# లెనిన్

## సంకలిత రచనలు

### తొమ్మిది సంపుటాల్లో

**1**

కార్ల్ మార్క్స్ • మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలు, మూడు అంశీభూత భాగాలు • మార్క్సిజమూ, రివిజనిజమూ • మనం పరిత్యజించే వారసత్వం యేమిటి? • ఏం చెయ్యాలి?

"ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో



VIGNAN BOOK CENTRE
Opp. Head Post Office
ONGOLE - 523 001
Rs 1 2 P 0 0

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!




ВУльянов (Ленин)

# వి.ఐ. లెనిన్

# సంకలిత రచనలు

## తొమ్మిది సంపుటాల్లో

## 1

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
ఆర్వియార్
కొండేపూడి లక్ష్మీనారాయణ
రాచమల్లు రామచంద్రారెడ్డి

**В. И. Ленин**

ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ В 9 ТОМАХ
ТОМ I

*на языке телугу*

**V. I. Lenin**

SELECTED WORKS IN NINE VOLUMES

**I**

*in Telugu*

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1983

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

Л $\frac{0101020000-238}{014(01)-84}$ 382—83

# విషయసూచిక

ప్రచురణకర్తల మాట . . . . . . . . . . . . . . . . 9

కార్ల్ మార్క్స్ (మార్క్సిజం వివరణతో కూడిన సంక్షిప్త జీవిత చరిత్ర)
(అను: కొండేపూడి లక్ష్మీనారాయణ) . . . . . . . . . . 12

ముందుమాట . . . . . . . . . . . . . . . . 12

మార్క్సిస్టు సిద్ధాంతం . . . . . . . . . . . . 17

తాత్విక భౌతికవాదం . . . . . . . . . . . . 18

గతితర్కం . . . . . . . . . . . . . . 20

చరిత్ర గురించిన భౌతికవాద భావన . . . . . . . 22

వర్గ పోరాటం . . . . . . . . . . . . . . 25

మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం . . . . . . . . . . 27

విలువ . . . . . . . . . . . . . . 27

అదనపు విలువ . . . . . . . . . . . . 29

సోషలిజం . . . . . . . . . . . . . . 39

శ్రామికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలు . . . . . . . 43

మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు అంశీభూత భాగాలూ
(అను: కొండేపూడి లక్ష్మీనారాయణ) . . . . . . . . 48

I . . . . . . . . . . . . . . . . 49

II . . . . . . . . . . . . . . . . 50

III . . . . . . . . . . . . . . . . 52

మార్క్సిజమూ, రివిజనిజమూ (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . 54

మనం పరిత్యజించే వారసత్వం యేమిటి? (అను: ఆర్వియార్) . . . . 63

I. "వారసత్వపు" ఒక ప్రతినిధి . . . . . . . . . 64

II. "వారసత్వాని"కి నరోదిజపు చేర్పు . . . . . . . . 77

III. నరోదిజంతోటి సంబంధంవల్ల "వారసత్వం" లాభం పొందిందా? 84

IV. "వికాసదాయకులు," నరోద్నిక్కులు, "శిష్యవర్గం" . . . 95

V. "శిష్యవర్గం" వారసత్వాన్ని పరిత్యజించడం గురించి మిహైలోవ్స్కీ . 97

ఏం చెయ్యాలి? (మన ఉద్యమపు తక్షణ సమస్యలు) (అను: నిడమర్తి ఉమా రాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . 105

ఉపోద్ఘాతం . . . . . . . . . . . . . 105

I. పిడివాదం, "విమర్శనా స్వేచ్ఛ" . . . . . . . . 108

అ) "విమర్శనా స్వేచ్ఛ" అంటే ఏమిటి? . . . . . 108

ఆ) "విమర్శనా స్వేచ్ఛ"కు కొత్త సమర్థకులు . . . 112

ఇ) రష్యాలో విమర్శ . . . . . . . . . 118

ఈ) సిద్ధాంత పోరాట ప్రాముఖ్యాన్ని గురించి ఎంగెల్స్ వివరణ . 126

II. జనసామాన్యపు సద్యోజనితత్వం, సోషల్ డెమోక్రట్ల చైతన్యం . 131

అ) సద్యోజనిత వెల్లువ ప్రారంభం . . . . . . 132

ఆ) సద్యోజనితత్వానికి దాసోహం. "రబోచయ మీస్ల్" . . 137

ఇ) "స్వయం విమోచన గ్రూపు," "రబోచెయె దేలొ". . 148

III. ట్రేడ్‌యూనియన్ రాజకీయాలు, సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలు . 159

అ) రాజకీయాందోళన, దాన్ని ఆర్థికవాదులు పరిమితపరచడం . 160

ఆ) ప్లెహానొవ్ భావాలకు మర్తీనొవ్ మరింత ప్రగాఢత్వాన్ని చేకూర్చిన గాథ . . . . . . . . . 171

ఇ) రాజకీయంగా బహిర్గతంచేసే ఖండనలు, "విప్లవ క్రియాశీలతకు శిక్షణ" . . . . . . . . . . . . . 175

ఈ) ఆర్థికవాదానికీ టెర్రరిజానికీ మధ్య సామాన్యాంశం ఏమిటి? . 182
ఉ) ప్రజాస్వామ్యంకోసం జరిగే పోరాటంలో కార్మికవర్గపు అగ్రగామి పాత్ర . . . . . . . . . . . . . . 186
ఊ) మరోసారి "అబద్ధాలకోర్లు," మరోసరి "ఇంద్రజాలికులు" . 203

IV. ఆర్థికవాదుల అనిపుణత, విప్లవకారుల నిర్మాణం . . . . . 207
అ) అనిపుణత అంటే ఏమిటి? . . . . . . . . . . 208
ఆ) అనిపుణత, ఆర్థికవాదం . . . . . . . . . 212
ఇ) కార్మికుల సంఘం, విప్లవకారుల సంఘం . . . . 219
ఈ) సంఘటన కృషి పరిధి . . . . . . . . . 236
ఉ) "కుట్రదారీ" సంఘం, "ప్రజాస్వామ్యతత్వం" . . . . 243
ఊ) స్థానిక, అఖిల రష్యన్ కార్యకలాపాలు . . . . . 253

V. అఖిల రష్యన్ రాజకీయ పత్రిక కోసం "పథకం" . . . . . 264
అ) "దేనితో ప్రారంభించాలి?" వ్యాసం ఎవరికి కోపం కలిగించింది? . 265
ఆ) వార్తాపత్రిక సమష్టి ఆర్గనైజరుగా పనిచెయ్యగలదా? . 271
ఇ) మనకి ఏ మాదిరి నిర్మాణం అవసరం? . . . . . . 284

ముగింపు . . . . . . . . . . . . . . . 292

అనుబంధం. "రబోచెయె దేలో"నీ, "ఇస్క్రా"నీ ఐక్యం చేసే ప్రయత్నం . . . . . . . . . . . . . . 296

"ఏం చెయ్యాలి?"కి సవరణ . . . . . . . . . 304

వివరణలు . . . . . . . . . . . . . . . . 306

పేర్ల సూచి . . . . . . . . . . . . . . 353

# ప్రచురణకర్తల మాట

మేం ప్రస్తుతం వి. ఐ. లెనిన్ రచనలను తొమ్మిది సంపుటాలలో వెలువరిస్తున్నాం. వాటిలో వి. ఐ. లెనిన్ సైద్ధాంతిక వారసత్వంనుంచి అతి ముఖ్యమైన రచనలను చేర్చాం. ఈ రచనలు, లెనినిజం ప్రస్తుత యుగానికి చెందిన సమగ్రమూ, సమన్వితమూ అయిన సిద్ధాంతం అన్న విషయాన్నీ, మార్క్సిస్టు సిద్ధాంతానికి వి. ఐ. లెనిన్ కొత్తగా చేసిన చేర్పునూ తెలియజేస్తాయి. మార్క్సిజం అభివృద్ధిలో లెనినిజాన్ని ఓ కొత్త దశగా పరిగణించవచ్చు.

సామాజికాభివృద్ధి నియమాలకూ, సోషలిస్టు విప్లవ సిద్ధాంతానికీ, సోషలిజం, కమ్యూనిజాల నిర్మాణ పద్ధతులకూ సంబంధించిన పరిజ్ఞాన సాధనకు వి. ఐ. లెనిన్ రచనలు ఒక మూలసాధనంగా ఉపయోగపడతాయి. వి. ఐ. లెనిన్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కొత్త నిర్ధారణలతోనూ, కొత్త ప్రతిపాదనలతోనూ సంపన్నం చేశాడు. నూతన చారిత్రక దశలో — సామ్రాజ్యవాద దశలో, శ్రామికవర్గ విప్లవాల దశలో, పెట్టుబడిదారీ విధానంనుంచి కమ్యూనిజానికి పరివర్తన దశలో — కార్మికజనం ముందూ, అన్నిటికంటె మొదట అంతర్జాతీయ శ్రామికవర్గం ముందూ తలెత్తిన అనేక ప్రశ్నలకు లెనిన్ తన రచనల్లో సమాధానాలిచ్చాడు.

వి. ఐ. లెనిన్ ప్రామాణిక రచనల్లోని — యివి మార్క్సిస్టు సిద్ధాంతానికి అతి ముఖ్యమైన చేర్పు — "ఏం చెయ్యాలి?", "సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ", "రాజ్యమూ, విప్లవమూ", "శ్రామికవర్గ విప్లవమూ, స్వపక్ష పరిత్యాగి కౌట్స్కీ", "వామపక్ష కమ్యూనిజం — ఒక బాలారిష్టం", మరికొన్నీ యీ ప్రస్తుత ముద్రణలో చేర్చబడ్డాయి.

* * *

ఈ ముద్రణలోని మొదటి సంపుటం, "కార్ల్ మార్క్స్ (మార్క్సిజం వివరణతో కూడిన సంక్షిప్త జీవిత చరిత్ర)" అన్న శీర్షికతో గ్రనాట్ ప్రచురణకర్తలు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వంకోసం రచింపబడిన వ్యాసంతో మొదలవుతుంది. ఈ వ్యాసంలో ఆయన కార్ల్ మార్క్స్ జీవితానికీ, కార్యకలాపాలకీ సంబంధించిన అంశాలను శాస్త్రీయ పద్ధతిలో దశలుగా విభజిస్తాడు. మార్క్స్ అభిప్రాయాల అభివృద్ధిలో ప్రధాన దశలను వేర్ప

రుస్తాడు. అదే సమయంలో, కార్యాచరణకు ఒక కరదీపిక అయిన మార్క్సిజంయొక్క సృజనాత్మక స్వభావాన్ని గురించీ, రివిజనిజంతోనూ, పిడివాదంతోనూ మార్క్సిజానికి పొసగదనీ నొక్కి వక్కాణిస్తాడు. మార్క్సిస్టు సిద్ధాంతం సరైనదన్న విషయాన్ని జీవితమూ, చారిత్రక క్రమమూ పూర్తిగా ధృవీకరించాయని లెనిన్ పేర్కొన్నాడు. ''మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు అంశీభూత భాగాలూ'' అన్న రచనలో లెనిన్ మార్క్సిజాన్ని 19వ శతాబ్దంలో మానవజాతి సృష్టించిన సర్వోత్తమమైన వాటన్నింటి వారసత్వంగా జర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లీషు అర్థశాస్త్రం, ఫ్రెంచి సోషలిజంల, వారసత్వం పుణికి పుచ్చుకున్నట్టుగా అభివర్ణించాడు. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సులు తాత్విక మార్క్సిజాన్ని ఎలా సమర్థించి, అభివృద్ధిచేశారో, గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని సృష్టించడం ద్వారా తత్వశాస్త్రంలో వాళ్లెలా విప్లవాత్మక పరివర్తనను తెచ్చారో లెనిన్ యిందులో నిరూపిస్తాడు.

లెనిన్ మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని అభివర్ణిస్తూ, కార్ల్ మార్క్స్ సాంప్రదాయిక అర్థశాస్త్రం సాధించిన విజయాలను వినియోగించుకుని, నిజమైన విప్లవాత్మక పరివర్తనను తెచ్చిన ఒక కొత్త అర్థశాస్త్రాన్ని సృష్టించాడని పేర్కొంటాడు. పెట్టుబడిదారీ విధాన వినాశం, సోషలిజం విజయాల అనివార్యతకు మార్క్సిస్టు అర్థశాస్త్రం శాస్త్రీయ ధృవీకరణను సమకూరుస్తుంది.

పెట్టుబడిదారీ సమాజాన్ని ఖండించి, విమర్శించిన ఊహాజనిత సోషలిజం పాత్రను ఉన్నతంగా అంచనా వేస్తూనే, యీ పరిస్థితినుంచి బయటపడే మార్గాన్ని ఊహాజనిత సోషలిస్టులు ఎందుకు చూపించలేకపోయారో లెనిన్ వివరిస్తాడు. పెట్టుబడిదారీ విధానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం ద్వారా, దాని అభివృద్ధి నియమాన్ని కనిపెట్టడం ద్వారా, ఒక నూతన సమాజాన్ని సృష్టించగల వర్గాన్ని – మార్క్సిస్టు సిద్ధాంతానుసారి అయిన పార్టీ నాయకత్వంకింద వున్న కార్మికవర్గాన్ని – గుర్తించి పేర్కొనడం ద్వారా మార్క్స్, ఎంగెల్సులు మానవజాతికి గొప్ప సేవను చేశారు.

ఈ సంపుటంలో చేర్చబడిన ''మార్క్సిజం, రివిజనిజం'' అన్న వ్యాసంలో, రెండవ ఇంటర్నేషనల్‌కి చెందిన అవకాశవాదుల సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనీ లెనిన్ విమర్శిస్తాడు. లెనిన్ యీ వ్యాసాన్ని, మార్క్స్ 25వ వర్ధంతి సందర్భంగా 1908 మార్చి ద్వితీయార్ధ భాగంలో ప్రచురింపబడిన ''కార్ల్ మార్క్స్ (1818–1883)'' అన్న సంకలనం కోసం రచించాడు. లెనిన్ తన యీ వ్యాసానికి విషయాంశంగా రివిజనిజానికి వ్యతిరేకంగా జరపవలసిన పోరాట సమస్యలను ఎంచుకోవడం, వీటిని ఆ దశకు చెందిన అతి ముఖ్య సమస్యలుగా పరిగణించడం అన్నది ప్రాముఖ్యం కలిగిన విషయం.

మార్క్సిజం పెరుగుదలా, కార్మికవర్గంలో మార్క్సిస్టు భావాల వ్యాప్తీ అనివార్యంగా

మార్క్సిజంపై ప్రతికూల సిద్ధాంతాలు చేసే దాడులను పెంచుతాయని రాశాడు లెనిన్. మార్క్సిజంపై రెండు దిశలనుంచి దాడులు జరుగుతున్నాయి: ఒకవంక మార్క్సిజాన్ని ఖండించాలనీ, నాశనం చెయ్యాలనీ విఫల ప్రయత్నం చేసే అధికారిక బూర్జువా విజ్ఞానశాస్త్రం జరిపే ప్రత్యక్ష దాడులు; మరోవంక రివిజనిస్టులు అనుసరించే రహస్య పోరాట పద్ధతులు. రివిజనిజంలోని ప్రమాదం ఎందులో ఉందంటే, సవరణల మాటున, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సంస్కరించడం మాటున అది లోపలనుంచి మార్క్సిజం వెనక గోతులు తవ్వుతుంది. లెనిన్ రివిజనిస్టు అభిప్రాయాల సారాంశాన్ని బహిర్గతం చేసి, రివిజనిస్టుల సైద్ధాంతిక "పరిశోధనలు" ప్రధానంగా కాలంచెల్లిపోయిన, అరిగిపోయిన బూర్జువా భావజాలపు పిడి సూత్రాల పునశ్చరణ మాత్రమేననీ, రివిజనిజం అన్నది సారాంశంలో ఉదారవాద బూర్జువా అభిప్రాయాల్లో ఒక రకమేననీ నిరూపించాడు.

కార్మికవర్గపు అంతిమ లక్ష్యాన్నీ, సోషలిజం విజయంకోసం జరిగే పోరాటాన్నీ పరిత్యజించడమే రివిజనిజం సారాంశం. కాల్పనిక క్షణభంగుర ప్రయోజనాలకోసం కార్మికవర్గ మౌలిక ప్రయోజనాలను రివిజనిస్టులు బలిపెడతారు. రివిజనిజం ఒక అంతర్జాతీయ ధోరణి, పెట్టుబడిదారీ సమాజంలో దానికి లోతైన వర్గమూలాలు వున్నాయి. అలాంటి రివిజనిజం కార్మికోద్యమంలో వ్యాప్తిచెందకుండా నిరంతరాయమైన, క్రమబద్ధమైన, పట్టుదలతో కూడిన పోరాటం జరపడం పార్టీ కర్తవ్యమని లెనిన్ బోధిస్తాడు.

1897 చివర రచించిన "మనం పరిత్యజించే వారసత్వం యేమిటి?" అన్న వ్యాసంలో, తమ దేశపు విప్లవ సంప్రదాయాలపట్ల శ్రామికవర్గ పార్టీ వహించవలసిన వైఖరిని లెనిన్ నిర్ధరించాడు. రష్యాలోని వివిధ జాతుల ప్రజలు సాధించిన సమస్త ప్రగతిశీల ఫలితాలకూ, విప్లవ ప్రజాతంత్ర సంప్రదాయాలకూ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అనుసరించే పార్టీనే అధికార వారసురాలుగా ఆయన పరిగణించాడు. అయితే వారసత్వాన్ని పదిలపరచడమంటే అర్థం, అలా లభించిన వారసత్వానికి మాత్రమే మనని మనం పరిమితం చేసుకోవడం కాదనీ, విప్లవ పోరాట పద్ధతులనూ, సాధనాలనూ స్వతంత్రంగా కనుక్కోవడంలో మనం మరింత ముందుకు వెళ్లాలనీ ఆయన పేర్కొన్నాడు.

1902 మార్చిలో ప్రచురింపబడిన "ఏం చెయ్యాలి?" అన్న లెనిన్ పుస్తకం, మార్క్సిస్టు కార్మిక పార్టీకోసం జరిగిన పోరాటంలో ప్రముఖ పాత్ర వహించింది. కార్మికోద్యమంలో చైతన్యపూరితులకూ, సద్యోజనిత శక్తులకూ మధ్య అన్యోన్య సంబంధం, శ్రామికవర్గ రాజకీయ నాయకుడుగా పార్టీ, రానున్న బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ పాత్ర, నిర్మాణానికి సంబంధించిన రూపాలు, సమరశీల విప్లవాత్మక శ్రామికవర్గ పార్టీని నిర్మించే మార్గాలూ, పద్ధతులూ అన్న తమను కలవరపరిచే ప్రశ్నలకు రష్యన్ సోషల్ డెమోక్రట్లకు యీ విప్లవ మార్క్సిస్టు రచనలో సమాధానాలు లభించాయి.

# కార్ల్ మార్క్స్

## (మార్క్సిజం వివరణతో కూడిన సంక్షిప్త జీవిత చరిత్ర)[1]

### ముందుమాట

ఇప్పుడు విడిగా ప్రచురితమవుతూన్న కార్ల్ మార్క్సును గురించిన యీ వ్యాసాన్ని (నాకు జ్ఞాపకం వున్నంతవరకు) 1913లో గ్రనాత్ "విజ్ఞాన సర్వస్వం"కోసం రాశాను. మార్క్స్ గురించిన సాహిత్యంయొక్క, ఎక్కువగా విదేశ భాషా ప్రచురణలయొక్క చాలా పెద్ద వివరణ పట్టిక యీ వ్యాసానికి అనుబంధంగా చేర్చబడింది. ఈ ముద్రణలో అది వదలివేయబడింది. సెన్సార్‌షిప్ కారణాలవల్ల "విజ్ఞాన సర్వస్వ" సంపాదకులు మార్క్స్ గురించిన నా వ్యాసంలోని చివరి భాగాన్ని, ఆయన విప్లవ ఎత్తుగడలను గురించిన భాగాన్ని, తొలగించి వేశారు. దురదృష్టవశాత్తూ ఆ చివరి భాగాన్ని నేను తిరిగి రాయలేకపోయాను, ఎందుచేతనంటే ఆ చిత్తుప్రతి క్రాకొవ్‌లోనో, స్విట్జర్లెండ్‌లోనో ఎక్కడో నేను విడిచిపెట్టిన కాగితాలలో వుండిపోయింది. ఆ వ్యాసం చివరి భాగంలో, మిగతా విషయాలతోపాటు, 1856 ఏప్రిల్ 16న ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖలోని యీకింది వాక్యాలను ఉదహరించినట్టు నాకు జ్ఞాపకం వుంది: "జర్మనీలోని విషయమంతా శ్రామికవర్గ విప్లవాన్ని మరో రైతు యుద్ధం లాంటిది ఏదైనా బలపర్చడానికి గల అవకాశంమీద ఆధారపడి వుంది. అలా జరిగితే వ్యవహారం దివ్యంగా వుంటుంది." ఇప్పుడు సోషలిజానికి పూర్తిగా ద్రోహం చేసి బూర్జువావర్గంతో చేరిపోయే స్థితికి దిగజారిపోయిన మన మెన్షెవిక్కులు[2] 1905 నుంచీ యీ విషయాన్నే అర్థంచేసుకోలేకపోయారు.

ఎన్. లెనిన్

మాస్కో, 1918 మే 4

కార్ల్ మార్క్స్, కొత్త కాలెండరు ప్రకారం 1818 మే 5వ తేదీన ట్రీర్ నగరంలో (రైనిష్ ప్రష్యా) జన్మించాడు. ఆయన తండ్రి న్యాయవాది, ఆయన యూదు జాతివాడైనా, 1824లో ప్రొటెస్టంట్ మతం స్వీకరించాడు. వాళ్లది సంస్కారం గల సంపన్న కుటుంబమే గాని విప్లవ భావాలు గల కుటుంబం కాదు. ట్రీర్ నగరంలో ఉన్నత పాఠశాల విద్య పూర్తిచేసిన తరువాత, మార్క్స్ మొదట బోన్ విశ్వవిద్యాలయంలోనూ, ఆతరువాత బెర్లిన్ విశ్వవిద్యాలయంలోనూ న్యాయశాస్త్రం, అంతకంటె ప్రధానంగా చరిత్ర, తత్వశాస్త్రం అధ్యయనం చేశాడు. 1841లో ఎపిక్యూరస్ తత్వశాస్త్రంపై థీసిస్ రాసి విశ్వవిద్యాలయానికి సమర్పించి తత్వశాస్త్రంలో డాక్టరేటు డిగ్రీ సంపాదించాడు. అప్పటికి మార్క్స్‌వి హేగెలియన్ భావవాదపు అభిప్రాయాలు. బెర్లిన్‌లో ఆయన ''వామపక్ష హేగెలియన్‌ల''[3] (బ్రూనో బౌవర్, మొదలైనవారి) బృందంతో చేరాడు. ఆ బృందంవారు హేగెల్ తత్వశాస్త్రంనుంచి నాస్తిక, విప్లవ భావ నిర్ధారణలు చేయడానికి ప్రయత్నించారు.

విశ్వవిద్యాలయ అధ్యయనం పూర్తిచేసిన తరువాత ఆచార్యుడు కావాలనే ఆశతో మార్క్స్ బోన్ నగరానికి మారాడు. కాని 1832లో లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్‌ను ప్రధానాచార్య స్థానంనుంచి తొలగించి, 1836లో ఆయన్ను తిరిగి విశ్వవిద్యాలయానికి రానివ్వకుండా చేసి, 1841లో యువ ఆచార్యుడైన బ్రూనో బౌవర్‌ను బోన్ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలివ్వకుండా నిషేధించిన ప్రభుత్వపు అభివృద్ధినిరోధక విధానం మార్క్స్ ఆచార్య వృత్తిని చేపట్టాలనే తన ఉద్దేశాన్ని విరమించుకొనేలా చేసింది. ఆ రోజుల్లో జర్మనీలో వామపక్ష హేగెలియన్ల భావాలు త్వరితగతిని వ్యాపించ సాగాయి. లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, ముఖ్యంగా 1836 తరువాత, మత శాస్త్రాన్ని విమర్శించడం ప్రారంభించి భౌతికవాదాన్ని సమర్థించడం మొదలుపెట్టాడు, 1841 కల్లా ఆయన తత్వశాస్త్రంలో భౌతికవాదానిది పైచెయ్యి అయింది. (''క్రైస్తవ మత సారం'' అనే ఆయన గ్రంథం.) 1843లో ''భవిష్యత్ తత్వశాస్త్ర సూత్రాలు'' అనే ఆయన గ్రంథం వెలువడింది. ఈ గ్రంథాలు ''మనస్సుపై కలిగించే విమోచన ప్రభావాన్ని ఎవరంతటవారు స్వయంగా అనుభవించ వలసిందే'' అని ఫాయెర్‌బాఖ్

గ్రంథాలను గురించి ఎంగెల్స్ తరువాత రాశాడు. ''మేము'' (అంటే మార్క్సుతో సహా వామపక్ష హెగెలియన్లు) ''అందరం వెంటనే ఫాయెర్‌బాఖ్ అనుయాయులమై పోయాం''[4] అని కూడా ఎంగెల్స్ రాశాడు. ఆ రోజులలో వామపక్ష హెగెలియనులతో పరిచయం వున్న రైన్‌లాండ్‌లోని కొందరు తీవ్రవాద బూర్జువాలు కొలోన్ నగరంలో ''రైనిషె సైటుంగ్''[5] అనే ప్రతిపక్ష పత్రికను స్థాపించారు (దీని మొదటి సంచిక 1842 జనవరి 1న వెలువడింది). ప్రధాన వ్యాసకర్తలుగా వుండవలసిందిగా మార్క్సును, బ్రూనో బౌవర్‌ను ఆహ్వానించారు, 1842 అక్టోబరులో మార్క్స్ ఆ పత్రికకు ప్రధాన సంపాదకుడు అయి బోన్ నుంచి కొలోన్‌కు మారాడు. మార్క్స్ సంపాదకత్వంకింద ఆ పత్రిక విప్లవకర ప్రజాస్వామిక ధోరణి మరింత ప్రస్ఫుటం అయింది, ప్రభుత్వం ఆ పత్రికమీద మొదట్లో రెండు స్థాయిలలోనూ, ఆ తరువాత మూడు స్థాయిలలోనూ సెన్సార్‌షిప్‌ను విధించి, చివరకు 1843 జనవరి 1న పత్రికను నిషేధించడానికి నిర్ణయించింది. ఆ తేదీకి ముందే మార్క్స్ తన సంపాదకత్వానికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది, అయినా పత్రికను ఆ రాజీనామా రక్షించ లేకపోయింది. 1843 మార్చిలో పత్రిక మూసివేయబడింది. ''రైనిషె సైటుంగ్'' పత్రికకు మార్క్స్ రాసిన ప్రధాన వ్యాసాలలో యీకింది పేర్కొన్న వాటికి తోడు (''గ్రంథ వివరణ పట్టిక'' చూడండి[6]) మోసెల్ లోయలో ద్రాక్ష పండించే రైతుల స్థితిని గురించి ఒక వ్యాసం[7] కూడా వుందని ఎంగెల్స్ పేర్కొన్నాడు. అర్థశాస్త్రంలో తనకున్న జ్ఞానం చాలదని మార్క్స్ తన పాత్రికేయ ఉద్యోగాన్ని బట్టి తెలుసుకుని, పట్టుదలతో అర్థశాస్త్ర అధ్యయనం ప్రారంభించాడు.

తన బాల్య స్నేహితురాలూ, విద్యార్థిగా వున్నప్పుడే ప్రదానం చేసుకున్న జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌ను 1843లో క్రాయిజ్‌నాఖ్ నగరంలో మార్క్స్ వివాహం చేసుకున్నాడు. ఆయన భార్య అభివృద్ధినిరోధక భావాలుగల కులీన ప్రష్యన్ కుటుంబానికి చెందింది. అత్యంత అభివృద్ధినిరోధక కాలమైన 1850–58లలో ప్రష్యాలో ఆమె అన్న ఆంతరంగిక వ్యవహారాల మంత్రిగా వుండేవాడు. 1843 ఆకురాలు కాలంలో ఆర్నాల్డ్ రూగెతో కలిసి (రూగె జననం 1802, మరణం 1880; అతడు వామపక్ష హెగెలియన్; 1825 నుండి 1830వరకూ జైలులో వున్నాడు; 1848 తరువాత రాజకీయ ప్రవాసం గడిపాడు, 1866–70 మధ్యకాలంలో బిస్మార్క్ అనుచరుడుగా వున్నాడు) విదేశాలనుంచి ఒక అతివాద పత్రికను ప్రచురించడంకోసం మార్క్స్ పారిస్ నగరానికి వెళ్ళాడు. ''దోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్'' [''జర్మన్-ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచికలు''][8] అనే ఆ పత్రిక ఒక సంచిక మాత్రమే వెలువడింది; జర్మనీలో దానిని రహస్యంగా పంచిపెట్టడంలో కలిగిన చిక్కుల మూలంగానూ, రూగెతో వచ్చిన అభిప్రాయభేదాల మూలంగానూ ఆ పత్రిక ప్రచురణ ఆపివేయవలసి వచ్చింది. ఈ పత్రికలో మార్క్స్ రాసిన వ్యాసాలలో,

ఆయన అప్పటికే విప్లవకారుడుగా ముందుకొచ్చాడు – "ఉనికిలో వున్న ప్రతిదానినీ నిర్దాక్షిణ్యంగా విమర్శించాలి" అని ఆయన వాదించాడు, అందులోనూ ప్రత్యేకించి "ఆయుధంతో విమర్శ"[9] అని జనబాహుళ్యానికీ, శ్రామికవర్గానికీ ఆయన ప్రబోధించాడు.

1844 సెప్టెంబరులో పారిస్‌లో కొన్ని రోజులు గడిపేటందుకు ఫ్రెడెరిక్ ఎంగెల్స్ పారిస్‌కు వచ్చాడు, అప్పటినుంచీ ఆయన మార్క్స్‌కి అత్యంత సన్నిహిత మిత్రుడయాడు. వారిద్దరూ అప్పుడు పారిస్‌లో వున్న విప్లవ గ్రూపుల పొంగులువారే జీవితంలో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు (ఆ రోజులలో ప్రూడనిజం[10] ప్రత్యేకించి ప్రాముఖ్యతలో వుండేది, మార్క్స్ "తత్వశాస్త్ర దారిద్ర్యం" (1847) అనే తన గ్రంథంలో, దానిని తుత్తునియలుగా ఖండించాడు); వివిధ రకాల పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలను తీవ్రంగా ఎదిరించి పోరాడుతూ వారు విప్లవాత్మక శ్రామికవర్గ సోషలిజం లేక కమ్యూనిజం (మార్క్సిజం)యొక్క సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనూ రూపొందించారు. 1844–48 మధ్యకాలంలో మార్క్స్ రచనల వివరాన్ని "గ్రంథ వివరణ పట్టిక"లో చూడండి. ప్రమాదకరమైన విప్లవకారుడని మార్క్స్‌ని ప్రష్యన్ ప్రభుత్వం ఒత్తిడివల్ల 1845లో పారిస్‌నుంచి వెళ్లగొట్టారు. ఆయన బ్రస్సెల్స్‌కు వెళ్లాడు. 1847 వసంతంలో మార్క్స్ ఎంగెల్సులు "కమ్యూనిస్టు లీగు"[11] అనే ఒక రహస్య ప్రచార సంఘంలో చేరారు; ఆ లీగ్ ద్వితీయ మహాసభలో (లండన్, నవంబరు 1847) వారు ప్రముఖ పాత్రను నిర్వహించారు, ఆ మహాసభ కోరిక మీదనే ప్రఖ్యాత "కమ్యూనిస్టు ప్రణాళిక"ను వారు రచించారు. అది 1848 ఫిబ్రవరిలో వెలువడింది. ఈ గ్రంథం, ఒక నూతన ప్రపంచ దృక్పథాన్ని, సామాజిక జీవితాన్ని సహితం పరివేష్టించే సుసంగతమైన భౌతికవాదాన్ని, అభివృద్ధిని గురించిన అత్యంత సమగ్రమైన ప్రగాఢమైన సిద్ధాంతం అయిన గతితర్కాన్ని, వర్గపోరాటంయొక్క, నూతన, కమ్యూనిస్టు సమాజ నిర్మాత అయిన శ్రామికవర్గపు ప్రపంచ చారిత్రక విప్లవకర పాత్రయొక్క సిద్ధాంతాన్ని స్పష్టంగానూ ప్రతిభావంతంగానూ వివరిస్తుంది.

1848 ఫిబ్రవరి విప్లవం[12] ప్రజ్వరిల్లినప్పుడు, మార్క్స్ బెల్జియంనుంచి వెళ్లగొట్టబడ్డాడు. ఆయన పారిస్‌కు తిరిగి వెళ్లాడు, అక్కడినుంచి మార్చి విప్లవానంతరం[13] జర్మనీలో కొలోన్ నగరానికి వెళ్లాడు. కొలోన్‌లో మార్క్స్ ప్రధాన సంపాదకత్వంకింద "నోయె రైనిషె సైటుంగ్" అనే పత్రిక[14] 1848 జూన్ 1నుంచి 1849 మే 19వరకూ వెలువడింది. ప్రపంచంలోని అన్ని దేశాలలో శ్రామికవర్గ, ప్రజాస్వామిక ఉద్యమాలన్నీ తరువాత ధ్రువపర్చినట్లే 1848–49లలో జరిగిన విప్లవకర ఘటనల తీరు నూతన సిద్ధాంతాన్ని ఘనంగా ధ్రువపర్చింది. విజయం సాధించిన విప్లవ ప్రతిఘాతకులు మార్క్స్‌పై మొదట కోర్టులో కేసు పెట్టాలని ప్రేరేపించారు (1849 ఫిబ్రవరి 9న మార్క్స్ నిర్దోషి అని కోర్టు తీర్పు చెప్పింది), ఆ తరువాత ఆయనని జర్మనీనుంచి వెళ్లగొట్టారు (1849

మే 16). మార్క్స్ మొదట పారిస్‌కు వెళ్లాడు, కాని 1849 జూన్ 13 ప్రదర్శన[15] తరువాత ఆయనను మళ్లీ అక్కడినుంచి వెళ్లగొట్టారు, ఆయన లండన్ చేరి జీవితాంతం వరకూ అక్కడే గడిపాడు.

రాజకీయ ప్రవాసిగా ఆయన ఎంతో కష్టభరితమైన జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఈ విషయం మార్క్స్ ఎంగెల్స్‌ల మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలలో (1913లో ప్రచురింపబడ్డాయి[16]) స్పష్టంగా తెలుస్తుంది. మార్క్సు, ఆయన కుటుంబమూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎంగెల్సే కనక నిరంతరమూ నిస్వార్థంగా ఆర్థిక సహాయం చేసివుండకపోతే మార్క్స్ ''పెట్టుబడి'' అనే గ్రంథాన్ని పూర్తిచేయలేకపోవడమే గాక, లేమితో కృంగిపోయి వుండేవాడు. అంతేకాకుండా, అప్పుడు ప్రబలమై వున్న పెటీబూర్జువా సోషలిజంయొక్క, మొత్తంమీద శ్రామికవర్గేతర సోషలిజంయొక్క సిద్ధాంతాలకూ ధోరణులకూ వ్యతిరేకంగా మార్క్స్ నిరంతరమైన నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించవలసి వచ్చింది, ఒక్కొక్కప్పుడు అత్యంత ఉన్మత్తమైన అమానుషమైన వ్యక్తిగత దూషణలను సహితం "Herr Vogt" ఎదుర్కొని తిప్పికొట్టవలసి వచ్చింది.[17] రాజకీయ ప్రవాసుల బృందాలకు దూరంగా వుంటూ, మార్క్స్ ప్రధానంగా అర్థశాస్త్ర అధ్యయనానికి తన శక్తి సామర్థ్యాలను వినియోగించుతూ అనేక చారిత్రక గ్రంథాలలో తన భౌతికవాద సిద్ధాంతాన్ని విపులీకరించాడు. మార్క్స్ తాను రచించిన ''అర్థశాస్త్ర విమర్శకు చేర్పు'' (1859), ''పెట్టుబడి'' (మొదటి సంపుటి, 1867) అనే గ్రంథాలలో యీ శాస్త్రాన్ని (ఈ దిగువ ఇవ్వబడిన ''మార్క్సిస్టు సిద్ధాంతం'' అనే ప్రకరణం చూడండి) విప్లవాత్మకంగా మార్చివేశాడు.

పంథొమ్మిదవ శతాబ్దం అయిదవ దశకం చివరి సంవత్సరాలలోనూ, ఆరవ దశకంలోనూ ప్రజాస్వామిక ఉద్యమాల పునరుద్ధరణ మార్క్స్‌ను ప్రత్యక్ష కార్యాచరణ రంగంలోకి దింపింది. 1864లో (సెప్టెంబరు 28న) అంతర్జాతీయ కార్మికుల సంఘం — ప్రఖ్యాత ప్రథమ ఇంటర్నేషనల్ — లండన్‌లో స్థాపించబడింది. ఈ సంఘానికి ప్రాణమూ, అంతఃకరణమూ మార్క్సే, ఆ సంస్థ ప్రకటించిన మొదటి విజ్ఞప్తినీ,[18] అనేక తీర్మానాలనూ, ప్రకటనలనూ, ప్రణాళికలనూ రచించింది మార్క్సే. వివిధ దేశాలలోని కార్మికోద్యమాలను ఐక్యపరుస్తూ వివిధ రూపాలలో వున్న శ్రామికవర్గేతర, మార్క్సిస్టు పూర్వపు సోషలిజాన్ని (మజ్జీనీ, ప్రూడన్, బకూనిన్, బ్రిటన్‌లోని లిబరల్ ట్రేడ్‌యూనియనిజం, జర్మనీలో మితవాదం వైపు లాసాలియన్ వూగిసలాటలు వగైరాలను) సంయుక్త కార్యాచరణ మార్గంలోకి మళ్లించడానికి ప్రయత్నిస్తూ, యీ మతాల, పంథాల సిద్ధాంతాలను అన్నిటినీ ప్రతిఘటించుతూ వివిధ దేశాలలోని కార్మికవర్గపు శ్రామిక పోరాటం అవలంబించవలసిన ఏకైక ఎత్తుగడలను మార్క్స్ రూపొందించాడు. పారిస్ కమ్యూన్[19] పతనం (1871) తరువాతనూ —

దీనిని గురించి మార్క్స్ ఎంతో ప్రగాఢమైన, స్పష్టమైన, ప్రతిభావంతమైన, సార్థకమైన, విశ్లేషణాత్మకమైన పరిశీలన జరిపాడు ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం", 1871 అనే గ్రంథం) — ఇంటర్నేషనల్‌లో బకూనిన్ అనుయాయులు[20] తెచ్చిన చీలిక మూలంగానూ ఆ సంఘం యూరప్‌లో ఇంకెంత మాత్రమూ మనలేకపోయింది. హేగ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ (1872) తరువాత మార్క్స్ ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిలును న్యూయార్క్ నగరానికి మార్పించాడు. ప్రథమ ఇంటర్నేషనల్ తన చారిత్రక పాత్రను నిర్వహించింది, ఇప్పుడది ప్రపంచంలోని అన్ని దేశాలలోని కార్మికోద్యమం మరింత ఎక్కువగా అభివృద్ధిచెందే దశకు అంటే, విస్తృతిలో పెరిగి విడివిడిగా దేశాలలో సామూహిక సోషలిస్టు కార్మికవర్గ పార్టీలు ఏర్పడిన దశకు తావిచ్చింది.

ఇంటర్నేషనల్‌లో అమిత ప్రయాసతో కూడిన పని మూలంగానూ, అంతకంటె ఇంకా ఎక్కువ శ్రమతో కూడిన సైద్ధాంతిక వ్యాసంగం మూలంగానూ మార్క్స్ ఆరోగ్యం క్షీణించింది. అయినప్పటికీ అర్థశాస్త్రాన్ని సరిదిద్దే పనినీ, "పెట్టుబడి"ని పూర్తిచేసే పనినీ ఆయన కొనసాగించాడు. అందుకోసం ఆయన బోలెడంత కొత్త సమాచారాన్ని సేకరించాడు. అనేక భాషలు (ఉదాహరణకు రష్యన్ భాష) నేర్చుకున్నాడు. కాని అనారోగ్యం కారణంగా ఆయన "పెట్టుబడి"ని పూర్తిచేయలేకపోయాడు.

1881 డిసెంబరు 2న ఆయన భార్య మరణించింది. 1883 మార్చి 14న ఆయన తన పడక కుర్చీలో ప్రశాంతంగా కన్నుమూశాడు లండన్‌లోని హైగేట్ శ్మశాన వాటికలో ఆయన భార్య సమాధి పక్కనే ఆయన కూడ సమాధి చేయబడ్డాడు. మార్క్స్ కుటుంబం నికృష్ట దారిద్ర్యం అనుభవించుతున్న రోజులలో ఆయన పిల్లలలో కొందరు శైశవ దశలోనే లండన్‌లో చనిపోయారు. ముగ్గురు కూతుళ్లు: ఎలియొనోర్ ఎవెలింగ్, లౌరా లాఫార్గ్, జెన్నీ లోంగె, ఇంగ్లీషు, ఫ్రెంచి సోషలిస్టులను వివాహాలు చేసుకున్నారు. జెన్నీ లోంగె కొడుకు ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సభ్యుడు.

## మార్క్సిస్టు సిద్ధాంతం

మార్క్స్ అభిప్రాయాల, ఉపదేశాల క్రమవిధానమే మార్క్సిజం. మానవజాతి అత్యంత పురోగమనాన్ని సాధించిన మూడు దేశాలలో పంధొమ్మిదవ శతాబ్దంలో ప్రధాన సైద్ధాంతిక వాహినులై వున్న మూడు ధోరణులను — సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రాన్నీ, సాంప్రదాయిక ఇంగ్లీషు అర్థశాస్త్రాన్నీ, మొత్తంమీద ఫ్రెంచి విప్లవాత్మక సిద్ధాంతాలతో సహా ఫ్రెంచి సోషలిజాన్నీ — కొనసాగించి పరిపూర్ణం చేసిన మహా ప్రతిభాశాలి మార్క్స్. ప్రపంచపు అన్ని దేశాల కార్మికవర్గ ఉద్యమపు సిద్ధాంతంగా, కార్యక్రమంగా ఆధునిక భౌతిక

వాదపు, ఆధునిక శాస్త్రీయ సోషలిజపు సంపూర్ణత్వంతోటి ఆయన ప్రతికక్షులు సైతం మెచ్చుకున్న సుసంగతత్వం, సమగ్రత వున్న మార్క్స్ అభిప్రాయాలవల్ల, మార్క్సిజపు ముఖ్య సారమైన దాన్ని, అంటే మార్క్స్ ఆర్థిక సిద్ధాంతాన్ని, వివరించే ముందుగా ఆయన ప్రపంచ దృక్పథపు సంక్షిప్త వివరణని యిచ్చే అవసరం వుంది.

## తాత్విక భౌతికవాదం

1844–45 సంవత్సరాలలో తన భావాలు ఒక రూపం దాల్చిన నాటినుంచి మార్క్స్ భౌతికవాదిగా, ప్రత్యేకించి లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్ అనుచరుడుగా వున్నాడు. ఫొయెర్‌బాఖ్ భౌతిక వాదం తగినంత సుసంగతంగానూ సమగ్రంగానూ లేకపోవడమే దానిలోని బలహీనత అని తరువాత మార్క్స్ తెలుసుకున్నాడు. మార్క్స్ అభిప్రాయంలో ఫొయెర్‌బాఖ్ ప్రపంచ చారిత్రక "యుగకర్తృక" ప్రాముఖ్యం, ఆయన హెగెల్ భావవాదంనుంచి కృతనిశ్చయంతో తెగతెంపులు చేసుకోవడంలోనూ, భౌతికవాదాన్ని అనుసరిస్తున్నట్టు బాహాటంగా ప్రకటించ డంలోనూ వుంది. ఈ భాతికవాదం "పద్దెనిమిదవ శతాబ్దం నాటికే, ముఖ్యంగా ఫ్రెంచి భౌతికవాదం, అప్పటికి అమలులో వున్న రాజకీయ సంస్థలకు వ్యతిరేకంగా మాత్రమేగాక, మతానికీ, మతశాస్త్ర సిద్ధాంతానికీ వ్యతిరేకంగానూ, అధిభౌతికవాదానికంతటికీ కూడ వ్యతిరేకం గానూ" ("హేతుబద్ధమైన తత్వశాస్త్రానికి" భిన్నంగా "మైకంతో కూడిన వూహాగానం" అనే అర్థంలో) "పోరాటం సాగించింది." ("సారస్వత వారసత్వం"లో "పవిత్ర కుటుంబం" అనే గ్రంథం.[21]) మార్క్స్ ఇలా రాశాడు: "హెగెల్ అభిప్రాయంలో, ఆయన దేనికైతే 'భావం' అని పేరుపెట్టి దానిని ఒక స్వతంత్ర కర్తగా కూడ తయారుచేశాడో ఆ ఆలోచనా విధానం వాస్తవిక ప్రపంచానికి డెమియుర్‌గోస్ (సృష్టికర్త, నిర్మాత).... తద్భిన్నంగా నా అభిప్రాయంలో, భావం అనేది మానవుని మనస్సుచే ప్రతిబింబింపబడి ఆలోచనా రూపాల లోకి మార్చబడిన భౌతిక ప్రపంచమే తప్ప మరోటి కాదు." ("పెట్టుబడి" మొదటి సంపుటం, రెండవ ముద్రణకు చివరిమాట.) మార్క్స్‌యొక్క యీ భౌతికవాద తత్వ శాస్త్రానికి పూర్తిగా అనుగుణంగా, దానిని వివరించుతూ ఫ్రెడరిక్ ఎంగెల్స్ తాను రచించిన "యాంటీ డ్యూరింగ్" అనే గ్రంథంలో ఇలా రాశాడు (ఈ గ్రంథం రాతప్రతిని మార్క్స్ చదివాడు): "ప్రపంచపు ఏకత్వం దాని అస్తిత్వంలో లేదు.... ప్రపంచపు నిజమైన ఏక త్వం దాని పదార్థతత్వంలోనే వుంది, తత్వశాస్త్రం, ప్రకృతిశాస్త్రంయొక్క దీర్ఘకాలికమైన ఆయాసకరమైన అభివృద్ధి దీనినే రుజువుచేస్తోంది...." "చలనం అనేది పదార్థం యొక్క అస్తిత్వపు రూపం. చలనం లేని పదార్థం గాని, పదార్థం లేని చలనం గాని ఎన్నడూ ఎక్కడా వుండి వుండలేదు, వుండజాలదు కూడ.... కాని, ఆలోచన, పరిజ్ఞానం

అనేవి ఏమిటి? అవి ఎక్కడనుంచి పుట్టుకువస్తున్నాయి? అని ఎవరైనా ప్రశ్నిస్తే, అవి మానవ మస్తిష్కపు ఉత్పత్తులేననీ, మానవుడు తనే ప్రకృతి ఉత్పాదితమనీ, అది పరిసరావళిలో దానితోపాటుగానే అభివృద్ధి చెందినదనీ స్పష్టంగానే తెలుస్తుంది. అందుచేత తుది పరిశీలనలో మానవ మేధస్సుయొక్క ఉత్పాదితాలు కూడా, ప్రకృతి ఉత్పాదితాలేనని, అవి ప్రకృతిలోని ఇతర పరస్పర సంబంధాలకు భిన్నం కాకపోగా, వాటికి అనుగుణంగానే వుంటాయన్న విషయం స్వయంవిదితమే....'' ''హెగెల్ భావవాది, అంటే, ఆయన అభిప్రాయంలో ఆయన మనస్సులోని ఆలోచనలు నిజమైన వస్తువుల, క్రమవిధానాల కొద్దో గొప్పో అనిర్దిష్టములైన ప్రతిబింబాలు (Abbilder; ఎంగెల్స్ ఒక్కొక్కప్పుడు వాటిని 'ముద్రలు' అని కూడా అంటూ వుంటాడు) కావు కాని, తద్భిన్నంగా ఆయన అభిప్రాయంలో వస్తువులు, వాటి పరిణామం ప్రపంచం పుట్టడానికి పూర్వమే ఎక్కడో ఒక చోట ఉనికి కలిగి వుంటూన్న 'భావం'యొక్క మూర్తిమంతములైన ప్రతిబింబాలే.''[22] ఎంగెల్స్ తాను రాసిన ''లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్'' అనే గ్రంథంలో ఫాయెర్‌బాఖ్ తత్వశాస్త్రంపై తన అభిప్రాయాలనూ, మార్క్స్ అభిప్రాయాలనూ వివరించాడు. అంతకు పూర్వం 1844–45లో హెగెల్, ఫాయెర్‌బాఖ్‌లను గురించీ, చరిత్రకు సంబంధించిన భౌతికవాద భావనలను గురించీ తానూ, మార్క్స్ కలిసి రాసిన పాత రాతప్రతిని మరోసారి చదివిన తరువాతనే యీ గ్రంథం అచ్చుకు ఇవ్వబడింది. దానిలో ఎంగెల్సు ఇలా రాశాడు: యే తత్వశాస్త్రమైనా, ప్రత్యేకంగా ఆధునిక తత్వశాస్త్రంయొక్క మహత్తరమైన మౌలికమైన ప్రశ్న ఆలోచనకీ అస్తిత్వానికీ, ఆత్మకీ ప్రకృతికీ వున్న సంబంధం ఏమిటనేది.... ఏది ప్రథమం, ఆత్మా లేక ప్రకృతా? అనేది. దీనికి తత్వవేత్తలు యిచ్చిన సమాధానాలు వారిని రెండు ప్రధానమైన శిబిరాలుగా విడదీశాయి. ప్రకృతికంటె ఆత్మయే ముందు అని నిర్ధారణ చేసి దానినిబట్టి అంతిమంగా యీ ప్రపంచం ఏదో ఒక విధంగా సృష్టింపబడిందని వూహించినవారు భావవాద శిబిరంగా ఏర్పడ్డారు. ప్రకృతే ముందు అని భావించిన వారు భౌతికవాదపు వివిధ కోవలకు చెందిన వారయారు.'' (తాత్విక) భావవాదం, భౌతికవాదం అనే భావనలను మరే యితర అర్థంలో వాడినా అది గందరగోళానికి మాత్రమే దారితీస్తుంది. ఎల్లప్పుడూ ఏదోవిధంగా మతంతో ముడివడివున్న భావవాదాన్ని మాత్రమే గాక, యీనాడు ఎక్కువ వ్యాప్తిలో వున్న హ్యూమ్, కాంట్‌ల అభిప్రాయాలనూ వివిధ రూపాలలో వున్న అజ్ఞేయతావాదాన్ని, విమర్శనా వాదాన్ని, పాజిటివిజాన్ని[23] కూడా మార్క్స్ నిష్కర్షగా తోసిపుచ్చాడు; అలాంటి తత్వశాస్త్రాన్ని భావవాదానికి యిచ్చే ''అభివృద్ధి నిరోధక'' రాయితీగానూ, మహా అయితే ''నలుగురి ముందూ భౌతికవాదాన్ని నిరాకరిస్తూ, సిగ్గుతో దొంగచాటుగా దాన్ని అంగీకరించడంగానే''[24] ఆయన పరిగణించాడు. ఈ సమస్యపై పైన పేర్కొన్న మార్క్స్ ఎంగెల్స్‌ల గ్రంథాలనే గాక, 1868 డిసెంబరు 12న ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన

లేఖ కూడా గమనించతగింది. అందులో ప్రసిద్ధ ప్రకృతిశాస్త్రవేత్త తామస్ హక్స్లీ అన్న మాటలను ప్రస్తావిస్తూ, ఆ మాటలు మామూలుగా కంటె "ఎక్కువ భౌతికవాద ధోరణి"లో వున్నాయనీ, "మనం వాస్తవంగా పరిశీలించి ఆలోచించినంత కాలమూ భౌతికవాదంలో వున్నట్లే"నని ఆయన అన్నప్పటికీ అందులో అజ్ఞేయతావాదానికీ, హ్యూమ్ వాదానికీ "దొడ్డి తలుపు" తెరిచే వుంచాడని హక్స్లీని మార్క్స్ ఆక్షేపించాడు. స్వేచ్ఛకీ ఆవశ్యకతకీ వున్న సంబంధంపై మార్క్స్ అభిప్రాయాన్ని తెలుసుకోడం ప్రత్యేకించి ముఖ్యం. "ఆవశ్యకతను మనం అర్థం చేసుకోలేనంత మేరకే అది గుడ్డిది. ఆవశ్యకతను గుర్తించడమే స్వేచ్ఛ" (ఎంగెల్స్ "యాంటీ డ్యూరింగ్"). అంటే దీని అర్థం, ప్రకృతిలో వస్తుగత నియమాలున్నాయనే సూత్రాన్నీ, ఆవశ్యకత స్వేచ్ఛలోకి గతితార్కిక పరివర్తన చెందుతుందనీ గుర్తించడమన్నమాట. (ఏవిధంగా అయితే ఇంతకు ముందు తెలియనిదైనప్పటికీ ఇక ముందు తెలుసుకొనబడగల "పరమ అజ్ఞాత వస్తువు" "మన కోసమైన వస్తువు"గానూ "వస్తువు సారం" "పరిణామం"గానూ పరివర్తన చెందుతున్నాయో ఆవిధంగానే.) ఫాయెర్‌బాఖ్ యొక్క భౌతికవాదంతో సహా "పూర్వకాలపు" భౌతికవాదం (ఇంకా చెప్పాలంటే, బ్యూహ్నెర్, ఫోగ్ట్, మొలెషోట్‌ల "అపభ్రంశ" భౌతికవాదమూ) యీ కింది ప్రధాన లోపాలను కలిగివున్నాయని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు: (1) రసాయనశాస్త్రంలోనూ, జీవశాస్త్రంలోనూ ఇటీవల జరిగిన అభివృద్ధిని (నేడైతే పదార్థంయొక్క విద్యుత్ సంఘట్టన సిద్ధాంతాన్ని కూడా దానికి జతచేయాలి) పరిగణనలోకి తీసుకోడంలో విఫలమై వున్న సమస్య; ఈ భౌతికవాదం "ప్రధానంగా యాంత్రికంగా" వుండిపోయింది; (2) పూర్వకాలపు భౌతికవాదం చారిత్రక విరుద్ధమూ, గతితార్కిక విరుద్ధమూ అయివుండి (గతితర్క వ్యతిరేకం అనే అర్థంలో అది అధిభౌతికవాదం) క్రమాభివృద్ధి దృక్పథానికి సుసంగతంగానూ సమగ్రంగానూ కట్టుబడి లేదు; (3) అది "మానవ స్వభావాన్ని" అనిర్దిష్టమైనదిగానే భావించింది గాని దానిని (నిర్దిష్టంగానూ, చారిత్రకంగానూ నిర్ధారణ చేయబడిన) "సామాజిక సంబంధాలన్నిటి సంకీర్ణకంగా" భావించలేదు, అందుచేతనే అది, సమస్య ప్రపంచాన్ని "మార్చడం" కాగా, కేవలం ప్రపంచాన్ని "వ్యాఖ్యానించి," అంటే, అది "విప్లవాత్మక ప్రత్యక్ష కార్యాచరణ" ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేదన్నమాట.

## గతితర్కం

అభివృద్ధిని గురించిన అత్యంత సమగ్రమైన, ప్రగాఢమైన, విషయపరంగా పరిపుష్టమైన సిద్ధాంతంగా సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రం సాధించిన అత్యంత గొప్ప విజయం హేగెల్ గతితార్కిక సిద్ధాంతం అని మార్క్స్, ఎంగెల్స్‌లు భావించారు. అభివృద్ధి

యొక్క, పరిణామంయొక్క నియమాలను గురించిన ఏ ఇతర సూత్రీకరణ అయినా పాక్షిక దృక్పథం కలిగినదీ, విషయపరంగా నిస్సారమైనదీ అనీ, ప్రకృతిలోనూ, సమాజం లోనూ వాస్తవంగా జరిగే అభివృద్ధి క్రమాన్ని (ఇది తరచు లంఘనలలోనూ, మహావిపత్తులూ, విప్లవాల ద్వారానూ సాగుతూవుంటుంది) వక్రీకరించి, వికలం చేస్తుందనీ వారు భావించారు. ఎంగెల్స్ యిలా రాశాడు: "చైతన్యవంతమైన గతితర్కాన్ని (హేగెలియన్‌వాదంతో సహా భావవాద విధ్వంసంనుండి) కాపాడి, దానిని ప్రకృతి గురించిన భౌతికవాద అవగాహనతో అన్వ యించినది బహుశా మార్క్సు, నేనూ మాత్రమే.... గతితర్కానికి నిదర్శనం ప్రకృతే, ఆధునిక ప్రకృతిశాస్త్రం విషయానికి వస్తే అది అత్యంత సంపద్వంతమైన" (ఇది రేడియం, ఎలక్ట్రానులూ, మూలద్రవ్యాల పరివర్తన వగైరాలు కనిపెట్టబడక పూర్వం రాసిందని గుర్తుంచుకోండి!), "రోజురోజుకూ అధికమౌతున్న సామగ్రిని సమకూర్చిందని, ఆ విధంగా అంతిమ పరిశీలనలో ప్రకృతియొక్క క్రమవిధానం గతితార్కికమే గాని అధిభౌతికం కాదని రుజావుచేసిందని చెప్పాలి."[25]

"ఈ ప్రపంచం ముందుగానే తయారైవున్న వస్తువుల సంకీర్ణకం కాదనీ, అది క్రమాల సంకీర్ణకం అనీ, ఇందులో స్థిరంగా వున్నట్టు కనబడే వస్తువులే కాకుండా, మన మనస్సుల లోని వాటి ప్రతిబింబాలు, అంటే భావనలు కూడా ఉనికిలోకి వస్తూ అంతరించిపోతూ వుండే ఒక నిరంతరమైన మార్పు చెందుతూ వుంటాయనే మహత్తరమైన మౌలిక చింతన హేగెల్ కాలంనుంచీ సాధారణ చైతన్యంలోకి ఎంత పరిపూర్ణంగా చొచ్చుకొనిపోయిందంటే, యీ సాధారణతలో ఇప్పుడు, దానిని ఎవరూ కాదని అనడంలేదు. కాని యీ మౌలిక చింతనను మాటలలో అంగీకరించడం వేరు, వాస్తవంలో ప్రతి పరిశోధనా రంగంలోనూ దానిని సవిస్త రంగా అన్వయించడం వేరు.... గతితార్కిక తత్వశాస్త్రానికి ఏదీ అంతిమం కాదు, పరమం కాదు, పవిత్రం కాదు. అది ప్రతిదానియొక్క, ప్రతిదానిలోని పరివర్తన లక్షణాన్ని బైట పెడుతుంది; ఉనికిలోకి రావడం, అంతరించిపోతూ వుండటం అనే నిరంతర క్రమం తప్ప, నిమ్న దశనుంచి ఉన్నత దశకు ఆరోహించే నిరంతర క్రమం తప్ప మరేదీ దానికి తట్టుకో జాలదు. గతితార్కిక తత్వశాస్త్రమంటే, మానవ మస్తిష్కంలో యీ క్రమంయొక్క ప్రతిబింబమే గాని మరోటి కాదు." ఆవిధంగా, మార్క్స్ అభిప్రాయంలో గతితర్కం "బాహ్య ప్రపంచంలోనూ మానవ చింతనలోనూ జరిగే చలనంయొక్క సాధారణ నియమాలను వివరించే శాస్త్రం."[26]

హేగెల్ తత్వశాస్త్రంలోని యీ విప్లవాత్మక అంశాన్ని మార్క్స్ స్వీకరించి దానిని అభి వృద్ధి చేశాడు. గతితార్కిక భౌతికవాదానికి, "ఇతర విజ్ఞానశాస్త్రాలకు అతీతంగా వుండే తత్వశాస్త్రం ఏదీ అవసరంలేదు." ఇతఃపూర్వపు తత్వశాస్త్రంలో ఇక మిగిలినదంతా "ఆలో చనా విధానశాస్త్రమూ, దాని నియమాలూ – అంటే వ్యావహారిక తర్కమూ, గతితర్కమూ."[27]

మార్క్స్ అవగాహన ప్రకారంగానూ, హేగెల్‌కు అనుగుణంగానూ కూడా గతితర్కంలో ఇప్పుడు జ్ఞాన సిద్ధాంతం లేక ఎపిస్టొమాలజీ అనబడేది ఇమిడి వుంది. ఈ సిద్ధాంతం కూడా తన విషయవస్తువును, పరిజ్ఞానంయొక్క ఆవిర్భావాన్నీ, అభివృద్ధినీ, జ్ఞానేతరమైంది పరిజ్ఞానంగా పరివర్తన చెందడాన్నీ అధ్యయనం చేసి సాధారణ ధర్మాలను వివరించడంలో చారిత్రక దృష్టిని ప్రదర్శించాలి.

ఈనాడు అభివృద్ధి భావం, పరిణామ భావం, సామాజిక చైతన్యంలో దాదాపు పూర్తిగా చొచ్చుకొని పోయివుంది, అయితే అది ఇతర విధాలుగా జరిగిందే గాని, హేగెలియన్ తత్వశాస్త్రం ద్వారా మాత్రం కాదు. అయినప్పటికీ, హేగెల్ తత్వశాస్త్ర ప్రాతిపదికమీద మార్క్స్ ఎంగెల్స్‌లచే సూత్రీకరించబడిన విధంగా యీ భావం ఇప్పుడు చలామణీ అవుతున్న పరిణామ భావం కంటె ఎంతో సమగ్రంగానూ, విషయవస్తువులో ఎంతో పరిపుష్టంగానూ వుంది. ఇదివరకే గడచిపోయిన దశలనే పునరావృతం చేస్తూన్నట్టు కనబడినా అది వాటిని వేరొక విధంగా, ఉన్నత స్థాయిలో (''నాస్తికరణయొక్క నాస్తికరణ''[28]) పునరావృతం చేస్తుంది. మరోలా చెప్పాలంటే, అది సరళ రేఖలో గాక, మరచుట్టలాగ సర్పిలాకృతులలో కొనసాగే అభివృద్ధి; లంఘనలతో, మహా విపత్తులతో, విప్లవాలతో సాగే అభివృద్ధి; ''అనుస్యూతిలో విరామాలు;'' పరిమాణం గుణంగా మారడం; ఒక నిర్దిష్ట వస్తువుమీద గాని, లేదా ఒక నిర్దిష్ట విషయం లోపల గాని, లేదా ఒక నిర్దిష్ట సమాజం లోపల గాని పనిచేసే వివిధ శక్తుల, ధోరణుల మధ్యనుండే వైరుధ్యాల ఘర్షణల ఫలితంగా కలిగే అభివృద్ధి కొరకు ఆంతరంగిక ప్రేరణలు; ప్రతి విషయంలోనూ అన్ని అంశాల మధ్య వున్న (చరిత్ర ఎప్పటికప్పుడు కొత్త అంశాలను నిరంతరమూ బయటపెడుతూ వుంటుంది) పరస్పరాశ్రయమూ అత్యంత సన్నిహితమైన అభేద్యమైన సంబంధం, ఏకరీతిగా వుండే సార్వత్రిక చలన క్రమాన్ని సమకూర్చే సంబంధం, యీ చలన క్రమం నిర్దిష్టమైన నియమాలను అనుసరించు తుంది – అభివృద్ధి సిద్ధాంతంగా సంప్రదాయబద్ధమైన దానికంటె సుసంపన్నం అయిన గతితర్కంయొక్క లక్షణాలలో ఇవి కొన్ని మాత్రమే. (1868 జనవరి 8న ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన ఉత్తరం చూడండి. అందులో ఆయన భౌతికవాద గతితర్కం అని ఎంత మాత్రమూ భ్రమపడడానికి వీలులేని స్టైయిన్‌యొక్క ''దారు త్రైభాగ'' సిద్ధాంతాన్ని పరిహాసం చేశాడు.)

## చరిత్ర గురించిన భౌతికవాద భావన

ప్రాచీన భౌతికవాదంలోని అసంగతత్వాన్నీ, అసంపూర్ణతనూ, ఏకపక్ష దృష్టినీ తెలుసుకున్న మార్క్స్ ''సమాజాన్ని గురించిన శాస్త్రాన్ని... భౌతికవాద పునాదులతో మేళవించి

ఆ పునాదులపై దానిని పునర్నిర్మించాల్సిన''[29] ఆవశ్యకతను గుర్తించాడు. అస్తిత్వంనుంచే చైతన్యం ఉద్భవిస్తుంది గాని దీన్నుంచి అది కాదని భౌతికవాదం స్థూలంగా వివరిస్తుంది గనుక, మానవ సామాజిక జీవితానికి భౌతికవాదాన్ని వర్తింపజేసి సామాజిక అస్తిత్వంనుంచే సామాజిక చైతన్యం ఉద్భవించిందని వివరించాలి. ''సాంకేతిక విజ్ఞానం ప్రకృతిపట్ల మానవుని క్రియాశీల వైఖరినీ, అతడు తన జీవితాన్ని పోషించుకునే సూటి ఉత్పత్తి క్రమాన్నీ బహిర్గతం చేస్తూ, తద్వారా అతని సామాజిక సంబంధాలు రూపొందే రీతినీ, ఆ సంబంధాలనుంచి ఏర్పడే మానసిక భావాల రీతినీ కూడా బహిర్గతం చేస్తుంది'' అని మార్క్స్ రాశాడు (''పెట్టుబడి,'' సంపుటి 1). మార్క్స్ ''అర్థశాస్త్ర విమర్శకు చేర్పు'' అనే తన గ్రంథానికి రాసిన పీఠికలో మానవ సమాజానికీ, దాని చరిత్రకు వర్తింపజేయబడిన భౌతికవాద మౌలిక సూత్రాలకూ యీకింది విధంగా సమగ్రమైన సూత్రీకరణ చేశాడు.

''మానవులు తమ జీవితావసర వస్తువుల సామాజిక ఉత్పత్తిలో అనివార్యమూ, తమ యిష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రమూ అయిన నిర్దిష్ట సంబంధాలను, తమ పాదార్థిక ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో నిర్దిష్ట దశకు అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలను ఏర్పరచుకుంటారు.

''ఈ ఉత్పత్తి సంబంధాలన్నిటి ఫలితార్థమే సమాజపు ఆర్థిక నిర్మాణంగా ఏర్పడుతుంది, ఇదే సమాజపు నిజమైన పునాది. ఈ పునాదిమీదనే న్యాయశాస్త్ర, రాజకీయ ఉపరినిర్మాణం లేస్తుంది. సామాజిక చైతన్యపు నిర్దిష్ట రూపాలు యీ పునాదికి అనుగుణంగా వుంటాయి. భౌతిక జీవితావసర వస్తువుల ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, మేధోపర జీవిత క్రమాలను దరహంమీద నిర్ణయిస్తుంది. మానవుల అస్తిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు, తద్భిన్నంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సమాజపు భౌతిక ఉత్పాదక శక్తులు వాటి అభివృద్ధిలో ఒకానొక నిర్దిష్ట దశలో అప్పుడు ఉనికిలో వున్న ఉత్పత్తి సంబంధాలలో — దీనినే న్యాయశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే — ఇంతవరకూ అవి దేనిలోపల అయితే పనిచేస్తున్నాయో ఆ ఆస్తి సంబంధాలతో ఘర్షణ పడతాయి. ఉత్పాదక శక్తుల అభివృద్ధి రూపాలుగా వున్న యీ సంబంధాలు వాటికి సంకెళ్లుగా తయారవుతాయి. అప్పుడే సామాజిక విప్లవ శకం ఆరంభమౌతుంది. ఆర్థిక పునాది మారడంతో బ్రహ్మాండమైన ఉపరినిర్మాణం యావత్తూ కొంచెం హెచ్చు తగ్గుల్లో త్వరితగతిని పరివర్తన చెందుతుంది. ఇటువంటి పరివర్తనలను పరిశీలించడంలో ప్రకృతిశాస్త్రానికున్నంత కచ్చితత్వంతో నిర్ధారణ చేయబడగల ఆర్థిక ఉత్పత్తి పరిస్థితుల భౌతిక మార్పుకూ, న్యాయశాస్త్ర, రాజకీయ, మత, రసాభిజ్ఞతా లేక తాత్విక — ఒక్క మాటలో చెప్పాలంటే మానవులు వేటిలో అయితే యీ ఘర్షణను గుర్తెరిగి దాని అమీ తుమీ తేల్చుకునేటందుకు పోరాడుతారో ఆ భావజాల రూపాలకూ మధ్యనున్న తేడాను ఎల్లప్పుడూ గమనిస్తూ వుండాలి.

''ఒక వ్యక్తిని గురించి మనకుండే అభిప్రాయం అతడు తనను గురించి తాను ఏమను

కుంటున్నాడో అనే దానిమీద ఎలా ఆధారపడి వుండదో, అదే విధంగా మనం అలాంటి పరివర్తన దశను దాని చైతన్య స్థితిని బట్టే నిర్ణయించజాలం; తద్భిన్నంగా భౌతిక జీవితంలోని వైరుధ్యాలను బట్టి, సామాజిక ఉత్పాదక శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్యనున్న సంఘర్షణను బట్టి యీ చైతన్య స్థితిని వివరించాల్సి వుంటుంది.... స్థూలంగా చూస్తే ఆసియన్, ప్రాచీన, ఫ్యూడల్, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలు సమాజపు ఆర్థిక వ్యవస్థలో అభ్యుదయకర శకాలనే చెప్పవచ్చు'' (1866 జూలై 7న ఎంగెల్స్‌కు రాసిన లేఖలో ''ఉత్పత్తి సాధనాలనుబట్టే శ్రమ సంఘటితం అయి నిర్ధారణ చేయబడుంది అనే మన సిద్ధాంతం'' అని చెప్పిన మార్క్స్ సంక్షిప్త సూత్రీకరణ చూడండి).

చరిత్ర గురించిన భౌతికవాద భావన ఆవిష్కరణ, ఇంకా సరిగా చెప్పాలంటే, సామాజిక సంఘటనా రంగానికి భౌతికవాదాన్ని సుసంగతంగా విస్తరింపజేసి కొనసాగించడం, వెనుకటి చారిత్రక సిద్ధాంతాలలో వుండిన రెండు ప్రధాన లోపాలను తొలగించింది. మొదటి లోపం ఏమిటంటే, తొలి చారిత్రక సిద్ధాంతాలు మహా చేస్తే మానవుల చారిత్రక కార్యకలాపాలలోని భావజాలాత్మక ప్రేరణహేతువులను మాత్రమే పరిశీలించడం, వాటి పుట్టుపూర్వోత్తరాలను పరిశీలించకుండానే, సామాజిక సంబంధాల వ్యవస్థయొక్క అభివృద్ధిని నడిపించే స్వతస్సిద్ధ నియమాలను నిర్ధారించకుండానే, పాదార్థిక ఉత్పత్తి చేరుకున్న అభివృద్ధి స్థాయిలో యీ సంబంధాల మూలాలను గుర్తించకుండానే పరిశీలించడం; రెండవ లోపం, వెనుకటి సిద్ధాంతాలు ప్రజాబాహుళ్యంయొక్క కార్యకలాపాలను పరిగణనలోకి తీసుకోలేదు. చారిత్రక భౌతికవాదం అలాకాకుండా మొట్టమొదటి సారిగా ప్రజాబాహుళ్యపు జీవితంలోని సామాజిక పరిస్థితులను, ఆ పరిస్థితులలో వచ్చే మార్పులను శాస్త్రీయ కచ్చితత్వంలో అధ్యయనం చేయడానికి అవకాశం కలిగించింది. మార్క్స్‌కు పూర్వమున్న ''సాంఘిక శాస్త్రమూ,'' చరిత్రరచనా శాస్త్రమూ మహా అయితే, పొడి వాస్తవాలను, చెదురుబదురుగా సేకరించిన వాటిని పోగుచేసిపెట్టడమూ, చారిత్రక క్రమంయొక్క విడివిడి అంశాలను మాత్రమే వర్ణించడమూ చేశాయి. మార్క్సిజం, పరస్పర వ్యతిరేక ధోరణుల సమస్తాన్ని పరిశీలించడం ద్వారానూ, వాటిని బట్టి సమాజంలోని వివిధ వర్గాల జీవన పరిస్థితులనూ ఉత్పత్తినీ ఖండితంగా నిర్వచించడం ద్వారానూ, ''ఒక ప్రబలమైన'' భావాన్ని ఎంపిక చేయడంలో గాని, దానికి భాష్యం చెప్పడంలో గాని ఆత్మాశ్రయతత్వాన్నీ నిరంకుశతత్వాన్నీ తొలగించడం ద్వారానూ, ఎలాంటి మినహాయింపు లేకుండా అన్ని భావాలూ వివిధములైన అన్ని ధోరణులూ పాదార్థిక ఉత్పాదక శక్తుల స్థితినుంచే ఉద్భవిస్తాయని నిరూపించడం ద్వారానూ సామాజిక ఆర్థిక వ్యవస్థల పుట్టుక, అభితవృద్ధి, పతనాల క్రమవిధానాన్ని సర్వతోముఖంగానూ సమగ్రంగానూ అధ్యయనం చేయడానికి దారి చూపించింది. ప్రజలు తమ చరిత్రను తామే సృష్టించుకుంటారు, కాని ప్రజలయొక్క, ప్రజాబాహుళ్యంయొక్క ప్రేరక హేతు

వులను నిర్ణయించేది ఏది? అంటే, పరస్పర విరుద్ధములైన భావాల మధ్య, ప్రయత్నాల మధ్య ఘర్షణను తెచ్చిపెట్టేది ఏది? మానవ సమాజాల రాసిలో యీ ఘర్షణలన్నిటి ఫలితార్థం ఏమిటి? మానవుని చారిత్రక కార్యకలాపానికి ప్రాతిపదిక అయే భౌతిక జీవితావసరాల ఉత్పత్తికి కావలసిన వస్తుగత పరిస్థితులు ఏవి? ఈ పరిస్థితుల అభివృద్ధిని నడిపే నియమం ఏమిటి? మార్క్స్ మన దృష్టిని యీ ప్రశ్నలన్నిటివైపు ప్రసరింపజేసి చరిత్రను అపారమైన వైవిధ్యమూ, వైరుధ్యాలు కలిగినదే అయినా ఒకే క్రమవిధానం గల్గినదిగానూ, నిర్దిష్టమైన నియమాల ద్వారా నడిచేదిగానూ శాస్త్రీయంగా అధ్యయనం చేసే మార్గాన్ని చూపించాడు.

## వర్గ పోరాటం

ఏ సమాజంలోనైనా సరే ఆ సమాజ సభ్యులలో కొంతమంది ప్రయత్నాలు మిగతా వారి ప్రయత్నాలతో విరోధిస్తాయనీ, సామాజిక జీవితం పరస్పర వైరుధ్యాలతో నిండి వుందనీ, జాతులకూ సమాజాలకూ మధ్యనూ, జాతుల లోపలనూ సమాజాలలోనూ కూడా పోరాటం జరుగుతూ వుంటుందనీ, అంతే గాక, విప్లవదశ, అభివృద్ధి నిరోధక దశ, యుద్ధమూ శాంతీ, మందస్థితీ త్వరితమైన పురోగమనమూ, లేక, క్షీణదశా ఒకదాని వెంట ఒకటి సంభవిస్తూనే వుంటాయని చరిత్ర బహిర్గతం చేస్తూ వుందనీ మనందరికీ తెలిసిన విషయమే. పద్మవ్యూహంలాగ అవ్యక్త స్థితిలాగ కనబడే యీ వ్యవస్థను నడిపించే నియమాలను బైటపెట్టేటందుకు మార్గదర్శకత్వాన్ని మార్క్సిజం మనకి అందిచ్చింది, అదే వర్గ పోరాట సిద్ధాంతం. ఒకానొక సమాజంలో గాని, సమాజాల సముదాయంలో గాని వున్న సభ్యులందరి ప్రయత్నాల వెరసిని అధ్యయనం చేసినప్పుడే ఆ ప్రయత్నాల ఫలితానికి శాస్త్రీయమైన నిర్వచనం చెప్పగలుగుతాం. కాగా ప్రతి సమాజమూ ఏయే వర్గాలుగా విభజింపబడి వుందో ఆయా వర్గాల స్థానంలోనూ జీవిత విధానంలోనూ వుండే తేడానుంచే యీ సంఘర్షించుకునే ప్రయత్నాలు ఉత్పన్నమవుతాయి. మార్క్స్ "కమ్యూనిస్టు ప్రణాళిక"లో ఇలా రాశాడు: "ఇంతవరకు గడిచిన సమాజపు చరిత్ర అంతా (ఆదిమ సమాజ చరిత్ర మినహా అని ఎంగెల్స్ తరువాత చేర్చాడు) వర్గ పోరాటాల చరిత్రే. స్వతంత్ర పౌరుడూ, బానిసా – పాలక వర్గీయుడూ, సామాన్యుడూ – భూస్వామ్య ప్రభువూ, దాసుడూ – వృత్తి సంఘ సభ్యుడూ, వృత్తి సంఘ కార్మికుడూ – ఒక్క మాటలో చెప్పాలంటే, పీడకుడూ, పీడితుడూ యెల్లప్పుడూ పరస్పర శత్రువులుగా నిలబడి, ఒకప్పుడు ప్రచ్ఛన్నంగానూ, మరొకప్పుడు బాహాటంగానూ, నిరంతరాయంగా పోరాటం చేస్తూ వచ్చినారు; యీ పోరాటపు పర్యవసానంగా ఒకోసారి మొత్తం సమాజం విప్లవాత్మక పునర్నిర్మాణానికి లోనయ్యేది, ఒకోసారి ప్రత్యర్థి వర్గాలు

రెండూ నాశనమయ్యేవి.... ఫ్యూడల్ సమాజపు శిథిలాలనుండి ఉద్భవించిన ఆధునిక బూర్జువా సమాజం వర్గ వైరుధ్యాలను నిర్మూలించలేదు. అది చేసిందల్లా పాత వర్గాలకు బదులు కొత్త వర్గాలనూ, పాత దమన పద్ధతులకు బదులు కొత్త దమన పద్ధతులనూ, పాత పోరాట రూపాలకు బదులు కొత్త పోరాట రూపాలనూ నెలకొల్పడం మాత్రమే. కానీ, బూర్జువా యుగం అనబడే యీ మన యుగానికి ఒక విశిష్టమైన లక్షణం వుంది: అది వర్గ వైరుధ్యాలలోని సంకీర్ణతను తొలగించింది. అంతకంతకూ మొత్తం సమాజమంతా బూర్జువా వర్గం, కార్మికవర్గం అనే రెండు మహత్తర శత్రు శిబిరాలుగా, పరస్పరాభిముఖాలైన రెండు మహా వర్గాలుగా చీలిపోతున్నది.'' ఫ్రెంచి మహా విప్లవం తరువాతనుంచీ యూరపియన్ చరిత్ర స్పష్టంగా బయటపెడుతున్నది ఏమిటంటే, అనేక దేశాలలో జరిగిన ఘటనలకు మూలం వర్గ పోరాటమే. ఫ్రాన్సులో పునరుద్ధరణ కాలం[30] అనేక మంది చరిత్రకారులను ముందుకు తెచ్చింది (త్యెర్రీ, గిజో, మిన్యే, త్యేర్); అక్కడ జరుగుతూన్న ఘటనలను క్రోడీకరించడంలో వారు ఫ్రెంచి చరిత్ర కంతకూ కీలకం వర్గ పోరాటమేనని అంగీకరించక తప్పలేదు. ఆధునిక శకం — బూర్జువావర్గపు సంపూర్ణ విజయం, ప్రజాప్రతినిధి సంస్థలు, విస్తృతమైన (సార్వత్రికం కాకపోయినా) వోటింగు హక్కు, ప్రజానీకంలో విరివిగా ప్రచారంలో వున్న చౌక దినపత్రికలు వగైరా వున్న శకం, శక్తివంతమైన నిరంతర విస్తృతి చెందుతూన్న కార్మికుల సంఘాలు, యజమానుల సంఘాలు వగైరా వున్న శకం — చారిత్రక ఘటనలకు (ఒక్కొక్కప్పుడు ఏకపక్షంగానూ, ''శాంతియుతంగానూ'' ''రాజ్యాంగబద్ధంగానూ'' అయినప్పటికీ) వర్గ పోరాటమే ప్రధాన చోదకశక్తి అని ఇదివరకటికంటె మరింత స్పష్టంగా బైటపెట్టింది. మార్క్సు రచించిన ''కమ్యూనిస్టు ప్రణాళిక''లోని యీ కింది భాగం ప్రతి వర్గంయొక్క అభివృద్ధి పరిస్థితులను విశ్లేషించడంలో ఆధునిక సమాజంలోని ప్రతి వర్గంయొక్క స్థానాన్ని గురించీ వస్తుగత విశ్లేషణ జరపడం సాంఘిక శాస్త్రం చేయవలసిన పని అని మార్క్సు కోరుతున్నట్టు తెలియజేస్తుంది: ''యీనాడు బూర్జువా వర్గానికి ముఖాముఖిగా నిలబడిన వర్గాలన్నిటిలోకీ కార్మికవర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం. తక్కిన వర్గాలు ఆధునిక పరిశ్రమల ప్రభావంవల్ల క్షీణించి క్షీణించి చివరకు అదృశ్యమౌతాయి. కార్మికవర్గం ఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి, ఆధునిక పరిశ్రమల అతిముఖ్య సృష్టి. మధ్య తరగతిలో కిందిశ్రేణివాళ్లు — చిన్న చిన్న పరిశ్రమల యజమానులూ, దుకాణదారులూ, చేతిపనివాళ్లూ, రైతులూ — వీళ్లందరూ బూర్జువావర్గంతో పోరాడుతారు; కానీ వీళ్ల పోరాటం మధ్యతరగతిలో భాగాలుగానే తాము బతుకుతూ వుండడానికి. అనగా వీళ్లు విప్లవకారులు కాదు, యథాస్థితివాదులు. అంతేకాదు, ప్రగతి వ్యతిరేకులు కూడా; యెందుకంటే వీళ్లు చరిత్ర గతిని వెనక్కు తిప్పడానికి ప్రయత్నిస్తారు. ఒకవేళ వీళ్లు యెప్పుడైనా విప్లవకరంగా వున్నారంటే, త్వరలోనే తాము కార్మికవర్గంలో

కలిసిపోనున్న దృష్ట్యానే అలా వుంటారు; అనగా వీళ్లు తమ ప్రస్తుత ప్రయోజనాలకొరకు కాక, భవిష్యత్ ప్రయోజనాలకొరకు పోరాడుతారు — తమ సొంత దృక్పథం వదలిపెట్టి కార్మికవర్గ దృక్పథం స్వీకరిస్తారు.'' అనేక చారిత్రక గ్రంథాలలో (''గ్రంథవివరణ పట్టిక'' చూడండి) మార్క్సు, విడిగా ప్రతి వర్గంయొక్క స్థానాన్ని, ఒక్కొక్కప్పుడు ఒక వర్గంలోని వివిధ గ్రూపుల లేక తరగతుల స్థానాన్ని పరిశీలించుతూ, ''ప్రతి వర్గ పోరాటమూ కూడ రాజకీయ పోరాటమే'' ఎందుచేత ఎలా అవుతుందో చూపుతూ భౌతికవాద చరిత్ర రచనాశాస్త్రానికి ఉజ్వలములూ, ప్రగాఢములూ అయిన ఉదాహరణలు యిచ్చాడు. చారిత్రక అభివృద్ధియొక్క ఫలితార్థాన్ని నిర్ధారణ చేసేటందుకుగాను, ఒక వర్గం మరొక వర్గంలోకీ, గతం భవిష్యత్తులోకీ మారేటప్పుడు సామాజిక సంబంధాలలో ఎలాంటి సంక్లిష్ట పరిస్థితుల జాలమూ, పరివర్తన దశలు ఏర్పడతాయో తెలుసుకోడానికి పైన ఉదహరించిన వాక్యాలు చక్కని తార్కాణం.

మార్క్సు సిద్ధాంతాన్ని అత్యంత ప్రగాఢంగానూ, సమగ్రంగానూ, సవిస్తరంగానూ ధ్రువపరుస్తూ దానిని అన్వయింపజేస్తున్నది ఆయన ఆర్థిక సిద్ధాంతమే.

# మార్క్సు ఆర్థిక సిద్ధాంతం

''ఆధునిక సమాజపు, అంటే పెట్టుబడిదారీ, బూర్జువా సమాజపు గమనం ఆర్థిక నియమాన్ని బయటపెట్టడమే యీ గ్రంథంయొక్క ప్రధానోద్దేశం'' అని ''పెట్టుబడి'' అనే తన గ్రంథానికి రాసిన పీఠికలో మార్క్సు అన్నాడు. చారిత్రకంగా నిర్వచింపబడిన ఒక నిర్దిష్ట సమాజంలోని ఉత్పత్తి సంబంధాలను, వాటి ఆరంభాన్నీ, అభివృద్ధినీ, క్షయాన్నీ పరిశోధించడమే మార్క్సు ఆర్థిక సిద్ధాంతపు వస్తువు. పెట్టుబడిదారీ సమాజంలో సరుకుల ఉత్పత్తే ప్రాబల్యం వహించి వుంటుంది, అందుచేత మార్క్సు చేసే విశ్లేషణ సరుకుల విశ్లేషణతో ఆరంభమవుతుంది.

## విలువ

మొదటి విషయం, సరుకు మానవుని అవసరాన్ని తీరుస్తుంది; రెండవది, ఒక సరుకును మరొక సరుకుతో మారకం చేసుకోవచ్చు. ఒక వస్తువు కుండే ఉపయోగమే దాని ఉపయోగపు విలువ అవుతుంది. ఒక రకం ఉపయోగపు విలువల సంఖ్యను మరో రకం ఉపయోగపు విలువల సంఖ్యతో మారకం చేసుకునేటప్పుడు వాటి మధ్య గల నిష్పత్తి, సమానుపాతం, మారకపు విలువ (లేక సూక్ష్మంగా, విలువ) అవుతుంది. నిత్యం కోట్ల

సంఖ్యలో జరిగే యిలాంటి మారకాలు, ఒక ఉపయోగపు విలువతో మరొక ఉపయోగపు విలువను నిరంతరం సమపరచి మారకం చేసుకోడం, అత్యంత భిన్నమైన పోల్చతగని వాటిని సహితం మారకం చేసుకోడం జరుగుతూ వుందని దైనందిన అనుభవం మనకు తెలుపుతూ వుంది. అయితే, ఒక నిర్దిష్టమైన సామాజిక సంబంధాల వ్యవస్థలో నిరంతరం ఒకదానితో ఒకటి సమపరచబడుతూన్న వివిధ వస్తువులలో వున్న సామాన్య గుణం ఏమిటి? అవి శ్రమయొక్క ఉత్పాదితాలు కావడమే వాటికున్న సామాన్యగుణం. ఉత్పాదితాలను మారకం చేసుకోడంలో మనుషులు అత్యంత విభిన్నమైన రకరకాల శ్రమను ఒకదానితో ఒకటి సమపరచుకుంటారు. సరుకుల ఉత్పత్తే సామాజిక సంబంధాల వ్యవస్థ, అందులో విడి ఉత్పత్తిదారులు రకరకాల ఉత్పాదితాలను (శ్రమయొక్క సామాజిక విభజన) తయారు చేస్తారు, మారకం చేసుకోడంలో యీ ఉత్పాదితాలన్నీ ఒకదానితో ఒకటి సమమవుతాయి. కనుక, సరుకులన్నిటికీ వున్న సామాన్యగుణం ఆయా ప్రత్యేక ఉత్పత్తి శాఖలో వున్న నిర్ణీత శ్రమ కాదు, ఒక ప్రత్యేక రకమైన శ్రమ కాదు, అనిర్దిష్ట మానవ శ్రమే – దరహంమీద మానవ శ్రమే. ఏ సమాజంలోనైనా, సరుకులన్నిటియొక్క మొత్తం విలువ రూపంలో నున్న శ్రమశక్తి అంతా అదే మానవ శ్రమశక్తే. కోటాను కోట్ల మారకపు చర్యలు దీనినే రుజువు చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి సరుకూ సామాజికంగా అవసరమైన శ్రమ కాలంలో కొంత భాగాన్ని మాత్రమే సూచిస్తుంది. విలువయొక్క పరిమాణాన్ని సామాజికంగా అవసర మైన శ్రమ, లేక ఒక నిర్దిష్ట విలువ గలిగిన సరుకును, ఒక నిర్దిష్ట ఉపయోగపు విలు వను ఉత్పత్తి చేయడానికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలం నిర్ణయిస్తుంది. ''మనం తయారుచేసిన వేర్వేరు ఉత్పాదితాలను మారకం చేసుకోడం ద్వారా వాటి విలువలను సమపరచుకున్నప్పుడల్లా ఆ మారకంవల్లనే మనం వాటిని తయారుచేయడానికి వినియోగిం చిన వివిధ రకాల శ్రమను మానవ శ్రమగా సమపరచడం కూడా చేస్తున్నాం. అలా చేస్తున్నా మనే ఎరుక మనకు వుండదు, అయినప్పటికీ మనం అలా చేస్తూనే వుంటాం.''[31] ఇద్దరు వ్యక్తుల మధ్య వుండే సంబంధమే విలువ అని వెనుకటి అర్థశాస్త్రవేత్త ఒకాయన అన్నాడు; వస్తు రూప సంబంధం అనే ముసుగుకింద మరుగుపర్చబడిన సంబంధం అనే మాటలను కూడా ఆయన చేర్చి వుండాల్సింది. ఒక నిర్దిష్ట చారిత్రక సమాజపు నిర్మాణ రూపంలోని ఉత్పత్తియొక్క సామాజిక సంబంధాల వ్యవస్థ దృష్ట్యా, అంతేగాక సామూహికమైన మారకం రూపంలో, కోట్లాది పర్యాయాలు పునరావృతమయే మారకం రూపంలో వ్యక్తమయే సంబంధాల వ్యవస్థ దృష్ట్యా పరిశీలించినప్పుడే విలువ అంటే ఏమిటో మనకి అర్థం అవుతుంది. ''విలువలుగా, అన్ని సరుకులూ కూడ వాటిలో ఘనీభవించి వున్న శ్రమకాలపు నిర్దిష్ట రాసులు మాత్రమే.''[32] సరుకులలో ఇమిడివున్న శ్రమయొక్క ద్వంద్వ స్వభావాన్ని వివరంగా పరిశీలించిన మీదట మార్క్స్, విలువ రూపాన్నీ, ధనాన్నీ పరిశీలించడానికి పూనుకున్నాడు.

ఈ పరిశీలనలో మార్క్స్ ప్రధానోద్దేశం విలువయొక్క ధనరూపం ఎలా ఉత్పన్నం అయిందో పరిశీలించడం, మారకంయొక్క అభివృద్ధిని గురించిన చారిత్రక క్రమాన్ని పరిశీలించడం, విడివిడి యాదృచ్ఛికమైన వస్తు మారకపు చర్యలతో ఆరంభమై (నిర్దిష్ట పరిమాణంలో వున్న ఒక సరుకును నిర్దిష్ట పరిమాణంలో వున్న మరొక సరుకుతో మారకం చేసుకున్నప్పుడు ఏర్పడే "ప్రాథమిక లేక యాదృచ్ఛిక విలువ రూపం") ఒక నిర్దిష్ట సరుకుతో వివిధ రకాల సరుకులను మారకం చేసుకునే సార్వత్రికమైన విలువ రూపం కింద ఎలా మారిందో, అది చివరకు ధన రూప విలువగా ఎలా తయారైందో బంగారం, యీ నిర్దిష్ట సరుకు రూపాన్ని ధరించి సార్వత్రిక విలువ రూపం ఎలా అయిందో పరిశీలించడం. మారకపు అభివృద్ధియొక్క, సరుకుల ఉత్పత్తియొక్క ఉన్నత ఉత్పాదితం అయిన ధనం వ్యక్తిగత శ్రమ అంతటియొక్క సామాజిక స్వభావాన్నీ, మార్కెట్ ద్వారా ఐక్యమయే విడి ఉత్పత్తిదారుల మధ్యనున్న సామాజిక సంబంధాన్ని, ముసుగు కప్పి మరుగు పరచుతుంది. ధనం నిర్వహించే వివిధ క్రియలను గురించి మార్క్స్ ఎంతో వివరంగా పరిశీలన జరిపాడు; ఈ సందర్భంలో ప్రత్యేకించి (దరహంమీద "పెట్టుబడి" అనే గ్రంథం మొదటి అధ్యాయాలలో వున్నట్టుగా) పేర్కొనవలసింది ఏమిటంటే అనిర్దిష్టమైనదిగానూ, ఒక్కొక్కప్పుడు తర్కరీత్యా కేవలం ఊహ్యమైన విధంగానూ వున్నట్టు కనబడే వివరణ, వాస్తవంలో మారకంయొక్క అభివృద్ధి చరిత్రను, సరుకుల ఉత్పత్తిని గురించిన వాస్తవ విషయాల బ్రహ్మాండమైన సముదాయాన్ని వివరిస్తుంది. "మనం ధనాన్నే తీసుకుని పరిశీలిస్తే, సరుకుల మారకంలో అది ఒక నిర్దిష్టమైన దశ అని తెలుస్తుంది. కేవలం సరుకుల విలువకు సమానమైనదిగా అయితేనేమి, చలామణీ సాధనంగా అయితేనేమి, చెల్లింపు సాధనంగా అయితేనేమి, నిధిగా అయితేనేమి, సాధారణమైన డబ్బుగా అయితేనేమి, ముఖ్యాంశంగా అయితేనేమి, ధనం నిర్వర్తించే ప్రత్యేక క్రియలు ఆయా క్రియల విస్తృతినీ, ప్రాబల్యాన్నీ బట్టి సామాజిక ఉత్పత్తిక్రమంలో వివిధ దశలను సూచిస్తాయి." ("పెట్టుబడి," సంపుటి 1.)[33]

## అదనపు విలువ

సరుకుల ఉత్పత్తి అభివృద్ధిలో ఒక నిర్దిష్టమైన దశలో ధనం పెట్టుబడిగా మారిపోతుంది. సరుకుల చలామణీయొక్క సూత్రసంకేతం స — ధ — స (సరుకు — ధనం — సరుకు) అంటే, మరో సరుకును కొనడంకోసం ఒక సరుకును అమ్మడం రూపంలో వుండేది. తద్భిన్నంగా పెట్టుబడియొక్క సాధారణ సూత్రసంకేతం ధ — స — ధ, అంటే (లాభం వచ్చేట్టుగా) అమ్మడంకోసమే సరుకును కొనడం. చలామణీలో పెట్టబడిన ధనం

విలువమీద పెరిగిన విలువకే అదనపు విలువ అని మార్క్స్ పేరుపెట్టాడు. పెట్టుబడిదారీ చలామణీ వ్యవస్థలో ధనం యీవిధంగా ''పెరుగుతుంది'' అనే విషయం అందరికీ తెలిసినదే. నిజానికి యీ ''పెరుగుదలే'' ధనాన్ని ఒక ప్రత్యేకమైన, చారిత్రకంగా నిర్దిష్టమైన, సామాజిక ఉత్పత్తి సంబంధమైన పెట్టుబడిగా మారుస్తుంది. అదనపు విలువ అనేది సరుకుల చలామణీనుంచి పుట్టుకురావడానికి అవకాశం లేదు, ఎందుచేతనంటే సరుకుల చలామణీ అంటే సమాన విలువగల వాటి మారకం మాత్రమే; ధరలు పెంచడంవల్ల కూడా అదనపు విలువ పుట్టదు, ఎందుచేతనంటే అమ్మేవాళ్ల, కొనేవాళ్ల లాభాలూ నష్టాలూ ఒకదానికొకటి సరిపోతూనే వుంటాయి కనుక, ఇక్కడ మనకి తటస్థపడేది విడి విషయం కాదు, సామూహికమైన, సగటున జరిగే సామాజిక విషయం. అదనపు విలువ లభించాలంటే ధనం వున్నవాడు ''ఏ సరుకుయొక్క ఉపయోగపు విలువకు విలువను సృష్టించగల విశిష్ట గుణం వుందో అలాంటి సరుకును మార్కెట్టులో వెతికి పట్టుకోవాలి''[34] – అంటే ఆ సరుకుయొక్క వినిమయ క్రమమే విలువను సృష్టించే క్రమం అయివుండాలి. అలాంటి సరుకు వుంది – అదే మానవ శ్రమశక్తి. దాని వినియోగమంటే శ్రమే. యీ శ్రమ, విలువను సృష్టిస్తుంది. ధనం వున్న వ్యక్తి శ్రమశక్తిని దాని విలువను బట్టి కొంటాడు, యీ శ్రమశక్తి విలువ కూడా అన్ని యితర సరుకుల విలువలాగే దాని ఉత్పత్తికి అవసరమైన సామాజిక శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయించబడుతుంది (అంటే కార్మికుడు, అతని కుటుంబమూ పోషింపబడడానికయే ఖర్చు అన్నమాట). శ్రమశక్తిని కొన్న తరువాత ధనం వున్న వ్యక్తి దానిని వినియోగించుకునే అధికారం కలిగివుంటాడు, అంటే రోజంతా, మాటవరసకి 12 గంటల సేపు పని చేయించగలడు. అయితే ఆరు గంటల కాలంలో (''అవసరమైన'' శ్రమ కాలం) ఆ కార్మికుడు తన పోషణ ఖర్చుకు సమానమైన విలువగల ఉత్పాదితాన్ని తయారుచేస్తాడు; మిగిలిన ఆరు గంటల కాలంలోనూ (''అదనపు'' శ్రమ కాలం) అతడు అదనపు ఉత్పాదితాన్ని లేక అదనపు విలువను సృష్టిస్తాడు, దీనికిగాను కార్మికునికి పెట్టుబడిదారుడు ఏమీ చెల్లించడు. అందుచేత, యీ ఉత్పత్తి క్రమం దృష్ట్యా పెట్టుబడిలో రెండు వేరువేరు భాగాలున్నాయని గుర్తించాలి: మొదటిది, ఉత్పత్తి సాధనాల కోసం (యంత్రాలూ, పనిముట్లూ, ముడిపదార్థాలూ వగైరాలు) ఖర్చు చేసే స్థిర పెట్టుబడి, వీటి విలువ ఎలాంటి మార్పూ లేకుండా (తక్షణంగాని, భాగాలుగాగాని) తయారైన వస్తువులోకి మారిపోతుంది; రెండవది, శ్రమశక్తిని కొనడం కోసం వినియోగించే అస్థిర పెట్టుబడి. ఈ పెట్టుబడియొక్క విలువ స్థిరమైనది కాదు. అది అదనపు విలువను సృష్టిస్తూ శ్రమ క్రమంలోనే పెరుగుతుంది. అందుచేత పెట్టుబడి శ్రమశక్తిని చేసే దోపిడీ తీవ్రతను వెల్లడి చేయాలంటే అదనపు విలువను మొత్తం పెట్టుబడితో గాక అస్థిర పెట్టుబడితో మాత్రమే పోల్చి చూడాలి. ఆవిధంగా, పైన ఇచ్చిన ఉదాహరణలో అదనపు విలువ

రేటు అని మార్క్స్ పేరుపెట్టిన యీ నిష్పత్తి 6:6 అవుతుంది, అంటే నూటికి నూరు పాళ్ళు.

పెట్టుబడి ఉద్భవించడానికి రెండు చారిత్రక పూర్వావసరాలు వుండాలి. మొదటిది, మొత్తంమీద సరుకుల ఉత్పత్తి సాపేక్షంగా ఉన్నత స్థాయి అభివృద్ధి దశలో వున్నప్పుడు వ్యక్తుల చేతులలో కొంత ధనం పోగుపడి వుండాలి; రెండవది, ద్వివిధమైన "స్వేచ్ఛ" కలిగివున్న కార్మికుడు వుండాలి; అంటే అతడు తన శ్రమశక్తిని అమ్ముకోడానికి ఎలాంటి నిర్బంధంగాని, ప్రతిబంధకంగాని లేనివాడూ, భూమిగాని, మొత్తంమీద ఉత్పత్తి సాధనాలు గాని ఏమీ లేనివాడూ, వాటితో ఎలాంటి సంబంధమూ లేని స్వేచ్ఛ కలిగిన కార్మికుడు, తన శ్రమశక్తిని అమ్ముకుంటేనే తప్ప జీవించజాలని "శ్రామికుడు" అయివుండాలి.

అదనపు విలువను వృద్ధి చేయడానికి ప్రధానంగా రెండు పద్ధతులున్నాయి: రోజులో పని చేయవలసిన కాలాన్ని పెంచడం ("పరమ అదనపు విలువ"), రోజులో అవసరమైన పనికాలాన్ని తగ్గించడం ("సాపేక్ష అదనపు విలువ"). ఇందులో మొదటి పద్ధతిని విశ్లేషిస్తూ రోజులో పనిచేయవలసిన కాలాన్ని తగ్గించడానికి కార్మికవర్గం జరిపిన పోరాటాన్నీ, పనికాలాన్ని పెంచేటందుకూ (పధ్నాలుగో శతాబ్దంనుంచి పదిహేడో శతాబ్దంవరకూ), పని కాలాన్ని తగ్గించేటందుకూ (పంథొమ్మిదో శతాబ్దంలో ఫ్యాక్టరీ చట్టాలు) ప్రభుత్వం కలుగ జేసుకున్న జోక్యాన్నీ గురించిన చిత్రాన్ని కళ్లకు కట్టినట్టుగా మార్క్స్ చూపాడు. "పెట్టుబడి" అనే గ్రంథం వెలువడిన తరువాత ప్రపంచంలో అన్ని నాగరిక దేశాలలోని కార్మికోద్యమ చరిత్రా యీ చిత్రణను విస్తరించి చూపే నూతన విషయాలను సమృద్ధిగా సమకూరుస్తోంది.

సాపేక్ష అదనపు విలువ ఎలా ఉత్పత్తి అవుతోందో విశ్లేషిస్తూ, పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రమ ఉత్పాదకతను అధికంచేసిన మూడు మౌలికమైన చారిత్రక దశలను మార్క్స్ పరిశోధించాడు: (1) సరళమైన సహకారం; (2) శ్రమ విభజన, కార్ఖానా ఉత్పత్తి; (3) యంత్రాలూ, భారీ పరిశ్రమలూ. పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రధానమైన విశిష్టమైన లక్షణాలను మార్క్స్ ఎంత నిశితంగా బైటపెట్టినదీ తెలుసుకునేందుకు సందర్భవశాత్తూ రష్యాలో చేతిపని పరిశ్రమలను గురించిన పరిశోధనలు పైన పేర్కొన్న మొదటి రెండు దశలనూ నిరూపించే బోలెడంత సమాచారాన్ని మనకు సమకూరుస్తున్నాయి. మార్క్స్ 1867లో వర్ణించిన భారీ యంత్రపరిశ్రమయొక్క విప్లవకర ఫలితాలను ఆ తరువాత గడచిన అర్ధశతాబ్దం కాలంలోనూ కొన్ని "కొత్త" దేశాలలో (రష్యా, జపాన్ వగైరాలు) జరిగిన పరిణామాలే బైటపెడుతున్నాయి.

ఇంకా చెప్పాలంటే, <u>పెట్టుబడి సంచయనం</u> గురించి మార్క్స్ జరిపిన విశ్లేషణ అత్యంత ముఖ్యమైనది, నవీనమైనది. పెట్టుబడి సంచయనాన్ని, అంటే, అదనపు విలువలో

కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చి దానిని పెట్టుబడిదారీ వ్యక్తిగత అవసరాలను గాని చాపల్యాలను గాని తీర్చుకోడానికి గాక, కొత్త ఉత్పత్తి కోసమే వినియోగించడం. పూర్వపు సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలందరూ (ఆడమ్ స్మిత్ మొదలు అందరూ) చేసిన పొర పాటును మార్క్స్ బైటపెట్టాడు. వారందరూ పెట్టుబడిగా మారిన అదనపు విలువ యావత్తూ అస్థిర పెట్టుబడి అవుతోందని భావించారు. వాస్తవంలో అది ఉత్పత్తి సాధనాలు గానూ, అస్థిర పెట్టుబడిగానూ విభజింపబడుతోంది. అస్థిర పెట్టుబడి వాటాకంటె స్థిర పెట్టుబడి వాటా మరింత త్వరితగతిని పెరగడమన్నది పెట్టుబడిదారీ విధానపు అభి వృద్ధి క్రమానికీ, అది సోషలిజంలోకి పరివర్తన చెందడానికీ గొప్ప ప్రాముఖ్యం గల విషయం.

పెట్టుబడి సంచయనం, కార్మికుల స్థానే యంత్రాలను తెచ్చిపెట్టడాన్ని త్వరితం చేసి, ఒక వైపున అమిత సంపదనూ, మరో వైపున కటిక దారిద్ర్యాన్నీ సృష్టించి "కార్మిక రిజర్వు సైన్యం" అనబడే కార్మికుల "సాపేక్ష అధిక సంఖ్య"ను లేదా "పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అధిక జనాభా"ను కూడా సృష్టిస్తోంది. ఇది అత్యంత వైవిధ్యంగల రూపా లను తీసుకుని, ఉత్పత్తిని అత్యంత త్వరితంగా విస్తృత పర్చేటందుకు పెట్టుబడికి వీలు కలి గిస్తుంది. దీనితోపాటు పరపతి సౌకర్యాలు అధికం కావడమూ ఉత్పత్తి సాధనాల రూపంలో పెట్టుబడి సంచయనమూ — మొదట సగటున పదేళ్ల కొకసారి చొప్పున, ఆ తరువాత మరింత సుదీర్ఘమూ, తక్కువ అనిర్దిష్టమూ అయిన కాలవ్యవధులలోనూ పెట్టుబడిదారీ దేశాలలో కాలక్రమంలో సంభవించే అధికోత్పత్తి సంక్షోభాలను అర్థంచేసుకోడానికి సందర్భవ శాత్తూ కీలకాంశాలు అవుతున్నాయి. పెట్టుబడిదారీ విధానంలో జరుగుతూన్న పెట్టుబడి సంచయనానికీ ఆదిమ సంచయనం అనే దానికీ వున్న తేడాను మనం తెలుసుకోవాలి. ఆదిమ సంచయనం అంటే, కార్మికుణ్ణి ఉత్పత్తి సాధనాలనుంచి బలాత్కారంగా వేరుచేయడమూ, రైతుని భూమినుంచి తరిమివేయడమూ, సాముదాయక భూములను కాజేయడమూ, వలస వ్యవస్థ, జాతీయ రుణ వ్యవస్థ, రక్షణ సుంకాలు, మొదలైన వాటి ద్వారా జరిగిన సంచ యనం. "ఆదిమ సంచయనం" ఒక కొసను "స్వేచ్ఛాయుతుడైన" శ్రామికుడినీ, మరో కొసను ధనాధిపతినీ, పెట్టుబడిదారునీ సృష్టిస్తుంది.

"పెట్టుబడిదారీ సంచయనపు చారిత్రక ధోరణి"ని మార్క్స్ యీకింది సుప్రసిద్ధ వచనాలలో వర్ణించాడు: "సూటి ఉత్పత్తిదారుల ఆస్తిహరణం నిష్కరుణమైన కిరాతకత్వం తోనూ, మహా అసహ్యమైన, మహా నీచమైన, మహా క్షుద్రమైన, మహా ఏహ్యమైన కోర్కెల ప్రేరణతోనూ జరిగింది. ఒంటరి, స్వతంత్ర శ్రమజీవియొక్క, అతని శ్రమ అవసరాల యొక్క సంలీనం అనదగిన దానిమీద ఆధారపడిన స్వీయార్జిత ఆస్తిని (రైతుదీ, చేతి పనివాడిదీ) యితరుల, నామకార్థంగా స్వేచ్ఛాయుతమైన శ్రమను, దోపిడీ చేయడంమీద,

అనగా వేతన శ్రమమీద ఆధారపడిన పెట్టుబడిదారీ సొంత ఆస్తి తొలగించింది.... ఇప్పుడు ఆస్తిహరణకు గురికావలసింది తన సొంతానికి పనిచేసే శ్రామికుడు యిక యెంతమాత్రమూ కాదు, మరి యెవరంటే, అనేక శ్రామికులను దోపిడీ చేసే పెట్టుబడిదారుడు. పెట్టుబడిదారీ ఉత్పత్తిలోనే అంతర్నిహితంగా వున్న నియమాలచేత, పెట్టుబడి కేంద్రీకరణచేత, యీ ఆస్తిహరణ జరుగుతుంది. ఒక పెట్టుబడిదారుడు అనేక మంది పెట్టుబడిదారుల నెత్తిన చెయ్యి పెడతాడు. యీ కేంద్రీకరణతో, లేదా కొద్దిమంది పెట్టుబడిదార్లచేత జరిగే యీ అనేకమంది పెట్టుబడిదార్ల ఆస్తిహరణతో పాటు, శ్రమ క్రమంయొక్క సహకార రూపమూ, శాస్త్ర విజ్ఞానాన్ని బుద్ధిపూర్వకంగా సాంకేతికంగా వినియోగించడమూ, భూమిని ప్రణాళికాబద్ధంగా సాగుచేయడమూ, శ్రమ పరికరాలను సమష్టిగా మాత్రమే ఉపయోగించదగిన శ్రమ పరికరాలుగా రూపాంతరీకరించడమూ, సంయుక్త, సామాజికీకృత శ్రమయొక్క ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించడంద్వారా సకల ఉత్పత్తి సాధనాలనూ పొదుపు చేయడమూ, సకల జాతులూ ప్రపంచ మార్కెట్ అనే వలలో యిరుక్కోవడమూ, దీనితో పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అంతర్జాతీయ స్వభావమూ అంతకంతకూ విస్తరించే ప్రమాణంలో అభివృద్ధి చెందుతాయి. యీ రూపాంతరీకరణ క్రమంయొక్క సకల సౌకర్యాలనూ దురాక్రమించి, గుత్తగొనే పెట్టుబడి ప్రభువుల నిత్యం క్షీణించే సంఖ్యతో పాటు దారిద్ర్యం, పీడన, బానిసత్వం, పతనం, దోపిడీల పరిమాణం పెరుగుతుంది. కానీ దీనితోపాటు కార్మికవర్గంయొక్క నిరసన కూడా పెరుగుతుంది — ఈ వర్గం సంఖ్యలో నిత్యం పెరుగుతూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంయొక్క సంవిధానంచేతనే క్రమశిక్షితమై, సమైక్యమై, వ్యవస్థీకృతమైన వర్గ మౌతుంది. ఉత్పత్తి విధానంతోపాటు, ఉత్పత్తి విధానంలో పుట్టి, వర్ధిల్లిన పెట్టుబడి గుత్తాధిపత్యం ఆ ఉత్పత్తి విధానానికి శృంఖలం అవుతుంది. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, శ్రమ సామాజికీకరణా చివరకు యే దశకు చేరుకుంటాయంటే, అక్కడ వాటికీ, వాటి పెట్టుబడిదారీ ఉపరితలానికీ పొత్తు కుదరదు. యీ ఉపరితలం బద్దలౌతుంది. పెట్టుబడిదారీ సొంత ఆస్తికి ఆయువు మూడుతుంది. ఆస్తిహర్తల ఆస్తి హరింపబడుతుంది'' (''పెట్టుబడి'', సంపుటి 1).[35]

మొత్తం సామాజిక పెట్టుబడియొక్క పునరుత్పత్తిని గురించి కూడా మార్క్స్ తన ''పెట్టుబడి'' రెండవ సంపుటిలో విశ్లేషించాడు. ఈ విశ్లేషణ అత్యంత ముఖ్యమైనదీ, నూతనమైనదీ కూడ. దీన్ని కూడ ఒక విడి విషయంగా కాకుండా సామూహిక విషయంగానూ, సమాజపు ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా గాక, మొత్తం ఆర్థిక వ్యవస్థ అంతకూ సంబంధించిన పరిణామంగానూ తీసుకున్నాడు మార్క్స్. పైన పేర్కొన్న సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తల పొరపాటును సరిదిద్దుతూ మార్క్స్ మొత్తం సామాజిక ఉత్పత్తినంతనూ రెండు పెద్ద విభాగాలుగా విభజించాడు: (I) ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి, (II) వినిమయ

వస్తువుల ఉత్పత్తి. ఆ తరువాత మొత్తం సామాజిక పెట్టుబడి చలామణీని — వెనుకటి పరిమాణాలలో జరిగే పునరుత్పత్తినీ, సంచయనాన్నీ తీసుకుని లెక్కలను ఉదహరిస్తూ వివరంగా పరిశీలించాడు. విలువ నియమం ప్రాతిపదికమీద లాభపు సగటు రేటు ఎలా ఏర్పడుతోంది అనే సమస్యను "పెట్టుబడి" మూడవ సంపుటిలో మార్క్స్ పరిష్కరించాడు. అర్థశాస్త్రంలో మార్క్స్ తీసుకొని వచ్చిన బ్రహ్మాండమైన ముందంజ యేమిటంటే, అపభ్రంశపు అర్థశాస్త్రమూ, ఆధునిక "ఉపాంత్య ఉపయోగపు విలువ" సిద్ధాంతమూ[36] తరచుగా పరిమితపడి వుంటున్న వ్యక్తిగత దృష్టాంతాల లేక పోటీకి సంబంధించిన బాహ్యమైన పైపై అంశాల దృక్పథంనుంచి కాకుండా, సామూహిక ఆర్థిక సంఘటనల దృక్పథంనుంచి, సామాజిక ఆర్థిక వ్యవస్థను మొత్తంగా తీసుకుని తన విశ్లేషణను కొనసాగించడం. మార్క్స్, అదనపు విలువ ఎలా ఉద్భవించిందో మొదట విశ్లేషించి, తరువాత అది లాభం, వడ్డీ, భూమి కౌలూ కింద విభజింపబడడాన్ని పరిశీలించాడు. ఒక వ్యాపారంలో మదుపుగా పెట్టిన మొత్తం పెట్టుబడికీ, అందులో వచ్చిన అదనపు విలువకీ మధ్య గల నిష్పత్తే లాభం. "ఉన్నత అంగ నిర్మాణం" కలిగివున్న పెట్టుబడి (అంటే, స్థిర పెట్టుబడి అస్థిర పెట్టుబడి కంటె, సామాజిక సగటును మించి ప్రబలంగా వుండడం) సగటు లాభం రేటు కంటె తక్కువ లాభాన్ని సమకూరుస్తుంది; "నిమ్న అంగ నిర్మాణం" గలిగి వున్న పెట్టుబడి సగటు లాభం రేటును మించిన లాభాన్ని సమకూరుస్తుంది. పెట్టుబడిదార్ల మధ్య పోటీ, తమ పెట్టుబడిని ఒక శాఖనుంచి మరో శాఖకు మార్చేటందుకు వారికున్న స్వేచ్ఛ, ఇవి రెండు సందర్భాలలోనూ కూడ లాభం రేటును సగటు స్థాయికి తగ్గిస్తాయి. ఒక నిర్దిష్ట సమాజంలో సరుకులన్నిటి విలువలయొక్క మొత్తం ఆ సరుకుల ధరలయొక్క మొత్తంతో సరిపోతూనే వుంటుంది, కాని విడివిడి వ్యాపారాలలోనూ, ఉత్పత్తి శాఖలలోనూ పోటీ ఫలితంగా సరుకులు వాటి విలువలతో సమానమైన ధరలకు గాక ఉత్పత్తి ధరలకు అమ్ముతూ వుంటారు. ఈ ధరలు పెట్టిన పెట్టుబడికి సగటు లాభం రేటును కలిపితే వచ్చే మొత్తానికి సమానంగా వుంటాయి.

ఈవిధంగా, మార్క్స్ విలువ నియమాన్ని ఆధారంగా తీసుకుని ధరలకూ విలువలకూ మధ్య వుండే సర్వవిదితమూ, నిర్వివాదమూ అయిన వ్యత్యాసాన్ని, లాభాలు సమస్థాయిలో వుండడాన్ని పూర్తిగా వివరించాడు. అన్ని సరకుల విలువలయొక్క మొత్తం, అన్ని ధరల మొత్తానికీ సమంగా సరిపోతూండడమే ఇందుకు కారణం. అయినప్పటికీ, (సామాజికమైన) విలువను (వ్యక్తిగతమైన) ధరలతో సమపరచడం సరళంగానూ సూటిగానూ జరగదు, అతి క్లిష్టమైన పద్ధతిలో జరుగుతుంది. కేవలం మార్కెట్టు ద్వారానే ఐక్యమై వుండే విడివిడి సరుకు ఉత్పత్తిదారులతో కూడిన సమాజంలో నియమం అనేది కేవలం సగటు, సామాజిక, సామూహిక నియమంగానే ప్రదర్శితమౌతుంది. అటూ యిటూ

వూగిసలాడే వ్యక్తిగత అతిక్రమణలు పరస్పరం ఒకదాని నొకటి పరిహారం చేసుకుంటూనే వుంటాయి.

శ్రమ ఉత్పాదకత పెరిగిందంటే, అస్థిర పెట్టుబడి కంటె స్థిర పెట్టుబడి మరింత త్వరితంగా పెరుగుతోందన్నమాట. అదనపు విలువ కేవలం అస్థిర పెట్టుబడి యొక్క ఫలం అవడంచేత లాభం రేటు (మొత్తం పెట్టుబడితో అదనపు విలువయొక్క నిష్పత్తి, అస్థిర పెట్టుబడి భాగంతో గల నిష్పత్తి మాత్రమే కాదు) పడిపోతుంది. ఈ ధోరణినీ దీనిని మరుగుపర్చేవీ, లేక ప్రతిఘటించేవీ అయిన అనేక ఇతర పరిస్థితులనూ మార్క్స్ వివరంగా పరిశీలించాడు. "పెట్టుబడి" గ్రంథం మూడవ సంపుటిలో వడ్డీ పెట్టుబడిని, వాణిజ్య పెట్టుబడిని, ధన పెట్టుబడినీ గురించి ఎంతో ఆసక్తికరంగా వివరించిన ప్రకరణాలను ప్రస్తుతానికి వదలివేసి అత్యంత ముఖ్యమైన ప్రకరణాన్ని—భూమి కౌలు సిద్ధాంతం గురించిన విషయాన్నిప్పుడు పరిశీలిద్దాం. భూమి విస్తీర్ణం పరిమితమై వుంది కనుకనూ, పెట్టుబడిదారీ దేశాలలో భూమి యావత్తూ విడి యజమానుల ఆధీనంకింద వుంది గను కనూ వ్యవసాయోత్పాదితాల ఉత్పత్తి ధరలు సగటు నాణ్యతగల భూమిలో ఉత్పత్తి చేయ డానికయే ఖర్చులనుబట్టిగాక నాసిరకం భూమిలో ఉత్పత్తి చేయడానికయే ఖర్చులనుబట్టీ, మార్కెట్టుకు ఉత్పాదితాన్ని చేరవేసే సగటు పరిస్థితులనుబట్టిగాక హీన పరిస్థితులనుబట్టీ నిర్ణయించబడతాయి, ఈ ధరకూ మేలురకం భూమిలో (లేక మేలైన పరిస్థితులలో) ఉత్పత్తి చేయడానికయే ధరకూ మధ్య వుండే వ్యత్యాసమే తారతమ్య కౌలు అవుతుంది. మార్క్స్ యీ విషయాన్ని వివరంగా పరిశీలించి భూఖండాల భూసారంలో వుండే తేడాలను బట్టీ, భూమిమీద పెట్టిన పెట్టుబడులలోని తేడాలనుబట్టీ, యీ కౌలు తేడా ఎలా ఏర్ప డుతోందో నిరూపిస్తూ, ("అదనపు విలువ సిద్ధాంతాల"ను కూడా చూడండి, అందులో రాడ్‌బేర్టుస్‌పై మార్క్స్ చేసిన విమర్శ ముఖ్యంగా గమనార్హం) మేలు రకం భూములు రాను రాను నాసిరకం భూములుగా మారిపోతూండడం మూలంగానే తారతమ్య కౌలు వస్తోందని భావించిన రికార్డోయొక్క పొరపాటును పూర్తిగా బైటపెట్టాడు. తద్భిన్నంగా యీ మార్పు అటునుంచి ఇటు జరగవచ్చు. భూమి ఒక తరంనుంచి మరో తరంలోకి మారిపోవచ్చు (వ్యవసాయ సాంకేతిక పద్ధతుల పురోగమనం, పట్టణాల అభివృద్ధి, ఇంకా ఇతరేతర కారణాల మూలంగా). ప్రకృతి లోపభూయిష్టమైనదనీ, దానికి పరిమితు లున్నాయనీ ఆపాదిస్తూ పెట్టుబడిదారీ వైరుధ్యాలను దానికి అంటగట్టే అప్రతిష్టాకర మైన "క్షీణమాన రాబడుల నియమం" (Law of diminishing returns) పూర్తిగా పొరపాటు. అంతేగాక, పరిశ్రమయొక్క అన్ని శాఖలలోనూ మొత్తంమీద జాతీయ ఆర్థిక వ్యవస్థలోనూ వచ్చే లాభాలను సమపరచడం అంటే పోటీచేసుకోడానికి పూర్తి స్వేచ్ఛ, ఒక శాఖనుంచి మరో శాఖకు పెట్టుబడిని స్వేచ్ఛగా తరలించే అవకాశమూ వుండాలి. అయిన

ప్పటికీ, భూమిపై వ్యక్తిగత స్వామ్యం గుత్తాధిపత్యాన్ని సృష్టిస్తుంది, అది పెట్టుబడి స్వేచ్ఛగా మారడానికి ప్రతిబంధకం అవుతుంది. ఈ గుత్తాధిపత్యం మూలంగా, పెట్టుబడి నిమ్న అంగ నిర్మాణం కలిగివున్న చోట, తత్ఫలితంగా విడిగా ఎక్కువ లాభం రేటు లభించే వ్యవసాయోత్పాదితాలు, లాభాల రేటును సమపరచే స్వేచ్ఛాయుత క్రమంలోకి రావు. గుత్తాధికారి అవడంచేత భూస్వామి వ్యవసాయోత్పాదితాల ధరలను సగటు ధరకు మించిన స్థాయిలో వుంచగలడు, యీ గుత్తధర పరమ కౌలుకు అవకాశాన్నిస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో తారతమ్య కౌలును రద్దుచేయడం సాధ్యం కాదు కాని, పరమ కౌలును రద్దుచేయవచ్చు — ఉదాహరణకు భూమిని జాతీయం చేయడంద్వారా, భూమిని ప్రభుత్వ ఆస్తిగా చేయడంద్వారా అలా చేయవచ్చు. అది ప్రయివేటు భూస్వాముల గుత్తాధిపత్యాన్ని బలహీనపర్చడమే. వ్యవసాయ రంగంలో స్వేచ్ఛాయుతమైన పోటీకి మరింత సంగతమైన, సంపూర్ణమైన అవకాశం ఇవ్వడమే అవుతుంది. అందుచేతనే బూర్జువావర్గంలోని తీవ్రవాదులు భూమిని జాతీయం చేయాలనే యీ ప్రగతిశీల బూర్జువా డిమాండును చరిత్రలో పదేపదే చేస్తూవచ్చారని మార్క్స్ పేర్కొన్నాడు. కాని యీ డిమాండు బూర్జువావర్గంలో ఎక్కువ మందిని భయకంపితులను చేస్తుంది, ఎందుకంటే యిది నేడు ప్రత్యేకించి ముఖ్యమైనదీ, "అతిసున్నితమైనదీ" అయిన మరో గుత్తాధిపత్యాన్ని, మొత్తంమీద ఉత్పత్తి సాధనాలపై వున్న గుత్తాధిపత్యాన్ని బాగా దెబ్బతీస్తుంది. (1862 ఆగస్టు 2న ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖలో పెట్టుబడిమీద వచ్చే సగటు లాభం రేటు గురించీ, పరమ కౌలు గురించీ తాను చెప్పిన సిద్ధాంతాన్ని అత్యంత సుబోధకంగానూ, క్లుప్తంగానూ, స్పష్టంగానూ వివరించాడు. మార్క్స్ — ఎంగెల్స్ "ఉత్తరప్రత్యుత్తరాలు", సంపుటి 3, పేజీలు 77–81, 1862 ఆగస్టు 9న రాసిన లేఖనూ, — అదే సంపుటి, పేజీలు 86–87 చూడండి.) భూమి కౌలు చరిత్ర విషయంలో మార్క్స్ చేసిన విశ్లేషణను కూడా తెలుసుకోడం ముఖ్యం. శ్రమ రూప కౌలు (భూస్వామియొక్క భూమిలో పనిచేయడం ద్వారా రైతు అదనపు ఉత్పాదితాన్ని సృష్టిస్తాడు) ఏవిధంగా ఉత్పాదిత రూపం లేక వస్తు రూపంలో చెల్లించే కౌలుగా (రైతు తన సొంత భూమిలో అదనపు ఉత్పాదితాన్ని సృష్టించి దానిని "ఆర్థికేతర బలాత్కారాల" కారణంగా భూస్వామికి అప్పగించుతాడు) మారిపోతుందో, ఆ తరువాత అది డబ్బు కౌలుగానూ (వస్తు రూపంలో వున్న కౌలు డబ్బులోకి మార్చబడుతుంది — పూర్వం రష్యాలో అమలులో వున్న "ఒబ్రోక్" — సరుకు ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందినప్పుడు వసూలు చేసే కౌలు), చిట్టచివరకు రైతు స్థానంలో కూలికి పనిచేసే కార్మికుల సహాయంతో భూమిని సాగుచేసే వ్యవసాయ వ్యాపారస్తులు రావడంతో యీ డబ్బు కౌలు పెట్టుబడిదారీ విధానపు కౌలుగానూ ఎలా మారిందో మార్క్స్ తన విశ్లేషణలో చూపుతాడు. "పెట్టుబడిదారీ విధానపు కౌలు పుట్టుక"ను పరిశీలించిన

సందర్భంలో వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధాన పరిణామం గురించి మార్క్స్ వెల్లడించిన అనేక ప్రగాఢమైన భావాలను (రష్యాలాంటి వెనుకబడిన దేశాలకు ఎంతో ముఖ్యమైనవి) గమనించడం అవసరం. "వస్తు రూప కౌలు డబ్బు రూప కౌలుగా మారడంతో పాటు డబ్బు కోసం కిరాయికి పనిచేసే నిరాస్తిపరులైన రోజువారీ కూలీల వర్గం తప్పని సరిగానే కాకుండా ముందుగానే ఏర్పడుతుంది కూడ. ఈ వర్గం ఏర్పడుతూ వుండగానే, అక్కడా అక్కడా యీ నూతన వర్గం అవతరించుతూ వుండగానే, పూర్వం ఫ్యూడల్ వ్యవస్థ కాలంలో ఎక్కువ ధనికులైన రైతు భూదాసులే తమ కింద పనిచేయడానికి పేద రైతు భూదాసులను ఎలా పెట్టుకుని వుండేవారో అలాగే, కౌలు చెల్లిస్తూ సంపన్న రైతులు వ్యవసాయ కూలీలను దోచుకునే వాడుక తప్పనిసరిగా ఏర్పడుతుంది. ఈవిధంగా, వారు క్రమంగా కొంత సంపదను కూడబెట్టుకునే సామర్థ్యాన్ని పొంది, భవిష్యత్తులో పెట్టుబడిదారులుగా మారిపోయే అవకాశం ఏర్పడుతుంది. ఈవిధంగా, తమంతట తామే ఆ స్థితికి వచ్చిన పాత భూస్వాములనుంచే పెట్టుబడి పెట్టగల రైతులను సృష్టించే నారుమడి తయారవుతుంది. పెట్టుబడి పెట్టగల యీ రైతుల అభివృద్ధి గ్రామీణ ప్రాంతాలకు వెలుపలవున్న పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క సాధారణ అభివృద్ధిమీద ఆధారపడివుంటుంది" ("పెట్టుబడి", సంపుటి 3, పేజి 332).[37] "వ్యవసాయ ప్రజానీకంలో కొంత భాగాన్ని నిరాస్తిపరులను చేయడమూ, భూమినుండి వెళ్లగొట్టడమూ అనేవి పారిశ్రామిక పెట్టుబడి కొరకు శ్రామికులనూ, వాళ్ల జీవనాధారాలనూ, శ్రమ సాధనాలనూ 'విడుదల చేయడం' మాత్రమే కాదు, అవి దేశీయ మార్కెట్‌ను కూడా సృష్టించినాయి.[38]" వ్యావసాయిక జనాభా దరిద్రులై పోయి నాశనమై పోవడమనేవి పెట్టుబడికి శ్రామిక రిజర్వు సైన్యాన్ని తయారు చేయడంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తాయి. అందుచేత ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ "వ్యావసాయక జనాభాలో కొంత భాగం పట్టణ, లేక పారిశ్రామిక (వ్యవసాయేతర) శ్రామికవర్గంగా మారిపోయే స్థితిలో నిరంతరం వుంటోంది.... సాపేక్షమైన అదనపు జనాభాయొక్క యీ మూలాధారం యీవిధంగా నిరంతరం సాగుతూనే వుంటుంది.... దీని ఫలితంగా వ్యవసాయ శ్రామికుడు కనీస వేతన కార్మికుని స్థితికి దిగజార్చబడి, ఎల్లప్పుడూ పరమ దారిద్ర్యం అనే వూబిలో ఒక కాలు దిగబడే వుంటాడు" ("పెట్టుబడి," సంపుటి 1, పేజి 668).[39] తాను సాగుచేస్తూన్న భూమిపై తాను స్వామ్యం కలిగివుండడమే సన్నకారు ఉత్పత్తికి పునాది అయి అది వర్ధిల్లడానికీ, సాంప్రదాయిక రూపాన్ని వహించడానికీ మూల కారణం అవుతోంది. కాని అలాంటి సన్నకారు ఉత్పత్తి సంకుచిత, ఆదిమ ఉత్పత్తి, సమాజ చట్రానికి మాత్రమే సాసగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో "రైతులపై జరిగే దోపిడికీ పారిశ్రామిక కార్మికవర్గంపై జరిగే దోపిడికీ రూపంలో మాత్రమే తేడా. దోపిడిచేసేది ఒక్కటే: పెట్టుబడి. విడి పెట్టుబడిదారులు తనఖాలూ, అధిక వడ్డీల

ద్వారా విడి రైతులను దోచుకుంటారు; పెట్టుబడిదారీ వర్గం రైతు వర్గాన్ని ప్రభుత్వ పన్నుల ద్వారా దోచుకుంటుంది'' (''ఫ్రాన్సులో వర్గపోరాటం'' అనే గ్రంథం).[40] ''రైతుల చిన్న కమతం ఇప్పుడు పెట్టుబడిదారుడు భూమినుంచి లాభాలనూ, వడ్డీనీ, కౌలునూ పిండడానికి వీలుకలిగించే ఒక సాకుగా మాత్రమే వుంది, పోతే భూమిని సాగుచేసే రైతు తన జీవన భృతిని ఎలా సంపాదించుకోగల్గుతాడా అనేది అతనికే వదలి వేయబడింది'' (''బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ'' అనే గ్రంథం).[41] సాధారణంగా రైతు తన జీవన భృతిలో కొంత భాగాన్ని పెట్టుబడిదారీ సమాజానికి అంటే పెట్టుబడిదారీ వర్గానికి ధారపోస్తూ, ''తన భూమికి తానే యజమానినన్న బడాయి కోసం ఐర్లండు దేశపు కౌలుదారీ రైతు స్థితికి దిగజారిపోతున్నాడు'' (''ఫ్రాన్సులో వర్గపోరాటం'' అనే గ్రంథం).[42] ''పెట్టుబడిదారీ పద్ధతి ఉత్పత్తిని కొనసాగించే దేశాలలో కంటే చిన్న రైతు కమతాలే ప్రబలంగా వున్న దేశాలలో ధాన్యం ధర తక్కువగా వుండటానికి గల కారణాలలో ఒకటి ఏమిటి?'' (''పెట్టుబడి,'' సంపుటి 3, పేజి 340).[43] రైతు తన అదనపు ఉత్పాదితంలో కొంత భాగాన్ని ఉచితంగా సమాజానికి (అంటే, పెట్టుబడిదారీ వర్గానికి) ధారపోస్తున్నాడు. ''అందుచేత (ధాన్యం, ఇతర వ్యావసాయిక ఉత్పాదితాల ధరలు తక్కువగా వుండటమన్నది ఉత్పత్తిదారుల పేదరికం ఫలితమేగాని వారి శ్రమ ఉత్పాదకత అధికం కావడంవల్ల ఎంతమాత్రమూ కాదు'' (''పెట్టుబడి,'' సంపుటి 3, పేజి 340).[44] సన్నకారు ఉత్పత్తి విధానపు సాధారణ రూపమైన చిన్న కమతాల సాగువిధానం పెట్టుబడిదారీ విధానంలో క్షీణించి, పతనమై, నశించిపోతుంది. ''స్వభావసిద్ధంగానే చిన్న కమతాల సాగువిధానంలో సామాజిక శ్రమయొక్క ఉత్పాదక శక్తుల అభివృద్ధికీ, శ్రమయొక్క సామాజిక రూపాలకూ, పెట్టుబడియొక్క సామాజిక కేంద్రీకరణకూ, పెద్ద ఎత్తున పశు సంవర్ధనకూ, విజ్ఞానశాస్త్రాన్ని అంతకంతకు అధికంగా వినియోగించుకోడానికీ ఎంతమాత్రం తావుండదు. అధిక వడ్డీలూ, పన్నుల విధానమూ సర్వేసర్వత్రా దానిని దారిద్ర్యంలో ముంచి తీరుతాయి. భూమిని కొనడానికే పెట్టుబడి వ్యయం అయిపోవడంవల్ల దాన్ని సాగుచేయడానికి పెట్టుబడి లోటు ఏర్పడుతుంది. ఉత్పత్తి సాధనాలు అంతులేకుండా చెల్లాచెదరైపోయి ఉత్పత్తిదారులు ఎవరికివారే ఏకాకులై పోతారు.'' (సహకార సంఘాలు, అంటే చిన్న రైతుల సంఘాలు అత్యంత ప్రగతిశీలమైన బూర్జువా పాత్రను నిర్వహిస్తూనే యీ పోకడను బలహీనపరుస్తాయి, అంతేగాని దానిని నిర్మూలించవు; ఇంకో విషయాన్ని కూడా మనం మరచిపోకూడదు, అదేమిటంటే యీ సహకార సంఘాలు ధనికరైతులకే ఎక్కువ ఉపయోగకరంగా వుంటాయి. గాని పేద రైతాంగానికి చాలాతక్కువ — ఇంచుమించు శూన్యంగానే — ఉపయోగపడుతాయి; ఆ తరువాత యీ సంఘాలే వేతన శ్రామికులను దోచుకునేవిగా తయారవుతాయి.) ''మానవశక్తి ఘోరంగా వృధా అయిపోతోంది. ఉత్పత్తి పరిస్థితులు అంతకంతకు అధికంగా క్షీణించడమూ, ఉత్పత్తి

సాధనాల ధరలు పెరగడమూ — ఇది చిన్న కమతాల ఆస్తి విధానంలో తప్పనిసరి నియమం.''45 పరిశ్రమలోలాగనే వ్యవసాయంలో కూడా పెట్టుబడిదారీ విధానం ''ఉత్పత్తిదారుని బలి చేస్తేనే'' గాని ఉత్పత్తి క్రమంలో మార్పు తీసుకు రాలేదు. ''ఒకే చోట కేంద్రీకృతం కావడం మూలంగా పట్టణ కార్మికుల ప్రతిఘటనా శక్తి అధికం అవుతూ వుండగా, గ్రామీణ శ్రామిక జనం విస్తృత ప్రాంతాలలో చెల్లాచెదరు కావడం మూలంగా వారి ప్రతిఘటనా శక్తి నీరసించిపోతూ వుంటుంది. ఆధునిక పరిశ్రమలలోలాగనే ఆధునిక, పెట్టుబడిదారీ వ్యవసాయంలో కూడా అధికమయే శ్రమ ఉత్పాదకత, చలనంలోకి తీసుకురాబడిన అధిక శ్రమశక్తీ, ఆ శ్రమశక్తినే వృథాచేయడం, రోగాలకు గురిచేసి నాశనంచేయడం ద్వారానే సాధించబడుతున్నాయి. అంతేగాక, పెట్టుబడిదారీ విధానపు వ్యవసాయంలో సాధించబడే యే ప్రగతి అయినా శ్రామికుని కొల్లగొట్టడమనే నేర్పు గాక భూమిని కొల్లగొట్టడమనే నేర్పులో కూడా సాధించబడే ప్రగతియే.... అందుచేత పెట్టుబడిదారీ ఉత్పత్తి సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధిచేసి, వివిధ క్రమాలను ఒకే సామాజిక మొత్తంగా సమ్మేళనంచేస్తోం దంటే సంపద కంతటికీ మూలాధారాలైన భూమినీ, శ్రామికునీ పీల్చి పిప్పిచేయడం ద్వారానే అది అలా చేస్తోంది'' (''పెట్టుబడి,'' సంపుటి 1, 13వ ప్రకరణం చివర).

## సోషలిజం

పైన వివరించిన దానినిబట్టి మార్క్స్ వర్తమాన సమాజాభివృద్ధి ఆర్థిక నియమం నుంచే, సంపూర్ణంగా, కేవలమూ దాన్నిబట్టే పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు సమాజంలోకి పరివర్తన చెందడం అనివార్యమని నిర్ధారణ చేశాడని స్పష్టం. మార్క్స్ మరణానంతర అర్ధ శతాబ్ద కాలంలో భారీ స్థాయి ఉత్పత్తి, పెట్టుబడిదారీ కార్టెల్సు, సిండికేట్లు, ట్రస్టుల పెరుగుదలలోనూ, ఫైనాన్సు పెట్టుబడి ప్రమాణాల్లోనూ, పాటవంలోనూ వచ్చిన బ్రహ్మాండమైన పెరుగుదలలోనూ వేలాది రూపాలలో అంతకంతకు ఎక్కువ వేగంగా ముందడుగేస్తున్న శ్రమ సామాజికీకరణ సోషలిజపు తప్పనిసరి అవతరణకు ప్రధానమైన భౌతిక పునాదిని సమకూరుస్తుంది. ఈ పరివర్తనను ముందుకు నడిపే నైతిక, మేధా శక్తీ, దానిని అమలు జరిపే భౌతిక శక్తీ పెట్టుబడిదారీ విధానం స్వయంగా తర్ఫీదు చేసిన శ్రామికవర్గమే. సారాంశంలో నానాటికీ ఎక్కువ సంపద్వంతమైన అనేక రూపాలలో ప్రదర్శితమౌతున్న, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం జరుపుతున్న పోరాటం, రాజకీయ అధికారాన్ని శ్రామికవర్గం తన హస్తగతం చేసుకునే (''శ్రామికవర్గ నియంతృత్వం'') లక్ష్యంతో సాగే రాజకీయ పోరాటంగా తప్పనిసరిగా తయారవుతుంది. ఉత్పత్తి

యొక్క సామాజికీకరణ, ఉత్పత్తి సాధనాలు సామాజిక ఆస్తిగా మారడానికీ, ''ఆస్తిహర్తల ఆస్తిహరణానికీ'' దారి తీయక తప్పదు. శ్రమ ఉత్పాదకత బ్రహ్మాండంగా పెరగడం, పని గంటలు తగ్గడం, సన్నకారు ఆదిమ అనైక్య ఉత్పత్తి అవశేషాల, శిథిలాల స్థానంలో, మెరుగైన సమష్టి శ్రమ రావడం — ఇవి యీ పరివర్తన ప్రత్యక్ష పర్యవసానాలు. వ్యవసాయానికీ పరిశ్రమకీ వున్న సంబంధాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా తెగగొడుతుంది, కాని అదే సమయంలో, తన అత్యున్నత స్థాయి అభివృద్ధి ద్వారా అది యీ సంబంధాల కొత్త అంశాలను — విజ్ఞానశాస్త్రాన్ని చైతన్యవంతంగా వినియోగించుకోడం పైనా, సమష్టి శ్రమను కేంద్రీకృతం చేయడం పైనా, జనాభా నూతన ప్రాంతాలలో స్థిరపడడం పైనా (ఆ విధంగా గ్రామీణ వెనుకబాటుతనాన్నీ, ఏకాంత జీవితాన్నీ, మొరటుతనాన్నీ, పెద్ద పట్టణాలలో విస్తారంగా ప్రజాబాహుళ్యం చేరుకునే అసహజపు జన కేంద్రీకరణనూ అంతమొందిస్తుంది) ఆధారపడిన వ్యవసాయానికీ పరిశ్రమలకీ మధ్య ఐక్యతను — నెలకొల్పుతుంది. నూతన తరహా కుటుంబాన్నీ, మహిళల ప్రతిపత్తిలోనూ, యువతరాన్ని పెంచి పెద్దవాళ్లను చేయడంలోనూ కొత్త పరిస్థితులనూ సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యున్నత రూపాలే నెలకొల్పుతాయి; స్త్రీలనీ పిల్లలనీ కూలీలుగా పనిచేయించడమూ, పెట్టుబడిదారీ వ్యవస్థ మూలంగా పితృస్వామిక కుటుంబం విచ్ఛిన్నం కావడమూ — ఇవి ఆధునిక సమాజంలో అత్యంత భయంకరమైన, విపత్కరమైన, ఏహ్యమైన రూపాలను ధరిస్తాయి. అయినప్పటికీ, ''ఆధునిక పరిశ్రమ సామాజికంగా సంఘటితమైన ఉత్పత్తిక్రమంలో కుటుంబరంగానికి వెలుపల స్త్రీలకూ, యువకులకూ, ఆడ, మగ పిల్లలకూ, ముఖ్యమైన పాత్రను కేటాయిస్తూ, ఉన్నత స్థాయి కుటుంబానికీ స్త్రీపురుష సంబంధాలకూ నూతన ఆర్థిక పునాదులను సృష్టిస్తోంది. ప్రాచీన రోమన్, గ్రీకు, లేదా ప్రాచ్య కుటుంబ రూపాలే పరిపూర్ణమైనవీ శాశ్వతమైనవీ అని భావించడం ఎంత అసందర్భమో ఆవిధంగానే ట్యూటనిక్-క్రిష్టియన్ కుటుంబ రూపాన్ని పరిపూర్ణమైనదీ శాశ్వతమైనదీ అని భావించడం కూడ అంత అసందర్భమైనదే, పైగా, యీ రూపాలన్నిటినీ మొత్తంమీద తీసుకుని చూస్తే అవి చారిత్రక అభివృద్ధిలో ఒక పరంపర అవుతాయి. సమష్టి శ్రామిక గ్రూపులో అన్ని వయస్సుల స్త్రీలూ, పురుషులూ చేరివుండటం తగిన పరిస్థితులలో, విధిగా మానవోచితమైన అభివృద్ధికి మూలకారణం అవుతుందనేది స్పష్టం. అయినప్పటికీ, శ్రామికుని కోసం ఉత్పత్తి విధానం వుండటానికి బదులు ఉత్పతి విధానం కోసం శ్రామికుడు ఉనికిలో వుండేదైన, సద్యోజనిత అభివృద్ధిచెందిన క్రూరమైన పెట్టుబడిదారీ రూపంలో ఆ విషయమే దుర్నీతి, బానిసత్వం అనే అంటుజాడ్యానికి మూల కారణం అవుతోంది.'' (''పెట్టుబడి,'' సంపుటి 1, ప్రకరణం 13 చివర.) ఫ్యాక్టరీ వ్యవస్థలో ''భావి విద్యా విధానపు బీజాలు వున్నాయి. ఒక నిర్దిష్ట వయస్సు దాటిన ప్రతి బాలునికీ, బాలికకూ సామాజిక ఉత్పత్తి సామర్థ్యాన్ని

పెంచే పద్ధతులలో ఒకటిగానే గాక, సర్వతోముఖ అభివృద్ధి చెందిన మానవులను తయారు చేసే ఏకైక పద్ధతిగా ఉత్పాదక శ్రమను విద్యాబోధనతోనూ, శరీర వ్యాయామంతోనూ మేళవించే విద్యా విధానపు బీజాలు వున్నాయి'' (అదే గ్రంథంలో, అదే చోట). మార్క్స్ యొక్క సోషలిజం, గతంలో జరిగి పోయినదాన్ని చెప్పే అర్థంలోనే గాక, భవిష్యత్తును గురించి ధైర్యంగా జోస్యం చెప్పే అర్థంలోనూ, దాని సాధన కోసం ధైర్యంతో కూడిన ప్రత్యక్ష కార్యాచరణ సాగించే అర్థంలోనూ జాతీయతా సమస్యనూ, రాజ్య సమస్యనూ అదే చారిత్రక ప్రాతిపదికమీద వుంచుతుంది. సామాజిక అభివృద్ధియొక్క బూర్జువా శకంలో జాతులు ఒక అనివార్యమైన ఉత్పాదితం, అనివార్యమైన రూపం. ''జాతిలో తానొక అంతర్భాగంగా ఏర్పడితేనే తప్ప'' ''జాతీయత''ను (''ఆ పదానికి బూర్జువావర్గం చెప్పే అర్థంలో కాకుండా'') కలిగి వుంటేనే తప్ప కార్మికవర్గం బలపడజాలదు, పరిపక్వం చెందజాలదు, రూపొందజాలదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి జాతీయ అడ్డుగోడలను అంతకంతకు ఎక్కువగా కూలదోసి, జాతీయ ఏకాకిత్వాన్ని నిర్మూలించి జాతీయ వైరుధ్యాల స్థానే వర్గ వైషమ్యాలను తెచ్చిపెడుతుంది. అందుచేతనే, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల విషయంలో ''కార్మికులకు స్వదేశమంటూ లేదు,'' కనీసం నాగరిక దేశాల కార్మికులు ''సమైక్యంగా కృషిచేయడం — శ్రామికవర్గ విమోచనకు గల ఒక ముఖ్య షరతు'' (''కమ్యూనిస్టు ప్రణాళిక''*) అనేది అక్షరాలా నిజం. సమాజాభివృద్ధిలో ఒక నిర్దిష్ట దశలో, సమాజం పరస్పరవిరుద్ధములైన వర్గాలుగా చీలిపోయి, ప్రత్యక్షంగా సమాజానికి అతీతంగానూ కొంతవరకు సమాజానికి విడిగానూ వుండే ''అధికారం'' లేనిదే మనజాలని దశలో సంఘటిత బలప్రయోగ శక్తి అయిన రాజ్యం ఆవిర్భవించింది. వర్గ వైరుధ్యాలనుంచి పుట్టిన రాజ్యం, ''అత్యంత శక్తివంతమైన, ఆర్థికంగా బలవత్తరమైన వర్గపు రాజ్యంగా తయారవుతుంది. ఈ వర్గం రాజ్యంయొక్క సహాయంతో రాజకీయంగా ప్రాబల్యం వహించే వర్గం అయి, తద్వారా అణగారిన వర్గాలను మరింత అణగదొక్కి దోచుకోడానికి నూతన సాధనాలను సంపాదిస్తుంది. ఆవిధంగా, ప్రాచీన రాజ్యం అన్నిటికంటె ముఖ్యంగా బానిసలను అణగదొక్కివుంచేటందుకు బానిస యజమానుల రాజ్యంగా ఎలా వుండిందో, ఆ తరువాతి కాలంలో ఫ్యూడల్ రాజ్యం రైతు బానిసలను అణచివుంచేటందుకు ప్రభువర్గాల చేతులలో ఆయుధంగా ఎలా వుండిందో, అలాగే ఆధునిక ప్రజా ప్రాతినిధ్య రాజ్యం వేతన శ్రమను దోచుకోడానికి పెట్టుబడి చేతులలో ఒక సాధనంగా వుంది'' (ఎంగెల్స్ తన అభిప్రాయాలనూ, మార్క్స్ అభిప్రాయాలనూ వివరిస్తూ రాసిన ''కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం'' అనే గ్రంథం). అత్యంత స్వేచ్ఛాయుతమూ, అత్యంత అభ్యుదయకరమూ

---

* మార్క్స్, ఎంగెల్స్ ''కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక,'' మాస్కో, పేజీలు 54–55. — సం.

అయిన రూపంలో వున్న బూర్జువా రాజ్యపు ప్రజాస్వామ్య రిపబ్లిక్ సహితం యీ విష యాన్ని ఏవిధంగానూ తొలగించకుండా, కేవలం దాని స్వరూపాన్ని మాత్రమే మార్పుచేసింది (ప్రభుత్వానికీ, స్టాక్ ఎక్స్ఛేంజికీ వున్న సంబంధాలూ, ఉద్యోగస్తులలోనూ, పత్రికలు వగైరాలలోనూ — ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని — వున్న లంచగొండితనం వగైరాలు). సోషలిజం వర్గాలను అంతమొందించడానికి దారితీస్తుంది, తద్వారా రాజ్యమే అంతరించడానికి కూడా దారితీస్తుంది. ''యాంటీ డ్యూరింగ్'' అనే గ్రంథంలో ఎంగెల్స్ ఇలా రాశాడు: ''ఏ తొలి చర్య ద్వారానైతే రాజ్యం వాస్తవంగా మొత్తంగా సమాజానికంతటికీ తానే ప్రతినిధిగా ఏర్పడుతుందో ఆ తొలి చర్యయే — సమాజం కోసం ఉత్పత్తి సాధనాలను తన కైవసం చేసుకోడమే — రాజ్యంగా తాను నిర్వర్తించే కడపటి స్వతంత్ర చర్య కూడా అవుతుంది. సామాజిక సంబంధాలలో ప్రభుత్వ జోక్యం ఒక రంగం తరువాత మరొక రంగంలో అనావశ్యకమవుతుంది. ఆ తరువాత ఆ జోక్యం దానంతట అదే అంతమైపోతుంది. వ్యక్తులపై పరిపాలన పోయి దాని స్థానంలో వ్యవహారాల నిర్వహణ, ఉత్పత్తి క్రమాల నిర్వహణ వస్తాయి. రాజ్యాన్ని 'రద్దుచేయడం' జరగదు, అది దానంతట అదే దుల్లి పోతుంది.''[46] ''స్వతంత్రులూ సమానులూ అయిన ఉత్పత్తిదారుల కలయిక ప్రాతిపదికమీద ఉత్పత్తిని వ్యవస్థీకరించే సమాజం మొత్తం రాజ్యయంత్రాన్నీ అప్పటికి దానికి ఉచితమైన స్థానంలో వుంచుతుంది: పురాతన వస్తు ప్రదర్శనశాలలో, రాట్నముా, కంచు గొడ్డలీ సరసన వుంచుతుంది'' (ఎంగెల్స్, ''కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం'').

ఆఖరున, ఆస్తిహర్తల ఆస్తిహరణం జరిగే కాలంలో ఇంకా తమ మనుగడను కొనసాగించుకుంటున్న సన్నకారు రైతులపట్ల సోషలిజం అవలంబించే వైఖరి విషయంలో మార్క్స్ అభిప్రాయాలను వెల్లడిచేస్తూ ఎంగెల్స్ చేసిన ఉద్ఘాటనను ఉదహరించ వలసివుంది: ''మనం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు బడా భూస్వాముల విషయంలో చేయవలసి వచ్చినట్టుగా (నష్టపరిహారం చెల్లించా, చెల్లించకుండానా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా) చిన్న రైతుల భూములను బలాత్కారంగా లాగుకోడం అన్న విషయాన్ని ఆలోచించనైనా ఆలోచించం. చిన్న రైతు విషయంలో మన కర్తవ్యం ఏమిటంటే, మొదట అతని సొంత వ్యాపారాన్నీ సొంత ఆస్తినీ సహకార వ్యాపారంగానూ, సహకార ఆస్తిగానూ పరివర్తన చెందేటట్లు చేయడాన్ని బలాత్కారంగా కాక, ఉదాహరణ బలం ద్వారానూ, అందుకోసం సామాజిక సహాయాన్ని ఇవ్వజూపడం ద్వారానూ జరిపించాలి. ఆ తరువాత చిన్న రైతుకు మున్ముందు కలుగబోయే లాభాలను చూపించడానికి కావలసినన్ని సాధనాలు మనకుంటాయి. ఈ లాభాలు అతనికి యీనాడే స్పష్టంగా కనబడుతూ వుండివుండాలి'' (ఎంగెల్స్ రచించిన ''ఫ్రాన్సు, జర్మనీల్లో రైతు సమస్య'' అనే గ్రంథం పేజి 17. అలెక్సేయెవాచే ప్రచురింపబడింది; రష్యన్ అనువాదంలో పొరపాట్లున్నాయి.[47] మూలం "Die Neue Zeit"లో వెలువడింది[48]).

# శ్రామికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలు

పూర్వకాలపు భౌతికవాదంలోని ప్రధాన లోపాలను, అంటే, ప్రత్యక్ష విప్లవ కార్యాచరణ పరిస్థితులను అర్థంచేసుకోలేకపోవడాన్ని, లేక దాని ప్రాముఖ్యతను గుర్తించలేకపోవడాన్ని 1844–45 నాటికే పరిశీలించి తెలుసుకుని మార్క్స్ తన సిద్ధాంత గ్రంథ రచనతోపాటు తన జీవిత కాలమంతా శ్రామికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలను గురించిన సమస్యలను తదేక శ్రద్ధతో పరిశీలించాడు. దీనికి సంబంధించిన బోలెడంత సమాచారం మార్క్స్ రచనలన్నింటిలోనూ, ప్రత్యేకించి ఎంగెల్స్‌తో ఆయన జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలు నాలుగు సంపుటాలలోనూ వుంది. ఉత్తరప్రత్యుత్తరాలు 1913లో ప్రచురించబడ్డాయి. ఈ సమాచారాన్నంతనీ సేకరించి, సంకలనం చేసి, పరిశీలించి, అధ్యయనం చేయవలసిన పని ఇంకా చాలా వుంది. అందుచేత ఇప్పుడు మనం యీ విషయాన్ని గురించి అత్యంత సాధారణమైన క్లుప్తమైన గమనికలకు పరిమితం కావాల్సి వుంటుంది; ఈ అంశాన్ని వివరించకపోతే భౌతికవాదం అసంపూర్ణమూ, ఏకపక్షమూ, నిర్జీవమూ అవుతుందని మార్క్స్ భావించడం సబబేనని నొక్కి చెప్పవలసివుంది. మార్క్స్ తన భౌతికవాద గతితార్కిక ప్రపంచ దృక్పథానికి కచ్చితంగా అనుగుణంగా వుండేలాగ శ్రామికవర్గ ఎత్తుగడల మౌలిక కర్తవ్యాలను నిర్వచించాడు. ఒక నిర్దిష్ట సమాజంలోని వర్గాలన్నిటి మధ్య వున్న సంబంధాలన్నిటినీ మొత్తంగా వస్తుగతంగా లెక్కలోకి తీసుకోవడం, తత్పర్యవసానంగా ఆ సమాజం యొక్క వస్తుగత అభివృద్ధి దశనూ, ఆ సమాజానికీ ఇతర సమాజాలకీ వున్న సంబంధాలనూ పరిశీలించడం మాత్రమే పురోగామి వర్గం అవలంబించవలసిన సరి అయిన ఎత్తుగడలకు ప్రాతిపదిక కాగలదు. అదే సమయంలో, అన్ని వర్గాలూ, అన్ని దేశాలూ స్థిరపడిపోయివున్నవేనని కాకుండా చలనశీలములని, అంటే, అచల స్థితిలో కాకుండా చలన స్థితిలోనే వున్నట్టు భావించాలి. (ఈ చలనంయొక్క నియమాలు ఆయా వర్గాల ఉనికియొక్క ఆర్థిక పరిస్థితులనుబట్టి నిర్ణయమవుతాయి.) ఈ చలనాన్ని గతకాలం దృష్ట్యా మాత్రమేగాక, భావికాలం దృష్ట్యా కూడా పరిశీలించాలి, మెల్లగా జరిగే మార్పులను మాత్రమే గమనించే "పరిణామవాదుల" అపభ్రంశ దృక్పథంతోగాక, గతితార్కిక దృక్పథంతో పరిశీలించాలి: ఎంగెల్స్‌కి మార్క్స్ రాసినట్టు "...అటువంటి బృహత్తర చారిత్రక పరిణామాల విషయంలో ఇరవై యేళ్ళు ఒక్క రోజుతో సమానం, ఇకముందు ఇరవై ఏళ్ళు ఒక్క రోజులోనే నిక్షిప్తమైవుండే కాలం రావచ్చు" (మార్క్స్–ఎంగెల్స్ "ఉత్తరప్రత్యుత్తరాలు," సంపుటి 3, పేజి 127).[49] శ్రామికవర్గపు ఎత్తుగడలను, అభివృద్ధియొక్క ప్రతి దశలోనూ, ప్రతి క్షణంలోనూ మానవ చరిత్రలో వస్తుగతంగా అనివార్యమైన గతితర్కాన్ని లెక్కలోకి

తీసుకుంటూ, ఒక వైపున రాజకీయ నిస్తబ్ధత ఏర్పడే కాలాన్ని లేదా ''శాంతియుతం'' అనబడే నత్తనడక గమనపు కాలాన్ని పురోగామి వర్గంయొక్క వర్గచైతన్యాన్ని, బలాన్ని, సమరశీలతను పెంపొందించడానికి వినియోగించుకుంటూ, మరో వైపున యీ వినియుక్త కృషినంతనూ యీ వర్గపురోగమనపు ''అంతిమ లక్ష్య'' సాధన దిశగా నడిపించడం కోసమూ ''ఇరవై ఏళ్లు ఒక్క రోజులోనే నిక్షిప్తమయ్యే'' మహత్తర కాలంలో నిర్వర్తించ వలసిన మహత్తర కర్తవ్యాలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనే శక్తిసామర్థ్యాలను యీ వర్గంలో కలిగించడంకోసమూ వినియోగించుకుంటూ వుండాలి. ఈ సందర్భంలో మార్క్స్ ప్రతిపాదించిన రెండు వాదనలు ప్రత్యేక ప్రాముఖ్యత కలిగివున్నాయి: వాటిలో ఒకటి ''తత్వశాస్త్ర దారిద్ర్యం'' అనే మార్క్స్ గ్రంథంలో వుంది, అది శ్రామికవర్గపు ఆర్థిక పోరాటాన్నీ, ఆర్థిక సంస్థలనూ గురించినది. రెండవ వాదన ''కమ్యూనిస్టు ప్రణాళిక''లో వుంది. అది శ్రామికవర్గపు రాజకీయ కర్తవ్యాల గురించినది. మొదటి వాదన ఇలా వుంది: ''భారీ పరిశ్రమ, ఒకరితో ఒకరికి పరిచయంలేని ప్రజా సమూహాన్ని ఒక చోట గుమికూరుస్తుంది. పోటీవల్ల వారి స్వప్రయోజనాలు భేదిస్తాయి: కాని కూలి రేట్లు పడిపో కుండా నిలబెట్టుకోడం అనే ప్రయోజనం, వారి యజమానికి వ్యతిరేకంగా వారందరికీ వున్న యీ ఉమ్మడి ప్రయోజనం, ప్రతిఘటించాలి అనే ఉమ్మడి ఆలోచనలో వారిని ఐక్య పరుస్తుంది, కలయికను ఏర్పరుస్తుంది.... మొదట విడివిడిగా వుండి, తరువాత గ్రూపు లుగా ఏర్పడిన యీ కలయికలు ఎల్లప్పుడూ ఐక్యమై వుండే పెట్టుబడిని ఎదుర్కొన వలసి వచ్చేసరికల్లా కూలి రేట్లను నిలబెట్టుకోడం కంటె కూడా యీ కలయికను నిల బెట్టుకోడమే వారికి, అంటే కార్మికులకి, మరింత అవసరం అవుతుంది.... ఈ పోరా టంలో – నిజమైన అంతర్యుద్ధంలో – రానున్న యుద్ధానికి అవసరమైన శక్తులన్నీ ఐక్యమై అభివృద్ధి చెందుతాయి. ఈ స్థితిని చేరుకోగానే యీ కలయిక రాజకీయ స్వభావాన్ని సంతరించుకుంటుంది.''[50] రానున్న అనేక దశాబ్దాలవరకూ, ''రానున్న పోరాటానికి'' శ్రామికవర్గం తన శక్తులను సన్నద్ధపరచే దీర్ఘకాలం అంతటికీ ఆర్థిక పోరాటమూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమమూ అనుసరించవలసిన కార్యక్రమమూ, అవలంబించవలసిన ఎత్తుగడలూ ఇందులో వున్నాయి. దీని నంతనీ బ్రిటిషు కార్మికోద్యమంనుంచి మార్క్స్ ఎంగెల్స్లు యిచ్చిన అనేక ఉదాహరణలతో పోల్చి చూడాలి: ఏవిధంగా పారిశ్రామిక ''సౌభా గ్యం'' ''శ్రామికవర్గాన్ని కొనివేయడానికి'' చేసే ప్రయత్నాలకు దారితీస్తుందో (''ఉత్తర ప్రత్యుత్తరాలు,'' సంపుటి 1, పేజి 136)[51], ఏవిధంగా వారిని పోరాటంనుంచి మర లించి పక్కదారి పట్టించడానికి దారితీస్తుందో, ఈ సౌభాగ్యం మొత్తంమీద ''కార్మికులను ఎలా దుర్నీతిపాలుచేస్తుందో'' (సంపుటి 2, పేజి 218);[52] బ్రిటిషు కార్మికవర్గం ఏవి ధంగా ''బూర్జువా''గా తయారైందో – ''అన్ని దేశాలకంటె అత్యంత ఎక్కువ బూర్జువా

దేశమైన యీ దేశం అంతిమంగా బూర్జువా ప్రభువర్గాన్నీ, బూర్జువావర్గంతోపాటుగా బూర్జువా శ్రామికవర్గాన్నీ కలిగి వుండడానికి ఉద్దేశించుతున్నట్టు కనబడుతూంది'' (సంపుటి 2, పేజి 290);[53] ఏవిధంగా బ్రిటిషు కార్మికోద్యమ ''విప్లవశక్తి'' నీళ్లుకారి పోతుందో (సంపుటి 3, పేజి 124);[54] ''బ్రిటిషు కార్మికులు స్పష్టంగా కనిపిస్తూన్న తమ బూర్జువా అంటువ్యాధిని వదలించుకోడానికి'' బహుశా చాలా కాలమే వేచివుండడం ఎలా అవసరమౌతుందో (సంపుటి 3, పేజి 127);[55] ఏవిధంగా బ్రిటిషు కార్మికోద్యమానికి ''చార్టిస్టు[56] సత్తువ లోపించిందో'' (1866; సంపుటి 3, పేజి 305);[57] ఏవిధంగా బ్రిటిషు కార్మిక నాయకులు ''రాడికల్ బూర్జువాకీ కార్మికునికీ'' మధ్యస్థంగా వుండే రకంగా తయారవుతున్నారో (హోలియోక్‌ను గురించి రాసినది, సంపుటి 4, పేజి 209); బ్రిటనుయొక్క గుత్తాధిపత్యం మూలంగానూ, ఆ గుత్తాధిపత్యం వున్నంత కాలమూనూ ఏవిధంగా ''బ్రిటిషు కార్మికుడు కదలడో'' (సంపుటి 4, పేజి 433)[58] మార్క్స్ ఎంగెల్సులు పేర్కొన్నారు. కార్మికోద్యమంయొక్క మొత్తం గమనం (దాని పర్యవసానం) సందర్భంగా ఆర్థిక పోరాటపు ఎత్తుగడలు ఆశ్చర్యకరమైనంత విస్తృతమైతన, సమగ్రమైన, గతితార్కికమైన, నిజంగా విప్లవాత్మకమైన దృక్పథంనుంచి యిక్కడ పరిశీలించబడ్డాయి.

రాజకీయ పోరాటపు ఎత్తుగడల గురించిన మౌలిక మార్క్సిస్టు సూత్రాన్ని ''కమ్యూనిస్టు ప్రణాళిక'' ఇలా నిర్వచించింది: ''కమ్యూనిస్టులు కార్మికవర్గంయొక్క తక్షణ లక్ష్యాలను సాధించడానికీ తాత్కాలిక ప్రయోజనాలను అమలు పరచడానికీ పోరాటం చేస్తారు. కానీ వాళ్ళ వర్తమాన ఉద్యమంలో ఆ ఉద్యమంయొక్క భవిష్యత్తును ప్రతిబింబిస్తూ, ఆ భవిష్యత్తుపట్ల కూడా శ్రద్ధ వహిస్తారు.'' ఈ కారణం వల్లనే ''1846లో పోలండ్‌లోని క్రాకొవ్‌లో తిరుగుబాటును లేవదీసిన వ్యవసాయ విప్లవ పార్టీనే'' 1848లో మార్క్స్ బలపర్చాడు.[59] జర్మనీలో 1848–49లలో అతివాద విప్లవ ప్రజాస్వామికవాదులను మార్క్స్ బలపర్చాడు, ఎత్తుగడలను గురించి తానప్పుడు చెప్పిన మాటలను తరువాత ఎన్నడూ కూడ ఉపసంహరించుకోలేదు. జర్మన్ బూర్జువావర్గం ''మొదటినుంచీ కూడా ప్రజలకు ద్రోహం చేసే ధోరణి''నే కలిగివుందనీ (రైతాంగంతో సయోధ్య కలిగివుంటే మాత్రమే బూర్జువావర్గం తన లక్ష్యాలను పూర్తిగా సాధించగలిగి వుండేది), ''పురాతన సమాజపు కిరీటధారులైన ప్రతినిధులతో రాజీపడతారనీ'' ఆయన అభిప్రాయపడ్డాడు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ యుగంలో జర్మన్ బూర్జువావర్గపు వర్గస్థానాన్ని మార్క్స్ యీకింది విధంగా విశ్లేషించాడు — సందర్భవశాత్తూ యీ విశ్లేషణ, తిరోగామి చలన పార్శ్వంనుంచి మాత్రమే గాక, చలన స్థితిలో వున్న సమాజాన్ని పరిశీలించే భౌతికవాద పద్ధతికి మచ్చుతునక: ''తనలో తనకే విశ్వాసం లేకుండా, ప్రజలలో విశ్వాసం లేకుండా, పై స్థానాలలో వున్నవారిని గురించి గొణుగుతూ, కిందనున్నవారిని చూసి భయంతో వణకిపోతూ....

ప్రపంచ కల్లోలం అంటే హడలిపోతూ; ....ఏ సందర్భంలోనూ శక్తిలేక, అన్ని సందర్భాల లోనూ అభిప్రాయ చౌర్యం చేస్తూ; ...చొరవ అనేది లేకుండా; ...బలిష్ఠులైన ప్రజలలోని తొలి యౌవనోత్సాహపు ఉద్వేగాలకు విధివశాత్తూ నాయకత్వం వహించవలసివచ్చి, వాటిని తన వృద్ధాప్యపు ప్రయోజనాల కోసం మళ్లింప జూస్తున్న పాపిష్టి ముసలివాడు'' "Neue Reinische Zeitung" 1848; ''సారస్వత వారసత్వం,'' సంపుటి 3, పేజి 212).[60] ఇరవై యేళ్ల తరువాత ఎంగెల్స్‌కు రాసిన ఉత్తరంలో (''ఉత్తరప్రత్యుత్తరాలు,'' సంపుటి 3, పేజి 224) స్వాతంత్ర్యం కోసం పోరాడవలసి రావడంకంటె బానిసత్వంతో కూడిన శాంతే మెరుగు అని బూర్జువావర్గం ఎంచుకోడం మూలంగానే 1848 విప్లవం విఫలమైందని మార్క్స్ రాశాడు. 1848–49 విప్లవ కాలం అంతమొందిన తరువాత విప్లవంతో ఆటలాడే ప్రయత్నాల నన్నిటినీ మార్క్స్ వ్యతిరేకించాడు (షాప్పెర్, విల్లిహ్ లిద్దరికీ వ్యతిరేకంగా ఆయన జరిపిన పోరాటం), పైకి ''శాంతియుతం'' గానే కనబడుతూ నూతన విప్లవాల కోసం సన్నద్ధం అవుతూన్న నూతన దశలో పనిచేసే సామర్ధ్యాన్ని సంపాదించుకోవాలని నొక్కి చెప్పాడు. ఈ పని ఏ సరళిలో కొనసాగింపబడాలని మార్క్స్ ఉద్దేశించాడో అది 1856లో అభివృద్ధి నిరోధక శక్తులు జర్మనీలో ప్రబలంగా వున్న అంధకార యుగ పరిస్థితిని గురించి ఆయన వేసిన అంచనాలో తెలుస్తుంది: ''జర్మనీలోని పరిస్థితి అంతా శ్రామికవర్గ విప్లవాన్ని మరో రైతు యుద్ధం ద్వారా బలపర్చే అవకాశంమీద ఆధార పడి వుంటుంది'' (''ఉత్తరప్రత్యుత్తరాలు'', సంపుటి 2, పేజి 108).[61] జర్మనీలో ప్రజాతంత్ర (బూర్జువా) విప్లవం పూర్తికాకుండా వున్నంతకాలమూ మార్క్స్ తన దృష్టినంతనీ రైతాంగంయొక్క ప్రజాస్వామిక శక్తిని అభివృద్ధిపరచడానికి సోషలిస్టు శ్రామికవర్గం అవలంబించవలసిన ఎత్తుగడలపైనే కేంద్రీకరించాడు. సందర్భవశాత్తూ, భూస్వాములపట్ల, ప్రష్యన్ జాతీయవాదంపట్ల లాసాల్ సహిష్ణుతను ప్రదర్శించుతూన్నందు వల్ల అతని వైఖరి ''వస్తుగతంగా చూస్తే... కార్మికవర్గ ఉద్యమాన్ని యావత్తునూ ప్రష్యాకు అప్పగింత పెట్టి ద్రోహం చేయడమే'' (సంపుటి 3, పేజి 210)[62] అని మార్క్స్ అభిప్రాయపడ్డాడు. 1865లో తాము పత్రికలలో చేయబోయే సంయుక్త ప్రకటనపై తమ అభిప్రాయాలను పరస్పరం తెలియజేసుకుంటూ మార్క్స్‌తో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలలో ఎంగెల్స్ ఇలా రాశాడు: ''వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గల దేశంలో ఫ్యూడల్ నిరంకుశ ప్రభువుల కొరడా జాడింపులకింద గ్రామీణ శ్రామికవర్గంపై జరిగే పితృస్వామిక దోపిడిని గురించి పల్లెత్తు మాటైనా అనకుండా పరిశ్రమలలోని శ్రామికవర్గం పేరుతో బూర్జువావర్గంమీద మాత్రమే దాడిచేయడం దుర్మార్గం'' (సంపుటి 3, పేజి 217).[63] 1864నుండి 1870వరకూ, జర్మనీలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ముగింపుకు వచ్చే కాలంలో, ప్రష్యన్, ఆస్ట్రియన్ దోపిడి వర్గాలు పైనుంచే యీ విప్ల

వాన్ని ఏదో విధంగా పూర్తిచేయడానికి ప్రయత్నిస్తూ వుండిన కాలంలో బిస్మార్క్‌తో సరస సల్లాపాలు జరుపుతూండిన లాసాల్‌ను ఖండించడమే గాక, "ఆస్ట్రియన్ అభిమానతత్వం" లోకి దిగజారి ప్రత్యేకతావాదాన్ని[64] సమర్థిస్తూ వుండిన లీబ్‌క్నెఖ్ట్‌ను కూడా మందలించి సరిదిద్దాడు మార్క్స్. బిస్మార్క్‌నూ, ఆస్ట్రియన్ అభిమానులనూ కూడా ఒకేవిధమైన నిర్దాక్షిణ్యంతో ఎదిరించి పోరాడే విప్లవాత్మకమైన ఎత్తుగడలు, "విజేత" అయిన ప్రష్యన్ భూస్వామికి అనుకూలమైనవి గాకుండా అతనికి కూడా వ్యతిరేకంగా, ప్రష్యన్ సైనిక విజయాలు సృష్టించిన పరిస్థితులలో విప్లవ పోరాటాన్ని తక్షణమే తిరిగి ప్రారంభించగలిగే ఎత్తుగడలు కావాలని మార్క్స్ గట్టిగా కోరాడు ("ఉత్తరప్రత్యుత్తరాలు", సంపుటి 3, పేజీలు 134, 136, 147, 179, 204, 210, 215, 418, 437, 440–41).[65] 1870 సెప్టెంబరు 9 నాటి ఇంటర్నేషనల్ ప్రఖ్యాత విజ్ఞప్తిలో అకాల తిరుగుబాటు ప్రారంభించ వద్దని ఫ్రెంచి శ్రామికవర్గాన్ని మార్క్స్ హెచ్చరించాడు, కానైతే తిరుగుబాటు జరిగినప్పుడు (1871) "స్వర్గాన్నే ముట్టడిస్తున్న" ప్రజానీకపు విప్లవాత్మక చొరవను ఉత్సాహంతో కొనియాడాడు (కూగెల్‌మన్‌కు మార్క్స్ రాసిన ఉత్తరం).[66] మార్క్స్‌యొక్క గతితార్కిక భౌతికవాద దృక్పథంనుంచి చూస్తే, అనేక ఇతర పరిస్థితులలో లాగనే ఆ పరిస్థితిలో విప్లవాత్మక చర్యకు సంభవించిన ఓటమి, శ్రామికవర్గ పోరాటపు సాధారణ గమనంలోనూ, పర్యవసానంలోనూ ఇదివరకే ఆక్రమించిన స్థానాన్ని వదలుకొని, పోరాడకుండా లొంగిపోవడంకంటె తక్కువ కీడు అవుతుంది. పోరాటం లేకుండా లొంగిపోయి వుంటే శ్రామికవర్గం నిరాశా నిస్పృహలకు లోనై దాని సమరశీలత నాశనమై వుండేది. రాజకీయంగా స్తబ్ధత ఏర్పడి బూర్జువా న్యాయమే ప్రబలమైన కాలంలో చట్టసమ్మతమైన పోరాట పద్ధతులను అవలంబించడాన్ని పూర్తిగా గుర్తించిన మార్క్స్ 1877లోనూ 1878లోనూ సోషలిస్టు వ్యతిరేక చట్టం[67] అమలులోకి వచ్చిన తరువాత మోస్ట్ ఉపయోగించిన "విప్లవకర పదజాలాన్ని" నిశితంగా ఖండించాడు; అంతేగాక అధికారయుత సోషల్ డెమోక్రటిక్ పార్టీలో తాత్కాలికంగా వచ్చిన అవకాశవాద ధోరణిని కూడా ఇంచుమించు అంతే నిశితంగా ఖండించాడు. అప్పుడు అధికారయుత సోషల్ డెమోక్రటిక్ పార్టీ, సోషలిస్టు వ్యతిరేక చట్టానికి జవాబుగా రహస్య పోరాటాన్ని చేపట్టడానికి తన దృఢ నిశ్చయాన్నీ, పట్టుదలనూ విప్లవాత్మక ఉత్సాహాన్నీ, సంసిద్ధతనూ ప్రదర్శించలేదు. ("ఉత్తరప్రత్యుత్తరాలు," సంపుటి 4, పేజీలు 397, 404, 418, 422, 424,[68] సోర్గెకు రాసిన ఉత్తరాలు కూడా చూడండి.)

రచన: 1914 జూలై – నవంబర్

# మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు అంశీభూత భాగాలూ[69]

మార్క్సు ఉపదేశాలు నాగరిక ప్రపంచ మంతటా బూర్జువా విజ్ఞానశాస్త్రానికి (అధికారయుతమైన, ఉదారవాద విజ్ఞానశాస్త్రానికీ కూడ) అత్యంత శత్రు భావాన్నీ, ద్వేషాన్నీ ఉత్పన్నంచేస్తున్నాయి. అవి మార్క్సిజాన్ని ఒక రకమైన ''హానికరమైన పక్షం''గా పరిగణిస్తున్నాయి. అవి వేరొక వైఖరిని ప్రదర్శిస్తాయని ఆశించలేము, ఎందుచేతనంటే వర్గపోరాటం ప్రాతిపదికగా ఏర్పడిన సమాజంలో ''నిష్పాక్షిక''మైన సామాజికశాస్త్రం అనేది ఏదీ వుండజాలదు. అధికారయుతమైన, ఉదారవాద విజ్ఞానశాస్త్రం అంతా ఏదో విధంగా వేతన బానిసత్వాన్ని సమర్థిస్తూ వుంటే, మార్క్సిజం ఆ వేతన బానిసత్వంమీద సడలుబాటులేని యుద్ధాన్ని ప్రకటించింది. వేతన బానిస సమాజంలో విజ్ఞానశాస్త్రం నిష్పాక్షికంగా వుంటుందని ఆశించడం పెట్టుబడిదార్ల లాభాలను తగ్గించుకుని కార్మికుల వేతనాలను పెంచే సమస్యమీద ఉత్పత్తిదారులు నిష్పాక్షికంగా వుంటారని ఆశించడమంతటి తెలివితక్కువ అమాయకత్వమే అవుతుంది.

అంతేకాదు. తత్వశాస్త్ర చరిత్ర, సామాజికశాస్త్ర చరిత్ర అత్యంత స్పష్టంగా తెలుపుతున్నది ఏమిటంటే, ప్రపంచ నాగరికతాభివృద్ధి రాజమార్గానికి దూరంగా ఎక్కడో ఉత్పన్నమైన ఏదో ఒక కుంచితమూ, శిలీభూతమూ అయిన సిద్ధాంతం అనే అర్థంలో మార్క్సిజంలో ''ఒంటెత్తువాదా''న్ని పోలిన లక్షణం కించిత్తు కూడా లేదు. తద్భిన్నంగా మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వడంలోనే మార్క్సు ప్రతిభ వుంది. తత్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్సు సిద్ధాంతం ఉద్భవించింది.

మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది, ఎందుకంటే అది సత్యమైనది. అది సమగ్రమైనది, సమరసమైనది, ఏ రకమైన మూఢ నమ్మకంతో గానీ, అభివృద్ధి నిరోధకత్వంతో గానీ, బూర్జువా పీడనను సమర్థించడంతో గానీ రాజీపడని పరిపూర్ణమైన ప్రపంచ దృక్పథాన్ని మానవులకు సమకూరుస్తుంది. అది జర్మన్ తత్వశాస్త్రంలోనూ,

ఇంగ్లీషు అర్థశాస్త్రంలోనూ, ఫ్రెంచి సోషలిజంలోనూ వ్యక్తమైన విధంగా పందొమ్మిదవ శతాబ్దంలో మానవాళి సృజించినదానిలో ఉత్తమమైన దానికి న్యాయమైన వారసురాలు.

మార్క్సిజంయొక్క యీ మూడు మూలాధారాలను గురించీ, దాని అంశీభూతములు కూడా అయిన మూడు భాగాలను గురించీ మేమిప్పుడు క్లుప్తంగా వివరిస్తాం.

I

మార్క్సిజపు తత్వశాస్త్రం భౌతికవాదం. యూరప్ ఖండంయొక్క ఆధునిక చరిత్ర అంతటిలోనూ, అందులో ప్రత్యేకించి పద్దెనిమిదవ శతాబ్దం చివరిలో మధ్యయుగం నాటి అన్ని రకాల చెత్తకూ వ్యతిరేకంగానూ, సంస్థలలోనూ భావాలలోనూ వుండిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగానూ కృతనిశ్చితమైన పోరాటం సాగిన ఫ్రాన్సులో ప్రకృతిశాస్త్రాల బోధలన్నిటికీ తగినట్టుగానూ, మూఢనమ్మకాలకూ, డాంబికాలు వగైరాలకూ వ్యతిరేకంగానూ నిరంతరాయంగా ఎదిరించి నిలబడగలిగిన ఒకేఒక తత్వశాస్త్రం భౌతికవాదమే నని రుజువైంది. అందుచేత ప్రజాస్వామ్యానికి శత్రువులైనవారు భౌతికవాదాన్ని "పూర్వపక్షం" చేయడానికీ, దాన్ని బలహీనపరచి, అపఖ్యాతి పాలుచేయడానికీ ఎల్లప్పుడూ తమ సర్వ శక్తులనూ వినియోగించారు; ఎల్లప్పుడూ ఏదో విధంగా మతాన్ని సమర్థించేవి, లేక బలపర్చేవి అయిన రకరకాల తాత్విక భావవాద రూపాలను ప్రోత్సహిస్తూనే వచ్చారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు తాత్విక భౌతికవాదాన్ని అత్యంత దృఢనిశ్చయంతో సమర్థించి యీ ప్రాతిపదికనుంచి వైదొలగిన పెడమార్గం ప్రతీదీ ఎంత తీవ్రమైన పొరపాటో పదే పదే వివరించారు. ఎంగెల్స్ రచించిన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్," "యాంటీ డ్యూరింగ్"[70] అనే గ్రంథాలలో వారి భావాలు అత్యంత స్పష్టంగానూ విపులంగానూ వివరించబడ్డాయి. ఇవి "కమ్యూనిస్టు ప్రణాళిక" లాగనే వర్గచైతన్యం కలిగిన ప్రతి కార్మికునికీ పాఠ్య గ్రంథాలు.

అయితే, మార్క్స్ పద్దెనిమిదవ శతాబ్దపు భౌతికవాదంతోనే ఆగిపోలేదు: ఆయన తత్వశాస్త్రాన్ని ముందుకు తీసుకుపోయాడు. ఆయన దానిని జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రం సాధించిన విజయాలతో, అందులోనూ ముఖ్యంగా హెగెల్ సిద్ధాంతంతో పరిపుష్టం చేశాడు. ఈ హెగెల్ సిద్ధాంతం ఫాయెర్‌బాఖ్ భౌతికవాదానికి దారితీసింది. అందులో ప్రధానమైన చేర్పు గతితర్కం, అంటే, అభివృద్ధిని దాని పరిపూర్ణమైన, ప్రగాఢమైన, అత్యంత సమగ్రమైన రూపంలో చూపించే సిద్ధాంతం, నిత్యం అభివృద్ధి చెందే పదార్థంయొక్క ప్రతిబింబాన్ని మనకు ప్రదర్శించే మానవ విజ్ఞానపు సాపేక్షత గురించిన సిద్ధాంతం. ప్రకృతిశాస్త్రంలో రేడియం, ఎలక్ట్రానులు, మూల ద్రవ్యాలు వేరు పదార్థాలుగా మారిపోడం మొదలైన ఇటీవలి ఆవిష్కరణలు, పాతకాలపు మృతిచెందిన భావవాదానికి తిరిగివెళ్లి బూర్జువా

తత్వశాస్త్రజ్ఞులు చేసే ''నూతన'' బోధలన్నీ విఫలం చెందగా, మార్క్సుయొక్క గతితార్కిక భౌతికవాదానికి అద్భుతమైన ధ్రువీకరణలు.

మార్క్సు తాత్విక భౌతికవాదాన్ని ప్రగాఢమొనర్చి, పూర్తిగా అభివృద్ధిచేసి, ప్రకృతిని గురించిన ప్రజ్ఞానాన్ని మానవ సమాజం గురించిన ప్రజ్ఞానానికి కూడా వర్తించేట్టు విస్తృత పర్చాడు. ఆయన చారిత్రక భౌతికవాదం శాస్త్రీయ చింతన సాధించిన ఒక మహత్తర విజయం. చరిత్రను, రాజకీయాలను గురించిన అభిప్రాయాలలో అంతకు పూర్వం ప్రబలంగా వుండిన అవ్యక్తస్థితి, నియమరహితస్థితి స్థానంలో ఉత్పాదక శక్తుల పెరుగుదల ఫలితంగా సామాజిక జీవితపు ఒక వ్యవస్థనుండి మరొక ఉన్నత వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందుతుందో – ఉదాహరణకు ఫ్యూడలిజంనుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఉత్పన్నమవుతుందో – నిరూపించే ఆశ్చర్యకరమైనంత పరిపూర్ణమైన సమరసమైన శాస్త్రీయ సిద్ధాంతం వచ్చింది.

మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉనికిలోవున్న ప్రకృతిని (అంటే, అభివృద్ధి చెందే పదార్థాన్ని) అతని జ్ఞానం ఏవిధంగా ప్రతిబింబిస్తుందో అలాగే మానవుని సామాజిక జ్ఞానం (అంటే, అతనికున్న తాత్విక, మత, రాజకీయ భావాలూ, సిద్ధాంతాలూ వగైరా) సమాజపు ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాదిమీద నిర్మింపబడిన ఉపరినిర్మాణం. ఉదాహరణకు, ఆధునిక యూరపియన్ రాజ్యాలయొక్క వివిధ రాజకీయ రూపాలు శ్రామికవర్గంపై బూర్జువావర్గపు అధికారాన్ని పటిష్టం చేసేటందుకు ఉపయోగపడుతూండటాన్ని మనం చూస్తున్నాం.

మార్క్సు తత్వశాస్త్రం మానవజాతికి, అందులోనూ ముఖ్యంగా కార్మికవర్గానికి శక్తివంతమైన జ్ఞాన సాధనాలను సమకూర్చిన పరిపూర్ణమైన తాత్విక భౌతికవాదమే.

## II

ఆర్థిక వ్యవస్థ పునాదిపైనే రాజకీయ ఉపరినిర్మాణం లేస్తుందనే విషయాన్ని గుర్తించి, మార్క్సు యీ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎక్కువ శ్రద్ధ వహించాడు. మార్క్సు తన ప్రధాన గ్రంథం అయిన ''పెట్టుబడి''లో ఆధునిక సమాజపు, అంటే పెట్టుబడిదారీ సమాజపు, ఆర్థిక వ్యవస్థను గురించి పరిశీలన జరిపాడు.

మార్క్సు పూర్వపు సాంప్రదాయిక అర్థశాస్త్రం, పెట్టుబడిదారీ దేశాలలో కల్లా అత్యంత అభివృద్ధి చెందిన ఇంగ్లండులో ఉత్పన్నం అయింది. ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోలు ఆర్థిక వ్యవస్థను పరిశీలించి విలువ శ్రమ సిద్ధాంతానికి పునాదులు వేశారు. వారి కృషిని మార్క్సు కొనసాగించాడు; ఆయన ఆ సిద్ధాంతానికి రుజువును సమకూర్చి దానిని సుసంగతంగా అభివృద్ధిచేశాడు. ప్రతి సరుకుయొక్క విలువా దానిని ఉత్పత్తి చేయడానికి

ఖర్చు చేయబడే సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్నిబట్టి నిర్ణయం అవుతుందని నిరూపించాడు.

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వస్తువుల మధ్య గల సంబంధాన్ని (ఒక సరుకుతో మరొక సరుకును మారకం చేసుకోవడమనే సంబంధాన్ని) గుర్తించగా మార్క్స్ మనుష్యుల మధ్యగల సంబంధాన్ని బైటపెట్టాడు. సరుకుల మారకం మార్కెట్ ద్వారా వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య ఉండే సంబంధాన్ని వ్యక్తంచేస్తుంది. ఈ సంబంధం అంతకంతకు మరింత సన్నిహితం అవుతూ వుండడాన్ని, విడి ఉత్పత్తిదారుల ఆర్థిక జీవితం యావత్తునూ ఒకటిగా, విడదీయరాని విధంగా ఏకం చెయ్యడాన్ని ధనం తెలియజేస్తుంది. ఈ సంబంధం మరింత అభివృద్ధి చెందడాన్ని — మానవ శ్రమశక్తి ఒక సరుకుగా తయారవడాన్ని — పెట్టుబడి తెలియజేస్తుంది. వేతన కార్మికుడు తన శ్రమశక్తిని భూమినీ, ఫ్యాక్టరీలనూ, శ్రమ పరికరాలనూ కలిగివున్న యజమానికి అమ్ముకుంటాడు. కార్మికుడు తాను పనిచేసే రోజులో ఒక భాగాన్ని తననూ, తన కుటుంబాన్నీ పోషించుకోడానికి అయ్యే ఖర్చుల సంపాదనకు (వేతనానికి) వినియోగిస్తాడు, ఆ రోజులో రెండవ భాగాన్ని ఎలాంటి ప్రతిఫలం లేకుండా పెట్టుబడిదారుని లాభానికి మూలాధారం అయిన అదనపు విలువను సృష్టించడానికి వినియోగిస్తాడు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు మూలాధారం.

అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ ఆర్థిక సిద్ధాంతానికి పునాది రాయి.

కార్మికుని శ్రమ సృష్టించిన పెట్టుబడి, చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేయడం ద్వారానూ, నిరుద్యోగుల సైన్యాన్ని సృష్టించడం ద్వారానూ కార్మికుణ్ణే అణచివేస్తుంది. పరిశ్రమలో అయితే భారీ స్థాయి ఉత్పత్తి సాధించిన విజయం మనకి వెంటనే కనబడుతోంది, కాని వ్యవసాయ రంగంలో కూడా ఇదే పరిణామం సంభవిస్తోందని గ్రహించాలి. అక్కడ భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయపు ఆధిక్యత పెరుగుతోంది. యంత్రాల వినియోగం హెచ్చు అవుతోంది, డబ్బు పెట్టుబడి గుప్పెట్లోపడి రైతాంగ ఆర్థిక వ్యవస్థ పతనం చెందుతోంది, సాంకేతిక పరిజ్ఞానపు వెనుకబాటుతనం భారం కింద క్రుంగి నాశనం అవుతోంది. సన్నకారు ఉత్పత్తియొక్క క్షయం వ్యవసాయ రంగంలో వివిధ రూపాలను ధరిస్తోంది, కాని అది క్షీణించిపోతోందన్న విషయం మాత్రం నిర్వివాదం.

సన్నకారు ఉత్పత్తిని నాశనం చేయడం ద్వారా పెట్టుబడి శ్రమ ఉత్పాదకత పెరుగుదలకూ, బడా పెట్టుబడిదారుల సంఘాలు గుత్తాధిపత్య స్థితిని నెలకొల్పుకోడానికీ దారితీస్తుంది. ఉత్పత్తియే అంతకంతకు ఎక్కువ సామాజికం అవుతుంది — లక్షలాది, కోట్లాది కార్మికులు ఒక క్రమబద్ధమైన ఆర్థిక నిర్మాణంగా కట్టుబాటు అవుతారు — కాని యీ సమిష్టి శ్రమ ఫలితం మాత్రం పిడికెడు మంది పెట్టుబడిదారులచే భుక్తం చేసుకోబడుతుంది. ఉత్పత్తిలో అరాజకత్వం, సంక్షోభాలు, మార్కెట్ల కోసం ఉగ్రమైన వేట, జన బాహుళ్యపు ఉనికికే భద్రతలేకపోవడం తీవ్రమైపోతాయి.

కార్మికులు పెట్టుబడిమీద ఆధారపడివుండే స్థితిని అంతకంతకు అధికం చేయడం మూలంగా పెట్టుబడిదారీ విధానం సమైక్య శ్రమయొక్క మహత్తర శక్తిని సృష్టిస్తుంది.

సరుకుల ఉత్పత్తిమీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ అంకుర దశనుంచి, సరళ మారకం దశనుంచి దాని అత్యున్నత రూపాలవరకూ భారీస్థాయి ఉత్పత్తివరకూ పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని మార్క్స్ వివరించాడు.

పాతవి కొత్తవి, అన్ని పెట్టుబడిదారీ దేశాల అనుభవం అంతకంతకు ఎక్కువమంది కార్మికులకు ఆయేటికాయేడు ఈ మార్క్స్ సిద్ధాంతంలోని సత్యాన్ని మరింత కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతటా విజయం పొందింది, కాని యీ విజయం పెట్టుబడిమీద శ్రమ సాధించబోయే విజయానికి నాంది మాత్రమే.

## III

ఫ్యూడల్ వ్యవస్థ కూలదోయబడి ప్రపంచంలో "స్వేచ్ఛాయుత" పెట్టుబడిదారీ సమాజం రావడంతోనే యీ స్వేచ్ఛ అంటే శ్రామిక ప్రజలను పీడించి దోచుకునే ఒక కొత్త పద్ధతి మాత్రమే అనేది వెంటనే స్పష్టం అయిపోయింది. ఈ పీడనకు ప్రతివర్తనగానూ అసమ్మతిగానూ రకరకాల సోషలిస్టు సిద్ధాంతాలు తక్షణమే తల ఎత్తాయి. కాని ఆదిలో వచ్చిన సోషలిజం ఊహాజనిత సోషలిజంగానే వుండిపోయింది. అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించింది, దానిని ఖండించి తిట్టింది, దాని నాశనాన్ని గురించి అది కలలు కంది, అది ఉత్తమ సమాజ వ్యవస్థను గురించి వూహించింది, దోపిడియొక్క నీతిరాహిత్యాన్ని గురించి ధనికులకు నచ్చచెప్పి ఒప్పించడానికి ప్రయత్నించింది.

కాని ఊహాజనిత సోషలిజం నిజమైన పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిసత్వపు సారం ఏమిటో అది వివరించలేకపోయింది, పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను బైటపెట్టడం గాని ఏ సామాజిక శక్తి నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం కలిగి వుందో చూపడం గాని చేయలేకపోయింది.

ఇది ఇలా వుండగా ఫ్యూడల్ వ్యవస్థ, భూదాస్య వ్యవస్థ పతనం చెందిన వెనువెంటనే యూరప్‌లో ప్రతి చోటా, ముఖ్యంగా ఫ్రాన్సులో, వచ్చిన ఉధృతమైన విప్లవాలు, యీ పరిణామానికంతకీ ప్రాతిపదికా, చోదకశక్తీ వర్గపోరాటమే అన్న విషయాన్ని అంతకంతకు మరింత స్పష్టంగా బైటపెట్టాయి.

ఫ్యూడల్ వర్గంపై సాధింపబడిన రాజకీయ స్వాతంత్ర్య సంబంధమైన ఏ ఒక్క విజయమూ కూడ తెంపరితనంతో కూడిన ప్రతిఘటనను ఎదుర్కోకుండా లభించలేదు.

ఏ ఒక్క పెట్టుబడిదారీ దేశమూ కూడ, పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జీవన్మరణ పోరాటం ద్వారా తప్ప కొద్దో గొప్పో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక ప్రాతిపదికపై వికసించలేదు.

దీన్నుంచి, ప్రపంచ చరిత్ర బోధించే యీ గుణపాఠాన్ని మొట్టమొదటి సారిగా గ్రహించి, ఆ గుణపాఠాన్ని సుసంగతంగా అన్వయించడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. ఈ గుణపాఠమే వర్గపోరాట సిద్ధాంతం.

ప్రజలు ఎల్లప్పుడూ రాజకీయాలలో వంచనకూ ఆత్మవంచనకూ తెలివి తక్కువగా బలి అవుతూనే వున్నారు, అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక ఏదో ఒక వర్గంయొక్క ప్రయోజనాలు దాగివున్నాయనే విషయాన్ని గ్రహించేటంతవరకూ వారలా బలి అవుతూనే వుంటారు. ప్రతి పురాతన సంస్థ, అది ఎంత అనాగరికమైనది గానూ, కుళ్లిపోయినది గానూ కనబడినప్పటికీ పాలకవర్గాలకు చెందిన కొన్ని శక్తులు దాన్ని నిలబెడుతున్నాయనే విషయాన్ని గ్రహించకుండా వున్నంతవరకూ సంస్కరణవాదులూ, అభివృద్ధి కాముకులూ పాత వ్యవస్థను సమర్థించే వారిచేత ఎల్లప్పుడూ మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకేఒక మార్గం వుంది, అదేమిటంటే మన చుట్టూ వున్న సమాజంలోనే పాతను తుడిచివేసి కొత్తను సృష్టించే సామర్థ్యం గలిగివున్న శక్తులను – సమాజంలో వాటి స్థానాన్ని బట్టి ఆ పని చేసితీరవలసిన శక్తులను – వెలికి తెచ్చి పోరాటంకోసం ఆ శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటిత పర్చడం.

పీడిత వర్గాలన్నీ తామింతవరకూ పడిమగ్గుతూన్న ఆత్మిక బానిసత్వంనుంచి బైటపడే మార్గాన్ని శ్రామికవర్గానికి చూపినది మార్క్స్ బోధించిన తాత్విక భౌతికవాదం ఒక్కటే. పెట్టుబడిదారీ విధానపు సాధారణ వ్యవస్థలో శ్రామికవర్గంయొక్క నిజమైన స్థానం ఏదో వివరించినది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం ఒక్కటే.

అమెరికా మొదలు జపానువరకు, స్వీడన్ మొదలు దక్షిణాఫ్రికావరకు, ప్రపంచమంతటా శ్రామికవర్గపు స్వతంత్ర సంఘాలు వృద్ధి అవుతున్నాయి. తన వర్గపోరాటాన్ని సాగించడంద్వారా శ్రామికవర్గం విజ్ఞానాన్నీ, వికాసాన్నీ పొందుతోంది; అది బూర్జువా సమాజపు దుర్భ్రమలను వదిలించుకుంటోంది; అది తన శ్రేణులను మరింత సన్నిహితంగా సమీకరించుకుంటోంది, తన విజయాల ప్రమాణాన్ని అంచనా వేయడం నేర్చుకుంటోంది; అది తన బలాలను పటిష్టం చేసుకుంటోంది, అప్రతిహతంగా అభివృద్ధి చెందుతోంది.

''ప్రాస్వేష్చేనియె'' 3వ సంచిక,
1913 మార్చి

# మార్క్సిజమూ, రివిజనిజమూ

రేఖాగణిత సూత్రాలు మానవ ప్రయోజనాలను ప్రభావితం చేస్తే వాటిని పూర్వ పక్షం చేసే ప్రయత్నాలు తప్పక జరుగుతాయి అని ఒక ప్రసిద్ధమైన నానుడి వుంది. మత శాస్త్ర సైద్ధాంతిక పాత దురభిప్రాయాలతో ఘర్షించే ప్రకృతి శాస్త్రీయ సిద్ధాంతాలు అత్యంత ఉన్మత్త వ్యతిరేకతను ప్రేరేపించినాయి, యింకా ప్రేరేపిస్తున్నాయి. కనుక, ఆధునిక సమాజంలోని పురోగామి వర్గాన్ని విజ్ఞాన ప్రబుద్ధం చేసి, సంఘటితపరచి, యీ వర్గాన్ని యెదుర్కొనే కర్తవ్యాలను సూచించి, (ఆర్థికాభివృద్ధి కారణంగా) ప్రస్తుత వ్యవస్థను కొత్త వ్యవస్థ అనివార్యంగా తొలగిస్తుందని నిరూపించే మార్క్సు సిద్ధాంతం తన మార్గంలోని ప్రతి ముందడుగు కొరకూ పోరాటం చేయవలసి రావడంలో ఆశ్చర్యం లేదు.

ఆస్తిపర వర్గాల కొత్త తరానికి మత్తెక్కించడానికీ, ఆంతరంగిక శత్రువులనూ, పరాయి శత్రువులనూ యెదుర్కోడానికి ''శిక్షణ'' యివ్వడానికీ ఆధికారిక ప్రొఫెసర్లచేత ఆధికారికంగా నేర్పబడే బూర్జువా విజ్ఞానశాస్త్రానికీ, తత్వశాస్త్రానికీ యిది వర్తిస్తుందని చెప్పనక్కర లేదు. యీ విజ్ఞానశాస్త్రం మార్క్సిజంను చెవిలో కూడా పడనివ్వదు, అది పూర్వపక్షం చేయబడిందనీ, నిర్మూలింపబడిందనీ ప్రకటిస్తుంది. సోషలిజంను పూర్వపక్షం చేయడం ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకొనే యువ పండితులూ, రకరకాల కాలంచెల్లిన ''వ్యవస్థల'' సంప్రదాయాన్ని నిలబెడుతున్న ముసలి తొక్కులూ సమానమైన ఉత్సాహంతో మార్క్సుమీద దాడిచేస్తారు. మార్క్సిజం పురోగతీ, దాని భావాలు కార్మికవర్గంలో వ్యాపిస్తూ, దృఢమైన పట్టు సంపాయిస్తూ వుండడమూ అనివార్యంగా మార్క్సిజంమీద యీ బూర్జువా దాడుల పౌనఃపున్యాన్నీ, తీవ్రతనూ పెంచుతాయి; ఆధికారిక విజ్ఞానశాస్త్రంచేత ప్రతిసారీ ''నిర్మూలింపబడిన'' తరువాత మార్క్సిజం మరింత బలంగా, కరకుగా, జీవవంతంగా వుంటుంది.

కానీ, కార్మికవర్గ పోరాటంతో సంబంధం కలిగి, ప్రధానంగా కార్మికవర్గంలో ప్రచారంలో వున్న సిద్ధాంతాలలో కూడా, మార్క్సిజం ఒక్క దెబ్బతో తన స్థానాన్ని దృఢపరుచుకోలేదు. తన అస్తిత్వంలోని మొదటి అర్ధ శతాబ్దిలో (1840లనుండి) మార్క్సిజం మౌలికంగా తనకు వ్యతిరేకమైన సిద్ధాంతాలతో పోరాటం చేయడంలో నిమగ్నమై వుండింది.

1840 దశకపు మొదటి సంవత్సరాల్లో మార్క్సు, ఎంగెల్సు, తాత్విక భావవాద దృక్పథం గల తీవ్రవాద యువ హెగెలియన్లను[71] ఓడించినారు. నలభైల అంతంలో ఆర్థిక సిద్ధాంతాల రంగంలో, ప్రూడనిజంమీద[72] పోరాటం ప్రారంభమైంది. కల్లోలపు సంవత్సరమైన 1848లో ఉద్భవించిన పార్టీలనూ, సిద్ధాంతాలనూ విమర్శించడంతో యీ పోరాటం యాభైలలో అంతమైంది. అరవైలలో పోరాటం సాధారణ సిద్ధాంతపు రంగంనుండి ప్రత్యక్ష కార్మికో ద్యమానికి మరింత సన్నిహితమైన రంగానికి మారింది: ఇంటర్నేషనల్‌నుండి బకూనిని జంను[73] గెంటివేయడం. తొలి డెబ్బైలలో జర్మనీలో కొద్ది కాలంపాటు ప్రూడనిస్టు మూల్ బెర్గెర్, చివరి డెబ్బైలలో పాజిటివిస్టు డ్యూరింగ్ రంగం ఆక్రమించినారు. కానీ శ్రామిక వర్గంమీద యీ యిద్దరి ప్రభావమూ అప్పటికే తృణప్రాయంగా వుండింది. మార్క్సిజం కార్మికోద్యమంలో యితర భావజాలాలన్నిటిమీదా అప్పటికే నిర్వివాదమైన విజయం పొందుతూ వుండింది.

తొంబైల నాటికి యీ విజయంలో ప్రధాన భాగం పూర్తి అయింది. ప్రూడనిజం సంప్రదాయాలు అన్నిటికంటె దీర్ఘకాలం పట్టుగలిగివుండిన లాటిన్ దేశాలలో కూడా, కార్మిక పార్టీలు వాస్తవానికి తమ కార్యక్రమాలనూ, యెత్తుగడలనూ మార్క్సిస్టు పునా దులమీద నిర్మించినాయి. పునరుద్ధరింపబడిన కార్మికోద్యమ అంతర్జాతీయ సంస్థ — అప్పు డప్పుడు జరిగే అంతర్జాతీయ మహాసభల రూపంలో — మొట్టమొదటినుండి, దాదాపు యే పోరాటమూ లేకుండా, అన్ని ముఖ్య విషయాలలోనూ మార్క్సిస్టు దృక్పథం అవలంబిం చింది. కానీ, మార్క్సిజం తనకు వ్యతిరేకమైన, దాదాపు అఖండమైన సిద్ధాంతాలనన్నిటినీ తొలగించిన తర్వాత, యీ సిద్ధాంతాలలో వ్యక్తీకరింపబడిన ధోరణులు యితర మార్గాలు చూసుకోసాగినాయి. పోరాట రూపాలూ, పోరాట కారణాలూ మారినాయి, కానీ పోరాటం కొనసాగింది. మార్క్సిజం అస్తిత్వపు రెండవ అర్ధ శతాబ్ది మార్క్సిజంలోనే మార్క్సిజంకు వ్యతిరేకమైన ధోరణి చేసే పోరాటంతో (1890 దశకంలో) ప్రారంభమైంది.

ఒకప్పుడు సాంప్రదాయిక మార్క్సిస్టు అయిన బెర్న్‌స్టైన్, మార్క్సుకు సవరణ లను — రివిజనిజంను — అందరికంటే పెద్ద గోలతోనూ, అత్యంత ఉద్దేశపూర్వకంగా వ్యక్తీ కరించడంతోనూ ముందుకు రావడంవల్ల యీ ధోరణికి[74] అతని పేరు వచ్చింది. ఆర్థిక వెనుకబాటుతనం మూలంగానూ, ఫ్యూడల్ దాస్య అవశేషాలచేత క్రుంగిపోయిన రైతు జనాభా ప్రాబల్యం మూలంగానూ, మార్క్సిస్టేతర సోషలిజం సహజంగా అన్నిటికంటె దీర్ఘకాలం పట్టుగలిగివుండిన రష్యాలో కూడా, అది మన కండ్ల యెదుటనే స్పష్టంగా రివిజనిజంగా మారుతున్నది. వ్యవసాయ సమస్యలోనూ (సమస్త భూమినీ మునిసిపలీకరించే కార్యక్రమం), కార్యక్రమానికీ, యెత్తుగడలకూ సంబంధించిన సాధారణ సమస్యలలోనూ, మన సోషల్

నరోద్నిక్కులు[75] తమ సొంత పద్ధతిలో అఖండంగా, మార్క్సిజంకు మౌలికంగా వ్యతిరేకంగా వుండిన తమ పాత వ్యవస్థయొక్క మరణోన్ముఖమైన, పాతబడిపోతున్న అవశేషాల స్థానంలో అంతకంతకూ యెక్కువగా మార్క్సుకు ''సవరణలు'' పెడుతున్నారు.

మార్క్సు పూర్వ సోషలిజం ఓడింపబడింది. అది తన సొంత స్వతంత్ర రంగంలో కాకుండా, మార్క్సిజంయొక్క సాధారణ రంగంలో, రివిజనిజంగా, పోరాటం కొనసాగిస్తున్నది. రివిజనిజంయొక్క సైద్ధాంతిక సారాంశాన్ని పరీక్షిద్దాం.

తాత్విక రంగంలో రివిజనిజం బూర్జువా ప్రొఫెసర్ల ''విజ్ఞానశాస్త్రం''యొక్క అడుగు జాడలను అనుసరించింది. ప్రొఫెసర్లు ''వెనక్కి కాంటు వద్దకు'' వెళ్లినారు — యిక రివిజనిజం నయా కాంటియన్ల[76] వెంట అడుగులు యీడ్చుకుంటూ వెళ్లింది. తాత్విక భౌతికవాదానికి వ్యతిరేకంగా మతగురువులు వెయ్యిసార్లు వల్లించిన పడికట్టు పదాలను ప్రొఫెసర్లు పునశ్చరణ చేసినారు — రివిజనిస్టులు ఉదారమైన చిరునవ్వులతో, భౌతికవాదం యేనాడో ''పూర్వపక్షం'' చేయబడిందని (తాజా పాఠ్యగ్రంథంలోని మాటలను మక్కికి మక్కీగా) గొణిగినారు. ప్రొఫెసర్లు హేగెల్‌ను ''చచ్చిన కుక్క''లాగ[77] తృణీకరించినారు; వాళ్లు ఒక వైపున తామే భావవాదాన్ని, హేగెల్ భావవాదంకంటె వేయిరెట్లు చిల్లరదీ, చౌకబారుదీ అయిన దాన్ని బోధిస్తూ, గతితర్కాన్ని యేవగింపుతో తృణీకరించినారు — యిక రివిజనిస్టులు వాళ్ల వెనుక విజ్ఞానశాస్త్రపు తాత్విక వికృతీకరణ అనే అడుసులో పడి, ''నిగూఢ'' (విప్లవకర కూడా) గతితర్కం స్థానంలో ''సరళ'' (ప్రశాంత కూడా) ''పరిణామా''న్ని పెట్టినారు. ప్రొఫెసర్లు తమ భావవాద వ్యవస్థలనూ, ''విమర్శనాత్మక'' వ్యవస్థలనూ ప్రాబల్యంలో వున్న మధ్యయుగ ''తత్వశాస్త్రానికి'' (అనగా మతశాస్త్ర సిద్ధాంతానికి) అనుగుణంగా సర్ది, తమ ఆధికారిక జీతాలకు తగిన ప్రతిఫలం యిచ్చినారు — యిక రివిజనిస్టులు వాళ్లకు దగ్గరగా జరిగి, మతాన్ని ''సొంత వ్యవహారం''గా, ఆధునిక రాజ్యానికి సంబంధించి కాదు, పురోగామి వర్గంయొక్క పార్టీకి సంబంధించి, చేయడానికి ప్రయత్నించినారు.

వర్గ పరిభాషలో మార్క్సుకు అలాంటి ''సవరణ''ల అర్థం యేమైందీ చెప్పనక్కర లేదు — అది స్వయంవ్యక్తం. ఒకటి మాత్రం గమనించాలి — అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో, రివిజనిస్టుల నమ్మశక్యం కాని పడికట్టు మాటలను స్థిరమైన గతితార్కిక భౌతికవాద దృక్పథంనుండి విమర్శించిన ఏకైక మార్క్సిస్టు ప్లెహానొవ్. దీనిని మరింత కంఠోక్తిగా నొక్కిచెప్పాలి; యెందుకంటే, యెత్తుగడల విషయంలో ప్లెహానొవ్ అవకాశవాదాన్ని విమర్శించే పేరుతో, పాత, ప్రగతివ్యతిరేక తాత్విక చెత్తను దొంగచాటుగా ప్రవేశపెట్టడానికి మహా పొరపాటైన ప్రయత్నాలు యీనాడు జరుగుతున్నాయి.*

---

* బొగ్దానొవ్, బజారొవ్, తదితరులు రచించిన ''మార్క్సిస్టు తత్వశాస్త్ర వ్యాసాలు'' అనే పుస్తకాన్ని చూడండి. ఆ పుస్తకాన్ని చర్చించడానికి యిది తగినచోటు కాదు. నయా

అర్థశాస్త్రానికి వస్తాను. మొదట గమనించవలసిం దేమిటంటే, యీ రంగంలో రివిజనిస్టుల "సవరణలు" యెక్కువ సర్వగ్రాసిగానూ, సందర్భగతంగానూ వున్నాయి; "ఆర్థికాభివృద్ధిని గురించిన కొత్త వాస్తవాల"తో ప్రజలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరిగినాయి. సాంద్రీకరణా, భారీ ఉత్పత్తితో సన్నకారు ఉత్పత్తిని తొలగించడమూ వ్యవసాయంలో బొత్తిగా జరగవనీ, వాణిజ్యంలోనూ, పరిశ్రమలలోనూ అతి నిదానంగా జరుగుతాయనీ అన్నారు. సంక్షోభాలు యెక్కువ అరుదూ, దుర్బలమూ అయినాయనీ, పెట్టుబడి వాటిని పూర్తిగా తొలగించేటట్లు కార్టెల్‌లూ, ట్రస్టులూ చేస్తాయనీ అన్నారు. వర్గ వైరుధ్యాలు యెక్కువ తేలికా, తక్కువ తీవ్రమూ అయ్యే ధోరణి మూలంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంవైపు పరుగెడుతున్నదనే "పతన సిద్ధాంతం" సరైనది కాదని అన్నారు. చివరి విషయం, బ్యోమ్-బావెర్క్‌ను అనుసరించి మార్క్స్ విలువ సిద్ధాంతాన్ని కూడా దిద్దడం తప్పు కాదని అన్నారు.

యీ సమస్యలమీద రివిజనిస్టులతో పోరాటం అంతర్జాతీయ సోషలిజంలో సిద్ధాంత యోచన పునరుద్ధరణను, దానికి యిరవై యేండ్ల ముందు డ్యూరింగ్‌తో ఎంగెల్స్ వివాదం కలిగించినంత ఫలప్రదమైనదానిని, కలిగించింది. రివిజనిస్టుల వాదాలు వాస్తవాల, అంకెల సహాయంతో పరిశీలింపబడినాయి. రివిజనిస్టులు క్రమపద్ధతిగా యీనాటి సన్నకారు ఉత్పత్తిని అందంగా చిత్రిస్తున్నారని రుజువుచేయబడింది. పరిశ్రమలలోనే కాక, వ్యవసాయంలో కూడా సన్నకారు ఉత్పత్తిమీద భారీ ఉత్పత్తియొక్క సాంకేతిక, వాణిజ్య ఆధిక్యం నిర్వివాదమైన వాస్తవాలచేత రుజువుచేయబడింది. కానీ వ్యవసాయంలో సరుకు ఉత్పత్తి చాలా తక్కువగా అభివృద్ధి అయింది. వ్యవసాయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని మారకం క్రమంలోకి అంతకంతకూ యెక్కువగా లాగబడుతున్నదని వ్యవసాయంలోని యే ప్రత్యేక శాఖలు (ఒకోసారి వ్యవసాయ పనులు కూడా) సూచిస్తాయో వాటిని యేరుకోవడంలో ఆధునిక గణాంకవేత్తలూ, అర్థశాస్త్రజ్ఞులూ అంత నేర్పరులు కాదు. నిత్యం క్షీణించే ఆహారమూ, పనిదినాన్ని పెంచడమూ, పశువుల నాణ్యమూ, పోషణా క్షీణించడమూ – ఒక్క మాటలో చెప్పాలంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తికి వ్యతిరేకంగా చేతిపనుల ఉత్పత్తి యే విధంగా తన్ను తాను నిలుపుకుందో ఆవిధంగా సన్నకారు ఉత్పత్తి – స్వయంపోషక ఆర్థిక

---

కాంటియన్ (neo-Kantian) రివిజనిస్టుల గురించి నేను వ్యాసంలో చెప్పిన ప్రతిదీ సారభూతంగా యీ "కొత్త" నయా హ్యూమిస్టు (neo-Humist), నయా బెర్క్‌లీయన్ (neo-Berkeleyan) రివిజనిస్టులకు కూడా వర్తిస్తుందని ఒక వ్యాస పరంపరలో గానీ, ప్రత్యేక గ్రంథంలో గానీ సమీప భవిష్యత్తులో రుజువు చేస్తాననే ప్రకటనకు యిక్కడ నేను పరిమితం కావాలి.[78] – లెనిన్ వివరణ.

వ్యవస్థ శిథిలాలమీద తన్ను తాను నిలుపుకుంటుంది. విజ్ఞానశాస్త్రంలోనూ, సాంకేతిక శాస్త్రంలోనూ జరిగే ప్రతి పురోగతీ పెట్టుబడిదారీ సమాజంలోని సన్నకారు ఉత్పత్తి పునాదులను అనివార్యంగా, తప్పనిసరిగా దుర్బలపరుస్తుంది; తరుచు జటిలమూ, చిక్కైనదీ అయిన యీ క్రమాన్ని అన్ని రూపాలలోనూ పరిశోధించడమూ, పెట్టుబడిదారీ వ్యవస్థలో తన స్థితిని నిలుపుకోవడం అసాధ్యమనీ, రైతు వ్యవసాయం నిరర్థకమనీ, కార్మిక దృక్పథం అవలంబించడం రైతుకు అవసరమనీ సన్నకారు ఉత్పత్తిదారునికి నిరూపించడమూ సోషలిస్టు ఆర్థిక విధాన కర్తవ్యం. మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధం లేకుండా, ఒక పార్శ్వానికి సంబంధించిన వాస్తవాలమీద ఆధారపడిన పైపై సాధారణీకరణల ద్వారా రివిజనిస్టులు, శాస్త్రీయ అర్థంలో, పాపం చేసినారు. రాజకీయంగా వాళ్ళు చేసిన పాపం యేమిటంటే, వాళ్ళు అలా అనుకున్నా, అనుకోకపోయినా, రైతును విప్లవ శ్రామికుని దృక్పథం అవలంబించమని ప్రేరేపించే బదులు ఆస్తిపరుని దృక్పథం (అనగా బూర్జువా వర్గ దృక్పథం) అవలంబించమని అనివార్యంగా ఆహ్వానించినారు, లేదా ప్రేరేపించినారు.

సంక్షోభాల సిద్ధాంతానికీ, పతన సిద్ధాంతానికీ సంబంధించిన విషయంలో రివిజనిజం మరింత అధ్వాన్నంగా వుంది. కొద్ది సంవత్సరాల పారిశ్రామిక పునరుజ్జీవన, వికాసాలయొక్క ప్రభావంకింద మార్క్సు సిద్ధాంత పునాదులను మార్చాలని యెవరైనా కొద్ది కాలం పాటు మాత్రమే, అదైనా బొత్తిగా దూరదృష్టి లేనివాళ్లు మాత్రమే, అనుకోగలరు. సంక్షోభాలు గతకాలపు విషయాలు కాదని వాస్తవాలు రివిజనిస్టులకు అతి త్వరలో స్పష్టం చేసినాయి: వికాస స్థితివెంట సంక్షోభం వచ్చింది. విడివిడి సంక్షోభాల రూపాలూ, అనుక్రమమూ, వాటి స్వరూపం మారినాయి, కాని సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యమైన భాగంగా నిలిచినాయి. కార్టెల్‌లూ, ట్రస్టులూ ఉత్పత్తిని యేకంచేస్తూ, అదే సమయంలో, అందరికీ తేటతెల్లమైన పద్ధతిలో, ఉత్పత్తిలోని అరాజకత్వాన్నీ, కార్మికుల జీవితభద్రతా రాహిత్యాన్నీ, పెట్టుబడి పీడననూ తీవ్రతరం చేసి, తద్వారా వర్గ వైరుధ్యాలను యెన్నడూ లేనంత స్థాయికి పెంచినాయి. విడివిడి రాజకీయ, ఆర్థిక సంక్షోభాల అర్థంలోనూ, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనే అర్థంలోనూ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిత్తి వైపు దారితీస్తున్నదని సరిగ్గా యీ కొత్త రాక్షస ట్రస్టులవల్ల విస్తృతమైన స్థాయిలో మరీ స్పష్టం అయింది. అనేక లక్షణాలు సూచిస్తున్నట్టి ఆసన్న పారిశ్రామిక సంక్షోభం మాట అటుంచి, యిటీవలి అమెరికాలోని ఫైనాన్సల్ సంక్షోభమూ, యూరప్ అంతటా దారుణంగా పెరిగిన నిరుద్యోగమూ — వీటి ఫలితంగా, రివిజనిస్టుల యిటీవలి ''సిద్ధాంతాలను'' అందరూ మరచిపోయినారు, రివిజనిస్టులలో చాలా మంది మరచిపోయినట్లు ఉన్నారు. కానీ మేధావుల యీ అస్థిరత్వం కార్మికవర్గానికి నేర్పిన గుణపాఠాలను మరచిపోకూడదు.

విలువ సిద్ధాంతానికి సంబంధించి, యిది మాత్రం చెప్పవలసి వుంది: బ్యోమ్-బావెర్క్ పద్ధతిలో అత్యంత అస్పష్టమైన సూచనలూ, నిట్టూర్పులూ తప్ప, రివిజనిస్టులు యీ సిద్ధాంతానికి బొత్తిగా యేమీ చేర్చలేదు, అందువలన శాస్త్రీయ యోచన అభివృద్ధిమీద వాళ్ల గుర్తులు యెలాంటివీ లేవు.

రాజకీయ రంగంలో, రివిజనిజం మార్క్సిజం పునాదిని, అనగా వర్గపోరాట సిద్ధాంతాన్ని, సవరించడానికి నిజంగా ప్రయత్నించింది. రాజకీయ స్వేచ్ఛా, ప్రజాస్వామ్యమూ, సార్వజనీన వోటు హక్కూ వర్గపోరాట కారణాన్ని తొలగిస్తాయట, కార్మికులకు స్వదేశం అనేది లేదు అనే ''కమ్యూనిస్టు ప్రణాళిక''లోని పాత సూత్రాన్ని అబద్ధంగా చేస్తాయట. యెందుకంటే, ప్రజాస్వామ్యంలో ''అధిక సంఖ్యాకుల అభీష్టం'' చెల్లుతుంది గనుక రాజ్యాన్ని వర్గ పరిపాలన అంగంగా పరిగణించకూడదట, ప్రగతి నిరోధకులకు వ్యతిరేకంగా ప్రగతిశీల, సంఘ సంస్కరణవాద బూర్జువాలతో పొత్తులను నిరాకరించకూడదట.

రివిజనిస్టుల యీ వాదాలు బాగా సమతూకం గల అభిప్రాయాల వ్యవస్థకు, అనగా పాత, సుప్రసిద్ధ ఉదారవాద బూర్జువా అభిప్రాయాలకు, సమాన మనేది నిర్వివాదం. వోటు హక్కూ, దేశంయొక్క పరిపాలనలో పాల్గొనే హక్కూ వివక్ష లేకుండా పౌరులందరికీ వున్నాయి గనుక, బూర్జువా పార్లమెంటరిజం వర్గాలనూ, వర్గ విభజనలనూ నిర్మూలిస్తుందని ఉదారవాదులు యెప్పుడూ అన్నారు. అలాంటి అభిప్రాయాలు యెంత అసంబద్ధమైనదీ, పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో మొత్తం యూరప్ చరిత్రా, యిరవయ్యవ శతాబ్ది తొలి భాగంలో మొత్తం రష్యన్ విప్లవ చరిత్రా స్పష్టంగా తెలుపుతాయి. ''ప్రజాతంత్ర'' పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క స్వేచ్ఛలో ఆర్థిక విభేదాలు తగ్గిపోలేదు సరికదా, యింకా తీవ్రమైనాయి. వర్గపీడన అంగాలుగా అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్కుల అంతర్గత స్వభావాన్ని కూడా పార్లమెంటరిజం తొలగించదు సరికదా, బట్టబయలు చేస్తుంది. గతంలో రాజకీయ ఘటనలలో క్రియాత్మకంగా పాల్గొన్నంతకంటె అపారమైన ప్రజా సముదాయాలను విజ్ఞాన ప్రబుద్ధం చేయడానికీ, సంఘటితపరచడానికీ తోడ్పడడంద్వారా, పార్లమెంటరిజం సంక్షోభాలనూ, రాజకీయ విప్లవాలనూ తొలగించడానికి కాక, అలాంటి విప్లవాలలో అంతర్యుద్ధాన్ని యెంతో యెక్కువ తీవ్రం చేయడానికి దారి తీస్తుంది. యీ తీవ్రకరణ యెలా అనివార్యంగా జరిగేదీ 1871 వసంతంలో పారిస్‌లోని ఘటనలూ, 1905 శీతకాలంలో రష్యాలోని ఘటనలూ సాధ్యమైనంత స్పష్టంగా చూపించినాయి. శ్రామికవర్గ ఉద్యమాన్ని నలిపివేయడానికి ఫ్రెంచి బూర్జువావర్గం ఒక క్షణం కూడా తటపటాయించకుండా మొత్తం జాతియొక్క శత్రువుతో, స్వదేశాన్ని నాశనం చేసిన విదేశ సైన్యంతో ఒప్పందం చేసుకుంది. పార్లమెంటరిజం, బూర్జువా ప్రజాస్వామ్యవాదాల అనివార్య అంతర్గత తర్కాన్ని — గతంలోకంటె యెక్కువగా కూడా సామూహిక

హింసతో వాదాన్ని తేల్చుకునేటట్లు చేసేదాన్ని — అర్థంచేసుకోనివాడెవడైనా యిలాంటి ''వాదాల''లో విజయోపేతంగా పాల్గొనడానికి కార్మికజన సామాన్యాన్ని నిజంగా సిద్ధంచేసే, సూత్రబద్ధమైన ప్రచారాందోళనలను యీ పార్లమెంటరిజం ఆధారంమీద యెన్నడూ సాగించజాలడు. పశ్చిమ దేశాలలో సాంఘిక సంస్కరణవాద ఉదారవాదులతోనూ, రష్యన్ విప్లవంలో ఉదారవాద సంస్కరణవాదుల (కాడెట్ల[79])తోనూ పొత్తుల, ఒప్పందాల, బ్లాకుల అనుభవం నమ్మకంగా నిరూపించింది యేమిటంటే: పోరాట సామర్థ్యం అతి తక్కువగా వున్న వాళ్లూ, ఎక్కువ ఊగిసలాడేవాళ్లూ, ద్రోహులూ అయినవాళ్లతో యోధులను లంకించడం ద్వారా, యీ ఒప్పందాలు జనాల చైతన్యాన్ని కేవలం మొద్దుబరుస్తాయి, జనాల పోరాటం యొక్క వాస్తవ ప్రాముఖ్యాన్ని పెంచకుండా, బలహీనపరుస్తాయి. ఫ్రాన్సులో మిలెరానిజం[80] — విస్తారమైన, నిజంగా జాతీయమైన ప్రమాణంలో రివిజనిస్టు రాజకీయ యెత్తుగడలు ప్రయోగించడంలో అత్యంత పెద్ద ప్రయోగం — రివిజనిజం గురించిన ఆచరణగత అంచనాను, ప్రపంచ మంతటా శ్రామికవర్గం యెన్నడూ మరిచిపోనిదాన్ని, సమకూర్చింది.

రివిజనిజంయొక్క ఆర్థిక, రాజకీయ ధోరణులకు సహజమైన ఒక చేర్పు యేమిటంటే, సోషలిస్టు ఉద్యమంయొక్క అంతిమ లక్ష్యంపట్ల దాని వైఖరి. ''ఉద్యమమే సర్వమూ, అంతిమ లక్ష్యం యేమీ కాదు'' అని బెర్న్‌స్టైన్ చెప్పిన యీ పడికట్టు మాట అనేక దీర్ఘ వివరణలకంటె రివిజనిజంయొక్క సారాన్ని బాగా వ్యక్తంచేస్తుంది. తన ప్రవర్తనను ప్రతి సందర్భానికీ విడివిడిగా నిర్ణయించుకోవడమూ, ఆనాటి ఘటనలకూ, అస్థిరమైన క్షుద్ర రాజకీయాలకూ అనుగుణంగా తన్ను తాను మలచుకోవడమూ, శ్రామికవర్గ ప్రాథమిక ప్రయోజనాలనూ, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క, సకల పెట్టుబడిదారీ పరిణామంయొక్క మౌలిక లక్షణాలనూ విస్మరించడమూ, యీ ప్రాథమిక ప్రయోజనాలను ఉద్యమంయొక్క నిజమైన, లేదా ఊహించబడిన సౌకర్యాల కొరకు బలిచెయ్యడమూ — యిదీ రివిజనిజం విధానం. యీ విధానంయొక్క స్వభావంనుండే స్పష్టంగా యేర్పడే దేమిటంటే, అది అనంతమైన రకాల రూపాలు ధరించవచ్చుననీ, అంతో యింతో ''కొత్తదైన'' ప్రతి సమస్యా, అంతో యింతో యెదురుచూడనిదీ, ముందు ఊహించనిదీ అయిన ప్రతి పరిస్థితీ, అది మౌలిక అభివృద్ధి పంథాను తృణప్రాయంగా మాత్రమే, అత్యంత స్వల్ప కాలంపాటు మాత్రమే మార్చినప్పటికీ, యేదో ఒక రకం రివిజనిజంను సర్వదా అనివార్యంగా ఉత్పన్నం చేస్తుంది.

రివిజనిజంయొక్క అనివార్యతకి ఆధునిక సమాజంలో దాని వర్గపు మూలాలే కారణం రివిజనిజం అంతర్జాతీయ ఘటన. జర్మనీలో సాంప్రదాయికులకూ, బెర్న్‌స్టైనియన్‌లకూ, ఫ్రాన్సులో గెడిస్టులకూ, జోరేసిస్టులకూ (యిప్పుడు ముఖ్యంగా బ్రుసి

స్టులకూ)[81], గ్రేట్ బ్రిటన్‌లోని సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్‌కూ,[82] ఇండిపెండెంటు లేబర్ పార్టీకీ,[83] బెల్జియంలో బ్రూకేర్‌కూ, వాండెర్‌వెల్డెకూ,[84] ఇటలీలో ఇంటెగ్రలిస్టులకూ,[85] రిఫార్మిస్టులకూ, రష్యాలో బోల్షివిక్కులకూ, మెన్షివిక్కులకూ గల సంబంధం, యీ దేశాలన్నిటిలోనూ ప్రస్తుత స్థితిలో జాతీయ పరిస్థితులలోనూ, చారిత్రక లక్షణాలలోనూ అపార వైవిధ్యం వున్నప్పటికీ, ప్రతిచోటా సారంలో ఒకే విధమైనదని, యేమాత్రమైనా విషయ పరిజ్ఞానం గల, యోచించే సోషలిస్టు కెవరికైనా అణుమాత్రం కూడా సందేహం వుండజాలదు. వాస్తవంలో, ప్రస్తుత అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలోని "విభజన" ప్రపంచంలోని వివిధ దేశాలన్నిటిలోనూ యిప్పుడు *ఒకే* మార్గాలలో జరుగుతున్నది; ముప్పై నలభై యేండ్లనాటి పరిస్థితితో పోలిస్తే ప్రచండమైన పురోగతి జరిగినట్టు యిది సాక్ష్యం చెపుతుంది; ఆనాడు వివిధ దేశాలలోని యేక స్వభావం లేని ధోరణులు ఒకేఒక అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో తన్నుకలాడుకుంటూ వుండినాయి. లాటిన్ దేశాలలో "విప్లవ సిండికాలిజం"[86]గా రూపుదాల్చిన ఆ "వామపక్ష రివిజనిజం" కూడా మార్క్సిజంకు అనుగుణంగా తన్ను తాను మలచుకుంటున్నది, మార్క్సిజంను "సవరిస్తూ": ఇటలీలో లబ్రియోల, ఫ్రాన్సులో లగార్డెల్ తరుచుగా తప్పుగా అర్థం చేసుకోబడిన మార్క్సు నుండి సరిగా అర్థం చేసుకోబడిన మార్క్సుకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవకాశవాద రివిజనిజం అభివృద్ధి అయిన స్థాయికి యింకా చాలా దూరంలో వున్న యీ రివిజనిజంయొక్క సిద్ధాంత సారాన్ని పరిశీలించడానికి యిక్కడ మేము ఆగజాలం: *యిది* యింకా అంతర్జాతీయం కాలేదు, యే ఒక్క దేశంలోని సోషలిస్టు పార్టీతోనూ ఒక్కగానొక్క పెద్ద ఆచరణగత యుద్ధ పరీక్షను కూడా యింకా తట్టుకు నిలబడలేదు. కనుక, పైన వర్ణించబడిన "దక్షిణపక్ష రివిజనిజం"కు మేము పరిమితమౌతాం.

పెట్టుబడిదారీ సమాజంలో దాని అనివార్యత యెందులో వుంది? జాతీయ విలక్షణాలలోనూ, పెట్టుబడిదారీ అభివృద్ధి స్థాయిలలోనూ వున్న భేదాలకంటే అది యెందుకు ప్రగాఢమైంది? యెందుకంటే, ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ, కార్మికవర్గం పక్కనే, పెటీబూర్జువాల, సన్నకారు యజమానుల విస్తారమైన పొరలు యెల్లప్పుడూ వున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సన్నకారు ఉత్పత్తినుండి ఉద్భవించింది, నిత్యం ఉద్భవిస్తున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్లీమళ్లీ అనివార్యంగా కొన్ని "మధ్యపొరల"ను ఉత్పన్నం చేస్తుంది (ఫాక్టరీ అనుబంధాలూ, యింటివద్ద పనీ, సైకిల్, మోటార్ పరిశ్రమల లాంటి పెద్ద పరిశ్రమల అవసరాలు తీర్చడానికి దేశమంతటా వెదజల్లబడిన చిన్న కార్ఖానాలూ, వగైరా). యీ కొత్త సన్నకారు ఉత్పత్తిదారులు మళ్లీ అంతే అనివార్యంగా కార్మికవర్గ శ్రేణులలోకి తోయబడతారు. విశాలమైన కార్మిక పార్టీలలో పెటీబూర్జువా దృక్పథం మళ్లీమళ్లీ తల యెత్తడం చాలా సహజం. యిది యిలా వుండవలసి రావడమూ, కార్మికవర్గ విప్లవంలో అదృష్టాలు

మారిందాకా యెల్లప్పుడూ యిలాగే వుండబోవడమూ చాలా సహజం. యెందుకంటే, అలాంటి విప్లవం సాధించడానికి ప్రజానీకంలో మెజారిటీని ''సంపూర్ణ'' కార్మికవర్గీకరణ చేయడం అత్యవసర మనుకోవడం ప్రగాఢమైన పొరపాటు. మనం యిప్పుడు సైద్ధాంతిక రంగంలో మాత్రమే అనగా మార్క్సుకు చేసే సిద్ధాంత సవరణలమీద వివాదాలే తరుచుగా అనుభవించేది, రివిజనిస్టులతో యెత్తుగడల విభేదాలుగానూ, యీ ప్రాతిపదికమీద చీలికలు గానూ, కార్మికోద్యమంలోని విడివిడి పాక్షిక సమస్యలమీద మాత్రం యిప్పుడు ఆచరణలో తలయెత్తేది – యిది, కార్మికవర్గ విప్లవం వివాదాస్పద సమస్యల నన్నిటినీ తీవ్రతరం చేసి నప్పుడు, జనాల ప్రవర్తనను నిర్ణయించడంలో అత్యంత తక్షణ ప్రాముఖ్యం గల అంశాల మీద విభేదాల నన్నిటినీ కేంద్రీకరించినప్పుడు, పోరాటం మధ్యలో మిత్రులనుండి శత్రువు లను వేరుపరచడమూ, శత్రువులమీద నిర్ణయాత్మకమైన దెబ్బలు కొట్టడానికి చెడ్డ పొత్తుదార్లను గెంటివేయడమూ అవసరమయ్యేటట్లు చేసినప్పుడు, పోలికే లేనంత విస్తృత మైన ప్రమాణంలో కార్మికవర్గం అనుభవించక తప్పదు.

పందొమ్మిదవ శతాబ్ది అంతంలో రివిజనిజంమీద విప్లవ మార్క్సిజం చేసిన సిద్ధాంత పోరాటం, పెటీబూర్జువా వర్గపు ఊగిసలాటలూ, బలహీనతలూ యెన్ని వున్నప్పటికీ తన లక్ష్యంయొక్క సంపూర్ణ విజయంవైపు పురోగమిస్తున్న కార్మికవర్గంయొక్క విప్లవ మహా యుద్ధాలకు నాంది మాత్రమే.

రచన: 1908 మార్చి రెండవ అర్ధభాగంలో –
ఏప్రిల్ 3 (16)కు లోపల
ప్రచురణ: 1908, ''కార్ల్ మార్క్స్ (1818–1883)''
అన్న సంకలనంలో

# మనం పరిత్యజించే వారసత్వం యేమిటి?

1897లో "రూస్కొయె బొగాత్‌స్త్వొ,"[87] 10వ సంచికలో "గతితార్కిక భౌతిక వాదుల" గురించి మీన్‌స్కీ చేసిన వ్యాఖ్యని ప్రస్తావిస్తూ మిఖైలోవ్‌స్కీ యిలా అంటాడు: "వీళ్లు గతంతోటి వున్న యే అవిచ్ఛిన్నతనీ గుర్తించరనీ, వారసత్వాన్ని నదురూ బెదురూ లేకుండా పరిత్యజిస్తారనీ అతను (మీన్‌స్కీ) తెలుసుకోవాలి" అని (179 పేజి). అంటే, "1860–70ల నాటి వారసత్వం," వి. రోజనొవ్ 1891లో "మస్కొవ్‌స్కియె వేదొమొస్తి"[88] (178 పేజి)లో గంభీరంగా పరిత్యజించింది అన్న మాట.

"రష్యన్ శిష్యవర్గాన్ని" గురించి మిఖైలోవ్‌స్కీ ప్రకటన పచ్చి అబద్ధం. "రష్యన్ శిష్యవర్గం వారసత్వాన్ని పరిత్యజిస్తారు" అనే అన్నతానికి ఆయన ఒక్కడే, స్వతంత్ర కర్త కాదన్న సంగతి నిజమే. ఉదారవాద నరోద్నిక్[89] పత్రికల ప్రతినిధులు దాదాపు అందరూ కూడా "శిష్యవర్గం"[90]తో తలపడినప్పుడల్లా యిప్పటికి యెంతో కాలంగా యీ మాటని పునరుద్ఘాటిస్తూనే వున్నారు. మాకు గుర్తున్న మట్టుకి మిఖైలోవ్‌స్కీ "శిష్యవర్గం" తోటి తన భీషణ పోరాటాన్ని మొదలుపెట్టేసరికింకా ఆయన యీ మాటని కల్పించ లేదు, ఆయనకు ముందే యితరులు యీ పని చేశారు. తర్వాత ఆయన కూడా దీన్ని అంది పుచ్చుకోవాలను కున్నాడు. "శిష్యవర్గం" రష్యన్ సారస్వతంలో తమ అభిప్రాయాలని యెంత ముందుకు తీసుకుపోతే అంత వివరంగా యెన్నో విషయాలమీద, సిద్ధాంతపరమైన వాటిమీదా, ఆచరణపరమైన వాటిమీదా కూడా, తమ అభిప్రాయాలని ముందు వుంచారు. అంత అరుదుగా శత్రు పత్రికలలో యీ నూతన ధోరణిలోని మౌలిక విషయాలకి సంబంధించి, అంటే రష్యన్ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికరమైందన్న అభిప్రాయాన్ని గురించి, చిన్న ఉత్పత్తిదారుణ్ణి నరోద్నిక్కులు ఆదర్శీకరించడంలోని అసంబద్ధత గురించి, సామాజిక ఆలోచన, న్యాయ, రాజకీయ వ్యవస్థల ధోరణుల వివరణని రష్యన్ సమాజంలోని విభిన్న వర్గాల భౌతిక ప్రయోజనాల పరంగా చూడాలనడం గురించీ అభ్యంతరాలు చెప్పడం కనిపించింది. యీ మౌలిక విషయాలని బుట్టలో పెట్టేసి, వాటిని గురించి యేమీ మాట్లాడకుండా వుండడం అనేది అత్యుత్తమ పద్ధతి అని అనుకోవడం జరిగింది, యింకా జరుగుతోంది. కాని యీ నూతన ధోరణిని అప్రతిష్ఠ పాల్జెయ్యడానికి యెంతో కల్పనా

శక్తితో కట్టు కథల్ని అల్లారు. యీ కట్టు కథల్లో — "తుచ్ఛమైన కట్టు కథలు" — ఒకటి "రష్యన్ శిష్యవర్గం వారసత్వాన్ని పరిత్యజిస్తున్నారు" అనే నాజూకైన పదబంధం, వాళ్లు రష్యన్ సమాజపు అత్యుత్తమ, అత్యంత అభివృద్ధికర సంప్రదాయాలతో తెగతెంపులు చేసుకుంటున్నారు అనీ, ప్రజాస్వామిక సూత్రాన్ని వాళ్లు తెంపేశారనీ, వగైరా, వగైరా యింకా అలాంటి చాలా వాటిల్లో యిది వ్యక్తమవుతోందనీనీ. అలాంటి పదబంధాలని విస్తృతంగా వాడుతూ వుండటమనే సంగతి వాటి సవివరమైన పరిశీలనకీ, ఖండనకీ ఉద్యుక్తులయేటట్టు మమ్మల్ని ప్రేరేపిస్తోంది. మా వివరణ ఆధార రహితంగా వున్నట్టు కనిపించకుండా వుండేందుకు గాను, "వారసత్వాన్ని" వర్ణించేందుకు తీసుకున్న "పల్లెప్రాంత వ్యాసకర్తలు" యిద్దరి మధ్య చారిత్రక-సారస్వత సాదృశ్యంతో మొదలుపెడతాం. "వారసత్వపు" ఆర్థిక, సాంఘిక సమస్యలకే మేం పరిమితమవుతామనీ, తాత్విక, సారస్వత, సౌందర్యాత్మక, తదితర సమస్యలని పక్కకి పెట్టి వీటిని మాత్రమే పరిశీలిస్తామనీ ముందే చెప్పనివ్వండి.

# I

## "వారసత్వపు" ఒక ప్రతినిధి

ముప్పై యేళ్ల క్రితం, 1867లో, "ఒతేచెస్త్వెన్నియె జపీస్కి"[91] "మారుమూల ప్రాంతాల్లోనూ, రాజధానిలోనూ" అనే పేరుమీద స్కాల్‌దిన్ రాసిన వ్యాస పరంపరని ప్రచురించ నారంభించింది. 1867నుంచి 1869దాకా మూడేళ్ల పాటు ఆ వ్యాసాలు వచ్చాయి. 1870లో రచయిత వాటిని సేకరించి అదే పేరుతోటి ఒక పుస్తకంగా ప్రచురించాడు.* యిప్పుడు దాదాపుగా విస్మృతమైన ఆ పుస్తకాన్ని ఒకసారి చదవడం మన ప్రస్తుత చర్చనీయాంశం దృష్ట్యా, అంటే, "వారసత్వపు" ప్రతినిధులు నరోద్నిక్కులపట్లా, "రష్యన్ శిష్యవర్గం"పట్లా యే వైఖరి అవలంబించిందీ అనే దానికి సంబంధించి చాలా ఉపయోగకరంగా వుంటుంది. యీ పుస్తకం పేరు సూటిగా లేదు. యీ విషయాన్ని రచయితే గ్రహించినట్టుంది. అందుకని తన పుస్తకపు ముందుమాటలో "పల్లె ప్రాంతాల పట్ల" "రాజధాని" వైఖరి తన విషయమనీ, యింకోలా చెప్పాలంటే గ్రామీణ పరిస్థితులమీద సాంఘిక వ్యాసాల పరంపర తన పుస్తకమనీ, రాజధానిని గురించి తను ప్రత్యేకం

---

* స్కాల్‌దిన్, "మారుమూల ప్రాంతాల్లోనూ, రాజధానిలోనూ," సెంట్ పీటర్స్‌బుర్గ్, 1870 (పేజి 451). యీ కాలపు "ఒతేచెస్త్వెన్నియె జపీస్కి" కాపీలు మాకు దొరకని కారణంగా ఆ పుస్తకాన్నే ఉపయోగించాం.

ప్రస్తావించదలచలేదనీ ఆయన వివరించుకున్నాడు. లేదా ఆయన అలా చేద్దామని సంక ల్పించి వుండచ్చు కాని అది అనుకూలంగా కనిపించక పోవచ్చును: **ὡς δύναμαι — οὐ βούλομαι, ὡς δὲ βούλομαι — οὐ δύναμαι** (నేను రాయగలిగినట్టుగా రాయను, రాయాలనుకున్నట్టుగా రాయలేను) అని స్కాల్‌దిన్ తన అననుకూల్యానికి గ్రీకు రచయిత మాటలు బదులు తెచ్చుకుని అంటాడు.

స్కాల్‌దిన్ అభిప్రాయాలని సూక్ష్మంగా వివరించనివ్వండి.

మనం రైతు సంస్కరణ[92]తో మొదలుపెడదాం — ఆర్థిక, సాంఘిక సమస్యలమీద తమ సాధారణ అభిప్రాయాలని వివరించదలచుకున్నవాళ్లు, యివాల్టికి కూడా, విధిగా మొదలు పెట్టాల్సిన ఆరంభ విషయం యిదే. స్కాల్‌దిన్ పుస్తకంలో రైతు సంస్కరణకే చాలా యెక్కువ భాగం కేటాయింపు అయింది. గ్రామీణ ప్రాంతంలోని జీవితపు అన్ని పార్శ్వాలనీ వాస్తవాల విశాల ప్రాతిపదికమీదా, వివరణాత్మక పరిశీలనమీదా ఆధారపడి, సంస్కరణ తర్వాత రైతుల దారిద్ర్యభరిత స్థితినీ, వాళ్ల జీవిత పరిస్థితుల క్షీణతనీ, ఆర్థిక, చట్టపర, నిత్య జీవితాల్లో వాళ్ల బానిసత్వపు రూపాలనీ క్రమపద్ధతిగా చూపించిన వాళ్లల్లో ఆయనే బహుశా మొదటి రచయిత — ఒక్క మాటలో, ఎన్నో పరిశోధనల్లోనూ సమీక్ష ల్లోనూ అంత వివరంగా, సంపూర్ణంగా వివరించి, చూపెట్టిన దాన్నంతటినీ ప్రదర్శించిన మొదటివాడు. యివాళ యీ సత్యాలన్నీ యెంత మాత్రం కొత్తగా కనిపించవు. ఆనాడు అవి కొత్తగా వుండటమే కాదు, "సంస్కరణలోని దోషాలని" అనుకునే యీ ప్రస్తావనల వెనక దాన్ని ఖండించడమూ, భూస్వామ్య బానిసత్వానికి లోపాయికారీగా వత్తాసు యివ్వడమూ వున్నాయని భయపడిన ఉదారవాద సమాజపు అవిశ్వాసాన్ని రెచ్చగొట్టాయి. స్కాల్‌దిన్ అభిప్రాయాలు మరింత ఆసక్తికరంగా యెందుకు వుంటాయంటే, ఆయన ఆ సంస్కరణకి సమకాలికుడు (బహుశా అందులో ఆయన చెయ్యీ పడివుండచ్చు. మనకి స్కాల్‌దిన్ గురించిన చారిత్రక, సారస్వతపరమైన సాక్ష్యంగాని, ఆయన జీవితాన్ని గురించిన సమాచారం గాని అందుబాటులో లేవు). తత్ఫలితంగా ఆయన అభిప్రాయాలు ఆ కాలపు "రాజధాని," "పల్లెపట్టు"లని గురించిన ప్రత్యక్ష పరిశీలనమీద ఆధారపడినవి గాని పడకకుర్చీలో కూర్చుని పుస్తకాలు అధ్యయనం చెయ్యడం వల్ల వచ్చినవి కావు.

రైతు సంస్కరణమీద పరోద్నికుల అధికతిపి కల్పనలకి అలవాటు పడిన సమకాలీన పాఠకుడికి కొట్టవచ్చినట్టు కనిపించేదేమిటంటే యీ విషయంమీద స్కాల్‌దిన్ అభిప్రాయాల విశేష సంయమనం. ఆయన సంస్కరణని యే భ్రమలూ, ఆదర్శీకరించడమూ లేకుండా చూస్తాడు; రెండు పక్షాల మధ్య — భూస్వాములకీ, రైతులకీ మధ్య — లావాదేవీగా దాన్ని ఆయన చూస్తాడు. అప్పటి దాకా కచ్చితమైన షరతులమీద యీ రెండు పక్షాలు ఉమ్మడిగా భూమిని వినియోగించుకున్నాయి, యిప్పుడు విడగొట్టుకున్నాయి; ఆ విడగొట్టుకోవడం

యిరుపక్షాల చట్టపరమైన హోదాని మార్చింది. ఈ విభజన పద్ధతిని నిర్ణయించిన అంశమూ, యీ రెండింటిలో ఒక్కొక్క పక్షానికీ వచ్చిన వాటా పరిమాణమూనే వాళ్ల వాళ్ల ప్రయోజనాలు. యీ ప్రయోజనాలు ఆయా పక్షాల ఆకాంక్షలని నిర్ణయించాయి. అదే సమయంలో ఒక పక్షం నేరుగా సంస్కరణలతోనూ, దాన్ని అమలుజరపడంలోని అనేక సమస్యలకి సంబంధించిన ఆచరణాత్మక పరిష్కారంలోనూ ప్రత్యక్ష భాగస్వామ్యం కలిగివుండడం, మిగతా వాటితో బాటు, ఆ పక్షపు ఆధిక్య స్థాయిని నిర్ణయించింది. అదీ స్కాల్‌దిన్ సంస్కరణని అవగాహన చేసుకున్న రీతి. సమస్య తాలూకు ప్రధాన సమస్య అయిన కమతాలూ, భూమి విముక్తి సంబంధమైన చెల్లింపులమీదనే, వాటినే మళ్లీ మళ్లీ తన వ్యాసాల్లో తడుముతూ, ఆయన వివరంగా చర్చిస్తాడు. (స్కాల్‌దిన్ పుస్తకం పదకొండు వ్యాసాలుగా విభజితమై వుంది, ప్రతీదీ దేనికదే స్వయం సంపూర్ణంగా వుంటుంది. పల్లెపట్టునుంచి రాసిన ఉత్తరాల రూపంలో వుంటాయి యివి. తొలి వ్యాసం తేదీ 1866, ఆఖరి దానిది 1869.) స్కాల్‌దిన్ పుస్తకంలో ''భూమి పేద'' రైతులు అనబడే వాళ్లకు సంబంధించి సమకాలీన పాఠకుడికి కొత్తదైనది యేమీ లేదని చెప్పక్కర్లేదు. కాని, అరవయ్యవ దశకపు చివర్లో ఆయన సాక్ష్యం నూతనమైందీ, విలువైందీ కూడానూ. మేం దాన్ని పునశ్చరణ చెయ్యంగాని, ఆయన్ని – ఆయనకి అనుకూలంగానే ననుకోండి – నరోద్నిక్కులనుండి వేరుచేసే వాస్తవాల వర్ణనకి సంబంధించిన లక్షణాన్ని గురించి మాత్రమే వ్యాఖ్యానిస్తాం. స్కాల్‌దిన్ ''భూమి పేదరికం'' గురించి చెప్పడు గాని ''రైతుల కమతాలలోనుంచి విపరీతంగా తొలగించిన భూమిని'' గురించి (213 పేజి, 214 పేజి, యింకా చాలా చోట్లా; మూడవ వ్యాసపు శీర్షికను పోల్చి చూడండి) చెపుతాడు. యీ రెగ్యులేషన్‌వల్ల రూఢమైన అతి పెద్ద కమతాలు కూడా అంతకు ముందు వాళ్లకి వున్న వాటికంటే చిన్నవైనాయనీ (257వ పేజి) చెప్తాడు. సంస్కరణ* లోని యీ పార్శ్వాన్ని గురించి రైతుల విశిష్ట, విలక్షణ అభిప్రాయాలని సందర్భవశాత్తూ ఉల్లేఖిస్తూ అంటాడు. మామూలుగా యెంతో ఉదారవాదమూ, సంయమనమూ వుండి, సామాన్య దృక్పథం నిస్సందేహంగా బూర్జువాది అయిన స్కాల్‌దిన్ లాంటి రచయితకి, యీ

* ''మా భూఖండాన్ని అతను (రచయిత ఒత్తి చెప్పిందే) యెంతగా కత్తిరించాడంటే యీ విడగొట్టేసిన ఖండం లేకుండా మేం బతకలేం. మాకు అన్ని వేపులా అతని పొలాలే, పశువులని మేపుకోవడానికి మాకు తావులేదు; అంచేత నువ్వు నీ వాటాకి సొమ్మివ్వాలి, పైగా కత్తిరించిన ఖండానికి అచ్చుకోవాలి; అతను సరిగా యెంత అడిగితే అంత.'' '''దీని వల్ల మాకు ఒరిగిందేమిటి? పూర్వం లాగే మేం అంత కౌలుశిస్తూ చెల్లించాలి, పొలం కత్తిరింపు అయిపోయినా గానీ' అన్నాడు అంతకు పూర్వపు కౌలుశిస్తుదారు అయిన ఒక చదువుకున్న, అనుభవజ్ఞుడైన రైతు.''

విషయానికి సంబంధించి, ఆయన వివరణలూ, రుజువులూ యెన్నో వివరాలతో, శక్తివంతంగా, ఆ మాటకొస్తే నిశితంగా కూడా వున్నాయి. స్కాల్‌దిన్ లాంటి రచయిత యీ విషయాన్ని గురించి యింతగా వక్కాణించి మాట్లాడుతున్నాడంటే అసలు యీ విషయం పరమ స్పష్టంగా వుండివుండాలి. చెల్లింపుల అతి యెక్కువ భారాన్ని గురించి కూడా స్కాల్‌దిన్ తీవ్రంగా, యెన్నో వివరాలతోటి, తన వాదాన్ని యెన్నో వాస్తవాల ఆధారంతో సమర్థిస్తూ చెప్తాడు. మూడవ వ్యాసపు (1867) ఒక ఉపశీర్షికలో వున్నట్టు "అమితమైన పన్నులు వాళ్ల" (రైతుల) "దారిద్ర్యానికి ప్రధాన కారణం" అని చెపుతూ, రైతులకు భూమిమీదనుంచి వచ్చే ఆదాయంకంటే పన్నులు యెక్కువగా వున్నాయని స్కాల్‌దిన్ చూపిస్తూ, "పన్నుల విధింపు కమీషన్ పరిశీలనల"నుంచి రష్యాలో పైవర్గంమీదా, కింది వర్గంమీదా పడిన పన్నులకి సంబంధించిన సమాచారాన్ని ఉల్లేఖిస్తాడు. 76% పన్నులు కింది వర్గాలమీద పడుతున్నాయనీ, 17% పైవర్గాలమీద పడుతున్నాయనీ దానివల్ల తెలుస్తోంది. అదే పశ్చిమ యూరప్‌లో అయితే ప్రతీచోటా యీ అనుపాతం పోలికే లేకుండా దిగువ వర్గాలకి అనుకూలంగా వుంది. సప్తమ వ్యాస (1868) ఉపశీర్షిక "మితిమీరిన ద్రవ్య రుణం రైతులలో దారిద్ర్యానికి గల కారణాల్లో ఒకటి" అని. నూతన జీవిత పరిస్థితులు తక్షణం రైతునుంచి డబ్బు, డబ్బు, యింకా యెక్కువ డబ్బుని అపేక్షించాయనీ, భూస్వామ్య దాస్య వ్యవస్థని రద్దుచేసిందానికి కూడా భూస్వాములకి నష్టపరిహారం ముట్టడం అనేది (252 పేజి) రెగ్యులేషన్ ఒక సూత్రం చేసిందనీ, కౌలుశిస్తు మొత్తం "భూస్వాములూ, వారి జమీ ఉద్యోగులూ, గ్రామ పెద్దలూ, ప్రమాణ పూర్తిగా సమకూర్చిన సమాచారంమీద, అంటే నమ్మడానికి పిసరు కూడా యోగ్యం కాని పరమ అహేతుక దత్తాంశం" మీద ఆధారపడిందనీ (255 పేజి), తత్ఫలితంగా కమిషన్లు మదింపు చేసిన సగటు శిస్తులు ప్రస్తుతపు సగటు శిస్తులకంటే యెక్కువ వున్నాయనీ రచయిత రుజువు చేస్తాడు. "రైతులు భరించే పన్నుల భారానికి తోడు వాళ్లు తరతరాలుగా ఉపయోగించుకున్న భూములు పోవడం కూడానూ" (258 పేజి). "శిస్తులని పెట్టుబడి చేసిన మొత్తంమీద ఆధారపడి భూమి విముక్తి ధరని అంచనా వెయ్యకుండా, విముక్తం అయే సమయానికి వుండే వాస్తవ విలువమీద చేసి వున్నట్టయితే విముక్తి ధరని సులభంగా తీర్చివెయ్యగలగడం వుండేది. ప్రభుత్వ సహాయం గాని, రుణ పత్రాల జారీ గాని అవసరమే వుండేది కాదు" (264). "రైతుల పరిస్థితుల్ని సులభతరం చెయ్యాలనీ, వాళ్ల జీవన పరిస్థితులని మెరుగుపరిచే పని పూర్తిచెయ్యాలనీ ఫిబ్రవరి 19 నాటి రెగ్యులేషన్ ఉద్దేశించిన విముక్తం వాస్తవానికి వాళ్లని మరింత ప్రయాస భరిత పరిస్థితుల్లో పడేసింది" (269). వాటంతటవి ఆసక్తికరమైనవి కాకపోయినా, ఒక మేరకి కాలం చెల్లినవే అయినా, గ్రామ కమ్యూన్‌కి వ్యతిరేకి అయిన ఒక రచయిత, అనేక సమస్యలమీద మాన్‌చెస్టర్ ధోరణి[93] సిసలైన అనుచరుడి అభిప్రాయాల లాంటి

అభిప్రాయాలున్న రచయిత రైతుల ప్రయోజనాలని యెంత శక్తివంతంగా సమర్థిస్తున్నాడో చూపించడానికే యీ భాగాలని ఉదాహరించడం. దాదాపు, అన్ని నరోదిజపు ప్రగతి నిరోధకేతర, ఉపయోగకర సూత్రాలూ యీ (మాంచెస్టరు ధోరణి అనుయాయుడి) అభిప్రాయాలతో పూర్తిగా యేకీభవిస్తూ వుండటం అనేది గమనించడం చాలా జ్ఞానదాయకంగా వుంటుంది. సంస్కరణ గురించి స్కాల్‌దిన్ అభిప్రాయం అది కావడంవల్ల, ఆయన నరోద్నికుల్లు చేసినట్టుగా సంస్కరణ ప్రజల ఉత్పత్తిని అనుమతించిందనీ, పశ్చిమ యూరపియన్ రైతు సంస్కరణలకంటే మెరుగ్గా వుందనీ, రష్యాని tabula rasa* చేసిందనీ యింకా యింకా అలాగనీ చెపుతూ, దాన్ని భావావేగ దౌర్బల్యంతో యింకా చేస్తున్నట్టుగా, ఆదర్శవంతం చెయ్యలేకపోయాడు. స్కాల్‌దిన్ అలాంటిదేమీ చెప్పలేదు, చెప్పలేదు; పైపెచ్చు మన దేశంలో రైతు సంస్కరణ, రైతులకు పశ్చిమ దేశాల్లోని రైతులకి కంటే, తక్కువ అనుకూలమనీ, తక్కువ ఉపయోగకరమనీ తేటతెల్లంగా అన్నాడు. ''మన దేశంలో విముక్తి తాలూకు ఉపయోగకర పరిణామాలు యీ శతాబ్దపు మొదటి పాదంలో ప్రష్యాలోనో, లేక శాక్సనీలోనో వెల్లడైనట్టుగా స్థిరమైన వేగంతో యెందుకు వెల్లడవడం లేదు అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే యీ సమస్యని తేటతెల్లంగా పెట్టడ''మవుతుందని ఆయన రాశాడు (221). ''ప్రష్యాలోనూ, మొత్తం జర్మనీ అంతటానూ రైతులు విముక్తి కోసం తమ వాటా చెల్లించలేదు, అది యెప్పటినుంచో చట్టసమ్మతంగా వాళ్ల ఆస్తిగానే వుండింది. కాని భూస్వాములకి విధిగా చెయ్యాల్సిన సేవలనుంచి విముక్తికి గాను వాళ్లు డబ్బు చెల్లించారు'' (272).

స్కాల్‌దిన్ దర్శిస్తున్నట్టుగా సంస్కరణ తాలూకు ఆర్థిక పార్శ్వంనుంచి న్యాయపరమైన పార్శ్వానికి వెడదాం. సమష్టి బాధ్యత[94]కీ, పాస్‌పోర్టు పద్ధతికీ, తన సభ్యులమీద రైతు ''కమ్యూన్''కి (అలాగే బస్తీ కమ్యూన్) వున్న పితృస్వామిక అధికారానికీ స్కాల్‌దిన్ బద్ధ వ్యతిరేకి. తన మూడవ వ్యాసంలో (1867) సమష్టి బాధ్యత రద్దు చెయ్యడం గురించీ, ప్రతి వ్యక్తిమీదా పడే పన్ను గురించీ, పాస్‌పోర్టు పద్ధతి రద్దు గురించీ, సమతూకం గల ఆస్తి పన్ను గురించీ, పాస్‌పోర్టుల స్థానే ఉచితమైన శాశ్వత పాస్‌పోర్టులని ప్రవేశపెట్టడం గురించీ ఆయన పట్టుదలగా వాదిస్తాడు. ''ఆంతరిక పాస్‌పోర్టులమీద పన్ను మరే నాగరిక దేశంలోనూ లేదు'' (109). యీ పన్నుని 1897లో మాత్రమే రద్దుచేశారని మనకు తెలుసు. నాలుగో వ్యాసపు శీర్షికలో యిలా వుంది: ''పాస్‌పోర్టులను పంపించడంలోనూ, గైరుహాజరు చెల్లింపుదారులమీద పన్నులు వెయ్యడంలోనూ గ్రామ కమ్యూన్, పట్టణ దూమల నిరంకుశ చర్యలు...'' ''సమష్టి బాధ్యత అనేది కష్టించి పనిచేసే సమర్థవంతు

* ఖాళీ పలకలాగా. — సం.

లైన రైతులమీద సోమరిపోతులు, దుబారాగాళ్లు మోయవలసిన భారం'' (126). రైతాంగంలో విచ్ఛిత్తిమూలంగా అది అప్పటికే కనిపిస్తోంది, వాళ్లు నెగ్గుకు రావడానికీ, మునిగి పోవడానికీ ఆయా వ్యక్తుల వ్యక్తిగత లక్షణానికే స్కాల్‌దిన్ మొగ్గు చూపిస్తాడు. సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో నివసించే రైతులు పాస్‌పోర్టులను పొందడంలో గాని, పొడిగించుకోవడంలో గాని పడే కష్టాల్ని వివరంగా వర్ణిస్తాడు. ''అమ్మయ్య, యీ భూమిలేని రైతుల తొంబంతా పట్టణాల్లో రిజిస్టరు అయి చరాస్తిలేని పట్టణవాసుల సంఖ్యని పెంచలేదు'' (130) అనే వాళ్లని ఖండిస్తాడు. ''యీ అనాగరిక సమష్టి బాధ్యత''... (131)... ''అలాంటి స్థితిలో వున్న జనాన్ని స్వేచ్ఛాయుతులైన పౌరులనవచ్చునా? వాళ్లు పూర్వపు glebae adscripti* కారా?'' (132). రైతు సంస్కరణని నిందించడం జరిగింది. ''రైతుని భూస్వామి బంధనంనుంచి విముక్తి చేసిన చట్టం, అతన్ని కమ్యూన్ బంధంనుంచీ, రిజిస్ట్రేషన్ బంధంనుంచీ విముక్తి చేసేందుకు యే మార్గమూ రూపొందించలేదంటే ఆ దోషం రైతు సంస్కరణదా?... తన నివాస స్థలం గురించి గాని, వృత్తి విధానం గురించి గాని నిర్ణయించుకునే స్వేచ్ఛ రైతుకి లేకపోతే పౌర స్వేచ్ఛ లక్షణాలు యెక్కడ వున్నట్టు?'' (132). స్కాల్‌దిన్ మన రైతుని ''స్థిరపడ్డ శ్రామికుడు'' (231)** అని యెంతో సరిగానూ, సముచితంగానూ పిలుస్తాడు. ఎనిమిదవ వ్యాసపు (1868) శీర్షికలో యిలా వుంది: ''రైతులు తమ కమ్యూన్‌లకీ, కమతాలకీ కట్టుబడివుండిపోవడం వాళ్ల జీవన పరిస్థితుల మెరుగుదలని నిరోధిస్తుంది.... యితర వృత్తుల అభివృద్ధికి అదొక అవరోధం.'' ''రైతుల అజ్ఞానానికీ, ఎప్పుడూ పెరుగుతూ వుండే పన్నుల భారానికీ తోడుగా, రైతు శ్రమ అభివృద్ధినీ, తత్పర్యవసానంగా రైతు సంపద్వంతం కాకుండా కుంటుపరిచే కారణాల్లో ఒకటి

---

* రోమన్ సామ్రాజ్యంలో రైతులు కొన్ని కమతాలకి కట్టుబడాపోయి వుండేవాళ్లు. అవి వ్యవసాయంలో యెంత నష్టదాయకమైనా వాళ్లు వాటిని వదిలిపెట్టడానికి లేదు. – సం.

** యీ నిర్వచనం (శ్రామికుడు)లోని మొదటి భాగాన్నే గాక, రెండవ భాగంలోని సామంజస్యాన్ని స్కాల్‌దిన్ చాలా ఆధారాలతో చూపిస్తాడు. ఆయన తన వ్యాసాల్లో రైతుల పరాధీన హోదానీ, వాళ్ల బీదరికాన్నీ వర్ణించడానికీ, వ్యవసాయ కార్మికుని దుర్భర స్థితికీ, ''1868 నాటి కరువుని వివరించడానికీ'' (అయిదవ వ్యాసం శీర్షిక), యింకా రైతు బానిసత్వపు, అవమానాలా అనేక రూపాలకీ యెక్కువ స్థలం కేటాయిస్తాడు. తొంభైయవ దశకంలో వున్నట్టుగానే, అరవైయవ దశకంలో కూడా కరువుని కప్పిపెట్టి వెయ్యాలనీ, కరువే లేదనీ చెప్ప ప్రయత్నించిన వాళ్లున్నారు. స్కాల్‌దిన్ వాళ్లను తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. యీ విషయం గురించిన వ్యాస భాగాలను సవివరంగా ఉల్లేఖించడం అనవసరం అవుతుంది.

వాళ్ళు తమ కమ్యూన్‌లకీ, కమతాలకీ బంధితులై వుండిపోవడం శ్రామికుడు ఒకే స్థలానికి బందీ అయిపోవడం, ఛేదించుకోలేని శృంఖలాలతో గ్రామ కమ్యూన్ సంకెళ్ళు వెయ్యడం యివే శ్రమ, సొంత చొరవ చిన్న భూకమతం అభివృద్ధి చెందకుండా వుండేందుకు యెంతో ఎక్కువ అననుకూల పరిస్థితి" (284). "తమ కమతాలకీ, కమ్యూన్‌లకీ బంధితులై పోయి, తమ శ్రమ యెక్కడ యెక్కువ ఉత్పాదకంగా తమకి యెక్కువ ఉపయోగకరంగా వుంటుఁదో అక్కడ వినియోగపరచుకోలేక, రైతులు తమ బానిసత్వంనుండి బయటపడి చేరుకున్న ఉక్కిరిబిక్కిరి, మందమాదిరి, అనుత్పాదక జీవిత విధానంలో ఘనీభవించిపోయి నట్లున్నారు" (285). తత్ఫలితంగా స్కాల్‌దిన్ రైతు జీవితపు యీ పార్శ్వాల్ని పూర్తిగా బూర్జువా దృక్పథంనుంచే చూస్తాడు. కాని అలా చేసినప్పటికీ కూడా (లేకపోతే అందువల్లనేమో కూడా) రైతులు బంధితులై పోవడంవల్ల వాళ్లకిగా వాళ్లకీ, సకల సాంఘికాభివృద్ధికీ జరిగిన నష్టాన్ని గురించిన ఆయన అంచనా చాలా కచ్చితంగా వుంది. అది రైతాంగంలోని అట్టడుగు విభాగాలకి, గ్రామీణ శ్రామికవర్గానికి ప్రత్యేక నష్టాన్ని (యీ విషయాన్ని మనం కలుపుకోవచ్చు) కలిగిస్తుంది. స్కాల్‌దిన్ చాలా సూటిగా అంటాడు: "రైతులు భూమి లేకుండా వుండరాదని చట్టానికి గల బాధ అభినందనీయం. కాని ఆ విషయానికి సంబంధించి రైతుల బాధ యే శాసనకర్త బాధకంటే యెక్కువ అసదృశంగా వుంటుం దన్న విషయాన్ని మర్చిపోకూడదు" (286). "రైతు కమతానికీ, కమ్యూన్‌కీ బంధి తుడనేదే కాకుండా, సమష్టి బాధ్యతవల్లా, పాస్‌పోర్టుల విధానంవల్లా యెక్కడేనా యింత సంపాదించుకోవడానికి తాత్కాలికంగా పోవడానికూడా యెన్నో వ్యయ ప్రయాసలకి గురవ వలసివస్తుంది" (298). "నా అభిప్రాయంలో, భూమిని వదులుకునే అవకాశాలు సులభతరం చేస్తే, చాలా మంది రైతులకి వాళ్ల ఇబ్బందికరమైన పరిస్థితినుంచి బయటపడే మార్గం లభిస్తుంది" (294). గ్రామ కమ్యూన్[95]ని శాశ్వతం చెయ్యాలనీ, కమతాలని అన్యాక్రాంతం కాకుండా వుండేటట్లు చెయ్యాలనీ వగైరా వగైరా లాంటి పూర్తి భిన్నమైన దిశకి మొగ్గే నరోద్నిక్కు పథకాలకి పరమ విరుద్ధంగా వుండే కోరికని యిక్కడ స్కాల్‌దిన్ వ్యక్తం చేస్తున్నాడు. స్కాల్‌దిన్ చెప్పింది పూర్తిగా సబబు అని చూపించడానికి తగ్గ సాక్ష్యం దరిమిలా కనిపిస్తుంది. రైతు భూమికి కట్టుబడి వుండిపోతాడనేది, రైతు కమ్యూన్ ఒక పరిమిత అంతస్తు కావడం అనేది "స్థిరశ్రామికుని" పరమ నికృష్టమైన దాస్యంనుంచీ, పరాధీనతనుంచీ, లేదా అతని కూలి జీవన ప్రమాణాలు అతి అధోస్థాయికి పడిపోవడంనుంచీ యే మేరకీ కాపాడ లేకుండా పోతూ, గ్రామీణ శ్రామికవర్గపు స్థితిని మరింత అధ్వాన్నం చేసి, దేశపు ఆర్థికాభివృద్ధిని కుంటుపరుస్తుంది.

పైన ఉల్లేఖించిన భాగాలనుంచి స్కాల్‌దిన్ గ్రామ కమ్యూన్‌కి విరోధి అని పాఠ కుడు యీపాటికి గ్రహించి వుండాలి. ఆయన **సొంత ఆస్తినీ, యత్నాన్నీ వగైరాలనీ** అమో

దిస్తున్న దృష్ట్యా కమ్యూన్‌నీ, భూమి పునర్విభజననీ వ్యతిరేకిస్తున్నాడు (142 పేజి, ఆ తరువాతి పేజీలు). గ్రామ కమ్యూన్ సమర్థకులకి "సామాన్య న్యాయం" కాలం చెల్లిం దని బదులు చెప్తాడు. "అన్ని దేశాల్లోనూ గ్రామీణ వాసులకి నాగరిక వాతావరణంతో సం బంధం కలగగానే వాళ్ల సామాన్య న్యాయపు ప్రాక్తన పరిశుద్ధత పంకిలమై ఒక మెట్టు దిగింది. మన దేశంలోనూ అదే కనిపిస్తుంది: గ్రామ కమ్యూన్ అధికారం క్రమేపీ గ్రామీణ పీడకుల అధికారంగా, గ్రామీణ కరణాల అధికారంగా తయారై రైతు అనేవాణ్ణి కాపాడ్డం పోయి దాని బదులు అతనిమీద పెద్ద భారం అయి కూర్చుంది" (143) – ముప్పై యేళ్ల అనవరత దాఖలాలతో రూఢి అయిన చాలా సత్యపూరితమైన మాట. స్కాల్‌దిన్ అభిప్రాయంలో "పితృస్వామిక కుటుంబం, భూమిపై ఉమ్మడి యాజమాన్యం, సామాన్య న్యాయం" అనే వాటిని చరిత్ర తిరుగులేకుండా ఖండించింది. "మనకి యీ గత కాలపు మాననీయ స్మృతి చిహ్నాల్ని శాశ్వతంగా వదిల పర్చాలని చూసేవాళ్లు, వాస్తవాలలోకి చొచ్చుకు పోయి పరిశీలన చెయ్యడం కంటేనూ, చరిత్ర అప్రతిహత పురోగతిని అందుకోవడం కంటేనూ యెక్కువగా ఒక భావంతో సమ్మోహితులై పోగలరని తెలియజేసుకుంటున్నారు" (162) అంటూ యీ కచ్చితమైన మాటలకు మాంచెస్టరు ధోరణి వేడి గంభీరోపన్యా సాలని స్కాల్‌దిన్ జతచేస్తాడు. "సామూహిక భూమి యాజమాన్యం ప్రతి రైతునీ మొత్తం సమాజానికి బానిసగా అణిగి వుండే స్థితిలో పెడుతుంది" (222) అంటాడు మరో చోట. అంచేత శుద్ధ బూర్జువా దృక్పథంనుంచి గ్రామ కమ్యూన్‌పట్ల స్కాల్‌దిన్‌కి వున్న బాహాటమైన వ్యతిరేకత, రైతుల ప్రయోజనాలని అతను స్థిరంగా సమర్థించడంతో మిళిత మైంది. గ్రామ కమ్యూన్‌కి వ్యతిరేకమైనా స్కాల్‌దిన్ బలవంతంగా యింకో దాన్ని, యివ్వాళ గ్రామ కమ్యూన్‌ని వ్యతిరేకించేవాళ్లు కల్పించే లాంటి వాటితో సామూహిక భూమి యాజమాన్య పద్ధతిని రుద్దాలనే తెలివి తక్కువ పథకాలని ముందుకు పెట్టడు. యివాళ గ్రామ కమ్యూన్‌ని వ్యతిరేకించేవాళ్లు రైతు జీవితంతో దౌర్జన్యంగా జోక్యం చేసుకో వడానికీ, రైతు ప్రయోజనాలు వినా మరే కోణంనుంచేనా గ్రామ కమ్యూన్‌ని దుయ్యబట్ట డానికీ అనుకూలురు. తద్వ్యతిరేకంగా స్కాల్‌దిన్ "సామూహిక భూమి హక్కుని బలవం తంగా రద్దుచెయ్యాలని" (144) విశ్వసించేవాళ్లతో వర్గీకరించబడడాన్ని తీవ్రంగా నిర సిస్తాడు. "ఫిబ్రవరి 19 నాటి రెగ్యులేషన్ సామూహిక హక్కునుంచి కుటుంబ హక్కుకి పోవడాన్ని యెంతో యుక్తిగా రైతులకే వదిలేసింది. నిజంగా అలా పోవడానికి తగ్గ కాలాన్ని రైతులకంటే మరెవళ్లూ సరిగ్గా నిర్ణయించలేరు." తత్ఫలితంగా ఆర్థికాభివృద్ధిని కుంటు పరుస్తుంది కాబట్టీ, రైతుని కమ్యూన్‌నుంచి ఉపసంహరించుకోవడానికీ భూమిని వదలు కోడానికీ లేకుండా నిరోధిస్తుంది కాబట్టీ, అంటే యివాళ "రష్యన్ శిష్యవర్గం" యే కార ణంగానైతే దాన్ని వ్యతిరేకిస్తున్నారో సరిగ్గా ఆ కారణంమీదనే స్కాల్‌దిన్ గ్రామ కమ్యూ

న్‌ని వ్యతిరేకించాడు. యీ విరోధానికి భూస్వాముల స్వార్థపర ప్రయోజనాలని సమర్థించ డంతో గాని, భూదాస్యపు భావంతోటీ, అవశేషాలతోటీ గాని, రైతుల జీవితాలతో జోక్యం కలిగించుకోవడమనే దాన్ని సమర్థించుకోవడంతో గాని సంబంధం యేదీ లేదు. యీ తేడాని గుర్తించడం చాలా ముఖ్యం. యేమంటే "మస్కోవ్‌స్కియె వేదొమొస్తి" పక్షంలోనూ, అలాంటి వాళ్లల్లోనూ మాత్రమే గ్రామ కమ్యూన్‌కి శత్రువులైన వాళ్లని చూడడానికి అలవాటుపడిన యీనాటి నరోద్నిక్కులు గ్రామ కమ్యూన్‌కి మరే యితరమైన వైరుధ్యాన్ని చూడనట్టు యెంతో యిష్టంగా నటిస్తున్నారు.

రైతుల దుర్భర దశకి కారణాలు అన్నీ కూడా భూదాస్య వ్యవస్థ అవశేషాలని స్కాల్‌దిన్ అభిప్రాయం. 1868 నాటి కరువుని గురించి చెబుతూ, దాన్ని రైతులలో విశృంఖలతకీ, భూస్వాముల సంరక్షకత్వపు రద్దుకీ యింకా అలాంటి వాటికీ ఆపాదిస్తూ, భూ బానిస యజమానులు విషపూరిత సంతోషంతో యెత్తి చూపించారని ఆయన అన్నాడు. స్కాల్‌దిన్ యీ అభిప్రాయాలని ఉధృతంగా ఖండిస్తాడు. "రైతుల దారిద్ర్యానికి కారణాలు భూస్వామ్య దాస్యంనుంచి సంక్రమించినవి (212) తప్ప దాని రద్దు ఫలితం కాదు; మన రైతాంగంలో అధిక భాగాన్ని శ్రామికవర్గ స్థాయిలో వుండేటట్టు చేసే సామాన్య కారణాలు అవి" అంటాడు ఆయన, అని, సంస్కరణ గురించి పైన ఉల్లేఖించిన అభిప్రాయాలని పునశ్చరణ చేస్తాడు. భూమిని కుటుంబంలో విభజించుకోవడాన్ని దుయ్యబట్టడం అసంబద్ధం: "విభజనలు తాత్కాలికంగా రైతుల భౌతిక ప్రయోజనాలకి నష్టం కలిగించినా అవి వాళ్ల వ్యక్తిగత స్వాతంత్ర్యాన్నీ రైతు కుటుంబపు నైతిక గౌరవాన్నీ, నాగరిక అభివృద్ధి యేవి లేకపోతే సాధ్యం కాదో ఆ మానవ వరాలనీ కాపాడతాయి" (217). స్కాల్‌దిన్ భూ విభజనలకి వ్యతిరేకంగా ప్రచారానికి అసలైన కారణాలని సరిగ్గా చూపిస్తాడు: "రైతు దారిద్ర్యపు అనేక కారణాల సకల పర్యవసానాలకీ (యీ దారిద్ర్యాన్ని గుర్తించడానికి భూస్వాములు యిష్టపడరు) తాగుబోతుతనంతో పాటుగా, విభజనలదే దోషమంటూ చాలా మంది భూస్వాములు యీ విభజనల వల్ల కలిగిన చెడుని కొండంతలు చేసి చెబుతారు" (218). యివాళ రైతుల దారిద్ర్యాన్ని గురించి యెక్కువ రాసేస్తున్నారనీ, పూర్వం అలా వుండేది కాదనీ, అంచేత రైతుల పరిస్థితులు క్షీణించివుంటాయనీ అనే వాళ్లకి స్కాల్‌దిన్ యిలా జవాబు చెబుతాడు: "రైతుల ప్రస్తుత స్థితిని, వాళ్ల పూర్వపు స్థితితో పోల్చి, భూస్వాముల పెత్తనంనుంచి రైతుల విమోచన ఫలితాలని గురించి ఒక అభిప్రాయాన్ని యేర్పాటు చేసుకోవడానికి, భూస్వామ్య దాస్య వ్యవస్థ యింకా వున్నప్పుడే రైతుల కమతాలని యిప్పుడు కత్తిరించినట్టుగా కత్తిరించి వేసి, విమోచన నాటినుంచీ రైతులమీద వెట్టి చాకిరీని విధించి, అప్పుడు రైతులు అలాంటి పరిస్థితుల్ని యెలా భరించేవాళ్లో చూడడం అవసరం అవుతుంది" (219). స్కాల్‌దిన్ అభిప్రాయాల్లో మహత్తరమైన విశిష్ట,

ప్రాముఖ్య లక్షణం యేమిటంటే అతను రైతుల పరిస్థితి క్షీణించడానికి భూస్వామ్య దాస్య అవశేషాలకీ, వెట్టిచాకిరీ, వస్తురూపంలో కౌలుశిస్తు, ఖండిత భూమి, రైతుల హక్కుల రాహిత్యం, చలన రాహిత్యం లాంటి దాస్య వారసత్వానికే అన్ని కారణాలనీ కుది స్తాడు. నూతన సామాజిక ఆర్థిక సంబంధాల నిర్మాణంలోనే, సంస్కరణానంతర ఆర్థిక నిర్మాణంలోనే రైతుల దారిద్ర్యానికి కారణాలు వుండవచ్చున్నదాన్ని స్కాల్‌దిన్ చూడక పోవడమే కాదు, యీ భూస్వామ్య దాస్య అవశేషాలన్నింటినీ సమూలంగా రద్దుచెయ్యడం విశ్వ శ్రేయోదాయక నూతన యుగాన్ని ప్రవేశపెడుతుందని గాఢంగా నమ్మి అలాంటి ఆలోచ ననే దారికి రానివ్వడు. నిజానికి అతని అభిప్రాయాలు వ్యతిరేకమైనవి కూడానూ: రైతాంగపు నిర్నిబంధ అభివృద్ధికి గల అవరోధాలని తొలగించండి, భూస్వామ్య దాస్య వ్యవస్థ వల్ల సంక్ర మించిన సంకెళ్లని ఛేదించండి, అప్పుడు అంతా కూడా యీ మహనీయ ప్రపంచంలో మానవీయంగా వుంటుంది. స్కాల్‌దిన్ రాస్తాడు: "యిక్కడ" (అంటే రైతాంగానికి సంబంధించి) "ప్రభుత్వం అనుసరించగల విధానం ఒకటే వుంది: మన రైతులని వాళ్ల ప్రస్తుత స్తబ్ధతకీ, దారిద్ర్యానికీ కుంచించి వేసి, వాళ్లని కాళ్లమీద లేచినిలబడ లేకుండా చేస్తున్న కారణాలని క్రమక్రమంగా, స్థిరంగా, తొలగించడం" (244, కింది గీతలు నావి). "కమ్యూన్"ని (అంటే రైతులని గ్రామ కమ్యూన్‌లకీ, కమతాలకీ బంధించి వేసేదాన్ని) అది లేకుండా పోయినట్లయితే, "ఒక గ్రామీణ శ్రామికవర్గం ఆవిర్భవిస్తుందన్న" నెపంతోటి సమర్థించే వాళ్లకి స్కాల్‌దిన్ యిచ్చిన సమాధానం యీ సందర్భంగా చాలా విశిష్టంగా వుంది. స్కాల్‌దిన్ రాస్తాడు: "సాగుచేసే నాథుడు లేక మన దేశంలో యెంత విస్తారమైన భూప్రాంతాలు వూరికే పడివున్నాయో జ్ఞాపకం చేసుకుంటే యీ అభ్యంతరం కుప్పకూలి పోతుంది. మానవ శ్రమ శక్తి సహజ పంపకాన్ని చట్టం అడ్డగించకపోయినట్లయితే, రష్యాలో నిజమైన శ్రామికులుగా వుండే మనుషులు వృత్తి భిక్షుకులు, లేదా పరమ భ్రష్టమైన దుర్మా ర్గులు, తాగుబోతులు" (144) – భూస్వామ్య దాస్యాన్నీ, దాని సకల అవశేషాలనీ రద్దుచేస్తే యిలమీద సకలా సంపదలూ తులతూగుతాయనే పద్దెనిమిదవ శతాబ్దపు ఆర్థికవేత్తలా, "వికా సదాయకులా"[96] విలక్షణ అభిప్రాయం యిది. నరోద్నిక్ సందేహం లేకుండా స్కాల్‌దిన్‌ని యేవగింపుగా, తూష్ణీం భావంతో చూసి అతను వట్టి బూర్జువా అంటాడు. అవును, స్కాల్‌దిన్ బూర్జువాయే. కాని పెటీబూర్జువా భావజాలంతోటే, మొత్తంమీద అనేక విషయాల్లో ప్రగతివ్యతిరేకమైన దానితోటే నరోద్నిక్కులు తప్పించిన అభ్యుదయకర బూర్జువా భావజాలపు ప్రతినిధి. మరి యీ "బూర్జువా"కి సామాన్యంగా సామాజికాభివృద్ధి అవసరాలతోటి సరిపడివుండిన, యిప్పటికీ సరిపడుతూ వున్న, రైతుల ఆచరణాత్మక

వాస్తవ ప్రయోజనాలని యెలా సమర్థించాలో అన్న దాన్ని గురించి నరోద్నిక్కులకంటే మంచి అవగాహన వుంది!*

స్కాల్‌దిన్ అభిప్రాయాల వివరణని పూర్తి చేసేందుకు కొన్ని విషయాలు చెప్పని వ్వండి. అతను సాంఘిక అంతస్తుల వ్యవస్థకి వ్యతిరేకి, వాటి అన్నిటికీ ఒకే న్యాయ స్థానాన్ని కోరతాడు, సామాజిక అంతస్తుల ప్రాతిపదికమీద వోలోస్త్ [తాలూకా] అధికారుల్ని ఏర్పాటు చేయడంకూడదనే అభిప్రాయంతోటి "సిద్ధాంత రీత్యా" సానుభూతి చూపిస్తాడు, ప్రజా విద్యను ప్రత్యేకించి, సార్వత్రిక విద్యను, హృదయపూర్వకంగా సమర్థిస్తాడు. స్థానిక స్వపరిపాలనా సంస్థలకీ, జేమ్‌స్త్వో[97] సంస్థలకీ అనుకూలమనీ, భూమిని కొనుక్కోవాలనే రైతు కోరిక బలీయంగా వుంది కాబట్టి భూ రుణాలు, ముఖ్యంగా చిన్నవి, విస్తారంగా అందుబాటులో వుండాలని విశ్వసిస్తాడు. ఆయన యిక్కడ కూడా మాంచెస్టరు ధోరణివాడి లాగా వుంటాడు: ఉదాహరణకి జేమ్‌స్త్వో బ్యాంకులు, మునిసిపల్ బ్యాంకులు, "పితృస్వామిక లేదా ఆదిమ బాంకుల రూపం," వాటికంటే "యెంతో అధికమైన" ప్రైవేట్ బ్యాంకులు వాటి స్థానంలో రావాలనీ, "మన రాష్ట్రాల్లో పారిశ్రామిక వాణిజ్య కార్యకలాపాల ప్రేరణ ద్వారా" యింకా అలాంటి చర్యల ద్వారా, భూమికి విలువ కలగవచ్చుననీ, ఆయన అంటాడు.

యిక ముగింపుగా. దృక్పథంలో స్కాల్‌దిన్‌ని బూర్జువా "వికాసదాయకుడన"వచ్చు, ఆయన అభిప్రాయాలు పద్దెనిమిదవ శతాబ్దపు ఆర్థికవేత్తల అభిప్రాయాలతో (రష్యన్ పరిస్థితుల పట్టకంలో తదనుగుణంగానే పరావర్తనం చెందినట్టేననుకోండి) సమానం. ఆయన అరవైయవ దశకపు "వారసత్వం"యొక్క సామాన్య "వికాసపు" లక్షణాన్ని యెంతో స్పష్టంగా ప్రతిబింబించాడు. అరవయ్యవ దశకపు పశ్చిమ యూరపియన్ వికాసదాయకుల లాగా, అధిక సంఖ్యాక సాహిత్య ప్రతినిధుల లాగా స్కాల్‌దిన్ భూస్వామ్య దాస్యంపట్లా, దాని సకల ఆర్థిక, సాంఘిక, న్యాయ ఉత్పాదితాలపట్లా తీవ్రమైన విరోధంతో వుంటాడు. అది వికాసదాయకుడి మొదటి విశిష్ట లక్షణం. రష్యా వికాసదాయకులకు ఉమ్మడిగా వున్న రెండో విశిష్ట లక్షణం విద్యనీ, స్వయంపాలననీ, స్వేచ్ఛనీ, జీవితంలో యూరపియన్ పద్ధతుల్నీ, సాధారణంగా రష్యా సర్వతోముఖ యూరపీయకరణనీ ఉత్సాహంగా ప్రోద్బలం చెయ్య

* యిటుదటు చెప్పినా, నరోద్నిక్కులు ప్రచారం చేస్తున్న అన్ని అభ్యుదయకర ఆచరణాత్మక చర్యలూ కూడా, వస్తుతః పూర్తిగా బూర్జువావి, అంటే అవి పెట్టుబడిదారీ విధానాభివృద్ధికి తప్ప మరి దేనికీ తోడ్పడవు. రైతు కమత కాల పరిమితిని పెంచడం, పన్ను తగ్గించడం, పునరావాస కల్పన, రుణాలు, సాంకేతికాభివృద్ధి, మార్కెట్ యేర్పాట్లు, అలాంటి చర్యలు "ప్రజల ఉత్పత్తి" అనే దాని ప్రయోజనాలకి అనుకూలిస్తాయనే సిద్ధాంతాన్ని పెటీబూర్జువాలు మాత్రమే కల్పించగలరు.

డం. యిక వికాసదాయకుడి **మూడవ** విశిష్ట లక్షణం ప్రజా బాహుళ్యపు ప్రయోజనాలని, ముఖ్యంగా రైతుల (వికాసదాయకుల రోజుల్లో పూర్తిగా విముక్తం కాని, లేదా విముక్తం అయే క్రమంలో వున్నటువంటి వీళ్ల) ప్రయోజనాలని సమర్థించడం, భూస్వామ్య దాస్యాన్నీ, దాని అవశేషాలనీ రద్దుచేయడాన్ని విశ్వ శ్రేయోదాయకత అనుసరించి వస్తుందని త్రికరణ శుద్ధిగా నమ్మడం, దీన్ని ఆచరణ యోగ్యం చెయ్యడానికి సహకరించాలనే మన స్ఫూర్తిగా వుండే కోరిక. యీ మూడు లక్షణాలే మన దేశంలో ''అరవయ్యవ దశకపు వారసత్వం'' అని పిలిచేదాని సారాంశం, యీ వారసత్వంలో నరోదిజానికి సంబంధించినదేదీ కూడా లేదని నొక్కిచెప్పడం ముఖ్యం. యీ లక్షణాలతో విశిష్టవంతం చెందిన అభిప్రాయాలున్న, నరోదిజంతోటి యే సంబంధమూ లేని రష్యన్ రచయితలు విశేషమైన సంఖ్యలో వున్నారు. రచయిత దృక్పథంలో యీ లక్షణాలు వున్న చోటల్లా, నరోదిజంపట్ల ఆయన వైఖరి యేమిటైందీ అనే దానితో సంబంధం లేకుండా, ఆయనెప్పుడూ కూడా ''అరవయ్యవ **దశకపు** సంప్రదాయాల్ని పదిలపరిచినవాడు''గానే ప్రతి వాళ్లచేతా గుర్తింపు పొందాడు. ఉదాహరణకి, యీ మధ్యనే సప్తతి ఉత్సవం జరిగిన ఎమ్. స్త్సస్యులేవిచ్, కేవలం నరోదిజానికి వ్యతిరేకుడు కాబట్టీ, లేదా నరోదిజం ప్రస్తావించే సమస్యలపట్ల ఉదాసీనంగా వుంటాడు కాబట్టీ, ''వారసత్వాన్ని పరిత్యజించాడు'' అనాలన్న ఆలోచనే యెవరికీ వుండదు కదా. మేము కచ్చితంగా స్కాల్‌దిన్* ఉదాహరణనే యెందుకు తీసుకున్నామంటే, ఆయన ''వారసత్వాని''కి నిస్సందేహమైన ప్రతినిధిగా వుంటూనే, అదే సమయంలో నరోద్నిక్కులు కాపాడదలచుకున్న ప్రాచీన వ్యవస్థలకి బద్ధ శత్రువుగా వున్నాడు.

---

* గ్రామ కమ్యూన్‌పట్ల తన విరోధంవల్లా, తన ధోరణివల్లా స్కాల్‌దిన్ అరవయ్యవ దశకపు విలక్షణ ప్రతినిధి కాడని బహుశా అభ్యంతరం రావచ్చును. కాని యిది గ్రామ కమ్యూన్‌కి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. స్కాల్‌దిన్ పాలు పంచుకున్న వికాసదాయకులందరికీ ఉమ్మడిగా వుండే సమస్య. ఆయన ధోరణికి సంబంధించి నిదానమైన హేతుబద్ధత సంయమనం, క్రమత్వంమీద వూనిక వగైరాలతో అది నిజంగా విలక్షణంగా లేదు. అందుకనే ఎంగెల్స్ స్కాల్‌దిన్‌ని liberalkonservativ అని వూరికే అనలేదు. యేమైనా యింకొంచెం విలక్షణమైన ధోరణి వుండే వారసత్వ ప్రతినిధిని యెంచుకోవడం అనేది, మొదటగా, అనేక కారణాలవల్ల అసౌకర్యమవుతుంది, రెండవదిగా యీనాటి నరోద్నిక్కులతో[98] పోల్చేటప్పుడు అపార్థాలకి దారితియ్యవచ్చు. మన కర్తవ్యానికి సంబంధించిన స్వభావం వల్లనే, ధోరణి (సామెతకి వ్యతిరిక్తంగా) స్వభావం కాదు, స్కాల్‌దిన్ విలక్షణ రహిత స్వరం అతని ''సంగీతాన్ని'' అంటే, అతని అభిప్రాయాల సారాంశాన్ని మరింత ప్రత్యేకంగా వెలువరిస్తుంది. మరి మనకి ఆసక్తి కలిగించేది యీ సారాంశం

స్కాల్‌దిన్ బూర్జువా అని మేము పైన అన్నాం. దానికి తగినంత ఆధారం పైన యివ్వడం జరిగింది. కాని యీ పదాన్ని (చారిత్రక దశ ప్రత్యేకత లేకుండా) అల్పసంఖ్యాక ప్రయోజనాల స్వార్థపర సమర్థనతోటి కలపడంవల్ల, తరచుగా, చాలా తప్పుగా, సంకుచితంగా, అచారిత్రకంగా అర్థంచేసుకోవడం జరిగింది. పద్దెనిమిదవ శతాబ్దపు వికాసదాయకులు (వాళ్లని బూర్జువావర్గపు నాయకత్వంలో చేర్చడం సామాన్యంగా అంగీకరించిందే) రాసినప్పుడు, 40, 60 దశకాలకు చెందిన మన వికాసదాయకులు రాసిన కాలంలో, అన్ని సాంఘిక సమస్యలూ కూడా భూస్వామ్య దాస్యానికీ, దాని అవశేషాలకీ వ్యతిరేకంగా పోరాటానికే తుల్యమయ్యాయి. అప్పట్లో నూతన సాంఘిక-ఆర్థిక సంబంధాలూ, వాటి వైరుధ్యాలూ యింకా అండదశలో వున్నాయి. కాబట్టి అప్పట్లో బూర్జువావర్గ సిద్ధాంతవేత్తలు యే స్వార్థపరతనీ ప్రదర్శించలేదు; తద్వ్యతిరేకంగా పశ్చిమ దేశాల్లోనూ, రష్యాలోనూ కూడా వాళ్లు విశ్వ శ్రేయస్సుని మనస్ఫూర్తిగా నమ్మి, మనస్ఫూర్తిగా దాన్ని కోరారు. వాళ్లు నిజంగా భూస్వామ్య దాస్యంలోనుంచి పెరుగుతున్న వ్యవస్థలో వైరుధ్యాలని చూడలేదు (ఓ రకంగా యింకా చూడగలగలేదు). స్కాల్‌దిన్ తన పుస్తకపు ఒక భాగంలో ఆడమ్ స్మిత్‌ని ఉల్లేఖించడం వూరికేనే కాదు. ఆయన అభిప్రాయాలూ, వాదనా స్వభావమూ, చాలా రకాలుగా ప్రగతిశీల బూర్జువావర్గపు ఆ మహా సైద్ధాంతికుని సూత్రీకరణలని పునశ్చరణ చేస్తూన్నట్టు మనం చూశాం.

అందుచేత, స్కాల్‌దిన్ ఆచరణ యోగ్యమైన సూచనలని ఒక పక్క యీనాటి నరోద్నిక్కుల భావాలతోటీ, యింకో పక్కన ''రష్యన్ శిష్యవర్గానికి'' వాటిపట్ల గల వైఖరితోటీ పోలిస్తే ''శిష్యవర్గం'' యెల్లప్పుడూ స్కాల్‌దిన్ సూచనలనే బలపరుస్తుందని మనకి కనిపిస్తుంది, యేమంటే అవి ప్రగతిశీల సామాజిక వర్గాల ప్రయోజనాలని ప్రతిబింబిస్తున్నాయి కనుకా, సామాన్యంగా ప్రస్తుత, అనగా పెట్టుబడిదారీ పంథాలో, సామాజిక అభివృద్ధి ప్రాణాధార ప్రయోజనాలని ప్రతిబింబిస్తున్నాయి కనుకా. స్కాల్‌దిన్ ఆచరణాత్మక ఆకాంక్షల్లో, లేదా ఆయన సమస్యలని ముందు వుంచడంలో, నరోద్నిక్కులు లోపం కావించిన విషయాలవల్ల శిష్యవర్గం వాటిని తోసిపుచ్చింది. శిష్యవర్గం ''తాము విరుచుకుపడేది'' ''వారసత్వం''మీద కాదు (అది అసంబద్ధమైన కట్టుకథ) వారసత్వానికి నరోద్నిక్కులు చేసిన కాల్పనికమైన, పెటీబూర్జువా చేర్పులమీద. యిప్పుడు యీ చేర్పులని చూద్దాం.

---

మాత్రమే. రచయిత అభిప్రాయాల సారాంశం ఆధారంగా మాత్రమే (వాటి ధోరణిని బట్టి గాక) మేము వారసత్వ ప్రతినిధులకీ, యీనాటి నరోద్నిక్కులకీ మధ్య సామ్యాన్ని తీయనుద్దేశించాం.

# II

## ''వారసత్వానికి'' నరోదిజపు చేర్పు

స్కాల్‌దిన్‌నుంచి ఎంగెల్‌హార్ట్‌దగ్గరికి వెడదాం. ఆయన ''పల్లెపట్టునుంచి ఉత్తరాలు''[99] గ్రామీణ జీవితపు సాంఘిక పార్శ్వాలమీద వ్యాసాలు కూడా. అంచేత వస్తుపరంగా, రూపంలో కూడా ఆయన పుస్తకం చాలా మట్టుకి స్కాల్‌దిన్ పుస్తకాన్ని పోలివుంటుంది. ఎంగెల్‌హార్ట్ స్కాల్‌దిన్ కంటే యింకా చాలా యెక్కువ ప్రతిభావంతుడు, గ్రామసీమ నుంచి ఆయన రాసిన ఉత్తరాలు యింకా చాలా యెక్కువ ఆసక్తికరంగానూ, కల్పనాత్మకంగానూ వుంటాయి. ''మారుమూల ప్రాంతాల్లోనూ, రాజధానిలోనూ'' పుస్తకపు గంభీర రచయిత సుదీర్ఘ ప్రసంగాలు ఎంగెల్‌హార్ట్ పుస్తకంలో కనిపించవు. యీ పుస్తకం చెయ్యి తిరిగిన వర్ణనతోటీ, ఆలంకారికతతోటీ నిండుగా వుంటుంది. అంచేత స్కాల్‌దిన్ పుస్తకం దాదాపు విస్మృతమైపోతే, దాని ప్రచురణ తర్వాత రెండేళ్లకే ''ఒతేచెస్త్వెన్నియె జపీస్కి'' ప్రచురణ ప్రారంభించిన ఎంగెల్‌హార్ట్ ఉత్తరాలు యీ మధ్యనే యింకో ముద్రణ చూసి, పఠితృలోకపు ఆదరణని చూరగొనడంలో ఆశ్చర్యంలేదు. కాబట్టి ఎంగెల్‌హార్ట్ పుస్తకంలోని విషయాలని గురించి పాఠకుడికి పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. ఆయన అభిప్రాయాల్లోని రెండు ధోరణులకి మాత్రమే పరిమిత మవుదాం: మొదటిగా, సామాన్యంగా ''వారసత్వానికి'' విశిష్టమైన అభిప్రాయాలు, ప్రత్యేకంగా ఎంగెల్‌హార్ట్‌కీ, స్కాల్‌దిన్‌కీ ఉమ్మడిగా వున్న అభిప్రాయాలు. రెండవది నరోద్నిక్కుకి ప్రత్యేకంగా వుండే అభిప్రాయాలు. ఎంగెల్‌హార్ట్ <u>అప్పటికే నరోద్నిక్కు</u>, కాని ఆయన అభిప్రాయాలలో వికాసదాయకులందరికీ ఉమ్మడిగా వుండేదీ, సమకాలీన నరోదిజం నీళ్లు వదిలేసిందీ యెంత వుందంటే, ఆయన్ని యెలా వర్గీకరించాలీ – నరోదిజపు వాసన లేకుండా సామాన్యంగా ''వారసత్వపు'' ప్రతినిధులతోటా, లేక నరోద్నిక్కులతోటా, అన్న దాంటో యిబ్బంది పడిపోతాం.

మొదటి రకానికి ఎంగెల్‌హార్ట్‌ని దగ్గరకి తెచ్చేది ప్రధానంగా ఆయన అభిప్రాయాల సంయమనం, వాస్తవాన్ని గురించి ఆయన నిర్మొహమాటమైన సూటి వర్ణనలు, సామాన్యంగా ''పునాదులకి'' సంబంధించీ, ప్రత్యేకంగా రైతాంగానికి సంబంధించీ వున్న అన్ని దుష్ట పార్శ్వాలనీ పట్టు సడలకుండా తూర్పారబట్టడం. కాగా, నరోదిజపు ముఖ్యాంశం యేమిటంటే, ఆ ''పునాదుల'' తప్పుడు ఆదర్శీకరణ, వాటిని అకర్షవంతంగా చిత్రించడం. అంచేత ఎంగెల్‌హార్ట్ చాలా దుర్బలంగా, బెరుగ్గా వ్యక్తం చేసిన నరోదిజం, ఆయన యెంతో ప్రతిభావంతంగా చిత్రించిన గ్రామీణ <u>వాస్తవికత</u> చిత్రంతోటి ప్రత్యక్షమైన, సూటి అయిన వైరుధ్యంతోటి వుంటుంది. ఏ అర్థికవేత్త అయినా, పబ్లిసిస్టు అయినా గ్రామీణ

ప్రాంతాన్ని గురించి తన అభిప్రాయాలని ఎంగెల్‌హార్ట్ పేర్కొన్న వాస్తవాలమీదా, పరిశీలనల*మీదా ఆధారపడి యేర్పాటుచేసుకోవాలంటే, అలాంటి సమాచారంనుంచి నరోద్నిక్కుల సూత్రీకరణలని లాగడం అసంభవమని అతనికి కనిపిస్తుంది. రైతునీ, అతని గ్రామ కమ్యూన్‌నీ ఆదర్శీకరించడం నరోదిజపు ప్రధాన అంశీభూత భాగాల్లో ఒకటి. అన్ని రకాల నరోద్నిక్కులూ వి. వి. నుంచి మిహైలోవ్‌స్కీదాకా "కమ్యూన్"ని ఆదర్శీకరించి ఆకర్షకంగా చేసే ప్రయత్నానికి పూర్తిగా కళ్లేలు వదిలేశారు. ఎంగెల్‌హార్ట్‌లో అలా ఆకర్షవంతం చేసే ఛాయ పిసరు కూడా లేదు. రైతాంగపు సామాజిక స్వభావాన్ని గురించి చెప్పే నాజూకు మాటలకి వ్యతిరేకంగా, యీ "సామాజిక స్వభావాని"కి, బస్తీ వైయక్తిక తత్వంతోటి, యీనాడు కనిపించే తారతమ్యానికి, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పోటీకీ వగైరాలకీ వ్యతిరేకంగా, చిన్న రైతు ఆశ్చర్యకరమైన వ్యష్టితత్వాన్ని బహిర్గతం చెయ్యడంలో ఎంగెల్‌హార్ట్ పరమ కరాఖండీగా వుంటాడు. మన "రైతులు యాజమాన్యానికి సంబంధించి నిశితమైన ఆస్తపరత కలవా"రనీ (పేజి 62, 1885 నాటి ముద్రణ), వాళ్లు "జట్టు పని"ని సహించలేరనీ, దాన్ని సంకుచితమైన స్వార్థపర, అహంభావ ఉద్దేశ్యాలతోటి అసహ్యించుకుంటారనీ, జట్టు పనిలో ప్రతివాడూ "మిగతా వాళ్లకంటే యెక్కువ చేసేస్తానేమో"నని భయపడతాడనీ (పేజి 206) విపులంగా ఆయన చూపిస్తాడు. మిగతా వాళ్లకంటే యెక్కువ పని చేస్తామేమోనన్న యీ భయం పరిహాసాస్పదమైన (లేదా విషాద పరిహాసాస్పద) అతికి పోతుంది. ఒకే యింట్లో వుంటూ, ఒకే ఉమ్మడి కాపరంతోటీ, బంధుత్వంతోటీ కట్టుబడిన ఆడవాళ్లలో ప్రతి ఒక్కత్తీ తన కంచం తను యెత్తుకుంటుందనీ, లేదా పాలు పితికే పనైతే ప్రతి ఒక్కత్తీ తన బిడ్డకి పాలు చూసుకుంటుందనీ (మిగతా వాళ్లు పాలు దాచేస్తారేమోననే భయంతో), తన బిడ్డకి మాత్రమే పాయసం చేసుకుంటుందనీ ఉదాహరణగా రచయిత చెబుతాడు (పేజి 323). ఎంగెల్‌హార్ట్ యీ విషయాలని యెంత విపులంగా చెప్పి, పుంఖాను పుంఖంగా ఉదాహర

* సందర్భవశాత్తూ, యిది అత్యంత ఆసక్తికరంగానూ, బోధనాత్మకంగానూ వుండటమే కాకుండా, ఆర్థిక పరిశోధకునికి పూర్తిగా ధర్మం కూడానూ. శాస్త్రజ్ఞులు ప్రశ్నావళులలోని సమాచారాన్ని, తరచుగా విషయజ్ఞులు కాకుండా వుండి, పాక్షిక దృష్టితో వుండి, తమ అభిప్రాయాలని తెలివిగా యేర్పరచుకోవడంగాని, స్థిరమైన దృక్పథం యేర్పరచుకోవడంగాని నేర్పని అసంఖ్యాక యజమానుల జవాబులనీ, అభిప్రాయాలనీ నమ్మినప్పుడు, అద్భుతమైన శక్తి సామర్థ్యాలతోటి పదకొండేళ్ల పాటు పరిశీలనలు చేసి పోగుచేసిన సమాచారాన్ని, నిస్సందేహంగా నిజాయితీపరుడూ, తను చెప్పేదాన్ని అద్భుతంగా అధ్యయనం చేసినవాడూ అయిన వ్యక్తి అందించేటప్పుడు నమ్మడానికి అభ్యంతరం యేమిటి?

ణలతో రుజువు చేస్తాడంటే అవి యేదో యాదృచ్ఛిక విషయాలని అనడానికి వీలే లేదు. యిదో, అదో: ఎంగెల్‌హార్ట్ అసలు నమ్మడానికి వీల్లేని పనికిమాలిన పరిశీలకుడేనా కావాలి లేదా మన రైతు సమష్టితత్వాన్ని గురించీ సమష్టి సుగుణాల గురించీ వున్న కథలు, భూ యాజమాన్యం రూపంనుంచి సాధారణీకరింపబడిన లక్షణాలని (యీ రకపు యాజమాన్యంనుంచి అదనంగా సకల ద్రవ్యమాన, పరిపాలనా పార్శ్వాలూ సాధారణీకరింపబడతాయి) ఆర్థిక ఆచరణకి బదలాయించే శుద్ధ కల్పననుంచి వచ్చినవేనా కావాలి. తన ఆర్థిక కార్యకలాపాల్లో రైతు కులక్ అయే దృష్టితోనే వుంటాడని ఎంగెల్‌హార్ట్ రుజువుచేస్తాడు. "ప్రతి రైతు లోనూ కొంత కచ్చితమైన కులక్ అంశ వుంది" (పేజి 491), "కులక్ ఆదర్శాలే రైతుల్లో ప్రాచుర్యంగా వుంటాయి...." "వ్యష్టితత్వం, స్వార్థపరత్వం, దోపిడీ చెయ్యాలనే కోరిక రైతుల్లో బలంగా అభివృద్ధిచెందుతాయని నేను మళ్లీ మళ్లీ చెపుతున్నాను...." "ప్రతి వాడూ తనో పెద్ద చేపనని గొప్పగా భావిస్తూ చిన్న చేపలని మింగెయ్యడానికే చూస్తాడు" అంటాడతను. రైతాంగంలో వుండే ధోరణి "సమష్టి" వ్యవస్థ కేసి కాదనీ, "ప్రజా ఉత్పత్తి" దిశగా కాదనీ, పెట్టుబడిదారీ సమాజాల్లో అంతర్గతంగా వున్న అతి సాదా పెటీ బూర్జువా వ్యవస్థ దిశగానే అనీ ఎంగెల్‌హార్ట్ అద్భుతంగా రుజువుచేస్తాడు. స్థితిమంతుడైన రైతు వ్యాపారంలోకి దూకాలనీ (363), పనికి బదులు ధాన్యం అప్పు యివ్వాలనీ, పేద రైతు శ్రమని కొనుక్కోవాలనీ (పేజీలు 457, 492, వగైరా), లేదా ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే, చొరవ వున్న రైతులు గ్రామీణ బూర్జువావర్గంగా మారడం అనే స్థితిమంతుడైన రైతు ధోరణిని ఆయన వర్ణించి తిరుగులేకుండా రుజువుచేస్తాడు. "రైతులు ఆర్టెల్* పద్ధతిని అనుసరించక పోయినట్లయితే, ప్రతివాడూ విడిగా తన క్షేత్రాన్ని చూసుకున్న ట్లయితే, పుష్కలంగా భూమి వున్నప్పటికీ కూడా రైతు సేద్యగాళ్లల్లో భూమి లేని రైతులూ, వ్యవసాయ కార్మికులూ వుంటారు. యింకా యేమంటే, రైతుల పరిస్థితిలో తేడా యిప్పటి కంటే విస్తృతంగా వుంటుంది. భూమిమీద సమష్టి యాజమాన్యం వున్నప్పటికీ 'ధనికు' లకి పక్కపక్కనే, వాస్తవంగా భూమిలేని వ్యవసాయ కార్మికులు యెంతోమంది వుంటారు. నాకు భూమిమీద హక్కు వుంది, దాన్ని సాగు చేసుకునే సాధనాలు గాని, పనిముట్లుగాని, సొమ్ముగాని లేనట్లయితే అలాంటి దానివల్ల నాకు గాని, నా పిల్లలకి గాని యేమిటి ప్రయో జనం? యిది అంధుడికి భూమి యివ్వడం లాంటిది, కిం ప్రయోజనం?" అంటాడు ఎంగెల్ హార్ట్ (పేజి 370). ఒక రకమైన విచారకర వ్యంగ్యంతోటి, యీ భాగంలో "ఆర్టెల్ పద్ధతి" వ్యవసాయం పవిత్రమైన, అమాయికమైన కోరికగా దీనంగా కనిపిస్తుంది. యీ

---

* ఆర్టెల్: రష్యాలో వ్యవసాయదారుల, కార్మికుల జట్టు. – సం.

కోరిక రైతాంగాన్ని గురించిన వాస్తవాలనుంచి రావడానికి మారుగా వాస్తవాలచేత ప్రత్యక్షంగా పూర్వపక్షం చేయబడినదీ, కాలదన్నబడిందీ.

యేరకమైన నరోద్నిక్ వాసనా లేకుండా, వారసత్వపు ప్రతినిధులకి చేరువగా ఎంగెల్‌హార్ట్‌ని తీసుకువచ్చే మరో లకణమేమిటంటే, రైతాంగపు విపద్దశకి ప్రధానమైన కారణం భూస్వామ్య దాస్య అవశేషాలనీ, దాని విలక్షణమైన నియమనిబంధనలు అనీ ఆయన నమ్మకం. యీ అవశేషాలనీ, నియమనిబంధనలనీ తొలగించండి – అంతా సక్రమమైపోతుంది. యీ నియమనిబంధనలపట్ల ఎంగెల్‌హార్ట్ పరమ విరోధమూ, పైనుంచి నియమనిబంధనల ద్వారా రైతుకి మేలు చేసే ప్రయత్నాలపట్ల ఆయన కరకు వ్యంగ్యం, "పాలకవర్గాల హేతుబద్ధతలోనూ, అంతరాత్మలోనూ, విజ్ఞానంలోనూ, దేశభక్తిలోనూ" ("రూస్కొయె బొగాత్‌స్త్వొ," 1896, సంచిక 12, పేజి 106లో యుజకోవ్ మాటలు) నరోద్నిక్కులకున్న విశ్వాసంతోటీ, "ఉత్పత్తిని వ్యవస్థీకరించడం" వగైరా లాంటి అర్థం పర్థం లేని వాళ్ల ప్రణాళికలతోటీ పరమ విరుద్ధంగా వుంది. రైతుల "మంచికే" ఉద్దేశించిన రూలు, పిండి మిల్లుల దగ్గర సారాయి అమ్మరాదనే దాన్ని వ్యంగ్యాత్మకంగా ఎంగెల్‌హార్ట్ ఖండించడాన్ని గుర్తుచేసుకుందాం; లేదా ఆగస్టు 15 లోపల రై ధాన్యాన్ని చల్లడాన్ని నిషేధిస్తూ కొన్ని జేమ్‌స్త్వోలు 1880లో జారీచేసిన ఉత్తరువులని గురించి "పడక కుర్చీ శాస్త్రజ్ఞులు" – వీళ్లూ రైతుల మంచిపట్ల ఆందోళన చెందిన వారైయుండి – "లక్షలాది రైతు యజమానుల" (424) వ్యవసాయంలో చేసుకునే నీతిమాలిన జోక్యం గురించీ ఆయన యేవగింపుతో మాట్లాడటాన్ని గుర్తుచేసుకుందాం. పైన్ అడవుల్లో పొగతాగడాన్నీ, వసంత రుతువులో బొమ్మిడాయిలు పట్టడాన్నీ, మే పండగకి బర్చ్ చెట్లని నరకడాన్నీ, పక్షిగూళ్లని దోచుకోవడాన్నీ, యింకా అలాంటి వాటినీ నిషేధిస్తూ వుండే నియమాలనీ, రూళ్లనీ ప్రస్తావిస్తూ ఎంగెల్‌హార్ట్ యెత్తి పొడుపుగా అంటాడు: "రైతుల కోసం ఆతృత చూపించడం మేధావి బుర్రలకి ప్రధాన చింతగా యెప్పుడూ వుండింది, వుంది. తన కోసం యెవడు బతుకుతున్నాడు? ప్రతివాడూ రైతు కోసం బతుకుతున్నాడు!... పాపం రైతు శుంఠ, తన వ్యవహారాలు తను నిర్వహించుకోలేడు. అతన్ని యెవరూ పట్టించుకోకపోతే అతను అడవులన్నిటినీ దహనం చేసేస్తాడు. పక్షులన్నిటినీ చంపేస్తాడు, నదుల్లో చేపలేమీ లేకుండా వూడ్చేస్తాడు, భూమిని ధ్వంసం చేసుకుంటాడు, తనే కడతేరిపోతాడు" (398). పాఠక మహాశయులారా, నరోద్నిక్కులకి యెంతో ప్రియమైన చట్టాలంటే, మాటకి, కమతాల బదలాయింపు నిషేధించే లాంటివి అంటే, యీ రచయితకి యే మాత్రమేనా సానుభూతి వుందని మీరు అనుకుంటారా? పైన ఉల్లేఖించిన పదబంధం, "రూస్కొయె బొగాత్‌స్త్వొ" స్తంభాల్లో ఒకటైన దాన్ని యీ కలం రాయగలదా? మన

గుబేర్నియా జేమ్స్త్వోలపై ''వ్యవసాయక శ్రమని వ్యవస్థీకరించడానికి క్రమమైన, పెద్ద, గణనీయ వ్యయం చేసేందుకు'' ''వీలు కల్పించక''* పోతున్నందుకు నిందని మోపిన, అదీ 90వ దశకంలో అదే పత్రికకి యింకో స్తంభమైన ఎస్. కారిషెవ్ అభిప్రాయంతో ఆయన పాలు పంచుకోగలడా?

ఎంగెల్‌హార్ట్‌ని స్కాల్‌దిన్‌కి దగ్గర చేసే యింకో లక్షణాన్ని ప్రస్తావిద్దాం: అనేక శుద్ధ బూర్జువా కోరికలపట్లా, చర్యలపట్లా ఆయన దృక్పథం. ఎంగెల్‌హార్ట్ పెటీ బూర్జువాకి బంగారు పూత పూస్తున్నాడని కాని, విడి వ్యాపారస్తునికి పెటీబూర్జువా హోదాని ప్రయుక్తం చేయనందుకు (వి. వి. రీతిగా) సాకులు అల్లడం చేస్తున్నాడనీ గాని కాదు, యీ పనికి సంబంధమే లేదు. ఆచరణాత్మక వ్యవసాయదారునిగా ఎంగెల్‌హార్ట్ ప్రతి అభ్యుదయకర నూతన రీతితోటీ, వ్యవసాయ పద్ధతులలో ప్రతి మెరుగుదలతోటీ, వూరికే అతి వ్యామోహితుడు అయిపోతాడు. యీ మెరుగుదలలోని సాంఘిక రూపమే యీ దేశంలో పెట్టుబడిదారీ విధానం అసంభవం అన్న తన సిద్ధాంతానికి అత్యంత పటువైన ఖండన అని గుర్తించడంలో పూర్తిగా విఫలుడవుతాడు. తన పని వాళ్లకి కట్టు కూలి పద్ధతిని ప్రవేశపెట్టడం (నారని శుద్ధి చెయ్యడం, నూర్చడం వగైరా) పుణ్యమా అని తాను సాధించిన విజయానికి అతనెంత సంబరపడిందీ ఉదాహరణగా గుర్తుకు తెచ్చుకుందాం. అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ శ్రమలోని ఉత్పత్తిని హెచ్చించి, అదనపు విలువని పెంచే అత్యంత ప్రాచుర్యమైన పద్ధతుల్లో పనినిబట్టి వేతనం యిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టడం ఒకటని ఎంగెల్‌హార్ట్‌కి అనుమానం కూడా కలగదు. యింకో ఉదాహరణ: ''జెమ్లెదేల్‌చెస్కాయ గజేత''[100] కార్యక్రమాన్ని ఎంగెల్‌హార్ట్ పరిహసిస్తాడు: ''నిర్బంధ సేద్యానికి పొలాల్ని గుత్తకివ్వడం మానెయ్యడం; వ్యవసాయ కార్మికులని పనిలో పెట్టుకోవడంమీద ఆధారపడిన వ్యవసాయం; మెరుగైన యంత్రాలనీ, పరికరాలనీ, పశుజాతులనీ, పైరుమార్పు వ్యవస్థనీ ప్రవేశపెట్టడం; మైదానాలనీ, పచ్చిక బీళ్లనీ మెరుగు పర్చడం వగైరా, వగైరా.'' ''యేమైనా యివన్నీ సాదా మాటలు తప్ప యింకేమీ కాదు!'' అంటాడు ఎంగెల్‌హార్ట్ (128). అయినా తన సొంత వ్యవసాయంలో ఎంగెల్‌హార్ట్ అమలుపరిచింది యీ కార్యక్రమమే; తన సొంత క్షేత్రంలో వ్యవసాయ కార్మికులని నియోగించుకోవడంమీద ఆధారపడే కచ్చితంగా ఆయన సాంకేతిక అభివృద్ధిని సాధించాడు. లేదా మళ్లీ: చోరవతో రైతుకి వుండే నిజమైన ధోరణులని ఎంగెల్‌హార్ట్ యెంత నిర్మోహమాటంగా, సరియైనంతగా తూర్పారబట్టిందీ మనకి తెలుసు; కాని అది, కావలసింది ఫ్యాక్టరీలు కాదు, చిన్న'' (వక్కాణింపు ఆయనదే) ''గ్రామీణ

* ''రూస్కాయె బొగాత్స్త్వో'' (1896), నంబరు 5, మే. ఆర్థిక చర్యలమీద గుబేర్నియా జేమ్స్త్వో వ్యయం గురించి కర్తిషేవ్ వ్యాసం. పేజి 20.

సారాబట్టీలు, నూనె మిల్లులు" వగైరా (పేజి 336) అని ఆయన నొక్కిచెప్పడాన్ని నిరోధించలేదు. అంటే "అవసరమైంది" గ్రామీణ బూర్జువావర్గం వ్యావసాయిక పరిశ్రమల్లోకి అడుగెట్టడం — అన్ని వేళలా, అన్ని చోట్లా వ్యావసాయిక పెట్టుబడిదారీ విధానపు పెద్ద సూచకాలల్లో ఒకటి అదే. ఎంగెల్‌హార్ట్ సిద్ధాంతవేత్త కాదు, ఆచరణాత్మక వ్యవసాయ దారుడు అనేది దీనికి కారణం. పెట్టుబడిదారీ విధానం లేకుండా అభివృద్ధి సాధ్యం అని వాదించడం ఒక యెత్తు, మీరే స్వయంగా సాగుచెయ్యడం యింకో యెత్తు. హేతుబద్ధమైన పద్ధతుల్లో వ్యవసాయం నిర్వహించాలన్న లక్ష్యం పెట్టుకోవడంతోటి, పరివేష్టిత పరిస్థితుల ఆధారంవల్ల, దాని కోసం శుద్ధ పెట్టుబడిదారీ విధానంతోటి కృషి చెయ్యడానికీ, "వ్యవసాయ కార్మికులని పనిలో పెట్టుకోవడం" అనే దానికీ సంబంధించిన తన సిద్ధాంత పరమైన, ఊహాత్మకమైన అనుమానాలన్నిటినీ ఎంగెల్‌హార్ట్ పక్కకి పెట్టక తప్పని స్థితిలో పడ్డాడు. సిద్ధాంత రంగంలో, తన వాదనలు సరిగ్గా ఆ స్వభావంతో వున్నవనీ, రష్యా పెట్టుబడిదారీ విధాన పరిణామ అవసరాలకి అవి తగి వున్నాయనే రెండు విషయాలూ పూర్తిగా గ్రహించకుండా స్కాల్‌దిన్ అచ్చు మాంచెస్టర్ ధోరణి సభ్యునిలా వాదించాడు. ఆచరణ రంగంలో ఎంగెల్‌హార్ట్, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా తన సిద్ధాంత పరమైన నిరసన వున్నప్పటికీ, తన పితృదేశం తన సొంత పథం అనుసరిస్తున్నట్టు నమ్మాలనే తన కోరిక వున్నప్పటికీ అచ్చు మాంచెస్టర్ ధోరణికి చెందిన వాడుగా వుండక తప్పలేదు.

ఎంగెల్‌హార్ట్ అలా అని నమ్మాడు. అతన్ని నరోద్నిక్కు అని పిలిచేటట్టు చేసేది యిదే. రష్యాలోని ఆర్థిక అభివృద్ధి తాలూకు అసలు ధోరణిని ఆయన అప్పటికే గ్రహించాడు, యీ అభివృద్ధిలోని వైరుధ్యాలని అలా అలా సర్ది చెప్పాలని ప్రయత్నించాడు. రష్యాలో వ్యావసాయిక పెట్టుబడిదారీ విధానం అసాధ్యమనీ, "మన దేశంలో వ్యవసాయకూలి (knecht) లేదు" (పేజి 556) అనీ ఆయన రుజువుచెయ్య ప్రయత్నించాడు. అయినా మన పనివాళ్లు చాలా ఖర్చు మనుషులన్న దాన్ని ఆయనే ఖండించాడు, తన పాలేరు ప్యోత్ర్‌కి తను యెంత కనీస భత్యం యిచ్చేదీ, అతను తన కుటుంబ జీవనానికి పోను, "ఉప్పు, వంటనూనె, దుస్తులు కొనుక్కోడానికి" (పేజి 10) ఏడాదికి కేవలం 6 రూబుళ్లు మాత్రమే ఎలా మిగులుతూ వుండినదీ ఆయన చూపుతాడు. "అయినా అతన్ని చూసి అసూయ పడుతున్నారు. నేను గనక అతన్ని గెంటేస్తే ఆ స్థానంలోకి రావడానికి వరసలో యాభైమంది సిద్ధమవుతారు" (పేజి 11). తన వ్యవసాయ క్షేత్రపు పురోగతిని గురించీ, తన పనివాళ్లు సేద్యం చేయడంలో చూపించే నేర్పుని గురించీ మాట్లాడుతూ ఎంగెల్‌హార్ట్ విజయోత్సాహంతో అంటాడు: "ఎవళ్లీ సేద్యగాళ్లు? అమాయిక, చిత్తశుద్ధిలేని రష్యన్ రైతులు" (పేజి 225).

తన సొంత వ్యావసాయిక అనుభవమూ, రైతుకి వుండే వ్యష్టితత్వాన్ని గురించి తను

వెల్లడి చేసిందీ "సమష్టితత్వాన్ని" గురించిన భ్రమలన్నింటినీ నిరాకరించినా, రైతులు ఆర్టెల్ పద్ధతి ఆర్థిక వ్యవస్థని అనుసరిస్తారని ఎంగెల్‌హార్ట్ "నమ్మడమే" కాదు, అలాంటిది నిజంగా ఏర్పడుతుందనీ, మన రష్యన్లం ఒక పెద్ద అద్భుత కృత్యాన్ని సాధించి, వ్యవసాయంలో నూతన పద్ధతిని ప్రవేశపెడతామనీ "విశ్వాసం" వ్యక్తం చేశాడు. "మన ఆర్థిక వ్యవస్థకి విశిష్ట లక్షణాన్నీ, విశిష్ట స్వభావాన్నీ సంతరించేది యిదే" (పేజి 349). తన సొంత వ్యవసాయ పద్ధతుల్లోనూ, రైతుల వ్యవసాయ పద్ధతుల్లోనూ "విశిష్ట లక్షణం" పూర్తిగా లోపించేటట్టు చేసే కాల్పనికవాది ఎంగెల్‌హార్ట్‌గా వాస్తవవాది ఎంగెల్‌హార్ట్ మారతాడు, యేమంటే ఆ పద్ధతులని భవిష్యత్ "విశిష్ట లక్షణం"లో "విశ్వాసం"వల్ల ఆయన చూశాడు! యీ విశ్వాసంనుంచి అతివాద నరోద్నిక్కు లక్షణాలకి వున్న దూరం కొంచమే. యీ లక్షణాలు – కొంచమే అయినప్పటికీ – ఎంగెల్‌హార్ట్‌లో దురభిమాన పూరిత దేశభక్తి అంచుల్ని తాకే సంకుచిత జాతీయవాద రూపంలో "మనం యూరప్‌ని ఒక బాదు బాదుతాం," "యూరప్‌లో కూడా రైతు మన పక్షాన వుంటాడు" (పేజి 387) – యుద్ధ అవకాశాన్ని గురించి ఒక భూస్వామితో చర్చిస్తూ, ఎంగెల్‌హార్ట్ అన్నాడు), వెట్టిని ఆదర్శీకరించడంలో కూడా కనిపిస్తాయి! అయినా చాకిరీ రూపంలో బాకీ తీర్చేటట్టు డబ్బో, ధాన్యమో రుణం తీసుకుని, పరమదారుణ వ్యక్తిగత పరాధీన పరిస్థితుల్లో దాదాపు వూరికే శ్రమించే దానికే బద్ధుడైన రైతుయొక్క హీన, పరాధీన* స్థితిని వర్ణించేందుకు అద్భుతమైన వర్ణనలతో పేజీలు నింపిన యిదే ఎంగెల్‌హార్ట్ "వైద్యుడికి (పల్లెప్రాంతాల్లో డాక్టర్ల అవసరం, ఉపయోగం గురించి ఆయన మాట్లాడుతున్నాడు, వి. ఐ.) తన సొంత క్షేత్రం వుంటే మంచిది, రైతు తన శ్రమ రూపంలో వైద్య చికిత్సకి చెల్లించగలదు" (పేజి 41) అనే మేరకి పోతాడు. దీనికి వ్యాఖ్య కావాలా?

– మొత్తంమీద ఎంగెల్‌హార్ట్ దృక్పథంలో పైన వివరించిన మంచి లక్షణాలని (అంటే యే రకపు నరోద్నిక్కు వాసనా లేకుండా "వారసత్వపు" ప్రతినిధులతో సామాన్యంగా వున్నవి) చెడ్డ వాటితో (అంటే నరోద్నిక్కు లక్షణాలతో) పోలిస్తే, ముందటివి "పల్లెపట్టు నుంచి ఉత్తరాలు" రచయితలో నిస్సందేహంగా పైచెయ్యితో వున్నాయి. తరవాతవి యేదో బాహిరంగా, యాదృచ్ఛికంగా కలిసి బయటనుంచి లోపలికి తుళ్లి పడ్డవి, ఆయన పుస్తకపు మామూలు ధోరణిలో జీరగా వున్నవీనీ.

---

* రైతు చేలో ధాన్యం పక్వానికి వచ్చి, పాడై పోతూ వుండేటప్పుడు గ్రామ పెద్ద (అంటే భూస్వామి నిగామాను) రైతుని పనికి పిలిచే దృశ్యం తలచుకోండి. యితగాడు వెళ్లి తీరాలి, యేమంటే, వెళ్లకపోతే, వోలోస్త్ అధికారులు అతని "వీపు చిట్లగొడతారు."

# III

## నరోదిజంతోటి సంబంధంవల్ల "వారసత్వం" లాభం పొందిందా?

"నరోదిజం అంటే మీ అవగాహన యేమిటి?" అని బహుశా పాఠకుడు అడగవచ్చు. "వారసత్వం అనే దానికి సంబంధించిన అర్థాన్ని పైన వివరించడం జరిగింది. కాని నరోదిజంకి సంబంధించి యే నిర్వచనమూ లేదు" అనవచ్చు.

నరోదిజం అంటే యీ కింది లక్షణాలతో వున్న అభిప్రాయాల సమాహారం అని మా ఉద్దేశం: 1) రష్యాలో పెట్టుబడిదారీ విధానం క్షీణతనీ, వెనుకంజనీ సూచిస్తుందన్న నమ్మకం. అంచేత పెట్టుబడిదారీ విధానంచేత తరతరాల పునాదులు "భగ్నం కావడాన్ని ఆపండి," "అడ్డగించండి," "ఆటంక పరచండి" అనే ఆకాంక్షలు, ప్రయత్నాలు యింకా అలాంటి ప్రగతి వ్యతిరేకమైన కేకలు. 2) సామాన్యంగా రష్యన్ ఆర్థిక వ్యవస్థ విశిష్ట లక్షణంలోనూ, ప్రత్యేకించి రైతాంగంలోని గ్రామ కమ్యూన్, ఆర్టెల్, వగైరాలలోను నమ్మకం. భిన్న సాంఘిక వర్గాలకీ, వాటి వైరుధ్యాలకీ సంబంధించి ఆధునిక విజ్ఞానశాస్త్రం వివరించిన భావనలని రష్యా ఆర్థిక సంబంధాలకి ప్రయుక్తం చెయ్యడం అవసరంగా కనిపించలేదు. గ్రామ కమ్యూన్ రైతాంగం పెట్టుబడిదారీ విధానంకంటే ఉన్నతంగా, మేలైనదిగా పరిగణించడం, "పునాదులని" ఆదర్శీకరించే స్వభావం వీళ్లలో వున్నాయి. ప్రతి సరుకు, పెట్టుబడిదారీ విధానాలకు విలక్షణమైన వైరుధ్యాలు రైతాంగంలో వుండటమనే దాన్ని నిరాకరించడం గానీ, యుక్తిగా దాట వెయ్యడం గానీ జరగడం. యీ వైరుధ్యాలకీ, పెట్టుబడిదారీ పరిశ్రమ, పెట్టుబడిదారీ వ్యవసాయంలో వాటి మరింత అభివృద్ధి చెందిన రూపానికీ మధ్య సంబంధం వుండడమనే దాన్ని నిరాకరించడం జరగడం. 3) ఒక పక్కన, "మేధావివర్గాని"కీ, దేశపు న్యాయ రాజకీయ సంస్థలకీ మధ్యన వుండే సంబంధాన్నీ, యింకో పక్క, నిర్దేశిత సామాజిక వర్గాల భౌతిక ప్రయోజనాలనీ ఉపేక్షించడం. యీ సంబంధాన్ని నిరాకరించడం, యీ సామాజిక లక్షణాలకి భౌతిక వివరణ లేకపోవడం అనేవి తాము "చరిత్రని యింకో దారిలో లాక్కు" పోగల శక్తినీ (వి. వి.), "దారినుంచి మళ్లించ" గల శక్తినీ ప్రతిబింబిస్తున్నామనీ (ఎన్—న్, యుజకోవ్, వగైరా), యింకా అలాంటి నమ్మకానికి పురిగొల్పుతాయి.

అదీ "నరోదిజం" అంటే మా అర్థం. యీ పదాన్ని దాని విస్తృతార్థంలో, ఒక అభిప్రాయాల సమాహారాన్ని వ్యతిరేకించేటప్పుడు "రష్యన్ శిష్యవర్గం" అందరూ ఉపయోగించినట్టుగా ఉపయోగిస్తున్నామనీ, యీ వ్యవస్థలోని విడి ప్రతినిధులని వ్యతిరేకిస్తున్నట్టు గాదనీ మీరు గమనిస్తారు. యీ విడి ప్రతినిధుల్లో భేదాలున్నాయి, ఒకో అప్పుడు ముఖ్య

మైనవి కూడా. యీ భేదాలని యెవళ్లూ నిర్లక్ష్యం చెయ్యరు. కాని పైన చెప్పిన అభిప్రాయాలు మాత్రం అందరికీ, నరోదిజపు యెంతో వైవిధ్య పూరిత ప్రతినిధులకి కూడా, అంటే యుజోవ్‌నుంచి మిహైలోవ్‌స్కీదాకా ఉమ్మడిగా వున్నవే. తమ అభిప్రాయాల యీ అభ్యంతరకర లక్షణాలకి యూజొవ్‌లూ, సజోనొవ్‌లూ, వి. వి.లూ వగైరాలు మరిన్నిటిని కలుపుతారు. వాటిని, ఉదాహరణకి, మిహైలోవ్‌స్కీ గాని యీ నాటి "రూస్కొయె బొగాత్‌స్త్వొ" వ్యాసకర్తలు గాని అంగీకరించరు. సంకుచితార్థంలో నరోద్నిక్కులకీ, సామాన్యంగా నరోద్నిక్కులకీ మధ్య యీ విభేదాల్ని నిరాకరించడం తప్పే కావచ్చు; కాని అందరు నరోద్నిక్కుల మౌలిక సామాజిక ఆర్థిక అభిప్రాయాలూ పైన చెప్పిన ముఖ్య విషయాలతోటి యేకీభవిస్తాయనే వాస్తవాన్ని అలక్ష్యం చెయ్యడం యింకా పెద్ద తప్పు అవుతుంది. "రష్యన్ శిష్యవర్గం," వాటినుంచి యింకా అధమ దిశకి "శోచనీయమైన మళ్లింపును" మాత్రమే కాక యీ మౌలిక అభిప్రాయాలనే నిరాకరిస్తారు కనుక, "నరోదిజం" అనే పదాన్ని దాని విస్తృతార్థంలో వాడే హక్కు వాళ్లకి సంపూర్తిగా వుంది. వాళ్లకా హక్కు వుండడమే కాదు; వాళ్లు మరోలా చెయ్యలేరు.

పైన స్థూలంగా వివరించిన నరోదిజపు మౌలిక అభిప్రాయాలకేసి మళ్లితే మనం గుర్తించాల్సిన మొట్టమొదటి విషయం యేమంటే "వారసత్వానికి" వాటిలో యెంత మాత్రమూ సంబంధం లేదు అనేది. నరోదిజంతోటి యేదీ ఉమ్మడిగా లేనివాళ్లు, పెట్టుబడిదారీ విధానపు సమస్యని అసలు లేవనెత్తనివాళ్లు, రష్యా విశిష్టతనూ, రైతు కమ్యూన్‌నీ వగైరాలనీ నమ్మని వాళ్లు, మేధావివర్గమూ, మన న్యాయ, రాజకీయ వ్యవస్థలూ "పథంనుంచి మళ్ల గల" సామర్థ్యం వున్న అంశంగా పరిగణించని వాళ్లు అయిన "వారసత్వపు" తిరుగులేని ప్రతినిధులు, సంరక్షకులు యెంతో మంది వున్నారు. "వేస్త్‌నిక్ యెవ్‌రొపి"[101] సంపాదక, ముద్రాపకుణ్ణి పైన ఉదాహరణగా పేర్కొన్నాం. అయన్ని దేనికేనా వేలెత్తి చూపించవచ్చును, వారసత్వపు సంప్రదాయాల ఉల్లంఘనకి తప్ప. మరో పక్క పైన పేర్కొన్న నరోదిజపు మౌలిక సూత్రాలని తమ అభిప్రాయాలు పోలి వున్నప్పటికీ, దాపరికం లేకుండా, నిర్మొహమాటంగా "వారసత్వాన్ని పరిత్యజించే" వాళ్లు వున్నారు. ఉదాహరణకి మిహైలోవ్‌స్కీ ప్రస్తావించిన ఆ వై. అబ్రామొవ్ లేదా యూజొవ్‌ని మనం చెప్పవచ్చు. "రష్యన్ శిష్యవర్గం" తలపడుతూ వున్న నరోదిజం, వారసత్వం (న్యాయపరమైన పదం వాడాలంటే) "సంక్రమించే" నాటికి, అంటే అరవయ్యవ దశకం నాటికి, లేనుకూడా లేదు. నరోదిజపు బీజాలు, అంకురాలు అరవయ్యవ దశకంలోనే కాదు, యింకా ముందే, నలభైయవ దశకంలోనూ అంతకు ముందూ* కూడా వున్నాయనుకోండి — కాని

* తుగాన్-బరనోవ్‌స్కీ "రష్యన్ ఫ్యాక్టరీ" (సెంట్ పీటర్స్‌బుర్గ్ 1898) పుస్తకాన్ని పోల్చి చూడండి.

మనకి యిక్కడ నరోదిజపు చరిత్రతో పని లేదు. మళ్లీ తిరిగి చెపుతున్నాం, మనకి ముఖ్యమైన దేమిటంటే, అరవయ్యవ దశకపు "వారసత్వం," పైన స్థూలంగా వివరించిన అర్థంలో, నరోదిజంతోటి ఉమ్మడిగా యేదీ కలిగిలేదనీ, అంటే వాళ్ల అభిప్రాయాల లోని సారాంశంతోటి యేదీ ఉమ్మడిగా దానికి లేదనీ, వాళ్లు వేరే సమస్యలని ముందు పెడుతున్నారనీ నిర్ధరించడం. నరోద్నిక్కులు కాని "వారసత్వపు" సంరక్షకులు వున్నారు, "వారసత్వాన్ని పరిత్యజించిన" నరోద్నిక్కులు వున్నారు. "వారసత్వా"న్ని కాపాడే నరోద్నిక్కులు, లేదా అలా నటించే వాళ్లు, కూడా వున్నారనుకోండి. అందుకనే నరోదిజానికీ, వారసత్వానికీ మధ్య సంబంధాన్ని గురించి మనం మాట్లాడుతున్నాం. యీ సంబంధపు ఫలితం యేమిటో చూద్దాం.

మొదటగా, వారసత్వంతో పోలిస్తే, వారసత్వపు సంరక్షకులు పాక్షికంగా (తమ కాలంలో) ముందు పెట్టగలగలేని, పాక్షికంగా తమ దృక్పథపు సంకుచితత్వంవల్ల పెట్టి వుండని, పెట్టని సమస్యల్ని సమాజపు దృష్టికి తెచ్చేటట్టు ముందు వుంచి నరోదిజం ఒక పెద్ద ముందు అడుగు వేసింది. యీ సమస్యల్ని ముందు వుంచడంవల్ల నరోద్నిక్కులు పెద్ద చారిత్రక సేవ చేశారు. యీ సమస్యలకి పరిష్కారం చూపించి (దాని ప్రయోజనం యేమైనా కానీవండి), ఆ రకంగా నరోదిజం రష్యన్ సామాజిక చింతన ప్రగతిశీల ధోరణుల్లో అగ్రస్థానం అధిష్టించడం అనేది సహజమూ, అర్థం చేసుకోగలిగినదీనీ.

కాని యీ సమస్యలకి నరోదిజం ప్రతిపాదించిన పరిష్కారాలు పశ్చిమ యూరప్‌లో యేనాడో వదిలేసిన వెనుకబడిన సిద్ధాంతాలైన, పెట్టుబడిదారీ విధానం గురించి కాల్పనిక పెటీబూర్జువా విమర్శమీదా, రష్యన్ చరిత్రకీ, వాస్తవానికీ సంబంధించిన ఆధారభూత మైన సత్యాలని నిర్లక్ష్యం చెయ్యడంమీదా ఆధారపడి పనికిరావని రుజువైనాయి. రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధీ, దాని అంతర్గతమైన వైరుధ్యాల అభివృద్ధీ యింకా చాలా బలహీనంగా వున్నప్పుడు, పెట్టుబడిదారీ విధానం గురించిన యీ ఆదిమ విమర్శ నిలబడ గలిగింది. కాని, రష్యాలో పెట్టుబడిదారీ విధానపు సమకాలీన అభివృద్ధినీ, రష్యన్ ఆర్థిక చరిత్రనీ, వాస్తవాన్నీ గురించిన మన జ్ఞానపు సమకాలీన స్థితినీ సామాజిక సిద్ధాంతంనుంచి సమకాలీన డిమాండ్లని గ్రహించగలిగిన శక్తి సామర్థ్యాలు పూర్తిగా నరోదిజానికి లేవు. పెట్టుబడిదారీ విధానపు సమస్యని ముందుపెట్టిన మొదటిదిగా ఒకప్పుడు అభ్యుదయకరమైన నరోదిజం యివాళ, సాంఘిక చింతనని పెడమార్గం పట్టించి స్తబ్ధతకీ, ఆసియా తరహా వెనుకబాటుతనానికీ అనుకూలం అయ్యే ప్రగతి నిరోధక, హానికరమైన నష్టదాయక సిద్ధాంతం అవుతోంది. యివాళ పెట్టుబడిదారీ విధానం గురించి తను చేసే విమర్శ ప్రగతి నిరోధక స్వభావం వారసత్వానికి విధేయమైన సంరక్షకత్వానికి తనని సంకుచిత పరచుకునే దృక్ప

థానికంటే హీనతకు పోయేటట్టు చేస్తోంది.* యిది అలా వుందనే విషయాన్ని, పైన చెప్పిన నరోద్నిక్ దృక్పథపు మౌలిక లక్షణాలు మూడింటిలోనూ ప్రతి ఒక్కదాన్నీ వివరిస్తూ రుజువు చెయ్య ప్రయత్నిస్తాం.

మొదటి లక్షణం — రష్యన్ పెట్టుబడిదారీ విధానం పతనాన్నీ, వెనకటడుగునీ రూపిస్తున్నదన్న అభిప్రాయం. రష్యాలో పెట్టుబడిదారీ విధానపు సమస్య ముందుకి వచ్చిన కొద్ది కాలానికే, మన ఆర్థికాభివృద్ధి పెట్టుబడిదారీ విధానంది అని స్పష్టపడింది. నరోద్నిక్కులు యీ అభివృద్ధిని తిరోగమనం అనీ, దోషమనీ, జాతి జీవిత చరిత్ర మొత్తం నిర్దేశించిందని భావించే పంథానుంచీ, తరతరాల పునాదులతో పవిత్రమైందని భావించే పంథానుంచీ పక్కకు మళ్లడం, అనీ యింకా యింకా అలాంటివనీ ఉద్ఘాటించారు. సామాజిక అభివృద్ధి తాలూకు యీ మార్గం పట్ల వికాసదాయకుల ఉత్సాహభరిత విశ్వాసం స్థానే అపనమ్మకం వచ్చింది, చారిత్రక ఆశావాదం, ఉత్సాహం స్థానాల్లో, వ్యవహారాలు అప్పుడు నడుస్తున్నట్లుగా నడిస్తే నూతన అభివృద్ధి లేవనెత్తిన సమస్యల పరిష్కారం యింకా గడ్డుగా, కష్టంగా వుంటుందన్న దానినుంచి ఉత్పన్నమైన నిరాశా, నిస్పృహలు ప్రవేశించాయి; యీ అభివృద్ధిని "మందగింప చెయ్యమనీ," "ఆపమనీ" విజ్ఞప్తులు వచ్చాయి; రష్యా వెనుకబాటుతనం మంచి లక్షణమనీ అదనీ సిద్ధాంతం ముందుకి వచ్చింది. నరోద్నిక్కు దృక్పథంలోని యీ లక్షణాలన్నీ, "వారసత్వం"తోటి ఉమ్మడిగా యేదేనా కలిగి వుండడం సరేసరి, మట్టగా దానికి విరుద్ధంగా వున్నాయి. రష్యన్ పెట్టుబడిదారీ విధానం "పథంనుంచి వైదొలగడా"న్నీ, పతనాన్నీ వగైరాలనీ రూపిస్తున్నదన్న భావం రష్యా మొత్తపు ఆర్థిక పరిణామాన్ని వక్రీకరించేటట్టు చేస్తుంది, మన కళ్లముందే జరుగుతున్న "మార్పు"ని వక్రీకరించేటట్టు చేస్తుంది. తరతరాల పునాదుల్ని పెట్టుబడిదారీ విధానం భగ్నం చెయ్యకుండా మందగింప చేసి ఆపుచెయ్యాలనే తమ కోరికతో తలమున్కలైపోయి నరోద్నిక్కులు చారిత్రక ఔచిత్యపు ఆశ్చర్యకరమైన లుప్తతని వెల్లడించుకుంటున్నారు. పెట్టుబడిదారీ విధానపు పూర్వస్థితిలో కూడా బానిసత్వపు లెక్కలేనన్ని రూపాలూ, వ్యక్తిగత పరాధీనతా మిళితమై శ్రామికుని స్థితిని భారంచేసిన అదే దోపిడీ తప్ప, సాంఘిక ఉత్పత్తిలో, ఆరకంగా అన్ని జీవిత రంగాల్లోనూ రొడ్డకొట్టుడు, స్తబ్ధత తప్ప మరేమీ లేవన్న విషయాన్ని వాళ్లు మరిచిపోతారు. తమ కాల్పనిక, పెటీబూర్జువా కోణంనుంచి

---

* ప్రగతి నిరోధక, పెటీబూర్జువా అనే పదాలకి పరిపూర్ణమైన కచ్చితమైన చారిత్రక తాత్విక అర్థం వుండగా, వాటిని వివాదాస్పద చర్చా నిందాత్మక పదాలుగా పరిగణించడంలో మన ప్రతికక్షులు అద్భుతమైన ప్రాస్యదృష్టిని ప్రదర్శిస్తారని యింతకు ముందే ఆర్థిక కాల్పనికతపైన వ్యాసంలో చెప్పే సందర్భం తటస్థపడింది.

పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా స్పర్ధిస్తూ నరోద్నిక్కులు సకల చారిత్రక వాస్తవికతనీ తుంగలో తొక్కుతున్నారు, సర్వకాలాల్లోనూ పెట్టుబడిదారీ విధాన వాస్తవికతని, తత్పూర్వపు స్థితి కాల్పనికతతో పోలుస్తున్నారు. అరవయ్యవ దశకపు ''వారసత్వం, ప్రస్తుత సాంఘికాభివృద్ధి తీరులోని అభ్యుదయకర స్వభావంపట్ల ఉత్సాహభరితమైన విశ్వాసంతోటీ, గత కాలపు అవశేషాలకి విరుద్ధంగా సంపూర్తిగా, ప్రత్యేకంగా యెక్కుపెట్టిన పట్టుసడలని వైరుధ్యంతోటీ, యీ అవశేషాలని సమూలం తుడిచిపెట్టాలి, అప్పుడే అంతా అద్భుతంగా సాగుతుందన్న నమ్మకంతోటీ వున్న వారసత్వం — యీ ''వారసత్వం'' పైన ఉల్లేఖించిన నరోదిజపు అభిప్రాయాలతో యే మేరకైనా సంబంధం కలిగివుండటం మాట అటుంచి, వాటికి సరాసరి విరుద్ధంగా వుంది.

నరోదిజపు రెండవ లక్షణం రష్యాకి వున్న విశిష్టతలో నమ్మకం, రైతాంగాన్ని గ్రామ కమ్యూన్‌ని ఆదర్శీకరించడం, వగైరా. రష్యా విశిష్టతత్వపు సిద్ధాంతం నరోద్నిక్కులని కాలంచెల్లిన పశ్చిమ యూరపియన్ సిద్ధాంతాల్ని అందిపుచ్చుకునేటట్టు చేసింది, పశ్చిమ యూరపియన్ సంస్కృతి సాధించిన విజయాలని ఆశ్చర్యకరమైన అల్పత్వంతో చూసేటట్టు ప్రేరేపించింది: నాగరిక మానవాళి లక్షణాలు మనకు కొన్ని లోపించినా, మరోపక్క ప్రపంచానికి నూతన ఆర్థిక పద్ధతులనీ వగైరాలనీ దర్శింపచేసేదానికి ''మనం విధి బద్ధులమై'' వున్నామనే ఆలోచనతోటి నరోద్నిక్కులు పూరటపొందారు. ప్రగతిశీల పశ్చిమ యూరపియన్ చింతన అందించిన పెట్టుబడిదారీ విధానపు వివరణనిగానీ, దాని వ్యక్తీకరణలనిగానీ పవిత్ర రష్యాకి సంబంధించి ఆమోదించక పోవడమేకాదు; యూరపియన్ పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన సూత్రీకరణలని రష్యా పెట్టుబడిదారీ విధానం గురించి చెయ్యకుండా వుండేందుకు సాకు కనిపెట్టడానికి ప్రతి ప్రయత్నమూ జరిగింది. యీ వివరణల రచయితలకి నరోద్నిక్కులు కాళ్ళు వెనక్కు లాక్కుని దణ్ణాలు పెట్టారు — పెట్టి యీ రచయితలు తమ జీవితమంతా దేనికి వ్యతిరేకంగా పోరాడారో ఆ కాల్పనికవాదులుగానే వుండిపోయారు. మళ్ళీ, రష్యా విశిష్టతత్వం అనే యీ సిద్ధాంతం — యిది అందరు నరోద్నిక్కులకూ వుంది — ''వారసత్వం'' తోటి యేదేనా ఉమ్మడి సంబంధం కలిగి వుండటం మాట అటుంచి దానికి సరాసరి విరుద్ధంగా వుంది. తద్వ్యతిరేకంగా, ''అరవయ్యవ దశకం'' రష్యాని యూరపీయకరణం చెయ్యాలని కోరింది, రష్యా సామాన్య యూరపియన్ సంస్కృతిని అనుసరించాలని భావించింది, యీ సంస్కృతి వ్యవస్థలని, ప్రత్యేకమైంది తప్ప మరేదేనా అయిన యీ గడ్డకి తెచ్చుకోవాలని ఆరాట పడింది. రష్యా విశిష్టతత్వం కలది అని చెప్పే యే సిద్ధాంతమేనా అరవయ్యవ దశకపు భావనతోటీ సంప్రదాయంతోటీ విభేదిస్తుంది. యీ సంప్రదాయంతో యింతకంటే విభేదంతో వుండేది గ్రామీణ ప్రాంతాన్ని నరోదిజం ఆదర్శవంతమూ, అతి ఆకర్షకమూ చెయ్యడం. యే రూపేణానేనాకానీ గ్రామీణ

వ్యవస్థలో యేదో ప్రత్యేకతని చూడాలని కోరినటువంటి, పెట్టుబడిదారీ సంబంధాల పూర్వ దశలో ప్రతి దేశంలోనూ వున్న గ్రామీణ వ్యవస్థకంటే పూర్తి భిన్నమైనదాన్ని కోరేటటు వంటి యీ తప్పుడు ఆదర్శీకరణ గంభీర వాస్తవిక వారసత్వపు సంప్రదాయాలతోటి నగ్న వైరుధ్యంతోటి వుంది. పెట్టుబడిదారీ విధానం యెంత విస్తృతంగా, గాఢంగా అభివృద్ధి చెందితే, సరుకు ఉత్పత్తిచేసే ప్రతి పెట్టుబడిదారీ సమాజానికీ సామాన్యమైన వైరుధ్యాలని గ్రామీణ ప్రాంతం అంత స్పష్టంగా వెల్లడిచేసింది; ఒక పక్కన రైతుల "సమష్టితత్వం" గురించీ, "కలిసికట్టుతత్వం" గురించీ నరోద్నిక్కులు చెప్పే తేనెపూసిన మాటలకీ, యింకో పక్క వాస్తవానికి గ్రామీణ బూర్జువావర్గంకిందా గ్రామీణ శ్రామికవర్గంకిందా రైతాంగపు విభజనకీ మధ్య భావవైరుధ్యం అంత కంతగా కొట్టవచ్చినట్టు వెల్లడైంది; రైతు దృష్టి నుంచే విషయాలని చూస్తూ వుండే నరోద్నిక్కులు అంత వేగంగా భావోద్విగ్న కాల్పనిక వాదులనుంచి పెటీబూర్జువా సిద్ధాంతవేత్తలుగా మారారు, యెందుచేతనంటే ఆధునిక సమాజంలో చిన్న ఉత్పత్తిదారుడు సరుకు ఉత్పత్తిదారుడుగా మారతాడు. గ్రామీణ ప్రాంతాన్ని తప్పుడుగా ఆదర్శవంతం చెయ్యడం, "సమష్టితత్వం" గురించిన కాల్పనిక స్వప్నాలు, ప్రస్తుత ఆర్థికాభివృద్ధి మార్గంలోనుంచి ఉత్పన్నం అయే రైతుల వాస్తవ అవసరాలపట్ల నరోద్నిక్కులు పరమ అల్పమైన దృష్టిని ప్రదర్శించేటట్టు చేసింది. సిద్ధాంతంలో పునాదుల పటుత్వాన్ని గురించి యెవరేనా కడుపునిండుగా మాట్లాడవచ్చు. కాని ఆచరణలో నరోద్నిక్కులందరూ, యివాళ్టికి కూడా మన రైతాంగాన్ని ఆపాదమస్తకం బంధించివేసే సంస్కరణాత్పూర్వపు వ్యవస్థ అవశేషాలని, గతకాలపు అవశేషాలని నిర్మూలించడం అనేది కచ్చితంగా పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గానికి దారి తెరుస్తుంది తప్ప మరొకటి కాదని బాగా గుర్తించారు. పెట్టుబడిదారీ అభివృద్ధికంటే స్తబ్దత మేలు — యిదీ, ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి ప్రతి నరోద్నిక్కు దృష్టినీ. వి. వి. అంత అమాయకపు సూటిదనంతోటి ప్రతి నరోద్నిక్కూ నిర్మొహమాటంగా, దాపరికం లేకుండా అలా అనే సాహసం చెయ్యడనుకోండి. "తమ కమతాలకీ, కమ్యూన్‌లకీ బంధితులైపోయి తమ శ్రమ యెక్కడ యెక్కువ ఉత్పాదకంగా, తమకి యెక్కువ ఉపయోగకరంగా వుంటుందో అక్కడ వినియోగ పరచుకోలేక, రైతులు తమ భూస్వామ్య దాస్యంనుండి బయటపడి చేరుకున్న క్రిక్కిరిసిన మందమాదిరి, అనుత్పాదక జీవిత విధానంలో ఘనీభవించిపోయారు." అదీ వారసత్వపు ప్రతినిధుల్లో ఒకాయన తన విశిష్ట "వికాసదాయకుడి" దృష్టినుంచి[102] దాన్ని దర్శించిన రీతి. "గ్రామీణ ప్రాంతంలో పెట్టుబడిదారీ విధానానికి దారి యివ్వడంకంటే రొడ్డ కొట్టుడు, పితృస్వామిక జీవిత రూపంలో రైతులని ఘనీభవించిపోనివ్వండి" — అదీ, ముఖ్యంగా, ప్రతి నరోద్నిక్కూ దాన్ని దర్శించే రీతి. సమష్టి బాధ్యతతోటీ, భూమి అమ్మకంలేని హక్కుతోటి కమతాన్ని వదలుకొనే హక్కు నిషేధంతోటీ వున్న రైతు కమ్యూన్ పరిమితమైన

సాంఘిక అంతస్తు సమకాలీన ఆర్థిక వాస్తవికతకూ, సమకాలీన సరుకు ఉత్పత్తి పెట్టుబడిదారీ సంబంధాలకీ, వాటి అభివృద్ధికీ నిశితమైన వైరుధ్యంతో వుంటుందనేదాన్ని యే ఒక్క నరోద్నిక్కూ తిరస్కరించే సాహసం నిజంగా చెయ్యడు. యీ వైరుధ్యాన్ని తిరస్కరించడం అసాధ్యం. కాని అసలు విషయం యేమిటంటే, యీ సమస్యని, ఆర్థిక వాస్తవాలతోటి రైతాంగపు న్యాయపర హోదాకీ ప్రస్తుత ఆర్థికాభివృద్ధి మార్గానికీ గల తారతమ్యాన్ని ముందు పెట్టాలంటేనే నరోద్నిక్కులు భయకంపితులైపోతారు. తన కాల్పనిక వూహల్లో కల్పితమైన, అస్తిత్వంలేని, పెట్టుబడిదారీయేతర అభివృద్ధిలో నమ్మకం కుదుర్చుకోవాలని మొండిగా వుంటాడు నరోద్నిక్కు కాబట్టి... కాబట్టి ప్రస్తుతం పెట్టుబడిదారీ పంథాలో క్రమిస్తూన్న అభివృద్ధిని మందగింప చెయ్యడానికి సన్నద్ధమవుతాడు. రైతు కమ్యూన్ పరిమిత సాంఘిక అంతస్తు సమష్టి బాధ్యతలాంటి సమస్యలపట్ల, తన కమతాన్ని వదలుకోవడానికీ అమ్ముకోవడానికీ సంబంధించి రైతుకి వుండే హక్కుపట్లా నరోద్నిక్కు దృష్టి "పునాదులకి" (రొడ్డకొట్టుడు, స్తబ్ధతల పునాదులు) సంబంధించిన భయం, విపరీతమైన హెచ్చరిక మాత్రమే కాదు; అంతకంటే యెక్కువగా రైతులు భూమిని అమ్ముకోవడాన్ని నిషేధిస్తూ పోలీసు రూలుని ఆహ్వానించేటంత కనీసపు స్థాయికి నరోద్నిక్కు దిగజారతాడు. అలాంటి నరోద్నిక్కుని ఎంగెల్‌హార్ట్ మాటల్లో నోరు మూయించాలి: "పాపం రైతు శుంఠ, తన వ్యవహారాలు తను నిర్వహించుకోలేడు. అతన్ని యెవరూ పట్టించుకోకపోతే అతను అడవులన్నిటినీ దహనంచేస్తాడు, పశులన్నిటినీ చంపేస్తాడు, నదుల్లో చేపలేమీ లేకుండా వూడ్చేస్తాడు, భూమిని ధ్వంసం చేసుకుంటాడు, తనే కడతేరిపోతాడు." యిక్కడ నరోద్నిక్కు ఖాయంగా "వారసత్వాన్ని పరిత్యజిస్తున్నాడు," ప్రగతి నిరోధకుడవుతున్నాడు. మరి గమనించండి, ఆర్థికాభివృద్ధి ముందుకు పోవడంతోటి, రైతు కమ్యూన్ సాంఘిక అంతస్తు ప్రత్యేకత విచ్ఛిత్తి గ్రామీణ శ్రామికవర్గానికి మరింతగా విధియుక్త అవసరం వుంది. అదే సమయంలో అక్కణ్ణుంచి రైతు బూర్జువావర్గానికి సంభవించే అసౌకర్యాలు లెక్కలోనివే కావు. "కొరవగల రైతు" భూమిని అద్దెకిచ్చుకుంటాడు, యింక వూళ్లో దేన్నైనా స్థాపిస్తాడు, తన యిష్టం వచ్చిన చోటికి, యిష్టం వచ్చినప్పుడు వ్యాపారం నిమిత్తం పోతాడు. కాని ప్రధానంగా తన శ్రమశక్తిని అమ్ముకునే బతికే "రైతు" తన కమతానికీ కమ్యూన్‌కీ బంధితుడైపోవడం అనేది అతని ఆర్థిక కార్యకలాపంమీద యెంతో పెద్ద ఆంక్ష అవుతుంది, అతను యింకో మంచి ఉద్యోగదాత దగ్గరకి పోవడాన్ని అసంభవం చేస్తుంది, స్థానికంగానే శ్రమశక్తిని కొనుగోలుచేసే వాళ్లకి శ్రమశక్తిని అమ్ముకునేటట్టు నిర్బంధిస్తుంది. ఆ కొనుగోలుదారుడు విధిగా తక్కువ చెల్లిస్తాడు, రైతుని బానిసత్వానికి కుంచించివేసే సకల మార్గాలనీ పద్ధతులనీ అన్వేషిస్తాడు. కాల్పనిక స్వప్నాలకి లొంగిపోయి, ఆర్థికాభివృద్ధి గతి యెలావున్నప్పటికీ, పునాదులని నిలబెట్టి, కాపాడాలనే లక్ష్యం పెట్టుకుని

వుండటంవల్ల నరోద్నిక్కు, తనకి తెలియకుండానే, యీ యేటవాలు చదునుమీద కిందికి జారి సర్వాత్మణా "భూమితోటి రైతు బంధాన్ని" కాపాడి, సుదృఢం చెయ్యాలని తపనపడే, భూమిని మళ్లీ పంచాలనేవాడి పక్కన తేలాడు. ఉదాహరణకి, రైతు కమ్యూన్ సాంఘిక అంతస్తు అనేది పనివాళ్లని కూలికి పెట్టుకోవడంలో ప్రత్యేకమైన పద్ధతులకి కారకమైందని, గుర్తుచేసుకోవడం మంచిది: ఫ్యాక్టరీ, క్షేత్ర యజమానులు గ్రామాలకి, ముఖ్యంగా యెక్కువ రుణభారంలో వున్నవాటికి, బహు లాభసాటి షరతులమీద శ్రామికుల్ని నియోగించుకునేదానికి యేజెంట్లని పంపుతున్నారు. అదృష్టవశాత్తూ, శ్రామికుడి "స్థిరీకృత స్థితిని" భగ్నంచేసి (వ్యావసాయికేతర ఉద్యోగాలు అని పిలిచేవాటి ఫలితం అలాంటిది) అభివృద్ధిచెందే పెట్టుబడిదారీ విధానం యీ రూపపు బానిసత్వాని బదులు క్రమేపీ అప్పనపు కూలీ ప్రవేశపెడుతోంది.

యీనాటి నరోద్నిక్కు సిద్ధాంతాలు ఉపద్రవకరమైనవన్న మా వాదనకి యింకో సాక్ష్యాధారం, బహుశా యింత కొట్టవచ్చినట్టుగానూ వుండేది, వెట్టిచాకిరీని ఆదర్శవంతం చెయ్యాలని నరోద్నిక్కులలో వున్న సామాన్య ధోరణిలో కనిపిస్తుంది. "ఆకాశంబుననుండి" తన నరోద్నిక్కు "పతనపు" పరాకాష్టలో ఎంగెల్‌హార్ట్ యెలా గ్రామీణ ప్రాంతంలో శ్రామిక సేవలని పెంపొందించడం "మంచి విషయం" అనేదాకా పోయాడో ఆ ఉదాహరణని యిదివరకే యిచ్చాం. వ్యావసాయిక ఉన్నత పాఠశాలలకోసం యుజకోవ్‌యొక్క ప్రసిద్ధ ప్రణాళికలో అదే విషయం మనకి కనిపిస్తుంది ("రూస్కాయె బొగాత్‌స్త్వొ" 1895, నంబరు 5). అదే పత్రికలో గంభీరమైన ఆర్థిక వ్యాసాల్లో ఎంగెల్‌హార్ట్ తోటి రచయిత వి. వి. పెట్టుబడిదారీ విధానం ప్రవేశపెట్టాలని అనుకున్నాడని తలచే భూస్వామిమీద రైతు ఒక విజయాన్ని సాధించాడని చాటి, అదే బాపతు ఆదర్శీకరణకు గురయ్యాడు; కాని అసలు గొడవంతా యెక్కడ వుందంటే రైతు భూస్వామి భూమిని, అతన్నుంచి "గుత్తకు" తీసుకున్నదానికి బదులుగా సాగుచెయ్యపూనుకున్నాడు — వేరే మాటల్లో చెప్పాలంటే, భూస్వామ్య దాస్య వ్యవస్థలో వున్న అదే ఆర్థిక పద్ధతిని తిరిగి ప్రవేశపెడుతునాడన్నమాట. మన వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపట్ల నరోద్నిక్కుల ప్రగతి వ్యతిరేక దృక్పథంలో కొట్టవచ్చినట్టు కనబడే ఉదాహరణల్లో యివి కొన్ని. కొంచెం తక్కువ మోతాదులో ప్రతి నరోద్నిక్కూ యీ భావాన్ని చెపుతూ వుండటం మీకు కనిపిస్తుంది. మన వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం విపత్కరమైందనీ, ప్రమాదకరమైందనీ, యేమంటే స్వతంత్ర రైతు స్థానంలో పెట్టుబడిదారీ విధానం మరి వ్యవసాయ కార్మికుణ్ణి పెడుతుందనీ ప్రతి నరోద్నిక్కూ అంటాడు. పెట్టుబడిదారీ విధానపు వాస్తవం ("వ్యవసాయ కార్మికుడు" "స్వతంత్ర" రైతు అనే కల్పన తోటి తారతమ్యంతో వుంది: పెట్టుబడిదారీ విధాన పూర్వపు యుగంలో ఉత్పత్తి సాధనాల రైతు స్వామ్యంమీద యీ కల్పన ఆధారపడింది; యీ ఉత్పత్తి

సాధనాలకోసం రైతు రెండింతలు విలువ చెల్లించాల్సివుందనీ, యీ ఉత్పత్తి సాధనాలు వెట్టిచాకిరి చేసినందుకు బదులు అనీ, యీ "స్వతంత్ర" రైతు జీవన ప్రమాణం యెంత హీనమైంది అంటే యే పెట్టుబడిదారీ దేశంలోనేనా అతన్ని బికారి అని వర్గీకరిస్తారనీ, యీ "స్వతంత్ర" రైతు దుర్భర దారిద్ర్యానికీ, బౌద్ధిక జడత్వానికీ తోడు పెట్టుబడిదారీ విధాన పూర్వపు ఆర్థిక వ్యవస్థ రూపాలని విధిగా అనుగమించి వచ్చే వ్యక్తిగత పరాధీనత వుంటుందనీ వాస్తవాలని చక్కగా మర్చిపోవడం జరుగుతోంది.

నరోదిజపు మూడవ విశిష్ట లక్షణం — ఒక పక్క దేశపు న్యాయ, రాజకీయ సంస్థలకీ, "మేధావి వర్గాని"కీ వున్న సంబంధంపట్ల, యింకో పక్క కచ్చితమైన సాంఘిక వర్గాల పాదార్థిక ప్రయోజనాలపట్లా ఉపేక్ష అనేది విడదియ్య లేకుండా ముందువాటితో బంధితమై వుంది: సాంఘిక సమస్యలపట్ల యీ అవాస్తవిక దృక్పథం మాత్రమే రష్యన్ పెట్టుబడిదారీ విధానం "దోషపూరిత" మనీ, "పథంనుంచి పక్కకు మళ్లడం" సాధ్యమని చెప్పే సిద్ధాంతాన్ని పెంచి వుండగలదు. యీ నరోద్నిక్కు అభిప్రాయానికి కూడా అరవైలనాటి "వారసత్వం" తోటీ, సంప్రదాయాలతోటీ యే సంబంధమూ లేదు; తద్వ్యతిరేకంగా యీ సంప్రదాయాలకి పూర్తి విరుద్ధంగా వుంది. యీ అభిప్రాయపు సహజ పర్యవసానం రష్యన్ జీవితపు సంస్కరణాత్పూర్వ నియమనిబంధనల అనేక అవశేషాలపట్ల నరోద్నిక్కుల దృక్పథం. యీ దృక్పథం "వారసత్వపు" ప్రతినిధులకి వుండేది కాదు. యీ దృక్పథాన్ని వర్ణించడానికి "దుష్ట కల్పన" ("నోవొయె స్లోవొ"[103], సెప్టెంబరు, 1897) అనే వి. ఇవనోవ్ వ్యాసంలోని బ్రహ్మాండమైన వ్యాఖ్యానాన్ని బదులు తెచ్చుకునే చనువు తీసుకుంటాం. ఆ రచయిత బొబొరీకిన్ నవల "భిన్న పథం" అనే దాన్ని ప్రస్తావించి, నరోద్నిక్కులకీ "శిష్యవర్గానికీ" మధ్య వున్న తగూ అనే అతని తప్పుడు అభిప్రాయాన్ని వెల్లడిచేస్తాడు. బొబొరీకిన్ తన నవల నాయకుడైన నరోద్నిక్కుచేత "శిష్యవర్గాన్ని" "నియమనిబంధనల తాలూకు దుర్భర నియంతృత్వంతోటి బారకాసుల పరిపాలన"ని ఆరోపితంగా కలగంటున్నందుకు నిందింపచేస్తాడు. యీ సందర్భంలో వి. ఇవనోవ్ యిలా అంటాడు:

"తమ ప్రతికక్షుల 'కల' నియమనిబంధనలయొక్క దుస్సహ నియంతృత్వం అనక పోవడమేకాక వాళ్లు (నరోద్నిక్కులు) తాము నరోద్నిక్కులుగా వున్నంతకాలం అలాగని అనలేరు, అనరు. యీ విషయంలో, నరోద్నిక్కుల అభిప్రాయం ప్రకారం, 'ఆర్థిక భౌతికవాదుల'తోటి వాళ్ల వివాదపు సారాంశం యేమంటే పాత నియమనిబంధనల మిగిలిన అవశేషాలు దాని యితోధిక అభివృద్ధికి ఆధారం కావచ్చుని. ఒకవైపున 'రైతు ఆత్మ' (ఏక, అభిన్న) నియమనిబంధనల కేసి 'పరిణమిస్తోంద'న్న తమ విశ్వాసంతోటీ, యింకోవేపున 'మేధావివర్గపు,' 'సమాజపు' లేదా సాధారణంగా 'నాయక వర్గాల'లో ప్రస్తుతం

వున్నటువంటి లేదా రాబోయేటటువంటి నైతిక సౌందర్యంపట్ల తను నమ్మకంతోటి పాత నియమనిబంధనలు వాళ్ల కళ్లకి మూసుకుపోయాయి. వాళ్లు ఆర్థిక భౌతికవాదుల్ని నియమ నిబంధనలతో మైమరిచిపోయినందుకు కాదు నిందించేది, కాని, తద్భిన్నంగా, నియమనిబం ధనలనుంచి స్వేచ్ఛ వుండటంమీద ఆధారపడిన పశ్చిమ యూరపియన్ వ్యవస్థతోటి మైమరచిపోయినందుకు. స్వయంపోషక ఆర్థిక రూపంనుంచి ఉత్పన్నం అయిన పాత నియమ నిబంధనల అవశేషాలు, జనాభాలోని అనేక విభాగాల వాస్తవ హోదాలోనూ, మానసిక, నైతిక తీరులోనూ లెక్కలేనన్ని మార్పులకి ఆస్పదమవుతూ, ద్రవ్య, ఆర్థిక వ్యవస్థకి మారిన దేశంలో నిత్యమూ యింకా యింకా దుస్సహమవుతున్నాయి అని ఆర్థిక భౌతికవాదులు వాస్తవంగానే దృఢంగా అంటారు. అందుకని దేశపు ఆర్థిక జీవితంలో నూతన, ప్రయో జనకర నియమనిబంధనల ఉత్పన్నానికి అవసరమైన పరిస్థితులు, స్వయంపోషక ఆర్థిక రూపానికీ, భూదాస్య వ్యవస్థకీ అనుకూలంగా అమరిన పాత నియమనిబంధనలనుంచి అభివృద్ధి చెందలేవనీ, అభివృద్ధి చెందిన పశ్చిమ యూరపియన్ దేశాలలోనూ, అమెరికా లోనూ బాగా పాత నియమనిబంధనలనుంచి విస్తృతమైన సర్వగ్రాసి అయిన స్వేచ్ఛాయుత వాతావరణంలో మాత్రమే వికసించగలవు అనీ వాళ్లు విశ్వసిస్తారు. 'నియమనిబంధనల'కి సంబంధించిన సమస్య వివాదం విషయంలో నరోద్నిక్కులకీ వాళ్ల ప్రతికక్షులకీ మధ్య విషయాలు వున్న స్థితి అదీ" (పేజీలు 11–12 ఉల్లేఖించబడిన చోట). "పాత నియమ నిబంధనలయొక్క అవశేషాల" పట్ల నరోద్నిక్కుల యీ వైఖరి బహుశా, "వారసత్వపు" సంప్రదాయాలనుంచి వాళ్లు పరమ నింద్యంగా నిష్క్రమించడం అవుతుంది. మనం చూసి నట్టుగా వారసత్వపు ప్రతినిధులు పాత నియమనిబంధనల అవశేషాలపట్ల తమ చెరపలేని, ఉధృతమైన అసహిష్ణుతతోటి విశిష్టమయ్యారు. తత్ఫలితంగా, యీ విషయంలో "శిష్యవర్గం" అసదృశంగా అరవైలనాటి "సంప్రదాయాల"కీ "వారసత్వాని"కీ నరోద్ని క్కులకంటే సన్నిహితంగా వున్నారు.

పైన చెప్పిన నరోద్నిక్కుల చాలా ముఖ్యమైన తప్పుకి తోడుగా వాళ్లకి సాంఘిక వాస్తవికత లుప్తంకావడం అనేది వాళ్లని సామాజిక వ్యవహారాలకి సంబంధించీ, సమస్యలకి సంబంధించీ ఒక ప్రత్యేక ధోరణి ఆలోచనకీ, తర్కానికీ నెట్టుతుంది, దాన్ని సంకుచిత, బౌద్ధిక స్వాతిశయం అనవచ్చు, లేదా, బహుశా, బ్యురాక్రటిక్ మనస్తత్వం అనచ్చు. మన దేశానికి "మనం" యెన్నుకోవాల్సిన పథం గురించీ, ఫలానా ఫలానా దారిలో దేశాన్ని నడిపిస్తే సంభవించబోయే అనర్థాలు యేమిటన్న వాటి గురించీ, యూరప్‌నుంచీ, మన ప్రాచీన గ్రామ కమ్యూన్‌లనుంచీ "మంచి యేదైతే వుందో దాన్ని తీసుకుంటే" పాత యూరప్ నడిచిన పథపు ప్రమాదాలని తప్పించుకుంటే "మనం" మనకిగా పరిరక్షించుకో గల భవిష్యదవకాశాల గురించీ యింకా అలాంటివాటి గురించీ నరోద్నిక్కు యెల్లవేళలా విస్త

రిస్తూనే వుంటాడు. అందుకనే చరిత్రని తమ ప్రయోజనాలకి అనుగుణంగా రూపొందించుకునే అనేక సాంఘిక వర్గాల స్వతంత్ర ధోరణులపట్ల నరోద్నిక్కు పూర్తి అపనమ్మకం, ఉపేక్షానూ. అందుకనే నరోద్నిక్కు (తన చుట్టూ వున్న పరిస్థితిని మర్చిపోయి) "వ్యవసాయ కార్మికుల్ని వ్యవస్థీకరించడం" నుంచి మన "సమాజపు" అనుగ్రహంవల్ల "ఉత్పత్తిని కమ్యూనల్‌గా (సామూహికంగా) చెయ్యడం" దాకా వున్న అనేక రకాల సాంఘిక ప్రణాళికల్ని ముందుకు పెట్టేటంతటి ఆశ్చర్యకరమైన అల్పత్వం. "Mit der Gründlichkeit der geschichtlichen Action wird der Umfang der Masse zunehmen, deren Action sie ist."* నరోద్నిక్కులు యెన్నటికీ అర్థంచేసుకోని, చేసుకోలేని ఆ చారిత్రక తాత్విక సిద్ధాంతపు గంభీరమైన, అత్యంత ముఖ్యమైన బోధనని యీ మాటలు వ్యక్తంచేస్తాయి. మానవుడి చరిత్ర నిర్మాణ శక్తి విస్తృతంగా, లోతుగా పెరిగేకొద్దీ చైతన్యయుత చరిత్ర నిర్మాత అయే జనాభా పరిమాణం విధిగా పెరిగి తీరుతుంది. యేమైనా నరోద్నిక్కు జనాభాని సామాన్యంగానూ, శ్రామికప్రజని ప్రత్యేకంగానూ, కొంచెమించుమించులో యుక్తమైన యేదో ఒక చర్యకి లక్ష్యంగా, యీ మార్గంలోనో ఆ మార్గంలోనో నడిపించగలదిగా పరిగణించాడు గాని, జనాభాలోని అనేక వర్గాలని ప్రస్తుతంవున్న పథంమీద స్వతంత్ర చరిత్ర నిర్మాతలుగా యెన్నడూ పరిగణించలేదు. ప్రకృత పథపు యే పరిస్థితులు యీ చరిత్ర నిర్మాతల స్వతంత్ర చైతన్యయుత కార్యకలాపాన్ని ప్రేరేపిస్తాయో (లేకపోతే, తద్విరుద్ధంగా, స్తంభింపజేస్తాయో) ఎన్నడూ అనుకోలేదు.

అందుచేత వికాసదాయకుల "వారసత్వం" తోటి పోల్చినపుడు రష్యాలో పెట్టుబడిదారీ విధాన సమస్యని ముందుకుపెట్టి, నరోదిజం ఒక పెద్ద ముందడుగు వేసినప్పటికీ, పెట్టుబడిదారీ విధానం గురించి తన పెటీబూర్జువా దృక్పథం, భావోద్విగ్న విమర్శ కారణంగా, ఆ సమస్యకి అది చూపించిన పరిష్కారం యెంత వెలితిగా వుందని తేలిందంటే, సాంఘిక జీవితపు అనేక మౌలిక సమస్యలమీద అది "వికాసదాయకుల"కి వెనకబడిపోయింది. మన వికాసదాయకుల వారసత్వంతోటీ, సంప్రదాయాలతోటీ నరోదిజపు సంబంధం కడకి ఆటంకంగా తయారైంది: రష్యా సంస్కరణానంతర ఆర్థికాభివృద్ధివల్ల రష్యన్ సామాజిక చింతనని చుట్టుముట్టిన నూతన సమస్యల్ని, వాటిమీద భావోద్విగ్న, ప్రగతి నిరోధక శోకా

* "చారిత్రక చర్యయొక్క గాఢతతోటి, అది యే ప్రజాబాహుళ్యపు ఆశయంగా ఉందో ఆ బాహుళ్యపు పరిమాణం పెరుగుతుంది." Marx, *Die heilige Familie*, S. 120[104] బేల్తొవ్ ప్రకారం[105] ఉల్లేఖించింది, పేజి 235. – సం.

నికి తన్నుతాను పరిమితం చేసుకుని, నరోదిజం పరిష్కరించలేదు; అదే సమయంలో వికాస దాయకులు ముందుపెట్టిన పాత సమస్యలని నరోద్నికుల్కా కాల్పనికత మసక కమ్మేసి ఆరకంగా వాటి పూర్తి పరిష్కారాన్ని ఆటంకపరచింది.

## IV

## "వికాసదాయకులు," నరోద్నికుల్కులు, "శిష్యవర్గం"

యిప్పుడు మన సాదృశ్యాల ఫలితాలని సంగ్రహంగా చెప్పుకుందాం. ఉపశీర్షికలో ప్రస్తావించిన సామాజిక చింతన ధోరణుల్లో ప్రతి ఒకటీ మిగతా వాటితో యేయే సంబంధంలో వుందో, ఆ సూక్ష్మ వివరణ యిచ్చే ప్రయత్నం చేద్దాం.

సామాజికాభివృద్ధి ప్రస్తుత మార్గాన్ని వికాసదాయకుడు నమ్ముతాడు, దాని అంతర్గత వైరుధ్యాలని గమనించడంలో అతను విఫలుడవుతాడు కాబట్టి. నరోద్నికుల్కా సామాజిక అభివృద్ధి ప్రస్తుత మార్గమంటే భయపడతాడు, యీ వైరుధ్యాలని గురించిన చైతన్యం అతనికి యిప్పటికే వుంది కాబట్టి. "శిష్యుడు" సామాజికాభివృద్ధి ప్రస్తుత మార్గంలో విశ్వాసం వుంచుతాడు, యీ వైరుధ్యాల పూర్తి పరిణతిలోనే మేలైన భవిష్యత్తుకిగల ఒక్క అవతారికనీ అతను చూస్తాడు. అంచేత తొలి ధోరణివాళ్లూ, ఆఖరి ధోరణివాళ్లూ ప్రస్తుత మార్గంలో అభివృద్ధిని అనుకూలంచేసి, వేగవంతంచేసి బలపరచాలనే ప్రయత్నం చేస్తారు, యీ అభివృద్ధిని ఆటంకపరచి, కుంటుపరచే సకల అవరోధాలనీ తొలగించ ప్రయత్నిస్తారు. తద్వ్యతిరేకంగా నరోదిజం యీ అభివృద్ధిని ఆటంకపరచి ఆపుచెయ్యాలని ప్రయత్నిస్తుంది, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి వుండే కొన్ని అవరోధాలని నిర్మూలించడానికి భయపడుతుంది. తొలి, కడపటి ధోరణులని చారిత్రక ఆశావాదం అని పిలిచే దాంతోటి ప్రత్యేకించవచ్చు: వున్నట్టుగా విషయాలు ఎంత ముందుకి, యెంత వేగంగా పోతే అంత మంచిది. నరోదిజం, తద్భిన్నంగా, సహజంగానే చారిత్రక నిరాశావాదానికి మొగ్గుతుంది: వున్నట్టుగా విషయాలు యెంత ముందుకి పోతే అంత అధ్వాన్నం అవుతుంది. సంస్కరణానంతర అభివృద్ధి స్వభావానికి సంబంధించిన ప్రశ్నల్ని "వికాసదాయకులు" యెప్పుడూ ముందు పెట్టలేదు. సంస్కరణాత్పూర్వపు వ్యవస్థ తాలూకు అవశేషాలకి వ్యతిరేకంగా పోరాడ్డానికీ, రష్యాలో యూరపియన్ తరహా అభివృద్ధికి దారి సుగమంచేసే రుణపక్ష కర్తవ్యానికీ పరిమితులయ్యారు. రష్యాలో పెట్టుబడిదారీ విధాన సమస్యని నరోదిజం ముందుపెట్టింది. కాని పెట్టుబడిదారీ విధానం ప్రగతి నిరోధకమైందనే అర్థంలో దానికి భాష్యం చెప్పింది. అంచేత వికాసదాయకుల వారసత్వాన్ని పూర్తిగా ఆమోదించలేకపోయింది. "ఒకే నాగరికత" దృష్టి

నుంచి రష్యాని యూరపీయకరణం చెయ్యాలని సామాన్యంగా ప్రయత్నించిన మనుషులకి వ్యతిరేకంగా నరోద్నిక్కులు యెప్పుడూ పోరాడుతూనే వున్నారు; తాము, నరోద్నిక్కులు, యీ మనుషుల ఆదర్శాలకి తమని పరిమితం చేసుకోలేక మాత్రమే కాదు పోరాడింది (అలాంటి పోరాటం ధర్మంగానే వుంటుంది) యీ అభివృద్ధిలో, అంటే పెట్టుబడిదారీ నాగరికతలో, అంతదూరం వెళ్లదలచుకోలేదు కాబట్టి. రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికర మైందనీ, అంచేత వికాసదాయకుల వారసత్వాన్ని, ఆస్తిరహిత ఉత్పత్తిదారుల దృష్టి నుంచి పెట్టుబడిదారీ వైరుధ్యాల వివరణతోటి దాన్ని పూరకంచేస్తూ, తాము సంపూర్తిగా అంగీకరించితీరాలనీ ''శిష్యవర్గం'' యీ సమస్యకి జవాబిస్తారు. వికాసదాయకులు జనాభాలోని యే ఒక్క వర్గాన్నీ ప్రత్యేక శ్రద్ధ నిమిత్తం వేర్పాటుగా చూపించలేదు; వాళ్లు జనాభాని గురించి మాత్రమే కాదు సామాన్యంగా మాట్లాడింది, దేశాన్ని గురించి కూడా సామాన్యంగానే మాట్లాడారు. నరోద్నిక్కులకి శ్రామికవర్గ ప్రయోజనాలని ప్రతి బింబించే కోరిక వుండింది, కాని సమకాలీన ఆర్థిక వ్యవస్థలో యే నిర్దేశిత గ్రూపునీ సూచించ లేదు; వాస్తవానికి, వాళ్లు యెప్పుడూ, పెట్టుబడిదారీ విధానం సరుకు ఉత్పత్తిదారునికింద మార్చే చిన్న ఉత్పత్తిదారుడి దృక్పథమే వహించారు. ''శిష్యవర్గం'' తమ గీటురాయిగా శ్రామిక ప్రయోజనాలని గ్రహించడమే కాదు, అలా చెయ్యడంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో నిర్దేశిత ఆర్థిక గ్రూపులని, అంటే, ఆస్తిరహిత ఉత్పత్తిదారులని సూచిస్తుంది. తమ లక్ష్యాల స్వభావరీత్యా తొలి, కడపటి ధోరణులు పెట్టుబడిదారీ విధానం సృష్టించి, పెంపొందించిన వర్గాల ప్రయోజనాలకి అనుగుణంగా వుంటాయి; నరోదిజం స్వభావరీత్యా చిన్న ఉత్పత్తిదారుల వర్గపు ప్రయోజనాలకి సరిపడి వుంటుంది, ఆ వర్గం పెటీబూర్జువా వర్గం, సమకాలీన సమాజపు వర్గాల్లో మధ్యస్థ స్థానం ఆక్రమిస్తుంది. పర్యవసానంగా ''వారసత్వాని''కి సంబంధించిన నరోదిజపు వైరుధ్యపూరిత వైఖరి యాదృచ్ఛికంకాదు, నరోద్నికు అభిప్రాయాల స్వభావంవల్లనే సిద్ధించిన తప్పనిసరి ఫలితం: వికాసదాయకుల అభిప్రాయాల ప్రధాన లక్షణాల్లో ఒకటి రష్యాని యూరపీయకరణం చెయ్యాలనే ఉద్ధృత మైన కోరిక అనీ, కాని నరోద్నిక్కులు నరోద్నిక్కులుగా వుండటం పూర్తిగా మానుకుంటే తప్ప యీ కోరికని పంచుకోలేరనీ మనం చూశాం.

ఆయా ప్రత్యేక సందర్భాల్లో మళ్లీ మళ్లీ చెబుతూ వచ్చిన నిర్ధారణలకే మనం ఆఖరికి చేరాం, అంటే, వారసత్వానికి శిష్యవర్గం నరోద్నిక్కులకంటే యెంతో యెక్కువ స్థిరమైన, విశ్వాసపాత్రమైన సంరక్షకులుగా వున్నారన్నది. వారసత్వాన్ని పరిత్యజించక పోవడం సరికదా, వికాసదాయకుల యూరపియన్ ఆదర్శాలని చాలా యెక్కువ, చాలా ముఖ్య మైన విషయాల్లో నరోద్నిక్కులని తిరస్కరింపచేసేటట్టు ప్రేరేపించే కాల్పనికవాద పెటీ బూర్జువా సంశయాలని ఖండించడం తమ ప్రధానమైన కర్తవ్యాల్లో ఒకటిగా వాళ్లు పరి

గణిస్తారు. ప్రాచీన పత్రాలని భద్రపరచేవాడు ఒక ప్రాచీన పత్రాన్ని పదిలంగా కాపాడిన ట్టుగా ''శిష్యవర్గం'' వారసత్వాన్ని కాపాడరని చెప్పనక్కర్లేదు. వారసత్వాన్ని కాపాడ్డం అంటే అర్థం వారసత్వానికి పరిమితం అయిపోవడం అని కాదు. మన పెట్టుబడిదారీ అభి వృద్ధిలో అర్థతః గర్భితంగావున్న వైరుధ్యాల వివరణని, పైన చెప్పిన ప్రత్యేక దృక్పథం నుంచి యీ అభివృద్ధిని గురించిన అంచనాని యూరపియనిజపు సామాన్య ఆదర్శాలకి తామిచ్చే వత్తాసుకి ''శిష్యవర్గం'' జతచేస్తుంది.

## V

## ''శిష్యవర్గం'' వారసత్వాన్ని పరిత్యజించడం గురించి మిహైలోవ్‌స్కీ

ముగింపుగా మళ్లీ మిహైలోవ్‌స్కీ దగ్గరికి వెళ్లి ప్రస్తుతం పరిశీలనలో వున్న విష యానికి సంబంధించి ఆయన వ్యాఖ్యలని పరిశీలిద్దాం. యీ మనుషులు (శిష్యవర్గం) ''గతంతోటి వున్న యే అవిచ్ఛిన్నతనీ గుర్తించరనీ, వారసత్వాన్ని నదురూ బెదురూ లేకుండా పరిత్యజిస్తార''నీ చాటడమే కాదు (ఉల్లేఖించిన గ్రంథం, 179) ''వీళ్లు'' (అబ్రామొవ్, వొలీన్‌స్కీ, రోజనొవ్‌ల సహా, అత్యంత విభిన్న ధోరణులున్న మిగతా వాళ్లతో కలిసి) ''వారసత్వానికి వ్యతిరేకంగా మహోగ్రులై విరుచుకుపడతారు'' (180). మిహై లోవ్‌స్కీ యే వారసత్వాన్ని ఉద్దేశిస్తున్నాడు? అరవైయ్యవ, డెబ్బైయవ దశకపు వారస త్వానికి, ''మస్కోవ్‌స్కియె వేదొమొస్తి'' యధావిధిగా తర్పణలిచ్చిన, యిస్తూవున్న వారస త్వానికి (178).

యీనాటి ప్రజలకి సంక్రమించిన ''వారసత్వం'' సమస్యే అయితే రెండు వారసత్వాల మధ్య విభేదం చూడాల్సివుంటుందని ముందే చెప్పాం: ఒక వారసత్వం సామాన్యంగా వికాస దాయకులది, సంస్కరణాత్పూర్వపు అన్ని పద్ధతులకి పరమ విద్వేషులైన వాళ్లది, యూర పియన్ ఆదర్శాలకీ, విశాల ప్రజా బాహుళ్యపు ప్రయోజనాలకీ ప్రాతినిధ్యం వహించిన వాళ్లది. రెండవ వారసత్వం నరోదిజంది. యీ రెండింటినీ తికమక చెయ్యడం శుద్ధ తప్పు అని యిదివరకే చూపించాం. ఎందుకంటే ''అరవైయ్యవ దశకపు సంప్రదాయాలని'' కాపాడుతూ కూడా నరోదిజంతో యే సామాన్య లక్షణమూ లేని వాళ్లు గతంలో వున్నారు, యిప్పటికీ వున్నారు అన్నది అందరికీ తెలుసు. మిహైలోవ్‌స్కీ పరిశీలనలన్నీ యీ పూర్తి విభిన్నమైన వారసత్వాలను గందరగోళపరచడంపైనే సంపూర్తిగా, ప్రత్యేకంగా ఆధారపడి వున్నాయి. మిహైలోవ్‌స్కీ యీ తేడాని గుర్తించే వుండాలి కాబట్టి, ఆయన కోపోద్రేకం అసంబద్ధంగానే గాక, ఖాయంగా అభాండం వేస్తూవుంది. ''మస్కోవ్‌స్కియె వేదొమొస్తి''

ప్రత్యేకంగా నరోదిజంమీద విరుచుకుపడిందా? ఎంత మాత్రమూ లేదు: అది యింత గానూ, ఎక్కువ గాకపోయినా, సామాన్యంగా వికాసదాయకులమీద విరుచుకుపడింది, నరోదిజాన్ని విపరీతంగా చీదరించుకునే "వేస్త్నిక్ యెవ్‌రోపి"మీద విరుచుకుపడింది, అది దాని దృష్టిలో నరోద్నిక్కు "రూస్కాయె బొగాత్‌స్త్వో" కంటే తక్కువ శత్రువేం కాదు. "మస్కోవ్‌స్కియె వేదొమొస్తి" వారసత్వాన్ని నిర్భయంగా పరిత్యజించే నరోద్నిక్కుల తోటి చాలా విషయాల్లో విభేదించవచ్చును — ఉదాహరణకి యూజొవ్ — కాని అది అతనికి వ్యతిరేకంగా ఆగ్రహంతో విరుచుకుపడదు. యేమైనా వారసత్వాన్ని కాపాడాలనుకునే నరోద్నిక్కులనుంచి అతన్ని వేరుచేసే విషయానికి అతన్ని పొగుడుతుంది. అబ్రామొవ్‌గాని వొలిన్‌స్కీగాని నరోదిజానికి వ్యతిరేకంగా విరుచుకుపడ్డారా? లేనేలేదు. మొదటాయన తనే ఒక నరోద్నిక్కు; యిద్దరూ కలిసి సామాన్యంగా వికాసదాయకులమీద విరుచుకుపడ్డారు. "రష్యన్ శిష్యవర్గం" తనకిగా రష్యన్ వికాసదాయకులకి వ్యతిరేకంగా విరుచుకుపడిందా? సంస్కరణాత్పూర్వపు జీవిత విధానానికీ, అవశేషాలకీ మినహాయింపుల్లేని శత్రుత్వంతోటి వుండే వారసత్వాన్ని శిష్యవర్గం పరిత్యజించిందా? దానిమీద తాము విరుచుకుపడడం అటుంచి, పెటీబూర్జువా భయంతోటి యీ అవశేషాలని నిలబెట్టాలని కాంక్షించే నరోద్నిక్కులని వాళ్లు ఖండించారు. సామాన్యంగా యూరపియన్ ఆదర్శాలని నిర్దేశించే వారసత్వానికి వ్యతిరేకంగా శిష్యవర్గం యెప్పుడేనా విరుచుకుపడిందా? దానిమీద తాము విరుచుకుపడడం అటుంచి, వాళ్లు నరోద్నిక్కులని ఖండించారు, యేమంటే వీళ్లు చాలా ముఖ్యమైన యెన్నో విషయాలమీద, యూరపియన్ ఆదర్శాలని ఆలింగనం చేసుకోడానికి మారుగా రష్యా ప్రత్యేక స్వభావాన్ని గురించి పరమ నీచమైన చెత్తని అల్లారు. జనాభాలో శ్రామిక బాహుళ్యపు ప్రయోజనాలని గురించి బాధపడే వారసత్వానికి వ్యతిరేకంగా శిష్యవర్గం యెప్పుడేనా విరుచుకుపడిందా? దానిమీద విరుచుకుపడటం మాట అటుంచి, వాళ్లు నరోద్నిక్కులని ఖండించారు, యెందుకంటే యీ ప్రయోజనాలపట్ల వీళ్ల బాధ అస్థిరంగా వుంది (రైతు బూర్జువావర్గాన్నీ, గ్రామీణ శ్రామికవర్గాన్ని లుంగచుట్టేసే వాళ్ల నిశ్చయమైన ధోరణి వల్ల); వాళ్లు నరోద్నిక్కులని ఖండించారు, యెందుకంటే తమ దృష్టిని వున్నదానికేసి మళ్లించకుండా, యేం జరగబోతోందో అన్న దాన్ని కలగనే అలవాటువల్ల వాళ్ల బాధ తగ్గిపోయింది; వాళ్లు నరోద్నిక్కులని ఖండించారు యెందుకంటే, వాళ్లు యెప్పుడూ పరిస్థితుల్ని (ఆర్థికం, తదితరం), తమ ప్రయోజనాలని గురించి తామే జాగ్రత్తపడ్డానికి యీ మనుషులకి కష్టతరంగాని, సులభతరంగాని చేసే పరిస్థితుల్ని, సరిగా అంచనా వేసుకోగలగలేకపోవడంవల్ల వాళ్ల బాధ గిరి గీసుకుపోయింది.

మిఖైలోవ్‌స్కీ యీ ఖండనలని ఆమోదించకపోవచ్చు — నరోద్నిక్కు అవడంవల్ల తప్పకుండా అంగీకరించడు — కాని కొంతమంది "అరవైయ్యవ, డబ్బైయవ దశకపు వారస

త్వం'' మీద ''మహోగ్రులై'' దాడిచేస్తారని నిర్ధరించడం, వాస్తవంలో, వాళ్ళు ''మహోగ్రులై'' నరోదిజాన్ని మాత్రమే యెదిరిస్తూవున్నప్పుడు, సంస్కరణానంతర చరిత్ర ముందుపెట్టిన సమస్యల్ని, యీ వారసత్వపు జీవలక్షణంతోటి, దాన్ని వ్యతిరేకించకుండా పరిష్కరించడంలో విఫలమైనందుకు నరోదిజాన్ని యెదిరిస్తూవున్నప్పుడు, అలాంటి నిర్ధారణ అంటే, సత్యాన్ని అష్టవంకర్లూ తిప్పిపెట్టడమే.

''మనల్ని'' (అంటే ''రూస్కాయె బొగాత్స్త్వొ'' రచయితల్ని) ''రూస్కాయె బొగాత్స్త్వొ''తో సంబంధంలేని ''నరోద్నిక్కుల''తోటీ, యితరులతోటీ ''శిష్యవర్గం'' గందరగోళ పరుస్తుందని అతి చిత్రంగా మిహైలోవ్స్కీ మొరపెడతాడు (పేజి 180). నరోదిజపు సకల మౌలిక అభిప్రాయాలనీ కాపాడుతూనే ''నరోద్నిక్కుల'' నుంచి విడిగా వుండాలనే యీ వింత ప్రయత్నం నవ్వుకికాక మరిదేనికి ఆస్పదమవుతుంది? ''రష్యన్ శిష్యవర్గం,'' ''నరోద్నిక్కు,'' ''నరోదిజం'' అనే పదాలని విస్తృతమైన అర్థంలో వాడుతూవుంటుందని అందరికీ తెలుసు. నరోద్నిక్కులలో అనేక ఛాయలున్నాయన్న విషయాన్ని ఎవరూ మర్చిపోలేదు, కాదనలేదు: ఉదాహరణకి, తమ పుస్తకాలలో పి. స్త్రూవె గాని, ఎన్. బెల్తొవ్ గాని మిహైలోవ్స్కీని వి.వి.తో గాని, ఆమాటకొస్తే యుజకోవ్‌తో గాని కలవరకంప చెయ్యలేదు; అంటే వాళ్ళ మధ్యనున్న భేదాల్ని పూసిపెట్టలేదు లేదా ఒకళ్ళ అభిప్రాయాల్ని యింకొకళ్ళకి అంటగట్టలేదు. యుజకోవ్ అభిప్రాయాలకీ, మిహైలోవ్స్కీ అభిప్రాయాలకీ మధ్య వున్న తేడాని పి. బి. స్త్రూవె వ్యక్తంగానే దృష్టికి తెచ్చాడు కూడా. భిన్న అభిప్రాయాలని కలవరకంప చెయ్యడం ఒకటి; ఎన్నో సమస్యలమీద విభేదాలున్నప్పటికీ మౌలిక, ప్రధాన విషయాలమీద, ''శిష్యవర్గం'' వ్యతిరేకించే విషయాలమీద, ఒకటే అయిన రచయితలని సామాన్యీకరించి, ఒకటే తరగతిలో వర్గీకరించడం యింకొకటి. ''శిష్యవర్గానికి'' ముఖ్యమైంది ఏమిటంటే ఉదాహరణకి, యుజకోవ్‌ని మిగతా నరోద్నిక్కులనుంచి వేర్పాటుచేసే అభిప్రాయాల పనికిమాలినతనాన్ని రుజువు చెయ్యడంకాదు, యూజొవ్‌కీ, మిహైలోవ్స్కీకీ, మొత్తంమీద అందరు నరోద్నిక్కులకీ ఉమ్మడిగా వుండే అభిప్రాయాలని — అంటే రష్యాయొక్క పెట్టుబడిదారీ పరిణామంపట్ల వాళ్ళ వైఖరి, చిన్న ఉత్పత్తిదారుడి దృష్టినుంచి ఆర్థిక, సాంఘిక సమస్యలకి సంబంధించి వాళ్ల చర్చ, సాంఘిక (లేదా చారిత్రక) భౌతికవాదాన్ని అర్థంచేసుకోవడంలో వాళ్ళ వైఫల్యం, వీటిని ఖండించడం. యీ లక్షణాలు ఒక పెద్ద చారిత్రక పాత్రని నిర్వహించిన సాంఘిక చింతన మొత్తం ధోరణి తాలూకు ఉమ్మడి సొత్తు. యీ విశాలమైన ధోరణిలో యెంతో విభిన్నమైన ఛాయలున్నాయి: అతివాద, మితవాద పార్శ్వాలు, జాతీయవాదానికీ, యూదు వ్యతిరేక వాదానికీ మొదలైనవాటికి దిగజారిన వాళ్ళు, వీటితో పంకిలంకానివాళ్లు; ''వారసత్వపు'' యెన్నో ఆదేశాలంటే యేవగింపు వున్నవాళ్ళున్నారు, యీ ఆదేశాలను కాపాడ్డానికి తమ శాయశక్తులా (అంటే నరోద్నిక్కుకి శక్తివున్నంత మేరకి) ప్రయత్నించిన

వాళ్లున్నారు. యీ ఛాయా భేదాల్ని ''రష్యన్ శిష్యవర్గం''లో ఒక్కళ్లు కూడా కాదన లేదు; ఒక పక్షపు నరోద్నిక్కు భావాల్ని యింకో పక్షపు భావాలకి అంటగట్టాడని వాళ్లల్లో ఒక్కళ్లకీ మిహైలోవ్‌స్కీ అరదండాలు వెయ్యలేకపోయాడు. కాని అన్ని భిన్న ఛాయలకీ సంబంధించిన ఉమ్మడి మౌలిక అభిప్రాయాలనే మేం వ్యతిరేకిస్తాం కాబట్టి, సామాన్య ధోర ణిలోని పాక్షిక భేదాల్ని గురించి మేమెందుకు ప్రస్తావించాలి? అది, నిజంగా, పరమ అర్థ హీనమైన కోరిక! ''శిష్యవర్గం'' రాకముందే యెప్పుడో, యెన్నోసార్లు, ప్రతి విషయంమీదా యేకాభిప్రాయం లేకపోయినప్పటికీ మన రచయితలు రష్యన్ పెట్టుబడిదారీ విధానాన్ని గురించీ, రైతు ''కమ్యూన్'' గురించీ, ''సమాజం'' అని పిలిచేదాని సర్వశక్తిమత్వం గురించీ ఉమ్మడి అభిప్రాయాలతో వున్నారని మన సాహిత్యం గుర్తించింది, గుర్తించడమే కాదు అది రష్యాకి సంతోషకరమైన విలక్షణమని పొగిడింది కూడాను. అలాగే, ''నరోదిజం'' అనే పదాన్ని, ''శిష్యవర్గం'' రాకముందే యేనాడో మన సాహిత్యంలో విస్తృతార్థంలో వాడటం జరిగింది. ఎన్నో సంవత్సరాలు ఆ ''నరోద్నిక్కు'' (సంకుచిత అర్థంలో) వి.వి.తో బాటుగా మిహైలోవ్‌స్కీ ఒక పత్రికకి వ్యాసాలు రాయడమే కాదు, యిద్దరి దృక్పథమూ పైన చెప్పిన అవే మౌలిక లక్షణాలని కలిగివుంది. యెనభై, తొంభైయవ దశకాల్లో కొన్ని వి.వి. నిర్ధారణలకు తను అభ్యంతరం చెప్పి, నైరూప్య సాంఘిక శాస్త్ర రంగంలో అతని పరిశీలనల ఔచిత్యాన్ని కాదన్నప్పటికీ మిహైలోవ్‌స్కీ, యెనభై, తొంభై దశకాలు రెండింటిలోనూ కూడా తన విమర్శ వి.వి. ఆర్థిక రచనలకి వ్యతిరేకంగా ఉద్దేశించి కాదనీ, రష్యన్ పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన మౌలిక అభిప్రాయాల్లో ఒకటేననీ సొడ్డు పెట్టాడు. తత్పర్యవసానంగా, ''రూస్కోయె బొగాత్‌స్త్వో'' ప్రముఖులు నరోదిజపు (విస్తృ తార్థంలో) అభిప్రాయాలని అభివృద్ధిచేసి, సుసంఘటితంచేసి, వ్యాప్తిచెయ్యడానికి అంత చేసినవాళ్లు, యిప్పుడు తాము ''నరోద్నిక్కులం'' (సంకుచిత అర్థంలో) కాదు అని ప్రకటిం చేసి, తాము పూర్తి ప్రత్యేక ''నైతిక-సాంఘిక శాఖ''గా యేర్పడుతున్నామని చెప్పినంత మాత్రాన ''రష్యన్ శిష్యవర్గపు'' విమర్శని తప్పించుకోగలమనుకుంటున్నారు — అలాంటి సాకులు, అంత సాహసవంతులుగా వుండి, అదే సమయంలో అంత లౌక్యంగా వున్నవాళ్లని న్యాయమైన పరిహాసానికే గురిచేస్తాయి.

తన వ్యాసపు 182వ పేజీలో మిహైలోవ్‌స్కీ ''శిష్యవర్గం''తోటి యీ అసాధారణ మైన వాదనని కూడా చేస్తాడు. కమేన్‌స్కీ విషపూరితంగా నరోద్నిక్కులమీద దాడిచేస్తు న్నాడు;[106] చూశారా, అది ''అతను కోపంగా వున్నాడని సూచిస్తుంది, దానికి అతనికి అర్హత లేదు (sic!!). మేము ''ఆత్మపరవాద పాతతరంవాళ్లం'' ''ఆత్మపరవాద యువతరం వాళ్లం'' కూడా, స్వవచో వ్యాఘాత దోషం తగలకుండా యీ దౌర్బల్యానికి గురికావచ్చును.

కాని ''కశాఘాత సదృశ వస్తుపరత్వంతో గర్వపడే'' సిద్ధాంత ''ప్రతినిధులు'' (''శిష్య వర్గం''లో ఒకరి మాటలు యివి) ''వేరే స్థాయిలో వున్నారు.''

ఏమిటిది?! సామాజిక విషయాలను గురించిన అభిప్రాయాలు వాస్తవాల కరకు వివరణమీదా, అభివృద్ధి తాలూకు అసలు మార్గపు వస్తుపరమైన పరిశీలనలమీద ఆధార పడి వుండాలి అని అంటే, వాళ్లకి కోప్పడే అర్హత లేదని అర్థమా?! యెందుకీ అర్థంలేని మాటలు, పనికిరాని వాగుడు! సామాజిక ఘటనలను పరిశోధించడంలో కరకు వస్తుపర త్వపు అత్యుత్తమ చిహ్నల్లో ఒకటిగా ప్రసిద్ధమైన ''పెట్టుబడి'' అన్న గ్రంథం పరి గణింపబడుతూ వుందని వినలేదా, మిహైలోవ్‌స్కీగారూ? చాలామంది శాస్త్రజ్ఞులూ, ఆర్థికవేత్తలూ దాని ప్రధాన, మౌలిక దోషంగా పరిగణించేది దాని వస్తుపరత్వాన్నే. అయిన ప్పటికీ, తిరోగమన అభిప్రాయాల ప్రతినిధులమీద, రచయిత దృష్టిలో యేవి సామాజిక పురోగతిని నిరోధిస్తున్నాయో ఆ సామాజిక వర్గాల ప్రతినిధులమీద, యింతటి ఉద్రేక భరిత, తీవ్ర వివాదాస్పద చర్చాన్విత దాడులు, యింతటి ''అనుభూతి'' శాస్త్రీయ గ్రంథంలో అరుదుగా కనిపిస్తాయి. ప్రూడన్ అభిప్రాయాలు ఫ్రెంచి పెటీబూర్జువా భావాలకీ, మనస్థితికీ సహజమైన, అవగాహన చేసుకోగల, అనివార్యమైన ప్రతిబింబాలని కరకు వస్తు పరత్వంతోటి చూపించిన రచయిత, మహా ఉద్వేగంతోటీ, కుతకుతలాడే కోపంతోటీ ఈ పెటీబూర్జువా సిద్ధాంతవేత్తమీద ''విరుచుకు పడతాడు.'' మార్క్స్ యిక్కడ ''స్వవచో వ్యాఘాత దోషం''తో వున్నాడని మిహైలోవ్‌స్కీ అనుకుంటాడా? ప్రముఖులైనవాని నుంచీ వాస్తవాల వస్తుపర పరిశీలననీ, యీ వాస్తవాలనుంచి ఉత్పన్నమయే అనేక వర్గాల మధ్య సంబంధాలయొక్క వస్తుపర వివరణనీ ఒక సిద్ధాంతం అపేక్షిస్తే, దాన్నుంచి అతను యీ వర్గంతోటీ ఆ వర్గంతోటీ సానుభూతి చెందకూడదనీ, సానుభూతిచెందే అర్హత లేదనీ యే మహిమవల్ల నిర్ధారణ చెయ్యగలరు? యీ సందర్భంలో విధిని గురించి మాట్లాడ్డం కూడా పరిహాసాస్పదమవుతుంది; యేమంటే మెడమీద తలవున్న మనిషెవ్వడూ యేదో వర్గపు పక్షం వహించకుండా (ఒకసారి అంటూ వాటి అంతర్గత సంబంధాలని అర్థం చేసుకుంటే) వుండలేడు; ఆ వర్గపు విజయాలపట్ల సంతోషమూ, ఓటములపట్ల నిరు త్సాహమూ ప్రదర్శించకుండా వుండలేడు; ఆ వర్గానికి విరోధులుగా వున్నవాళ్లపట్ల, తిరోగమన భావాలని వ్యాప్తిచేసి, దాని పురోగమనాన్ని ఆటంకపరచీ తదితరమైనవీ చేసే వాళ్లపట్ల ఆగ్రహం చెందకుండా వుండలేడు. మిహైలోవ్‌స్కీ నిశ్చితవాదానికీ, విధికృతవాదానికీ మధ్యనవుండే ప్రాథమిక విభేదాన్ని గ్రహించడంలో యింకా విఫలుడవుతున్నాడనే ఆయన చెత్త పరిహాసం తెలియజేస్తోంది.

'''పెట్టుబడి వచ్చేస్తోంది!' అది ఖాయమే. కాని (sic!!) సమస్య యేమిటంటే, మనం దానికి యెలా అభివాదం చెప్పాలి'' (పేజి 189) అని రాస్తాడు మిహైలోవ్‌స్కీ.

మిహైలోవ్‌స్కీ గొప్ప ఆవిష్కరణ చేస్తున్నాడు, "రష్యన్ శిష్యవర్గం" అసలు ఆలోచనే చేయలేదట అనే "సమస్య"ని సూచిస్తున్నాడు! "రష్యన్ శిష్యవర్గం" నరోద్నిక్కులతో విభేదించినది యీ సమస్యమీదనే కాదన్నట్లు! రష్యాలో అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానానికి రెండు రకాలుగానే యెవళ్లేనా "అభివాదం" చెయ్యొచ్చు: దాన్ని అభ్యుదయకరమైందన్నట్టుగాని, తిరోగమన పూర్వకమైందని గాని మాత్రమే పరిగణించగలరు; సరైన దారిలో ముందుకుపోయే అడుగుగా గాని, అసలైన దారినుంచి పక్కకు మళ్లడంగా గాని మాత్రమే పరిగణించగలరు; పెట్టుబడిదారీ విధానం నాశనంచేసే చిన్న ఉత్పత్తిదారుల వర్గపు దృష్టినుంచి గాని లేదా పెట్టుబడిదారీ విధానం సృష్టించే ఆస్తి రహిత ఉత్పత్తిదారుల వర్గపు దృక్పథంనుంచి గాని మాత్రమే యెవళ్లేనా దాన్ని అంచనా కట్టగలరు. యిక మధ్యేమార్గం లేదు.* తత్ఫలితంగా, "శిష్యవర్గం" పెట్టుబడిదారీ విధానంపట్ల వహించాలని నొక్కిచెప్పే ధోరణి సక్రమత్వాన్ని మిహైలోవ్‌స్కీ తిరస్కరిస్తున్నాడంటే, దాని అర్థం ఆయన నరోద్నిక్కు ధోరణిని అంగీకరిస్తూవున్నట్టే, దాన్ని ఆయన తన తొలి వ్యాసాల్లో స్పష్టంగానే వెల్లడించాడు. యీ విషయానికి సంబంధించి ఆయన పాత అభిప్రాయాలకి చేర్పులూ కూర్పులూ యేమీ చెయ్యలేదు, నరోద్నిక్కుగానే మిగిలిపోయాడు. కాని అలాంటిదేమీ లేదు! ఆయన నరోద్నిక్కు కాదు, అన్యాయం ప్రతిహతమగుగాక! ఆయన "నైతిక-సాంఘికశాస్త్ర శాఖ" ప్రతినిధి....

"పెట్టుబడిదారీ విధాన యితోధిక అభివృద్ధి తేబోయే(?) ఆ భవిష్యత్ (??) లాభాలని గురించి మాట్లాడనివ్వక్కర్లేదులెండి" అంటాడు మిహైలోవ్‌స్కీ.

మిహైలోవ్‌స్కీ నరోద్నిక్కు కాదు. ఆయన నరోద్నిక్కుల అన్ని దోషాలనీ, దోష భూయిష్ట వాదన పద్ధతులనీ వల్లిస్తాడంతే. "భవిష్యత్తుని" గురించిన యీ సంభాషణ తప్పనీ, యిది "భవిష్యత్తు" సమస్య కాదనీ, పెట్టుబడిదారీ విధాన పూర్వపు సంబంధాల్లో యిప్పటికే వస్తున్న వాస్తవ అభ్యుదయకరమైన మార్పులకి చెందిన – రష్యాలో పెట్టుబడిదారీ విధానం తీసుకువస్తున్న (తీసుకురాబోయే కాదు) మార్పులకి చెందినదనీ, యెన్నిసార్లు నరోద్నిక్కులకి యిదివరకే చెప్పలేదు. యీ సమస్యని "భవిష్యత్తు"కి తీసుకుపోయి అక్కడ

---

* శ్రామిక ప్రయోజనాలవల్ల నిర్దేశింపబడటం అవసరంలేదని పరిగణించేవాళ్లు దీనికి చేసిన అభివాదం గురించీ, "పెట్టుబడిదారీ విధానం" అనే పదం యిచ్చే సామాన్యార్థమే దురవహగాహంగా, దురవబోధంగా వున్నవాళ్లు యిచ్చిన అభివాదం గురించీ నేను యేమీ చెప్పను. రష్యన్ జీవితంలో ఆ సామాజిక ఆలోచనా ధోరణులు యెంత ముఖ్యమైనవైనప్పటికీ నరోద్నిక్కులకీ వాళ్ల ప్రత్యర్థులకీ మధ్య వివాదంలో వాటికేమీ సంబంధం లేదు, వాటిని యిందులోకి తీసుకురావడంలో అర్థంలేదు.

నాటి, ''శిష్యవర్గం'' యెదిరించే ఆ విషయాలనే సంభావ్యంగా యెంచుతున్నాడు. వాస్తవంలో, మన కళ్లముందర జరిగేదాంట్లో, పాత సామాజిక ఆర్థిక సంబంధాల్లోకి పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి యే అభ్యుదయకరమైన మార్పులనీ తీసుకుని రావడంలేదని ఆయన వూహిస్తున్నాడు. నరోద్నిక్కు దృక్పథాన్ని యేర్పరచేది అదే. దీనికి వ్యతిరేకంగానే ''రష్యన్ శిష్యవర్గం'' వాదించి తద్వ్యతిరేకమైంది నిజమని చూపిస్తున్నారు. ''రష్యన్ శిష్యవర్గం'' ప్రచురించిన పుస్తకాల్లో వ్యవసాయంలో వెట్టిచాకిరీ స్థానంలో కూలీశ్రమ, ''చేతివృత్తుల'' పరిశ్రమ అని పిలిచేదాని స్థానంలో ఫ్యాక్టరీ పరిశ్రమ రావడం అనేది యిప్పుడు, మన కళ్లముందు, ఎప్పుడో ''భవిష్యత్తు''లో కాదు, జరుగుతూవున్న (అదీ బ్రహ్మాండమైన వేగంతో) వాస్తవ విషయమని చాటి, యీ మార్పు సకల విధాలా అభ్యుదయకరమైందనీ, యిది రొడ్డకొట్టుడు, అవ్యవస్థీకృత, చిన్న తరహా చేతివృత్తి ఉత్పత్తిని, యుగాలుగా అచలంగా, స్తబ్దంగా వుండిపోయినదాన్ని, యీ వాస్తవ విషయం విచ్ఛిన్నం చేస్తోందని చాటి; యిది సామాజిక శ్రమ ఉత్పాదకతని పెంపొందిస్తుందనీ, ఆ రకంగా శ్రామికుడి హెచ్చు జీవిత ప్రమాణాల అవకాశాన్ని కల్గిస్తోందని చాటి యిది యాదృచ్ఛికతని అవశ్యకతగా మార్చే పరిస్థితుల్ని సృష్టిస్తోందని – అంటే ''మారుమూల ప్రాంతాల్లో'' తప్పిపోయిన ''స్థిరీకృత శ్రామికుణ్ణి,'' శారీరకంగా, మానసికంగా స్థిరీకృత శ్రామికుణ్ణి, చలనశీలమైన శ్రామికుడిగా మారుస్తూ, అనంతంగా అభివృద్ధిచెందిన దాస్యంతో, వైయక్తిక పరాధీనత అనేక రూపాలతో వున్న ఆసియాటిక్ శ్రమ రూపాలని, యూరపియన్ శ్రమ రూపాలకింద మారుస్తోందని చాటి రుజువుచెయ్యని పుస్తకం ఒక్కటి కూడా లేదు; ''ఆవిరి, బొగ్గు, సాంకేతిక నైపుణ్యాలు వగైరాలకంటే యంత్రాల ఫలవంతమైన ఉపయోగానికి యూరపియన్ ఆలోచనా అనుభూతుల సరళి తక్కువ అవశ్యకతదేమీ కాదని''* (అవశ్యకత అనేదాన్ని గమనించండి, వి. ఐ.) చాటి చెప్పని పుస్తకం ఒక్కటి కూడా లేదు. మళ్లీ అంటున్నా, దీన్నంతటినీ ప్రతి ''శిష్యుడూ'' ధృవపరచి చూపించాడు; కాని, బహుశా, యిది మిహైలోవ్స్కీ ''బృందానికి'' వర్తించదు; యిదంతా ''నరోద్నిక్కులకి'' వ్యతిరేకంగా మాత్రమే రాసింది, వాళ్లకి ''రూస్కొయె బొగాత్స్త్వొ''తో ''సంబంధం లేదు.'' ''రూస్కొయె బొగాత్స్త్వొ,'' చూశారా, ''నైతిక-సాంఘికశాస్త్ర శాఖకి'' చెందింది, దాని సారం యేమిటంటే, ఓడ కొత్త జెండా కింద పాత సరుకు రవాణా చెయ్యడం.

నేను పైన చెప్పినట్టు, యీ వ్యాసపు ఉద్దేశం యేమిటంటే ఉదారవాద నరోద్నిక్కు పత్రికావళిలో ''రష్యన్ శిష్యవర్గం'' ''వారసత్వాన్ని పరిత్యజిస్తున్నారు, రష్యన్ సమాజపు

---

* "Schmollers Jahrbuch,"[107] 1896లో, మాస్కో-వ్లదీమిర్ పత్తి పరిశ్రమమీద వ్యాసంలో షుల్జె-గేవెర్నిట్జ్ మాటలు.

అత్యుత్తమ విభాగపు అత్యుత్తమ సంప్రదాయాలతో తెంచుకుంటున్నారు అంటూ యెంతో విస్తృత ప్రచారంలో వున్న ఆరోపణలను ఖండించడమే. యీ అరిగిపోయిన పదబంధాలని వల్లించడంలో, చాలా పూర్వం, చాలా బింకంగా "రూస్కాయె బొగాత్స్వో"తో "సంబంధంలేని" "నరోద్నిక్కు" – వి.వి. చెప్పినదాన్నే వాస్తవానికి మిహైలోవ్స్కీ చెపుతున్నాడని గ్రహించడం ఆసక్తికరంగా వుండకపోదు. ప్రియమైన పాఠక మహాశయా, మూడేళ్లక్రితం, 1894 చివర్లో, పి. బి. స్త్రూవె పుస్తకానికి సమాధానంగా "నెదేల్యా"[108]కి యీ రచయిత రాసిన వ్యాసాలతో మీకు పరిచయం వుందా? లేకపోయినా, నా అభిప్రాయంలో మీరు ఆవగింజంత కూడా నష్టపోలేదని ఒప్పుకుంటున్నాను. యీ వ్యాసాల్లోని ప్రధాన భావం ఏమిటంటే "రష్యన్ శిష్యవర్గం" రష్యన్ సామాజిక చింతనలోని అన్ని అభ్యుదయకర ధోరణుల్లోనూ అనుస్యూతంగా వున్న ప్రజాస్వామిక సూత్రాన్ని తెంపేస్తున్నారని. "వారసత్వా"న్ని పరిత్యజిస్తున్నవాళ్లని, యింకొంచెం భిన్నమైన పదాల్లో మాత్రమేనా "శిష్యవర్గా"న్ని నిందిస్తున్నప్పుడు ("మస్కోవ్స్కియే వేదొమొస్తి" దేనికి వ్యతిరేకంగా ఆగ్రహంతో విరుచుకుపడుతోందో), మిహైలోవ్స్కీ కచ్చితంగా అంటున్నది సరిగా యిదే కాదా? మనం చూసినట్టుగా, వాస్తవానికి యీ నిందని సృష్టించిన వాళ్లు, "శిష్యవర్గం" తిరుగులేకుండా నరోదిజంతో తెంచుకోవడం అనేది రష్యన్ సమాజపు అత్యుత్తమ విభాగపు అత్యుత్తమ సంప్రదాయాలతో తెంచుకోవడాన్ని సూచిస్తుందని అనేవాళ్లు, తమ దోషాలకి యితరులని నిందిస్తున్నారు. అయ్యో, యిది అటు తిరగేసి చెప్పడం కాదూ? అలాంటి విచ్ఛిన్నత యీ అత్యుత్తమ సంప్రదాయాలని నరోదిజం లేకుండా క్షాళన చెయ్యడాన్ని సూచించదూ?

రచన:
1897 చివరలో ప్రవాసంలో వున్నప్పుడు.
ప్రచురణ:
వ్లదీమిర్ ఇల్యీన్ "ఆర్థిక అధ్యయనాలు, వ్యాసాలు,"
సెంట్ పీటర్స్‌బుర్గ్, 1898

# ఏం చెయ్యాలి?

## మన ఉద్యమపు తక్షణ సమస్యలు[109]

"...పార్టీ పోరాటాలు పార్టీకి బలాన్నీ, జీవశక్తినీ చేకూరుస్తాయి. చెల్లాచెదరుగా వ్యాప్తి చెందడం, స్పష్టమైన హద్దులు చెరిగిపోవడం — యివే పార్టీ బలహీనతకి మిక్కిలి పెద్ద రుజువులు. తనను తాను ప్రక్షాళనం చేసుకోవడం ద్వారా పార్టీ పటుతరమవుతుంది...."

(1852 జూన్ 24న
మార్క్సుకి లాసాల్ రాసిన లేఖనుంచి)

## ఉపోద్ఘాతం

నేను మొదట అనుకున్నదాని ప్రకారం, "దేనితో ప్రారంభించాలి?"[110] ("ఇస్క్రా"[111] సంచిక 4, 1901 మే) అన్న వ్యాసంలో వెల్లడించిన అభిప్రాయాలను యీ పుస్తకంలో విపులీకరించవలసి వుంది. అయితే ఆ వ్యాసంలో నేను చేసిన వాగ్దానాన్ని (కొందరు స్నేహితుల ప్రశ్నలకూ, జాబులకూ జవాబుగా పునరుద్ఘాటించిన వాగ్దానాన్ని) నిలబెట్టుకోవడంలో జరిగిన జాప్యానికిగాను ముందుగా పాఠకుల క్షమార్పణను అర్థిస్తున్నాను. విదేశాల్లో ఉన్న రష్యన్ సోషల్ డెమొక్రటిక్ సంఘాలన్నింటినీ ఐక్యం చెయ్యడంకోసం గత సంవత్సరం (1901) జూన్‌లో జరిపిన ప్రయత్నం ఆ జాప్యానికి గల కారణాల్లో ఒకటి.[112] ఈ ప్రయత్న పర్యవసానాలకోసం వేచివుండటం సహజమే కదా, ఎందుకంటే, ఆ ప్రయత్నమే గనుక ఫలిస్తే, నిర్మాణానికి సంబంధించిన "ఇస్క్రా" అభిప్రాయాలను కొంచెం భిన్న దృక్పథంనుంచి విశదీకరించడం అవసరమై వుండేది. ఏదేమైనా, ఆ ప్రయత్న సాఫల్యం రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో రెండు భిన్న ధోరణుల అస్తిత్వాన్ని అతి త్వరగా తుదముట్టించి వుండేది. అయితే ఆ ప్రయత్నం విఫలమైందన్న విషయం పాఠకులకు తెలిసిందే. "రబోచెయె దేలొ"[113] 10వ సంచికలో "ఆర్థికవాదం"[114] పట్ల ప్రదర్శితమైన కొత్త మొగ్గు తర్వాత, ఆ ప్రయత్నం విఫలం కాక తప్పదు, ఈ విషయాన్ని దరిమిలా రుజువుచేస్తాను. గాఢత్వమూ, సమగ్రతా లేని ఈ ధోరణి, సరిగా ఆ కారణంగానే మరింత మొండిగా కొనసాగి, యింకా ఎన్నో రూపాలు ధరించే అవకాశం వుండటం వల్ల,

దానిమీద ఎడతెగని పోరాటాన్ని మొదలెట్టడం పరమావశ్యకంగా తోచింది. అందువల్ల యీ పుస్తకపు తొలి పథకం మారి గణనీయంగా పెరిగింది.

"దేనితో ప్రారంభించాలి?" అనే వ్యాసంలో తీసుకున్న యీ దిగువ మూడు సమస్యలకూ యీ పుస్తకంలో విపులంగా జవాబు చెప్పాలని మొదట అనుకున్నాను. అవి: 1) మన రాజకీయాందోళన స్వభావ సారాంశాలు ఏమిటి? 2) మన పార్టీ నిర్మాణ కర్తవ్యాలు ఏమిటి? 3) ఏక కాలంలో, సర్వతోముఖమూ, సమరశీలమూ అయిన అఖిల రష్యా పార్టీని నిర్మించడం ఎలా? ఈ సమస్యలను గురించి చాలా కాలం యోచించాను. "రబోచయ గజేత"[115] పత్రికను తిరిగి ప్రారంభించేందుకు విఫల ప్రయత్నం జరిపినప్పుడు వీటిని గురించి చర్చించేందుకు ప్రయత్నించాను (ప్రకరణం 5 చూడండి). పై మూడు సమస్యలకు మాత్రమే యీ పుస్తకాన్ని పరిమితం చెయ్యాలనీ, నా భావాలను సాధ్యమైనంతవరకు నేరుగా ప్రస్తావించాలనీ, వాదవివాదాలకు దిగకుండా, లేక దాదాపు దిగకుండా మొదట వేసుకున్న ప్లాను, రెండు కారణాల మూలంగా, బొత్తిగా ఆచరణసాధ్యం కాలేదు. ఒకవైపున మొదట అనుకున్నదానికంటే "ఆర్థికవాదం" మొండిది ["ఆర్థికవాదం" అన్న పదాన్ని 1901 డిసెంబరు నాటి "ఇస్క్రా" 12వ సంచికలో, "ఆర్థికవాద సమర్థకులతో సంభాషణ" అన్న వ్యాసంలో వివరింపబడిన విస్తృతార్థంలో నేను ఉపయోగిస్తాను. ఒక విధంగా యీ పుస్తకపు సంక్షిప్త సారాంశమే ఆ వ్యాసం]. పైన పేర్కొన్న మూడు సమస్యల పరిష్కారం విషయంలో వున్న అభిప్రాయభేదాలకు, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని రెండు ధోరణుల మధ్యా వివరాల విషయంలో వున్న అభిప్రాయభేదాలు కాక, మూల వైరుధ్యాలే కారణమన్న విషయం నిస్సంశయంగా స్పష్టమైంది. మరొక వైపున, "ఇస్క్రా"లో నా అభిప్రాయాలను ఆచరణాత్మకంగా అన్వయించినప్పుడు ఆర్థికవాదులు విస్మయం చెందడాన్ని బట్టి మనం తరచుగా అక్షరాలా భిన్నమైన భాషల్లో మాట్లాడుతున్నట్లూ, అందుచేత, ఆరంభంనుంచీ ప్రారంభిస్తేగాని, ఆర్థికవాదులు అందరితోనూ మనకున్న అన్ని మౌలిక అభిప్రాయభేదాలనూ నిర్దిష్టమైన అనేక ఉదాహరణలతో, సులభశైలిలో, క్రమబద్ధంగా "స్పష్టం చేసేందుకు" ప్రయత్నిస్తే గాని ఒక అవగాహనకు రాలేం అన్న విషయం స్పష్టంగా బయటపడింది. పుస్తకం మొదట అనుకున్న దానికంటె బాగా పెద్దదవుతుందనీ, దాని ప్రచురణ ఆలస్యమవుతుందనీ పూర్తిగా తెలిసి కూడా, అలాంటి "స్పష్టీకరణ" ప్రయత్న మొకటి చెయ్యాలని తీర్మానించుకున్నాను. "దేనితో ప్రారంభించాలి?" అన్న వ్యాసంలో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోడానికి నాకు మరో మార్గం ఏదీ కనిపించలేదు. కాగా, ఆలస్యం విషయంలో క్షమార్పణలకు, యీ పుస్తకంలో భాషాపరంగా వున్న తీవ్ర లోపాల విషయంలో నా క్షమార్పణలను జతచెయ్యవలసివుంది. మధ్య మధ్య అనేక యితర కర్తవ్యాలను నిర్వహిస్తూ, అవ్యవధిగా యీ రచనను పూర్తిచెయ్యవలసివచ్చింది.

పై మూడు సమస్యల్నే ప్రధానంగా యీ పుస్తకంలో చర్చించాను. అయితే, మొట్ట మొదట మరింత సాధారణ స్వభావం కలిగిన రెండు సమస్యలను చర్చించడం అవసరమని నాకు తోచింది. 1) పైకి ''నిరపాయంగానూ,'' ''సహజంగానూ'' కనబడే ''విమర్శనా స్వేచ్ఛ'' వంటి నినాదాన్ని మనం వాస్తవమైన సమర నినాదంగా ఎందుకు పరిగణించాలి? 2) సద్యోజనితంగా పెల్లుబికే జనసామాన్యపు ఉద్యమంలో సోషల్ డెమోక్రట్ల పాత్రను గూర్చిన మౌలిక సమస్యపైన సైతం మనం ఏకాభిప్రాయానికి ఎందుకు రాలేకపోయాం? దీనికితోడు, రాజకీయాందోళన స్వభావ సారాంశాల విషయంలో మన అభిప్రాయాల వివరణ ట్రేడ్‌యూనియన్ రాజకీయాలకూ, సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలకూ మధ్య తేడాకి సంబంధించిన వివరణగా పరిణమించింది. అదే సమయంలో, పార్టీ నిర్మాణ సమస్యలపైన మన అభిప్రాయాల వివరణ ఆర్థికవాదులు అనుసరించే అనిపుణ పద్ధతులకూ, మనం అనివార్యంగా భావించే విప్లవవాద నిర్మాణ పద్ధతులకూ మధ్య తేడాకి చెందిన వివరణగా పరిణమించింది. పైగా, అఖిల రష్యా రాజకీయ వార్తాపత్రిక స్థాపనకు సంబంధించిన నా ''పథకాన్ని'' మరింత గట్టిగా యిందులో ముందుకు తెచ్చాను. ఎందుకంటే, దీనికి వ్యతిరేకంగా లేవదియ్యబడిన అభ్యంతరాల్లో పస లేదు. అదీకాక, ''దేనితో ప్రారంభించాలి?'' అన్న వ్యాసంలో మనకి అవసరమైన పార్టీ స్థాపనకు సర్వతోముఖ కార్యక్రమంతో ఏక కాలంలో పనిచెయ్యడం ఎలాగ అని నేను లేవదీసిన ప్రశ్నకు సరైన జవాబు యింతవరకు రాలేదు. చివరి అధ్యాయంలో, ఆర్థికవాదులతో తిరుగులేని చీలికను నివారించేందుకు మనం చెయ్యగలిగినదంతా చేశామనీ (అయినా అది అనివార్యమైంది), ''రబోచెయె దేలో'' ప్రత్యేక ప్రాముఖ్యాన్ని — ఆ మాటకి వస్తే ''చారిత్రక'' ప్రాముఖ్యం అని కూడా మీరు చెప్పకోవచ్చు — సంతరించుకుందనీ, పొడుగునా ఆర్థికవాదాన్ని గాక, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్రలో ఓ పూర్తి దశకు విశిష్ట లక్షణమైన గందరగోళాన్నీ, ఊగిసలాటనీ అది పూర్తిగానూ, ప్రస్ఫుటంగానూ వ్యక్తంచెయ్యడమే యిందుకు కారణం అనీ, మరి యీ కారణంగా, ''రబోచెయె దేలో''తో వాదోపవాదాలకు కూడా — మొదటి చూపులకు అవి మరీ అధిక వివరాలతో కూడినవిగా కనిపించినప్పటికీ, ప్రాముఖ్యం వుందనీ — యేమంటే, ఈ దశకు పూర్తిగా స్వస్తి చెప్తేగాని మనం ఏ మాత్రం ముందుకు వెళ్లలేం అనీ చూపేందుకు ప్రయత్నిస్తాను.

ఎన్. లెనిన్

ఫిబ్రవరి 1902

# I

# పిడివాదం, ''విమర్శనా స్వేచ్ఛ''

## అ) ''విమర్శనా స్వేచ్ఛ'' అంటే ఏమిటి?

''విమర్శనా స్వేచ్ఛ'' అనేది యీనాడు నిస్సందేహంగా అన్ని నినాదాలకంటె మోజైనదిగానూ, అన్ని దేశాల్లోనూ సోషలిస్టులకూ, ప్రజాస్వామ్యవాదులకూ మధ్య సాగుతున్న వాదోపవాదాల్లో అతి తరచుగా వినియోగింపబడేదిగానూ తయారైంది. స్థూలంగా చూస్తే, యీ వివాదానికి చెందిన రెండు పక్షాల్లో ఒక పక్షానికి చెందినవారు ''విమర్శనా స్వేచ్ఛ'' కావలంటూ గంభీరమైన విజ్ఞప్తులు చెయ్యడం చాలా చిత్రంగా కనిపించక మానదు. విజ్ఞానశాస్త్రానికీ, శాస్త్రీయ పరిశోధనకీ స్వేచ్ఛను కల్పించే అధిక సంఖ్యాక యూరపియన్ దేశాల రాజ్యాంగబద్ధ చట్టానికి వ్యతిరేకంగా, పురోగామి పార్టీల్లో ఎవరైనా అభ్యంతరాలు లేవదీశారా? మోజుగా తయారైన యీ నినాదం మాటిమాటికీ వల్లింపబడటం వింటూ, వాదోపవాదాలు చేసేవారి మధ్య ఏయే అంశాలపై విభేదాలు వచ్చాయో పూర్తిగా తెలుసుకోని తటస్థులు, ''యిందులో ఏదో లొసుగు ఉన్నట్లుంది, మారుపేరు మాదిరిగానే, నలుగురి నోళ్లలోనూ నలగడం మూలంగా స్థిరపడిపోయి, దాదాపు నానుడిగా మారే ఆచారసిద్ధ పదబంధాల్లో యీ నినాదం ఒకటి'' అంటారు.

వాస్తవానికి, యీనాటి అంతర్జాతీయ* సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో రెండు భిన్న ధోరణులు రూపొంది వున్నాయన్నది రహస్యమేం కాదు. ఈ ధోరణుల మధ్య ఘర్షణ

---

*సందర్భవశాత్తూ యిక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. సోషలిస్టు ఉద్యమంలోపలి వివిధ ధోరణుల మధ్య పోరాటం జాతీయ స్థాయినుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఆధునిక సోషలిస్టు ఉద్యమ చరిత్రలో యిది బహుశా సాటిలేని, ఒక విధంగా సంతోషించవలసిన విషయం. పూర్వం, లాసాలియన్లకూ ఐసెనాఖర్లకూ[116] మధ్య, గెడిస్టులకూ పాసిబిలిస్టులకూ మధ్య, ఫేబియన్లకూ[117] సోషల్ డెమోక్రట్లకూ[118] మధ్య, ''నరోద్నయ వోల్య''[119] అనుచరులకూ సోషల్ డెమోక్రట్లకూ మధ్య వివాదాలు పూర్తిగా జాతీయ పరిధులకు పరిమితమై, పూర్తిగా జాతీయ వైఖరులను ప్రతిబింబిస్తూ, ఒక విధంగా భిన్న భిన్న స్థాయిల్లో సాగుతూ వుండేవి. కాని యీనాడు, (యీ విషయం యిప్పుడు

ఒక్కొక్కప్పుడు తీవ్రంగా ప్రజ్వలిస్తూ, మరొకప్పుడు చప్పగా చల్లారి, గంభీరమైన "రాజీ తీర్మానాల"నే బూడిద మరుగున రగులుతూ వుంటుంది. "కాలం చెల్లిపోయిన పిడివాద" మార్క్సిజంపట్ల "విమర్శనాత్మక" వైఖరి వహించే "కొత్త" ధోరణి సారాంశాన్ని బెర్న్‌స్టైన్ సాధ్యమైనంత స్పష్టంగా ప్రతిపాదించగా, మిలెరాన్ దాన్ని నిరూపించాడు.

సోషల్ డెమోక్రటిక్ పార్టీ సామాజిక విప్లవ పార్టీగా ఉండటం మాని, సామాజిక సంస్కరణల కోసం పనిచేసే ప్రజాస్వామిక పార్టీగా మారాలన్నది వాళ్ల డిమాండు. బెర్న్‌స్టైన్ ఈ రాజకీయ డిమాండు చుట్టూ బోలెడు "కొత్త" వాదనలనూ, తర్కాలనూ అల్లాడు. సోషలిజాన్ని శాస్త్రీయంగా నిరూపించడాన్నీ, చారిత్రక భౌతికవాద దృక్పథం దృష్ట్యా సోషలిజం ఆవశ్యకతనూ, అనివార్యతనూ నిరూపించే అవకాశాన్నీ అతను నిరాకరించాడు. జనంలో పేదతనం నానాటికీ పెరుగుతోంది, జనం శ్రామికులయ్యే క్రమం సాగుతోంది, పెట్టుబడిదారీ వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి – యీ వాస్తవాన్ని బెర్న్‌స్టైన్ ఒప్పుకోలేదు. అతను కమ్యూనిస్టు సమాజ స్థాపన "అంతిమ లక్ష్యం" అన్న భావనే సరైనది కాదని ప్రకటించి, శ్రామికవర్గ నియంతృత్వం అన్న భావాన్నే పూర్తిగా నిరాకరించాడు. సూత్రరీత్యా ఉదారవాదానికీ, సోషలిజానికీ మధ్య వైరుధ్యం వుందన్న విషయాన్ని అతను కాదన్నాడు. అధిక సంఖ్యాక ప్రజల యిచ్ఛకు అనుగుణంగా ఏర్పడిన శుద్ధ ప్రజాస్వామిక సమాజానికి అన్వయింపబడజాలదన్న కుంటి సాకులతో వర్గ పోరాట సిద్ధాంతాన్నే అతను తిరస్కరించాడు.

ఈవిధంగా, విప్లవాత్మక సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని బూర్జువా సోషల్ సంస్కరణవాదానికి మళ్లించాలన్న కచ్చితమైన డిమాండుకు, మార్క్సిస్టు మూలసూత్రాలపైన కచ్చితమైన బూర్జువా విమర్శ జోడింపబడింది. ఈ రకమైన విమర్శ, చిరకాలంగా రాజకీయ వేదిక మీదనుంచీ, విశ్వవిద్యాలయ ఆచార్య పీఠాలనుంచీ, అనేక పుస్తకాల్లోనూ, పాండిత్య

---

స్పష్టమే), ఇంగ్లీషు ఫేబియన్లు, ఫ్రెంచి మినిస్టీరియలిస్టులు,[120] జర్మన్ బెర్న్‌స్టైనియన్లు, రష్యన్ విమర్శకులు[121] – అందరూ ఒకే మూసలో వాళ్లు. వీళ్లందరూ ఒకళ్లనొకళ్లు పొగుడుకుంటూ, ఒకళ్లనుంచి యింకొకళ్లు నేర్చుకొంటూ, కలిసికట్టుగా "పిడివాద" మార్క్సిజానికి వ్యతిరేకంగా కత్తిగడుతూ వున్నారు. సోషలిస్టు అవకాశవాదులతో జరిగే యీ తొలి వాస్తవ అంతర్జాతీయ పోరాటంలో, అంతర్జాతీయ విప్లవాత్మక సోషల్ డెమోక్రట్లు తగినంతగా బలం పుంజుకొని, యూరప్‌లో చాలకాలంగా పాతుకొని వున్న రాజకీయ అభివృద్ధి నిరోధక శక్తులను తుదముట్టించే అవకాశం లేదంటారా?

ప్రకర్షతో కూడిన గ్రంథ పరంపరలోనూ మార్క్సిజానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన దృష్ట్యా, విద్యావంతులైన మొత్తం యువతరం యీ విమర్శ అనే ఉగ్గు పాలతో క్రమ బద్ధంగా దశాబ్దాల తరబడి పెరిగిన దృష్ట్యా, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో యీ "కొత్త విమర్శనాత్మక" ధోరణి, జూపిటర్ శిరస్సునుంచి ఉద్భవించిన మినేర్వా[122] మాదిరిగా, సమగ్ర రూపంలో తలెత్తడం ఆశ్చర్యకర విషయమేమీ కాదు. ఈ కొత్త ధోరణి సారాంశం క్రమంగా పెంపొంది, రూపుదాల్చవలసిన అవసరం లేకపోగా, అది బూర్జువా సాహిత్యం నుంచి యథాతథంగా సోషలిస్టు సాహిత్యంలోకి బదిలీ అయింది.

అంతే కాదు. బెర్న్‌స్టైన్ సైద్ధాంతిక విమర్శా, రాజకీయ ఆరాటాలూ ఏమిటో ఎవరికైనా యింకా స్పష్టం కాకపోతే, యీ "కొత్త విధానం" ఏమిటో ప్రస్ఫుటంగా చూపేందుకు ఫ్రెంచివారు శ్రమ తీసుకున్నారు. "మరి ఏ యితర దేశంలో కన్న అధికంగా ఫ్రాన్సులోనే, ప్రతి ఒక సారీ చరిత్రాత్మకమైన వర్గపోరాటాలు తుదికంటా సాగాయి...." (మార్క్స్ రచించిన "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"కి ఎంగెల్స్ "ముందుమాట"నుంచి) అన్న తన పాత ప్రశస్తిని ఫ్రాన్సు, యీ సందర్భంలో కూడా నిలబెట్టుకుంది. ఫ్రెంచి సోషలిస్టులు సిద్ధాంతీకరించడం గాక, ఆచరించడం మొదలెట్టారు. ఫ్రాన్సులోని ప్రజాస్వామికంగా మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందిన రాజకీయ పరిస్థితులు, వాళ్ళు వెంటనే దాని పర్యవసానాలన్నింటితోనూ, "బెర్న్‌స్టైనిజాన్ని ఆచరణలో పెట్టడాన్ని" సాధ్యం చేశాయి. ఆచరణలో బెర్న్‌స్టైనిజానికి మిలెరాన్ చక్కటి ఉదాహరణను సమకూర్చాడు. కాగా, మిలెరాన్ని బలపరచేందుకూ, అతన్ని ప్రస్తుతించేందుకూ బెర్న్‌స్టైన్ ఫోల్మర్‌లు మహోత్సాహంగా పూనుకోవడమన్నది అకారణంగా జరగలేదు. నిజానికి, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సారంలో, కేవలం సంస్కరణల కోసమే పనిచేసే పార్టీ మాత్రమే అయి, యీ విషయాన్ని బాహాటంగా చాటే ధైర్యం దానికి వుంటే బూర్జువా మంత్రివర్గంలో చేరే హక్కును కలిగివుండటమేగాక, సోషలిస్టు సదా అందు కోసం కృషి చెయ్యాలి. వాస్తవానికి ప్రజాస్వామ్యపు అర్థం వర్గ పెత్తనపు రద్దే అయినట్లయితే, అప్పుడిక ఆ సోషలిస్టు మంత్రి, వర్గ సామరస్యంపై గంభీరోపన్యాసాలిచ్చి, యావత్తు బూర్జువా ప్రపంచాన్నీ ఎందుకు సమ్మోహితం చెయ్యకూడదు? కార్మికుల్ని సాయుధ పోలీసులు తుపాకులతో కాల్చి చంపడం ద్వారా, ఆ వర్గ సామరస్య సారాంశమేమిటో వందసార్లూ, వెయ్యిసార్లూ రుజువైన తర్వాత సైతం, ఆ సోషలిస్టు మంత్రి, మంత్రి వర్గంలో ఎందుకు కొనసాగకూడదు? విప్లవకారుల్ని ఉరికంబాల కెక్కించి, కొరడా దెబ్బలు కొట్టించి, ప్రవాస శిక్షలకు గురిచేసిన పీరుడుగా తప్ప మరోవిధంగా ఫ్రెంచి సోషలిస్టులచేత గుర్తింపబడని రష్యన్ జార్ సన్మానంలో యీ మంత్రి ఖుద్దున ఎందుకు పాల్గొ

కూడదు? యావత్ప్రపంచపు దృష్టిలో సోషలిస్టు పార్టీ యింతటి తలవంపులకూ, ఆత్మ హైన్యానికీ ఒడిగట్టి, మన విజయానికి ఏకైక హామీ అయిన కార్మిక జనసామాన్యపు సోష లిస్టు చైతన్యాన్ని కల్తీ చేసినందుకుగాను, దానికి ముట్టిన ప్రతిఫలం ఏమిటి? అల్పమైన సంస్కరణలకుగాను ఘనమైన పథకాలు; వాస్తవానికి ఆ సంస్కరణలైనా కూడా ఎంత అల్పమైనవంటే, బూర్జువా ప్రభుత్వాలు అమలుజరిపినవి సైతం వాటికంటె ఎంతో మేలైనవి!

సోషలిజంలో తలెత్తిన యీ కొత్త ''విమర్శనాత్మక'' ధోరణి ఓ కొత్త రకం అవకాశ వాదం తప్ప మరొకటి కాదని బుద్ధిపూర్వకంగా కళ్లు మూసుకోనివాడు ఎవడైనా చూడ కుండా ఉండలేడు. మనుషుల్ని, వాళ్లు ధరించే మెరిసే యూనిఫారాలనుబట్టీ, వాళ్లు తమకు పెట్టుకునే పేర్లనిబట్టీగాక, వాళ్ల చేతలనుబట్టీ, వాళ్లు వాస్తవంగా ఏమి ప్రచారం చేస్తున్నారన్నదాన్నిబట్టీ కనుక మనం బేరీజువేసినట్లయితే, ''విమర్శనా స్వేచ్ఛ'' అంటే అర్థం, సోషల్ డెమోక్రటిక్ పార్టీలో అవకాశవాద ధోరణికి స్వేచ్ఛ అనీ, సోషల్ డెమో క్రటిక్ పార్టీని సంస్కరణవాద డెమోక్రటిక్ పార్టీగా మార్చేందుకు స్వేచ్ఛ అనీ, సోషలి జంలోకి బూర్జువా భావాలనూ, బూర్జువా శక్తులనూ ప్రవేశపెట్టేందుకు స్వేచ్ఛ అనీ స్పష్టమవుతుంది.

''స్వేచ్ఛ'' అనేది గొప్ప మాటే, కాని పరిశ్రమలకు స్వేచ్ఛ అనే నినాదం కింద అత్యంత కొల్లదారీ యుద్ధాలు సాగాయి, శ్రమకు స్వేచ్ఛ అనే నినాదంకింద శ్రామికజనం దోచుకో బడ్డారు. ''విమర్శనా స్వేచ్ఛ'' అనే ఆధునిక పదబంధంలో కూడా యిదే అంతర్గత బూటకం యిమిడి వుంది. విజ్ఞానశాస్త్రంలో తాము పురోగతిని సాధించామని నిజంగా నమ్మినవాళ్లు కొత్త అభిప్రాయాలు పాతవాటితోబాటు కలిసిమెలిసి కొనసాగే స్వేచ్ఛ కావాలని కాక, పాతవాటి స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టాలని డిమాండు చేసివుండే వారు. ''విమర్శనా స్వేచ్ఛ వర్ధిల్లాలి'' అంటూ యీనాడు వినిపిస్తున్న నినాదం, ఖాళీ పీపా కథను గుర్తుకు తెస్తోంది.

గుంపుగా నిట్రంగా వున్న కష్టమైన బాటవెంట, ఒకరి చేతిని మరొకరం దృఢంగా పట్టుకొని, మనం ఘనిష్టమైన గుంపుగా నడుస్తున్నాం. మన చుట్టూ అన్ని పక్కలా శత్రువులు వున్నారు. దాదాపు ఎడతెగకుండా వాళ్లు జరిపే కాల్పుల మధ్య మనం ముందుకె ళ్లాలి. స్వచ్ఛందంగా చేసుకున్న నిర్ణయం మేరకు, శత్రువుతో పోరాడేందుకోసం, మనం జత కలిశాం, అంతేగాని, పక్కనే వున్న ఊబిలోకి తిరోగమించేందుకు కాదు. ఆ ఊబిలో ఉన్నవాళ్లు, మొదట్నుంచీ, మనల్ని ఒక ప్రత్యేక గ్రూపుగా విడిపోయినందుకూ, రాజీ పంథాని గాక పోరాట పంథాని చేబట్టినందుకూ దూషిస్తూ వచ్చారు. మరి యిప్పుడు మనలో కొందరు ఊబిలోకి పోదాం పదండి అంటూ అరవడం మొదలెట్టారు. మనం వాళ్ల

సిగ్గు మాలినతనాన్ని ఎండగట్టినప్పుడు వాళ్లు, మీరెంత వెనకబడిన మనుషులు! మిమ్మల్ని మరింత మంచి పంథాలోకి ఆహ్వానించే స్వేచ్ఛని మాకు తిరస్కరించడానికి మీకు సిగ్గులేదూ! – అంటూ దెప్పిపొడుస్తున్నారు. లేకపోవడమేమిటి, పెద్ద మనుషుల్లారా, ఉంది! మమ్మల్ని ఆహ్వానించేందుకే కాకుండా, ఎక్కడికి వెళ్లేందుకైనా, చివరకు ఊబిలోకి వెళ్లేందుకు సైతం మీకు స్వేచ్ఛ వుంది. నిజానికి, ఊబే మీకు సరైన స్థానం అని మేం అనుకుంటున్నాం. అక్కడికి చేరుకునేందుకు మీకు మా శక్తిమేరకు సహాయం చేసేందుకు మేము సంసిద్ధంగా ఉన్నాం. అయితే, మా చేతులు మాత్రం వదలండి. మమ్మల్ని పట్టుకు వేళ్లాడకండి, విశిష్టమైన స్వేచ్ఛ అనే మాటను కలుషితం చెయ్యకండి, ఎందుచేతంటే, మా యిష్టం వచ్చిన చోటుకి వెళ్లడానికి మాకూ "స్వేచ్ఛ" వుంది. ఊబిలో ఉన్న వాళ్లతోనే కాకుండా, ఊబిలోకి పోవాలని తహతహలాడేవారితో కూడా పోరాడే స్వేచ్ఛ మాకుంది!

## ఆ) "విమర్శనా స్వేచ్ఛ"కు కొత్త సమర్థకులు


"విమర్శనా స్వేచ్ఛ" అనే యీ నినాదాన్ని, యిటీవలి కాలంలో, "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్"[123] పత్రిక అయిన "రబోచెయె దేలొ" (10వ సంచిక), ఒక సైద్ధాంతిక ప్రతిపాదనగా కాకుండా ఒక రాజకీయ డిమాండుగా గంభీరంగా ముందుకు తెచ్చింది. "విదేశాల్లో పనిచేస్తున్న సోషల్ డెమోక్రటిక్ సంఘాలను సమైక్యం చెయ్యడం సాధ్యమా?" అన్న ప్రశ్నకు అది యిలా జవాబిచ్చింది: "స్థిరమైన ఐక్యత కావాలంటే విమర్శనా స్వేచ్ఛ ఉండితీరాలి" (పేజి 36).

ఈ ఉద్ఘాటననిబట్టి కచ్చితమైన రెండు నిర్ధారణలు తేలుతున్నాయి: (1) మొత్తంగా అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో బయల్దేరిన అవకాశవాద ధోరణిని "రబోచెయె దేలొ" తన భద్రత ఛాయల కిందకి తీసుకుంది. (2) రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో అవకాశవాదానికి "రబోచెయె దేలొ" స్వేచ్ఛను డిమాండుచేస్తోంది. ఈ నిర్ధారణలను పరిశీలిద్దాం.

అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని మహీధరానికీ, జిరోండాకీ[124] మధ్య ఘర్షణ వస్తుందని జోస్యం చెప్పాలన్న "ఇస్క్రా," "జర్యా"[125]ల అభిలాష "రబోచెయె దేలొ"కి "ప్రత్యేకించి" రుచించలేదు.*

---

* విప్లవాత్మక శ్రామికవర్గంలోని రెండు ధోరణులకూ (విప్లవాత్మక, అవకాశవాద), 18వ శతాబ్దంలో విప్లవాత్మక బూర్జువావర్గంలోని రెండు (మహీధరం అనబడే జాకొబిన్,



# Что дѣлать?

## Наболѣвшіе вопросы нашего движенія

**Н. ЛЕНИНА.**

. . . „Партійная борьба придаетъ партіи силу и жизненность, величайшимъ доказательствомъ слабости партіи является ея расплывчатость и притупленіе рѣзко обозначенныхъ границъ, партія укрѣпляется тѣмъ, что очищаетъ себя“ . . . (Изъ письма Лассаля къ Марксу отъ 24 іюня 1852 г.).

**Цѣна 1 руб.**
**Preis 2 Mark = 2.50 Francs.**

STUTTGART
Verlag von J. H. W. Dietz Nachf. (G. m. b. H.)
1902

వి. ఐ. లెనిన్ "ఏం చెయ్యాలి?" 1902నాటి ముద్రణకి కవరు పేజి

''రబోచెయె దేలో'' సంపాదకుడు బి. క్రిచేవ్‌స్కీ యిలా రాస్తాడు: ''స్థూలంగా చెప్పాలంటే, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుల్లో 'మహీధరం,' 'జిరోండా' అంటూ వినవస్తున్న మాటలు పసలేని చారిత్రక పోలికగా కనిపిస్తాయి. ఒక మార్క్సిస్టు కలంనుంచి యీ పోలిక రావడం విచిత్రమైన విషయం. 'మహీధరం,' 'జిరోండా'లు సిద్ధాంతపర చరిత్రకారులు అనుకునేట్లు, భిన్న మనోస్థితులకు గాని, మేధా ధోరణులకుగాని ప్రాతినిధ్యం వహించవు, అవి రెండు భిన్న వర్గాలకు లేక సామాజిక విభాగాలకు – ఒక వంక మధ్య శ్రేణి బూర్జువావర్గానికీ, మరోవంక పెటీబూర్జువా, శ్రామికవర్గాలకూ ప్రాతినిధ్యం వహించాయి. అయితే, ఆధునిక సోషలిస్టు ఉద్యమంలో, వర్గ ప్రయోజనాల వైరుధ్యం అంటూ ఏమీ లేదు. మొత్తం సోషలిస్టు ఉద్యమం, దాని వైవిధ్యపూరితమైన అన్ని రూపాల్లోనూ (వక్కాణింపు క్రిచేవ్‌స్కీది), మిక్కిలి కరడుగట్టిన బెర్న్‌స్టైనియన్లు సైతం, శ్రామికవర్గపు వర్గ ప్రయోజనాలకూ, రాజకీయ, ఆర్థిక విమోచనంకోసం అది జరిపే వర్గ పోరాటానికీ కట్టుబడే పనిచేస్తోంది'' (పేజీలు 32–33).

సాహసంతో కూడిన ఉద్ఘాటన! ఇటీవలి సంవత్సరాల్లో, సోషలిస్టు ఉద్యమంలో ''విద్యాధిక'' విభాగం విస్తృతంగా పాల్గొనడమే బెర్న్‌స్టైనిజం అలా త్వరితంగా పెరగడానికి కారణమైందని చాలా కాలం క్రితమే గుర్తింపు పొందిన విషయాన్ని క్రిచేవ్‌స్కీ విన లేదా? అతి ముఖ్యమైన విషయం – ''అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్లు'' సైతం శ్రామికవర్గపు రాజకీయ, ఆర్థిక విమోచనకోసం జరిగే వర్గపోరాటానికి కట్టుబడి వుంటారన్న తన అభిప్రాయానికి మన యీ రచయిత ఏ ఆధారంతో వచ్చాడు? ఎవరికీ తెలియదు. అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్లకి యితనిచ్చే యీ గట్టి సమర్థనకు ఆధార

---

జిరోండిస్టు) ధోరణులకూ మధ్య పోలిక ''ఇస్క్రా'' రెండవ సంచిక (1901 ఫిబ్రవరి)లోని సంపాదకీయంలో ప్రస్తావింపబడింది. ఈ వ్యాసాన్ని ప్లెహానొవ్ రాశాడు. కాడెట్లు, ''బెజ్ జగ్లావ్‌త్సీ,''[126] మెన్షెవిక్కులూ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని జాకొబినిజాన్ని గురించి యీనాటికీ ప్రశంసాపూర్వకంగా ప్రస్తావిస్తూవుంటారు. సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని మితవాద పక్షానికి వ్యతిరేకంగా యీ భావాన్ని ప్లెహానొవ్ మొట్ట మొదట ఉపయోగించడం ఎలా తటస్థించింది? – దీన్ని గురించి మాత్రం వాళ్లు మౌనమేనా వహిస్తారు లేకుంటే దాన్ని విస్మరించనైనా విస్మరిస్తారు. (1907 నాటి ముద్రణకు రచయిత వివరణ. – సం.)

భూతమైన వాదంగాని, తర్కంగాని ఏమీ కనిపించదు. అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్లు తమను గురించి తాము ఏమి చెప్పుకుంటారో, దాన్నే తాను తిరిగిచెప్తే, తన ఉద్ఘాటనకు రుజువంటూ ఏమీ అఖ్ఖర్లేదని రచయిత భావిస్తున్నాడనడం స్పష్టం. అయితే, ఆ ధోరణి ప్రతినిధులు స్వయంగా తమను గురించి తాము చెప్పుకొనేదానిమీద ఆధారపడుతూ ఓ మొత్తం ధోరణిని గురించి చెయ్యబడిన యీ అభిప్రాయంకన్న లోతులేనిది అభిప్రాయం మరొకటేదైనా ఉండగలదా? పార్టీ అభివృద్ధియొక్క రెండు భిన్నమైనవే కాకుండా చివరకు పరస్పరం పూర్తిగా విరుద్ధమైనవైన పద్ధతులపైన, లేక పంథాలపైన అతను చేసిన పైపై "ధర్మపన్నాల" కన్న వేరేవాటిని ఎవరైనా ఊహించగలరా? ("రబోచెయె దేలొ," పేజీలు 34–35.) మరో విధంగా చెప్పాలంటే, జర్మన్ సోషల్ డెమోక్రట్లు పూర్తి విమర్శనా స్వేచ్ఛను గుర్తించగా, ఫ్రెంచి సోషల్ డెమోక్రట్లు గుర్తించలేదు. మరి సరిగా వాళ్ల ఆచరణే "అసహిష్ణుతా దోషానికి" ప్రత్యక్షోదాహరణ.

దీనికి మనం ఒకటే జవాబు చెప్పగలం. చరిత్రను అక్షరాలా "ఇలొవాయ్‌స్కీ పద్ధతి"లో అవగాహన చేసుకునే వాళ్లు ఒక్కొక్కప్పుడు మార్క్సిస్టులన్న పేరును తగిలించుకొన్నారని బి. క్రిచేవ్‌స్కీ ఉదాహరణే మనకి ధృవపరుస్తుంది. జర్మన్ సోషలిస్టు పార్టీ ఐక్యతనూ, ఫ్రెంచి సోషలిస్టు పార్టీ అనైక్యతనూ వివరించేందుకుగాను, యీ దేశాల చరిత్రల్లోని విశిష్ట లక్షణాల పరిశీలనలోకి వెళ్లవలసిన అవసరమేమీ లేదు. ఒక దేశంలోని సైనిక అర్ధ నిరంకుశ పరిస్థితులను రెండోదానిలోని రిపబ్లికన్ పార్లమెంటరిజంతో పోల్చి చూపనవసరం లేదు. పారిస్ కమ్యూన్ ఫలితాలనూ, సోషలిస్టు వ్యతిరేక అసాధారణ చట్టాన్నీ విశ్లేషించనక్కర్లేదు. రెండు దేశాల ఆర్థిక జీవితాన్నీ, ఆర్థికాభివృద్ధినీ సరిపోల్చనక్కర్లేదు. లేక, "జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు సాటిలేని పెరుగుదల"తోబాటే, తప్పుడు సిద్ధాంతాలకు వ్యతిరేకంగానే కాకుండా (మూల్‌బెర్గర్, ద్యూరింగ్,* కథెడెర్ సోషలిస్టులు[129]), తప్పుడు ఎత్తుగడలకు వ్యతిరేకంగా కూడా (లాసాల్) తీవ్రమైన పోరాటం జరిగిందనీ, సోషలిజం చరిత్రలో యిది సాటిలేనిదనీ వగైరా, వగైరా గుర్తుచెయ్యనక్కర్లేదు. ఇదంతా

* ద్యూరింగ్‌మీద ఎంగెల్స్ దెబ్బ కొట్టినప్పుడు, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ ప్రతినిధులు అనేకమంది ద్యూరింగ్ అభిప్రాయాలవైపు మొగ్గుచూపారు. పార్టీ మహాసభలో బహిరంగంగా సైతం ఎంగెల్సుపైన కటు స్వభావం, అసహిష్ణుత, కామ్రేడ్లకు ఉచితంకాని వాదవివాదాలు జరపడం వగైరా ఆరోపణలు చెయ్యబడ్డాయి. 1877 నాటి మహాసభలో,[127] మోస్ట్, అతన్ని సమర్థించే వాళ్లూ "Vorwärts"[128] పత్రికనుంచి ఎంగెల్స్ వ్యాసాలను తొలగించే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అందుకు వాళ్లు, "అత్యధిక సంఖ్యాక

అనవసర ప్రసక్తే! సహనశీలురు కారు గనుక ఫ్రెంచివాళ్లు తమలో తాము కలహించు కుంటారు, జర్మన్లు మంచి కుర్రాళ్లు గనుక ఐక్యంగా ఉంటారు.

అంచేత, ప్రగాఢ పరిజ్ఞానపు సాటిలేని యీ మచ్చుతునక పరమోద్దేశం బెర్న్‌స్టైనియన్ల కుదుళ్లను సమూలంగా కదిపివేసే యథార్థాన్ని "ఖండించడమే" తప్ప వేరుకాదు. బెర్న్‌స్టైనియన్లు శ్రామికవర్గపు వర్గపోరాట పునాదిపైన నిలబడతారా లేదా అన్న ప్రశ్నకు సమగ్రంగానూ, తిరుగులేని పద్ధతిలోనూ జవాబుచెప్పగలది ఒక్క చారిత్రకానుభవం మాత్రమే. అందుచేత, యీ సందర్భంలో ఫ్రాన్సు ఉదాహరణకు అత్యధికమైన ప్రాముఖ్యం వుంది. ఎందుకంటే, తమ జర్మన్ సహచరుల ఉత్సాహపూర్వక సమర్థనతో (పాక్షికంగా రష్యన్ అవకాశవాదుల సమర్థనతో కూడా; చూడండి: "రబోచెయె దేలొ," 2–3 సంచికలు, పేజీలు 83–84), బెర్న్‌స్టైనియన్లు స్వతంత్రంగా, తమ సొంత కాళ్లపైన నిలబడేందుకు ప్రయత్నించిన దేశం ఏదైనా ఉందంటే, అదొక్క ఫ్రాన్సు మాత్రమే. ఫ్రాన్సు "చారిత్రక" ప్రాముఖ్యానికి (నొజ్‌ద్ర్యోవ్[130] అర్థంలో) తోడు, ఫ్రెంచివాళ్ల "సహన రాహిత్యాన్ని" గురించి పేర్కొనడానికి అర్థం, మిక్కిలి అప్రియమైన వాస్తవాలను కోపంతో కూడిన దూషణలతో కప్పెట్టే ప్రయత్నంగానే తేలుతుంది.

"విమర్శనా స్వేచ్ఛ"ను సమర్థించే క్రిచేవ్‌స్కీకీ, పలువురు యితరులకీ జర్మన్లను అప్పగించేందుకు మనం సిద్ధంగా లేము. "అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్లు" జర్మన్ పార్టీ సభ్యులుగా యింకా సహింపబడుతున్నారంటే, బెర్న్‌స్టైన్ "సవరణలను" గట్టిగా తిరస్కరించిన హనోవర్ తీర్మానానికీ,[131] బెర్న్‌స్టైన్‌ని ఉద్దేశించి చేసిన ప్రత్యక్షమైన హెచ్చరిక వున్న ల్యూబెక్ తీర్మానానికీ[132] (అది లౌక్యమైన పదాల్లో పొదగబడినప్పటికీ) వాళ్లు తలొగ్గిన మేరకు మాత్రమే. జర్మన్ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా, దౌత్యం

---

పాఠకులకు అవి ఆసక్తి గొలపవు" అన్న కారణాన్ని పేర్కొన్నారు. పోతే వల్టేయిష్ (Vahlteich) వాటి ప్రచురణ పార్టీకి విశేషమైన నష్టాన్ని కలిగించిందనీ, సోషల్ డెమొక్రటిక్ ఉద్యమానికి డ్యూరింగ్ కూడా సేవ చేశాడనీ ఉద్ఘాటించాడు: "పార్టీ ప్రయోజనాలకోసం మనం అందర్నీ వినియోగించుకోవాలి. తమకు కావాలనుకుంటే, ప్రొఫెసర్లను వాదవివాదాల్లో నిమగ్నులు కానివ్వండి, అయితే ఆ వాదవివాదాలను సాగించే స్థలం 'Vorwärts' కాదు ('Vorwärts,' 65వ సంచిక, జూన్ 6, 1877). "విమర్శనా స్వేచ్ఛ" సమర్థనకు యిదిగో యిది మరో ఉదాహరణ. కాగా, జర్మన్ల ఆదర్శాన్ని ఉదహరించడానికి విశేషంగా ఉవ్విళ్లూరే మన చట్టబద్ధ విమర్శకులూ, చట్టవిరుద్ధ అవకాశవాదులూ దీన్ని గురించి యోచిస్తే బాగుంటుంది!

ఉచితమైనదా, యీ సందర్భంలో, మంచి కలహం కన్న చెడ్డ శాంతి మేలైనదా అన్న విషయాలు వివాదాస్పదమైనవి. క్లుప్తంగా చెప్పాలంటే, బెర్న్‌స్టైనిజాన్ని తిరస్కరించేందుకు వినియోగపెట్టిన పద్ధతుల్లో ఏ ఒక దాని కార్యసాధకత్వాన్ని గురించేనా అభిప్రాయాలు విభేదిస్తే విభేదించవచ్చు. కాని, జర్మన్ పార్టీ బెర్న్‌స్టైనిజాన్ని రెండు సందర్భాల్లో తిరస్కరించింది అన్న వాస్తవాన్ని ఎవడూ చూడకుండా ఉండలేదు. అందుచేత జర్మన్ ఉదాహరణ "అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్లు శ్రామికవర్గపు వర్గపోరాట పునాది పైన, దాని రాజకీయార్థిక విమోచనకోసం నిలబడుతున్నారు" అన్న సూత్రీకరణను నిరూపిస్తోందని అనుకోవడమంటే, మన కళ్ల ఎదుట జరుగుతున్నదాన్ని అర్థంచేసుకోడంలో పూర్తి వైఫల్యమేనని అర్థం.*

---

* "రబోచెయె దేలో" జర్మన్ పార్టీలో బెర్న్‌స్టైనిజానికి సంబంధించి కేవలం వాస్తవాలను పేర్కోడానికి మాత్రమే తనను తానెప్పుడూ పరిమితం చేసుకొంటూ వచ్చిందన్న విషయాన్నీ, తన సొంత అభిప్రాయాన్ని వ్యక్తంచెయ్యకుండా వుండిపోయింది" అన్న విషయాన్నీ మనం గమనించవలసివుంది. ఉదాహరణకు, 2–3 సంచికల్లోని 66వ పేజిలో ష్టుట్‌గార్ట్ మహాసభ[133] నివేదికలను చూడండి, అభిప్రాయభేదాలన్నీ "ఎత్తుగడలకు" కుదింపబడ్డాయి. అత్యధిక సంఖ్యాకులు వెనకటి విప్లవాత్మక ఎత్తుగడలకే కట్టుబడి వున్నారని మాత్రమే చెప్పబడింది. లేక 4–5 సంచికల్లో (25వ పేజిలోనూ, అటు తర్వాతా), బేబెల్ తీర్మాన పునర్ముద్రణతోబాటు హనోవర్ మహాసభలో చెయ్యబడిన ప్రసంగాల తాత్పర్యం తప్ప మరేమీ లేదు. "ప్రత్యేక వ్యాసం"లో పరిశీలింపబడుతుందన్న సాకుతో, (2–3 సంచికల్లో మాదిరిగానే), బెర్న్‌స్టైన్ అభిప్రాయాలపై వివరణా, విమర్శా మరోమారు వాయిదా వెయ్యబడ్డాయి. చిత్రం ఏమిటంటే, 4–5 సంచిక (పేజి 33)లో యిలా వుంది: "బేబెల్ వివరించిన అభిప్రాయాలకు మహాసభలో విస్తృతమైన మెజారిటీ తోడ్పాటు వుంది," మరికొద్ది పంక్తుల తర్వాత యిలా వుంది: "బెర్న్‌స్టైన్ అభిప్రాయాలను డేవిడ్ బలపరిచాడు.... యెన్ని అనుకున్నా యేం చేసినా (sic!) [గుర్తుపెట్టుకోండి!] బెర్న్‌స్టైనూ, అతని మిత్రులూ వర్గపోరాట పునాదిపైనే నిలబడుతారు.... అని చూపేందుకు ప్రయత్నించాడు...." ఇది 1899 డిసెంబరులో రాయబడింది, 1901 సెప్టెంబరులో "రబోచెయె దేలో" – "బేబెల్ చెప్పేది సరైనదని యికనెంతమాత్రమూ విశ్వసించరాదట – డేవిడ్ అభిప్రాయాలనే తన సొంత అభిప్రాయాలుగా పునరుక్తం చేస్తోంది!

ఇంతేకాదు. ''విమర్శనా స్వేచ్ఛ''ను డిమాండు చేస్తూ, ''రబోచెయె దేలొ'' రష్యన్ సోషల్ డెమోక్రసీ ముందు, బెర్న్‌స్టైనిజాన్ని సమర్థిస్తోంది. మన ''విమర్శకుల'' పట్లా, బెర్న్‌స్టైనియన్ల పట్లా మనం అపచారం చేశామని అది నమ్ముతోందనడం స్పష్టం. అయితే, ఎవళ్లెవళ్ల పట్ల? ఎవరు? ఎక్కడ? ఎప్పుడు అపచారం చేశారు? ఆ అపచారం ఏమిటి? దీన్ని గురించి ఒక్క మాట కూడా లేదు. ''రబోచెయె దేలొ'' ఒక్కగా నొక్క రష్యన్ విమర్శకుడిని గాని, బెర్న్‌స్టైనియన్నిగాని పేర్కోలేదు! దీన్నిబట్టి యీ కింది రెండు ఊహల్లో ఏదో ఒకటి నిజం అనుకోవలసివస్తోంది. అపచారానికి గురైనది సాక్షాత్తూ ''రబోచెయె దేలొ''యే అయివుండాలి (10వ సంచికలోని రెండు వ్యాసాల్లోనూ ''జర్యా,'' ''ఇస్క్రా''ల చేతుల్లో ''రబోచెయె దేలొ''కు జరిగిన అవమానాల ప్రస్తావన మాత్రమే ఉండటాన్నిబట్టి యీ విషయం ధృవపడుతోంది). అదే నిజమైతే, బెర్న్‌స్టైనియన్లతో ఎటువంటి సంఘీభావాన్ని సైతం ఎప్పుడూ గట్టిగా వ్యతిరేకిస్తూ వచ్చిన ''రబోచెయె దేలొ,'' ''అత్యంత బాహాటమైన బెర్న్‌స్టైనియన్ల'' తరఫునా, విమర్శనా స్వేచ్ఛ తరఫునా వకాలతు తీసుకోకుండా, తనను తాను ఎందుకు సమర్థించుకోలేకపోయిందన్న విచిత్ర వాస్తవాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? లేక, మూడవ పక్షానికి అపచారం జరిగివుండాలి. ఇదే నిజమైతే, వారి పేరు ఉదహరించక పోవడానికి కారణాలేమిటి?

దీన్నిబట్టి తేలుతోంది యేమిటంటే, తన స్థాపన నాటినుంచీ ''రబోచెయె దేలొ'' ఏ దాగుడుమూతలు ఆడుతోందో (యీ విషయాన్ని తర్వాత చూపగలను), అవే దాగుడు మూతలను యిప్పుడు కూడా అది కొనసాగిస్తోంది అని. బాహాటంగా ప్రస్తుతింపబడుతున్న ''విమర్శనా స్వేచ్ఛ'' ఆచరణలో మొట్టమొదటి సారిగా ఎలా అన్వయింపబడిందో కూడా మనం చూద్దాం. వాస్తవంలో అది, ఎలాంటి విమర్శనుంచీ తటస్థంగా ఉండటానికే కాకుండా స్వతంత్రమైన అభిప్రాయ వ్యక్తీకరణనుంచి కూడా పూర్తి తటస్థంగా వుండేందుకు వెన్వెంటనే దిగజారిపోయింది. రష్యన్ బెర్న్‌స్టైనిజాన్ని అదేదో సిగ్గుపడవలసిన వ్యాధి అన్నట్లు (స్త్రువేర్ వాడిన సముచిత పదం వాడాలంటే)[134] ప్రస్తావించకుండా దాట వేసే ''రబోచెయె దేలొ''యే, యీ వ్యాధికి చికిత్స నిమిత్తం, యీ వ్యాధి జర్మన్ రూపాంతరానికి సరికొత్త జర్మన్ వ్యాధినివారణ పద్ధతిని ముక్కస్య ముక్క అనుసరించాలని ప్రతిపాదిస్తోంది! విమర్శనా స్వేచ్ఛ స్థానంలో బానిస (అంతకంటే అధ్వానం: కోతి) అనుకరణ! ఆధునిక అంతర్జాతీయ అవకాశవాదపు సామాజిక, రాజకీయ సారాంశమే, జాతీయ విలక్షణాలతో, ఆయా దేశాల్లో రకరకాలుగా ఆవిష్కృతమవుతోంది. ఒక దేశంలో అవకాశవాదులు ఎన్నడో వేరే జండా కిందకి చేరితే, మరో దేశంలో వాళ్లు సిద్ధాంతానికి నీళ్లొదిలి, ఆచరణలో రాడికల్ సోషలిస్టుల విధానాన్ని అనుసరించారు. ఇంకో దేశంలో విప్లవ పార్టీకి

చెందిన కొందరు సభ్యులు అవకాశవాద శిబిరంలోకి పోయి, సూత్రాలకోసమూ, కొత్త ఎత్తుగడలకోసమూ బహిరంగంగా జరిపే పోరాటంద్వారా కాకుండా, మెల్లమెల్లగా, చాప కింద నీరులా, శిక్షకు గురిచేసేందుకు వీల్లేని పద్ధతిలో తమ పార్టీనే సంకరం చేస్తూ, తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నారు. వేరే దేశంలో ఆ బాపతు పార్టీ ద్రోహులు రాజకీయ బానిసత్వపు నిరాశా వాతావరణంలో ''రహస్య'' కార్యకలాపాలను ''బహిరంగ'' కార్యకలాపాలతో విశేషమైన ప్రతిభతో మిళాయించి, అవే పద్ధతులను అనుసరిస్తున్నారు. రష్యన్ సోషల్ డెమోక్రట్లను సమైక్యం చేసే ఒక షరతుగా విమర్శనా స్వేచ్ఛను గురించీ, బెర్న్‌స్టైనిజాన్ని గురించీ మాట్లాడటం, రష్యన్ బెర్న్‌స్టైనిజం ఏ రూపం ధరించిందో, ఎలాంటి ప్రత్యేక ఫలితాలను ఉత్పన్నం చేసిందో చెప్పకపోవడం అంటే, ఏమీ చెప్పకుండా ఉండే లక్ష్యంతో మాట్లాడటమే అవుతుంది.

''రబోచెయె దేలో'' ఏ విషయాలనైతే చెప్పదలచుకోలేదో (లేక, బహుశా దానికి అవగతం కాలేదో), ఆ విషయాలను క్లుప్తంగానే అయినా చెప్పుకునేందుకు మనం ప్రయత్నిద్దాం.

## ఇ) రష్యాలో విమర్శ

మనం యిప్పుడు పరిశీలిస్తున్న విషయానికి సంబంధించి రష్యా ప్రధాన విశిష్ట లక్షణం ఏమిటంటే, ఒకవంక సద్యోజనిత కార్మికోద్యమ ప్రారంభం, మరో వంక ప్రగతిశీల ప్రజాభిప్రాయం మార్క్సిజం దిశగా మళ్లడం, విభిన్న దృక్పథాలకు చెందిన వాళ్లు, కాలం చెల్లిపోయిన సామాజిక, రాజకీయ ప్రపంచ దృక్పథం అనే ఉమ్మడి శత్రువుమీద ఒకే జండా కింద పోరాడటం. ''చట్టబద్ధ మార్క్సిజం'' ఉచ్ఛ దశను గురించి మనం మాట్లాడుతున్నాం. స్థూలంగా చూస్తే, 1880 దశకంలోగాని, 1890 దశకం మొదట్లోగాని సాధ్యమని ఏ ఒక్కడూ నమ్మివుండని పూర్తి విచిత్ర విషయం యిది. దేశంలో నిరంకుశుడైన రాజు పరిపాలిస్తున్న కాలంలో, పత్రికా స్వేచ్ఛ బొత్తిగా లేని పరిస్థితిలో, ఏ కొద్ది రాజకీయ అసంతృప్తిగాని నిరసనగాని వ్యక్తమైనా తీవ్రమైన రాజకీయ దమనచర్యలకు పూనుకొంటున్న తరుణంలో, విప్లవాత్మక మార్క్సిస్టు సిద్ధాంతం ఆకస్మికంగా సెన్సారు చెయ్యబడిన సాహిత్యంలోకి చొరుచుకువచ్చి, పిట్టకథల్లో మాదిరిగా అన్యాపదేశంగానే వివరించబడినా, ''ఆసక్తి కలిగిన'' వాళ్లందరికీ అది బోధపడింది. (విప్లవాత్మక) ''నరోద్నయ వోల్య'' వాళ్ల సిద్ధాంతాన్ని మాత్రమే ప్రమాదకరంగా పరిగణించడానికి ప్రభుత్వం అలవాటు పడి, ఎప్పటి మాదిరిగానే, దాని లోపల వస్తున్న పరిణామాలను గమనించకుండా, దానిమీద ఏ విమర్శ ఎక్కుపెట్టబడినా కూడా పరమానందపడుతూ వచ్చింది. జరిగిందే

మిటో ప్రభుత్వం గ్రహించి, సవాలక్షమంది సెన్సారు అధికార్లూ, సాయుధ పోలీసులూ కొత్త శత్రువు ఎవరో కనిపెట్టి, అతనిమీద విరుచుకుపడే లోగా, బోలెడు కాలం (మన రష్యన్ ప్రమాణాల ప్రకారం) గడిచిపోయింది. ఈలోగా, మార్క్సిస్టు గ్రంథాలు శర పరంపరగా ప్రచురింపబడ్డాయి, మార్క్సిస్టు వార, పక్ష, మాస పత్రికలూ, దినపత్రికలూ స్థాపించబడ్డాయి. దాదాపు ప్రతివాడూ మార్క్సిస్టుగా మారిపోయాడు. మార్క్సిస్టుల్ని ప్రస్తుతించారు, మార్క్సిస్టుల మెప్పుకోసం తహతహలాడారు. మార్క్సిస్టు సాహిత్యపు అమ్మకాలు అసాధారణంగా పెరగడం, మార్క్సిస్టు పుస్తకాలు వేడివేడిగా అమ్ముడైపోవడం తోటి ప్రచురణకర్తలు మహదానంద భరితులయ్యారు. కాగా, యిటువంటి వాతావరణంలో చిక్కుకొని, కొత్తగా మార్క్సిస్టు దీక్ష పుచ్చుకున్నవాళ్లల్లో, ''కళ్లు నెత్తికి ఎక్కిన రచయితలు''[135] ఎక్కువమందే బయలుదేరడంలో చిత్రమేమీ లేదు.

మనం యిప్పుడు ఆ దశను గురించి గత చరిత్రలోని ఒక ఘట్టాన్ని గురించి మాదిరిగా ఉద్రేకరహితంగా చెప్పుకోవచ్చు. మన సాహిత్యపు ఉపరితలంమీద మార్క్సిజం వికసించిన క్లుప్తమైన ఆ దశ, అతి తీవ్రవాద, అతి మితవాద భావాలు కలిగినవాళ్ల మధ్య పొత్తు వలన ఉత్పన్నమైందన్న విషయంలో రహస్యమేమీ లేదు. నిజానికి, యీ మితవాదులు బూర్జువా ప్రజాతంత్రవాదులు. ఆ ''పొత్తు'' యింకా అమల్లో వున్న రోజుల్లోనే యీ నిర్ధారణ (వాళ్ల తదుపరి ''విమర్శనాత్మక'' అభివృద్ధి కారణంగా అది స్పష్టంగా రుజువైంది) కొందరికి స్ఫురించింది.*

అటువంటప్పుడు, భవిష్యత్ ''విమర్శకుల''తో పొత్తు కుదుర్చుకున్న విప్లవాత్మక సోషల్ డెమోక్రట్లే తదుపరి ''కలతకి'' ప్రధానంగా బాధ్యులు కారా? మరీ ఛాందస అభిప్రాయాలు కలిగినవారినుండి యీ ప్రశ్నా, దీనికి ఔనన్న సమాధానమూ కొన్ని సార్లు వినిపిస్తూ వుంటాయి. అయితే, అటువంటివాళ్లు పూర్తిగా పొరబడుతున్నారు. ఆత్మవిశ్వాసం లేనివారు మాత్రమే నమ్మదగని వాళ్లతో సైతం తాత్కాలికంగా పొత్తుపెట్టుకోడానికి భయపడగలరు. అటువంటి పొత్తులు లేనిదే ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా మనజాలదు. ఒక విధంగా చట్టబద్ధ మార్క్సిస్టులతో కలయికే రష్యన్ సోషల్ డెమోక్రట్లు పెట్టుకున్న మొట్టమొదటి నిజమైన రాజకీయ పొత్తు. ఈ పొత్తు మూలంగా, నరోదిజంమీద అసాధారణమైన సత్వర విజయం చేకూరింది. మార్క్సిస్టు భావాలు (అపభ్రంశ రూపం

---

* స్త్రూవెకు వ్యతిరేకంగా ఉద్దేశించి కె. తూలిన్ రాసిన వ్యాసానికి యిది ప్రస్తావన. ''బూర్జువా సాహిత్యంలో ప్రతిబింబించిన మార్క్సిజం'' అన్న సమీక్ష ఆధారంగా యీ సమీక్ష రచించబడింది. ముందుమాట చూడండి.[136] (1907 నాటి ముద్రణకు రచయిత వివరణ. — సం.)

లోనే అయినా) బాగా విస్తృతంగా వ్యాప్తిచెందాయి. పైగా ఆ పొత్తు బొత్తిగా యే "షరతులూ" లేకుండా కుదుర్చుకున్నది కాదు. 1895లో, "రష్యా ఆర్థికాభివృద్ధి సమస్యను గూర్చిన సమాచారం" అన్న మార్క్సిస్టు వ్యాస సంకలనాన్ని సెన్సార్లు తగలబెట్టడమే యిందుకొక నిదర్శనం. చట్టబద్ధ మార్క్సిస్టులతో చేసుకున్న సాహిత్యపరమైన ఒప్పందాన్ని రాజకీయ పొత్తుతో పోల్చవచ్చుననుకుంటే, అప్పుడు ఆ పుస్తకాన్ని ఒక రాజకీయ ఒప్పందంతో పోల్చవచ్చు.

చీలికకి కారణం "పొత్తుదారులు" బూర్జువా డెమోక్రట్లు అని తేలడం ఎంత మాత్రం కాదు. తద్భిన్నంగా, రష్యాలో ఆనాడున్న పరిస్థితుల మూలంగా, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రజాస్వామిక కర్తవ్యాలు ముందుకొచ్చిన మేరకు, బూర్జువా డెమోక్రటిక్ ధోరణి ప్రతినిధులు సోషల్ డెమోక్రట్లకు సహజమూ, వాంఛనీయమూ అయిన పొత్తుదార్లే అవుతారు. అయితే, కార్మికవర్గ ప్రయోజనాలు బూర్జువావర్గ ప్రయోజనాలకు పూర్తి విరుద్ధమైనవని సోషలిస్టులు కార్మికవర్గానికి వెల్లడించేందుకు పూర్తి అవకాశం ఉండాలన్నదే, అటువంటి పొత్తుకి ఆవశ్యకమైన ఒక షరతై ఉండితీరాలి. కాని, బెర్న్‌స్టైనియన్, "విమర్శక" ధోరణివాళ్లు – చట్టబద్ధ మార్క్సిస్టుల్లో అధిక సంఖ్యాకులు యీ ధోరణి వైపుకే మొగ్గారు – సోషలిస్టులకు యీ అవకాశాన్ని లేకుండా చేసి, మార్క్సిజాన్ని అపభ్రంశం చెయ్యడంద్వారా, సామాజిక వైరుధ్యాలను మొద్దుబరచేయాలన్న సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యడంద్వారా, సామాజిక విప్లవం, శ్రామికవర్గ నియంతృత్వం అన్న భావాలు అర్థరహితమైనవని ప్రకటించడంద్వారా, కార్మికోద్యమాన్నీ, వర్గ పోరాటాన్నీ సంకుచితమైన ట్రేడ్‌యూనియనిజానికీ, క్రమేణావచ్చే అల్ప సంస్కరణలకోసం జరిగే "వాస్తవిక" పోరాటానికీ దిగజార్చడంద్వారా, సోషలిస్టు చైతన్యాన్ని నీళ్లు కార్చారు. దీన్నిబట్టి, బూర్జువా డెమోక్రట్లు సోషలిజం స్వాతంత్ర్యానికి అడ్డుతగిలారనీ, తత్పర్యవసానంగా దాని స్వతంత్ర అస్తిత్వ హక్కును నిరాకరించారనీ తేలుతోంది. ఆచరణలో దీని అర్థం, కొత్తగా తలెత్తిన కార్మికోద్యమాన్ని లిబరల్సుకు తోకగా మార్చేందుకు కృషిచెయ్యడం తప్ప వేరు కాదు.

అటువంటి పరిస్థితుల్లో, సహజంగానే, చీలిక తప్పనిసరి. అయితే, రష్యా "విశిష్ట" లక్షణం – అతి సులభంగా అందుబాటులో వుండి, బహుళ వ్యాప్తమైన చట్టబద్ధ సాహిత్యంనుండి సోషల్ డెమోక్రట్లను దూరం చెయ్యడంగా మాత్రమే వ్యక్తమైంది. "విమర్శనా" కేతనాన్ని చేబూని, మార్క్సిజాన్ని "నిర్మూలించే" విషయంలో దాదాపు గుత్తహక్కును పొందిన "మాజీ మార్క్సిస్టులు" యీ సాహిత్యంలో పాతుకుపోయారు. "ఛాందసభావాలకు వ్యతిరేకంగా పోరాడాలి!," "విమర్శనా స్వేచ్ఛ వర్ధిల్లాలి!" (దీన్ని యిప్పుడు "రబోచెయె దేలొ" వల్లిస్తోంది) వంటి పడికట్టు మాటలు వెంటనే జనాదరణ పొందిన విషయం, సెన్సారు ఉద్యోగులుగాని, సాయుధ పోలీసులుగాని యీ జనాదరణని నిలవరించ

లేకపోయారన్న విషయం, హెరొస్ట్రాటియన్ అర్థంలో ప్రసిద్ధుడైన బెర్న్‌స్టైన్ రచన యొక్క మూడు రష్యన్ ముద్రణలు వెలువడటాన్ని బట్టీ,[137] బెర్న్‌స్టైన్, ప్రొకొపోవిచ్‌ల రచనలనూ, తదితరుల రచనలనూ జుబాతొవ్ సిఫారసు చెయ్యడాన్నిబట్టీ ("ఇస్క్రా" 10వ సంచిక) నిరూపితమైంది. సోషల్ డెమొక్రట్లపైన యిప్పుడొక కష్టమైన కర్తవ్యం పడింది – కొత్త ధోరణిని ప్రతిఘటించే కర్తవ్యం. స్వతహాగానే కష్టసాధ్యమైన ఆ కర్తవ్యం కేవలం బాహ్య ఆటంకాల మూలంగా ఊహకు అందనంత కష్టంగా తయారైంది. ఈ ధోరణి సాహిత్య పరిధికే తనను తాను పరిమితం చేసుకోలేదు. "విమర్శ" వంక మొగ్గుకి సోషల్ డెమొక్రటిక్ కార్యకర్తల్లో "ఆర్థికవాదం"పట్ల వ్యామోహం తోడైంది.

చట్టబద్ధ పత్రికల్లో విమర్శ, రహస్య పత్రికల్లో "ఆర్థికవాదం" – యీ రెండింటి మధ్యా సంబంధమూ, యీ రెండూ పరస్పరం ఆధారపడటం అన్నది ఏవిధంగా ఉత్పన్నమై పెంపొందిందన్నది దానికదే ఆసక్తికరమైన అంశం, యీ అంశం ఒక ప్రత్యేక వ్యాసానికి యితివృత్తం కాగలది. నిస్సందేహంగా ఈ సంబంధం యింతకు ముందే ఉంది అన్న విషయాన్ని మాత్రమే యిక్కడ గుర్తిస్తే సరిపోతుంది. రోసిపోయిన "క్రెడో"* యీ సంబంధాన్ని వివరించి, "ఆర్థికవాదం"యొక్క మౌలిక రాజకీయ ధోరణిని – అంటే, కార్మికులను ఆర్థిక పోరాటం (ట్రేడ్‌యూనియన్ పోరాటం అంటే మరింత బాగుంటుంది, ఎందుకంటే, దీనిలో ప్రత్యేకించి కార్మికవర్గ రాజకీయాలు యిమిడి వుంటాయి) సాగించనివ్వండి, మార్క్సిస్టు మేధావులను రాజకీయ "పోరాటం" కోసం లిబరల్సుతో కలిసిపోనివ్వండి అనే దాన్ని – నిర్మొగమాటంగా బయటపెట్టింది. "క్రెడో"ను ఆడిపోసుకోడానికి సరిగా దాని యీ నిర్మొగమాటమే కారణం. ఈవిధంగా, "జనం మధ్య" ట్రేడ్‌యూనియనిస్టు కృషి అంటే అర్థం యీ కర్తవ్యంలో మొదటి భాగాన్ని నిర్వర్తించడం, చట్టబద్ధ విమర్శ అంటే అర్థం రెండో భాగాన్ని నిర్వర్తించడం. ఆర్థికవాదానికి వ్యతిరేకంగా యీ ప్రకటన ఎంత చక్కటి ఆయుధమంటే, "క్రెడో" కనుక లేకపోయివుంటే, అటువంటి ప్రకటనను మరో దాన్ని సృష్టించడం సముచితంగా వుండేది.

"క్రెడో" కల్పితమైనది కాదు అది, దాని రచయితల అనుమతి లేకుండా, బహుశా వారి అభీష్టానికి వ్యతిరేకంగా సైతం ప్రచురింపబడింది. ఏదేమైనప్పటికీ, యీ కొత్త "కార్యక్రమాన్ని" వెలుగులోకి లాక్కురావడంలో పాల్గొన్న ప్రస్తుత రచయిత,** వక్తల అభిప్రాయాల సారాంశపు కాపీలు పంచబడ్డాయనీ, దానికి "క్రెడో" అన్న మారుపేరు

---

* "క్రెడో" – కార్యక్రమ, దృక్పథాల వివరణ. – సం.

** "క్రెడో"కి వ్యతిరేకంగా "పదిహేడుగురి నిరసన"కు యిది ప్రస్తావన. ఈ నిరసనను రచించడంలో యీ గ్రంథకర్త పాల్గొన్నాడు (1899 చివర). ఆ నిరసనా, "క్రెడో"

పెట్టబడిందనీ, నిరసనతోబాటు అది పత్రికల్లో సైతం ప్రకటించబడిందన్న ఫిర్యాదులనూ, దూషణలనూ విన్నాడు! ఈ ఉపాఖ్యానం మన ఆర్థికవాదానికి సంబంధించిన అత్యంత విశిష్టమైన ఒక లక్షణాన్ని, అంటే ప్రచారంపట్ల తగని భయాన్ని, బహిర్గతం చేస్తూండడం వల్ల దీన్నిక్కడ ప్రస్తావిస్తున్నాం. ఇదొక్క "క్రెడో" రచయితల లక్షణమే కాదు, యిది మొత్తంమీద ఆర్థికవాదపు లక్షణం. ఆర్థికవాదపు అత్యంత నిష్కపట, నిజాయితీపర ప్రతినిధియైన "రబోచయ మీస్ల్,"[140] "రబోచెయె దేలో" "Vademecum"[141]లో ఆర్థికవాద పత్రాల ప్రచురణ విషయంలో యిది కోపాన్ని వెళ్లగక్కింది), వీటికి తోడు, రెండేళ్ల క్రితం తన "profession de foi"[142]ని, దాని ఖండనతో బాటు ప్రకటించేందుకు నిరాకరించిన కీయెవ్ కమిటీ,* అర్థికవాదపు అనేకమంది యితర ప్రతినిధులూ – వీటన్నింటిలోనూ, వీళ్లందరిలోనూ యీ లక్షణం బహిర్గతమైంది.

విమర్శనా స్వేచ్ఛ సమర్థకులు విమర్శపట్ల ప్రదర్శించే యీ భయానికి కారణం కేవలం కౌటిల్యమే అని చెప్పేందుకు వీల్లేదు (కొన్ని సందర్భాల్లో కౌటిల్యం కూడా ప్రయుక్తమవుతుందనడంలో సందేహం లేదనుకోండి, అయినా కూడా, అప్పుడే పొటమరించి, యింకా దుర్బలంగా ఉన్న యీ నూతన ధోరణి అంకురాలను వ్యతిరేకుల దాడులకు గురి చెయ్యడం దూరదృష్టి లేని అజాగ్రత్త పనే అవుతుంది). అబ్బే, అధిక సంఖ్యాక ఆర్థికవాదులు సకల సైద్ధాంతిక వివాదాలనూ, గ్రూపులవారీ అభిప్రాయభేదాలనూ, విస్తృత రాజకీయ సమస్యలనూ, విప్లవవాదులను సంఘటితం చేసే ప్లానులు వగైరాలనూ మనఃపూర్వకమైన అయిష్టతతో చూస్తారు (ఆర్థికవాద స్వభావాన్నిబట్టి వాళ్లు ఆవిధంగా చూడక తప్పదు కదా). బాగా రాటుదేలిన ఒక ఆర్థికవాది ఓ రోజున నాతో "అలాంటి విషయాలన్నీ విదేశాల్లో ఉన్న వాళ్లకి వదిలేద్దురూ!" అన్నాడు. అలా అనడంలో అతను బాగా విస్తృతంగా వ్యాపించిన (అందులోనూ శుద్ధ ట్రేడ్‌యూనియనిస్టు) అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు: మాకు సంబంధించినంతవరకు కార్మికోద్యమమూ, యిక్కడ, మా ప్రాంతాల్లోని కార్మిక సంఘాలే ప్రధానం. మిగతాదంతా కేవలం శుష్క సైద్ధాంతికుల కల్పన మాత్రమే; "రబోచెయె దేలో" 10వ సంచికతో ఏకీభవించే "ఇస్క్రా" 12వ సంచికలోని లేఖా రచయితలు అన్నట్లు "సిద్ధాంతానికి విపరీత ప్రాముఖ్యాన్ని యివ్వడమే."

---

విదేశాల్లో 1900 వసంత కాలంలో ప్రచురింపబడ్డాయి.[138] శ్రీమతి కుస్కోవా రాసిన వ్యాసాన్నిబట్టి ("బిలోయె"[139]లో అనుకుంటాను) "క్రెడో" రాసినది ఆమెయేననీ, అప్పట్లో విదేశాల్లో వున్న ఆర్థికవాదుల్లో బాగా ప్రముఖుడు శ్రీ ప్రొకొపోవిచ్ అన్న సంగతి యిప్పుడు తెలిసిందే. (1907 నాటి ముద్రణకు రచయిత వివరణ. – సం.)

* మాకు తెలిసినంత మేరకు, కీయెవ్ కమిటీ సంపుటి దరిమిలా మారింది.

ఇప్పుడొక ప్రశ్న ఉత్పన్నమవుతుంది: రష్యన్ "విమర్శయొక్క, రష్యన్ బెర్న్‌స్టైనిజంయొక్క యీ విశిష్ట లక్షణాలను గమనించినమీదట, అవకాశవాదాన్ని కేవలం మాటల్లో కాక, చేతల్లో వ్యతిరేకించదలుచుకున్నవాళ్ల కర్తవ్యం ఏమిటి? మొదటి విషయం, చట్టబద్ధ మార్క్సిజం దశలో నామమాత్రంగా ప్రారంభమై రహస్యంగా పనిచేస్తున్న కార్మేడ్సు భుజాలపై కొత్తగా పడిన సైద్ధాంతిక కృషిని పునఃప్రారంభించేందుకు పనిచేసివుండవలసింది. అటువంటి కృషి జరపకుండా ఉద్యమం విజయవంతంగా పెరగడమన్నది అసాధ్యం. రెండో విషయం, జనం మనస్సుల్ని గణనీయమైన స్థాయిలో పెడదోవ పట్టిస్తున్న, చట్టబద్ధ "విమర్శ"ను వాళ్లు చురుకుగా ప్రతిఘటించివుండాల్సింది. మూడో విషయం, రోజువారీ ఉద్యమంలో గందరగోళాన్నీ, ఊగిసలాటనీ వాళ్లు చురుకుగా ఎదుర్కొని, మన కార్యక్రమాన్నీ మన ఎత్తుగడలనీ ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో భ్రష్టుపట్టించే ప్రతి ప్రయత్నాన్నీ బయటపెట్టి, నిరాకరించివుండాల్సింది.

"రబోచెయె దేలో" వీటిలో యే ఒకటీ చెయ్యలేదన్న సంగతి బాగా తెలిసిందే. బాగా తెలిసిన యీ వాస్తవాన్ని గురించి మరో చోట సవివరంగానూ, వివిధ దృక్కోణాలనుంచీ వివరించే అవకాశం వస్తుంది. అయితే, ప్రస్తుతానికి మటుకు, "విమర్శనా స్వేచ్ఛ" డిమాండుకూ, మన దేశీ విమర్శ, రష్యన్ ఆర్థికవాద విశిష్ట లక్షణాలకూ మధ్య కొట్టవచ్చినట్టు కనిపించే వైరుధ్యాలను మాత్రమే యిక్కడ చూపించాలని అనుకుంటున్నాను. అందుకుగాను, "రబోచెయె దేలో" దృక్పథాన్ని ధృవీకరించిన "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" తీర్మాన పాఠాన్ని మరోసారి చూస్తే చాలు.

> "సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు యితోధిక సైద్ధాంతికాభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా, పార్టీ సాహిత్యంలో సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతాన్ని విమర్శించే స్వేచ్ఛ — ఆ విమర్శ యీ సిద్ధాంతపు వర్గ, విప్లవాత్మక స్వభావానికి విరుద్ధంగా సాగని మేరకు — పరమ ఆవశ్యకమని మేము గుర్తిస్తున్నాం." ("రెండు మహాసభలు," పేజి 10.)

ఇందుకు కారణం ఏమిటి? ఆ తీర్మానం "దాని మొదటి భాగంలో, బెర్న్‌స్టైన్‌పైన ల్యూబెక్ పార్టీ మహాసభ చేసిన తీర్మానంతో ఏకీభవించింది".... ఆ "యూనియన్‌వాళ్లు," తమ అమాయకత్వం కారణంగా, యీ అనుకరణద్వారా తాము ఎంతటి testimonium paupertatis (పేదతనానికి సర్టిఫికెట్టు) ప్రదర్శిస్తున్నదీ గమనించలేకపోయారు.... "కాని... తన రెండో భాగంలో, ల్యూబెక్ పార్టీ మహాసభ కన్న చాలా ఎక్కువగా విమర్శనా స్వేచ్ఛను అది పరిమితం చేస్తుంది."

ఇంతకీ, "దేశాంతర యూనియన్"యొక్క యీ తీర్మానం రష్యన్ బెర్న్‌స్టైనియన్లకు

వ్యతిరేకంగా ఉద్దేశింపబడిందా? ఉద్దేశింపబడకపోతే, ల్యూబెక్ తీర్మాన ప్రసక్తి శుద్ధ అసంబద్ధమే అవుతుంది. కాని, అది "విమర్శనా స్వేచ్ఛను పరిమితం చేస్తుంది" అనడం నిజం కాదు. జర్మన్లు తమ హనోవర్ తీర్మానంలో, సరిగా బెర్న్‌స్టైన్ ప్రతిపాదించిన సవరణలనే వరుసగా అంశం తర్వాత అంశం చొప్పున అన్నింటినీ తిరస్కరించగా, తమ ల్యూబెక్ తీర్మానంలో పేర్కొనడంద్వారా బెర్న్‌స్టైన్‌ని వ్యక్తిగతంగా హెచ్చరించారు. అయితే, మన యీ "స్వేచ్ఛాయుత" అనుకరణకర్తలు విలక్షణమైన రష్యన్ "విమర్శ" యొక్క, రష్యన్ ఆర్థికవాదంయొక్క ఏ ఒక్క వ్యక్తీకరణను గాని ఒక్కగానొక్కసారి కూడా ఉదహరించలేదు. ఈ లోపం దృష్ట్యా, సిద్ధాంతపు వర్గ, విప్లవాత్మక స్వభావాన్ని గురించిన శుష్క ప్రస్తావన వక్రభాష్యం చెప్పేందుకు — ప్రత్యేకించి "దేశాంతర యూనియన్" "ఆర్థికవాదం అనబడేదాన్నీ," అవకాశవాదాన్నీ ఒకే గాటన కట్టేందుకు నిరాకరించి నప్పుడు ("రెండు మహాసభలు," పేజి 8, పేరా 1) — చాలా విస్తృతమైన అవకాశాన్ని యిస్తుంది. అయితే, యివన్నీ కూడా సందర్భవశాత్తూ చెప్పిన విషయాలు. గమనించాల్సిన ప్రధాన విషయం ఏమిటంటే, రష్యాలోని విప్లవ సోషల్ డెమోక్రట్ల విషయంలోనూ, జర్మనీలోనివాళ్ల విషయంలోనూ అవకాశవాదులు తీసుకునే వైఖరులు బద్ధ వ్యతిరేకంగా వున్నాయన్నదే. మనకి తెలిసిందే, జర్మనీలో విప్లవ సోషల్ డెమోక్రట్లు అంతకు ముందు ఉన్నవాటిని — సార్వత్రికంగా తెలిసినటువంటి, అనేక దశాబ్దాల అనుభవంద్వారా సరైనవిగా సవివరంగా సమగ్రంగా రుజువైనటువంటి కార్యక్రమం, ఎత్తుగడలూ — పదిల పరచడానికి అనుకూలురు. కాని "విమర్శకులు" మార్పులను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. ఈ విమర్శకులు లెక్కలోకి రానంతటి అల్పసంఖ్యాకులు అయిన కారణంగానూ, తాము చేసే రివిజనిస్టు ప్రయత్నాలకు సంబంధించి వాళ్ళు బాగా భీరువులైనందువలనా, అధిక సంఖ్యాకులు "కొత్త ధోరణులను" నిర్మొహమాటంగా తిరస్కరించడానికి పరిమితమవడం వెనకగల సంకల్పాన్ని మనం అర్థంచేసుకోగలం. అయితే రష్యాలో యిందుకు భిన్నంగా, విమర్శకులూ, ఆర్థికవాదులే అంతకు ముందున్నదాన్ని పదిలపరచడానికి అనుకూలంగా ఉన్నారు. ఆ "విమర్శకులు" తమను మనం మార్క్సిస్టులుగా పరిగణిస్తూనే ఉండాలనీ, తాము యింతకు ముందే పూర్తిగా అనుభవిస్తున్న "విమర్శనా స్వేచ్ఛ"కు హామీ యివ్వాలనీ (ఎందుకంటే, నిజానికి, వాళ్ళ ఏ రకమైన పార్టీ బంధాలనూ* ఎన్నడూ గుర్తించలేదు,

* రష్యాలో బహిరంగ పార్టీ బంధాలూ, పార్టీ సంప్రదాయాలూ లేకపోవడమే రష్యన్ పార్టీకీ, జర్మన్ పార్టీకీ మధ్య వున్న మౌలికమైన భేదాన్ని గుర్తించడానికి చాలు. ఇంగితజ్ఞానం కలిగిన సోషలిస్టులందరూ దీన్నిబట్టి గుడ్డి అనుకరణ పనికిరాదని తెలుసుకొని వుండాల్సింది. కాని, రష్యాలో "విమర్శనా స్వేచ్ఛ" ఎంత దూరం వెళ్లిందో

పైగా, కనీసం సలహా రూపంలోనైనా, విమర్శనా స్వేచ్ఛను "పరిమితం" చేయగలిగిన, నలుగురిచేతా గుర్తించబడిన పార్టీ సంస్థ అంటూ మనకి ఎన్నడూ లేదు). "ప్రస్తుత ఉద్యమపు సార్వభౌమ స్వభావాన్ని" విప్లవవాదులు గుర్తించాలని ఆర్థికవాదులు కోరుతున్నారు ("రబోచెయె దేలొ," సంచిక 10, పేజి 25), అంటే, యిప్పుడు ఉన్నదాని "సక్రమత్వాన్ని" గుర్తించమని కోరుతున్నారు. "పాదార్థిక అంశాల పాదార్థిక పరిసరాలచే పరస్పర చర్య నిర్ణయింపబడిన" మార్గంనుంచి ఉద్యమాన్ని "మళ్లించే" ప్రయత్నం "సైద్ధాంతికులు" చెయ్యరాదని వాళ్లు కోరుతున్నారు ("ఇస్క్రా" 12వ సంచికలో "లేఖ"). "ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు సాగించ సాధ్యమైన" ఆ పోరాటమే వాంఛనీయమైనదిగానూ, "ప్రస్తుతం వాళ్లు వాస్తవంగా సాగిస్తున్నదాన్నే" సాధ్యమైన ఏకైక పోరాటంగానూ, గుర్తించబడాలని వాళ్లు కోరుతునారు ("రబోచయ మీస్ల్"కి ప్రత్యేకానుబంధం, పేజి 14). తద్భిన్నంగా, మనం, అంటే విప్లవ సోషల్ డెమోక్రట్లం, ప్రాప్తకాలజ్ఞత ఆరాధనతో, అంటే, "యీ క్షణంలో" ఉన్నదాని ఆరాధనతో తృప్తిచెంది ఊరుకోం. ఇటీవలి సంవత్సరాల్లో అమల్లో వున్న ఎత్తుగడలను మార్చాలని మనం డిమాండుచేస్తాం; "మనం ఐక్యం కాగలిగేందుకు ముందు, మనం ఐక్యం అయ్యేందుకూ, మొట్టమొదట మన మధ్య మనం స్థిరమూ, నిశ్చితమూ అయిన విభజన రేఖలను గీసుకోవాలి ("ఇస్క్రా" ప్రచురణకు సంబంధించిన ప్రకటన చూడండి). ఒక్కముక్కలో చెప్పాలంటే, జర్మన్లు ఉన్నదాన్ని పట్టుకు వేళ్లాడుతారు, మార్పులు పనికిరావంటారు. మనమేమో ఉన్నది మారాలంటాం, ఉన్నదానికి లొంగివుండడాన్నీ, దానితో రాజీపడటాన్నీ తిరస్కరిస్తాం.

---

తెలుసుకునేందుకు ఒక ఉదాహరణను చూద్దాం: రష్యన్ విమర్శకుడు బుల్గాకొవ్ ఆస్ట్రియన్ విమర్శకుడు హేర్ట్జ్‌ని గురించి యిలా విమర్శిస్తాడు: "హెర్ట్జ్ స్వేచ్ఛగానే నిర్ణయాలు చేసినప్పటికీ, ఆయన యీ అంశంమీద [సహకార సంఘాల సమస్యపైన], తన పార్టీ అభిప్రాయాలకు మరీ ఎక్కువగా కట్టుబడివున్నట్లూ, వివరాల్లో పార్టీ నిర్ణయంతో విభేదిస్తున్నప్పటికీ, ఉమ్మడి సూత్రాన్ని నిరాకరించేందుకు ఆయన సాహసించలేనట్లూ కనిపిస్తుంది ("పెట్టుబడిదారీ విధానం, వ్యవసాయం," సంపుటం 2, పేజి 287). రష్యా రాజకీయంగా బానిసత్వం అనుభవిస్తున్న దేశం, అక్కడ జనాభాలో వెయ్యింట 999 మంది రాజకీయ పరాధీనత కారణంగా పార్టీ గౌరవానికీ పార్టీ సంబంధాలకూ చెందిన అవగాహన పూర్తిగా కుంటుబడి, మూలుగుల్లో కంటా పూర్తిగా మాలిన్యం పాలైనవాళ్లు. అలాంటి దేశపు పౌరుడు, రాజ్యాంగబద్ధమైన దేశపు పౌరుణ్ణి, "తన పార్టీ అభిప్రాయాలకు" అతిగా "కట్టుబడి" వున్నందుకు ఉన్నత పీఠంనుంచి మందలిస్తున్నాడు! విమర్శనా స్వేచ్ఛపైన తీర్మానాలు చెయ్యడం తప్ప మన రహస్య సంఘాలకు వేరే పని లేదు కదా....

జర్మన్ తీర్మానాలను ''స్వేచ్ఛగా'' అనుకరించే మన మిత్రులు ''స్వల్పమైన'' యీ తేడాను గుర్తించడంలో విఫలురయ్యారు.

## ఈ) సిద్ధాంత పోరాట ప్రాముఖ్యాన్ని గురించి ఎంగెల్స్ వివరణ

''పిడివాదం, శుష్క సిద్ధాంత ప్రసక్తి,'' ''పార్టీ జడస్థితి – నిర్బంధ ఆలోచనా పద్ధతిని ప్రవేశపెట్టినదాని తప్పనిసరి పర్యవసానం'' – ఈ శత్రువులకు వ్యతిరేకంగా ''విమర్శనా స్వేచ్ఛ''ను సమర్థించే యోధులు ''రబోచెయె దేలో''తో కత్తిగట్టారు. వీళ్లు యీ సమస్యను యింత స్పష్టంగా ముందుకు తెచ్చినందుకు మనం చాలా సంతోషిస్తున్నాం. దానికి నేను మరో అంశాన్ని చేర్చాలని కోరుతున్నాను:

ఈ విషయంలో తీర్పరులు ఎవరు?

మన ముందు రెండు ప్రచురణాలయాల ప్రకటనలు వున్నాయి. మొదటిది, '' 'దేశాంతర రష్యన్ సోషల్ డెమొక్రట్ల యూనియన్' పత్రిక – 'రబోచెయె దేలో' కార్యక్రమం.'' (''రబోచెయె దేలో'' మొదటి సంచికనుంచి పునర్ముద్రితం.) రెండోది, '' 'శ్రమ విమోచన' గ్రూపు[143] ప్రచురణల పునరారంభానికి సంబంధించిన ప్రకటన.'' ఇవి రెండూ 1899లోనే ప్రచురింపబడ్డాయి. అప్పటికి చాలా కాలంగా ''మార్క్సిజం సంక్షోభం''పై చర్చ సాగుతోంది. సరే, మనకి ఏం కనిపిస్తుంది? మొదటి ప్రకటనలో యీ విషయాన్ని గురించి ప్రస్తావన గాని, లేక యీ సమస్యపైన కొత్త పత్రిక తీసుకోబోయే వైఖరిని గూర్చిన నిర్దిష్టమైన ప్రకటన గాని ఉంటుందేమోనని వెతికితే, మన ప్రయత్నం విఫలమే అవుతుంది. ఈ కార్యక్రమంలో గాని, లేక 1901లో దేశాంతర ''యూనియన్'' మూడవ మహాసభలో[144] ఆమోదింపబడిన దాని అనుబంధాల్లో గాని సైద్ధాంతిక రంగంలో కృషిని గురించీ, ఆ రంగం ఎదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలను గురించీ ఒక్క మాట కూడా లేదు. (''రెండు మహాసభలు,'' పేజీలు 15–18.) ఈ కాలం అంతట్లోనూ ''రబోచెయె దేలో'' సంపాదకవర్గం సైద్ధాంతిక సమస్యలను, యివి ప్రపంచమంతటా సోషల్ డెమొక్రట్లందరి మనస్సులనూ కలవర పరుస్తున్న సమస్యలైనప్పటికీ, నిర్లక్ష్యం చేసింది.

తద్భిన్నంగా రెండవ ప్రకటన, యిటీవలి సంవత్సరాల్లో సిద్ధాంతంపట్ల ఆసక్తి తగ్గిపోవడాన్ని మొట్టమొదట పేర్కొని, ''శ్రామికవర్గ ఉద్యమపు సైద్ధాంతిక పార్శ్వంపట్ల అప్రమత్తతతో కూడిన శ్రద్ధ'' చూపబడాలని ఆదేశపూర్వకంగా డిమాండుచేసి, మన ఉద్యమంలో ''బెర్న్‌స్టైనియన్ ధోరణినీ, తదితర విప్లవ వ్యతిరేక ధోరణులనూ నిర్దాక్షి

ణ్యంగా విమర్శించాలి'' అని పిలుపిచ్చింది. ఈనాటివరకు వెలువడ్డ ''జర్యా'' సంచికలు చూస్తే యీ కార్యక్రమం ఏవిధంగా అమలుజరపబడిందో తెలుస్తుంది.

ఈవిధంగా, ఆలోచనలు కరడుగట్టిపోవడం పగ్గైరాలకు వ్యతిరేకంగా ఆడంబర పద బంధాల చాటున సైద్ధాంతిక ఆలోచన అభివృద్ధి పట్ల నిర్లక్ష్య భావం, నిస్సహాయతా మనకి కనబడతాయి. రష్యన్ సోషల్ డెమోక్రట్లను చూస్తే సాధారణ యూరపియన్ బాణీ స్పష్టంగా బోధపడుతుంది (జర్మన్ మార్క్సిస్టులు సైతం యీ విషయాన్ని చాలా కాలం క్రితమే గమనించారు). అతిగా ప్రస్తుతింపబడుతున్న విమర్శనా స్వేచ్ఛకు అర్థం, ఒక సిద్ధాంతం స్థానంలో మరో సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టడం కాక సమగ్రమైన వివేచనతో కూడిన సిద్ధాంతమే అవసరం లేదని. దీని అర్థం పృథక్కలవాదమూ, సూత్ర రాహిత్యమూ. మన ఉద్యమపు వాస్తవ స్థితితో ఏ కొంచెం పరిచయం ఉన్నవాళ్లకైనా మార్క్సిజం విస్తృత వ్యాప్తితో, దాని సైద్ధాంతిక స్థాయి కొంత పడిపోయిందన్న విషయం స్పష్టంగా కనబడకమానదు. ఆచరణలో సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ ప్రాముఖ్యాన్నీ, విజయాలనూ చూసి సిద్ధాంత పరిజ్ఞానం మిక్కిలి స్వల్పంగా ఉన్నవాళ్లూ, బొత్తిగా అసలే లేనివాళ్లూ అనేకమంది ఉద్యమంలో చేరారు. దీన్నిబట్టి, ''రబోచెయె దేలొ'' సరభసంగా మార్క్స్ యొక్క యీకింది వాక్యాన్ని ఉల్లేఖించడం ఎంత అనుచితమో గ్రహించవచ్చు: ''నిజమైన ఉద్యమం వేసే ప్రతి అడుగూ ఓ డజను కార్యక్రమాల కన్న ఎక్కువ ముఖ్యం.''[145] సైద్ధాంతిక గందరగోళం ప్రబలివున్న దశలో యీ మాటలను వల్లించడం అంత్యక్రియల ఊరేగింపులో వున్న వాళ్లని ఉద్దేశించి, యిలాంటి సుదినం మీకు పదే పదే వచ్చుగాక అన్నట్లుంటుంది. అదీ గాక, గోతా కార్యక్రమాన్ని[146] గురించి మార్క్స్ రాసిన ఒక లేఖనుంచి యీ వాక్యాన్ని తీసుకున్నారు. ఆ లేఖలో ఆయన సూత్రాలను రూపొందించడంలో పృథక్కలవాదాన్ని అనుసరించడాన్ని నిశితంగా ఖండిస్తాడు. మీరు ఎవరితోనైనా ఐక్యంగా పనిచేయవలసివచ్చినప్పుడు, ఆచరణలో ఉద్యమ లక్ష్యాల సాధనకోసం ఒప్పందాలను కుదుర్చుకోండి, అంతే గాని, సూత్రాల విషయంలో ఎటువంటి బేరాలకూ చోటివ్వకండి, సైద్ధాంతిక ''రాయితీలు'' యివ్వకండి – యిదీ, పార్టీ నాయకులకు మార్క్స్ ఆ లేఖలో రాసింది. మార్క్స్ ఉద్దేశం యిది కాగా, మనలో కొందరు – మార్క్స్ పేరుతో – సిద్ధాంత ప్రాముఖ్యాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు!

విప్లవ సిద్ధాంతం లేనిదే విప్లవోద్యమం ఉండజాలదు. ఒక ఫేషనుగా అవకాశవాదాన్ని బోధించడమూ, ఆచరణలో అత్యంత సంకుచిత కార్యకలాపాలపట్ల వ్యామోహమూ జమిలిగా సాగుతున్న యీ తరుణంలో యీ భావాన్ని ఎంత నొక్కిచెప్పినా యింకా తక్కువే అవుతుంది. అయితేనేం, రష్యన్ సోషల్ డెమోక్రట్ల విషయంలో సిద్ధాంత ప్రాముఖ్యం మరో మూడు పరిస్థితుల కారణంగా ఎక్కువైంది. తరచుగా విస్మరింపబడే ఆ మూడూ

యివి: మొదటిది, మన పార్టీ యింకా నిర్మాణ క్రమంలో మాత్రమే వుంది, దాని రూపు రేఖలు యిప్పుడే స్థిరపడుతున్నాయి. ఉద్యమాన్ని సరైన పంథానుంచి మళ్లించ ప్రయత్ని స్తున్న విప్లవ ఆలోచనకు సంబంధించిన యితర ధోరణులతో మన పార్టీ యింకా వ్యవహా రాలు తేల్చుకోలేదు. తద్వ్యతిరేకంగా, సరిగా అత్యంత సమీప గతంలోనే సోషల్ డెమోక్ర టికేతర విప్లవ ధోరణులు (యిలా జరగవచ్చునని అక్సెల్‌రోడ్ ఆర్థికవాదులను ఎన్నడో హెచ్చ రించాడు[147]) తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో, పైపైకి "అముఖ్యమైన"దిగా కనిపించే పొరపాటు అత్యంత ప్రమాదకర పర్యవసానాలకు దారితియ్యవచ్చు. కాగా, విభిన్న దృక్పథాల మధ్య తగాదాలకిది అదనుకాదనీ, లేక ఘర్షణ వాంఛనీయం కాదనీ దూరదృష్టి లేనివాళ్లు మాత్రమే అనుకోగలరు. రాబోయే అనేక సంవత్సరాలపాటు, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ భవితవ్యం సిద్ధాంతపు ఏ "ఛాయ"ను ఎంత బలపరచుకున్నారన్న దానిపైన ఆధార పడివుంటుంది.

రెండవది, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం మౌలికంగా ఒక అంతర్జాతీయ ఉద్యమం. దీని అర్థం, మనం జాతీయ దురహంకారంపైన మాత్రమే పోరాడాలని కాకుండా, ఒకా నొక తరుణ దేశంలో ఆరంభ దశలో వున్న ఉద్యమం, యితర దేశాల అనుభవాన్ని ఉపయో గించుకున్నప్పుడే, విజయవంతం కాగలదు అని. ఈ అనుభవాలను ఉపయోగించుకోగలిగేం దుకు వాటితో కేవలం పరిచయం వుంటేనూ, లేక వట్టినే సరికొత్త తీర్మానాలను కేవలం కాపీచేస్తేనూ మాత్రమే సరిపోదు. కావలసిందేమిటంటే, ఇతర దేశాల యీ అనుభవాలను విమర్శనాత్మకంగా పరిశీలించి, వాటిని స్వతంత్రంగా పరీక్షించగల సామర్థ్యం ఆధునిక కార్మి కోద్యమం ఎంత బ్రహ్మాండంగా శాఖోపశాఖలుగా పెరిగినదీ గ్రహించినవాడు, యీ కర్తవ్య నిర్వహణకు ఎంతటి సిద్ధాంత పరిజ్ఞానమూ, రాజకీయ (దానితోబాటు విప్లవ) అనుభ వమూ అవసరమో గ్రహిస్తాడు.

మూడవది, ప్రపంచంలోని ఏ యితర దేశపు సోషలిస్టు పార్టీ ఎన్నడూ ఎదుర్కొనం తటి బృహత్తరమైన కర్తవ్యాలను రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ దేశంలో యీనాడు ఎదుర్కొంటోంది. జారు నిరంకుశపాలననుంచి యావత్తు జనాభానూ విముక్తంచెయ్యు డమనే కర్తవ్యం మనపైన మోపే రాజకీయమూ, నిర్మాణపరమూ అయిన విధులను గురించి తర్వాత వివరిస్తాను. ప్రస్తుతానికి, అత్యంత పురోగామి సిద్ధాంత మార్గదర్శక త్వంలో పనిచేసే పార్టీ మాత్రమే అగ్రగామి పోరాట యోధుని పాత్ర వహించగలదు అని మాత్రమే నేనిక్కడ చెప్పదలచుకున్నాను. దీని అర్థమేమిటో కచ్చితంగా అవగాహన చేసుకో గలిగేందుకు గాను, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి పూర్వులైన గేర్‌త్సెన్, బెలిన్‌స్కీ, చెర్నిషేవ్‌స్కీ వంటివాళ్లనూ, 1870 దశకానికి చెందిన పలువురు ప్రముఖ విప్లవకారులనూ పాఠకుణ్ణి గుర్తుచేసుకోనివ్వండి; ప్రపంచ వ్యాపితంగా రష్యన్ సాహిత్యం

యీనాడు సంతరించుకొంటున్న ప్రాముఖ్యాన్ని గురించి అతన్ని మననం చేసుకోనివ్వండి. పాఠకుణ్ణే... కాని యిది చాలులెండి!

సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో సిద్ధాంత ప్రాముఖ్యాన్ని గురించి 1874లో ఎంగెల్స్ ఏమి చెప్పాడో ఉదహరిస్తాను. సోషల్ డెమొక్రటిక్ ఉద్యమానికి రెండు మహత్తర పోరాట రూపాలు (రాజకీయ, ఆర్థిక) వున్నాయని మన వాళ్లు చెప్పడం పరిపాటయింది. కాని ఎంగెల్స్, రెండు పోరాట రూపాలను గాక, మూడు పోరాట రూపాలను గుర్తించి, సైద్ధాంతిక పోరాటాన్ని మిగతా రెండింటితో సమాన ఫాయిలో పెట్టాడు. ఆచరణలోనూ, రాజకీయంగానూ బలపడిన జర్మన్ కార్మికోద్యమానికి ఎంగెల్స్ చేసిన సూచనలు సమకాలీన సమస్యల, వాద వివాదాల దృష్ట్యా చాలా ఉపయోకరమైనందున, "Der deutsche Bauernkrieg"కి ఆయన రాసిన ఉపోద్ఘాతంనుంచి* (చాలా కాలంగా ఈ పుస్తకం లభ్యం కావడం లేదు) సుదీర్ఘంగా ఉల్లేఖిస్తున్నందుకు పాఠకులు విసుగు చెందరని ఆశిస్తున్నాను:

''జర్మన్ కార్మికులకు మిగతా యూరప్‌లోని కార్మికులకు లేని రెండు ముఖ్యమైన సౌకర్యాలు వున్నాయి. మొదటిది, వాళ్లు యూరప్‌లోని అత్యధిక సిద్ధాంత దృష్టి కలిగిన జాతికి చెందినవాళ్లు. జర్మనీలోని 'విద్యా సంపన్న' వర్గాలు అనబడేవి దాదాపు పూర్తిగా కోల్పోయిన ఆ సిద్ధాంత దృష్టిని వాళ్లు నిలుపుకున్నారు: జర్మన్ శాస్త్రీయ సోషలిజం — యింతవరకు వున్న ఏకైక శాస్త్రీయ సోషలిజం — తన కంటె ముందు వచ్చిన జర్మన్ తత్వశాస్త్రం లేకుండా, ముఖ్యంగా హెగెల్ తత్వశాస్త్రం లేకుండా, అసలు అవతరించి వుండేదే కాదు. కార్మికులలో సిద్ధాంత దృష్టి లేకుంటే, యీ శాస్త్రీయ సోషలిజం వాళ్ల రక్త మాంసాలలోకి యిప్పుడు యెక్కినంతగా యెప్పుడూ యెక్కి వుండేది కాదు. ఇది యెంత అపరిమితమైన సౌకర్యమైందీ ఒకవైపున, యింగ్లీషు కార్మికోద్యమం, విడివిడి సంఘాల అద్భుతమైన నిర్మాణం వున్నప్పటికీ, నత్తనడకతో వుండడానికి గల ముఖ్య కారణాల్లో ఒకటి, సమస్త సిద్ధాంతంపట్లా నిర్లక్ష్యం అవడంబట్టీ, మరోవైపున, ప్రూడనిజం తన అసలు రూపంలో ఫ్రెంచివాళ్లలోనూ, బెల్జియన్లలోనూ, బకూనిన్‌చేత మరింత వికృత పరచబడిన రూపంలో స్పానియర్డులలోనూ, ఇటాలియన్లలోనూ హానీ, గంద్రగోళమూ కలిగించడాన్నిబట్టీ గ్రహించవచ్చు.

''రెండవ సౌకర్యం యేమిటంటే, కాలక్రమాన్నిబట్టి జర్మన్లు కార్మికోద్యమంలోకి రావడానికి దాదాపు చివరివాళ్లు. జర్మన్ సిద్ధాంత సోషలిజం తాను సెంట్ సైమన్, ఫోరియర్, ఓవెన్‌ల భుజాలమీద నిలిచిన సంగతి యెలా యెప్పుడూ మరచిపోదో — వీళ్ల ఊహాకల్పనాత్మక భావాలూ, సమస్త ఊహాస్వర్గవాదమూ యెలా వున్నప్పటికీ, వీళ్లు ముగ్గురూ

* ''జర్మనీలో రైతు యుద్ధం,'' మార్క్స్ ఎంగెల్స్ సంకలిత రచనలు, భాగం II, ''ప్రగతి'' ప్రచురణాలయం, మాస్కో, 1981, పేజీలు 96–98.

అన్ని కాలాల అత్యంత ప్రముఖ ఆలోచనాశీలుర మధ్యా తమ స్థానం కలిగివుంటారు; వీళ్ల మహా మేధ ముందుగానే ఊహించిన అసంఖ్యాక విషయాలు సరైనవని యిప్పుడు మనం శాస్త్రీయంగా రుజావుచేస్తున్నాం — అలాగే జర్మనీలోని ఆచరణగత కార్మికోద్యమం, తాను ఇంగ్లీషు, ఫ్రెంచి ఉద్యమాల భుజాలమీద అభివృద్ధి అయినానని, వాళ్ల అధిక మూల్యం చెల్లించి కొన్న అనుభవాన్ని తాను పూరక ఉపయోగించగలిగినాననీ, వాళ్ల కాలంలో అత్యధికంగా అనివార్యమైనట్టి వాళ్ల పొరపాట్లను తాను యిప్పుడు నివారించవచ్చుననీ, యెప్పుడూ మరచిపోకూడదు. ఇంగ్లీషు ట్రేడ్‌యూనియన్లు ముందు లేకుండా, ఫ్రెంచి కార్మికుల రాజకీయ పోరాటాలు లేకుండా, ముఖ్యంగా పారిస్ కమ్యూన్ యిచ్చిన బ్రహ్మాండమైన ఊపు లేకుండా, యిప్పుడు మనం యెక్కడ వుండేవాళ్లం?

"జర్మన్ కార్మికులు తమ పరిస్థితిలోని సౌకర్యాలను అపురూపమైన అవగాహనతో వినియోగించుకున్నారని వాళ్లని మెచ్చుకోక తప్పదు. కార్మికోద్యమం పుట్టినప్పటినుండి మొట్టమొదటిసారి దాని మూడు రంగాలలోనూ — సిద్ధాంత రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ, ఆచరణాత్మక ఆర్థిక (పెట్టుబడిదార్లకు ప్రతిఘటన) రంగంలోనూ — సుసమన్వితంగా, వాటి పరస్పర సంబంధాలకు అనుగుణంగా, ఒక క్రమపద్ధతిలో సాగించబడుతున్నది. సరిగ్గా యిందులో, యీ ఏకకేంద్రిత దాడిలో జర్మన్ ఉద్యమంయొక్క బలమూ, అజేయతా వున్నాయి.

"ఒకవైపున యీ సౌకర్యవంతమైన సన్నివేశం వలనా, మరొకవైపున సంకుచితంగా వుండే యింగ్లీషు కార్మికోద్యమంయొక్క విలక్షణ గుణాలవలనా, ఫ్రెంచి కార్మికోద్యమం బలవంతంగా అణచివేయబడడంవలనా జర్మన్ కార్మికులు ప్రస్తుతానికి కార్మికవర్గ ఉద్యమ అగ్రభాగాన వున్నారు. వీళ్లను ఘటనలు యెంత కాలం యీ గౌరవ స్థానంలో వుండనిస్తాయో జోస్యం చెప్పలేం. కానీ, అక్కడ వున్నంత కాలం వాళ్లు ఈ స్థానానికి యోగ్యంగా వుంటారని ఆశిద్దాం. ఇది ప్రతి పోరాట, ఆందోళన రంగంలోనూ ద్విగుణీకృత కృషిని డిమాండు చేస్తుంది. ప్రత్యేకంగా, నాయకుల కర్తవ్యం యేమిటంటే, సిద్ధాంత సమస్యలన్నిటిని గురించీ అంతకంతకు స్పష్టమైన అవగాహన సంపాయించడమూ, పాత ప్రపంచ దృక్పథంనుండి సంక్రమించిన సాంప్రదాయిక నుడికారాల ప్రభావంనుండి అంతకంతకూ విముక్తిచెందడమూ, సోషలిజం ఒక విజ్ఞానశాస్త్రం అయింది గనుక దానిని శాస్త్రీయంగా అనుసరించాలని, అనగా అధ్యయనం చేయాలని, అది డిమాండుచేస్తుందనే విషయం నిత్యం మనసులో వుంచుకోవడమూ. అలా గ్రహించినట్టి, అంతకంతకూ స్పష్టమైన అవగాహనను మరింత పట్టుదలతో కార్మిక జనాలలో వ్యాప్తిచేయడమూ, పార్టీయొక్కా, ట్రేడ్ యూనియన్లయొక్కా నిర్మాణాన్ని అంతకంతకూ దృఢంగా కట్టుదిట్టం చేయడమూ కర్తవ్యంగా వుంటుంది....

"జర్మన్ కార్మికులు యీ పద్ధతిలో పురోగమిస్తే, వాళ్లు సరిగ్గా ఉద్యమ అగ్రభాగాన నడుస్తూవుండరు – యే ప్రత్యేక దేశపు కార్మికులూ ఉద్యమ అగ్రభాగాన నడవడం యీ ఉద్యమానికి ప్రయోజనకారి కాదు – కానీ వాళ్లు యుద్ధశ్రేణిలో గౌరవ స్థానంలో వుంటారు; హఠాత్తుగా సంభవించే తీవ్ర అగ్నిపరీక్షలుగానీ, అతి ముఖ్య ఘటనలుగానీ వాళ్ల నుండి యితోధిక ధైర్యాన్నీ, యితోధిక దీక్షనూ, శక్తినీ అపేక్షించినప్పుడు వాళ్లు యుద్ధానికి సాయుధులుగా నిలబడివుంటారు."

ఎంగెల్స్ మాటలు భవిష్యద్దర్శకాలుగా రుజువయ్యాయి. కొద్ది సంవత్సరాల్లోనే, సోషలిస్టులకు వ్యతిరేకంగా అసాధారణ చట్టం రూపంలో జర్మన్ కార్మికులు అనుకోనంతటి తీవ్ర పరీక్షలకు గురిచెయ్యబడ్డారు. పోరాటానికి సుసజ్జితులైన జర్మన్ కార్మికులు ఆ పరీక్షలను ఎదుర్కొని, వాటినుండి విజయవంతంగా బయటపడ్డారు.

రష్యన్ శ్రామికవర్గం యింతకు ఎన్నోరెట్లు తీవ్రతరమైన పరీక్షలను ఎదుర్కొవలసి వుంటుంది. రాజ్యాంగబద్ధమైన దేశంలోని సోషలిస్టు వ్యతిరేక చట్టంతో పోల్చినప్పుడు ఒక మరుగుజ్జులా మాత్రమే కనిపించే బ్రహ్మరాక్షసితో అది తలపడాలి; చరిత్ర యీనాడు ఒక తక్షణ కర్తవ్యాన్ని మనపైన మోపింది; ఏ దేశపు శ్రామికవర్గమైనా ఎదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలన్నింటిలోకీ అది అత్యంత విప్లవాత్మక కర్తవ్యం. ఈ కర్తవ్య పరిపూర్తి, అంటే, ఒక్క యూరపియన్ అభివృద్ధినిరోధకత్వానికే గాక, ఆసియాలోని అభివృద్ధినిరోధకత్వానికి (అని కూడా యిప్పుడు చెప్పవచ్చు) పైతం మిక్కిలి శక్తివంతమైన దుర్గపు వినాశం, రష్యన్ శ్రామికవర్గాన్ని అంతర్జాతీయ విప్లవ శ్రామికవర్గపు అగ్రశ్రేణిలో నిలబెడుతుంది. మన పూర్వీకులైన 1870 దశకపు విప్లవవాదుల ఉద్యమం కన్న వేయి రెట్లు విస్తృతమూ, గాఢమూ అయిన యీ ఉద్యమాన్ని అదే అకుంఠిత దీక్షతోటీ, జీవంతోటీ ఉత్తేజితం చెయ్యడంలో మనం విజయం సాధించినట్లయితే, మన పూర్వీకులు యింతకు ముందే సాధించిన యీ గౌరవహోదాని సంపాదించుకొనే హక్కును మనం సంపాదించుకుంటాం.

## II

## జనసామాన్యపు సద్యోజనితత్వం, సోషల్ డెమోక్రట్ల చైతన్యం

1870 దశకంనాటి ఉద్యమం కన్న యింకెంతో విస్తృతమూ, గాఢమూ అయిన మన ఉద్యమాన్ని, ఉత్తేజితం చెయ్యాలని నేను యింతకు ముందే చెప్పాను. నిజానికి, యీనాటి

ఉద్యమ బలం జనసామాన్యపు (ప్రధానంగా, పారిశ్రామిక శ్రామికవర్గపు) చైతన్యంలో ఉంటుందన్న విషయాన్నీ, దాని బలహీనత విప్లవ నాయకుల్లో చైతన్యమూ, చొరవా లోపించడంలో వుంటుందన్న విషయాన్నీ యింతవరకు ఎవ్వరూ శంకించలేదనుకుంటాను.

అయితే, యిటీవల విభ్రాంతి గొలిపే విషయం ఒకటి బయటపడింది. అది, యింత వరకు జనంలో నాటుకొనివున్న అభిప్రాయాలన్నింటినీ తలకిందులుచేసే ప్రమాదం వుంది. ఈ విషయాన్ని కనిపెట్టింది ''రబోచెయె దేలొ.'' ''ఇస్క్రా,'' ''జర్యా''లతో తను జరిపిన వాదవివాదాల్లో అది, ఆయా వేర్వేరు అంశాలపై అభ్యంతరాలను చెప్పడంతో సరిపెట్టుకోక, మరింత ప్రగాఢమైన ధ్యేయం విషయంలో — ''సద్యోజనితమైనదానికీ, చైతన్య పూరితంగా 'పద్ధతి ప్రకారం నిర్వహించే' ఉద్యమానికీ మధ్య సాపేక్ష ప్రాధాన్యంపట్ల భిన్న అంచనాల'' విషయంలో — ''సాధారణ అభిప్రాయభేదాలు'' ఉన్నట్లు చిత్రించప్రయత్నించింది. ''రబోచెయె దేలొ'' తన ఆరోపణను యీవిధంగా నిర్వచించింది: ''ఉద్యమ అభివృద్ధిలో వస్తుపరమూ లేక సద్యోజనితమూ అయిన అంశాన్ని కొంచెపరచడం.''* దీనికి నేనిలా జవాబు చెప్పాను: ''ఇస్క్రా,'' ''జర్యా''లతో ''రబోచెయె దేలొ'' జరిపిన వాదోపవాదాల పర్యవసానంగా, మిగతా విషయాలన్నింటి మాటా ఎలా వున్నా, ''సాధారణ అభిప్రాయభేదాలు'' ఉన్న విషయాన్ని అది బయటపెట్టినందుకు మనం తృప్తిచెందవచ్చు. ఈ సూత్రీకరణ ఎంతో ప్రాముఖ్యం కలిగింది, రష్యన్ సోషల్ డెమొక్రట్ల మధ్య యీనాడు సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ వున్న అభిప్రాయభేదాల సారాంశంమీద యిది ప్రసరింపజేసే కాంతి యెంతో స్పష్టమైంది.

కనుకనే, చైతన్యానికీ సద్యోజనితత్వానికీ మధ్య సంబంధంపట్ల జనంలో యింతటి విశేషమైన ఆసక్తి ఏర్పడింది, కనుకనే యీ సమస్యను సవివరంగా పరిశీలించడం అవసరమైంది.

## అ) సద్యోజనిత వెల్లువ ప్రారంభం

1890 దశకం మధ్యలో రష్యాలోని విద్యావంతులైన యువకుల్లో మార్క్సిస్టు సిద్ధాంతాలపట్ల ఎంతటి సార్వత్రికమైన ఆసక్తి ప్రచలితంగా వున్నదో వెనకటి ప్రకరణంలో నేను పేర్కొన్నాను. అదే కాలంలో ప్రసిద్ధమైన 1896 నాటి సెంట్ పీటర్స్‌బుర్గ్ పారిశ్రామిక యుద్ధానంతరం[148] సంభవించిన సమ్మెలు కూడ అలాగే సాధారణ స్వభావాన్ని సంతరించుకున్నాయి. యావత్తు రష్యాలోనూ వాటి వ్యాప్తి కొత్తగా జాగృతమవుతున్న ప్రజోద్యమ

* ''రబోచెయె దేలొ,'' సంచిక 10, 1901 సెప్టెంబరు, పేజీలు 17–18. ''రబోచెయె దేలొ'' వక్కాణింపు.

ప్రగాఢత్వాన్ని తెలియజేస్తుంది. కాగా, ఆనాటి "సద్యోజనిత అంశాన్ని" గురించి చెప్పుకో వాలన్నప్పుడు, ప్రథమంగానూ, ప్రధానంగానూ యీ సమ్మె ఉద్యమాన్నే మనం సద్యోజ నితమైనదిగా పరిగణించాల్సి వుంటుంది. కాని సద్యోజనితత్వాల్లో తేడా వుంది. రష్యాలో 1870 దశకంలోనూ, 1860 దశకంలోనూ (చివరకు 19వ శతాబ్దపు మొదటి అర్ధ భాగంలోనూ) సమ్మెలు సంభవించాయి, వాటితోబాటు "సద్యోజనితంగా" యంత్రాలు నాశనంచెయ్యడం మొదలైనవి జరిగాయి. ఈ "తిరుగుబాట్ల"తో పోల్చినప్పుడు, 1890 దశకం నాటి సమ్మెలను "చైతన్యపూరితమైనవిగా" సైతం పరిగణించవచ్చు. ఆమేరకు అవి, కార్మికోద్యమం ఆ కాలంలో సాధించిన ప్రగతిని తెలియజేస్తాయి. దీన్నిబట్టి "సద్యో జనిత అంశం," సారాంశంలో, పిండరూపంలో వున్న చైతన్యాన్ని మాత్రమే తప్ప మరి దేన్నీ వ్యక్తంచెయ్యడంలేదని తెలియవస్తోంది. ఆదిమ తిరుగుబాట్లు సైతం కొంతమేరకు చైతన్య జాగృతినే వ్యక్తంచేశాయి. తమను పీడిస్తున్న వ్యవస్థ శాశ్వతత్వంమీద కార్మికవర్గం తరతరాల తమ నమ్మకాన్ని కోల్పోతూ అధికారులకి బానిసబుద్ధితో కూడిన దాసోహాన్ని నిశ్చయంగా వదులుకొని, సమిష్టిగా పోరాడవలసిన ఆవశ్యకతను అర్థంచేసుకుందని అనను గాని, గ్రహించనారంభించింది. అయితే యిది, పోరాటంగా కంటే ఎక్కువగా తెగింపు, పగసాధింపులుగా వెల్లడైంది. కాని, 1890 దశకంలోని సమ్మెలు యిందుకు భిన్నం. వాటిలో చైతన్య స్ఫులింగాలు చాలా అధికంగా బహిర్గతమయ్యాయి. నిర్దిష్టమైన డిమాండ్లు ముందుకు వచ్చాయి, సమ్మెకు జాగ్రత్తగా ఆలోచించి మరీ సమయ నిర్దేశం చేసేవారు, తమ ఎరుకలో యితర చోట్ల సమ్మెలు జరిగిన సందర్భాలనూ, సంఘటనలనూ చర్చించడం మొదలైనవి చేసేవారు. తిరుగుబాట్లు కేవలం పీడితుల ప్రతిఘటన క్రమబద్ధమైన సమ్మెలు పిండరూపంలో – పిండరూపంలో మాత్రమే – వర్గపోరాటం. వాటంతటికి అవిగా తీసుకున్నప్పుడు, యీ సమ్మెలు కేవలం ట్రేడ్‌యూనియన్ పోరాటాలు మాత్రమే, అవి అప్పటికి యింకా సోషల్ డెమొక్రటిక్ పోరాటాలు కావు. కార్మికులకూ యజమానులకూ మధ్య వైరుధ్యాలు పొడసూపాయన్నే అవి తెలియజేస్తున్నాయి. అయితే, తమ ప్రయోజనాలకూ మొత్తం ఆధునిక రాజకీయ, సామాజిక వ్యవస్థకూ మధ్యగల రాజీలేని వైరుధ్యాన్ని గురించిన చైతన్యం కార్మికులకు లేనూ లేదు, ఉండనూ జాలదు. అంటే, వాళ్లది అప్పటికింకా సోషల్ డెమొక్రటిక్ చైతన్యం కాదు. ఈ అర్థంలో, "తిరుగుబాట్లతో" పోలిస్తే 1890 దశకం నాటి సమ్మెలు, పెద్ద ముందడుగే అయినప్పటికీ, అప్పటికింకా శుద్ధ సద్యోజనిత ఉద్యమంగానే ఉండిపోయాయి.

కార్మికుల్లో సోషల్ డెమొక్రటిక్ చైతన్యం ఉండివుండజాలదని నేను చెప్పాను. వాళ్లకి ఆ చైతన్యాన్ని బయటనుంచే తీసుకురావాలి. అన్ని దేశాల చరిత్రా మనకి ఒక్క విషయాన్నే తెలియజేస్తుంది: కార్మికవర్గం, ప్రత్యేకించి స్వయంకృషి ద్వారా ట్రేడ్

యూనియన్ చైతన్యాన్ని మాత్రమే పెంపొందించుకోగలుగుతుంది; అంటే, యూనియన్లలో తాము సమీకృతమై, యజమానులతో పోరాడి, అవసరమైన కార్మిక చట్టాలను చేసేలా ప్రభుత్వాన్ని ఒత్తిడిచెయ్యడం మొదలైనవి అవసరమన్న విశ్వాసాన్ని మాత్రమే పెంపొందించుకోగలుగుతుంది.* అయితే, సోషలిస్టు సిద్ధాంతం, ఆస్తిపరవర్గాల విద్యాధిక ప్రతినిధుల చేతా, మేధావులచేతా విపులీకరించబడిన తాత్విక, చారిత్రక, ఆర్థిక సిద్ధాంతాల్లోంచే పెంపొందింది. ఆధునిక శాస్త్రీయ సోషలిజం వ్యవస్థాపకులైన మార్క్సు ఎంగెల్సులు తమ సామాజిక హోదా రీత్యా స్వయంగా బూర్జువా మేధావివర్గానికి చెందినవాళ్లే గదా. సరిగా అదే విధంగా, రష్యాలో, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ సిద్ధాంతం కార్మికోద్యమపు సద్యోజనితమైన పెరుగుదలకు ఎటువంటి సంబంధమూ లేకుండానే ఉత్పన్నమైంది; విప్లవ సోషలిస్టు మేధావివర్గంలో చింతన అభివృద్ధిచెందినదానికి సహజమూ, తప్పనిసరీ అయిన పర్యవసానంగా అది ఉత్పన్నమైంది. చర్చింపబడుతున్న దశలో, అంటే 1890 దశకపు మధ్య సంవత్సరాల్లో, యీ సిద్ధాంతం ''శ్రమ విమోచన'' బృందపు సమగ్రంగా రూపొందిన కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించడమేగాక, అప్పటికే అది, రష్యాలోని విప్లవవాద యువకుల్లో అధిక సంఖ్యాకులను తన వైపుకి తిప్పుకుంది.

ఈవిధంగా, ఒక వంక సద్యోజనితంగా జాగృతులై, చైతన్యపూరిత జీవితానికీ, చైతన్యపూరిత పోరాటానికీ జాగృతులైన కార్మిక జనసామాన్యం, మరోవంక సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతాయుధ సజ్జితులై, కార్మికులవద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విప్లవకారులైన యువకులూ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా, తరచుగా విస్మరింపబడే (సాపేక్షంగా తక్కువ తెలిసిన) ఒక వాస్తవాన్ని గుర్తుంచుకోవడం ప్రత్యేకించి ముఖ్యావసరం. ఆనాటి తొలి సోషల్ డెమోక్రట్లు కార్మికుల ఆర్థిక సమస్యలపైన చాలా పట్టుదలతో ఆందోళన చేసేవారు అన్నదే ఆ వాస్తవం (అప్పటికింకా రాతప్రతిగానే వున్న ''ఆందోళనా పద్ధతులు''[149] అన్న పుస్తకంలోని మిక్కిలి ఉపయోగకరమైన సూచనల మార్గదర్శకత్వంలో తమ కార్యకలాపాలను సాగించినవాళ్లు దీన్నే తమ ఏకైక కర్తవ్యంగా పరిగణించలేదు. తద్వ్యతిరేకంగా, ఆదినుంచీ కూడా మొత్తంమీద మిక్కిలి దీర్ఘకాల పర్యవసానాలు కలిగిన కర్తవ్యాలనూ, ప్రత్యేకించి నిరంకుశ రాజరికాన్ని కూలదొయ్యవలసిన కర్తవ్యాన్నీ రష్యన్ సోషల్ డెమో

---

*కొందరు ఊహించుకునేట్లు, ట్రేడ్‌యూనియనిజం మొత్తానికి ''రాజకీయాలను'' తోసిపుచ్చదు. ట్రేడ్‌యూనియన్లు ఎప్పుడూ కూడా ఏదో ఒక రాజకీయ (అంతేగాని సోషల్ డెమోక్రటిక్ కాదు) ఆందోళననూ, పోరాటాన్నీ నిర్వహిస్తూనే వచ్చాయి. ట్రేడ్ యూనియన్ రాజకీయాలకూ, సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలకూ మధ్య వున్న భేదాన్ని తర్వాతి అధ్యాయంలో నేను చర్చిస్తాను.

క్రటిక్ ఉద్యమం ముందు వాళ్లు పెడుతూవచ్చారు. ఈవిధంగా, 1895 చివరి నాటికి, "కార్మికవర్గ విమోచన పోరాట సమితి"ని[150] స్థాపించిన సోషల్ డెమొక్రట్ల సెంట్ పీటర్స్‌బుర్గ్ గ్రూపు "రబోచెయె దేలొ" అనే పత్రిక మొదటి సంచికను తయారు చేసింది. ఈ సంచిక అచ్చుకి సిద్ధంగావున్న తరుణంలో, రాజకీయ పోలీసులు 1895 డిసెంబరు 8వ తేదీ రాత్రి పూట, ఆ గ్రూపు సభ్యుల్లో ఒకడైన అనతోలి అలెక్సేయెవిచ్ వనేయెవ్* యింటిపైన దాడిచేసి, దాన్ని వశంచేసుకున్నారు. దానితో "రబోచెయె దేలొ" మొదటి సంచిక వెలుగు ముఖం చూడలేకపోయింది. ఈ సంచికలోని సంపాదకీయం (బహుశా యిప్పటికి ముప్పయ్యేళ్ల తర్వాత ఏ "రూస్కయ స్తరినా"నైనా పోలీసు డిపార్టుమెంటు పురా పత్రాల్లోంచి తవ్వి బయటకు తియ్యవచ్చు) రష్యాలో కార్మికవర్గపు చారిత్రక కర్తవ్యాలను రేఖామాత్రంగా చిత్రించి, రాజకీయ స్వాతంత్ర్య సాధనను అగ్రస్థానంలో పెట్టింది.[151] ఆ సంచికలో "మన మంత్రులు దేన్ని గురించి ఆలోచిస్తున్నారు?" అన్న శీర్షికతో, ప్రాథమిక విద్యా కమిటీలను పోలీసులు అణచివెయ్యడాన్ని గూర్చిన మరో వ్యాసం కూడా వుంది. దీనికితోడు, సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచీ, రష్యాలోని యితర ప్రాంతాలనుంచీ వచ్చిన కొన్ని లేఖలు కూడా వున్నాయి (ఉదాహరణకు, యరొస్లావ్ల్ గుబేర్నియాలోని కార్మికుల ఊచకోత పైన వచ్చిన లేఖ[152]). 1890 దశకానికి చెందిన రష్యన్ సోషల్ డెమొక్రట్ల యీ ప్రయత్నం, మనం పొరపడకుండా ఉన్నట్లయితే "మొదటి ప్రయత్నం," కేవలం స్థానికమైన పత్రికగాని, "ఆర్థిక" పత్రికగాని కాదు. సమ్మె ఉద్యమాన్ని నిరంకుశ రాజరిక వ్యతిరేక విప్లవోద్యమంతో సమైక్యంచేసే లక్ష్యంతోనూ, అభివృద్ధినిరోధక సంస్కరణ వ్యతిరేక విధాన పీడితులైన వాళ్లందరినీ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమం వైపు ఆకర్షించే లక్ష్యంతోనూ పనిచేసే పత్రిక అది. రాజధానిలోని కార్మికులూ, విప్లవ భావాలు కలిగిన మేధావులూ యీ పత్రికకు హార్దికంగా స్వాగతం చెప్పివుండే వారనడంలోనూ, దానికి విస్తృతమైన సర్క్యులేషను ఉండివుండేదనడంలోనూ, ఆ కాలపు ఉద్యమ పరిస్థితితో ఏ కొంచెం పరిచయం ఉన్నవాళ్లకైనా అనుమానం ఉండజాలదు. ఆ పత్రికను వెలువరించడంలో వైఫల్యం, ఆనాటి సోషల్ డెమొక్రట్లు, తమ విప్లవానుభవ రాహిత్యం వల్లా, క్రియారంగంలో తరిఫీదు పొందకపోవడం వల్లా ఆనాటి తక్షణావసరాలను ఎదుర్కోలేకపోయారన్న విషయాన్ని

* ఎ. ఎ. వనేయెవ్ క్షయవ్యాధి కారణంగా తూర్పు సైబీరియాలో 1899లో మరణించాడు (ప్రవాసానికి ముందు ఖైదులో ఏకాంత నిర్బంధంలో వుండగా అతనికి యీ క్షయ వ్యాధి సోకింది). అందుకనే పై సమాచారాన్ని ప్రచురించవచ్చునని నేను తలచాను. ఎ. ఎ. వనేయెవ్‌తో సన్నిహిత, ప్రత్యక్ష సంబంధం కలిగినవారినుండి యీ సమాచారం వచ్చిన కారణంగా, యీ సమాచారపు ప్రామాణికత్వానికి నేను హామీ యిస్తున్నాను.

మాత్రమే తెలియజేస్తుంది. ''సెంట్ పీటర్స్‌బుర్గ్‌స్కీ రబోచియ్ లిస్తోక్''కీ,[153] ప్రత్యేకించి ''రబోచయ గజేత''కీ, 1898 వసంతకాలంలో స్థాపింపబడిన రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ''ప్రణాళిక''కీ కూడా యిదే వర్తిస్తుంది. ఆనాటి సోషల్ డెమోక్రట్ల యీ అసన్నద్ధత విషయంలో వాళ్లని నిందించాలని మనం కలలో కూడా అనుకోము. అయితే ఆ ఉద్యమానుభవంనుంచి ప్రయోజనం పొందేందుకూ, దాన్నుంచి ఆచరణాత్మకమైన గుణ పాఠాలను గ్రహించేందుకూ గాను, ఆయా లోపాల కారణాలనూ, ప్రాముఖ్యాన్నీ మనం కూలంకషంగా అర్థంచేసుకోవాలి. 1895–98 దశలో క్రియాశీలురుగా వున్న సోషల్ డెమోక్రట్లలో కొందరు (బహుశా అధిక సంఖ్యాకులు సైతం), ''సద్యోజనిత'' ఉద్య మారంభంలోనే, మిక్కిలి విస్తృతమైన కార్యక్రమంతోనూ, సమరశీలమైన ఎత్తుగడల పంథాతోనూ ముందుకు వెళ్లడం సాధ్యమని సహేతుకంగానే భావించారన్న విషయాన్ని ధృవ పరచడం అత్యంత ముఖ్యమైన విషయం.* అధిక సంఖ్యాక విప్లవకారుల్లో శిక్షణలోపం అన్నది ఆనాటి పరిస్థితుల్లో పూర్తిగా సహజమైన విషయం. అది ప్రత్యేకించి ఏ ఆదుర్దా లనూ కలిగించివుండేది కాదు. కర్తవ్యాలు సరిగా నిర్వచింపబడినప్పుడు, వాటి పరిపూర్తి కోసం పదేపదే ప్రయత్నించేందుకు తగిన శక్తి వున్నప్పుడు, తాత్కాలికంగా ఎదురయ్యే వైఫ

---

*''1890 దశకపు చివరి సంవత్సరాలకు చెందిన సోషల్ డెమోక్రట్ల కార్యకలాపాల పట్ల ప్రతికూల వైఖరి వహించడంద్వారా చిల్లరమల్లర డిమాండ్లకోసం జరిగే పోరాటా నికే తప్ప మరేయితర కార్యకలాపాలకీ తగిన పరిస్థితులు ఆ కాలంలో లేవన్న అభిప్రాయాన్ని 'ఇస్క్రా' నిర్లక్ష్యంచేసింది'' అని ఆర్థికవాదులు, తమ ''రష్యన్ సోషల్ డెమోక్రటిక్ సంస్థలకు లేఖ''లో పేర్కొన్నారు (''ఇస్క్రా,'' సంచిక 12). పైన యివ్వబడిన వాస్తవాలు ''పరిస్థితుల అభావం'' గురించిన ఉద్ఘాటన వాస్తవానికి పరమ విరుద్ధమని నిరూపిస్తు న్నాయి. 1890వ దశకపు చివరి సంవత్సరాల్లోనే కాకుండా, మధ్య సంవత్సరాల్లో సైతం, చిల్లరమల్లర డిమాండ్లకోసం పోరాటానికే కాకుండా, భిన్నమైన కార్యకలాపాలకు అవ సరమైన అన్ని పరిస్థితులూ — నాయకులకు తగినంత శిక్షణ తప్ప — అన్ని పరిస్థితులూ వున్నాయి. ఉద్యమానికి భావజాలాన్ని సమకూర్చే మనకి, నాయకులమైన మనకి తగినంత శిక్షణ కొరవడింది — ఈ విషయాన్ని నిర్మొహమాటంగా ఒప్పుకొనేందుకు బదులు, ఆర్థిక వాదులు నేరమంతటికీ బాధ్యతను పూర్తిగా ''పరిస్థితుల అభావం'' మీదకీ, ఏ పంథానుంచైతే ఉద్యమాన్ని పక్కకి ఏ సైద్ధాంతికుడూ మళ్లించలేడో, ఆ పంథాను నిర్ధరించే భౌతిక పరిసరాల ప్రభావం మీదకీ నెట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సద్యోజనితత్వం ముందు బానిసబుద్ధితో మోకరిల్లడం తప్ప యిదేమిటి? తమ సొంత లోపాలపట్ల ''సైద్ధాంతికుల'' వ్యామోహం కాకపోతే యిదేమిటి?

ల్యాలను పాక్షికమైన దురదృష్టంగా మాత్రమే పరిగణించవలసివుంటుంది. విప్లవానుభవమూ, నిర్మాణ కౌశల్యమూ అన్నవాటిని సంతరించుకోవడం సాధ్యమే—అయితే, వాటిని సంపాదించుకోవలన్న వాంఛ ఉన్నప్పుడూ, లోపాలను గుర్తించినప్పుడూ మాత్రమే యిది సాధ్యం. విప్లవ కార్యకలాపాల్లో లోపాలను గుర్తించడమంటే, వాటిని తొలగించుకొనే మార్గంలో సగానికి పైగా ముందుకెళ్ళడమే.

ఈ చైతన్యం మసకబార నారంభించినప్పుడు, (పైన పేర్కొనబడిన గ్రూపుల సభ్యుల్లో యీ చైతన్యం చాలా సజీవంగా వుంది), లోపాలను సుగుణాలుగా పరిగణించేందుకు సిద్ధపడేవాళ్ళు—చివరకు సోషల్ డెమొక్రటిక్ పత్రికలు సైతం—తయారైనప్పుడు, సద్యోజనితత్వం ముందు తాము బానిస బుద్ధితో మోకరిల్లడానికి సైద్ధాంతిక ప్రాతిపదికను కనుగొనేందుకు సైతం ప్రయత్నించే వాళ్ళుగా తయారైనప్పుడు, పాక్షిక దురదృష్టం పూర్తి దురదృష్టంగా పరిణమించింది. ఈ ధోరణి సారాంశం పొరపాటుగానూ, అత్యంత సంకుచితంగానూ ఆర్థికవాదంగా వర్గీకరింపబడుతోంది, ఈ ధోరణిని పరిశీలించి, దీన్నుంచి నిర్ధారణలు చెయ్యవలసిన సమయం ఆసన్నమైంది.

## ఆ) సద్యోజనితత్వానికి దాసోహం. ''రబోచయ మీస్ల''

సద్యోజనితత్వానికి యీ దాసోహం అన్నది పత్రికల్లోనూ, పుస్తకాల్లోనూ ఎలా వ్యక్తమైందన్న దాన్ని పరిశీలించే ముందు, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో భవిష్యత్తులో ఘర్షణలోకి రానున్న రెండు ధోరణులు సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో పనిచేసే కామ్రేడ్ల మధ్య మొదలై, పెరిగిన తగాదామీద వెలుగును ప్రసరించే యీ దిగువ విశిష్ట వాస్తవాన్ని (పైన పేర్కొన్న మూలంనుంచి నాకీ సమాచారం అందింది) నేను గుర్తుచెయ్యగోరుతున్నాను. 1897 మొదట్లో, అంటే తాము ప్రవాసానికి వెళ్ళేముందు, ఎ. ఎ. వనేయెవ్, అతని కామ్రేడ్లు కొందరూ ఒక ప్రైవేటు సమావేశానికి హాజరయారు. దానికి ''కార్మిక వర్గ విమోచన పోరాట సమితి'' ''పాత'', ''యువ'' సభ్యులు హాజరయారు.[154] చర్చ ప్రధానంగా నిర్మాణ సమస్యలపైనా, ప్రత్యేకించి ''కార్మికుల పరస్పర సహాయనిధి నిబంధనల'' పైనా కేంద్రీకరింపబడింది. చర్చలో తుది రూపాన్ని తీసుకున్న నిబంధనలు ''లిస్తోక్ 'రబోత్నిక,' ''[155] 9–10 సంచికల్లో, 46వ పేజీలో ప్రచురింపబడ్డాయి. వెన్వెంటనే ''పాత'' సభ్యులకూ (సెంట్ పీటర్స్‌బుర్గ్ సోషల్ డెమొక్రట్లు వాళ్ళని వేళాకోళంగా ''డిసెంబరిస్టులు'' అని పిలుస్తూండేవాళ్ళు), ''యువ'' సభ్యుల్లో కొందరికీ (వీళ్ళ దరిమిలా

“రబోచయ మీస్ల్” పనిలో చురుకుగా పాల్గొన్నారు) మధ్య భేదాభిప్రాయాలు ప్రస్ఫుటమయాయి. దరిమిలా ఆవేశపూరితమైన వాదోపవాదాలు సాగాయి. ప్రకటింపబడిన రూపంలో ఆ నిబంధనలకు సంబంధించిన ప్రధాన సూత్రాలను “యువ” సభ్యులు సమర్థించారు. ప్రధానావశ్యకత యిది కాదనీ, “పోరాట సమితి”ని విప్లవవాదుల సంఘంగా సంఘటితపరచుకోవడమే ప్రధానావశ్యకత అనీ, కార్మికుల పరస్పర సహాయ నిధులూ, విద్యార్థుల ప్రచార కేంద్రాలూ మొదలైన రకరకాలవాటన్నింటినీ దానికి విధేయం చెయ్యాలనీ “పాత” సభ్యులు వాదించారు. అలా తగాదాపడిన యిరుపక్షాలూ యీ అభిప్రాయభేదం ఒక చీలికకు నాంది అన్న సంగతిని అప్పట్లో ఎంత మాత్రం గ్రహించలేదని వేరే చెప్పనక్కర్లేదు. తద్వ్యతిరేకంగా, దాన్ని వాళ్ళు మిగతావాటికి సంబంధంలేని ఏదో విడి, యాదృచ్ఛిక విషయంగా చూశారు. అయితే, యీ వాస్తవం ఒక విషయాన్ని తెలియజేస్తుంది. అదేమిటంటే, రష్యాలో కూడా, “పాత” సోషల్ డెమొక్రట్లకి వ్యతిరేకంగా పోరాటం లేకుండా ఆర్థికవాదం ఉద్భవించి, నిరాఘాటంగా వ్యాపించలేదు (ఈ విషయాన్ని యీనాటి ఆర్థికవాదులు మరచిపోతున్నారు). కాగా, ప్రధానంగా, యీ పోరాటానికి సంబంధించిన “లిఖితపూర్వక” వివరాలు మిగల్లేదంటే, అప్పట్లో పనిచేస్తూవుండిన కేంద్రాల సభ్యత్వం ఎప్పటికప్పుడు మారిపోతూ వున్న కారణంగా అనుస్యూతి అంటూ ఏదీ ఏర్పడకపోవడం, తత్పర్యవసానంగా, దృక్పథాల్లో భేదాలు ఏ పత్రాల్లోనూ పొందుపరచబడక పోవడమే, అందుకు ఏకైక కారణం.

“రబోచయ మీస్ల్” స్థాపనతో ఆర్థికవాదం వెలుగులోకి వచ్చింది, అయితే యీ పని ఒక్కసారిగానే జరిగిపోలేదు. వివిధ పట్టణాల్లో కొత్త ధోరణి విజయాల్లోనూ, వైఫల్యాల్లోనూ యాదృచ్ఛికత ఏమేరకు వుందో, “కొత్త” ధోరణి సమర్థకులూ, వ్యతిరేకులూ యిది నిజంగానే ఓ కొత్త ధోరణో లేక కేవలం కొందరు వ్యక్తుల్లో శిక్షణాలోపమో తేల్చుకునేందుకు — అక్షరాలా అలా చేసేందుకు వ్యవధి లేకపోయింది — ఎంతకాలం పట్టిందో అర్థం చేసుకునేందుకుగాను, ఆనాడు రష్యన్ అధ్యయన కేంద్రాల్లో ఎక్కువవాటి కార్యకలాపాలు ఏ పరిస్థితుల్లో జరుగుతూండేవో, ఆ పరిస్థితులనూ వాటి అల్ప జీవిత స్వభావాన్నీ (యీ విషయంలో స్వానుభవం వున్నవాళ్లకి మాత్రమే యిది సాధ్యం) మనం ఊహించుకోవలసి వుంటుంది. ఉదాహరణకు, “రబోచయ మీస్ల్”యొక్క మొదటి సైక్లోస్టైల్ సంచికలు సోషల్ డెమొక్రట్లలో అత్యధిక సంఖ్యాకులకు ఎన్నడూ అందనే లేదు. కాగా నేనిప్పుడు ఆ పత్రిక మొదటి సంచిక సంపాదకీయాన్ని ప్రస్తావించగలుగుతున్నానంటే, వి. ఐ. అనే ఆయన, తన వ్యాసంలో దాన్ని పొందుపరచిన కారణంగా మాత్రమే (“లిస్తోక్ ‘రబోత్నిక,’ ”[155] సంచిక 9–10, పేజి 47, ఆ తర్వాతి పుటలు) అది సాధ్యమైంది. ఈ వి. ఐ. పైన ఉదహరింపబడిన పత్రికలకూ, పత్రికల ప్రచురణకు సంబంధించిన పథకాలకూ ఎంతో భిన్నమైన యీ కొత్త పత్రికను హేతువాదం కన్న ఎక్కువగా ఉత్సా

హంతో కూడిన పట్టుదలతోనే ప్రశంసించడానికి వెనుకంజవెయ్యలేదు.* ''రబోచయ మీస్ల్'' ఉద్దేశాల పూర్తి సారాంశాన్నీ, మొత్తంమీద ఆర్థికవాద సారాంశాన్నీ స్ఫుటంగా వెల్లడించిన ఆ సంపాదకీయాన్ని పరిశీలించడం ఎంతైనా ప్రయోజనకరం.

''నీలంకోట్ల'' హస్తం156 కార్మికోద్యమ ప్రగతిని ఎన్నడూ నిలవరించజాలదని పేర్కొన్న తర్వాత, ఆ సంపాదకీయం యింకా యిలా సాగుతుంది ''...కార్మికోద్యమపు యీ శక్తికి కారణం కార్మికులు చివరకు తమ సొంత భవితవ్యాన్ని నాయకుల చేతుల్లోనుంచి నేరుగా తమ చేతుల్లోకి తీసుకోవడమే.'' మౌలికమైన యీ అంశమే తర్వాత మరింత వివరంగా విపులీకరించబడింది. వాస్తవానికి, ఆ నాయకులని (అంటే సోషల్ డెమొక్రట్లనీ ''పోరాట సమితి'' ఆర్గనైజర్లనీ) పోలీసులు కార్మికుల చేతుల్లోంచి గుంజివేశారని చెప్పుకోవచ్చు.** కాని కార్మికులు నాయకులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్నట్లూ, వాళ్ల పెత్తనం నుంచి తమను తాము విముక్తం చేసుకున్నారన్నట్లూ చిత్రింపబడింది! విప్లవ సంఘాన్ని సంఘటితపరచి, రాజకీయ కార్యకలాపాలను విస్తరింపజేసి ముందుకుపోవలసిందిగా పిలుపిచ్చేందుకు బదులు, శుద్ధ ట్రేడ్‌యూనియన్ పోరాటానికి తిరోగమించాల్సిందిగా పిలుపు యివ్వబడింది. ''ఎంత సేపూ రాజకీయ లక్ష్యాన్నే స్మరిస్తూ వుండడంవల్ల ఉద్యమపు ఆర్థిక పునాది మరుగున పడిపోయింది'' అనీ, కార్మికోద్యమ ప్రధాన నినాదం ''ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవడంకోసం పోరాటం''(!) లేక, అంతకంటె కూడ మంచిది, ''కార్మికుల వ్యవహారాలు కార్మికులే చూసుకోవాలి'' అన్నదై వుండాలనీ ప్రకటింపబడింది. సమ్మె నిధులు ''ఇంకో వంద అదనపు సంఘాల కన్న ఉద్యమానికి ఎక్కువ విలువైనవి'' (1897 అక్టోబ

---

* సందర్భవశాత్తూ ఒక విషయం చెప్పవలసి వుంది. 1898 నవంబరులో, ఆర్థిక వాదం సమగ్రంగా నిర్వచింపబడిన తర్వాత (ప్రత్యేకించి విదేశాల్లో) ''రబోచయ మీస్ల్'' యొక్క యీ ప్రశంస సైతం అదే వి. ఐ. కలంనుంచే వచ్చింది. అటుతర్వాత అతి త్వరలోనే అతను ''రబోచెయె దేలొ'' సంపాదకవర్గ సభ్యుడయాడు. అయినా కూడా, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో రెండు ధోరణులు వున్నాయన్న విషయాన్ని ''రబోచెయె దేలొ'' నిరాకరించింది, పైగా, యీనాటికీ నిరాకరిస్తూనే వుంది!

** ఈ పోలిక సరైనదేననడానికి యీ కింది విలక్షణ వాస్తవమే నిదర్శనం. ''డిసెంబరిస్టులు'' అరెస్టుచెయ్యబడ్డాక, ''డిసెంబరిస్టుల'' ఆచూకీ చెప్పి, వారి అరెస్టును సాధ్యం చేసినది ఒక ద్రోహి దంతవైద్యుడు ఎన్. ఎన్. మిహైలొవ్ అన్న వార్త ష్లీసెల్‌బుర్గ్ హైవే కార్మికుల్లో వ్యాపించింది. దానితో ఆ కార్మికులు ''డిసెంబరిస్టుల''తో సంబంధం కలిగిన ఒక గ్రూపుతో సంబంధం పెట్టుకొన్న ఆ ద్రోహిని హతమార్చాలని నిర్ణయించుకునేటంత ఆగ్రహావేశపూరితులయ్యారు.

రులో చెయ్యబడిన యీ ప్రకటనను 1897 మొదట్లో ''డిసెంబరిస్టులకూ'', యువ సభ్యులకూ మధ్య జరిగిన వాదోపవాదాలతో సరిపోల్చి చూడండి), వగైరా చాటబడ్డాయి. ''మనం మన దృష్టిని కార్మికుల్లో 'ముఖ్యుల' మీదగాక, 'సగటు' సామాన్య కార్మికుని మీద కేంద్రీకరించాలి,'' ''రాజకీయాలు ఎప్పుడూ ఆర్థిక విషయాలను విధేయంగా అనుసరించి వుంటాయి,''* వగైరా, వగైరా పడికట్టు పదాలు వల్లించడం ఒక ఫేషనుగా తయారైంది. అత్యధిక సందర్భాల్లో, చట్టబద్ధంగా ప్రచురణ అయే వాటిల్లో కనిపించే మార్క్సిస్టు పదాలతో మాత్రమే పరిచయం కలిగి, ఉద్యమంకేసి ఆకర్షితులైన యువజన సామాన్యం పైన, యీ నినాదాలు తిరుగులేని ప్రభావాన్ని కలిగించాయి.

రాజకీయ చైతన్యం సద్యోజనితత్వంచేత – వి. వి. గారి భావాలను వల్లెవేస్తూ వచ్చిన ''సోషల్ డెమోక్రట్ల'' సద్యోజనితత్వంచేత, ఒక రూబులుకు జతచేరిన ఒక కోపెక్కు ఏ సోషలిజంకన్న, లేక రాజకీయాలకన్న విలువైనదనీ, వాళ్లు ''ఏదో భవిష్యత్ తరంకోసం కాక, తమకోసమూ, తమ బిడ్డల కోసమే తాము పోరాడుతున్నామన్న'' ఎరుకతో పోరాడాలనే వాదనలతో కొట్టుకుపోయిన ఆ కార్మికుల సద్యోజనితత్వంచేత – ముంచెత్తబడింది (''రబోచయ మీస్ల్'' సంచిక 1లో సంపాదకీయం). ఇలాంటి పదబంధాలు ఎప్పుడూ కూడా పశ్చిమ యూరపియన్ బూర్జువావర్గపు అభిమానపాత్రమైన ఆయుధంగా ఉంటూ వచ్చాయి. వాళ్లు, సోషలిజంపట్ల తమకున్న ద్వేషం మూలంగా, (''సోషల్-రాజకీయవేత్త'' హిర్ష్ మాదిరిగా) ఇంగ్లీషు ట్రేడ్‌యూనియనిజాన్ని తమ దేశంలోకి దిగుమతి చేసేందుకూ, శుద్ధ ట్రేడ్‌యూనియన్ పోరాటంలో మాత్రమే నిమగ్నం కావడంద్వారా** ఏదో భవిష్యత్ సోషలిజంతో, ఏవో భావి తరాలకోసంగాక, తమ కోసమూ, తమ పిల్లలకోసమే వాళ్లు పోరాడుతారని కార్మి

---

* ''రబోచయ మీస్ల్'' మొదటి సంచికలోని అదే సంపాదకీయంనుంచి యీ ఉల్లేఖనలు తీసుకోబడ్డాయి. దీన్నిబట్టి, యీ ''రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ వి. వి. లకు'' వున్న సైద్ధాంతిక శిక్షణాస్థాయి ఏమిటో మనం తెలుసుకోవచ్చు. రాజకీయాలకూ ఆర్థిక విషయాలకూ మధ్య అటువంటి అభిప్రాయాలనే కలిగివున్నందుకుగాను, చాలా కాలం క్రితమే ''అభ్యుదయ నిరోధక చర్యల్లో అందెవేసిన చెయ్యి''గా పేరుపొందిన అసలు వి. వి. గారికి వ్యతిరేకంగా మార్క్సిస్టులు పత్రికలద్వారా, పుస్తకాలద్వారా పోరాటం జరుపుతున్న సమయంలో యీ వి. వి.లు ''ఆర్థిక భౌతికవాదపు'' మొరటు వక్రీకరణలను వల్లెవేస్తూ వచ్చారు.

** జర్మన్లు యీ సందర్భంగా ఓ ప్రత్యేకమైన పదబంధాన్ని "Nur-Gewerkschaftler" కూడా వాడేవారు. ''శుద్ధ ట్రేడ్‌యూనియన్'' పోరాట సమర్థకుడు అని దీని అర్థం.

కులకు బోధించేందుకూ ప్రయత్నించేవారు. మరి యిప్పుడు, "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు వి. వి.లు"[157] యీ బూర్జువా పదబంధాలను వల్లెవెయ్యడానికి పూనుకున్నారు. ఈ ఘట్టంలో, సమకాలిక విభేదాలను* మరింత వివరంగా విశ్లేషించుకునేందుకు మనకు ఉపయోగపడే మూడు పరిస్థితులను గుర్తుచేసుకోవడం ముఖ్యావసరం.

మొదటిది, రాజకీయ చైతన్యాన్ని సద్యోజనితత్వంతో అణచివెయ్యడం కూడా — యీ విషయాన్ని నేను పైన పేర్కొన్నాను — సద్యోజనితంగానే జరిగింది. ఇది శబ్దక్రీడలా కనిపించవచ్చు, కాని, దురదృష్టవశాత్తూ యిది కటిక సత్యం. పరస్పరం పూర్తిగా విరుద్ధమైన రెండు దృక్పథాల మధ్య బాహాటంగా జరిగిన పోరాట ఫలితంగా, ఆ పోరాటంలో ఒక పక్షం మరోదానిపైన విజయం సాధించడం ఫలితంగా యిది సంభవించలేదు. "పాత" విప్లవకారులను అంతకంతకు అధిక సంఖ్యలో పోలీసులు రాజకీయ రంగంనుంచి "పెరికేశారు," అదే సమయంలో రాజకీయ రంగంమీదకి "యువకులైన" "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు వి. వి.లు" అంతకంతకు అధిక సంఖ్యలో ప్రవేశించడం ఫలితంగానూ ఇది జరిగింది. సమకాలిక రష్యన్ ఉద్యమంలో పాల్గొన్న ప్రతివాడికీ అని నేను చెప్పనుగాని, కనీసం ఆ వాతావరణంతో పరిచయం కలిగిన ప్రతివాడికీ, జరిగినది సరిగా యిదేనన్న విషయం కచ్చితంగా తెలుసు. అయినా కూడా, సర్వజన విదితమైన యీ వాస్తవాన్ని పాఠకుడు పూర్తిగానూ స్పష్టంగానూ గ్రహించాలని నేను పట్టుపడుతున్నానన్నా, పూర్వాపరాలకోసమా అన్నట్లు "రబోచెయె దేలో" మొదటి సంచికలోని విషయాలనూ, 1897 మొదట్లో "పాతవాళ్లకీ," "యువకులకూ" మధ్య జరిగిన వివాదానికి సంబంధించిన వాస్తవాలనూ నేను ఉదహరిస్తున్నానన్నా, తమ "ప్రజాస్వామ్యాన్ని" గురించి గప్పాలు కొట్టుకొనేవాళ్లు, విస్తృత జనసామాన్యానికి (లేక మరీ యువతరం వాళ్లకి) యీ వాస్తవాలను గురించిన పరిజ్ఞానం లేకపోవడాన్ని తమ స్వప్రయోజనం కోసం వినియోగించుకోవడమే అందుకు కారణం. దీన్ని గురించి నేను తర్వాత మళ్లీ వివరిస్తాను.

రెండవది, ఆర్థికవాదుల మొట్టమొదటి లిఖిత పత్రంలోనే అతి చిత్రమైన విషయం ఒకటి మనకి కనిపిస్తుంది. ఈనాటి సోషల్ డెమోక్రట్లలో వున్న విభేదాలన్నింటినీ అర్థం

---

* కొందరు వంచనాత్మకంగా భుజాలు ఎగరేసి, "రబోచయ మీస్ల్"ని యీనాడు ఖండించడం చాలా తేలికే, కాని యిదంతా పాత చరిత్ర కాదా? అని అనవచ్చు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకొనే నేను "సమకాలిక" అన్న పదాన్ని వక్కాణిస్తున్నాను. Mutato nomine de te fabula narratur (పేరును మార్చి చదవండి, ఆ కథ మీకే వర్తిస్తుంది. — సం.) అన్నదే అటువంటి సమకాలిక వంచకులకు నా సమాధానం. "రబోచయ మీస్ల్" భావాలకు వీళ్ల పూర్తి దాసోహాన్ని తర్వాత నిరూపిస్తాను.

చేసుకోడానికి చాలా బాగా పనికొచ్చే ఆ ప్రత్యేక విషయం ఏమిటంటే: ''కేవల కార్మికోద్యమ'' అనుయాయులు, శ్రామికవర్గ పోరాటంతో అత్యంత సన్నిహితమైన ''సజీవ'' సంబంధాలను (యిది ''రబోచెయె దేలో'' వాడిన పదం) ఆరాధించేవాళ్లు, కార్మికేతర మేధావివర్గానికి (వాళ్లు సోషలిస్టు మేధావులైనా సరే) ప్రత్యర్థులు: తమ స్థానాలను కాపాడుకొనేందుకు గాను, బూర్జువా ''కేవల ట్రేడ్‌యూనియనిస్టుల'' వాదాలకు పూనుకోవలసిన స్థితిలో పడ్డారు. ఈ వాస్తవం, ఆదినుంచీ కూడా ''రబోచయ మీస్ల్'' — తనకు తెలియకుండానే — ''క్రెడో'' కార్యక్రమాన్ని అమలుజరపనారంభించిందన్న విషయాన్ని తెలియజేస్తోంది. ఇది కార్మికోద్యమపు సద్యోజనితత్వం ముందు పూర్తిగా దాసోహమైనా, ''చైతన్యపూరిత శక్తుల'' పాత్రనూ, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ పాత్రనూ కొంచెపరచడమైనా ఆ పాత్రను కొంచె పరచేవాడు అలా కావాలనుకుని చేశాడా, వద్దనుకునే చేశాడా అన్నదానితో ప్రసక్తి లేకుండా, కార్మికులపైన బూర్జువా భావజాలాన్ని బలపరచడమే అన్న విషయాన్ని తెలియజేస్తోంది (దీన్నే ''రబోచెయె దేలో'' గ్రహించలేకపోతోంది). ''భావజాలపు ప్రాముఖ్యాన్ని అతిశయింప జేసి చెప్పడం,''* చైతన్యపూరిత శక్తుల పాత్రను అతిశయింపజేసి చెప్పడం** వగైరాలను గురించి మాట్లాడేవాళ్లందరూ, కార్మికులే గనుక ''తమ భవితవ్యాన్ని నాయకుల చేతుల్లోంచి గుంజుకున్నట్లయితే,'' ''కేవల'' కార్మికోద్యమం ఒక స్వతంత్రమైన భావజాలాన్ని తనకోసం తాను రూపొందించుకోగలదనీ, రూపొందించుకొంటుందనీ ఊహించుకుంటారు. అయితే యిది తీవ్రమైన పొరపాటు. పైన చెప్పినదానికి అనుబంధంగా, ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కొత్త ముసాయిదా కార్యక్రమాన్ని గురించి కార్ల్ కౌట్స్కీ అన్న యీకింది పరమ నిజమూ, అతి ముఖ్యమూ అయిన మాటలను నేను ఉల్లేఖిస్తున్నాను.***

> ''ఆర్థికాభివృద్ధీ, వర్గపోరాటమూ సోషలిస్టు ఉత్పత్తికి పరిస్థితులను మాత్రమే కాకుండా, నేరుగా, దాని ఆవశ్యకతయొక్క చైతన్యాన్ని [కార్ల్ కౌట్స్కీ వక్కాణింపు] కూడా సృష్టిస్తాయని మార్క్స్ ఉద్ఘాటించినట్లు మన రివిజనిస్టు విమర్శకుల్లో చాలమంది విశ్వసిస్తారు. పెట్టుబడిదారీ పద్ధతిలో అత్యధికంగా అభివృద్ధిచెందిన దేశమైన ఇంగ్లండులో మిగతా ఏ దేశంలో కన్న యీ చైతన్యం బాగా తక్కువగా

---

* ''ఇస్క్రా,'' సంచిక 12లో ఆర్థికవాదుల లేఖ.

** ''రబోచెయె దేలో,'' సంచిక 10.

*** "Neue Zeit," 1901–02, XX, I, № 3, పేజి 79. కౌట్స్కీ ఉదహరిస్తున్న ఆ కమిటీ ముసాయిదా కార్యక్రమాన్ని కొద్దిగా సవరింపబడిన రూపంలో వియన్నా మహాసభ (గత సంవత్సరాంతంలో) ఆమోదించింది.[158]

వుందని యీ విమర్శకులు వక్కాణించి చెప్తూవుంటారు. ముసాయిదాను పరిశీలించినప్పుడు, పై విధంగా విమర్శింపబడిన, ఛాందసమైనదనబడే మార్క్సిస్టు దృక్పథాన్నే ఆస్ట్రియన్ కార్యక్రమాన్ని రచించిన కమిటీ సభ్యులు కూడా కలిగివున్నారని మనం అనుకోవచ్చు. ఆ ముసాయిదా కార్యక్రమంలో యిలా పేర్కొనబడింది: 'పెట్టుబడిదారీ అభివృద్ధి శ్రామికవర్గ సంఖ్యను ఎంత ఎక్కువగా పెంచుతుందో, శ్రామికవర్గం పెట్టుబడిదారీ విధానంపై అంత ఎక్కువగా పోరాడక గత్యంతరం లేని స్థితిలో పడుతుంది, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడేందుకు తగినదిగా తయారవుతుంది. శ్రామికవర్గం' సోషలిజం సాధ్యతకూ, ఆవశ్యకతకూ సంబంధించిన 'చైతన్యాన్ని పొందుతుంది.' దీన్నిబట్టి సోషలిస్టు చైతన్యం శ్రామికవర్గపు వర్గపోరాటంయొక్క ఆవశ్యకమూ, ప్రత్యక్షమూ అయిన ఫలితం అన్నట్లు కనిపిస్తుంది. అయితే యిది పూర్తిగా అవాస్తవం. ఒక సిద్ధాంతంగా సోషలిజం కూడా, శ్రామికవర్గపు వర్గపోరాటం మాదిరిగానే, ఆధునిక ఆర్థిక సంబంధాల్లోంచే పుట్టుకొచ్చే మాటా, వర్గపోరాటం మాదిరిగానే, పెట్టుబడిదారీ సమాజం సృష్టించే జనబాహుళ్యపు దారిద్ర్యదైన్యాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలోంచే ఆవిర్భవించే మాటా నిజమే. కాని సోషలిజమూ, వర్గపోరాటమూ ఒకదానితోబాటుగా యింకొకటి ఉద్భవిస్తాయేగాని, ఒకదానిలోంచి మరొకటి కాదు. దేనికదే భిన్నమైన పరిస్థితుల్లో ఉద్భవిస్తాయి. ప్రగాఢమైన శాస్త్రీయ జ్ఞానం అనే పునాదిపైన మాత్రమే ఆధునిక సోషలిస్టు చైతన్యం ఉద్భవించగలదు. నిజానికి, సోషలిస్టు ఉత్పత్తికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో ఆధునిక ఆర్థిక విజ్ఞానశాస్త్రం కూడా అంతే అవసరం; కాగా శ్రామికవర్గం, తానెంతగా కోరుకున్నప్పటికీ, యీ రెండింటిలో దేన్నీ కూడా సృష్టించలేదు. ఈ రెండూ కూడా ఆధునిక సామాజిక క్రమంలోంచే ఉద్భవిస్తాయి. విజ్ఞానశాస్త్రానికి వాహిక శ్రామికవర్గం కాదు, బూర్జువా మేధావివర్గమే [కార్ల్ కౌట్స్కీ వక్కాణింపు]: సమాజంలోని యీ విభాగానికి చెందిన విడి వ్యక్తుల మనసుల్లోనే ఆధునిక సోషలిజం ఆవిర్భవించింది, మేధాపరంగా మరింత అభివృద్ధిచెందిన శ్రామికులకు ఆధునిక సోషలిజాన్ని అందచేసినది వాళ్లే. ఈ శ్రామికులు తిరిగి తమవంతుగా, పరిస్థితులు సాధ్యం చేసిన చోట్ల, శ్రామికవర్గపు వర్గపోరాటంలో దాన్ని ప్రవేశపెడతారు. ఈవిధంగా, సోషలిస్టు చైతన్యం అన్నది, వర్గపోరాటంలోంచి సద్యోజనితంగా (urwüchsig) పుట్టుకొచ్చినదేదో కాదు, శ్రామికవర్గపు వర్గపోరాటంలోకి బయటనుంచి ప్రవేశపెట్టబడినదే (von außen Hineingetragenes). అందుకనే, తన స్థానాన్ని గురించిన చైతన్యంతోనూ, తన కర్తవ్యాన్ని గూర్చిన చైతన్యంతోనూ శ్రామికవర్గపు మనస్సును నింపడమే (అక్షరాలా: శ్రామికవర్గానికి నూరిపొయ్యడమే)

సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ కర్తవ్యం అని పాత హైన్‌ఫెల్డ్ కార్యక్రమం చాలా సరిగా చెప్పింది. ఈ చైతన్యం వర్గపోరాటంనుంచి తనంతట తాను పుట్టుకొచ్చే మాటైతే, యీ ఆదేశానికి అవసరమే వుండేదికాదు. ఈ కొత్త ముసాయిదా కార్యక్రమం పాత కార్యక్రమంనుంచి యీ ప్రతిపాదనను తీసుకొని, దీన్ని పైన పేర్కొన బడిన ప్రతిపాదనకు జోడించింది. అయితే, దీని మూలంగా ఆలోచనా సరళిలో అనుస్యూతి పూర్తిగా దెబ్బతింది...."

కార్మిక జనసామాన్యం తమ ఉద్యమ క్రమంలో స్వతంత్రమైన భావజాలాన్ని రూపొందించుకొనే ప్రసక్తే లేదు* కాబట్టి, యిక మిగిలిన ఏకైక ప్రత్యామ్నాయం – బూర్జువా భావజాలం లేక సోషలిస్టు భావజాలమే. మధ్యేమార్గం అంటూ ఏదీ లేదు (ఎందుకంటే, మానవజాతి "మూడవ" భావజాలం అంటూ దేన్నీ తయారుచెయ్యలేదు. అంతేగాక, వర్గ వైరుధ్యాలతో విశ్లథమయ్యే సమాజంలో వర్గేతర లేక వర్గాతీత భావజాలం అంటూ ఎన్నడూ వుండజాలదు). అందుచేత, సోషలిస్టు భావజాలాన్ని ఏ విధంగానైనా తక్కువ అంచనా వెయ్యడమన్నా, దాన్నుంచి ఏ కొంచెమైనా పక్కకి వైదొలగడమన్నా అర్థం బూర్జువా భావజాలాన్ని బలపరచడమే. సద్యోజనితత్వాన్ని గురించి అధికంగా వినవస్తోంది. కాని కార్మికోద్యమపు సద్యోజనిత అభివృద్ధి, అది బూర్జువా భావజాలానికి దాసోహం అనడా

* దీని అర్థం, అటువంటి భావజాలాన్ని సృష్టించడంలో కార్మికులకు పాత్ర లేదని కాదు. అయితే వాళ్ళు, భావజాలాన్ని సృష్టించడంలో కార్మికులుగా కాక సోషలిస్టు సిద్ధాంత కర్తలుగా, ప్రూడన్లుగాను, వైట్లింగులుగానూ పాల్గొంటారు. మరోలా చెప్పాలంటే, తమ యుగపు జ్ఞానాన్ని హెచ్చుతగ్గుల్లో, సంపాదించుకొని, దాన్ని అభివృద్ధి చెయ్యగలిగిన ప్పుడు, చెయ్యగలిగినంత మేరకు వాళ్ళు పాల్గొంటారు. అయితే కార్మికజనం దీనిలో మరింత తరచుగా విజయం పొందగలిగేందుకుగాను, మొత్తంగా కార్మికుల చైతన్య స్థాయిని పెంచేందుకు సకల ప్రయత్నాలూ జరగాలి. "కార్మికులకోసం సాహిత్యం"చేత కృతకంగా పరిమితం చెయ్యబడిన హద్దులకు తమను తాము పరిమితంచేసుకోకుండా, కార్మికులు సాధారణ సాహిత్యాన్ని జీర్ణంచేసుకునేందుకు అవసరమైన అధిక స్థాయి జ్ఞానాన్ని సంతరించుకోవడం అవసరం. "తమను తాము పరిమితం చేసుకోకుండా" అనడానికి బదులు "పరిమితం చెయ్యబడకుండా" అంటే మరింత సరైనదిగా ఉంటుంది. ఎందుకంటే, మేధావులకోసం రాయబడినదాన్నంతనీ చదవాలని కార్మికులు కోరుకుంటారు, చదువుతారు. కొద్దిమంది (చెడ్డ) మేధావులు మాత్రమే "కార్మికులకు" ఫ్యాక్టరీ పరిస్థితులను గురించి కొద్ది విషయాలు చెప్తే సరిపోతుందనీ, యింతకు ముందే ఎన్నడో తెలిసిన విషయాలనే పదేపదే వల్లిస్తే సరిపోతుందనీ నమ్ముతారు.

నికి దారితీస్తుంది, "క్రెడో" కార్యక్రమ పంథాలో దాని అభివృద్ధికి దారితీస్తుంది. ఎందుకంటే, సద్యోజనిత కార్మికోద్యమం అంటే ట్రేడ్‌యూనియనిజమే, Nur-Gewerkshaftlerei (కేవల ట్రేడ్‌యూనియన్ పోరాటాన్ని సమర్థించడమే). మరి, ట్రేడ్‌యూనియనిజం అంటే బూర్జువావర్గం కార్మికులను భావజాలపరంగా బానిసలను చేసుకోవడమే. అందుచేత, సద్యోజనితత్వంపై పోరాటం జరపడం, కార్మికోద్యమాన్ని బూర్జువావర్గ ఛత్రఛాయల్లోకి తీసుకురావాలన్న యీ సద్యోజనిత, ట్రేడ్‌యూనియనిస్టు ప్రయత్నాన్ని మళ్లించడం, విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ ఛత్రఛాయ కిందకి దాన్ని తీసుకురావడమే మన కర్తవ్యం, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ కర్తవ్యం. అత్యంత ఉత్తేజితులైన సిద్ధాంతవేత్తల ప్రయత్నాలు సైతం కార్మికోద్యమాన్ని భౌతిక శక్తులకూ భౌతిక పరిసరాలకూ మధ్య పరస్పర ప్రతిచర్య ద్వారా నిర్ణయింపబడిన పంథానుంచి మళ్లించడంలో విఫలమయ్యాయి అంటూ, "ఇస్క్రా" 12వ సంచికలో ప్రచురింపబడిన ఆర్థికవాద లేఖ కర్తలు వాడిన వాక్యం సోషలిజాన్ని పూర్తిగా పరిత్యజించడంతో సమానం. ఈ లేఖా కర్తలు నిర్భయంగా, సుసంగతంగా, కూలంకషంగా తాము చెప్పేదాన్ని పరిశీలించే సామర్థ్యం కలిగినవారైతే—సాహిత్య, ప్రజా కార్యకలాపాల్లో పాల్గొనే ప్రతివాడూ అలాగే వుండాలి—కార్యాచరణ రంగాన్ని, కార్మికోద్యమాన్ని "కనీస ప్రతిఘటన పంథాపై" అంటే, బూర్జువా ట్రేడ్‌యూనియనిజం పంథాపై లాక్కుపోతున్న స్త్రూవెలకూ, ప్రొకొపోవిచ్‌లకూ, లేక కార్మికోద్యమాన్ని మత, పోలీసు "భావజాలం"[159] పంథాపై లాక్కుపోయే జుబాతొవ్‌లకూ అప్పగించి "తమ పనికిమాలిన హస్తాలను తమ ఖాళీ రొమ్ములపైన మడుచుకోవడం తప్ప" వాళ్లకింకేమీ మిగలదు.

జర్మనీ ఉదాహరణను ఒకసారి మనం జ్ఞాపకంచేసుకుందాం. జర్మన్ కార్మికోద్యమానికి లాసాల్ చేసిన చరిత్రాత్మక సేవ ఏమిటి? ఆయన ఆ కార్మికోద్యమాన్ని ప్రోగ్రెసిస్టు ట్రేడ్‌యూనియన్, సహకారోద్యమాల పంథానుంచి—అది సద్యోజనితంగా (షుల్జె-డెలిష్ బాపతు వాళ్ల కృపాకటాక్షంతో కూడిన తోడ్పాటుతో) అటువైపు కదులుతోంది—మళ్లించాడు. అటువంటి కర్తవ్యాన్ని పూర్తిచెయ్యాలంటే సద్యోజనితత్వాన్ని తక్కువ అంచనా వెయ్యడాన్ని గురించీ, ఒక క్రమంగా ఎత్తుగడలను గురించీ, సామాజిక శక్తులకూ పరిసరాలకూ మధ్య పరస్పర ప్రతివర్తన వగైరాలను గురించీ మాట్లాడటం కాకుండా అందుకు పూర్తిగా భిన్నమైనదాన్ని దేన్నో చెయ్యాల్సివుంటుంది. దాన్ని సాధించడానికి సద్యోజనితత్వానికి వ్యతిరేకంగా భీకరమైన పోరాటం జరపడం అవసరమైంది, ఉదాహరణకు, అనేక సంవత్సరాల తరబడి జరిగిన అటువంటి పోరాటం తర్వాత మాత్రమే, ప్రోగ్రెసిస్టు పార్టీకి దుర్గంగా వున్న బెర్లిన్ కార్మిక జనసామాన్యాన్ని సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి అతి చక్కని దుర్గంగా మార్చడం సంభవమైంది. ఈ పోరాటం యీనాటికీ ఎంతమాత్రం

ముగియలేదు (జర్మన్ ఉద్యమ చరిత్రను గూర్చి ప్రొకోపొవిచ్ దగ్గరా, దాని తత్వశాస్త్రాన్ని గురించి స్త్రూవె దగ్గరా నేర్చుకున్న వాళ్లకు అది ముగిసిపోయినట్లు కనిపించవచ్చు). ఈనాటికీ జర్మన్ కార్మికవర్గం, ఒక విధంగా చెప్పాలంటే, అనేక భావజాలాల మధ్య చీలి పోయే వుంది, కార్మికుల్లో ఒక విభాగం కేథలిక్, రాజరికవాద ట్రేడ్‌యూనియన్లలో సంఘటితులై వున్నారు. మరో విభాగం బ్రిటిష్ ట్రేడ్‌యూనియనిజాన్ని ఆరాధించే బూర్జువాలు స్థాపించిన హిర్ష్-డుంకెర్ యూనియన్లలో[160] సంఘటితులై వున్నారు. మూడో విభాగం సోషల్ డెమొక్రటిక్ ట్రేడ్‌యూనియన్లలో సంఘటితులై వున్నారు. ఈ చివరి గ్రూపు మిగిలినవాటి కన్న బాగా సంఖ్యాధిక్యత కలిగివుంది. అయితే, యీ ఆధిక్యతను సాధించిన సోషల్ డెమొక్రటిక్ భావజాలం, యితర అన్ని భావజాలాలకూ వ్యతిరేకంగా అచంచల మైన పోరాటం జరిపినప్పుడు మాత్రమే, తన యీ ఆధిక్యతను నిలుపుకోగలుగుతుంది.

అయితే, సద్యోజనిత ఉద్యమం, కనీస ప్రతిఘటన పంథాలో ఉద్యమం, బూర్జువా భావజాలం ప్రాబల్యం వహించడానికి ఎందుకు దారితీస్తుంది? అని పాఠకుడు అడగవచ్చు. దీనికి గల సరళమైన కారణం ఏమిటంటే, బూర్జువా భావజాలం సోషలిస్టు భావజాలం కన్న బాగా ముందు ఆవిర్భవించి, దానికన్న మరింత సమగ్రంగా అభివృద్ధిచెందింది. బూర్జువా భావజాల వ్యాప్తికి లెక్కలేనన్ని ఎక్కువ సాధనాలు వున్నాయి.* ఏదైనా ఒక దేశంలో సోషలిస్టు ఉద్యమం ఎంత తరుణదశలో వుంటే, సోషలిస్టేతర భావజాలాన్ని నాటేందుకు జరిగే అన్ని ప్రయత్నాలకూ వ్యతిరేకంగా అది అంత ఎక్కువ తీవ్రంగా పోరాడాలి, "చైతన్య పూరిత శక్తులను ఎక్కువ అంచనావేసి చెప్పడానికి" వ్యతిరేకంగా గొంతుచించుకొనే చెడ్డ సలహాదార్లకు వ్యతిరేకంగా కార్మికులను అంత ఎక్కువ దృఢసంకల్పంతో హెచ్చరించాలి. ఆర్థికవాద లేఖ రచయితలు, "రబోచెయె దేలో"తో గొంతు కలిపి, ఉద్యమ శైశవావస్థకు

---

* కార్మికవర్గం సద్యోజనితంగా సోషలిజం వంక మొగ్గుతుందని తరచుగా చెప్పబడుతూ వుంటుంది. ఇది ఒక విధంగా పూర్తిగా నిజం. కార్మికవర్గపు దైన్యానికి గల కారణాలను మరే యితర సిద్ధాంతం కన్న సోషలిజం మరింత ప్రగాఢంగానూ, మరింత సరిగానూ చెబుతుంది. ఆ కారణంగానే కార్మికులు దాన్ని ఎంతో తేలికగా జీర్ణించుకోగలుగుతారు. సోషలిజం తనకు తానై సద్యోజనితత్వానికి లొంగిపోకుండా వుంటే, సద్యోజనితత్వాన్ని తానే లొంగదీసుకుని వుంటేనే అది జరుగుతుంది. ఇదేదో మామూలు విషయమేననుకుంటూ వుంటారు. కాని సరిగ్గా దీన్నే "రబోచెయె దేలో" విస్మరిస్తుంది లేక వక్రీకరిస్తుంది. కార్మికవర్గం సద్యోజనితంగా సోషలిజం వైపు మొగ్గుతుంది; అయితేనేం, అత్యంత విస్తృతంగా వ్యాపించిన (అంతేకాకుండా నిరంతరాయంగానూ, శాఖోపశాఖలుగానూ పునరుజ్జీవితమైన) బూర్జువా భావజాలం సద్యోజనితంగా తనంతటతాను కార్మికవర్గాన్ని మరింత ఎక్కువ స్థాయిలో ప్రభావితం చేస్తుంది.

విశిష్ట లక్షణమైన అసహిష్ణుతమీద దుమ్మెత్తిపోశారు. దీనికి మనం యిలా జవాబి స్తాం: ఔను, మా ఉద్యమం నిజంగానే శైశవావస్థలో వుంది. అది శీఘ్రతరంగా పెరిగేందుకు గాను, సద్యోజనితత్వానికి దాసోహం అనడంద్వారా ఉద్యమపు పెరుగుదలను కుంటుపరచే వాళ్లకు వ్యతిరేకంగా అది అసహిష్ణుతను నిండుగా అలవరచుకోవాలి. మనం, పోరా టపు నిర్ణయాత్మక దశల అనుభవాన్ని ఎన్నడో పొందిన "ఆరితేరినవాళ్లం" అన్నట్లు నటిం చడం కన్న ఎక్కువ హాస్యాస్పదమూ, హానిదాయకమూ అయినది మరొకటుండదు.

మూడవది, "రబోచయ మీస్ల్" మొదటి సంచిక "ఆర్థికవాదం" అన్న పదం (మనం దీన్ని విసర్జించాలని అనుకోవడం లేదు, ఎందుకంటే, ఏదో విధంగా యిప్పటికే అది స్థిరపడిపోయింది) యీ కొత్త ధోరణి నిజస్వభావాన్ని తగినంతగా ప్రస్ఫుటం చెయ్య డంలేదని నిరూపించింది. "రబోచయ మీస్ల్" రాజకీయ పోరాటాన్ని బొత్తిగా నిరాకరించదు. దాని మొదటి సంచికలో ప్రచురింపబడిన కార్మికుల పరస్పర సహాయ నిధి నిబంధనల్లో ప్రభుత్వంపై పోరాటం జరపడం ప్రస్తావన కూడా వుంది. అయితే, "రబోచయ మీస్ల్" "రాజకీయాలు ఎప్పుడూ ఆర్థిక విషయాలకు లొంగి, వాటిని అనుసరించి వుంటాయి" అని నమ్ముతుంది ("రబోచెయె దేలొ" యీ ప్రధానాంశాన్ని మార్చి, తన కార్యక్రమంలో యిలా అంటుంది: "మరే యితర దేశంలో కన్న రష్యాలో, ఆర్థిక పోరాటం రాజకీయ పోరాటం నుండి వేరుచెయ్యరానిదిగా వుంది"). రాజకీయాలు అన్నప్పుడు సోషల్ డెమొక్రటిక్ రాజకీయాలు అని అర్థమైతే, అప్పుడు "రబోచయ మీస్ల్" "రబోచెయె దేలొ"ల సూత్రీ కరణలు పూర్తిగా తప్పు. కార్మికుల ఆర్థిక పోరాటం చాలా తరచుగా, బూర్జువా రాజకీ యాలు, మతరాజకీయాలు వగైరాలతో ముడిపెట్టబడుతూ వుంటుంది (విడదీయరానిదిగా కాకపోయినా). ఈ విషయాన్ని యింతకు ముందే మనం చూశాం. రాజకీయాలంటే ట్రేడ్ యూనియన్ రాజకీయాలనే అర్థమైతే, అంటే, తమ పరిస్థితి ఉత్పన్నంచేసిన దారిద్ర్య బాధను ఉపశమింపజేసే — అవి ఉపశమింపజేస్తాయేగాని, ఆ పరిస్థితిని రద్దుచెయ్యవు, అంటే అవి పెట్టుబడికి శ్రమ లొంగుబాటును తొలగించవు — చర్యలను ప్రభుత్వంనుండి రాబ ట్టుకొనేందుకుగాను కార్మికులందరి ఉమ్మడి కృషే అయినట్లయితే, "రబోచెయె దేలొ" ప్రతిపాదనలు సరైనవే. సోషలిజానికి వ్యతిరేకులైన ఇంగ్లీషు ట్రేడ్ యూనియనిస్టులకీ, కేథలిక్ కార్మికులకీ, "జుబాతొవ్" కార్మికులు వగైరాలకీ ఆ కృషి ఉమ్మడి అయినదే. అందుకని రాజకీయాల్లో ఎన్నైనా రకాలున్నాయి. ఈవిధంగా, "రబోచయ మీస్ల్" సద్యో జనితత్వానికీ, చైతన్యరాహిత్యానికీ ఒక వంక తలొగ్గుతూనే, మరోవంక రాజకీయ పోరాటాన్ని అంతగా వ్యతిరేకించదు. కార్మికోద్యమంనుంచే సద్యోజనితంగా ఉత్పన్నమయే రాజకీయ పోరా టాన్ని (రాజకీయ వాంఛలూ, కార్మికుల డిమాండ్లూ అని చెప్తే మరింత బాగుంటుంది) పూర్తిగా గుర్తిస్తూనే, సోషలిజంయొక్క సాధారణ కర్తవ్యాలకూ, రష్యాలోని సమకాలీన

పరిస్థితులకూ అనుగుణమైన నిర్దిష్టమైన సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలను స్వతంత్రంగా రూపొందించేందుకు అది ససేమిరా నిరాకరిస్తుంది. ''రబోచెయె దేలో'' కూడ యిదే పొరపాటు చేస్తోందన్న విషయాన్ని తర్వాత వివరిస్తాను.

## ఇ) ''స్వయం విమోచన గ్రూపు,''[161] ''రబోచెయె దేలో''

''రబోచయ మీస్ల్'' మొదటి సంచికయొక్క ప్రసిద్ధం కాని, యిప్పుడు దాదాపు పూర్తిగా విస్మరింపబడిన సంపాదకీయాన్ని గురించి యింత సుదీర్ఘంగా చర్చించడానికి, తర్వాత శాఖోపశాఖలుగా వెలుగులోకి వచ్చిన ఆ సాధారణ భావవాహినిని అది మొట్టమొదటి సారిగా, ప్రస్ఫుటంగా వ్యక్తీకరించడమే కారణం. వి. ఐ. ''రబోచయ మీస్ల్'' యొక్క ఆ మొదటి సంచికనూ, సంపాదకీయాన్నీ ప్రశంసిస్తూ, ఆ సంపాదకీయం ''సునిశితమూ, సముత్సాహపూరితమూ'' అయిన పద్ధతిలో రచించబడిందని పొగడ్డం పూర్తిగా ఒప్పే (''లిస్తోక్ 'రబోత్నిక,' '' 9–10 సంచిక, పేజి 49). దృఢవిశ్వాసాలు కలిగి, తానేదో కొత్త విషయాన్ని లోకానికి చెప్తున్నానని అనుకొనే వాడెవడైనా ''సముత్సాహంగానూ,'' తన అభిప్రాయాలు ప్రస్ఫుటంగా కనిపించేట్టుగానే రాస్తాడు. రెండు పడవల్లో కాళ్ళు పెట్టడానికి అలవాటుపడినవాళ్లలోనే యీ ''ఉత్సాహం'' లోపిస్తుంది. అటువంటివాళ్ళు మాత్రమే ''రబోచయ మీస్ల్'' ఉత్సాహాన్ని ఒక రోజున ప్రశంసించి, దాని ప్రత్యర్థుల ''ఉత్సాహపూరిత వాదోపవాదాన్ని'' మరో రోజున ఖండించగలుగుతారు.

''రబోచయ మీస్ల్''కి ప్రత్యేకానుబంధం గురించి నేనిక్కడ ప్రస్తావించను (ఆర్థిక వాదుల భావాలను ఏ యితర రచనల కన్న ఎక్కువ సుసంగతంగా వ్యక్తంచేసిన యీ రచన గురించి ముందుముందు వేర్వేరు అంశాలపై చర్చించినప్పుడు ప్రస్తావిస్తాను). కాని ''కార్మికుల స్వయం విమోచన గ్రూపు విజ్ఞప్తి''ని (1899 మార్చి, లండన్ ''నకనూనె,''[162] సంచిక 7లో, 1899 జూలైలో పునర్ముద్రింపబడింది) గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తాను. ఆ ''విజ్ఞప్తి'' రచయితలు ''రష్యాదేశ కార్మికులు యిప్పుడిప్పుడే మేల్కొంటున్నారు, చుట్టూ పొరజూడనారంభిస్తున్నారు, ముందుగా అందుబాటులోకి వచ్చే పోరాట సాధనాలని ఆంతరిక ప్రేరణతో అందుకొంటున్నారు'' అని సరిగానే చెప్పారు. అయితేనేం, దీన్నుంచి ''రబోచయ మీస్ల్'' లాగిన తప్పుడు నిర్ధారణనే వాళ్ళూ లాగారు, ఆంతరిక ప్రేరణ అన్నది చైతన్యరాహిత్యమనీ, (సద్యోజనితత్వమనీ), దానికి సాయపడేందుకు సోషలిస్టులు ముందుకు రావాలనే విషయాన్నీ, ''మొదట అందుబాటులోకి వచ్చే పోరాట సాధనాలు'' అన్నవి ఎప్పుడూ కూడా, ఆధునిక సమాజంలో, ట్రేడ్‌యూనియన్ పోరాట సాధనాలే అయివుంటాయన్న

విషయాన్నీ, ''అందుబాటులోకి వచ్చే'' భావజాలం బూర్జువా (ట్రేడ్‌యూనియన్) భావజాలమే అన్న విషయాన్నీ వాళ్లు మరచిపోతున్నారు. అదేవిధంగా, యీ రచయితలు ''రాజకీయాలను నిరాకరించరు. వాళ్లు కేవలం (కేవలం!), రాజకీయాలు ఉపరినిర్మాణం, కనుక, ''ఆర్థిక పోరాటానికి అనుకూలంగా సాగింపబడే ఆందోళనకు రాజకీయాందోళన ఉపరినిర్మాణంగా వుండాలి, అది యీ పోరాట ప్రాతిపదికపైన తలెత్తి, దాని అడుగుజాడలను అనుసరించాలి'' అన్న వి. వి. గారి మాటలను వల్లిస్తున్నారు.

''రబోచెయె దేలో''కు సంబంధించినంతవరకు, అది తన కార్యకలాపాలను ఆర్థికవాదులను సమర్థించడంతో మొదలుపెట్టింది. తన ప్రసిద్ధమైన పుస్తకంలో* ఆర్థికవాదులను అతను హెచ్చరించినప్పుడు ''ఏ యువ కామ్రేడ్లను అక్సెల్‌రోడ్ ప్రస్తావించాడో తెలియదు'' అని పేర్కోవడం ద్వారా తన ప్రారంభ సంచికలోనే (సంచిక 1, పేజీలు 141–42) అది పచ్చి అబద్ధాన్ని రాసింది. ఈ అబద్ధంపైన అక్సెల్‌రోడ్, ప్లెహానొవ్‌లతో చెలరేగిన వాదవివాదాల్లో, ''విభ్రాంతిచెంది, విదేశాల్లో వున్న యువ సోషల్ డెమోక్రట్లందరినీ యీ అన్యాయపు ఆరోపణనుంచి కాపాడేందుకు నేను ప్రయత్నించాను'' (అక్సెల్‌రోడ్ ఆర్థికవాదులను సంకుచిత మనస్కులని ఆరోపించాడు) అని ''రబోచెయె దేలో'' ఆమోదించాల్సివచ్చింది.[163] నిజానికి యీ ఆరోపణ పూర్తిగా సహేతుకమైనది, మిగతావాళ్లతో బాటు, తన సంపాదకవర్గ సభ్యుడైన వి. ఐ. కి కూడా అది వర్తిస్తుందన్న విషయం ''రబోచెయె దేలో''కు పూర్తిగా తెలుసు. ''రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు'' అన్న నా పుస్తకాన్ని గురించిన వ్యాఖ్యానాల్లో, అక్సెల్‌రోడ్ వ్యాఖ్యానం పూర్తిగా సరిఅయింది, ''రబోచెయె దేలో'' వ్యాఖ్యానం పూర్తిగా తప్పు అన్న విషయాన్ని సందర్భవశాత్తూ చెప్పదలుచుకున్నాను. ఆ పుస్తకాన్ని 1897లో, ''రబోచయ మీస్ల్'' వెలువడక ముందు, రాశాను. అప్పట్లో నేను, సెంట్ పీటర్స్‌బుర్గ్ ''పోరాట సమితి'' పూర్వ ధోరణి – దీన్ని నేను పైన వివరించాను – ప్రబలంగా ఉందని సరిగానే భావించాను. ఈ ధోరణి కనీసం 1898 మధ్య దాకా ప్రబలంగా వుంది. ఆ కారణంగా, ఆర్థికవాదమూ, దాని ప్రమాదమూ లేవని చేప్పే తన ప్రయత్నంలో, 1897–98 సంవత్సరాల్లో సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ఆర్థికవాద అభిప్రాయాలచేత వెలిగక్కించబడ్డ అభిప్రాయాలను వ్యక్తంచేసిన చిన్న పుస్తకాన్ని పేర్కొనే హక్కు ''రబోచెయె దేలో''కి ఎంత మాత్రం లేదు.**

---

* ''రష్యన్ సోషల్ డెమోక్రసీయొక్క ప్రస్తుత కర్తవ్యాలు, యెత్తుగడలు,'' జెనీవా, 1898. 1897లో ''రబోచయ గజేత''కు రాయబడిన రెండు లేఖలు.

** తన మొదటి అబద్ధాన్ని (''అక్సెల్‌రోడ్ ఏ యువ కామ్రేడ్లను గురించి ప్రస్తావించాడో మాకు తెలియదు'') సమర్థించుకునే ప్రయత్నంలో, ''రబోచెయె దేలో'' తన

అయితే, ''రబోచెయె దేలొ'' ఆర్థికవాదులను సమర్థించడమే కాకుండా, తన మటుకు తాను కూడా ఎడతెగకుండా వాళ్ల ప్రాథమిక పొరపాట్లలోనే పడుతూ వచ్చింది. ఈ గంద రగోళాని కంతటికీ ''రబోచెయె దేలొ'' కార్యక్రమంలోని యీ కింది సూత్రీకరణకి యివ్వ బడిన వ్యాఖ్యానంలోని సందిగ్ధతే మూల కారణం: ''రష్యన్ జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన విషయం, ప్రధానంగా కర్తవ్యాలనూ [వక్కాణింపు నాది], 'సమితి' ప్రచురణ కార్యక్రమ స్వభావాన్నీ నిర్ణయించేది యిటీవలి సంవత్సరాల్లో తలెత్తిన విస్తృతమైన కార్మికోద్యమమే'' (''రబోచెయె దేలొ'' వక్కాణింపు). విస్తృతమైన ఉద్యమం అతి ముఖ్యమైన విషయం అన్న వాస్తవం నిర్వివాదమైనదే. కాని, విస్తృత కార్మికోద్యమం ''కర్తవ్యాలను నిర్ణయిస్తుంది'' అన్న వాక్యాన్ని ఎవరైనా అర్థంచేసుకోవడం ఎలాగన్నదే కీలకాంశం. ఎవరైనా దీన్ని రెండు విధాలుగా అర్థంచేసుకోవచ్చు: సద్యోజనిత ఉద్య మానికి దాసోహం అనడం, అంటే, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ పాత్రను కేవలం కార్మి కోద్యమంగా కార్మికోద్యమానికి తైనాతీగా తయారుచెయ్యడం అయినా కావాలి (''రబోచయ మీస్ల్,'' ''స్వయం విమోచన గ్రూపు,'' తదితర ఆర్థికవాదుల భాష్యం యిదే), లేదా ఆ విస్తృత ఉద్యమం కొత్త సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర కర్తవ్యాలను మన ముందు పెడుతుంది. అయితే, యీ కర్తవ్యాలు విస్తృతోద్యమం ఉధృతస్థాయిని అందుకోడానికి ముందు మనకి తృప్తికలిగించినవాటికన్న చాలా సంక్లిష్టంగా వుంటాయి. ''రబోచెయె దేలొ'' మొదటి భాష్యం వైపే మొగ్గింది, యిప్పటికీ మొగ్గుతోంది. ఎందుకంటే, ఏ

---

''సమాధానం''లో యిలా రాయడం ద్వారా రెండో అబద్ధాన్ని జోడించింది: '' 'కర్తవ్యాలు'పై సమీక్ష ప్రచురింపబడిన దరిమిలా, ఆర్థిక పాక్షికత్వం పట్ల రెండు ధోరణులు తలెత్తాయి, లేక కొద్ది గొప్పల్లో నిర్దిష్టంగా రూపుదాల్చాయి. 'కర్తవ్యాలు' '' (పేజి 9)లో ''మన ఉద్యమ పరిస్థితిని గురించి వర్ణింపబడినదానితో పోలిస్తే యివి ఒక వెనుకడుగునే సూచిస్తు న్నాయి.'' 1900లో ప్రచురింపబడిన ''సమాధానం''లో వున్నది యిదీ. కాని ''రబో చెయె దేలొ'' మొదటి సంచిక (దీనిలోనే సమీక్ష వెలువడింది) 1899 ఏప్రిల్లో వెలు వడింది. ఆర్థికవాదం నిజంగా 1899లో మాత్రమే తలెత్తిందా? లేదు. 1899లో జరిగిందేమిటంటే, ఆర్థికవాదానికి వ్యతిరేకంగా రష్యన్ సోషల్ డెమోక్రట్ల మొదటి నిరసన (''క్రెడో''కి వ్యతిరేకంగా నిరసన) వెలువడింది. ఆర్థికవాదమే 1897లో తలె త్తింది. ఈ విషయం ''రబోచెయె దేలొ''కి చాలా బాగా తెలుసు. ఎందుకంటే, 1898 నవంబరులోనే వి. ఐ. ''రబోచయ మీస్ల్''ను పొగుడుతున్నాడు (''లిస్తోక్ 'రబోత్నిక,' '' సంచిక 9–10ని చూడండి).

కొత్త కర్తవ్యాలను గురించీ అది నిర్దిష్టంగా చెప్పలేదు గాని, అది మనముందు పెట్టే కర్తవ్యాన్ని స్పష్టంగా అర్థంచేసుకొని, నిర్వర్తించవలసిన అవసరాన్నుంచి ఆ "విస్తృత ఉద్యమం" మనల్ని విముక్తం చేస్తుందన్నట్లు ఎడతెగకుండా వాదించింది. నిరంకుశ రాజరికాన్ని కూలదొయ్యడాన్ని విస్తృత కార్మికోద్యమానికి ప్రథమ కర్తవ్యంగా పెట్టడం అసాధ్యమన్నట్లు "రబోచెయె దేలొ" పరిగణించి, యీ కర్తవ్యాన్ని (విస్తృత కార్మికోద్యమం పేర) అది, తక్షణ రాజకీయ డిమాండ్లకోసం చేసే పోరాటంకన్న తక్కువగా అంచనా వేసింది ("సమాధానం," పేజి 25).

"రబోచెయె దేలొ" సంపాదకుడు బి. క్రిచేవ్‌స్కీ "రష్యన్ ఉద్యమంలో ఆర్థిక, రాజకీయ పోరాటం" అనే శీర్షికతో రాసిన వ్యాసం ఆ పత్రిక 7వ సంచికలో ప్రచురింపబడింది. ఆ వ్యాసంలో సరిగా యివే పొరపాట్లు* పునరుక్తం చెయ్యబడ్డాయి. ఈ వ్యాసం

---

* రాజకీయ పోరాటంలో "దశల సిద్ధాంతం" లేక "పిరికి మెలికల" సిద్ధాంతం, ఉదాహరణకు, యీ వ్యాసంలో యీ కింది విధంగా వ్యక్తంచెయ్యబడింది: "రాజకీయ డిమాండ్లు, తమ స్వభావ రీత్యా యావత్తు రష్యాకూ సామాన్యమైనవే. అయితే యివి, మొట్టమొదట [యిది 1900 ఆగస్టులో రాయబడింది!] ఆర్థికపోరాటంలో కార్మికుల ఒకానొక నిర్దిష్ట శ్రేణి [sic!] సాధించిన అనుభవానికి అనుగుణంగా ఉండాలి. ఈ అనుభవ ప్రాతిపదికపైన మాత్రమే [!] రాజకీయ ఆందోళనను చేబట్టడం సాధ్యం, చేబట్టాలి" వగైరా. (పేజి 11). 4వ పేజిలో, రచయిత, ఆర్థిక వితండవాదమనే పూర్తి నిరాధార ఆరోపణగా తాను పరిగణించేదానికి వ్యతిరేకంగా అభ్యంతరం తెలుపుతూ బేలగా యిలా అంటాడు: "మార్క్స్ ఎంగెల్సుల సిద్ధాంతం ప్రకారం కొన్ని వర్గాల ఆర్థిక ప్రయోజనాలు చరిత్రలో నిర్ణయాత్మకమైన పాత్రను వహిస్తాయన్న విషయమూ, అందువల్ల, తన ఆర్థిక ప్రయోజనాలకోసం శ్రామికవర్గం జరిపే పోరాటమే దాని వర్గాభివృద్ధిలోనూ, విమోచనకోసం జరిగే పోరాటంలోనూ అత్యధిక ప్రాముఖ్యం కలిగినదన్న విషయమూ ఏ సోషల్ డెమోక్రట్‌కి తెలియదు?" [వక్కాణింపు నాది.] ఈ "అందువల్ల" అన్న మాట పూర్తిగా అసందర్భమైనది. ఆర్థిక ప్రయోజనాలు నిర్ణయాత్మకమైన పాత్ర వహిస్తాయన్న వాస్తవానికి ఆర్థిక (అంటే, ట్రేడ్‌యూనియన్) పోరాటం ప్రధాన ప్రాముఖ్యం కలిగినది అని ఎంతమాత్రమూ అర్థం కాదు. ఎందుకంటే, వర్గాల అతి ముఖ్యమూ, "నిర్ణయాత్మకమూ" అయిన ప్రయోజనాలను మొత్తంమీద తీవ్రమైన రాజకీయ మార్పుల ద్వారా మాత్రమే తీర్చడం సాధ్యం. ప్రత్యేకించి శ్రామికవర్గపు మౌలిక ఆర్థిక ప్రయోజనం, బూర్జువావర్గ నియంతృత్వ స్థానంలో శ్రామికవర్గ నియంతృత్వాన్ని ప్రవేశపెట్టే రాజకీయ

సంగతి విడిచిపెట్టి, నేరుగా ''రబోచెయె దేలో'' 10వ సంచిక విషయానికి వస్తాను. ''జర్యా,'' ''ఇస్క్రా''లకు వ్యతిరేకంగా క్రిచేవ్‌స్కీ, మర్తీనావ్‌లు చేసిన వివిధ విమర్శలకు నేనిప్పుడు విపులంగా జవాబు చెప్పదలుచుకోలేదు. ''రబోచెయె దేలో'' తన 10వ సంచికలో ఏ సూత్రాల ప్రాతిపదికపైన తన వైఖరిని తీసుకుందో దాన్ని మాత్రమే నేనిక్కడ పరిశీలించదలుచుకున్నాను. ఉదాహరణకు, ''రబోచెయె దేలో''కు

> ''సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం తన చేతులు కట్టేసుకోదు, ముందే వేసుకున్న ఏ ఒక ప్లానుకో లేక రాజకీయ పోరాట పద్ధతికో అది తనను తాను పరిమితం చేసుకోదు. పార్టీ అధీనంలో వున్న శక్తులకు సరిపడ్డ మేరకు అన్ని పోరాట సాధనాలనూ అది గుర్తిస్తుంది'' వగైరా (''ఇస్క్రా,'' సంచిక 1.) అనే సూత్రీకరణకూ

> ''అన్ని పరిస్థితుల్లోనూ, అన్ని సమయాల్లోనూ రాజకీయ పోరాటాన్ని నిర్వహించగల నేర్పు గల గట్టి సంఘం లేకపోతే, క్రమబద్ధమైన కార్యాచరణ పథకం అంటూ ఒకటి వుండే సమస్యే లేదు; సుదృఢమైన సూత్రాలచేత ఉద్దీప్తం చెయ్యబడి, పట్టుదలగా నిర్వహింపబడే ఆ కార్యాచరణ పథకం ఒక్కటే ఎత్తుగడలు అన్న పేరుకి తగినది'' (''ఇస్క్రా,'' సంచిక 4) అనే సూత్రీకరణకూ

మధ్య ''పూర్తి భిన్నత్వం'' కనిపించిందన్న వింత వాస్తవాన్ని నేనిక్కడ పరిశీలించను.

మనం ఎత్తుగడలకి సంబంధించి మాట్లాడాలంటే, సూత్రరీత్యా అన్ని పోరాట సాధనాలనీ, కార్యసాధకమైనవైతే అన్ని ప్లానుల్నీ, పద్ధతులనీ, గుర్తించడం అనేది ఒకానొక నిర్దిష్ట రాజకీయ క్షణంలో కచ్చితంగా పాటింపబడే ప్లానుచేత నడిపింపబడాలన్న డిమాండుతో కలగాపులగం చెయ్యడం ఎలాంటిదంటే, వ్యాధులకు వివిధ రకాల చికిత్సా పద్ధతులను వైద్య విజ్ఞానశాస్త్రం గుర్తించడాన్ని ఒక ప్రత్యేక వ్యాధికి ఒక నిర్దిష్టమైన చికిత్సా పద్ధతినే అవలంబించవలసిన ఆవశ్యకతతో కలగాపులగం చెయ్యడం వంటిదే అవుతుంది.

---

విప్లవం ద్వారా మాత్రమే తీరగలదు. క్రిచేవ్‌స్కీ ''రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు వి. వి.ల'' వాదనలను (అంటే, రాజకీయాలు ఆర్థిక విషయాలను అనుసరించి వుంటాయి మొదలైనవి), జర్మన్ డెమోక్రటిక్ ఉద్యమానికి చెందిన బెర్న్‌స్టైనియన్ల వాదనలనూ (ఉదాహరణకు, యిటువంటి వాదనల ద్వారానే వోల్ట్‌మన్, రాజకీయ విప్లవాన్ని గురించి ఆలోచించగలిగేందుకు ముందు కార్మికులు మొట్టమొదట ''ఆర్థిక శక్తి''ని సంపాదించుకోవాలని రుజువుచేసేందుకు ప్రయత్నించాడు) పునరుక్తంచేస్తాడు.

అయితే, అసలు విషయం ఏమిటంటే, సద్యోజనితత్వానికి దాసోహమనే వ్యాధిచేత స్వయంగా పీడింపబడుతున్న ''రబోచెయె దేలొ'' ఆ వ్యాధికి ఏ ''చికిత్సా పద్ధతినీ'' గుర్తించ నిరాకరిస్తోంది. అందుకనే అది, ''ఎత్తుగడలకు సంబంధించిన ఒక ప్లాను వేసుకోవడం అనేది మార్క్సిజం మూలసూత్రాలకే విరుద్ధం'' (సంచిక 10, పేజి 18) అంటూనూ, ఎత్తుగడలు అనేవి ''పార్టీ కర్తవ్యాల పెరుగుదల క్రమం, అవి పార్టీతోబాటుగా పెరుగుతాయి'' అంటూనూ ఓ గొప్ప విషయాన్ని కనిపెట్టింది (పేజి 11, ''రబోచెయె దేలొ'' వక్కాణింపు). ఈ వ్యాఖ్యకు ఒక ప్రసిద్ధ సూక్తి, ''రబోచెయె దేలొ'' ''ధోరణి''కి ఒక శాశ్వత స్మారక చిహ్నమూ అయ్యే అన్ని అవకాశాలూ వున్నాయి. ''ఎటు వెళ్లాలి?'' అన్న ప్రశ్నకు ఆ ప్రముఖ పత్రిక యిలా జవాబిస్తుంది: ఆరంభ బిందువుకీ, తదుపరి వాటికీ మధ్య దూరాన్ని మార్చే క్రమమే గమనం. జ్ఞాన ప్రగాఢత్వానికి సాటిలేని యీ వ్యాఖ్య కేవలం ఒక వింత విషయమే కాదు (అదే అయివుంటే, దాన్ని గురించి దీర్ఘంగా మాట్లాడవలసిన అవసరం ఉండి వుండేది కాదు), సరికదా ఓ మొత్తం ధోరణి కార్యక్రమం సరిగా ఆ కార్యక్రమాన్నే ఆర్. ఎమ్. (''రబోచయ మీస్ల్''కి ప్రత్యేక అనుబంధంలో) యీ కింది మాటల్లో వ్యక్తంచేశాడు: ఏ పోరాటమైతే సాధ్యమో ఆ పోరాటం వాంఛనీయం, కాగా ప్రస్తుతం జరుగుతున్నదే సాధ్యమైన పోరాటం. ఇది కచ్చితంగా అంతులేని అవకాశవాదం, యిది క్రియారహితంగా తనను తాను సద్యోజనితత్వానికి అనుకూలంగా మలుచుకొంటుంది.

''ప్లాను ప్రకారం ఎత్తుగడలు మార్క్సిజం సారాంశానికి విరుద్ధం!'' యిది మార్క్సిజంమీద అపనింద, దీని అర్థమేమిటంటే, మనకి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో నరోద్నిక్కులు మార్క్సిజాన్ని వికృతం చేసినట్టే వుంది యిది. దీని అర్థం యేమిటంటే, వర్గ చైతన్యం కలిగిన యోధుల చొరవనూ, శక్తినీ కించపరడం. కాగా మార్క్సిజం తద్వ్యతిరేకంగా, సోషల్ డెమొక్రట్ల చొరవకీ, శక్తికీ బ్రహ్మాండమైన ప్రేరణనిచ్చి, వాళ్ల ముందు అత్యంత విస్తృతమైన వుంతలను తెరుస్తుంది, (మరోలా చెప్పుకోవాలనుకుంటే) ''సద్యోజనితంగా'' పోరాటానికి విజృంభించే లక్షలాది కార్మికుల మహత్తర శక్తిని సోషల్ డెమొక్రట్ల అందుబాటులోకి తెస్తుంది. అంతర్జాతీయ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమ చరిత్ర నంతటీ చూస్తే, ఒకప్పుడు ఒకరు, మరొకప్పుడు మరొకరుగా రాజకీయ నాయకులు ఎన్నెన్నో ప్లానులు వేసిన ఉదాహరణలు కొల్లలుగా మనకి కనిపిస్తాయి. కొన్ని ప్లానులు తమ కర్తల దూరదృష్టినీ, సరైన రాజకీయ, నిర్మాణపర అభిప్రాయాలనూ నిరూపించగా, మరికొన్ని ప్లానులు తమ కర్తల హ్రస్వదృష్టినీ, వారి రాజకీయ పొరపాట్లనూ నిరూపించాయి. జర్మనీ తన చరిత్రలోని కీలకమైన ఒక మలుపులో వున్నప్పుడు—సామ్రాజ్య స్థాపన, రైహ్‌స్టాగ్ ప్రారంభం, సార్వజనిక ఓటింగు హక్కు మంజూరు—సోషల్ డెమొక్రటిక్

రాజకీయాలకీ, మొత్తం కార్యకలాపాలకీ లీబ్క్నెఖ్ట్ ఒక ప్లాను సూచించగా, ష్వేయ్‌త్సెర్ మరో ప్లాను సూచించాడు. సోషలిస్టు వ్యతిరేక చట్టం జర్మన్ సోషలిస్టుల నెత్తిమీద విరుచుకు పడ్డప్పుడు, మోస్ట్, హాస్సెల్‌మన్‌లు ఒక ప్లాను సూచించగా — (వాళ్లు తక్షణం హింసా దౌర్జన్యాలకు పిలుపిచ్చేందుకు సిద్ధపడ్డారు), హోఖ్‌బెర్గ్, ష్రామ్‌లూ, (కొంత మేరకు) బెర్న్‌స్టైనూ మరో ప్లాను సూచించారు — సరసంగా కాకుండా ద్వేషంతోనూ, విప్లవాత్మకంగానూ ప్రవర్తించడంద్వారా మీ అంతట మీరే యీ చట్టం జారీకావడానికి కారణభూతులయారు, కాగా మీరిప్పుడు ఆదర్శవంతంగా ప్రవర్తించి, క్షమాభిక్షను సంపాదించుకోవాలి, అంటూ వాళ్లు సోషల్ డెమోక్రట్లకు బోధించడం మొదలుపెట్టారు. ఇవి రెండూ కాక, ఒక రహస్య పత్రిక ప్రచురణకు సన్నాహాలు చేసి, ప్రచురణను సాగించిన వాళ్లు ప్రతిపాదించిన మూడో ప్లానొకటి వుంది.[164] ఈ మూడింటిలో ఏ మార్గం సెరైనదో తేల్చుకునేందుకు ఘర్షణ జరిగిన చాలా సంవత్సరాల తర్వాత, ఎంచుకోబడిన పంథా కార్యసాధకతను చరిత్ర రుజువుచేసిన తర్వాత, వెనక విషయాలను సింహావలోకనం చేసుకొని, పార్టీతోబాటు పెరిగే పార్టీ కర్తవ్యాల పెరుగుదలను గురించి గంభీరమైన సూక్తులను వల్లించడం తేలికే. అయితే గందరగోళ తరుణంలో,* రష్యన్ ''విమర్శకులూ'' ఆర్థికవాదులూ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని ట్రేడ్‌యూనియనిజం స్థాయికి దిగజారుస్తున్న తరుణంలో, టెరరిస్టులు పాత పొరపాట్లను పునరుక్తంచేసే ''ప్లాను ప్రకారం ఎత్తుగడల''ను గట్టిగా ప్రతిపాదిస్తున్న తరుణంలో, అటువంటి కాలంలో, యీ మాదిరి జ్ఞాన పారమ్య ప్రదర్శకమైన గంభీర సూక్తుల వల్లింపుకి పరిమితం కావడమంటే తమకు తాము ''దారిద్ర్య యోగ్యతా పత్రాన్ని'' యిచ్చుకోవడం మాత్రమే. పలువురు రష్యన్ సోషల్ డెమోక్రట్లకు చొరవ, శక్తులు కొరవడిన సమయంలో, ''రాజకీయ ప్రచార, ఆందోళన, నిర్మాణాల విస్తృతి''** తగినంతగా లేనప్పుడు, విప్లవ కార్యకలాపాల విస్తృత నిర్మాణానికి సంబంధించిన ''ప్లానులు'' కొరవడినప్పుడు, అలాంటి సమయంలో, ''ప్లాను ప్రకారం ఎత్తుగడలు మార్క్సిజం సారాంశానికి విరుద్ధం'' అని ప్రకటించడమంటే అర్థం, సైద్ధాం

---

* "Ein Jahr der Verwirrung" (''గందరగోళపు సంవత్సరం'') అన్నది తన ''జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్ర''లోని ఒక ప్రకరణానికి మేరింగ్ యిచ్చిన శీర్షిక. దానిలో ఆయన, కొత్త పరిస్థితికి అనుగుణంగా ''ప్లాను ప్రకారం ఎత్తుగడలను'' ఎంచుకోవడంలో సోషలిస్టులు మొదట్లో ప్రదర్శించిన సంశయాత్మకతనూ, కృతనిశ్చయ లోపాన్నీ వర్ణించాడు.

** ''ఇస్క్రా'' సంచిక 1లో సంపాదకీయం.

తికంగా మార్క్సిజాన్ని అపభ్రంశం చెయ్యడమే కాకండా, ఆచరణలో పార్టీని వెనక్కి లాగడమే తప్ప వేరు కాదు.

''రబోచెయె దేలో'' తన ధర్మ పన్నాలను యిలా కొనసాగిస్తుంది:

''వస్తుపరమైన అభివృద్ధిని తన చైతన్యపూరిత కార్యకలాపాలతో త్వరితమొన ర్చడమే విప్లవ సోషల్ డెమోక్రట్ కర్తవ్యం గాని, దాన్ని పరిహరించడమూ, లేక యీ అభివృద్ధి కోసం తన స్వీయాత్మక పథకాలను ప్రవేశపెట్టడమూ కాదు. 'ఇస్క్రా'కు సైద్ధాంతికంగా యిదంతా తెలుసు. కాని, మార్క్సిజం సముచితంగానే యే చైతన్యపూరిత విప్లవ కృషికైతే బృహత్తర ప్రాముఖ్యాన్ని ఆపాదిస్తుందో ఆ కృషి ఆచరణలో 'ఇస్క్రా'ను, ఎత్తుగడలకు సంబంధించిన దాని జడ దృష్టి మూలంగా, అభివృద్ధియొక్క వస్తుపరమూ లేక సద్యోజనితమూ అయిన శక్తుల ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనా వేసేటట్టు చేస్తోంది. (పేజి 18.)

వి. వి. గారికీ, ఆయన బృందానికీ తగి వున్న అద్భుతమైన సైద్ధాంతిక గందరగోళా నికి మరో ఉదాహరణ. మన యీ తత్వశాస్త్రవేత్తని నేనొక ప్రశ్న అడుగుతాను: స్వీయాత్మక పథకాలు వేసేవాడు వస్తుపరమైన అభివృద్ధిని ఎలా ''తక్కువ అంచనా వేయగలడు?'' ఈ వస్తుపర అభివృద్ధి కొన్ని వర్గాలను, శ్రేణులను, లేక గ్రూపులను, కొన్ని జాతులను లేక జాతుల గ్రూపులు మొదలైనవాటిని సృష్టిస్తుంది లేక బలపరుస్తుంది, నిర్మూలి స్తుంది లేక బలహీనపరుస్తుంది అన్న వాస్తవాన్నీ, యీవిధంగా ఒకానొక నిర్దిష్టమైన అంతర్జాతీయ రాజకీయ శక్తుల పొందికనూ లేక విప్లవ పార్టీలు అవలంబించే వైఖరి మొద లైనవాటిని నిర్ణయిస్తుందనీ చూడకపోవడం వల్లనే కదా! పథకాలు వేసేవాడు ఆ పని చేసి నట్లయితే, అతని దోషం సద్యోజనిత అంశాన్ని తక్కువ అంచనా వేయడం కాదు, కాని అందుకు విరుద్ధంగా, చైతన్యపూరిత అంశాన్ని తక్కువ అంచనా వెయ్యడం అతని దోషం అవుతుంది. ఎందుకంటే, వస్తుపర అభివృద్ధిని సరిగా అర్థంచేసుకొనే ''చైతన్యం'' అత నిలో కొరవడటాన్నే యిది నిరూపిస్తుంది. కాగా, సద్యోజనితత్వ, చైతన్యాల ''సాపేక్ష ప్రాముఖ్యాన్ని (''రబోచెయె దేలో'' వక్కాణింపు) అంచనా వెయ్యబూనడం'' పూర్తి ''చైతన్య'' రాహిత్యాన్నే తెలియజేస్తోంది. ''అభివృద్ధికి సంబంధించిన సద్యోజనిత శక్తులు'' గురించి మానవుడు అవగాహన చేసుకోగలిగినట్లయితే వాటిని పొరపాటుగా అంచనా వెయ్య డమన్నది ''చైతన్యపూరిత శక్తులను'' తక్కువగా చూడ్డంతో సమానమే అవుతుంది. అలా కాకుండా, వాటిని అవగాహన చేసుకోలేకపోయినట్లయితే, వాటిని గురించి మనకి తెలి యనే తెలియదు, కాగా, మనం వాటిని గురించి మాట్లాడటమే సాధ్యం కాదు.

బి. క్రిచేవ్‌స్కీ యిప్పుడు దేన్ని గురించి వాదిస్తున్నట్లు? "ఇస్క్రా" "స్వీయాత్మక పథకాలు" పొరపాటైనవని అతను భావించినట్లయితే (నిజానికి పొరపాటైనవనే అతని వాదన), ఏ వస్తుపరమైన యథార్థాలను అవి నిర్లక్ష్యం చేస్తున్నాయో అతను నిరూపించి, తర్వాత మాత్రమే, "ఇస్క్రా"కి రాజకీయ చైతన్యం లోపించిందనీ, అతని మాటలనే ఉపయోగించాలంటే, "చైతన్యపూరిత శక్తులను అది తక్కువ అంచనా వేసిందనీ" ఆరోపించివుండాల్సింది. అలా కాకుండా, స్వీయాత్మక పథకాలు నచ్చక పోవడానికి "చైతన్యపూరిత అంశాన్ని తక్కువ అంచనా వెయ్యడం" అన్న వాదనను తప్ప మరే వాదననూ ముందుకు తీసుకురాలేకపోయినట్లయితే(!), అతను యీ కింది విషయాలను నిరూపించుకున్నట్లవుతుంది: 1) సైద్ధాంతికంగా, మార్క్సిజాన్ని కరేయెవ్, మిహైలోవ్‌స్కీల మాదిరిగానే (వాళ్ల అవగాహనను బేల్తొవ్ ఎన్నడో ఎండగట్టాడు) అతను అర్థంచేసుకున్నాడన్నమాట; 2) ఆచరణలో, మన చట్టబద్ధ మార్క్సిస్టులను బెర్న్‌స్టైనిజం వైపూ, మన సోషల్ డెమోక్రట్లను ఆర్థికవాదం వైపూ ఆకర్షించిన "అభివృద్ధియొక్క సద్యోజనిత శక్తుల"తో అతను పూర్తిగా తృప్తిచెందాడన్న మాట. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని ఎంత మూల్యమైనా చెల్లించి "సద్యోజనిత" అభివృద్ధి పంథానుంచి మళ్లించేందుకు కృత నిశ్చయులైనవారిపట్ల అతను "కోపంతో భగ్గున మండిపడుతున్నాడన్నమాట."

తర్వాత, హాస్యాస్పదమైన విషయాలు యింకా వున్నాయి. "ప్రకృతి శాస్త్రాల్లో ఎన్ని విజయాలు సాధింపబడినప్పటికీ, మానవులు పాత పద్ధతిలోనే సంతానోత్పత్తి చేస్తున్న మాదిరిగానే, నూతన సామాజిక వ్యవస్థ పుట్టుక కూడా, భవిష్యత్తులో సైతం, సామాజిక శాస్త్రాల్లో ఎన్ని ఆవిష్కరణలు జరిగినప్పటికీ, చైతన్యంతో పోరాడేవాళ్ల సంఖ్య ఎంతగా పెరిగినప్పటికీ, ప్రధానంగా సద్యోజనిత విజృంభణల ఫలితంగానే సంభవిస్తుంది." (పేజి 19.) మన తాతముత్తాతలు తమ పాత సరళి వివేకంతో, ఎవరైనా యీ లోకంలోకి బిడ్డల్ని తీసుకురాగలరు అని అంటూవుండినట్లుగానే, యీ రోజున ఆధునిక సోషలిస్టులు (నార్సిస్ వరాహమూర్తి మాదిరిగా[165]) తమ తెలివితోటి, నూతన సామాజిక వ్యవస్థ సద్యోజనిత అవతరణలో ఎవరైనా పాల్గొగలరు అంటారు. ఎవరైనా పాల్గొగలరనే మనమూ అంటున్నాం. ఆ మాదిరిగా పాల్గోడానికి కావలసిందల్లా ఆర్థికవాదం ప్రాబల్యంలో వున్నప్పుడు ఆర్థికవాదానికి లొంగడం, టెరరిజం ప్రాబల్యంలో వున్నప్పుడు టెరరిజానికి లొంగడమే. ఈవిధంగా యీ సంవత్సరం వసంతకాలంలో, టెరరిజంపట్ల వ్యామోహానికి వ్యతిరేకంగా హెచ్చరించి వుండవలసినప్పుడు తనకు ఎదురైన "కొత్తదైన" సమస్యతోటి, "రబోచెయె దేలో" దిగ్భ్రాంతి చెంది, దిక్కుతోచక వుండిపోయింది. కాని యిప్పుడు, ఆర్నెల్ల తర్వాత, ఆ సమస్య పాతబడి అప్పుడంతటి సామయికత లేకపోయాక, ఒక్కసారిగా అది యీ కింది ప్రకటన చేస్తోంది: "టెరరిస్టు భావాల ఉధృతిని ఎదుర్కోవడం

సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ కర్తవ్యం కాదనీ, అది కర్తవ్యంగా ఉండరాదనీ మేము భావిస్తున్నాం'' (''రబోచెయె దేలొ,'' సంచిక 10, పేజి 23), దీనికి తోడు అది మహాసభ తీర్మానాన్ని గురించి యిలా అంది: ''క్రమబద్ధమూ, దాడితో కూడినదీ అయిన టెరరిజం సమయోచితమైనది కాదని మహాసభ పరిగణిస్తోంది'' (''రెండు మహాసభలు,'' పేజి 18). ఓహో ఎంత చక్కగా స్పష్టంగా, సుసంగతంగా ఉందిది! దాన్ని ఎదుర్కోక పోవడం, కాని దాన్ని సమయోచితం కానిదిగా ప్రకటించడం, ఆ ప్రకటించడంలో కూడా క్రమబద్ధం కాని, ఆత్మ రక్షణాత్మకమైన టెరరిజం ఆ ''తీర్మానపు'' పరిధిలోకి రాదన్న పద్ధతిలో ప్రకటించడం. మాట్లాడినా, ఏమీ చెప్పని మనిషి పొరపడకుండా ఎలా జాగ్రత్త పడగలడో, అలాగే, అటువంటి తీర్మానం కూడా, అత్యంత ప్రమాద రహితమైనదీ, పొరపాటుకి పూర్తిగా అతీతమైనదిగా ఉంటుందని ఒప్పుకోవలసివుంటుంది. అటువంటి తీర్మానాన్ని రూపొందించడానికి కావలసిందల్లా ఉద్యమపు *తోకగా* ఉండే సామర్థ్యం. టెరరిజం సమస్యను అదేదో *కొత్తది* అన్నట్లు ప్రకటించినందుకుగాను ''రబోచెయె దేలొ''ను ''ఇస్క్రా'' పరిహాసం చేసినప్పుడు, ''ఎన్నడో పదిహేనేళ్లకి పైగా వెనక ప్రవాస రచయితల బృందం ఎత్తుగడల సమస్యల పరిష్కారార్థం ప్రతిపాదించిన పరిష్కారాలను పార్టీ సంఘంమీద రుద్దేటంత అచ్చెరువు గొలిపే సిగ్గుమాలిన ఔద్ధత్యాన్ని ప్రదర్శిస్తున్నందుకు'' (పేజి 24) ''ఇస్క్రా''ను ''రబోచెయె దేలొ'' కోపంగా దూషించింది. సిగ్గుమాలిన ఔద్ధత్యమే మరి, చైతన్యపూరితమైన శక్తులకి యింతటి అధిక అంచనా వెయ్యడం — మొదట సమస్యలను సైద్ధాంతికంగా ముందుగానే పరిష్కరించడం, అటు తర్వాత శాఖను, పార్టీని, జనసామాన్యాన్ని యీ పరిష్కారం సరైనదని ఒప్పించ ప్రయత్నించడం!* దేన్నీ ఎవరిపైనా ''రుద్దకుండా,'' ప్రతి ''మలుపు''తోనూ — ఆర్థికవాదం దిశగానో లేక టెరరిజం దిశగానో — ఊగిసలాడుతూ, మూల సూత్రాలను పునశ్చరణ చేస్తూవుంటే ఎంత భేషుగ్గా వుంటుంది. లౌకిక వివేకానికి సంబంధించిన యీ గొప్ప సూక్తిని ''రబోచెయె దేలొ'' చివరకు సాధారణీకరించి, ''రూపరహితమైన గందరగోళంమీద తారాడేశక్తి మాదిరిగా తమ కార్యక్రమాన్ని ఉద్యమానికి పోటీ పెట్టినందుకు'' ''ఇస్క్రా,'' ''జర్యా''లను నిందిస్తోంది (పేజి 29). సద్యోజనిత ఉద్యమంమీద తారాడటమే గాక, యీ ఉద్యమాన్ని ''*తన కార్యక్రమ*'' స్థాయికి *పెంచే* రూపరహితమైన శక్తిగా కూడా ఉండటం కాక సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ విధి మరేమిటి? దాని విధి ఉద్యమపు *తోక వెంబడి* యీడ్చుకుంటూ పోవడం ఎంత మాత్రం కాదనడం స్పష్టం. మహా అయితే యిది ఉద్యమానికి ఎంత మాత్రం ప్రయోజనకారి

---

* టెరరిజం సమస్యను ''సైద్ధాంతికంగా'' పరిష్కరించడంలో ''శ్రమ విమోచన'' బృందం వెనకటి విప్లవోద్యమ అనుభవాన్ని *సాధారణీకరించిందన్న* విషయాన్ని మరచిపోరాదు.

కాదు. అధమ పక్షంలో, యిది అత్యంత హానిదాయకమవుతుంది. అయితే, ''రబోచెయె దేలొ'' యీ ''ఓ క్రమంగా ఎత్తుగడల'' పద్ధతిని అనుసరించడమే కాకుండా, దాన్నొక సూత్రంగా ఆకాశానికి ఎత్తుతుంది. అందుచేత, దాని యీ ధోరణిని అవకాశవాదంగా కాక, తోకవాదంగా (తోక అన్న పదంనుంచి) వర్ణించడం సరిగా వుంటుంది. సదా ఉద్యమం వెనకనే అనుస రించి వెళ్ళాలనీ, దానికి తోకగా ఉండాలనీ నిర్ణయించుకున్నవాళ్లకు ''అభివృద్ధికి సంబంధిం చిన సద్యోజనితత్వ శక్తులను తక్కువ అంచనావేసే'' ప్రమాదం బొత్తిగా ఎన్నడూ వుండదు.

* * *

ఈవిధంగా, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని ''కొత్త ధోరణి'' చేసిన మౌలిక మైన పొరపాటు ఏమిటంటే, అది సద్యోజనితత్వానికి దాసోహమనడం, జనసామాన్యపు సద్యోజనిత ఉద్యమం సోషల్ డెమోక్రట్లమైన మననుండి ఉన్నత స్థాయి చైతన్యాన్ని డిమాండుచేస్తోందన్న విషయాన్ని గ్రహించడంలో విఫలం కావడం. జనసామాన్యంలో సద్యోజనిత వెల్లువ ఎంత అధికమైతే, ఉద్యమం ఎంత విస్తృతమైతే, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ కృషిలో అధికతర చైతన్యపు అవసరం అంత మహా వేగంగా పెరుగుతుంది.

రష్యాలో జనసామాన్యపు సద్యోజనితమైన వెల్లువ ఎంత వేగంగా పెల్లుబికిందంటే (యింకా పెల్లుబుకుతున్నదంటే), యీ మహత్తర కర్తవ్య నిర్వహణలో యువ సోషల్ డెమోక్రట్లు తాము అసన్నద్ధంగా వున్నట్లు రుజువుచేసుకున్నారు. ఈ అసంసిద్ధత మన ఉమ్మడి దురదృష్టం, రష్యన్ సోషల్ డెమోక్రట్లు అందరి దురదృష్టం. జనసామాన్యపు వెల్లువ అవిరామ అనుస్యూతితో సాగింది, విస్తరించింది. బయల్దేరిన చోట కొనసాగడమే కాక, కొత్త ప్రాంతాలకూ, జనాభాలోని కొత్త విభాగాలకూ అది విస్తరించింది (కార్మికోద్యమ ప్రభావంలో విద్యార్థి యువజనంలోనూ, మొత్తంగా మేధావుల్లోనూ, చివరకు రైతాంగంలో సైతం తిరుగుబాటు భావాలు తిరిగి తలెత్తుతున్నాయి. అయితే విప్లవవాదులు, తమ ''సిద్ధాం తాల్లోనూ,'' తమ కార్యకలాపాల్లోనూ కూడా యీ వెల్లువకు వెనకపడ్డారు. ఈ మొత్తం ఉద్యమాన్ని నడిపించే సామర్థ్యం గలిగి కట్టుదిట్టంగా అవిరామంగా పనిచేసే పార్టీని నిర్మిం చడంలో వారు విఫలురయారు.

''రబోచెయె దేలొ'' మన సైద్ధాంతిక కర్తవ్యాలను తక్కువ అంచనా వేసిందనీ ''విమ ర్శనా స్వేచ్ఛ'' అనే ఫేషనబుల్ ఊతనినాదాన్ని అది ''సద్యోజనితంగా'' వల్లించిందనీ మొదటి ప్రకరణంలో నేను నిరూపించాను. ఈ నినాదాన్ని వల్లించేవారిలో, అవకాశవాద ''విమ ర్శకుల'' వైఖరికీ, జర్మనీ, రష్యా దేశాల్లోని విప్లవవాదుల వైఖరికీ మధ్య పూర్తి భిన్నత్వం వుందని అర్థంచేసుకోగల ''చైతన్యం'' లోపించిందని నిరూపించాను.

రాబోయే ప్రకరణాల్లో, సద్యోజనితత్వానికి యీ దోసోహం అనడమన్నది, సోషల్ డెమొక్రటిక్ ఉద్యమపు రాజకీయ కర్తవ్యాల రంగంలోనూ, సంఘటనాత్మక కృషిలోనూ ఏవిధంగా వ్యక్తమైందో వివరిస్తాను.

# III

## ట్రేడ్‌యూనియన్ రాజకీయాలు, సోషల్ డెమొక్రటిక్ రాజకీయాలు

''రబోచెయె దేలో''ను పొగడటంతోనే మళ్లీ మొదలుపెడదాం. ''రబోచెయె దేలో'' 10వ సంచికలో, ''ఇస్క్రా''తో తనకు గల విభేదాలపైన మర్తీనొవ్ రాసిన వ్యాసానికి, ''బట్టబయలుచేసే సాహిత్యం, శ్రామికవర్గ పోరాటం'' అని పేరుపెట్టాడు. విభేదాల సారాంశాన్ని ఆయన యీ విధంగా సూత్రీకరించాడు: ''దాని (కార్మికవర్గ పార్టీ) అభివృద్ధి పంథాకు అవరోధంగా నిలబడే వ్యవస్థను బహిర్గతంచేసి ఖండించడానికే మనల్ని మనం పరిమితం చేసుకోలేము. శ్రామికవర్గ తక్షణ సమకాలిక ప్రయోజనాల విషయాన్ని కూడా మనం పట్టించుకోవాలి. (పేజి 63.)... 'ఇస్క్రా'... మన దేశంలోని పరిస్థితులను, ప్రత్యేకించి రాజకీయ పరిస్థితులను బహిర్గతంచేసి ఖండించే విప్లవ ప్రతిపక్ష పత్రిక.... అయితే మనం, కార్మికవర్గ శ్రేయస్సుకోసం, శ్రామికవర్గ పోరాటంతో సన్నిహిత సజీవ సంబంధం పెట్టుకుని పనిచేస్తాం, పనిచేస్తూనే వుంటాం.'' (పేజి 63.) ఈ సూత్రీకరణ చేసినందుకు మర్తీనొవ్‌కి కృతజ్ఞతాబద్ధులు కాకుండా ఎవరూ ఉండలేరు. ''రబోచెయె దేలో''తో మనకి వున్న అభిప్రాయభేదాలనే కాకుండా, రాజకీయ పోరాటం విషయంలో మనకీ ఆర్థికవాదులకీ మధ్యవున్న సాధారణ అభిప్రాయభేదాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తున్నందున, సార్వత్రికంగా విశేషమైన ఆసక్తిగొలిపే యీ సూత్రీకరణ ప్రధానమైనది. ఆర్థికవాదులు ''రాజకీయాలను'' పూర్తిగా నిరాకరించరనీ, అయితే వాళ్లు సోషల్ డెమొక్రటిక్ అవగాహనతో కూడిన రాజకీయాలనుంచి ట్రేడ్‌యూనియన్ అవగాహనతో కూడిన రాజకీయాలకి సదా దారి తప్పుతూ వుంటారనీ నేను యింతకుముందే నిరూపించాను. మర్తీనొవ్ సరిగా యిలాగే దారి తప్పిపోతున్నాడు. అందుకని, యీ సమస్య పైన ఆర్థికవాదుల పొరపాటుకు ఆయన అభిప్రాయాలనే నేను మచ్చుగా తీసుకుంటున్నాను. నేనిలా చేస్తున్నందుకు, '' 'రబోచయ మీస్ల్' ప్రత్యేకానుబంధ'' రచయితలకు గాని, ''స్వయం విమోచన'' బృందం ప్రణాళికా రచయితలకు గాని, ''ఇస్క్రా'' 12వ సంచికలోని ఆర్థికవాద లేఖ రచయితలకు గాని ఆక్షేపణ తెలిపే హక్కేమీ ఉండదు. ఎందుచేత వుండదో రుజువుచేసేందుకు నేనీ ప్రకరణంలో ప్రయత్నిస్తాను.

## అ) రాజకీయాందోళన, దాన్ని ఆర్థికవాదులు పరిమితపరచడం

రష్యాలో ఒకవంక కార్మికుల ఆర్థిక పోరాటం* విస్తృతంగా అభివృద్ధిచెందడం, సంఘటితమవడమూ, మరోవంక ఆర్థిక (ఫ్యాక్టరీ, వృత్తి) పరిస్థితులను బహిర్గతంచేసి ఖండించే "సాహిత్య" ప్రచురణా ఏకకాలంలో జరుగుతూండేవన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ "కరపత్రాలు" ప్రధానంగా ఫ్యాక్టరీ పద్ధతులను బహిర్గతంచేసి ఖండిస్తూండేవి. కాగా, యిలా బహిర్గతంచేసి ఖండించే విషయాలపట్ల కార్మికుల్లో త్వరలోనే తీవ్ర వాంఛ పెల్లుబికింది. సోషల్ డెమోక్రటిక్ అధ్యయన బృందాలు తమ హీన జీవిత పరిస్థితులను గురించీ, దుర్భరమైన కాయకష్టం గురించీ, తమకు హక్కులు లేకపోవడాన్ని గురించీ పూర్తి నిజాన్ని తమకు తెలియజెయ్యాలని వాంఛిస్తున్నాయనీ, అలా తెలియజేసే ఓ కొత్త రకం కరపత్రాన్ని అవి తమకు అందజెయ్యగలవనీ కార్మికులు గ్రహించగానే, వాళ్లు ఫ్యాక్టరీలనుంచీ, కర్మాగారాలనుంచీ మాకు ఉత్తరాలు రాసేవాళ్లు, రాయడమేమిటి, మమ్మల్ని ఉత్తరాలతో ముంచెత్తే వాళ్లు. ఏ ఫ్యాక్టరీని గురించి కరపత్రంలో బహిర్గతంచేసి ఖండించారో ఆ ప్రత్యేక ఫ్యాక్టరీలోనే కాకుండా, యిలా బహిర్గతంచెయ్యబడి ఖండించబడిన యథార్థాల వార్త వ్యాపించిన ఫ్యాక్టరీలన్నింట్లోనూ కూడా ఈ "బహిర్గతం చేసి ఖండించే సాహిత్యం" విశేషమైన సంచలనం కలిగించేది. వివిధ పరిశ్రమల్లోనూ, వివిధ వృత్తుల్లోనూ కార్మికులు అనుభవించే దారిద్ర్యమూ, లేమీ దాదాపుగా ఒకే రకంగా ఉండేవి గనుక, "కార్మికుల జీవితాన్ని గురించిన సత్యం" ప్రతి ఒక్కడినీ కదిలిచ్చేది. మిక్కిలి వెనుకబడిన కార్మికుల్లో సైతం, తమ సంగతులు "అచ్చులోకి ఎక్కాలి" అన్న తీవ్ర వాంఛ రేకెత్తింది — దోపిడిపైనా, పీడనపైనా ఆధారపడిన ప్రస్తుత సామాజిక విధానమంతటికీ వ్యతిరేకమైన యీ ప్రాథమిక యుద్ధరూపానికి సంబంధించినంతవరకు యిదొక ఉన్నత వాంఛయే. అత్యధిక సందర్భాల్లో యీ "కరపత్రాలు" నిజానికి యుద్ధ ప్రకటనలే, ఎందుకంటే అవి కార్మికుల్లో ఉద్రేకాన్ని రెచ్చగొట్టడానికి విశేషంగా తోడ్పడేవి. కొట్టవచ్చినట్లు కనిపించే

* అపార్థాన్ని నివారించేందుకుగాను, నేనొక విషయాన్ని స్పష్టంచెయ్యాల్సివుంది. ఇక్కడా, యీ పుస్తకం అంతట్లోనూ, ఆర్థిక పోరాటం అన్నప్పుడు, (మన సోషల్ డెమోక్రట్లలో వాడుకలో ఉన్న ప్రకారం) "ఆచరణలో ఆర్థిక పోరాటం" అనే నా ఉద్దేశం. దీన్నే ఎంగెల్స్, పైన యివ్వబడిన ఉల్లేఖనలో "పెట్టుబడిదారులకు ప్రతిఘటన" అని వర్ణించాడు. దీన్నే స్వతంత్ర దేశాల్లో సంఘటిత శ్రామికులనీ, సిండికల్ అనీ, లేక ట్రేడ్‌యూనియన్ పోరాటం అనీ అంటారు.

ఘాతుకాలను తొలగించుకొనే విషయంలో కార్మికుల మధ్య ఉమ్మడి కోర్కెలను ఉత్పన్నం చేసి, ఆ డిమాండ్లను సమ్మెలతో బలపరిచే సంసిద్ధతను అవి రేకెత్తించేవి. చివరకు, యజమానులు సైతం యుద్ధ ప్రకటనలుగా యీ కరపత్రాల ప్రాముఖ్యాన్ని గుర్తించక తప్పని సరి పరిస్థితిలో పడేవారు. దానితో, అనేక సందర్భాల్లో వాళ్ల పోరాటం యింకా ప్రారంభం కాకముందే జాగ్రత్తపడేవారు. బహిర్గతంచేసి ఖండించే యీ కరపత్రాలు వెలువడే సరికే ఫలితం కనిపించేది. వాటికి గట్టి నైతిక ప్రభావం కలిగించే ప్రాముఖ్యం ఏర్పడింది. అనేక సందర్భాల్లో కరపత్రం వెలువడితేనే చాలు, కార్మికులు ముందుపెట్టిన డిమాండ్లు అన్నీ గాని, కొన్ని గాని తీర్చబడేవి. క్లుప్తంగా చెప్పాలంటే, యీ ఆర్థిక (ఫ్యాక్టరీ) వ్యవహారాలను బహిర్గతంచేసి ఖండించడమన్నది వెనకే కాకుండా యికముందు కూడా ఆర్థిక పోరాటపు ఒక ముఖ్యమైన సాధనమే. పెట్టుబడిదారీ విధానం కొనసాగినంత కాలం, కార్మికులు స్వయంరక్షణకు పూనుకోవడాన్ని అది అవసరంచేసేటంత కాలం, వాటికి యీ ప్రాముఖ్యం ఉంటూనే వుంటుంది. బాగా అభివృద్ధిచెందిన యూరపియన్ దేశాల్లో సైతం, వెనుకబడిన ఏదో ఒక వృత్తిలో, లేక గృహ పరిశ్రమయొక్క ఏదో ఒక విస్మృత శాఖలో అత్యాచారాలను బట్టబయలుచెయ్యడం అన్నది, వర్గ చైతన్యాన్ని జాగృతంచెయ్యడానికీ, ట్రేడ్ యూనియన్ పోరాటానికి బీజంవెయ్యడానికీ, సోషలిజం వ్యాప్తికీ తోడ్పడుతుంది.*

---

* ఈ ప్రకరణంలో నేను రాజకీయ పోరాటాన్ని గురించే దాని విస్తృతార్థంలో గాని, సంకుచితార్థంలో గాని పరిశీలిస్తాను. అందుచేత, ఆర్థిక పోరాటం విషయంలో ''ఇస్క్రా'' ''మరీ సంకుచితంగా'' వ్యవహరిస్తోందన్న ఆరోపణను సందర్భవశంగా, కేవలం జిజ్ఞాసగా మాత్రమే నేను ప్రస్తావిస్తాను (''రెండు మహాసభలు,'' పేజి 27, ''సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం, కార్మికవర్గం'' అన్న పుస్తకంలో మర్తీనావ్‌చేత తిరగేసి బోర్లేసి చెప్పబడింది). ''ఇస్క్రా'' ఆర్థిక పోరాటపు విభాగంలో గురించి ఏ ప్రత్యేక సంవత్సరంలో నైనాసరే జరిగిన చర్చలను, హండ్రెడ్‌వెయిట్ల లేక రీముల కాగితం లెక్కన చూసినా (యిలా చూడటం వాళ్లకి చాలా యిష్టం), అదే సంవత్సరం ''రబోచెయె దేలో,'' ''రబోచయ మీస్ల్'' పత్రికలు రెండింటిలోనూ కలిపి అదే విభాగాల్లో ప్రచురింపబడిన సమాచారంతో పోలిస్తే, చివరికి యీ విధంగా కూడా యీ రెండు పత్రికలూ ''ఇస్క్రా'' కన్న వెనకబడతాయన్న విషయాన్ని వాళ్లు తేలిగ్గా గ్రహించగలరు. సరళమైన యీ నిజాన్ని గ్రహించడం మూలంగానే వాళ్ల గందరగోళాన్ని బయటపెట్టే వాదనలకు పూనుకోక తప్పనిసరి పరిస్థితిని వాళ్లకి కల్పిస్తోందనడం స్పష్టం. వాళ్లు యిలా రాస్తారు: ''ఇస్క్రా'' యిష్టం వున్నా లేకపోయినా [!] వాస్తవ జీవితంలోని సంఘటనల ఒత్తిడిని ఎదుర్కోక తప్పనిసరి పరిస్థితిలో పడుతోంది[!] కార్మికోద్యమాన్ని గురించి కనీసం [!!] లేఖలనైనా ప్రచురించక గత్యంతరం

రష్యన్ సోషల్ డెమొక్రట్లలో అత్యధిక సంఖ్యాకులు యిటీవల ఫ్యాక్టరీల్లో పరిస్థితులను బహిర్గతంచేసి ఖండించే ఏర్పాట్లలో నిమగ్నులై వున్నారు. వాళ్ళు ఏమేరకు యీ పనిలో నిమగ్నులై వున్నారో తెలుసుకోడానికి "రబోచయ మీస్ల్"ని తిరగేస్తే సరిపోతుంది. కాగా, నిజానికి యీ కార్యకలాపాన్ని, దానికి అదిగా తీసుకున్నప్పుడు, యిదే సోషల్ డెమొక్రట్ల కార్యకలాపం కాదనీ, యిది కేవలం ట్రేడ్‌యూనియన్ కార్యకలాపం మాత్రమే నన్న దృష్టిని వాళ్ళు కోల్పోయారు. నిజానికి, బహిర్గతం చేసి ఖండించే యీ కార్యకలాపాలు కేవలం ఒకానొక నిర్దిష్ట వృత్తిలో కార్మికులకూ యజమానులకూ మధ్య సంబంధాలకు మాత్రమే పరిమితమై వుండేవి. శ్రమశక్తి అమ్మకందార్లు తమ "సరుకు"ను మరింత మంచి షరతులపైన అమ్ముకోవడం ఎలాగో, శుద్ధ వ్యాపార లావాదేవీలో కొనుగోలుదార్లది పైచెయ్యి కాకుండా ప్రతిఘటించడం ఎలాగో నేర్చుకున్నారు — యింత మాత్రమే. బహిర్గతంచేసి ఖండించే యీ కార్యకలాపాలు (విప్లవవాదుల పార్టీ యేదైనా వాటిని సరిగా వినియోగించుకున్నట్లయితే) సోషల్ డెమొక్రటిక్ కార్యకలాపాలలో మొదటిమెట్టుగానూ, అంతర్భాగంగానూ ఉపయోగపడి వుండేవి. అయితే, సద్యోజనితత్వంపట్ల ఆరాధనా దృష్టిని చూపి, దానికి దాసోహం చేసినట్లయితే, తప్పని సరిగా అవి "శుద్ధ ట్రేడ్‌యూనియన్" పోరాటానికీ, సోషల్ డెమొక్రటికేతర కార్మికోద్యమానికీ దారితియ్యగలగడమే కాక, దారితీసి తీరుతాయి. సోషల్ డెమొక్రటిక్ పార్టీ కార్మికవర్గాన్ని శ్రమశక్తి అమ్మకంలో మంచి షరతులకోసమేగాకుండా, ఆస్తిహీనులు తమని తాము ధనికులకు అమ్ముకోక తప్పని సరి పరిస్థితిలో పెట్టే సామాజిక వ్యవస్థ రద్దుకోసం కూడా పోరాటాన్ని నడుపుతుంది. కార్మికవర్గానికీ ఓ ప్రత్యేక యజమానుల బృందానికీ మధ్య వ్యవహారాల్లోనే కాక, కార్మికవర్గానికీ ఆధునిక సమాజపు అన్ని వర్గాలకూ మధ్య, సంఘటిత రాజకీయ బలప్రయోగ శక్తిగా రాజ్యానికీ కార్మికవర్గానికీ మధ్య జరిగే వ్యవహారాల్లో కూడా సోషల్ డెమొక్రటిక్ పార్టీ కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. దీన్నిబట్టి, సోషల్ డెమొక్రట్లు కేవలం ఆర్థిక పోరాటానికి మాత్రమే తమని తాము పరిమితం చేసుకోరాదనీ, ఫ్యాక్టరీల్లో ఆర్థిక పరిస్థితులను బహిర్గతంచేసి ఖండించే కరపత్రాల ప్రచురణనే తమ కార్యకలాపాల్లో ప్రధాన భాగం కానివ్వరాదనీ తెలుతోంది. కార్మికవర్గానికి రాజకీయ శిక్షణ గరిపి, దాని రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు మనం చురుకుగా పనిచెయ్యాలి. ఇప్పుడు "జర్యా," "ఇస్క్రా"లు ఆర్థికవాదంమీద తమ మొదటి దాడిని చేశాయి గనుక యీ అంశంమీద "అందరూ ఏకీ

---

లేని స్థితిలో పడుతోంది" ("రెండు మహాసభలు," పేజి 27). ఇది నిజంగానే మనల్ని చిత్తుచేసే వాదన!

భవిస్తున్నారు (అయితే కొందరు మాటల్లో మాత్రమే ఏకీభవిస్తున్నారన్న సంగతిని త్వరలోనే మనం చూస్తాం).

ఇప్పుడిక, రాజకీయ శిక్షణలో ఏం వుండాలి? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా కార్మికవర్గపు ప్రాతికూల్య ప్రచారానికి దాన్ని పరిమితం చెయ్యగలమా? ఎంతమాత్రం కాదు. తాము పీడింపబడుతున్నారని కార్మికులకు వివరిస్తే (యజమానుల ప్రయోజనాలకు కార్మికుల ప్రయోజనాలు విరుద్ధమైనవని వివరించినంత మాత్రాన సరిపోనట్లే) సరిపోదు. ఈ రాజకీయ పీడనకు సంబంధించిన ప్రతి నిర్దిష్ట సంఘటన విషయంలోనూ (ఆర్థిక పీడనకు సంబంధించిన నిర్దిష్ట ఘటనల్లో మనం ఆందోళనను సాగించడం ఎలా మొదలుపెట్టామో అలాగ) ఆందోళన సాగించాలి. ఈ రాజకీయ పీడన సమాజంలోని అత్యంత వైవిధ్యపూరిత రంగాలను దెబ్బతీసే మేరకు, అత్యంత వైవిధ్యపూరిత జీవిత రంగాల్లోనూ, కార్యకలాపాల రంగాల్లోనూ – వృత్తి, పౌర, వ్యక్తిగత, కుటుంబ, మత, శాస్త్రీయాది రంగాల్లోనూ – తనను తాను అది వ్యక్తంచేసుకునే మేరకు, నిరంకుశ రాజరికాన్ని సర్వతోముఖంగా రాజకీయంగా బహిర్గతం చేసి ఖండించే కార్యకలాపాలను మనం చేబట్టకపోయినట్లయితే, కార్మికుల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే మన కర్తవ్యాన్ని నిర్వహించలేకపోతాం అన్న విషయం స్పష్టమే కదా? రాజకీయ పీడనకు సంబంధించిన నిర్దిష్ట ఘటనలపైన ఆందోళన సాగించేందుకు గాను, ఆ ఘటనలను (ఆర్థిక ఆందోళనను సాగించేందుకు ఫ్యాక్టరీల్లో జరిగే అక్రమాలను బహిర్గతం చేసి ఖండించడం అవసరమైన మాదిరిగానే) బహిర్గతం చేసి ఖండించే తీరాలి.

ఇది స్పష్టంగా ఉన్నట్లే ఉంది. అయితే, రాజకీయ చైతన్యాన్ని, సర్వతోముఖంగా పెంపొందించవలసిన అవసరాన్ని గురించి "అందరూ" మాటల్లో మాత్రమే ఏకాభిప్రాయంలో వున్నారని తేలుతుంది. ఉదాహరణకు, "రబోచెయె దేలొ" రాజకీయ విషయాలను సర్వతోముఖంగా బహిర్గతంచేసి ఖండించే కార్యకలాపాలను ఏర్పాటుచెయ్యడం (కనీసం అలా ఏర్పాటు చెయ్యనారంభించడం) మాట అటుంచి, యీ కర్తవ్యాన్ని చేబట్టిన "ఇస్క్రా"ను సైతం, దాన్నుంచి పక్కకి లాగేందుకు ప్రయత్నిస్తోంది. "రబోచెయె దేలొ" ఏమంటోందో చూడండి: "కార్మికవర్గపు రాజకీయ పోరాటం కేవలం" (అది ఎంత మాత్రం "కేవలం" కాదు) "ఆర్థిక పోరాటపు మిక్కిలి అభివృద్ధిచెందిన, విస్తృతమైన, పటిష్ఠమైన రూపం" ("రబోచెయె దేలొ" కార్యక్రమం, 1వ సంచిక, 3వ పేజీలో, ప్రచురింపబడింది). "ఆర్థిక పోరాటానికే, సాధ్యమైనంతవరకు, రాజకీయ స్వభావాన్ని కల్పించే కర్తవ్యాన్ని సోషల్ డెమోక్రట్లు యీనాడు ఎదుర్కొంటున్నారు" (మర్తీనొవ్, "రబోచెయె దేలొ," సంచిక 10, పేజి 42). "జనసామాన్యాన్ని క్రియాశీల రాజకీయ పోరాటంలోకి లాగేందుకు అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల సాధనం ఆర్థిక పోరాటమే" (దేశాంతర

యూనియన్[166] మహాసభ ఆమోదించిన తీర్మానం, దానికి చెయ్యబడిన "సవరణలు," "రెండు మహాసభలు," పేజీలు 11, 17). "రబోచెయె దేలో" మొట్టమొదటి సంచిక నుండి "సంపాదకులకు సూచనలు" వున్న తాజా సంచికవరకు అన్నీ కూడా యీ సూత్రీకరణలతోనే నిండివున్నాయి; రాజకీయ ఆందోళన గురించీ, పోరాటం గురించీ అవన్నీ కూడా ఒకే అభిప్రాయాన్ని వెల్లడిస్తాయనడం స్పష్టం. రాజకీయ ఆందోళన ఆర్థిక ఆందోళనను అనుసరించి రావాలని ఆర్థికవాదులందరిలోనూ నాటుకొనివున్న అభిప్రాయం దృష్ట్యా పై అభిప్రాయాన్ని పరిశీలిద్దాం. సర్వసాధారణంగా,* జనసామాన్యాన్ని రాజకీయ పోరాటంలోకి లాగే "అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల సాధనం" ఆర్థిక పోరాటమే అన్న మాట నిజమేనా? ఎంతమాత్రం కాదు. ఆర్థిక పోరాటానికి సంబంధించి మాత్రమే కాకుండా, పోలీసు పీడనకీ, లేక నిరంకుశ రాజరిక ఘాతుకానికీ సంబంధించిన ప్రతి ఒక్క ఘటనా కూడా జనసామాన్యాన్ని పోరాటంలోకి "లాగడంలో" "విస్తృతంగా వర్తించే" సాధనాలకు కించిత్తు కూడా తీసిపోదు. గ్రామీణ అధికారులు[167] కొరడాలతో రైతుల వీపులు చిట్లకొట్టడం, అధికారుల లంచగొండితనం, నగరాల్లోని "సామాన్యజనం" పట్ల పోలీసుల అమానుష ప్రవర్తన, కరువు బాధితులకు వ్యతిరేకంగా జబర్దస్తీ, జ్ఞాన వికాసాల కోసం జనం జరిపే ప్రయత్నాల అణచివేత, మైనారిటీ మతాలకు చెందినవాళ్లని హింసించడం, సైనికుల్ని అవమానాలకు గురిచెయ్యడం, విద్యార్థులనూ, ఉదారవాద మేధావులనూ సైనిక బారక్సులో సైనికుల్ని చూసిన మాదిరిగా చూడటం — యివన్నీ కాకుండా, యిలాంటివే యింకెన్నో పీడన పద్ధతులు అమల్లో వున్నాయి. వీటికీ, "ఆర్థిక" పోరాటానికీ ప్రత్యక్ష సంబంధం

---

* "సర్వసాధారణంగా" అని నేనెందుకు అంటున్నానంటే, "రబోచెయె దేలో" సాధారణ సూత్రాలను గురించీ, మొత్తంగా పార్టీ సాధారణ కర్తవ్యాలను గురించీ చెప్తూవుంటుంది. నిస్సందేహంగా, ఆచరణ క్రమంలో రాజకీయాలు నిజంగా ఆర్థిక వ్యవహారాలను అనుసరించి వుండి తీరవలసిన కొన్ని సందర్భాలు వుండే మాట నిజమే. అయితే, మొత్తం రష్యాను ఉద్దేశించి చెయ్యబడిన తీర్మానంలో ఒక్క ఆర్థికవాదులు మాత్రమే యీ విషయాన్ని గురించి మాట్లాడగలరు. రాజకీయ పోరాటాన్ని "ఆదినుంచీ కూడా" "కేవలం ఆర్థిక పునాదిపైననే" సాగించగలగడం సాధ్యమయ్యే సందర్భాలు ఉండితీరుతాయి. అయితే, "రబోచెయె దేలో" చివరకు "దీనికి ఎంతమాత్రం అవసరం లేదు" అన్న నిర్ణయానికి వచ్చింది ("రెండు మహాసభలు," పేజి 11). "రాజకీయవాదుల," విప్లవకారుల ఎత్తుగడలు సోషల్ డెమోక్రట్ల ట్రేడ్‌యూనియన్ కర్తవ్యాలను నిర్లక్ష్యం చెయ్యకపోవడమే గాక, అందుకు భిన్నంగా, వాటిని సోషల్ డెమోక్రట్లు మాత్రమే ఎడతెగకుండా సాధించగలరు. ఈ విషయాన్ని రాబోయే ప్రకరణంలో నేను నిరూపిస్తాను.

లేకపోయినా, రాజకీయ ఆందోళనలోకీ, జనసామాన్యాన్ని రాజకీయ పోరాటంలోకీ ఆకర్షిం చడంలో మొత్తంమీద, తక్కువ "విస్తృతంగా ప్రయుక్తం కాగల" సాధనాలూ, సందర్భా లూనా? ఇందుకు పూర్తి భిన్నమైనదే వాస్తవం. నిరంకుశత్వం, హింసాకాండ, హక్కుల లేమినుంచి కార్మికులు (తాము స్వయంగా గాని, తమకు సన్నిహితులైనవారు గాని) బాధ లకు గురయ్యే మొత్తం సందర్భాలను తీసుకుంటే, వాటిలో అతి కొద్ది మాత్రమే ట్రేడ్ యూనియన్ పోరాటాలమీద పోలీసులు అత్యాచారాలు జరిపిన సందర్భాలు వుంటాయి. మరి అలాంటప్పుడు, మనం ఒక్క సాధనాన్ని మాత్రమే "అతి విస్తృతంగా ప్రయుక్తం కాగల" సాధనంగా ప్రకటించి, రాజకీయాందోళన అవకాశానికి ముందే, పరిమితం చెయ్యడం ఎందుకు? నిజానికి, సోషల్ డెమొక్రట్లు, దీనికితోడు, యితరవైన, సాధారణంగా చూసు కున్నప్పుడు, ఎంతమాత్రం తక్కువ "విస్తృతంగా ప్రయుక్తం కాగలవి" కాని సాధనాలను చేబట్టడం అవసరం కాదా?

ఎన్నడో సుదూరగతంలో (ఓ పూర్తి సంవత్సరం వెనక!...) "రబోచెయె దేలొ" యిలా రాసింది: "జనసామాన్యం తక్షణ రాజకీయ డిమాండ్లను ఒక సమ్మె తర్వాతనో, లేక ఏదేమైనా కొన్ని సమ్మెల తర్వాతనో, "తమకు వ్యతిరేకంగా ప్రభుత్వం పోలీసులనూ, రాజకీయ పోలీసులనూ ఉసిగొల్పిన వెంటనే" అర్థంచేసుకోవడం మొదలుపెడతారు" (సంచిక 7, పేజి 15, ఆగస్టు 1900). ఈ అవకాశవాద దశల సిద్ధాంతాన్ని యిప్పుడు నిరాకరిం చిన "దేశాంతర యూనియన్" యిలా ప్రకటించడం ద్వారా మనకొక రాయితీని యిస్తోంది: "ఆదినుంచీ, కేవలం ఆర్థిక ప్రాతిపదికపైనే, రాజకీయాందోళనను సాగించవలసిన అవసరం లేదు" ("రెండు మహాసభలు," పేజి 11). సుదీర్ఘమైన సవాలక్ష వాదనల కన్న, "యూని యన్" తన పూర్వపు పొరపాట్లలో కొన్నింటిని వదిలిపెట్టడం, మన ఆర్థికవాదులు సోష లిజాన్ని ఎంతగా దిగజార్చారో అన్న విషయాన్ని, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమపు భావి చరిత్రకారులకు మరింత బాగా తెలియజేస్తుంది! కాని రాజకీయాలను పరిమితం చేసే ఒక రూపాన్ని తను విసర్జించినంత మాత్రాన మరో రూపానికి మనల్ని ఒప్పించగలరని "దేశాంతర యూనియన్" ఊహించుకుంటే, నిజంగానే అది చాల అమాయకమైనదే అయి వుండాలి. ఈ సందర్భంలో కూడా, ఆర్థిక పోరాటాన్ని సాధ్యమైనంత విస్తృత ప్రాతిపదిక పైన నిర్వహించాలనీ, దాన్నెప్పుడూ కూడా రాజకీయాందోళనకోసం ఉపయోగపెట్టు కోవాలనీ, కాని, జనసామాన్యాన్ని చురుకైన రాజకీయ పోరాటంలోకి లాగడానికి ఆర్థిక పోరాటాన్ని అత్యంత విస్తృత సాధనంగా పరిగణించవలసిన "అవసరం ఏ మాత్రం లేదు" అనీ చెప్తే మరింత హేతుబద్ధంగా వుండదా?

"అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల సాధనం" అన్న పదబంధం స్థానంలో, "యూదు కార్మికుల సంఘం" ("బుంద్")[168] నాలుగవ మహాసభ చేసిన ఒక తీర్మానంలో

వున్న "అత్యుత్తమ సాధనం" అన్న పదబంధాన్ని తను పెట్టడానికి "దేశాంతర యూనియన్" ప్రాముఖ్యాన్ని ఆపాదిస్తోంది. ఈ రెండింటిలో ఏది మేలైనదో చెప్పడం నాకు కష్టంగానే వుంది. నా ఉద్దేశంలో రెండూ అధ్వానమైనవే. రాజకీయాలకు ఆర్థికవాద, ట్రేడ్‌యూనియనిస్టు వ్యాఖ్యానం చెయ్యడమనే పొరపాటులో (పాక్షికంగా, బహుశా సంప్రదాయ ప్రభావ కారణంగా తమకు తెలియకుండానే) "దేశాంతర యూనియనూ," "బుందూ" రెండూ కూరుకుపోయి వుంటాయి. ఈ పొరపాటు "అత్యుత్తమ" అన్న పదం వాడటం ద్వారానా లేక "అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల" అన్న పదాలు వాడటం ద్వారానా అన్నదానికి యేవిధమైన మౌలిక ప్రాముఖ్యమూ లేదు. "దేశాంతర యూనియన్" "ఆర్థిక ప్రాతిపదిక పైన రాజకీయాందోళన" అత్యంత విస్తృతంగా ప్రయుక్తం అయిన ("ప్రయుక్తం కాగల" కాదు) సాధనం అని చెప్పివుంటే, మన సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు ఒకానొక దశ విషయంలో అది సరిగా చెప్పినట్లయ్యేది. ఆర్థికవాదులకూ, 1898–1901 కాలపు కార్యకర్తలలో పలువురికీ (అధిక సంఖ్యాకులకు కాకపోయినా) సంబంధించినంతవరకు అది సరిగా చెప్పినట్లయ్యేది. ఎందుకంటే, కార్యరంగంలో వున్న యీ ఆర్థికవాదులు రాజకీయాందోళనను దాదాపు ప్రత్యేకంగా ఆర్థిక వునాదిపైననే ప్రయుక్తం చేశారు (అసలంటూ వాళ్లు ప్రయుక్తం చేస్తే). అటువంటి పద్ధతుల్లో రాజకీయాందోళనను "రబోచయ మీస్ల్," "స్వయం విమోచన గ్రూపు" గుర్తించారు, సిఫారసు కూడా చేశారు. ఆర్థిక సంబంధమైన ఆందోళన అనే ఉపయోగకర కృషికి రాజకీయ పోరాటమనే హానిదాయకమైన పరిమితిని జోడించడాన్ని "రబోచెయె దేలో" గట్టిగా ఖండించివుండాల్సింది. తద్భిన్నంగా (ఆర్థికవాదులు) అత్యంత విస్తృతంగా ప్రయుక్తం చేసిన సాధనమే అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల సాధనంగా అది ఉద్ఘాటిస్తోంది! మనం వీళ్లని ఆర్థికవాదులు అని పిలుస్తూండగా, వాళ్లు మనమీద రకరకాలుగా దుమ్మెత్తిపొయ్యడం తప్ప మరేమీ చెయ్యలేకుండా వున్నారు. వాళ్లు మనల్ని "ఇంద్రజాలికులు," "విచ్ఛిన్నకులు" అనీ, "మతాధిపతిబంట్లు," "అభాండాలువేసే వాళ్లు"* అనీ అంటారు. మనం వాళ్ల మనసులను దారుణంగా గాయపరిచామని ప్రపంచమంతటికీ ఫిర్యాదుచేస్తున్నారు. "ఒక్క సోషల్ డెమోక్రటిక్ శాఖకీ ఆర్థికవాదపు వాసన లేదు"** అని ఒట్టేసి చెప్తున్నారు. ఓయ్, యీ పాడు, అభాండాలకోరు రాజకీయవేత్తల్ని ఏమనాలి! మానవాళిపట్ల పరమ ద్వేషంతో, యితరులను దారుణంగా అవమానపరచడం కోసమే, వీళ్లు యీ ఆర్థికవాదాన్ని బుద్ధిపూర్వకంగా కల్పించివుంటారు.

---

* "రెండు మహాసభలు"లో సరిగ్గే యివే పదాలు వాడబడ్డాయి, పేజీలు 31, 32, 28, 30.

** "రెండు మహాసభలు," పేజి 32.

''ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం'' అన్న కర్తవ్యాన్ని సోషల్ డెమొక్రటిక్ ఉద్యమం ముందు పెట్టినప్పుడు, మర్తీనొవ్ మాటల్లోని నిర్దిష్టమైన, నిజమైన అర్థం ఏమిటి? ఆర్థిక పోరాటం అన్నది, తమ శ్రమశక్తి అమ్మకంలో మరింత మంచి షరతులకోసమూ, మరింత మంచి జీవిత పరిస్థితులకోసమూ, పని పరిస్థితులకోసమూ, కార్మికులు తమ యజమానులకు వ్యతిరేకంగా జరిపే సమష్టి పోరాటం. ఈ పోరాటం విధిగా ట్రేడ్‌యూనియన్ పోరాటమే అయివుంటుంది. భిన్న వృత్తుల్లో పని పరిస్థితులు ఎంతో భిన్నంగా వుండటమే యిందుకు కారణం. తత్పర్యవసానంగా పని పరిస్థితులను మెరుగు పరచుకునేందుకు జరిగే ఆ పోరాటం ట్రేడ్‌యూనియన్ సంఘాల ప్రాతిపదికమీదనే (పశ్చిమ దేశాల్లో ట్రేడ్‌యూనియన్ల ద్వారా; రష్యాలో తాత్కాలిక వృత్తి సంఘాల ద్వారా, కరపత్రాలు వగైరాల ద్వారా) సాగింపబడగలదు. అందువల్ల, ''ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని'' కల్పించడం అంటే అర్థం ఏమిటంటే, యీ వృత్తులకు చెందినవారి డిమాండ్లను తీర్చుకోవడం, ప్రతి ఒక విడి వృత్తిలోనూ పని పరిస్థితులను ''చట్టాల ద్వారానూ, ప్రభుత్వ చర్యల ద్వారానూ'' మెరుగొనర్చుకోవడం (మర్తీనొవ్ తన వ్యాసపు 43వ పేజీలో యీ విషయాన్ని స్పష్టంచేశాడు). కార్మికుల ట్రేడ్‌యూనియన్లు అన్నీ చేసేదీ, యింతకు ముందు చేసినదీ సరిగా యిదే. విశేషంగా శాస్త్రీయ (అంతే కాకుండా ''విశేషంగా'' అవకాశవాద) వెబ్బ దంపతుల రచనలను చదవండి, ''ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం'' అన్న కర్తవ్యాన్ని బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్లు ఎన్నడో గుర్తించినట్లూ, చాలా కాలంగా ఆచరణలో పెడుతున్నట్లూ మీకు కనిపిస్తుంది. సమ్మె చేసే హక్కుకోసం, సహకార, ట్రేడ్‌యూనియన్ ఉద్యమాలకు చట్టపరంగా వున్న అవరోధాల తొలగింపుకోసం, మహిళల, బాలబాలికల రక్షణార్థం చట్టాలకోసం, ఆరోగ్య రక్షణ చట్టాలు, ఫ్యాక్టరీ చట్టాలు మొదలైనవాటి ద్వారా శ్రామికుల పరిస్థితులను మెరుగు పరచడంకోసం బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్లు చాలా కాలంగానే పోరాడుతున్నాయి.

కాగా, ''ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం'' అన్న ఆడంబర పదాలు ''మహా'' గంభీరంగానూ, విప్లవాత్మకంగానూ కనిపించినప్పటికీ, వాస్తవంలో సోషల్ డెమొక్రటిక్ ఉద్యమాన్ని ట్రేడ్‌యూనియన్ రాజకీయాల స్థాయికి దిగజార్చేందుకు సాంప్రదాయికంగా జరిగే ప్రయత్నానికి తెరమరుగుగా మాత్రమే ఉపయోగపడుతాయి. ''జీవితాన్ని విప్లవాత్మకం చెయ్యడాన్నికన్న పిడిసూత్రాన్ని విప్లవాత్మకం చెయ్యడాన్ని ఉన్నత స్థానం''*లో

* ''రబోచెయె దేలొ,'' సంచిక 10, పేజి 60. నేను పైన పేర్కొన్న మన ఉద్యమపు ప్రస్తుత అవ్యవస్థిత స్థితిలో ''వాస్తవ ఉద్యమపు ప్రతి ఒక అడుగూ, ఓ డజను కార్యక్రమాలకన్న ఎక్కువ ముఖ్యమైనది'' అన్న సూత్రానికే మర్తీనొవ్ చేసే సొంత వ్యాఖ్యానం

ఉంచుతోందని చెప్పబడే "ఇస్క్రా" పాక్షిక దృష్టిని సరిదిద్దడం అన్న ముసుగులో, అదేదో పూర్తిగా కొత్తది అన్నట్లు ఆర్థిక సంస్కరణలకోసం పోరాటాన్ని మన ముందు పెడుతున్నారు. నిజానికి, "ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం" అన్న మాటలకు అర్థం ఆర్థిక సంస్కరణలకోసం పోరాటం అని తప్ప మరేమీ కాదు. తన మాటల అర్థాన్ని తను గ్రహించే వుంటే, మర్తీనొవ్ స్వయంగా సరళమైన యీ నిర్ణయానికి వచ్చివుండును. "ఇస్క్రా" వంక తన ఫిరంగుల్లో మిక్కిలి పెద్ద వాటిని బారుచేసి, అతనిలా అంటాడు: "ఆర్థిక దోపిడికీ, నిరుద్యోగానికీ, కరువు మొదలైన వాటికీ వ్యతిరేకంగా చట్టపరమూ, పాలనా సంబంధమైన చర్యలకోసం మన పార్టీ, ప్రభుత్వం ముందు నిర్దిష్టమైన డిమాండ్లను పెట్టివుండగలిగేది, పెట్టివుండవలసింది." ("రబోచెయె దేలొ," సంచిక 10, పేజీలు 42–43.) చర్యలకోసం నిర్దిష్టమైన డిమాండ్లు – దీని అర్థం సామాజిక సంస్కరణలకోసం డిమాండ్లు అని కాదా? నిష్పాక్షికులైన పాఠకులను నేను మరో ప్రశ్న అడుగుతాను: "రబోచెయె దేలొ"వాళ్లు (ప్రస్తుతం ఉపయోగంలోకి వచ్చిన యీ అవకతవక పదబంధాన్ని వాడినందుకు నన్ను మన్నించగోరుతున్నాను.) "ఇస్క్రా"తో తమ అభిప్రాయ భేదాన్ని గురించి చెప్తూ, ఆర్థిక సంస్కరణలకోసం పోరాడే అవసరాన్ని గురించిన తమ సూత్రాన్ని ప్రతిపాదిస్తున్న దృష్ట్యా, వాళ్లని ప్రచ్ఛన్న బెర్న్‌స్టైనియన్లని నేను అన్నప్పుడు వాళ్లమీద అపనింద మోపుతున్నానా?

సంస్కరణలకోసం పోరాటం అన్నది విప్లవవాద సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ఎప్పుడూ అంతర్భాగంగా వుంటూనే వస్తోంది. అయితే ఆ "ఆర్థిక" ఆందోళనను అది, రకరకాల డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టేందుకోసమే కాకుండా (ప్రధానంగా) అది నిరంకుశ ప్రభుత్వంగా ఉండటం మానుకోవాలన్న డిమాండును కూడా పెట్టేందుకు వినియోగించుకుంటుంది. అంతే కాకుండా అది, ప్రభుత్వం ముందు పెట్టే తన యీ డిమాండును, ఆర్థిక పోరాట ప్రాతిపదికపైన మాత్రమే కాకుండా, మొత్తంగా ప్రజా జీవితం, రాజకీయ జీవితం ప్రాతిపదికపైన ముందుకు తీసుకురావడాన్ని తన విధిగా పరిగణిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, సంస్కరణలకోసం జరిగే పోరాటాన్ని మొత్తం పోరాటంలో ఒక భాగం మాదిరిగా, స్వాతంత్ర్యంకోసం, సోషలిజంకోసం జరిగే విప్లవ పోరాటంలో ఒక అంతర్భాగంగా చేస్తుంది. అయితే, మర్తీనొవ్ దశల సిద్ధాంతాన్ని ఓ కొత్త రూపంలో పునరుజ్జీవితం చేసి, రాజకీయ పోరాటానికి పూర్తిగా ఆర్థిక అభివృద్ధి పంథాను నిర్దేశించేందుకు తంటాలుపడుతున్నాడు. విప్లవోద్యమం ఉచ్చస్థితిలో వున్న యీ తరు

---

యిది. నిజానికి యిది, "ఉద్యమమే సర్వస్వం, అంతిమ లక్ష్యం ఏమీ కాదు" అన్న బెర్న్‌స్టైన్ కుఖ్యాత వాక్యానికి, కేవలం రష్యన్ అనువాదం తప్ప మరేమీ కాదు.

ణంలో, సంస్కరణలకోసం పోరాడవలసిన ఒక ప్రత్యేక "కర్తవ్యం" అనబడేదాన్ని ముందుకు తేవడం ద్వారా, అతను పార్టీని వెనక్కి లాక్కుపోయి, ఒకవంక "ఆర్థికవాద" అవకాశవాదం చేతుల్లోనూ, మరోవంక ఉదారవాద అవకాశవాదం చేతుల్లోనూ పడేస్తున్నాడు.

ఈ విషయాన్ని యింకా కొంచెం పరిశీలిద్దాం. సంస్కరణలకోసం పోరాటాన్ని "ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం" అన్న గంభీరమైన ప్రతిపాదన వెనుక బిడియంగా మరుగుపరచి, అదేదో ప్రత్యేకాంశం అన్నట్లు, ప్రత్యేకించి ఆర్థిక (నిజానికి, ప్రత్యేకించి ఫ్యాక్టరీ) సంస్కరణలను మాత్రమే మర్తీనొవ్ ముందుకు తెచ్చాడు: అతనలా ఎందుకు చేశాడన్నదానికి మనకి కారణం తెలియదు. బహుశా, అజాగ్రత్తా? అయితే, అతని మనస్సులో "ఫ్యాక్టరీ" సంస్కరణలు కాకుండా మరేమైనా ఉండివుంటే, నేను పైన పేర్కొన్న, అతని ప్రస్తావన యావత్తూ, మొత్తం అర్థరహితమైందే అవుతుంది. ప్రభుత్వం ఆర్థిక రంగంలో మాత్రమే "రాయితీలను" యివ్వడం సాధ్యమనీ, సంభవమనీ అతను పరిగణించడం వల్లనే బహుశా, అతనలా చేశాడేమో?"* అదే అతని అభిప్రాయమైతే, అదొక చిత్రమైన దుర్భ్రమే అని చెప్పవలసివుంటుంది. కొరడా దెబ్బలు, ప్యాస్‌పోర్టులు, భూమి విడుదల చెల్లింపులు,[169] మత తెగలు, సెన్సార్‌షిప్ వగైరా వగైరాలను గురించిన శాసనాల ద్వారా కూడా రాయితీలు సంభవమే కాకుండా, యివ్వబడ్డాయి. "ఆర్థిక" రాయితీలు (లేక కుహనా రాయితీలు) ప్రభుత్వం దృష్టిలో, మిక్కిలి చౌకగా తేలిపోయేవి, ప్రయోజనకరమైనవి. ఎందుకంటే, వీటి ద్వారా అది, కార్మిక జనసామాన్యపు విశ్వాసాన్ని చూరగొనాలని ఆశిస్తుంది. సరిగ్గా యిదే కారణంగా, సోషల్ డెమోక్రట్లమైన మనం, ఎటువంటి పరిస్థితుల్లోనూ లేక ఏవిధంగానూ కూడా, ఆర్థిక సంస్కరణలకు అధికతర ప్రాధాన్యాన్ని ఆపాదిస్తామన్న లేక వాటిని ప్రత్యేక ప్రాధాన్యం కలిగినవిగా పరిగణించడం వగైరా చేస్తామన్న అభిప్రాయానికి (లేక అపార్థానికి) ఆధారం కల్పించకూడదు. పైన పేర్కొనబడిన చట్టబద్ధమైన ప్రభుత్వ చర్యలకోసం నిర్దిష్టమైన డిమాండ్లను గురించి ప్రస్తావిస్తూ, మర్తీనొవ్ యిలా రాశాడు: "అటువంటి డిమాండ్లు కేవలం వ్యర్థపదాలుగానే వుండిపోవు, ఎందుకంటే, ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశంగల ఆ డిమాండ్లను కార్మిక జనసామాన్యం క్రియాశీలంగా బలపరచవచ్చు...." మనం ఆర్థికవాదులం కాము, అబ్బే, ఎంత మాత్రం కాము! మనం, నిర్దిష్టమైన ఫలితాలు కలిగే "అవకాశం" ముందు, బెర్న్‌స్టైన్లు, ప్రొకొపొవిచ్‌లు, స్త్రూవెలు, ఆర్. ఎమ్.లు, ప్రభృతుల మాదిరిగా, దాసబుద్ధితో మోకరిల్లుతాం, అంతే!

---

* పేజి 43. "ప్రభుత్వం ముందు కొన్ని ఆర్థిక డిమాండ్లను పెట్టమని నేను కార్మికులకు సలహా యిస్తున్నానంటే, నిరంకుశ ప్రభుత్వం, ఆవశ్యకతకు లొంగి, ఆర్థిక రంగంలో కొన్ని రాయితీలను యివ్వడానికి సిద్ధంగా వుండటమే, అందుకు కారణం."

''కచ్చితమైన ఫలితాలను యిచ్చే అవకాశంలేని'' అన్నింటికీ కేవలం ''వ్యర్థపదం'' అని బోధపరచాలని మాత్రమే మేము (నార్సిస్ వరాహమూర్తితో బాటు) కోరుతున్నాం! కార్మిక జనసామాన్యం నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా జరిగే ప్రతి ఒక్క నిరసననూ, అది కచ్చితమైన ఫలితాలనిస్తాయన్న హామీని ఏమాత్రం యివ్వకపోయినా కూడా, క్రియాశీలంగా బలపరచడంలో అసమర్థులనీ (తమ కూపస్థమండూక భావాలనే కార్మికులకు ఆపాదించే వాళ్లు ఎంతగా ప్రయత్నించినప్పటికీ, కార్మికులు తమ సామర్థ్యాలను ఎన్నడో రుజువుచేసుకో లేదన్నట్లు) వాదించేందుకు మాత్రమే మేము ప్రయత్నిస్తున్నాం!

ఉదాహరణకు, నిరుద్యోగ, క్షామాల నిర్మూలనకోసం మర్తీనొవ్ స్వయంగా ముందుకు తెచ్చిన ''చర్యలనే'' తీసుకుందాం. ''జీవితాన్ని విప్లవాత్మకం చెయ్యడాన్నికన్న పిడి సూత్రాన్ని విప్లవాత్మకం చెయ్యడాన్ని ఎప్పుడూ మరింత ఉన్నతంగా పరిగణించే'' ''ఇస్క్రా'' నిరుద్యోగానికీ యావత్తు పెట్టుబడిదారీ వ్యవస్థకీ మధ్యగల విడదీయరాని సంబంధాన్ని వివరించేందుకు ప్రయత్నించి, ''కరువు రాబోతోంది'' అని హెచ్చరిక చేసి, పోలీసులు ''కరువు బాధితులకు వ్యతిరేకంగా జరిపే పోరాటాన్నీ,'' ఘాతుకమైన ''తాత్కాలిక కఠిన కారాగార శిక్షా నిబంధనలనూ''[170] బహిర్గతంచేసి ఖండించగా; ''జర్యా'' కరువును గురించి తను రాసిన ''దేశ వ్యవహారాల సమీక్ష''లో ఒక భాగాన్ని ఆందోళనకు పనికి వచ్చే చిన్న పుస్తకం రూపంలో విడిగా ముద్రించి వెలువరించగా; ''రబోచెయె దేలో'' అది వాగ్దానం చేసినదాన్ని బట్టి నిర్ణయిస్తే, ''ప్రత్యక్ష ఫలితాలను యిచ్చే అవకాశంగల,'' ''చట్టబద్ధమైన, ప్రభుత్వ చర్యలకోసం నిర్దిష్టమైన [బిల్లుల రూపంలోనా?] డిమాండ్ల'' పథకాన్నొకదాన్ని రూపొందించడంలోనూ, విపులీకరించడంలోనూ నిమగ్నమై వుంది. కాని, ఓరి భగవంతుడా! ఈ ''పాక్షిక'' సంకుచిత ఛాందస సిద్ధాంతజడులు, ''సాక్షాత్తూ జీవితపు'' పిలుపులకే ఎంత బధిరులుగా వున్నారో! వాళ్ల వ్యాసాల్లో – ''ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశంగల'' ''నిర్దిష్టమైన డిమాండు'' ఓహ్ దారుణం! ఒక్కగా నొక్కటి! – మీరు ఊహించుకోగలరా? – ఒక్కగానొక్కటి కూడా లేదు! పాపం సిద్ధాంత జడులు! వాళ్లని క్రిచేవ్స్కీల దగ్గరకీ, మర్తీనొవ్‌ల దగ్గరకీ పంపి, ఎత్తుగడలన్నవి అభివృద్ధి క్రమం అనీ, అభివృద్ధి చెందేది, వగైరాలనీ, ఆర్థిక పోరాటా నికే రాజకీయ స్వభావాన్ని కల్పించాలనీ శిక్షణ యిప్పించాలి!

''యజమానులకూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికుల ఆర్థిక పోరాటానికి [''ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం!''] దాని తక్షణ విప్లవాత్మక ప్రాముఖ్యంతో బాటు, యీ కింది ప్రాముఖ్యం కూడా వుంది: తమకు రాజకీయ హక్కులు లేవన్న వాస్తవాన్ని కార్మికులకు అది నిరంతరాయంగా స్ఫురింపచేస్తూవుంటుంది. (మర్తీనొవ్, పేజి 44.) పైన యింతకుముందే చెప్పినదాన్ని నూరో సారో, వెయ్యో సారో పునశ్చరణచేసేందుకు కాక, ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా కార్మికుల ఆర్థిక పోరాటం''

గూర్చిన మర్తీనొవ్‌యొక్క అద్భుతమైన యీ కొత్త సూత్రం విషయంలో ఆయనకి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పేందుకే నేనీ వాక్యాలను ఉల్లేఖిస్తున్నాను. మర్తీనొవ్ వజ్రపు తునక లాంటి మాట చెప్పాడు! ఆర్థికవాదుల మధ్య పాక్షిక అభిప్రాయభేదాలనూ, అభిప్రాయ భేదాల్లోని ఛాయలనూ తొలగించడంలో అఖండమైన నైపుణ్యాన్నీ, ప్రతిభనూ ప్రదర్శించిన మర్తీనొవ్‌యొక్క సుస్పష్టమూ, సంక్షిప్తమూ అయిన యీ సూత్రీకరణ ఆర్థికవాద సారాంశాన్ని – "అందరు కార్మికుల పరిస్థితులనూ మెరుగొనర్చడం కోసం, సార్వత్రిక ప్రయోజనార్థం తాము సాగించే రాజకీయ పోరాటానికి"* కార్మికులకు పిలుపు యివ్వడం దగ్గర మొదలై, దశల సిద్ధాంతంగుండా కొనసాగి, "అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల" వగైరాలపై మహాసభ తీర్మానంలో ముగిసి – వ్యక్తం చేసింది! "ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" అన్నది సరిగా ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాలే, వాటికీ, సోషల్ డెమొక్రటిక్ రాజకీయాలకీ యింకా చాలా దూరంగా వుంది.

## ఆ) ప్లెహానొవ్ భావాలకు మర్తీనొవ్ ప్రగాఢత్వాన్ని చేకూర్చిన గాథ

"ఈమధ్య మనలో ఎంత పెద్ద సంఖ్యలో సోషల్ డెమొక్రటిక్ మహా విద్వాంసులు తయారయ్యారో!" – అని ఓ రోజున ఓ కామ్రేడ్ అన్నాడు. అలా అన్నప్పుడు అతని మన సులో, ఆర్థికవాదంపట్ల ఆశ్చర్యజనకమైన ఉన్ముఖత చాలామంది "విధిగా తమకు తామే" మహా సత్యాలను "అవగతం చేసుకుంటున్నారన్న విషయం (ఉదాహరణకు, ఆర్థిక పోరాటం, తమకు హక్కులు లేవన్న విషయాన్ని గురించి కార్మికులను ఆలోచించేటట్టు చేస్తుంది), అలా జేసే క్రమంలో వాళ్ళు, విప్లవాత్మక ఆలోచనా క్రమంలోనూ, విప్లవో ద్యమంలోనూ గతంలో జరిగిన అభివృద్ధినంతటినీ, ఆజన్మ మేధావుల మాదిరిగా పరమా సహ్యంతో నిర్లక్ష్యంచేస్తున్నారన్న విషయం మెదిలివుంటుంది. "మహా విద్వాంసుడు" మర్తీనొవ్ సరిగా అలాంటి ఆజన్మ మేధావి. "తక్షణ సమస్యలు" అన్న అతని వ్యాసాన్ని చూస్తే చాలు, అతను ఏవిధంగా అక్సెల్‌రోడ్ (అతన్ని గురించి మన "మహా విద్వాంసుడు" సహజంగానే ఒక్క మాట కూడా చెప్పడు) ఎన్నడో చెప్పినదాన్ని తనకు తానే అవగతం చేసుకుంటాడో, మాటవరుసకు, బూర్జువావర్గంలోని ఫలానా ఫలానా పొర వ్యతిరేకతను మనం నిర్లక్ష్యం చెయ్యజాలమని అతనెలా అర్థంచేసుకోనారంభిస్తున్నాడో ("రబోచెయె దేలొ," సంచిక 9,

---

* "రబోచయ మీస్ల్," "ప్రత్యేక అనుబంధం," పేజి 14.

పేజీలు 61, 62, 71; దీన్ని అక్సెల్‌రోడ్‌కి "రబోచెయె దేలొ" "సమాధానంతో" పేజీలు 22, 23–24 పోల్చిచూడండి, వగైరా) మనకి బోధపడుతుంది. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, అతను "అవగతం చేసుకుంటున్నాడు" అంత మాత్రమే, "ఆరంభిస్తున్నాడు" అంతమాత్రమే, అంతకు మించి మరేమీ లేదు, ఎందుకంటే, అక్సెల్‌రోడ్ భావాలను అంత తక్కువగా అర్థంచేసుకున్న మూలంగానే అతను "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" గురించి మాట్లాడుతున్నాడు. మూడేళ్లపాటు (1898–1901) "రబోచెయె దేలొ" అక్సెల్‌రోడ్‌ని అర్థంచేసుకోడానికి శతవిధాల ప్రయత్నించింది, కాని యింతవరకు అతన్ని అర్థంచేసుకోలేకపోయింది! "మానవ జాతి మాదిరిగా" సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం కూడా ఎప్పుడూ తనకి తాను సాధించగల కర్తవ్యాలనే పెట్టుకోవడం యిందుకుగల కారణాల్లో ఒకటా?

అయితే మన యీ "మహా విద్వాంసులు" అనేక విషయాల్లో అజ్ఞానులు కావడం వల్లనే విశిష్టులవలేదు (అది మరీ పెద్ద దురదృష్టం కదు!), తమ అజ్ఞానాన్ని గురించిన స్పృహ లేకపోవడం కూడా వాళ్ల విశిష్టతే. ఇదే అసలైన దురదృష్టం. మరి యీ దురదృష్టం మూలంగానే వాళ్లు మరేమీ ఆర్భాటం లేకుండా ప్లెహానొవ్ భావాన్ని "మరింత ప్రగాఢం" చేస్తున్నారు.

"మహా విద్వాంసుడు" మర్తీనొవ్ యిలా అంటాడు: "ప్లెహానొవ్ తన పుస్తకాన్ని ["రష్యాలో కరువుకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సోషలిస్టుల కర్తవ్యాలు"] రాశాక అనేక మార్పులు సంభవించాయి. కార్మికవర్గపు ఆర్థిక పోరాటాన్ని ఒక దశాబ్దం పాటు నడిపిన రష్యన్ సోషల్ డెమోక్రట్లు... పార్టీ ఎత్తుగడలకు విస్తృతమైన సైద్ధాంతిక ప్రాతిపదికను నిర్దేశించడంలో యీనాటివరకు యింకా సఫలురు కాలేదు. ఇప్పుడీ సమస్య మన ముందు నిలిచింది, మనం అలాంటి సైద్ధాంతిక ప్రాతిపదికను నిర్దేశించాలనుకుంటే, వెనక ప్లెహానొవ్ అభివృద్ధి చేసిన ఎత్తుగడల సూత్రాలను మనం తప్పనిసరిగా గణనీయంగా ప్రగాఢం చెయ్యాల్సివుంటుంది.... ప్రచారానికీ ఆందోళనకీ మధ్య తేడాకు సంబంధించిన మన నిర్వచనం ప్లెహానొవ్ నిర్వచనానికి భిన్నంగా ఉండాల్సివుంటుంది. [మర్తీనొవ్ సరిగా అంతకు ముందే ప్లెహానొవ్ మాటలను ఉల్లేఖించాడు: "ప్రచారకుడు ఒకడికో, కొద్దిమందికో అనేక భావాలను సూచిస్తాడు, ఆందోళనకారుడు ఒకేఒక్క భావాన్ని గాని లేక కొన్ని భావాలను గాని సూచిస్తాడు, కాని వాటిని అతను పెద్ద జనసమూహానికి సూచిస్తాడు."] ప్రచారం అన్నదాన్ని ప్రస్తుత సామాజిక వ్యవస్థను గురించిన విప్లవాత్మక వివరణగా మనం అర్థంచేసుకుంటాం; ఈ వివరణ సామాజిక వ్యవస్థ పూర్తి స్వరూపాన్ని గురించి జరుగు

తుందా, దాని పాక్షిక వ్యక్తీకరణలను గురించి జరుగుతుందా అన్నదీ, అది వ్యక్తులకు గ్రాహ్యమయ్యే రూపంలో జరుగుతుందా లేక విస్తృత జనసమూహానికి గ్రాహ్యమయ్యే రూపంలో జరుగుతుందా అన్నదీ అప్రస్తుతం. ఆందోళన అంటే, ఆ మాటకి గల కచ్చితమైన అర్థంలో [sic!], నిర్దిష్టమైన, కచ్చితమైన కార్యాచరణకు పూనుకోవలసిందిగా జనసామాన్యానికి పిలుపుగానూ, సామాజిక జీవితంలో శ్రామికవర్గపు ప్రత్యక్ష విప్లవాత్మక జోక్యానికి పిలుపుగానూ మనం అర్థంచేసుకుంటాం.''

మర్తీనొవ్ ధర్మమా అని, మరింత కచ్చితమూ, మరింత ప్రగాఢమూ అయిన కొత్త పదజాలాన్ని కనుగొన్నందుకు రష్యన్, అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని నేను అభినందిస్తున్నాను. ఇంతవరకూ మనం (ప్లెహానొవ్‌తోబాటూ, అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకులు అందరితోబాటూ), ఉదాహరణకు నిరుద్యోగ సమస్యను పరిశీలించే ప్రచారకుడు, సంక్షోభాల పెట్టుబడిదారీ స్వభావాన్నీ, ఆధునిక సమాజంలో వాటి అనివార్యతకుగల కారణాన్నీ, యీ సమాజాన్ని సోషలిస్టు సమాజంగా మార్చవలసిన ఆవశ్యకతనూ వివరించాలని భావించాం. క్లుప్తంగా చెప్పాలంటే, ప్రచారకుడు ''అనేక భావాలను,'' నిజంగానే అనేకానేక భావాలను ముందుపెట్టాలి. వాటన్నింటినీ సమగ్రంగా (సాపేక్షంగా) కొద్దిమంది మాత్రమే అర్థంచేసుకోగలుగుతారు. అయితే, ఆందోళనకారుడు, అదే అంశాన్ని గురించి మాట్లాడేటప్పుడు, ఒక వాస్తవాన్ని, తన శ్రోతల్లో అత్యధికులకు తెలిసివుండి, కొట్టవచ్చినట్లు కనిపించే వాస్తవాన్ని, మాట వరసకు, ఒక నిరుద్యోగ కార్మికుని కుటుంబం ఆకలికి గురై మరణించడాన్ని, నానాటికీ పెరిగిపోతున్న దుర్భర దారిద్ర్యం వగైరాలను ఉదాహరణగా తీసుకొని, అందరికీ తెలిసిన యీ వాస్తవాన్ని ఉపయోగించుకొని, ''జనసామాన్యానికి'' ఒకేఒక భావాన్ని, ఉదాహరణకు, ఒకవంక సంపద మేటపడటం, మరో వంక దారిద్ర్యం పెరిగిపోవడం — వీటి మధ్య వున్న వైరుధ్యంలోని అర్థరాహిత్యాన్ని వివరించేందుకు తన సర్వశక్తులనూ వినియోగిస్తాడు; ఘోరమైన యీ అన్యాయానికి వ్యతిరేకంగా — యీ వైరుధ్యాన్ని గురించిన మరింత సమగ్రమైన వివరణను ప్రచారకుడికి వదిలిపెట్టి — జనసామాన్యంలో అసంతృప్తినీ, కోపాన్నీ రెచ్చగొట్టేందుకు కృషిచేస్తాడు. కాబట్టి, ప్రచారకుడు ప్రధానంగా అచ్చు మాటద్వారా కృషిచేస్తాడు; ఆందోళనకారుడు నోటి మాటద్వారా కృషిచేస్తాడు. ప్రచారకుకి వుండవలసిన లక్షణాలు ఆందోళనకారుడికి వుండవలసిన లక్షణాలకు భిన్నమైనవి. ఉదాహరణకు, కౌట్స్కీ, లాఫార్గ్‌లను ప్రచారకులనీ, బేబెల్, గెడ్‌ను ఆందోళనకారులనీ మనం పిలుస్తాం. ప్రత్యక్ష కార్యకలాపాలకు సంబంధించి ఒక మూడవ రంగాన్ని, లేక మూడో విధిని వేర్పరచి, యీ విధిలో ''నిర్దిష్టమైన, కచ్చితమైన కార్యాచరణలకు పూనుకోవలసిందిగా జనసామాన్యానికి పిలుపు''ను చేర్చడం పరమ అర్థ

రహితమైన విషయం, ఎందుకంటే, ఒక విడి చర్యగా యీ ''పిలుపు'' అన్నది సహజంగానూ, తప్పనిసరిగానూ సైద్ధాంతిక గ్రంథానికీ, ప్రచార పుస్తకానికీ, ఆందోళనోపన్యాసానికీ అనుబంధంగానైనా వుంటుంది, లేకపోతే కేవలం నిర్వహణ బాధ్యతకి సంబంధించిన విషయంగానైనా వుంటుంది. ఉదాహరణకు, ధాన్యపు సుంకాలకు వ్యతిరేకంగా జర్మన్ సోషల్ డెమో్క్రట్లు యీనాడు జరుపుతున్న పోరాటాన్ని తీసుకుందాం. సిద్ధాంతవేత్తలు సుంకాల విధానాన్ని గురించి పరిశోధక వ్యాసాలు రాస్తారు, మాటవరుసకు, వాణిజ్య ఒప్పందాలకూ, స్వేచ్ఛా వాణిజ్యానికీ అనుకూలంగా పోరాటం జరపవలసిందిగా ''పిలుపు''ను వాటిలో జోడిస్తారు. ప్రచారకుడు పత్రికల్లోనూ, ఆందోళనకారుడు బహిరంగోపన్యాసాల్లోనూ యిదే పిలుపు ఇస్తారు. ప్రస్తుతం, జనసామాన్యం జరిపే ''నిర్దిష్ట కార్యాచరణ'' అంటే ధాన్యపు సుంకాలను పెంచడానికి వ్యతిరేకంగా మహజర్లపై సంతకాలు పెట్టి రైహ్‌స్టాగ్ [జర్మన్ పార్లమెంటు]కి సమర్పించడం. ఈ కార్యాచరణకు పిలుపు పరోక్షంగా, సిద్ధాంతవేత్తల నుంచీ, ప్రచారకులనుంచీ, ఆందోళనకారులనుంచీ, ప్రత్యక్షంగా, సంతకాలు పోగుచేసేందుకోసం మహజరు పత్రాన్ని ఫ్యాక్టరీలకూ, ప్రైవేటు యిళ్లకూ తీసుకువెళ్లే కార్మికులనుంచీ వస్తోంది. ''మర్తీనొవ్ పదజాలం'' ప్రకారం కౌట్స్కీ, బేబెల్ యిద్దరూ ప్రచారకులు కాగా, సంతకాలు పెట్టించేవాళ్లు ఆందోళనకారులు కదా?

ఈ జర్మన్ ఉదాహరణవల్ల Verballhornung అనే జర్మన్ మాట నాకు గుర్తొస్తోంది. ఈ మాటకు శబ్దార్థం ఏమిటంటే ''బాల్‌హోర్నీకరణ.'' 16వ శతాబ్దానికి చెందిన యోహన్ బాల్‌హోర్న్ అనే యీ లైప్జిగ్ ప్రచురణకర్త బాలబాలికల కోసం ఒక పాఠ్యపుస్తకం ప్రచురించాడు. దానిలో, ఆనాటి ఆచారం ప్రకారం, కోడిపుంజ బొమ్మ ఒకటి అచ్చువేశాడు. అయితే, ఆ కోడిపుంజు కాళ్లకి మామూలుగా వుండే కాలిగోళ్లు లేకపోగా, దాని పక్కనే ఓ రెండు గుడ్లు వున్నాయి. ఆ పాఠ్య పుస్తకం అట్టమీద ''యోహన్ బాల్‌హోర్న్‌చేత సంస్కరింపబడిన ముద్రణ'' అని అచ్చువెయ్యబడింది. అప్పటినుండి, జర్మన్లు అలాంటి ఏ ''సంస్కరణ''నైనా కూడా – అంటే మెరుగుపరచడానికి బదులు ఉన్న గోడును చెడగొట్టడాన్ని Verballhornung అని పిలుస్తూ వుంటారు. కాగా, మర్తీనొవ్‌లు ప్లెహానొవ్‌ను ''మరింత ప్రగాఢం చేసిన'' తీరును చూసినప్పుడు బాల్‌హోర్న్‌ని జ్ఞాపకంచేసుకోకుండా ఎవరూ ఉండలేరు.

మన యీ ''మహా విద్వాంసుడు'' యీ గందరగోళాన్ని ఎందుకు ''సృష్టించినట్లు''? ''ఒకటిన్నర దశాబ్దాల క్రితం ప్లెహానొవ్ చేసినట్లే, యిప్పుడు 'ఇస్క్రా' వ్యవహారానికి ఒక పార్శ్వం పట్లనే శ్రద్ధ చూపుతోంది'' (39) అని నిరూపించడంకోసమే. '''ఇస్క్రా' విషయంలో, ప్రచార కర్తవ్యాలు ఆందోళన కర్తవ్యాలను, కనీసం ప్రస్తుతానికైనా, వెనక్కినెట్టేశాయి'' (52). ఈ చివరి సూత్రీకరణను మర్తీనొవ్ భాషలోంచి మామూలు మానవ

భాషలోకి అనువదించినట్లయితే (ఎందుకంటే, మానవాళి యిప్పటికింకా కొత్తగా ఆవిష్కరింపబడిన పదజాలాన్ని నేర్చుకోలేకపోయింది), దాని సారాంశం మనకి యిలా తేలుతుంది. 'ఇస్క్రా'కు సంబంధించి, రాజకీయ ప్రచార, రాజకీయ ఆందోళన కర్తవ్యాలు "కొన్ని ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశంగల" చట్టబద్ధ, ప్రభుత్వ చర్యలకోసం ప్రభుత్వానికి నిర్దిష్టమైన డిమాండ్లను సమర్పించే" కర్తవ్యాన్ని (లేక సామాజిక సంస్కరణల కోసం డిమాండ్లను, అంటే, మర్తీనొవ్ స్థాయికి యింకా ఎదగని పాత మానవాళి పాత పదజాలాన్ని వాడటానికి మనం అనుమతింపబడితే) వెనక్కి నెట్టేస్తున్నాయి. పై సూత్రీకరణను యీకింది దండయాత్రతో పోల్చిచూడవలసిందిగా పాఠకుడికి సూచిస్తున్నాను:

> "ఈ కార్యక్రమాలలో [విప్లవాత్మక సోషల్ డెమోక్రట్లు ప్రతిపాదించిన కార్యక్రమాలలో] మనకి ఆశ్చర్యం కూడా కలిగించే విషయం ఏమిటంటే, పార్లమెంటులో [రష్యాలో యిది లేనే లేదు] కార్మికుల కార్యకలాపాల ఉపయోగాలపై ఎడతెగని వక్కాణింపు. అయితే వాళ్లు [తమ విప్లవాత్మక నిహిలిజం కారణంగా] ఫ్యాక్టరీ వ్యవహారాలపై (యివి రష్యాలో వున్నాయి) నియమాలను రూపొందించే ఫ్యాక్టరీ యజమానుల సమితుల్లో కార్మికుల భాగస్వామ్యపు ప్రాధాన్యాన్ని... లేక కనీసం నగరపాలక సంఘాల్లో కార్మికుల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు...."

మహా విద్వాంసుడు మర్తీనొవ్ తనంతట తానుగా ఏ భావాన్నైతే అవగతం చేసుకుంటాడో, అదే భావాన్ని పై దండయాత్ర కర్త ఒక రకంగా మరింత నిష్కర్షగానూ, మరింత స్పష్టమైన పద్ధతిలోనూ వ్యక్తంచేశాడు. ఈ రచయిత పేరు ఆర్. ఎమ్.; యీ వ్యాసం "'రబోచయ మీస్ల్' 'ప్రత్యేకానుబంధం'"లో (పేజి 15) ప్రచురింపబడింది.

## ఇ) రాజకీయంగా బహిర్గతంచేసే ఖండనలు, "విప్లవ క్రియాశీలతకు శిక్షణ"

"ఇస్క్రా"కి వ్యతిరేకంగా "కార్మిక జనసామాన్యపు కార్యాచరణను పెంపొందించడం" అన్న తన సిద్ధాంతాన్ని ముందుకు తేవడంలో, మర్తీనొవ్ వాస్తవానికి, అదే క్రియాశీలతను తక్కువ చేసే తన ప్రయత్నాన్ని బయటపెట్టుకున్నాడు. ఎందుకంటే, ఏ ఆర్థిక పోరాటం ముందైతే ఆర్థికవాదులందరూ సాగిలపడుతున్నారో అదే ఆర్థిక పోరాటాన్ని మర్తీనొవ్, కార్మికుల కార్యాచరణమూ, దాని అత్యంత విస్తృత రంగాన్నీ పెంపొందించడంలో "అత్యంత

విస్తృతంగా ప్రయుక్తం చేయగల'' సాధనాల్లో ప్రత్యేకించి ముఖ్యమైనదని చెప్తున్నాడు. ఈ పొరపాటు మామూలే, ఎందుకంటే, యిది ప్రత్యేకించి మర్తినావ్‌కే చెందినదేమీ కాదు. నిజానికి, యీ కార్యాచరణను ''ఆర్థిక ప్రాతిపదికమీద మాత్రమే రాజకీయ ఆందోళన''కు మనం పరిమితం చేయనప్పుడు మాత్రమే, ''కార్మిక జనసామాన్యపు కార్యాచరణను పెంపొందించడం'' సాధ్యం, రాజకీయాందోళన ఆవశ్యక విస్తరణకు మౌలికమైన షరతు ఏమిటంటే, రాజకీయంగా బహిర్గతం చేసి ఖండించడమన్న దాన్ని సమగ్రంగా చెయ్యడమే. అలా బహిర్గతం చేసి ఖండించడం ద్వారా తప్ప, జనసామాన్యానికి రాజకీయ చైతన్యంలోనూ, విప్లవ క్రియాశీలతల్లోనూ శిక్షణ యివ్వడం మరి ఏవిధంగానూ సాధ్యం కాదు. కాగా, యీ రకమైన కార్యకలాపం మొత్తంగా అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు అత్యంత ముఖ్యకర్తవ్యాల్లో ఒకటి. ఎందుకంటే, రాజకీయ స్వాతంత్ర్యం ఉన్నా కూడా బహిర్గతం చేసి ఖండించే కార్యక్రమాల ప్రాముఖ్యం ఏమాత్రం తగ్గదు; అది, యీ కార్యక్రమాలు ఏ దిశా రంగాల్లో జరగాలన్నదాన్ని మాత్రమే మారుస్తుంది. ప్రత్యేకించి రాజకీయంగా బహిర్గతం చేసి ఖండించే తన ఉద్యమాన్ని విధి విరామాల్లేకుండా సాగిస్తున్న కారణంగానే జర్మన్ పార్టీ తన స్థానాన్ని బలపరచుకొని, తన పలుకుబడిని విస్తరింపజేసుకుంటోంది. నిరంకుశత్వం, పీడన, హింస, అధికార దుర్వినియోగాలకు సంబంధించిన అన్ని సందర్భాల విషయంలోనూ — వాటివల్ల ఏ వర్గం నష్టపడిందన్న దానితో ప్రసక్తి లేకుండా — ప్రతివర్తించేలా, దీనికితోడు, సోషల్ డెమోక్రటిక్ దృక్పథంనుంచి మాత్రమే ప్రతివర్తించేలా కార్మికులకు శిక్షణ కలిగించకపోతే, కార్మికవర్గ చైతన్యం నికరమైన రాజకీయ చైతన్యం కాజాలదు. నిర్దిష్టమైన, అన్నిటికన్న ముఖ్యంగా తాజా రాజకీయ వాస్తవాలనుంచీ, ఘటనలనుంచీ ప్రతి యితర సామాజిక వర్గాన్నీ, దాని మేధా, నైతిక, రాజకీయ జీవితపు అన్ని వ్యక్తీకరణలనూ పరిశీలించడాన్ని కార్మికులు నేర్చుకుంటేగాని, జనాభాలోని అన్ని వర్గాల, పొరల, గ్రూపుల జీవిత, కార్యకలాపాల అన్ని పార్శ్వాలకూ భౌతికవాద విశ్లేషణనూ, భౌతికవాద అంచనానూ అన్వయించడం ఎలాగో నేర్చుకుంటే గాని కార్మిక జనసామాన్యపు చైతన్యం నికరమైన వర్గచైతన్యం కాజాలదు. కార్మికవర్గపు దృష్టినీ, పరిశీలననూ, చైతన్యాన్నీ తనీగానూ, లేక ప్రధానంగానూ, కార్మికవర్గంమీద మాత్రమే కేంద్రీకరింపజేసేవాళ్ళు సోషల్ డెమోక్రట్లు కారు. ఎందుచేతనంటే, కార్మికవర్గం తనను గురించి తాను సంపాదించే జ్ఞానం ప్రత్యేకించి పూర్తిగా స్పష్టమైన సైద్ధాంతిక అవగాహనతోనే ముడిపడి వుండకుండా, లేక, మరో విధంగా చెప్పాలంటే, ఆధునిక సమాజపు వర్గాలు అన్నింటి మధ్యా సంబంధాలను గురించి సైద్ధాంతికంగా కంటె రాజకీయ జీవిత క్రమంలో సంపాదించుకున్న ప్రత్యక్ష అనుభవంతో ఎక్కువగా ముడిపడింది. ఈ కారణంగా, జనసామాన్యాన్ని రాజకీయోద్యమంలోకి లాగేందుకు అత్యంత విస్తృతంగా ప్రయుక్తం కాగల సాధనం ఆర్థిక

పోరాటమే అంటూ మన ఆర్థికవాదులు బోధించే భావం, ఆచరణ దృష్ట్యా అత్యంత హాని దాయకమూ, అభివృద్ధినిరోధకమూ అయినది. తను సోషల్ డెమోక్రట్ అయ్యేందుకు గాను, కార్మికుడి మనస్సులో భూస్వామీ, మతాధిపతీ, బడా ప్రభుత్వోద్యోగీ, రైతూ, విద్యార్థీ, బికారీ ఆర్థిక స్వభావం, సామాజిక, రాజకీయ వైఖరులను గురించిన స్పష్టమైన అవగాహన వుండాలి. వీళ్ల బలం ఏమిటో, బలహీనతలు ఏమిటో అతను తెలుసుకోవాలి. జనాభాలోని ప్రతి ఒక వర్గమూ, ప్రతి ఒక విభాగం తన స్వార్థ ప్రయత్నాలనూ, తన "అంతరంగాన్ని" <u>కప్పిపుచ్చుకునేందుకు</u> వాడే అన్ని నినాదాల, కుతర్కాల అర్థాన్నీ అతను గ్రహించాలి. విభిన్న సంస్థలూ, చట్టాలూ ఏ ప్రయోజనాలను, ఏవిధంగా వ్యక్తంచేస్తున్నాయో అతను అర్థంచేసుకోవాలి. అయితే, అతను యీ "స్పష్టమైన అవగాహనను" ఏ పుస్తకంనుంచీ పొందలేడు. ఒకానొక నిర్దిష్ట సమయంలో మన చుట్టూ ఏం జరుగుతోంది, ప్రతి ఒక్కడూ తన సొంత పద్ధతిలో, బహుశా గుసగుసలద్వారానే కావచ్చు, దేన్ని గురించి చర్చిస్తున్నాడు, ఫలానా ఫలానా ఘటనల్లో, ఫలానా ఫలానా గణాంక లెక్కల్లో, ఫలానా ఫలానా కోర్టు తీర్పులు వగైరా వగైరాల్లో ఏమి బయటపడుతోంది – యిలా ఆయా ఘటనలు జరిగీ జరగ్గానే, వాటి సజీవోదాహరణలను కార్మికుల ముందు పెట్టినప్పుడు, వాటి గుట్టుమట్లను బహిర్గతం చేసినప్పుడు మాత్రమే అటువంటి "స్పష్టమైన అవగాహనను" కార్మికుడు పొందగలుగుతాడు. జనసామాన్యానికి విప్లవాత్మక కార్యకలాపాల్లో శిక్షణ నివ్వడానికి ఆవశ్యకమూ, <u>ప్రధానమూ</u> అయిన ఒక షరతు ఏమిటంటే, సమగ్రంగా రాజకీయంగా బహిర్గతం చేసి ఖండించడమే.

పోలీసులు ప్రజలపట్ల పాశవికంగా ప్రవర్తించడంపట్ల, మైనారిటీ మత తెగల వాళ్లను చిత్రహింసలకు గురిచెయ్యడంపట్ల, రైతుల్ని కొరడాలతో బాదడంపట్ల, పత్రికలమీద కఠినమైన సెన్సార్ నిబంధనలను అమలుజరపడంపట్ల, సైనికులను యమబాధలు పెట్టడంపట్ల, అత్యంత నిరపాయమైన సాంస్కృతిక సంస్థలపైనా, వ్యవహారాలపైనా నిర్బంధకాండ అమలుజరపడంపట్ల, వగైరా. ఇన్ని అక్రమాలు జరుగుతూంటే, వీటికి వ్యతిరేకంగా రష్యన్ కార్మికులు విప్లవ కార్యాచరణకు ఎందుకింకా దిగడంలేదు? "ఆర్థిక పోరాటం" వాళ్లకి "ప్రేరణ" కలిగించకపోవడమేనా అందుకు కారణం? అటువంటి కార్యాచరణ ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశం యిస్తుందన్న నమ్మకం లేకపోవడమేనా కారణం? "ప్రత్యక్ష ఫలితాన్ని" పెద్దగా కలిగించకపోవడమేనా కారణం? కాదు. అటువంటి అభిప్రాయాన్ని కలిగి వుండటమంటే, తప్పు లేనివాళ్ల పైన తప్పు ఆపాదించడం మాత్రమే, తనలోనే కూపస్థమండూకతత్వం (లేక బెర్న్‌స్టైనిజం) పెట్టుకొని కార్మికజనం పైన దోషారోపణ చెయ్యడం అని నేను మరోమారు చెప్తున్నాను. జనసామాన్యపు ఆందోళనకు వెనక పడుతున్నందుకూ, ఘాతుకమైన అత్యాచారాలన్నింటినీ తగినంత విస్తృతంగా,

గట్టిగా, త్వరితంగా బహిర్గతం చేసి ఖండించనందుకూ మనల్ని మనమే తప్పు పట్టుకోవలసి వుంటుంది. మనం ఆ పని చేస్తే (మనం ఆ పని చేసితీరాలి, చెయ్యగలం కూడా), తమ జీవితంలో అడుగడుగునా తమను పీడించి, అణచివేస్తున్న దుష్టశక్తులే విద్యార్థుల్నీ, మైనారిటీ మతతెగలవాళ్లనీ, రైతుల్నీ, రచయితల్నీ అవమానాలకూ, అత్యాచారాలకూ గురిచేస్తున్నాయని యెంతో వెనకబడిన కార్మికుడు కూడా అర్థంచేసుకుంటాడు లేక అనుభూతి పొందుతాడు. ఎప్పుడైతే అతనా అనుభూతి పొందుతాడో, అప్పుడు, ఆ అత్యాచారాలన్నింటినీ ప్రతిఘటించాలన్న ప్రబలమైన కోర్కె స్వయంగా అతనిలోనే కలుగుతుంది. అప్పుడిక ఒక రోజున సెన్సారు అధికార్లమీద హేళన పూర్వకంగా అరుపులూ కేకలూ వెయ్యడం, మరో రోజున, రైతుల తిరుగుబాటును క్రూరంగా అణచివేసిన గవర్నరు యింటిముందు ప్రదర్శన చెయ్యడం, మూడో రోజున ఫాదరీ దుస్తులు ధరించి, మధ్య యుగం నాటి మత న్యాయస్థానం మాదిరిగా పనిచేసే పోలీసులకు పాఠం నేర్పడం వగైరా యెలాగో తెలుసుకుంటాడు. సంభవమైన అన్ని సమస్యలనూ బహిర్గతం చేసి ఖండిస్తూ కార్మిక జన సామాన్యం ముందుకు సకాలంలో తీసుకువచ్చేందుకు మనం చేసినది చాలా తక్కువ, దాదాపు అసలేమీ చెయ్యలేదనే చెప్పాలి. మనలో చాలామంది యిది మన విధ్యుక్త ధర్మం అని యిప్పటివరకు యింకా గుర్తించలేదు, పోతే యింకా ఫ్యాక్టరీ జీవితపు సంకుచిత పరిధుల్లో, అనాలోచితంగా "నీరస దైనందిన పోరాటం" వెనకవెనక కాళ్లీడ్చుకొంటూ పోతున్నాం. అటువంటి పరిస్థితుల్లో, "'ఇస్క్రా' నీరస దైనందిన పోరాటపు పురోగమన ప్రాధాన్యాన్ని కొంచెపరుస్తోందనీ, తద్భిన్నంగా ఉజ్వల, సమగ్ర భావాలను ప్రచారంచేస్తోందనీ" చెప్పడానికి (మర్తీనొవ్, పైన పేర్కొన్న రచన, పేజి 61) అర్థం పార్టీని వెనక్కి లాగడమూ, మన అసంసిద్ధతనూ, వెనుకబాటుతనాన్నీ సమర్థించడమూ, ప్రశంసించడమే.

జనసామాన్యానికి కార్యాచరణకు పిలుపు యిచ్చే విషయానికి సంబంధించినంతవరకు, పటిష్ఠమైన రాజకీయాందోళనా, సజీవమూ, ప్రభావశీలమూ అయిన పద్ధతిలో బహిర్గతం చేసి ఖండించే కార్యక్రమమూ అమలుజరిగిన వెంటనే, తనంతట తను అదీ జరుగుతుంది. నేరస్థుణ్ణి నేరం చేస్తూండగా పట్టుకొని, జనం ముందు అతని నేరాన్ని అన్ని చోట్లా వెన్వెంటనే బహిర్గతం చేసి ఖండించడం, దానికి అదే అనేక "పిలుపులు" యిచ్చినదానికన్న ఎక్కువ ఫలదాయకం అవుతుంది. తరచుగా జనానికి యీ "పిలుపులు" ఎవరిచ్చారో, ప్రదర్శన మొదలైనవాటికి ఆయా పథకాలు సూచించింది సరిగా ఎవరో తెలుసుకోవడం కూడా అసంభవమైపోతూవుంటుంది. కార్యాచరణకు పిలుపులు — మూకుమ్మడిగా కాకుండా నిర్దిష్టార్థంలో — కార్యాచరణ రంగంలో మాత్రమే యివ్వడం సాధ్యం; కార్యాచరణలోకి దిగినవాళ్లు, అందునా వెంటనే దిగినవాళ్లు మాత్రమే అలాంటి పిలుపులు యివ్వగలుగుతారు. సోషల్ డెమోక్రటిక్ ప్రచారకులంగా మన పని ఏమిటంటే, రాజకీయంగా బహిర్గతం

చేసి ఖండించే కార్యక్రమాన్నీ, రాజకీయాందోళననూ మనం మరింత ప్రగాఢమూ, విస్తృతమూ, తీవ్రమూ చెయ్యడమే.

సందర్భవశాత్తూ "కార్యాచరణకు పిలుపుల" విషయం గురించి ఒక మాట. కార్మికులకు ఎలాంటి ప్రత్యక్ష ఫలితాలనూ యిచ్చే అవకాశం ఎంతమాత్రం లేని వ్యవహారంలో, అంటే, విద్యార్థులను సైన్యంలోకి భర్తీచేసుకునే విషయంలో, క్రియాశీలంగా జోక్యంచేసుకొమ్మని, కార్మికులకు, వసంత కాలపు ఘటనలకు[171] ముందే, పిలుపు యిచ్చిన పత్రిక ఏదైనా వుందంటే అది ఒక్క "ఇస్క్రా"యే. "183 మంది విద్యార్థుల్ని సైన్యంలోకి భర్తీచేసుకోవడం" గురించిన జనవరి 11వ తేదీ ఉత్తరువు వెలువడిన వెంటనే, "ఇస్క్రా" యీ వ్యవహారంమీద ఒక వ్యాసాన్ని ప్రచురించింది (తన ఫిబ్రవరి సంచికలో, సంచిక 2), ఏ ప్రదర్శనా మొదలు కాకముందే, వెన్వెంటనే "విద్యార్థులకు అండదండలివ్వవలసిందిగా కార్మికులకు" పిలుపిచ్చింది, ప్రభుత్వపు తలబిరుసు సవాలును స్వీకరించవలసిందిగా "జనానికి" పిలుపిచ్చింది. నేనిక్కడ ఒక ప్రశ్న అడుగుతాను: మర్తీనొవ్ "కార్యాచరణకు పిలుపు"ను గురించి తెగ మాట్లాడటంతోబాటు, "కార్యాచరణకు పిలుపులను" ఓ ప్రత్యేక కార్యాచరణ రూపంగా సూచించాడు కదా, మరి అలాంటివాడు యీ పిలుపును గురించి ఒక్కమాట కూడా ఎందుకు చెప్పలేదు? దీని తర్వాత, "ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశం గల" డిమాండ్లకోసం పోరాటానికి తగినన్ని "పిలుపులను" యివ్వనందుకుగాను "ఇస్క్రా"ను ఏకపక్షంగా వ్యవహరించిందని ఆరోపించడమన్నది మర్తీనొవ్ విషయంలో కేవలం అల్పబుద్ధి కాక మరేమిటి?

మన ఆర్థికవాదులు, "రబోచెయె దేలొ"తో సహా, రాజకీయ చైతన్యంలో వెనుకబడిన కార్మికుల స్థాయితో సరిపెట్టుకొన్నారు గనుక, కొంత సాఫల్యం పొందారు. కాని సోషల్ డెమోక్రటిక్ కార్మికుడు, విప్లవాత్మక కార్మికుడు (మరి యిలాంటి కార్మికుల సంఖ్య పెరుగుతోంది) "ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశం గల" వగైరా డిమాండ్లకోసం పోరాటాన్ని గూర్చిన కబుర్లన్నింటినీ కోపంగా తోసిపుచ్చుతాడు. ఎందుకంటే, యిది, పైసపైసా కూడబెట్టడాన్ని గూర్చిన పాత పాటకు కొత్త బాణీ తప్ప మరేమీ కాదు. అటువంటి కార్మికుడు "రబోచయ మీస్ల్"కీ, "రబోచెయె దేలొ"కీ చెందిన సలహాదార్లకు యిలా చెప్తాడు: పెద్దమనుషులారా, మా అంతట మేమే చక్కగా చేసుకోగలిగిన పనిలో అనవసరంగా మీరు వేలుపెడుతున్నారు, అంతే కాకుండా, మీరు ఏయే పనులు చెయ్యవలసివుందో వాటిని మీరు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం సోషల్ డెమోక్రట్ల కర్తవ్యమన్న మీ ఉద్ఘాటనలో తెలివైనదేమీ లేదు. అది ఆరంభం మాత్రమే, అది సోషల్ డెమోక్రట్ల ప్రధాన కర్తవ్యం కాదు. ఎందుకంటే, రష్యాతోబాటు, ప్రపంచమంతటా ఆర్థిక పోరాటానికి రాజకీయ స్వభావాన్ని కల్పించడంలో స్వయంగా

పోలీసులే తరచుగా చొరవ తీసుకుంటున్నారు, ప్రభుత్వం ఎవరిని బలపరుస్తుందో అర్థంచేసుకోడాన్ని కార్మికులు స్వయంగా నేర్చుకుంటున్నారు.* "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా కార్మికుల ఆర్థిక పోరాటం" గురించి, ఏదో ఓ కొత్త అమెరికాను కనిపెట్టినట్లు మీరు పెద్దగా అట్టహాసం చేస్తున్నారు. రష్యా అంతటా, మిక్కిలి మారుమూల ప్రాంతాల్లో సైతం, సమ్మెలను గురించి మాత్రమే విని, సోషలిజాన్ని గురించి బొత్తిగా ఏమీ వినని కార్మికులు ఆ ఆర్థిక పోరాటాన్ని జరుపుతూనే వున్నారు. ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశం గల నిర్దిష్టమైన డిమాండ్లను ముందు పెట్టడంద్వారా మా కార్మికుల్లో మీరు ప్రేరేపించాలనుకొనే "కార్యకలాపాన్ని" మేము యింతకుముందే సాగిస్తున్నాం. మా రోజువారీ, పరిమిత ట్రేడ్‌యూనియన్ కృషిలో మేము నిర్దిష్టమైన యీ డిమాండ్లను, అతి తరచుగా మేధావులనుంచి ఎలాంటి తోడ్పాటూ లేకుండానే, ముందుపెడుతున్నాం. కాని అలాంటి కార్యకలాపం మాకు సరిపోదు. "ఆర్థిక" రాజకీయాలనే పల్చటి జావతో మాత్రమే సరిపెట్టుకొనే శిశువులం కాం మేము. ఇతరులకు

---

* "ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించాలి" అన్న డిమాండు, రాజకీయ కార్యాచరణ రంగంలో సద్యోజనితత్వానికి దాసోహాన్ని అత్యంత విస్పష్టంగా వ్యక్తంచేస్తోంది. చాలా తరచుగా, ఆర్థిక పోరాటం సద్యోజనితంగా అంటే, "మేధావివర్గం అనబడే విప్లవాత్మక సూక్ష్మజీవుల" జోక్యం లేకుండానే, వర్గ చైతన్యం కలిగిన సోషల్ డెమోక్రట్ల జోక్యం లేకుండానే రాజకీయ స్వభావాన్ని సంతరించుకుంటుంది. ఉదాహరణకు, సోషలిస్టుల జోక్యమేమీ లేకుండానే ఇంగ్లీషు కార్మికుల ఆర్థిక పోరాటం కూడా రాజకీయ స్వభావాన్ని సంతరించుకుంది. అయితే, ఆర్థిక ప్రాతిపదికమీద రాజకీయ ఆందోళనను నిర్వహించడంతోనే సోషల్ డెమోక్రట్ల కర్తవ్యం ముగిసిపోదు. ఈ ట్రేడ్‌యూనియన్ రాజకీయాలను సోషల్ డెమోక్రటిక్ రాజకీయ పోరాటంగా మార్చడం, కార్మికులను సోషల్ డెమోక్రటిక్ రాజకీయ చైతన్య స్థాయికి పెంచేందుకు కార్మికులలో ఆర్థిక పోరాటం ఉత్పన్నం చేసే రాజకీయ చైతన్య లేశాన్ని వినియోగించుకోవడం — యిదే వాళ్ల కర్తవ్యం. కాని మర్తీనోవ్‌లు కార్మికుల్లో సద్యోజనితంగా జాగృతమయ్యే రాజకీయ చైతన్యాన్ని పెంపొందించి, ఉత్తేజితం చేసేందుకు బదులు, సద్యోజనితత్వానికి దాసోహం అంటున్నారు. అంతేకాకుండా, తమకు స్వయంగా రాజకీయ హక్కులు లేవన్న విషయాన్ని కార్మికులు గ్రహించేలా ఆర్థిక పోరాటం "చేసి తీరుతుంది" అని విసుగుపుట్టేలా పదేపదే వల్లిస్తున్నారు. పెద్ద మనుషులారా, దురదృష్టకర విషయం ఏమిటంటే, సద్యోజనితంగా జాగృతమయ్యే ట్రేడ్‌యూనియన్ రాజకీయ చైతన్యం మీ సోషల్ డెమోక్రటిక్ కర్తవ్యాలను మీరు అర్థం చేసుకునేలా "ప్రేరేపించదు."

తెలిసిన విషయాలన్నీ తెలుసుకోవాలని మేం కోరుతున్నాం, రాజకీయ జీవితపు అన్ని పార్శ్వాలకు సంబంధించిన వివరాలనూ మేము నేర్చుకోవాలనుకుంటున్నాం, ప్రతి ఒక రాజకీయ ఘటనలోనూ క్రియాశీలంగా పాల్గోవాలని వాంఛిస్తున్నాం. మేమీ పని చెయ్యగలిగేందుకు వీలుగా, మాకు యింతకుముందే తెలిసినదాన్ని గురించి మేధావులు మాకు చెప్పడం తగ్గించాలి,* మాకు యింతవరకు యింకా తెలియనిదాన్ని గురించి, మా ఫ్యాక్టరీ అనుభవంనుంచీ

---

* ఒక ఆర్థికవాదికి ఒకానొక కార్మికుడిచ్చిన యీ ఊహాత్మక ఉపన్యాసానికి వాస్తవ ప్రాతిపదిక ఉందన్న విషయాన్ని నిరూపించేందుకుగాను, కార్మికోద్యమాన్ని గురించి నిస్సందేహంగా ప్రత్యక్ష పరిజ్ఞానం కలిగినవారూ, మా "సిద్ధాంతజడుల" పట్ల అందరిలోకీ తక్కువ పక్షపాతం కలవాళ్లూ అయిన యిద్దరు సాక్షులను యిక్కడ పేర్కొంటాను. ఎందుకంటే వారిలో మొదటి సాక్షి ఒక ఆర్థికవాది (ఈయన "రబోచెయె దేలో"ని సైతం రాజకీయ పత్రికగా పరిగణిస్తాడు!), పోతే రెండో ఆయన టెరరిస్టు. మొదటి సాక్షి "రబోచెయె దేలో" 6వ సంచికలో "సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికోద్యమం, సోషల్ డెమోక్రట్ల ప్రత్యక్ష కర్తవ్యాలు" అన్న శీర్షికతో అత్యంత వాస్తవికమూ, సుస్పష్టమూ అయిన ఒక వ్యాసం రచించాడు. ఆయన కార్మికుల్ని యీ కింది తరగతులుగా విభజిస్తాడు: (1) వర్గ చైతన్యం కలిగిన విప్లవవాదులు; (2) మధ్యశ్రేణికి చెందినవాళ్లు; (3) మిగిలిన సామాన్య కార్మిక జనం. ఈ మధ్యశ్రేణికి చెందినవాళ్లు "తమ తక్షణ ఆర్థిక ప్రయోజనాల్లోకన్న తరచుగా రాజకీయ జీవిత సమస్యల్లో ఎక్కువ ఆసక్తి కలిగివుంటారు. వీటికీ సాధారణ సామాజిక పరిస్థితులకీ మధ్య ఉండే సంబంధాన్ని వాళ్లు ఎన్నడో అర్థంచేసుకున్నారు" అంటాడాయన.... "రబోచయ మీస్ల్" "నిశితంగా విమర్శింపబడింది": "మాకు వెనక ఎప్పటినుంచో తెలిసిన, ఎన్నడో చదివిన విషయాలనే అది మళ్లీ మళ్లీ వల్లిస్తూవుంటుంది." "రాజకీయ సమీక్షలో యీసారి కూడా ఏమీ లేదు!" (పేజీలు 30–31). అయితే మూడవ శ్రేణి కూడా "ఎవరికైతే రాజకీయ సాహిత్యం దొరికే అవకాశం బహుసకృతుగా ఉంటుందో, ఎవరినైతే సారా కొట్లూ, చర్చీ యిప్పటికింకా ఎక్కువ భ్రష్టుల్ని చెయ్యలేదో, ఏ విభాగంలోనైతే తారతమ్యరీత్యా ఎక్కువమంది యువకులూ, చాలా తేలిగ్గా స్పందించేవాళ్లూ అయిన కార్మికులు ఉన్నారో ఆ కార్మికులు రాజకీయ సంఘటనలను క్రమరహితమైన పద్ధతిలో చర్చిస్తారు, విద్యార్థుల అల్లర్లు మొదలైన వాటిని గురించి లభించిన అసంపూర్తి వార్తలని గురించి ఆలోచిస్తారు." ఆ టెరరిస్టు యిలా రాస్తాడు: "...ఫ్యాక్టరీ జీవితానికి సంబంధించిన చిల్లరమల్లర వివరాలను — అదీ తమ సొంత పట్టణంలోవి కాదు, యితర పట్టణాల్లోవి — వాళ్లు ఒకటి రెండు సార్లు చదువుతారు, ఇక ఆ తర్వాత మరేమీ చదవరు... అవన్నీ వాళ్లకి చప్పచప్పగా కనిపిస్తాయి.... కార్మికుల పత్రికలో ప్రభుత్వాన్ని

"ఆర్థిక" అనుభవం నుంచీ మేమెన్నడూ తెలుసుకోలేనిదాన్ని గురించి, మాకు మరింత ఎక్కువగా చెప్పాలి, అంటే, రాజకీయ జ్ఞానాన్ని మాకు కలిగించాలి. మేధావులైన మీరు యీ జ్ఞానాన్ని సంపాదించగలరు, అంతేకాదు, మీరు దాన్ని యింతకు ముందరి కన్న శతసహస్రాధిక ప్రమాణంలో మాకు అందించడం మీ విధి; అంతేకాకుండా ఆ జ్ఞానాన్ని మీరు మాకు చర్చలు, పుస్తకాలు, వ్యాసాల రూపంలో మాత్రమే కాకుండా (అవి తరచుగా విసుగెత్తించేటట్టు ఉంటున్నాయి – యిలా నిర్మొగమాటంగా చెప్తున్నందుకు మన్నించండి), అన్ని జీవిత రంగాల్లోనూ మన ప్రభుత్వమూ, మన పాలకవర్గాలూ యీ క్షణంలో ఏం చేస్తున్నాయో, దాన్ని సుస్పష్టంగా బహిర్గతంచేసి ఖండించే రూపంలో మీరు మాకు ఆ జ్ఞానాన్ని అందించాలి. మీరీ విధి నిర్వహణకు మరింత ఉత్సాహంగా పూనుకోండి, "కార్మిక జన సామాన్యపు క్రియాశీలతని పెంపొందించడం" గురించిన కబుర్లు తగ్గించండి. మీరు అనుకునే దాని కన్న మేము చాలా ఎక్కువే క్రియాశీలంగా ఉన్నాం. "ప్రత్యక్ష ఫలితాలు" వస్తాయన్న ఆశలేని డిమాండ్లని సైతం మేము బాహాటమైన వీధి పోరాటం ద్వారా బలపరచగలం. మా క్రియాశీలతని "పెంపొందించడం" కాదు మీ పని, ఎందుకంటారేమో, మీలో తక్కువైనది సరిగ్గా ఆ క్రియాశీలతే. పెద్దమనుషులారా, సద్యోజనితత్వానికి దాసోహమనడం తగ్గించి, మీ సొంత క్రియాశీలతను పెంపొందించుకునే విషయం మరింత ఎక్కువగా ఆలోచించండి!

## ఈ) ఆర్థికవాదానికీ టెర్రరిజానికీ మధ్య సామాన్యాంశం ఏమిటి?

ఇంతకు ముందరి పాదపీఠికలో ఒక ఆర్థికవాది అభిప్రాయాన్నీ, ఒక సోషల్ డెమొక్రటికేతర టెర్రరిస్టు అభిప్రాయాన్నీ నేను ఉదహరించాను. వారిద్దరి మధ్యా యాదృచ్ఛికమైన ఏకాభిప్రాయం ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే స్థూలంగా చూసినప్పుడు, యీ రెండు అభిప్రాయాల మధ్యా అనివార్య, ఆంతరిక సంబంధం ఉంది, యాదృచ్ఛికమైనది కాదు. దీన్ని గురించి నేను తర్వాత చెప్తాను. ప్రస్తుతానికి మటుకు విప్లవ కార్యాచరణలో కార్మికులకు శిక్షణనిచ్చే సమస్యకు సంబంధించి మాత్రమే యిక్కడ దాన్ని పేర్కోవాలి. ఆర్థికవాదులకీ,

---

గురించి ఏమీ రాయకపోవడమంటే... కార్మికుల్ని చిన్న పిల్లలుగా పరిగణించడమే.... కార్మికులు చిన్న పిల్లలు కారు." (విప్లవ సోషలిస్టు గ్రూపు ప్రచురిస్తున్న "స్వొబోద,"[172] పేజీలు 69–70.)

యీనాటి టెరరిస్టులకీ మూలం ఒక్కటే, అదేమిటంటే సద్యోజనితత్వానికి దాసోహం అనడం. ఈ సద్యోజనితత్వాన్ని గురించి ఒక సాధారణ విషయం రూపంలో యింతకు ముందరి ప్రకరణంలో నేను వివరించాను. కాగా యిప్పుడిక్కడ, రాజకీయ కార్యకలాపాలపైనా, రాజకీయ పోరాటంపైనా దానికి ఉన్న ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని దాన్ని పరిశీలిద్దాం. మేం చెప్పిన విషయం పైకి విరోధాభాసగా కనిపించవచ్చు. ''విసుగు పుట్టించే దైనందిన పోరాటాలు'' అవసరం అని నొక్కిచెప్పేవాళ్లకీ, వ్యక్తులు అత్యంత ఆత్మత్యాగ పూరిత పోరాటాలు చెయ్యాలని చెప్పేవాళ్లకీ మధ్య వున్న తేడా అంత అధికమైనది. కాని యిదేమీ విరోధాభాస కాదు. ఆర్థికవాదులూ, టెరరిస్టులూ సద్యోజనితత్వపు భిన్న భిన్న ధ్రువాలకి దాసోహం అంటున్నారు. ఆర్థికవాదులు ''శుద్ధ, సరళ కార్మికోద్యమ'' సద్యోజనితత్వానికి దాసోహం అంటే, విప్లవ పోరాటాన్నీ కార్మికోద్యమాన్నీ సమగ్ర మొత్తంగా జోడించగల సామర్థ్యంగాని, అవకాశంగాని లేని మేధావుల తీవ్ర క్రోధానికి టెరరిస్టులు దాసోహం అంటారు, ఇది సంభవమన్న విశ్వాసాన్ని కోల్పోయినవాళ్లకీ, లేక యిది సంభవమని ఎన్నడూ విశ్వసించనివాళ్లకీ తమ క్రోధాన్నీ, విప్లవాత్మక కార్యశీలతనీ వ్యక్తం చెయ్యడానికి టెరరిస్టు కార్యకలాపాలు తప్ప మరో మార్గాన్ని కనుక్కోవడం కష్టమే. ఈవిధంగా, పైన నేను పేర్కొన్న సద్యోజనితత్వానికి దాసోహం అనే రూపాలు రెండూ కుఖ్యాత ''క్రెడో'' కార్యక్రమ ఆచరణారంభమే తప్ప వేరేమీ కావు: కార్మికులను ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం'' జరపనివ్వండి (''క్రెడో'' అభిప్రాయాలను మర్తీనొవ్ మాటల్లో చెప్పినందుకు నన్ను క్షమించాల్సిందిగా దాని రచయితను కోరుతున్నాను. ఆర్థిక పోరాటంలో కార్మికులు ''రాజకీయ వ్యవస్థకి వ్యతిరేకంగా ఘర్షణ పడతారు'' అని ''క్రెడో'' కూడా చెప్పింది కనుక, అలా అనేందుకు నాకు హక్కుందని తలుస్తాను), మేధావులను తమ స్వప్రయత్నాల ద్వారా రాజకీయ పోరాటాన్ని జరపనివ్వండి — టెరరిజం ఆసరాతోటే అనుకోండి! — ఎవరైతే యీ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టనారంభిస్తున్నారో వాళ్లు స్వయంగా యీ విషయాన్ని గ్రహించకపోయినప్పటికీ, యిది పట్టుబట్టవలసిందీ, పూర్తిగా తర్కబద్ధమూ, తప్పనిసరీ అయిన నిర్ధారణ. రాజకీయ కార్యకలాపానికి దాని తర్కం దానికి ఉంటుంది, అది అత్యంత సత్సంకల్పాలతో టెరరిజాన్ని అవలంబించమని కాని, లేకపోతే ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించమనిగాని నినాదాలిచ్చేవాళ్ల చైతన్యంతో సంబంధం లేకుండా ఉంటుంది. నరకానికి దోవ సత్సంకల్పాలతో నిండి వుంటుంది. మరి, యీ సందర్భంలో, సత్సంకల్పాలు ''కనీస ప్రతిఘటన మార్గం'' వెంట, శుద్ధ బూర్జువా ''క్రెడో'' కార్యక్రమ పంథాకి అనుగుణంగా సద్యోజనితంగా ఆకర్షింపబడకుండా ఎవరినీ కాపాడలేవు. చాలామంది రష్యన్ లిబరల్సు — తాము లిబరల్సు అని బాహాటంగా చెప్పుకునేవాళ్లూ, మార్క్సిజం వేషం వేసుకునే లిబరల్సూ — టెరరిజంపట్ల హృదయపూర్వకమైన సానుభూతి చూపు

తారన్నా, యీనాడు పెల్లుబుకుతున్న టెరరిస్టు ధోరణులను ఎగసన దోసేందుకు ప్రయత్నిస్తారన్నా అది ఎంతమాత్రమూ యాదృచ్ఛిక విషయం కాదు.

"విప్లవ సోషలిస్టు 'స్వొబోద'" గ్రూపు ఆవిర్భవించినప్పుడు, సాధ్యమైన అన్ని మార్గాల్లోనూ కార్మికోద్యమానికి తోడ్పడటాన్నే అది తన లక్ష్యంగా పెట్టుకుంది, కాని అది తన "కార్యక్రమం"లో టెరరిజాన్నీ, ఒక విధంగా చెప్పాలంటే, సోషల్ డెమోక్రసీనుండి తనని తాను విముక్తి చేసుకోవడాన్నీ చేర్చింది. ఈ విషయం పి. బి. అక్సెల్‌రోడ్ విశిష్ట కుశాగ్ర బుద్ధి మరోసారి రుజువుచేసింది. సోషల్ డెమోక్రటిక్ ఊగిసలాటలవల్ల కలగబోయే యీ ఫలితాలను గురించి ఆయన ఎన్నడో 1897 చివరలోనే ("ప్రస్తుత కర్తవ్యాలు, ఎత్తుగడలు"), తన సుప్రసిద్ధ "రెండు భవిష్యదవకాశాలు"ని రేఖామాత్రంగా చిత్రించినప్పుడే, అక్షరాలా జోస్యం చెప్పాడు. రష్యన్ డెమోక్రట్ల మధ్య దరిమిలా వచ్చిన అన్ని వివాదాలూ, అభిప్రాయభేదాలూ బీజప్రాయంగా యీ రెండు భవిష్యదవకాశాలలో యిమిడివున్నాయి.*

ఈ దృక్కోణంనుంచి చూసినప్పుడు, ఆర్థికవాద సద్యోజనితత్వం ముందు నిలబడలేకపోయిన "రబోచెయె దేలొ" టెరరిస్టు సద్యోజనితత్వం ముందు సైతం ఎందుకు నిలబడలేకపోయిందో మనకి స్పష్టంగా బోధపడుతుంది. టెరరిజాన్ని సమర్థిస్తూ "స్వొబోద"

---

* మర్తీనొవ్ "మరో, మరింత వాస్తవిక(?) ప్రత్యామ్నాయాన్ని ఊహిస్తాడు" ("సోషల్ డెమోక్రసీ, కార్మికవర్గం," పేజి 19): "శ్రామికవర్గపు ఆర్థిక పోరాట ప్రత్యక్ష నాయకత్వాన్ని సోషల్ డెమోక్రట్లు కైవసం చేసుకొని, తద్వారా(!) దాన్ని విప్లవ వర్గపోరాటంగా మార్చనైనా మార్చాలి...." "తద్వారా" అంటే, ఆర్థిక పోరాటపు ప్రత్యక్ష నాయకత్వంలో అని. ట్రేడ్‌యూనియన్ పోరాటానికి నాయకత్వం వహించడం మాత్రమే ట్రేడ్ యూనియనిస్టు ఉద్యమాన్ని విప్లవ వర్గపోరాటంగా మార్చివెయ్యడంలో విజయవంతమైందన్న దానికి మర్తీనొవ్ ఒక్కగానొక్క సందర్భాన్నైనా ఉదహరించగలడా? ఈ "మార్పు"ను తీసుకొచ్చేందుకుగాను సర్వతోముఖమైన రాజకీయ ఆందోళనకు "ప్రత్యక్ష నాయకత్వాన్ని" మనం క్రియాశీలంగా చేపట్టాలన్న సంగతి ఆయన అర్థం చేసుకోలేడా?... "లేకుంటే రెండో అవకాశం: కార్మికుల ఆర్థిక పోరాటపు నాయకత్వాన్ని సోషల్ డెమోక్రసీ తన చేతుల్లోకి తీసుకోకపోవడం ద్వారా... తన రెక్కలను తనే కత్తిరించుకుంటోంది...." పైన ఉదహరింపబడిన "రబోచెయె దేలొ" అభిప్రాయంలో "ఆర్థిక పోరాట నాయకత్వాన్ని తన చేతుల్లోకి తీసుకోనిది" "ఇస్క్రా". కాని "ఇస్క్రా" ఆర్థిక పోరాటాన్ని నడపడంలో "రబోచెయె దేలొ" కంటె చాలా ఎక్కువే చేస్తున్నదనీ, కాని, అది తనని తాను అంత మాత్రానికే పరిమితం చేసుకోదనీ, దాని పేరుతో తన రాజకీయ కర్తవ్యాలను సంకుచితం చేసుకోదనీ మనం చూశాం.

ముందుకు తెచ్చిన నిర్దిష్ట వాదనలను గమనించడం అత్యంత ఆసక్తిదాయకమైన విషయం. హింసాకాండ భయకంపితం చేసే పాత్రను అది "పూర్తిగా తిరస్కరిస్తుంది" ("విప్లవ తత్వ పునరుత్థానం," పేజి 64). పైగా దానికి విరుద్ధంగా దాని "ఉత్తేజక ప్రాముఖ్యాన్ని" నొక్కిచెప్తుంది. హింసాకాండ కావాలని పట్టుపట్టే సాంప్రదాయిక (సోషల్ డెమోక్రటిక్ పూర్వ) భావజాలపు విచ్చిత్తి పతనాల దశల్లో ఒకదాన్ని ప్రతిబింబించడంలో యిది విశిష్టమైంది. ప్రభుత్వాన్ని యిప్పుడు హింసాకాండ ద్వారా "భయకంపితం చెయ్యడం" కుదరదనీ, అందుకే దాన్ని టెరరిజం ద్వారా విచ్ఛిన్నం చెయ్యడం సాధ్యం కాదనీ చెప్పడమంటే హింసాకాండను ఒక పోరాట పద్ధతిగానూ, కార్యక్రమపు ఆమోదం లభించిన రంగంగానూ పూర్తిగా తిరస్కరించడంతో సమానమే. రెండో సంగతి, "విప్లవ కార్యాచరణ కోసం శిక్షణ యివ్వడానికి" సంబంధించి మన తక్షణ కర్తవ్యాలను అర్థంచేసుకోవడంలో వైఫల్యానికి యిది మరింత విశిష్టమైన ఉదాహరణ. కార్మికోద్యమానికి ఉత్తేజం కలిగించేందుకూ, దానికి "గట్టి ఊపు" నిచ్చేందుకూ హింసాకాండను ఒక సాధనంగా "స్వాబోద" ప్రతిపాదిస్తోంది. ఇంతకంటె ఎక్కువగా తనను తాను ఖండించుకునే వాదాన్ని ఊహించడం కష్టం! ప్రత్యేక "ఉత్తేజకాంశాలను" కల్పించే అవసరం లేకుండానే రష్యన్ జీవితంలో తగినన్ని అత్యాచారాలు జరగలేదా? పైగా రష్యాలో సాగే నిరంకుశత్వాన్ని చూసి కూడా ఉత్తేజం పొందనివారూ, ఉత్తేజం పొందలేనివారూ, ఉడ్డా నలుగురు టెరరిస్టులు ప్రభుత్వంతో జరిపే బాహాబాహీ పోరాటాన్ని చూసి మాత్రం "గోళ్లు గిల్లుకుంటూ" కూర్చోరన్న హామీ ఏముంది? వాస్తవ విషయం ఏమిటంటే, కార్మికజన సామాన్యం రష్యన్ సామాజిక జీవితంలోని చెడుగులను చూసి అధిక స్థాయిలోనే ఉత్తేజం పొందారు. కాని రష్యన్ సామాజిక జీవిత పరిస్థితులవలన మనం అనుకునే దానికంటె అధికతర ప్రమాణంలో ప్రజల్లో వ్యాపించిన యీ నిరసన అనే బిందువులనూ, వాగులనూ మనం సమీకరించి కేంద్రీకృతం చెయ్యలేకపోతున్నాం (అని మనం చెప్పకోవచ్చునేమో). మరి వాటన్నింటినీ ఒకే మహా ప్రవాహంగా సమీకరించవలసి వుంది. దీన్ని సాధించగలమన్న విషయం, కార్మికోద్యమం విశేషంగా పెరగడాన్నిబట్టీ, యింతకుముందు పేర్కొన్నట్లు, రాజకీయ సాహిత్యంకోసం కార్మికుల్లో కనిపించే ఆత్రంతో కూడిన ఉత్సుకతనుబట్టీ తిరుగులేకుండా రుజువవుతోంది. ఇందుకు భిన్నంగా, హింసాకాండను ఆవాహన చెయ్యడం, ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించాలనడం అన్నవి రష్యన్ విప్లవవాదుల భుజాలమీద యీనాడున్న అత్యంతావశ్యక విధిని, అంటే సర్వతోముఖ రాజకీయ ఆందోళనను సంఘటితపరచవలసిన బాధ్యతను రెండు భిన్న రూపాల్లో తప్పించుకోవడం మాత్రమే. "ముమ్మరం చెయ్యబడిన తీవ్రాందోళన జన సామాన్యంలో మొదలు కాగానే హింసాకాండ ఉత్తేజక విధి ముగిసిపోతుంది" ("విప్లవతత్వ పునరుత్థానం," పేజి 68) అన్న విషయాన్ని బాహాటంగా ఆమోదించడం ద్వారా "స్వాబోద" హింసాకాం

డను ఆందోళన స్థానంలో పెట్టాలని కోరుతోంది. వసంతకాలంలో సంభవించిన ఘటనలు* కొట్టవచ్చినట్టు రుజువు చేస్తున్నప్పటికీ కూడా జన సామాన్యపు విప్లవ కార్యకలాపాల ప్రాముఖ్యాన్ని టెఱరిస్టులూ, ఆర్థికవాదులూ తక్కువ అంచనావేస్తున్నారనీ, ఒక గ్రూపు కృత్రిమ "ఉత్తేజకాల" కోసం వెతుకుతూంటే, రెండోది "నిర్దిష్టమైన డిమాండ్ల"ను గురించి మాట్లాడుతోందనీ యిది కచ్చితంగా రుజువుచేస్తోంది. కాని యీ రెండు గ్రూపుల వాళ్ళూ కూడా రాజకీయాందోళన రంగంలోనూ, రాజకీయ విషయాలను బహిర్గతం చేసే ఖండనల్లోనూ తమ సొంత కార్యశీలతను పెంపొందించుకొనడంపట్ల తగినంత శ్రద్ధను చూపడంలేదు. ప్రస్తుతంగాని, మరొకప్పుడు గాని, యీ కర్తవ్య పాలన స్థానాన్ని మరే యితర కృషీ ఆక్రమించలేదు.

## ఉ) ప్రజాస్వామ్యంకోసం జరిగే పోరాటంలో కార్మికవర్గపు అగ్రగామి పాత్ర

అత్యంత విస్తృత స్థాయిలో రాజకీయాందోళనను నిర్వహించడం, మరి అందుకోసమే రాజకీయాంశాలను అన్ని పార్శ్వాలనుంచీ బహిర్గతంచేసి ఖండించడం అనేవి మన కార్య కలాపాల – యివి సిసలైన సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాలు కావాలంటే – పరమా వశ్యకమూ, అత్యున్నతమూ అయిన కర్తవ్యాలు. అయితే కార్మికవర్గానికి రాజకీయ పరి జ్ఞానం, రాజకీయ శిక్షణ ఆవశ్యకం అయిన కారణంగా మాత్రమే మనం యీ నిర్ణయానికి చేరుకున్నాం. కాని యీ సమస్యను యీవిధంగా ముందుకి తేవడం అన్నది చాలా సంకుచిత మైనది. ఎందుకంటే, మొత్తంమీద సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు, ప్రత్యేకించి యీనాటి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు, సాధారణ కర్తవ్యాలను అది ఉపేక్షిస్తోంది. ఈ విషయాన్ని మరింత నిర్దిష్టంగా వివరించేందుకుగాను, నేనీ అంశాన్ని ఆర్థికవాదికి "మిక్కిలి సన్నిహితమైన" పార్శ్వంనుంచి, అంటే ఆచరణాత్మక పార్శ్వంనుంచి పరిశీలిస్తాను. కార్మిక వర్గపు రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం అవసరమన్న విషయాన్ని "ప్రతి ఒక్కడూ" ఒప్పుకుంటాడు. దాన్ని సాధించడం ఎలాగ, దాన్ని సాధించడానికి కావలసింది ఏమిటి అన్నదే అసలు సమస్య. ఆర్థిక పోరాటం కార్మికవర్గంపట్ల ప్రభుత్వ వైఖరి ఏమిటో కార్మికులు గుర్తించేలా "చేస్తుంది" అంతమాత్రమే. అందుచేత, "ఆర్థిక పోరాటానికే రాజకీయ

* 1907లో వసంతకాలంలో మొదలైన భారీ వీధి ప్రదర్శనలు. (1907నాటి ముద్రణకి రచయిత వివరణ. – సం.)

స్వభావాన్ని కల్పించ''డానికి మనం యెంతగా ప్రయత్నించినప్పటికీ, ఆర్థిక పోరాట చట్రం లోనే వుంచడంవల్ల కార్మికుల రాజకీయ చైతన్యాన్ని (సోషల్ డెమోక్రటిక్ రాజకీయ చైతన్య స్థాయికి) మనం యెన్నడూ పెంచలేం, యేమంటే ఆ చట్రం మరీ సంకుచిత మైంది. మర్తీనొవ్ సూత్రానికి మన దృష్టిలో కొంత ప్రాముఖ్యం ఉన్నది. విషయాలను గందరగోళపరచడంలో మర్తీనొవ్‌కి గల అభిరుచిని అది తెలియచెయ్యడంవల్ల కాక, ఆర్థిక వాదులందరూ చేసే ప్రధానమైన పొరపాటును అది సూటిగా వ్యక్తపరచడంవల్లా, అంటే, ఆర్థిక పోరాట చట్రంలోంచి, వేరే మాటల్లో ఆర్థిక పోరాటంద్వారా, అంటే, యీ పోరాటాన్ని ఏకైక (కాకుంటే, కనీసం, ప్రధానమైన) ఆరంభ బిందువుగా, యీ పోరాటాన్ని ఏకైక (కాకుంటే, కనీసం, ప్రధానమైన) ప్రాతిపదికగా చెయ్యడంద్వారా కార్మికుల వర్గ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం సాధ్యమన్న ఆర్థికవాదులందరి విశ్వాసాన్నీ అది సూటిగా వ్యక్తపరచడం వల్లనే. అటువంటి దృక్పథం మౌలికంగా పొరపాటైనది. మా వాదనలతో కోపం తెచ్చుకున్న ఆర్థికవాదులు యీ అభిప్రాయభేదాలకు గల మూలాన్ని గురించి ఆలోచించేందుకు నిరాకరిస్తున్నారు, తత్పర్యవసానంగా మనం ఒకరినొకరం అర్థమే చేసుకోలేకపోతున్నాం. దానితో మనం రెండు వేర్వేరు భాషల్లో మాట్లాడుతున్నట్లుంది.

కార్మికులకు వర్గ రాజకీయ చైతన్యాన్ని కల్పించడమన్నది బయటనుంచి మాత్రమే, అంటే, ఆర్థిక పోరాట చట్రం బయటనుంచి మాత్రమే, కార్మికులకూ యజమానులకూ మధ్య సంబంధాల రంగం బయటనుంచి మాత్రమే సాధ్యం. ఈ జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కల్పించే రంగం ఒకటే ఒక్కటుంది – రాజ్యంతోనూ, ప్రభుత్వంతోనూ అన్ని వర్గాలకూ, సమాజపు విభాగాలకూ ఉన్న సంబంధాల రంగమే అది, అన్ని వర్గాల పరస్పర సంబంధాల రంగమే అది. ఆ కారణంగా, కార్మికులకు రాజకీయ జ్ఞానాన్ని కలిగించేందుకు ఏం చెయ్యాలన్న ప్రశ్నకు జవాబు కేవలం, ఎక్కువ సందర్భాల్లో, ఆచరణాత్మక కార్యకర్తలు, ప్రత్యేకించి ఆర్థికవాదంపట్ల మొగ్గు చూపేవాళ్ళు ఏ జవాబుతోనైతే అత్యధికంగా తమని తాము తృప్తిపరచుకొంటూ ఉంటారో అది, అంటే, ''కార్మికుల మధ్యకి వెళ్లడం'' మాత్రమే కాజాలదు. కార్మికులకి రాజకీయ జ్ఞానాన్ని కల్పించేందుకుగాను సోషల్ డెమోక్రట్లు జనాభాలోని అన్ని వర్గాల మధ్యకీ వెళ్లాలి; వాళ్లు తమ సైనిక దళాలను అన్ని దిక్కులకీ పంపాలి.

నేనీ మోటు సూత్రాన్ని కావాలనే ఎంచుకోవడమూ, యిలాంటి నిశిత సరళీకృత పద్ధతిలో వ్యక్తీకరించడమూ విరోధాభాసల్లో చెప్పాలన్న కోరికకొద్దీ కాదు, ఆర్థికవాదులు క్షమించరాని పద్ధతిలో నిర్లక్ష్యంచేస్తున్న కర్తవ్యాలను వాళ్లు ''గుర్తించేటట్టు చెయ్యడానికే,'' ట్రేడ్‌యూనియన్ రాజకీయాలకూ సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలకూ మధ్య ఉన్న భేదాన్ని – దాన్ని అర్థంచేసుకునేందుకే వాళ్లు నిరాకరిస్తున్నారు – గుర్తింపజేయడానికే. అందు

చేత, పాఠకుణ్ణి చిరాకుపడకుండా నేను చెప్పేదాన్ని చివరికంటూ ఓపిగ్గా వినమని కోరుతున్నాను.

గత కొద్ది సంవత్సరాల్లో మిక్కిలి విస్తృతంగా ప్రచారంలోకి వచ్చిన మాదిరి సోషల్ డెమోక్రటిక్ అధ్యయన బృందాన్ని తీసుకుని దాని కృషిని పరిశీలిద్దాం. దానికి ''కార్మికులతో సంబంధాలు'' ఉన్నాయి, అది ఫ్యాక్టరీల్లో జరిగే అత్యాచారాలనూ, పెట్టుబడిదారులపట్ల ప్రభుత్వ పక్షపాతాన్నీ, పోలీసుల హింసాకాండనూ ఘాటుగా ఖండించే కరపత్రాలను ప్రకటిస్తూ, అంతతోనే సంతృప్తిచెంది ఊరుకుంటుంది. కార్మికుల సభల్లో చర్చలు ఎన్నడూ, లేక ఎన్నడో తప్ప, యీ అంశాల పరిధిని దాటి వెళ్లవు. విప్లవోద్యమ చరిత్ర, ప్రభుత్వపు దేశాంగ, విదేశాంగ విధానాలను గురించిన సమస్యలు, రష్యా, యూరప్‌ల ఆర్థిక పరిణామ సమస్యను, ఆధునిక సమాజంలో వివిధ వర్గాల స్థానం మొదలైన సమస్యలపై ఉపన్యాసాలూ, చర్చలూ యెప్పుడో అమావాస్యకీ పౌర్ణానికే గాని కనిపించవు. ఇక సమాజంలోని యితర వర్గాలతో క్రమబద్ధమైన సంబంధాన్ని పెట్టుకొని, దాన్ని విస్తరింపజెయ్యడమన్న దాన్ని గురించి అసలెవ్వడూ కలలో కూడా అనుకోడు. ఆచరణలో ఆదర్శ నాయకుడు — అటువంటి అధ్యయన బృందాల సభ్యుల్లో అధిక సంఖ్యాకులు చిత్రించే రూపంలో — సోషలిస్టు రాజకీయ నాయకుడిగాకంటె యెంతో ఎక్కువగా ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి స్వభావం కలిగివుంటాడు. ఏ ట్రేడ్‌యూనియన్ — ఉదాహరణకు ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్ — కార్యదర్శి అయినా ఆర్థిక పోరాటాన్ని నిర్వహించడంలో కార్మికులకు తోడ్పడుతాడు. ఫ్యాక్టరీలో జరిగే అత్యాచారాలను బట్టబయలు చెయ్యడంలో వాళ్లకి అతను తోడ్పడుతాడు. సమ్మె చేసేందుకూ, పికెటింగు చేసేందుకూ గల హక్కును భంగపరిచే చట్టాల, చర్యల అన్యాయాన్ని గురించి వివరించి చెప్తాడు (అంటే, ఫలానా ఫ్యాక్టరీలో సమ్మె సాగుతోందని అందరినీ హెచ్చరించడం లాంటిది), బూర్జువా వర్గాలకు చెందిన మధ్యవర్తిత్వ న్యాయస్థానాలకు చెందిన జడ్జీల పక్షపాతాన్ని గురించి వివరిస్తాడు, యింకా ఆ బాపతు పనులు చేస్తాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ప్రతి ఒక్క ట్రేడ్‌యూనియన్ కార్యదర్శీ ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటాన్ని'' నిర్వహిస్తాడు, నిర్వహించడానికి తోడ్పడుతాడు. ఇదింకా సోషల్ డెమోక్రసీ కాదని ఎంత నొక్కి చెప్పినా అది తక్కువే అవుతుంది. సోషల్ డెమోక్రట్ ఆదర్శం ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి కావడం కాదు, ప్రజాసామాన్య నాయకుడు కావడం. నిరంకుశత్వం, పీడన, అవి ఎక్కడ కనిపించినా, ఏ సమాజపు విభాగానికి లేక ఏ వర్గానికి చెందిన ప్రజలను అవి దెబ్బతీసినా వాటికి స్పందించగలగడం, అటువంటి ఘటనలన్నింటినీ సాధారణీకరించి, పోలీసుల హింసాకాండకూ, పెట్టుబడిదారీ దోపిడీకీ సంబంధించిన ఒక అవిభాజ్య చిత్రాన్ని రూపొందించగల నేర్పుగలిగి వుండటం; తన సోషలిస్టు విశ్వాసాలనూ, తన ప్రజాస్వామిక డిమాండ్లనూ అందరిముందూ

వివరించి చేప్పేందుకూ, శ్రామికవర్గ విముక్తికోసం జరిగే పోరాటపు ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యాన్ని అందరికీ, ప్రతి ఒక్కరికీ వివరించి చెప్పేందుకూ ప్రతి ఒక్క ఘటననూ, అదెంత చిన్నదైనా కూడా, ఉపయోగించుకోగల సామర్థ్యం కలిగినవాడై వుండటం. ఉదాహరణకు (ఇంగ్లండులో అత్యంత శక్తివంతమైన ట్రేడ్‌యూనియన్లలో ఒకటైన బాయిలర్ తయారీదార్ల సొసైటీ సుప్రసిద్ధ నాయకుడూ, కార్యదర్శీ అయిన) రాబర్ట్ నైట్ వంటి ఒక నాయకుణ్ణి విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌తో పోల్చి, మర్తీనొవ్ "ఇస్క్రా"తో తన వివాదంలో పైకి తెచ్చిన భేదాలను వాళ్లిద్దరికీ అన్వయించేందుకు ప్రయత్నించండి. ఈ కింది విషయాలు కనిపిస్తాయి — నేను మర్తీనొవ్ వ్యాసంలోని మాటల్లో ఒక్కొక్కదాన్నే ఉదహరిస్తాను — రాబర్ట్ నైట్ "జన సామాన్యానికి కొన్ని నిర్దిష్ట కార్యాచరణలకు పిలుపు యివ్వడంలో" ఎక్కువ నిమగ్నుడై వుండగా (మర్తీనొవ్, పైన పేర్కొనబడిన రచనలో పేజి 39), విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ "మొత్తం ప్రస్తుత వ్యవస్థను లేక దాని పాక్షిక వ్యక్తీకరణలను విప్లవాత్మకంగా వివరించడంలో" (38–39) ఎక్కువగా నిమగ్నుడయాడు. రాబర్ట్ నైట్ "శ్రామిక వర్గపు తక్షణ డిమాండ్లను సూత్రీకరించి, అవి ఏ సాధనాల ద్వారా సాధింపబడగలవో సూచించగా" (41), విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ యీ పని చేస్తూ, అంతటితో సరిపెట్టుకోకుండా "అదే సమయంలో వివిధ ప్రతిపక్ష శ్రేణుల కార్యకలాపాలకు" "వాళ్లకి నిర్మాణాత్మకమైన కార్యాచరణ పథకాన్ని నిర్దేశిస్తూ"* "మార్గదర్శకత్వం వహించాడు" (41). రాబర్ట్ నైట్ "సాధ్యమైన మేరకు ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడానికి" కృషిచేశాడు (42), "కొన్ని ప్రత్యక్ష ఫలితాలను యిచ్చే అవకాశం గల కచ్చితమైన డిమాండ్లను ప్రభుత్వానికి సమర్పించడంలో" అద్భుత సామర్థ్యాన్ని ప్రదర్శించాడు (43); కాగా లీబ్‌క్నెఖ్ట్ "ఏకపక్షంగా" "బహిర్గతంచేసి ఖండించే కార్యక్రమాల్లో" చాలా ఎక్కువగా నిమగ్నుడయాడు (40). రాబర్ట్ నైట్ "నిస్సార దైనందిన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి" అధికతర ప్రాముఖ్యాన్ని ఆపాదించగా (61), లీబ్‌క్నెఖ్ట్ "ఉజ్వలమూ, సంపూర్ణమూ అయిన భావాల ప్రచారానికి" అధికతర ప్రాముఖ్యాన్ని ఆపాదించాడు (61); రాబర్ట్ నైట్ "కార్మికవర్గ లక్ష్యంకోసం శ్రామికవర్గ పోరాటంతో సన్నిహిత సజీవ సంబంధం పెట్టుకొని కృషిచెయ్యగా" (63) — "సన్నిహిత సజీవ సంబంధం" అంటే, మనం పైన పరిశీలించిన సద్యోజనితత్వానికి దాసోహం అనడం ద్వారా, క్రిచేవ్‌స్కీ, మర్తీనొవ్‌లను ఆదర్శంగా పెట్టుకొని — "తన ప్రభావాన్ని పరిమితం చేసుకోగా," అయితే మర్తీనొవ్

---

* ఉదాహరణకు, ఫ్రెంచి–ప్రష్యన్ యుద్ధకాలంలో లీబ్‌క్నెఖ్ట్ మొత్తం ప్రజాస్వామ్యవాదులందరికీ ఒక కార్యాచరణ పథకాన్ని తయారుచేశాడు — అలాగే 1848లో మార్క్స్, ఎంగెల్సులు యిదే పనిని యింతకంటె పెద్ద ఎత్తున చేశారు.

నమ్మినట్లు "ఆవిధంగా చెయ్యడం ద్వారా అతనా ప్రభావాన్ని ప్రగాఢం చెయ్యగా," లీబ్ క్నెఖ్ట్ తను నడుపుతున్న పత్రికను "మన దేశంలోని పరిస్థితులను, ప్రత్యేకించి రాజకీయ పరిస్థితులను — జనాభాలోని అత్యంత వైవిధ్యపూరిత విభాగాల ప్రయోజనాలను అవి ప్రభావితంచేసిన మేరకు — బహిర్గతంచేసి ఖండించే విప్లవాత్మక పత్రికగా" మార్చాడు (63). ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆచరణలో, మర్తీనావ్ సోషల్ డెమోక్రసీని ట్రేడ్‌యూనియనిజానికి దిగజారుస్తున్నాడన్న సంగతిని మీరు చూస్తారు. అయితే పాపం ఆయన సోషల్ డెమోక్రసీ మేలును కోరకపోవడంవల్ల కాదు, ప్లెహానొవ్‌ని అర్థంచేసుకోడానికి శ్రమ పడేందుకు బదులు ప్లెహానొవ్‌ని మరింత ప్రగాఢంచేసేందుకు మరీ యెక్కువ ఆత్రపడటమే కారణం.

సరే యిప్పుడు మనం మన ప్రధానాంశానికి తిరిగి వద్దాం. ఏ సోషల్ డెమోక్రట్ అయినా శ్రామికవర్గపు రాజకీయ చైతన్యాన్ని సమగ్రంగా పెంపొందించడం అవసరమని నిజంగా నమ్మినట్లయితే, అతను "జనాభాలోని అన్ని వర్గాల మధ్యకీ వెళ్లాలి" అని మనం చెప్పుకున్నాం. దీన్నిబట్టి యీ కింది ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి: ఈ పని ఎలా చెయ్యాలి? ఈ పని చేసేందుకు మనకి తగినన్ని శక్తులు ఉన్నాయా? అన్ని యితర వర్గాల మధ్యా అలాంటి కృషిచెయ్యడానికి ఆధారమేదైనా ఉందా? వర్గ దృష్టితో చూసినప్పుడు అలా చెయ్యడమంటే తిరోగమనం కాదా, లేక తిరోగమనానికి దారితియ్యడం కాదా? ఈ ప్రశ్నల్ని పరిశీలిద్దాం.

"జనాభాలోని అన్ని వర్గాల మధ్యకీ" మనం సిద్ధాంతవేత్తలుగా, ప్రచారకులుగా, ఆందోళనకారులుగా, ఆర్గనైజర్లుగా వెళ్లాలి. సైద్ధాంతిక కృషి రంగంలో వివిధ వర్గాల సామాజిక, రాజకీయ పరిస్థితియొక్క అన్ని విశిష్ట లక్షణాలనూ అధ్యయనం చెయ్యడాన్ని సోషల్ డెమోక్రట్లు తమ లక్ష్యంగా పెట్టుకోవాలనడంలో ఎవరికీ సందేహం లేదు. అయితే, ఫ్యాక్టరీ జీవితపు విశిష్ట లక్షణాలను అధ్యయనం చేసేందుకు జరిపే కృషితో పోలిస్తే యీ మాదిరి అధ్యయనం బహు స్వల్పం. కమిటీల్లోనూ, అధ్యయన బృందాల్లోనూ లోహ పరిశ్రమకి సంబంధించిన ఏ ప్రత్యేక శాఖనో అధ్యయనంచెయ్యడంలో నిమగ్నులైనవాళ్లు మనకి కనిపిస్తారు. అంతేగాని, మన శాఖల్లో (తరచుగా, ఏదో ఒక కారణం మూలంగా రోజువారీ కార్యకలాపాలలో పాల్గొలేనివాళ్లు) మన దేశపు సామాజిక, రాజకీయ జీవితానికి సంబంధించిన ఏదో ఒక అత్యవసర సమస్యను గురించి — జనాభాలోని యితర విభాగాల వాళ్ల మధ్య సోషల్ డెమోక్రటిక్ పార్టీ కృషిచెయ్యడానికి ఒక సాధనంగా పనికిరాగల, సమాచార సేకరణలో ప్రత్యేకించి నిమగ్నులైన సభ్యులు ఎక్కడో ఎప్పుడో బహు అరుదుగా తప్ప మనకి కనిపించరు. కార్మికోద్యమపు ప్రస్తుత నాయకుల్లోని అధిక సంఖ్యాకులకు శిక్షణ కొరవడిందని అనేటప్పుడు, పై విషయంలో శిక్షణను గురించి సైతం పేర్కొనకుండా ఉండలేం. ఎందుకంటే, అది కూడా "శ్రామికవర్గ పోరాటంతో సన్నిహిత సజీవ సంబంధం" అన్న

ఆర్థికవాద భావంతో ముడిపడివుంది. అయితే, నిస్సందేహంగా ప్రధాన విషయం జనాభా లోని అన్ని విభాగాల మధ్యా ప్రచారం, ఆందోళనా చెయ్యడమే. ఈ విషయంలో పశ్చిమ యూరపియన్ సోషల్ డెమోక్రట్ కృషికి కొంత సౌకర్యం ఉంది. ఎలాగంటే, బహిరంగ సభలకూ, ప్రదర్శనలకూ అక్కడ అందరూ స్వేచ్ఛగా హాజరవగలరు. దానికితోడు పార్లమెంటులో అన్ని వర్గాల ప్రతినిధులనూ ఉద్దేశించి అతనక్కడ మాట్లాడగలడు. మనకిక్కడ పార్లమెంటూ లేదు, సమావేశ స్వేచ్ఛా లేదు. అయినా కూడా, సోషల్ డెమోక్రట్ చెప్పేదాన్ని వినాలని కోరుకునే కార్మికుల సమావేశాలను మనం ఏర్పాటుచెయ్యగలం. ఒక డెమోక్రట్ చెప్పేదాన్ని వినాలని కోరుకునే అన్ని సామాజిక వర్గాల ప్రతినిధుల సమావేశాలను మనం ఏర్పాటు చెయ్యవలసివుంది. అందుకు మనం పద్ధతులను వెతకాలి. ఎందుకంటే "ప్రతి విప్లవోద్యమాన్నీ కమ్యూనిస్టులు బలపరుస్తారు"[173] అన్న అంశాన్ని ఆచరణలో విస్మరించేవాడు సోషల్ డెమోక్రట్ కాడు. అందుకనే మన సోషలిస్టు విశ్వాసాలను క్షణకాలం కూడా దాచిపెట్టకుండా, మొత్తం ప్రజలందరి ముందూ సాధారణ ప్రజాస్వామిక కర్తవ్యాలను వివరించి, వాటిని గురించి నొక్కిచెప్పవలసిన బాధ్యత మనమీద ఉంది. ప్రతి సాధారణ ప్రజాస్వామిక సమస్యనూ లేవదియ్యడంలో, దాని ప్రాముఖ్యాన్ని విశ్లేషించడంలో, దాన్ని పరిష్కరించే విషయంలో అందరికన్న ముందుండటంలో తన బాధ్యతను ఆచరణలో విస్మరించేవాడు సోషల్ డెమోక్రట్ కాజాలడు.

ఓర్మిలేని పాఠకుడు "కాని, యిది అందరూ ఒప్పుకునే విషయమే కదా!" అని అనక పోడు. "రబోచెయె దేలొ" సంపాదకవర్గం కోసం "దేశాంతర యూనియన్" తన యిటీవలి మహాసభలో ఆమోదించిన కొత్త ఆదేశాలు కచ్చితంగా యిలా పేర్కొన్నాయి: "ఒక ప్రత్యేక వర్గంగా గాని లేక స్వాతంత్ర్య పోరాటంలో అన్ని విప్లవ శక్తులకూ అగ్రగామి దళంగా గాని శ్రామికవర్గంపైన తమ ప్రభావాన్ని బరపే అన్ని సామాజిక, రాజకీయ జీవిత ఘటనలూ రాజకీయ ప్రచారానికీ, ఆందోళనకీ విషయాంశాలుగా ఉండాలి" ("రెండు మహాసభలు," పేజి 17, ఉటంకింపు నాది). ఔను, యివి చాలా నిజమైన మాటలూ, చాలా మంచి మాటలే. "రబోచెయె దేలొ" వాటిని అర్థంచేసుకుని, అది మరుసటి క్షణంలోనే వాటిని ఖండించే విషయాలను చెప్పకుండా వేచివుంటే, మనం పూర్తిగా తృప్తిచెందివుండేవాళ్లం. ఎందుకంటే "అగ్రగామి దళం" అనీ, పురోగామి దళమనీ మనల్ని మనం పిలుచుకుంటేనే చాలదు, మనం అగ్రగామి దళంగా పనిచెయ్యడం అవసరం. ఇతర అన్ని దళాలూ మనల్ని గుర్తించి, మనం ముందు పీఠీలో వెళ్తున్నామన్న విషయాన్ని ఒప్పుకునేలా మనం వ్యవహరించాలి. నేను పాఠకుణ్ణి ఓ ప్రశ్న అడుగుతాను: మనంతట మనం మేమే "అగ్రగామిదళం" అని చెప్పుకుంటే, యితర "దళాల" ప్రతినిధులు నమ్మేసేందుకు వాళ్లేమన్నా మూర్ఖులా? కొంచెం యీ కింది విషయాన్ని వూహించుకోండి: ఒక సోషల్ డెమోక్రట్ విద్యావంతులైన

రష్యన్ రాడికల్సు ''దళం'' దగ్గరకో లేక లిబరల్ రాజ్యాంగవాదుల ''దళం'' దగ్గరకో వెళ్లి మేం అగ్రగామి దళానికి చెందినవాళ్లం; ''సాధ్యమైన మేరకు, ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడమే మమ్మల్నెదుర్కొంటున్న సమస్య'' అంటాడు. ఆ రాడికల్ లేక ఆ రాజ్యాంగవాది, అతనేమాత్రం తెలివైనవాడైనా (రష్యన్ రాడికల్సులోనూ, రాజ్యాంగవాదుల్లోనూ తెలివైనవాళ్లు చాలామందే ఉన్నారు), ఆ మాటలు విని చిరునవ్వు నవ్వి యిలా అంటాడు (తనలోనే అనుకుంటాడనుకోండి, ఎందుకంటే అత్యధిక సందర్భాల్లో అతను అనుభవశాలియైన లౌక్యుడు అయ్యుంటాడు), ''మీ 'అగ్రగామి దళం' అమాయకులతో కూడిన గుంపు. కార్మికుల ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడమన్నది మా కర్తవ్యం – బూర్జువా ప్రజాస్వామ్యపు ప్రగతిశీల ప్రతినిధుల కర్తవ్యమన్న సంగతిని సైతం వాళ్లు అర్థంచేసుకోవడం లేదు. అరే, పశ్చిమ యూరపియన్ బూర్జువాలందరి మాదిరిగానే కార్మికులను రాజకీయాల్లోకి, సోషల్ డెమోక్రటిక్ రాజకీయాల్లోకి కాక, ట్రేడ్‌యూనియన్ రాజకీయాల్లోకి మాత్రమే తీసుకురావాలని మేము కూడా కోరుతున్నామే. కార్మికవర్గపు ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాలున్నాయే, అవి ఆచరణలో సరిగ్గా కార్మికవర్గానికి సంబంధించి బూర్జువా రాజకీయాలు, మరి తన కర్తవ్యానికి సంబంధించిన యీ 'అగ్రగామిదళపు' సూత్రీకరణ ఉన్నదే, అది ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయ సూత్రీకరణే! వాళ్లని వాళ్లు తమకి తృప్తిదీరా సోషల్ డెమోక్రట్లం అని పిలుచుకోనివ్వండి. ఈ పేరుతో ఉత్తేజితుడినయ్యేందుకు నేనేమీ చిన్న పిల్లాడిని కాను. కాని, వాళ్లు ఆ విచ్ఛిన్నకర ఛాందస సిద్ధాంతజడుల ప్రభావంలో పడకూడదు, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని ట్రేడ్‌యూనియనిస్టు పంథాల్లోకి తమని తెలియకుండానే నడిపిస్తున్నవాళ్లకి వాళ్లు 'విమర్శనా స్వేచ్ఛ'ని యివ్వాలి.''

సోషల్ డెమోక్రసీని అగ్రగామి దళంగా పరిగణించే సోషల్ డెమోక్రట్లు, మన ఉద్యమంపైన సద్యోజనితత్వం దాదాపు పూర్తి ప్రాబల్యం వహిస్తున్న యీరోజున ''సద్యోజనితత్వ శక్తులను తక్కువచేసి చెప్పడం'' అంటే భయపడినంతగా, ''సముజ్వల సంపూర్ణ భావాల ప్రచారంతో సరిపోల్చినప్పుడు నీరస దైనందిన పోరాటపు పురోగామి ఉద్యమ ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనావెయ్యడం'' వగైరా, వగైరా అంటే భయపడినంతగా మరి దేన్నిగురించీ భయపడరని తెలుసుకున్నప్పుడు, మన రాజ్యాంగవాది చిరునవ్వు ఫక్కుమని నవ్వే నవ్వు అవుతుంది! ఇదెలాంటి ''అగ్రగామిదళం''? చైతన్యం సద్యోజనితత్వాన్ని మించిపోతుందని భయపడేది, మనతో విభేదించేవాళ్లు సైతం సాధారణ పద్ధతిలో మన్ని గుర్తించి తీరేలా చేసే సాహసికమైన ''పథకాన్ని'' ముందుపెట్టేందుకు భయపడేది! ''వెనక దళాన్ని'' ''అగ్రగామి దళం''గా వాళ్లు గందరగోళపడ్డం లేదుకదా?

మర్తీనొవ్ చేసిన యీ కింది వాదాన్ని మనం కొంచెం పరిశీలిద్దాం. చెడుగులను బట్ట

బయలుచేసే "ఇస్క్రా" ఎత్తుగడలు ఏకపక్షమైనవనీ, "ప్రభుత్వంపైన ఎంత అపనమ్మకాన్నీ, ద్వేషాన్నీ మనం వ్యాపింపజేసినప్పటికీ, దాన్ని కూలదోసేందుకు తగినంతటి క్రియాశీల సామాజిక శక్తిని పెంపొందించడం విజయం సాధించనిదే మనం మన లక్ష్యాన్ని సాధించలేం" అనీ ఆయన 40వ పేజీలో, అంటాడు. దీన్ని గురించి ప్రస్తావవశంగా ఒక విషయం చెప్పుకోవచ్చు. జనసామాన్యాన్ని క్రియాశీలురను చెయ్యాలన్న యీ ఉత్సుకతలో, అదే సమయంలో తమ సొంత కార్యకలాపాలను పరిమితం చేసే ప్రయత్నం కూడా కలిసివుందన్నదే ఆ విశేషం. అయితే ప్రస్తుతం అది కాదు ప్రధానాంశం. తదనుగుణంగానే మర్తీనొవ్ యిక్కడ విప్లవాత్మక శక్తి ("కూలదొయ్యడానికి") గురించి చెప్తున్నాడు. మరి ఆయన చేసే నిర్ధారణ ఏమిటి? సాధారణ కాలంలో సమాజంలోని వివిధ విభాగాలు అనివార్యంగా విడి విడిగా ముందుకెళ్తాయి కాబట్టి, "సోషల్ డెమోక్రట్లం అయిన మనం వివిధ ప్రత్యర్థి విభాగాల కార్యకలాపాలకు ఏకకాలంలో మార్గదర్శకత్వం వహించలేం, మనం వాళ్లకి కచ్చితమైన కార్యాచరణ పథకాన్ని నిర్దేశించలేం, వాళ్లు తమ ప్రయోజనాలకోసం ఏ మాదిరి దైనందిన పోరాటాన్ని సాగించాలో మనం వాళ్లకి సూచించలేం.... ఉదారవాద విభాగానికి చెందిన వాళ్లు తమంతట తామే తమ తక్షణ ప్రయోజనాలకోసం జరపవలసిన క్రియాశీల పోరాటం విషయం, మన రాజకీయ వ్యవస్థతో వాళ్లని ఎదురుబదురుగా తీసుకొచ్చే పోరాటం విషయం చూసుకుంటారు" (పేజి 41). ఈవిధంగా, విప్లవాత్మక శక్తిని గురించీ, నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు జరపవలసిన క్రియాశీల పోరాటం గురించీ కబుర్లు చెప్పడంతో మొదలెట్టిన మర్తీనొవ్, ఆ వెంటనే ట్రేడ్‌యూనియన్ శక్తికేసీ, తక్షణ ప్రయోజనాల కోసం క్రియాశీల పోరాటంకేసీ తిరుగుతాడు! విద్యార్థులు, లిబరల్సు మొదలైనవాళ్ల "తక్షణ ప్రయోజనాల" కోసం వాళ్లకి మనం నాయకత్వం వహించలేమని వేరే చెప్పనక్కర్లేదు, అయితే అత్యంత యోగ్యులైన ఆర్థికవాద మహాశయా, మన వివాదాంశం అదికాదు! నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యడంలో సమాజంలోని వివిధ విభాగాలవారు పాల్గొనే అవకాశం, ఆవశ్యకతా — యిదే మనం చర్చిస్తున్న అంశం. మనం గనక "అగ్రగామి దళం"గా ఉండాలనుకుంటే, "వివిధ ప్రతిపక్ష విభాగాలవారి యీ క్రియాశీల కార్యకలాపాలకు" నాయకత్వం వహించడం మనకి సాధ్యమూ, అది మన పరమ విధీ కూడా. మన విద్యార్థులూ, లిబరల్సూ వగైరాలు "మన రాజకీయ వ్యవస్థతో ఎదురుబదురుగా వచ్చే పోరాటం" కోసం స్వయంగా ప్రయత్నించడం మాత్రమే కాదు; నిరంకుశ ప్రభుత్వ పోలీసులూ, అధికారులూ మొట్టమొదట యీ విషయాన్నే చూసుకుంటారు. కాని, అగ్రశ్రేణి ప్రజాస్వామ్యవాదులం అవాలని "మనం" కోరుకునేట్లయితే, విశ్వవిద్యాలయాల్లోని లేక జేమ్‌స్త్వోలు మొదలైన వాటిలోని పరిస్థితులతో మాత్రమే అసంతృప్తులైనవారి భావాలను యావత్తు రాజకీయ వ్యవస్థా శుద్ధ పనికిమాలినదన్న అభిప్రాయాన్ని కలిగించే బాధ్యతను మనం వహించితీరాలి.

ప్రతిపక్ష శక్తులన్నీ పోరాటానికీ, మన పార్టీకీ పూర్తి తోడ్పాటు నివ్వడాన్ని సాధ్యంచేసే విధంగా, మన పార్టీ నాయకత్వంకింద, సర్వతోముఖ రాజకీయ పోరాటాన్ని సంఘటితంచేసే కర్తవ్యాన్ని "మనం" మన భుజాలమీద వేసుకోవాలి. "మనం" మన సోషల్ డెమోక్రటిక్ కార్యకర్తలకు, యీ సర్వతోముఖ పోరాటపు అన్ని రూపాలకూ నాయకత్వం వహించగలిగేలా, ఉత్తేజితులైన విద్యార్థులకు, అసంతృప్తులైన జేమ్‌స్త్వో సభ్యులకు, క్రుద్ధులైన మత తెగలవారికి, కుపితులైన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వగైరా వగైరాలకు సకాలంలో "నిర్మాణాత్మకమైన కార్యాచరణ క్రమాన్ని నిర్దేశించే" సామర్థ్యం కలిగిన రాజకీయ నాయకులుగా మనం శిక్షణనివ్వాలి. అందుకని, "వీరికి సంబంధించి, అత్యాచారాలను బట్టబయలు చేసేవాళ్ల కేవల విధ్వంసకరమైన పాత్రలో మాత్రమే మనం పనిచెయ్యగలం.... వివిధ ప్రభుత్వ కమిషన్లలో వారు పెట్టుకున్న ఆశలను మనం భగ్నం మాత్రమే చెయ్యగలం" అన్న మర్తీనొవ్ ఉద్ఘాటన శుద్ధ పొరపాటు (ఉటంకింపు నాది). ఈ మాట చెప్పడం ద్వారా, విప్లవాత్మక "అగ్రగామి దళం" నిజంగా వహించవలసిన పాత్రని గురించి తనకు బొత్తిగా ఏమీ అర్థంకాలేదని మర్తీనొవ్ నిరూపించుకున్నాడు. పాఠకుడు యీ విషయాన్ని మనస్సులో ఉంచుకుంటే, మర్తీనొవ్ చెప్పిన యీ చివరి మాటకు అసలు అర్థం ఏమిటో స్పష్టంగా బోధపడుతుంది: "మన దేశంలోని వ్యవహారాల పరిస్థితిని, ప్రత్యేకించి రాజకీయ పరిస్థితిని, జనాభాలోని అత్యంత వైవిధ్య పూరితమైన విభాగాల ప్రయోజనాలను అది దెబ్బతీసే మేరకు, బహిర్గతంచేసి ఖండించే విప్లవాత్మక ప్రతిపక్ష పత్రిక 'ఇస్క్రా.' కాని మేము, కార్మికవర్గ లక్ష్యం కోసం, శ్రామికవర్గ పోరాటంతో సన్నిహిత సజీవ సంబంధం పెట్టుకొని పనిచేస్తాం, యిక ముందు కూడా పనిచేస్తూనే వుంటాం. మా క్రియాశీల ప్రభావాన్ని పరిమితం చేసుకోవడం ద్వారా మేము దాన్ని మరింత ప్రగాఢం చేస్తాం" (63). ఈ నిర్ధారణ అసలైన అర్థం ఏమిటయ్యా అంటే యిదీ: "ఇస్క్రా" కార్మికవర్గపు ట్రేడ్ యూనియనిస్టు రాజకీయాలను (మన కార్యకర్తలు తెలియనితనంవల్లనో, శిక్షణ లోపం వల్లనో, లేక విశ్వాసంవల్లనో తరచుగా దీనికి పరిమితం అవుతూ వుంటారు) సోషల్ డెమోక్రటిక్ రాజకీయ స్థాయికి పెంచాలని కోరుతూండగా "రబోచెయె దేలో" సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలను ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాల సాయికి దిగజార్చాలని కోరుతోంది. పైగా అది, యీ రెండు వైఖరులూ "ఉమ్మడి లక్ష్యసాధనకు సంబంధించి పూర్తిగా సంగతమైనవే" అని ప్రపంచానికి వక్కాణించి చెప్తోంది (63). O, sancta simplicitas!*

ముందుకెళ్దాం. అన్ని సామాజిక వర్గాల మధ్యా ప్రచారాందోళనలు చేయడానికి

* ఆహా! పవిత్రమైన అమాయకత్వం! (లాటిన్.) – సం.

సరిపడినన్ని బలగాలు మనదగ్గర ఉన్నాయా? నిస్సందేహంగా ఉన్నాయి. ఈ విషయాన్ని నిరాకరించడంపట్ల మొగ్గు చూపించే మన ఆర్థికవాదులు, (సుమారు) 1894–1901 మధ్య మన ఉద్యమం సాధించిన బృహత్తర ప్రగతిని విస్మరిస్తున్నారు. సిసలైన "తోక వాదుల" మాదిరిగా, వాళ్ళు తరచుగా సుదూర గతంలో, ఉద్యమారంభ దశయొక్క గడిచి పోయిన కాలంలో జీవిస్తూ వుంటారు. వాస్తవానికి ఆ తొలి దశలో మన బలగాలు ఆశ్చర్యం గొలిపేటంత తక్కువగా ఉండేవి. అప్పట్లో మన కార్యకలాపాలను ప్రత్యేకించి కార్మికులకే పరిమితంచెయ్యడం, యీ పంథానుంచి ఏమాత్రం వైదొలగినా దాన్ని తీవ్రంగా ఖండించడం పూర్తిగా సహజం, సముచితం కూడా. అప్పట్లో మన పనల్లా కార్మికవర్గంలో మన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడమే. అయితే ప్రస్తుతం, బృహత్తరమైన శక్తులు ఉద్యమంలోకి ఆకర్షిత మయాయి. విద్యావంతులైన వర్గాలవారి యువతరపు అత్యుత్తమ ప్రతినిధులు మన సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోకి వస్తున్నారు. 1894లో వేళ్లమీద లెక్కించదగినంత మంది రష్యన్ సోషల్ డెమోక్రట్లు మాత్రమే ఉండగా, యీనాడు, గతంలో ఉద్యమంలో పాల్గొన్నవాళ్లు లేక యీనాడు ఉద్యమంలో పాల్గొనగోరుతున్నవాళ్లు దేశపు వివిధ రాష్ట్రాల్లో నివసించవలసి వచ్చినా, క్రమంగా సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం దిశగా మొగ్గుతున్నవాళ్లు సర్వత్రా వున్నారు. ఈ శక్తులన్నింటినీ వినియోగించుకొని, వాటికి సముచితమైన పనిని యివ్వగలిగిన శక్తి మనకి లేకపోవడమే మన ఉద్యమంలోని మౌలిక రాజకీయ, ఆర్గనైజేషనల్ లోపం (దీన్ని గురించి వచ్చే ప్రకరణంలో నేను మరింత సమగ్రంగా చర్చిస్తాను). వీరిలో అత్యధిక సంఖ్యాకులకు "కార్మికుల మధ్యకి వెళ్లే" అవకాశం బొత్తిగా లేదు. కాగా మనం మన ప్రధాన కృషినుంచి కొందరిని పక్కదారి పట్టిస్తామన్న భయానికి బొత్తిగా ఆధారం లేదు. కార్మికులకు సిసలైన, సమగ్రమైన, సజీవమైన రాజకీయ పరిజ్ఞానాన్ని కలిగించ గలిగేందుకుగాను అన్నిచోట్లా, అన్ని సామాజిక విభాగాల్లోనూ, ఎక్కడెక్కడినుంచైతే మన ప్రభుత్వ యంత్రాంగపు ఆంతరిక ప్రేరక శక్తులను మనం తెలుసుకోగలుగుతామో ఆ స్థానాలన్నింటిలోనూ మనం మన "సొంత మనుషులను," సోషల్ డెమోక్రట్లను కలిగి వుండాలి. అటువంటివాళ్ళు ప్రచారాందోళనల కోసమే కాకుండా, అంతకంటె ఎక్కువ స్థాయిలో సంఘటన కృషికోసం అవసరం.

జనాభాలోని అన్ని విభాగాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రాతిపదిక ఏదైనా ఉందా? ఉందన్న సంగతిని శంకించేవాళ్లు తమ చైతన్యం విషయంలో జనసామాన్యపు సద్యో జనిత జాగృతికంటె కూడా వెనకబడుతున్నారు. కార్మికోద్యమం కొందరిలో అసంతృప్తినీ, మరి కొందరిలో ప్రతిపక్షానికి తోడ్పాటు పొందే ఆశనూ, యింకొందరిలో నిరంకుశ ప్రభు త్వాన్ని సహించడం సాధ్యంకాదనీ, దాన్ని విధిగా కూల్చివెయ్యాల్సిందేనన్న భావాలనూ రేకె త్తించింది, రేకెత్తిస్తూనే వుంటుంది. ప్రతి అసంతృప్తి వ్యక్తీకరణనీ ఉపయోగించుకోవడం, అదెంత చిన్నదైనా కూడా ప్రతి నిరసననీ బలపరచి, వాటిని అత్యుత్తమంగా వినియో

గించుకోవడం మన కర్తవ్యమన్న విషయాన్ని గ్రహించడంలో మనం విఫలమైనట్లయితే, మనం నామమాత్రపు “రాజకీయవేత్తలం,” సోషల్ డెమొక్రట్లం అవుతాం (వాస్తవంలో తరచుగా అలా జరుగుతూనే వుంది). కోట్లాది శ్రమజీవులైన రైతులు, చేతివృత్తుల వాళ్లు, చిల్లర మల్లర నిపుణ కార్మికులూ మొదలైనవాళ్లు ఏమాత్రం యోగ్యత కలిగిన సోషల్ డెమొక్రట్ అయినా యిచ్చే ఉపన్యాసాన్ని ఎప్పుడూ ఉత్సుకతతోనే వింటారన్న వాస్తవానికి యిది పూర్తిగా వేరైనది. నిజానికి హక్కులు లేకపోవడంపట్లా, నిరంకుశత్వంపట్లా అసంతృప్తిచెంది, ఆ కారణంగా, మిక్కిలి తక్షణ సాధారణ ప్రజాస్వామిక అవసరాల ప్రవక్తలుగా సోషల్ డెమొక్రట్ల ప్రచారానికి మొగ్గు చూపే అవకాశమున్న వ్యక్తులూ, గ్రూపులూ, లేక బృందాలూ లేని సామాజిక వర్గం ఏ ఒక్కటైనా ఉందా? జనాభాలోని *అన్ని* వర్గాల మధ్యా, విభాగాల మధ్యా సోషల్ డెమొక్రట్లు చెయ్యవలసిన రాజకీయాందోళనను గురించిన విశిష్టాభిప్రాయం కావాలనుకునేవాళ్లకి, యీ ఆందోళన ప్రధాన రూపం (అలా అని అదే ఏకైక రూపం కాదనుకోండి) విస్తృతార్థంలో *రాజకీయ విషయాలను బహిర్గతంచేసే ఖండనలే* అని మేము చెప్తాం.

“దేనితో ప్రారంభించాలి?” అన్న నా వ్యాసంలో [“ఇస్క్రా,” మే, (సంచిక 4), 1901] “జనాభాలో ఏమాత్రం రాజకీయ చైతన్యమైనా కలిగిన ప్రతి విభాగంలోనూ *రాజకీయ* విషయాలను బహిర్గతం చేసే ఖండనలపట్ల ఉత్సాహాన్ని రేకెత్తించాలి” అని నేను రాశాను. ఈ విషయాన్ని నేను తర్వాత మరింత విపులంగా చర్చిస్తాను. “రాజకీయ విషయాలను బహిర్గతంచేసి ఖండించేవాళ్ల వాణి యీనాడు నీరసంగా, పిరికిగా, అంతరాయాలలో కూడి ఉండటాన్ని చూసి మనం నిరుత్సాహపడరాదు. ఇందుకు పోలీసు నిరంకుశత్వానికి అందరూ తలవంచడం కారణం కాదు. తద్భిన్నంగా, ఎవరైతే బహిర్గతం చేసి ఖండించగలిగి, అలా చెయ్యడానికి సిద్ధంగా వున్నారో వాళ్లకి మాట్లాడేందుకు వేదిక లేదు, ఆత్రంగా విని ప్రోత్సహించే శ్రోతలు లేరు. జనం మధ్య వాళ్లకెక్కడా ‘సర్వశక్తివంతమైన’ రష్యన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ అభ్యంతరాన్ని ఏ శక్తిని ఉద్దేశించి ప్రకటిస్తే లాభదాయకమో ఆ శక్తి వాళ్లకి కనిపించడంలేదు.... జారిస్టు ప్రభుత్వాన్ని గురించి దేశవ్యాపితంగా బహిర్గతంచేసి ఖండించేందుకు అవసరమైన వేదికను సమకూర్చే స్థితిలో మనం యిప్పుడున్నాం, అలా చెయ్యడం మన విధి కూడా. అలాంటి వేదిక సోషల్ డెమొక్రటిక్ పత్రికే అయ్యుండాలి.”

రాజకీయ విషయాలను బహిర్గతంచేసే ఖండనకు అత్యంత ఆదర్శ శ్రోత కార్మిక వర్గమే. సర్వతోముఖమూ, సజీవమూ అయిన రాజకీయ పరిజ్ఞానం ప్రథమంగానూ, ప్రధా

సంగానూ కార్మికవర్గానికే అవసరం. ఈ జ్ఞానాన్ని — క్రియాశీల పోరాటంలోకి — ఆ పోరాటం "ప్రత్యక్ష ఫలితాలను" కలిగించే ఆశ లేనప్పుడు సైతం — మార్చగల అత్యధిక సామర్థ్యం కలిగినది యీ కార్మికవర్గమే. అఖిల రష్యా పత్రిక మాత్రమే దేశ వ్యాపితంగా బహిర్గతం చేసి ఖండించే వేదిక కాగలదు. "రాజకీయ పత్రిక లేకుండా, రాజకీయోద్యమం పేరున పిలువదగిన ఏ ఉద్యమాన్ని గాని ఆధునిక యూరప్‌లో ఊహించడం అసాధ్యం; ఈ సందర్భంలో రష్యాను నిస్సందేహంగా ఆధునిక యూరప్‌లోనే చేర్చవలసివుంటుంది. మన దేశంలో వార్తాపత్రికలు ఎన్నడో ఒక శక్తి అయ్యాయి, లేకుంటే వాటికి లంచాలిచ్చేందుకూ, కత్కోవ్, మెష్చేర్‌స్కీ వంటివాళ్లకు సహాయపడేందుకూ ప్రభుత్వం లక్షలాది రూబుళ్లను ఖర్చుపెట్టదు. ఏకవ్యక్తి నిరంకుశ ప్రభుత్వం సాగే రష్యాలో రహస్యంగా వెలువడే పత్రికలు సెన్సార్‌షిప్ కుడ్యాలను భేదించి, చట్టబద్ధ, యథాతథవాద పత్రికలచేత తమని గురించి బహిరంగంగా మాట్లాడించగలిగిన సందర్భం కొత్తదేమీ కాదు. 1870వ దశకంలోనూ, 50వ దశకంలో సైతం యిదే పరిస్థితి కనిపించింది. చట్టవిరుద్ధమైన రహస్య పత్రికలను చదివి, వాటినుండి "ఇస్క్రా" 7వ సంచికకు లేఖ రాసిన ఒక కార్మికుడి మాటల్లో "జీవించడమెలాగో, మరణించడమెలాగో"[174] నేర్చుకొనగోరేవాళ్లు ఆ రోజులతో పోలిస్తే యీ రోజుల్లో జనాభాలో చాలా విస్తృత వ్యాప్తి కలిగిన భాగాలుగా ఉన్నారు. ఆర్థిక కుంభకోణాలను బహిర్గతం చేసే ఖండనలు ఫ్యాక్టరీ యజమానులమీద యుద్ధ ప్రకటన అయినట్లే రాజకీయ కుంభకోణాలను బహిర్గతం చేసే ఖండనలు ప్రభుత్వంమీద యుద్ధం ప్రకటించడమే. బహిర్గతం చేసే ఖండనల ఉద్యమం మరింత విస్తృతమూ, మరింత శక్తివంతమూ అయ్యేకొద్దీ, యుద్ధాన్ని మొదలుపెట్టేందుకు యుద్ధాన్ని ప్రకటించే సామాజిక వర్గం అధిక సంఖ్యాకమూ, మరింత కృతనిశ్చితమూ అయ్యేకొద్దీ, ఈ యుద్ధ ప్రకటన నైతిక ప్రాముఖ్యం యెంతో ఎక్కువగా వుంటుంది. అందుకని, రాజకీయ విషయాలను బహిర్గతం చేసే ఖండనలు వాటంతటకి అవే, మనం వ్యతిరేకిస్తున్న వ్యవస్థను ఛిన్నాభిన్నంచేసే శక్తివంతమైన ఒక పరికరంగా, శత్రువునుండి అతని యాదృచ్ఛిక లేక తాత్కాలిక సహచరులను దూరంచేసే ఒక సాధనంగా, నిరంకుశ ప్రభుత్వపు శాశ్వత భాగస్వాముల మధ్య శత్రుత్వాన్నీ, అవిశ్వాసాన్నీ వ్యాపింపజేసే ఒక సాధనంగా పని చేస్తాయి.

మన కాలంలో దేశవ్యాపితంగా కుంభకోణాల ఖండలను నిర్వహించగలిగే పార్టీ మాత్రమే విప్లవ శక్తులకు అగ్రగామి దళం కాగలుగుతుంది. "దేశవ్యాపిత" అన్న పదానికి ప్రగాఢమైన అర్థం ఉంది. బహిర్గతం చేసి ఖండించే వారిలో కార్మికవర్గేతరులలోని అత్యధిక సంఖ్యాకులు (అగ్రగామి దళం కావాలన్నప్పుడు మనం యితర వర్గాలను ఆకర్షించాలన్న విషయాన్ని మరచిపోకండి) నిగ్రహశక్తిగల రాజకీయవేత్తలు, ఒడిదుడుకులులేని వ్యవహార

కుశలురు. ''సర్వశక్తివంతమైన'' రష్యన్ ప్రభుత్వంమాట అటుంచి ఓ చిన్న ఉద్యోగికి వ్యతిరేకంగా ''ఫిర్యాదుచెయ్యడం'' ఎంత ప్రమాదకరమో వాళ్ళకి చాలా బాగా తెలుసు. మరి అలాంటివాళ్ళు, తమ ఫిర్యాదులకు నిజంగానే ప్రభావం ఉంటుందనీ, మనం ఒక రాజకీయ శక్తి అనీ గ్రహించినప్పుడే, తమ ఫిర్యాదులతో మన దగ్గరకి వస్తారు. బయటి వాళ్ల దృష్టిలో అలాంటి శక్తి అయ్యేందుకుగాను, మన సొంత చైతన్యాన్నీ, చొరవనీ, శక్తినీ పెంపొందించుకోవడానికి చాలా దీక్షతోనూ, ధైర్యంగానూ కృషిచెయ్యడం అవసరం. ఈ పనిని సాధించేందుకు తిరోగామి సిద్ధాంతాచరణలకు ''అగ్రగామి దళం'' అనే చీటీని తగిలిస్తే సరిపోదు.

కాని, ప్రభుత్వ కుంభకోణాలను దేశవ్యాపితంగా బహిర్గతం చేసి ఖండించే కార్యక్రమాన్ని మనం నిజంగానే చేబట్టవలసివుంటే, మన ఉద్యమపు వర్గ స్వభావాన్ని యెలా వ్యక్తీకరించాలి? ''శ్రామికవర్గంతో సన్నిహిత సజీవ సంబంధం'' పెట్టుకోవాలని వాదించే అత్యుత్సాహపరులు యీ ప్రశ్ననే అడుగుతూ వుంటారు, యిప్పుడు కూడా అడుగుతూనే వున్నారు. ఇందుకు జవాబు యిలా బహుముఖంగా వుంటుంది: సోషల్ డెమోక్రట్లం అయిన మనం దేశవ్యాపితంగా బండారాలను బహిర్గతంచేసి ఖండించే యీ కార్యకలాపాలను నిర్వహిస్తాం. ఆందోళన క్రమంలో ఉత్పన్నమయే ప్రశ్నలన్నింటికీ సుసంగతమైన సోషల్ డెమోక్రటిక్ పద్ధతిలో, మార్క్సిజాన్ని బుద్ధిపూర్వకంగా గాని, అనుద్దేశపూర్వకంగా గాని వక్రీకరించేవాళ్ల భావాలకి ఎటువంటి చోటూ యివ్వకుండా, స్పష్టీకరణలు యివ్వబడతాయి. సర్వతోముఖమైన యీ రాజకీయాందోళన యావత్తూ, ప్రజలందరి పేరిటా ప్రభుత్వం మీద జరిగే దాడిని అవిభాజ్యమైన మొత్తంగా ఏకీకృతంచేసి, దానితోబాటు శ్రామికవర్గానికి విప్లవాత్మక శిక్షణనిచ్చి, దాని రాజకీయ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించి, కార్మికవర్గపు ఆర్థిక పోరాటానికి నాయకత్వం వహించి, పీడకులతో కార్మికవర్గానికి సద్యోజనితంగా వచ్చే ఏ ఘర్షణల క్రమంలోనైతే అంతకంతకు అధిక సంఖ్యలో శ్రామికులు చైతన్యవంతులై మన శిబిరంలోకి వచ్చి చేరుతూవుంటారో, అటువంటి అన్ని ఘర్షణలనూ వినియోగించుకొనే పార్టీ చేత నిర్వహింపబడుతుంది.

కాని ఆర్థికవాదపు అత్యంత విశిష్ట లక్షణం ఏమిటంటే, యీ సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో దాని వైఫల్యం, అంతే కాకుండా, కార్మికవర్గపు మిక్కిలి తక్షణావశ్యకతకి (రాజకీయాందోళనద్వారా, రాజకీయ విషయాలను బహిర్గతం చేసే ఖండనలద్వారా సమగ్ర రాజకీయ శిక్షణ) సాధారణ ప్రజాస్వామిక ఉద్యమంతో వున్న సామ్యాన్ని అవగాహన చేసుకోవడంలో వైఫల్యం. ఈ అవగాహనా లోపం ''మర్తీనొవైట్ పదబంధాల్లో'' మాత్రమే కాకుండా, యీ పదబంధాలతో సమానమైన అర్థం కలిగిన వర్గదృక్పథం అనుకొనేదాని ప్రస్తావనలలో కూడా వ్యక్తం అయింది. ''ఇస్క్రా'' 12వ సంచికలో ప్రచురింపబడిన

''ఆర్థికవాద'' లేఖ రచయితలు యిలా పేర్కొంటారు*: '' 'ఇస్క్రా' యొక్క యీ మౌలిక లోపమే (భావజాలానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వడం) వివిధ సామాజిక వర్గాలపట్లా, ధోరణులపట్లా సోషల్ డెమోక్రట్ల వైఖరి సమస్యపై దాని అసంగతత్వానికి కూడా కారణం. 'ఇస్క్రా' సైద్ధాంతిక చర్చల ద్వారా ('పార్టీతోబాటు పెరిగే పార్టీ కార్యకలాపాలను పెంపొందించడం' ద్వారా కాకుండా) నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి తక్షణ పరివర్తన సమస్యను పరిష్కరించింది. ప్రస్తుత పరిస్థితుల్లో, అటువంటి కార్మిక కర్తవ్య పరిష్కారంలోని కష్టాన్ని బహుశా 'ఇస్క్రా' పసిగట్టివుంటుంది (అది పసిగట్టడమే కాదు, దాదిలా శ్రద్ధవహించే స్వభావం కలిగిన ఆర్థికవాద మేధావులకన్న యీ కర్తవ్య పాలన కార్మికులకు తక్కువ కష్టంగా కనిపిస్తుందనీ, ఎందుకంటే, సదా స్మరణీయుడైన మర్తీనొవ్ భాషలో 'ప్రత్యక్ష ఫలితాలు' కలిగే అవకాశం లేని డిమాండ్లకోసం సైతం కార్మికులు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారనీ కూడా దానికి బాగా తెలుసు), కాని యీ పోరాటంకోసం తగినన్ని శక్తులను కార్మికులు కూడగట్టుకునేదాకా నిరీక్షించే ఓపికలేక, 'ఇస్క్రా' ఉదారవాదుల్లోనూ, మేధావుల్లోనూ సహచరులకోసం వెదకడం మొదలెడ్తోంది...''

ఔను, రకరకాల ''రాజీవాదులు'' ఎంతకాలంగానో వాగ్దానం చేస్తున్న మంచి ముహూర్తంకోసం — ఆర్థికవాదులు తమ సొంత వెనకబాటుతనాన్ని కార్మికుల నెత్తిపైన రుద్ది, తమ శక్తిహీనతను కార్మికులలో శక్తి లోపించిందన్న ఆరోపణలతో బలపరుచుకోవడం మానేసే ముహూర్తం కోసం ''నిరీక్షించే'' ''ఓపిక'' నిజంగానే మాలో యింక లేదు. మన ఆర్థికవాదుల్ని మేమిలా ప్రశ్నిస్తున్నాం. ''పోరాటంకోసం కార్మికవర్గపు బలాన్ని కూడగట్టడం'' అంటే వాళ్ల అర్థం ఏమిటి? దీని అర్థం, కార్మికులకు రాజకీయ శిక్షణను యివ్వడం, మన దేశపు దుష్ట నిరంకుశ ప్రభుత్వపు అన్ని పార్శ్వాలనూ వారి ముందు బయలుపెట్టడమూనని తేటతెల్లం కాదా? సరిగా యీ పనికోసమే జేమ్స్త్వాలు, టీచర్లు, గణాంకశాస్త్ర

* ఆర్థికవాదుల స్వభావాన్ని చాలా చక్కగా వెల్లడించే యీ లేఖకు, స్థలాభావ కారణంగా ''ఇస్క్రా''లో మేము జవాబివ్వలేకపోయాం. ఆ లేఖ ప్రచురణ మాకు చాలా సంతోషం కలిగించింది. ఎందుకంటే ''ఇస్క్రా'' సుసంగతమైన వర్గ దృక్పథాన్ని అనుసరించడం లేదన్న వివిధ పాతకుల ఆరోపణలు మాకు అంతకు చాలా ముందే చేరాయి. సరైన అవకాశం దొరుకుతుందేమోననీ, యీమధ్య ఒక ఫేషనుగా తయారైన యీ ఆరోపణ సరైన రూపంలో సూత్రీకరింపబడి ముందుకొస్తుందేమోననీ, అప్పుడు దానికి జవాబివ్వవచ్చుననీ మేము ఎదురు చూస్తున్నాం. ఇంకా ఏమిటంటే, దాడులనుండి కాచుకోవడంద్వారా కాకుండా, దాడులను తిప్పికొట్టడం ద్వారానే జవాబివ్వడం మా అలవాటు.

వేత్తలు, విద్యార్థులు వగైరాలమీద జరిగే రాజకీయ దాడిని బహిర్గతంచేసి ఖండించడంలో మనతో కలిసేందుకు సిద్ధపడే "ఉదారవాదుల్లోనూ, మేధావుల్లోనూ తోడ్పాటుదారులు మనకి అవసరమన్న విషయం స్పష్టం కాదా? ఈ ఆశ్చర్యజనకమైన "సంక్లిష్ట యంత్రాంగాన్ని" అర్థంచేసుకోవడం నిజంగానే అంత కష్టమా? పి. బి. అక్సెల్‌రోడ్ 1897 నుంచీ నిరంతరాయంగా "రష్యన్ సోషల్ డెమొక్రట్ల శ్రామికేతర వర్గాల్లో సహచరుల్నీ, ప్రత్యక్ష, పరోక్ష తోడ్పాటుదారుల్నీ సంపాదించుకోవడమన్న కర్తవ్య పరిష్కారం శ్రామిక వర్గం మధ్యనే చేసే ప్రచార కార్యకలాపాల స్వభావంమీదనే ప్రథమంగానూ, ప్రధానంగానూ ఆధారపడుతుంది" అని చెప్తూ రాలేదా? కాని యీ మర్తీనొవులూ, తదితర ఆర్థికవాదులూ "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటంద్వారా" కార్మికులు మొట్ట మొదట బలాన్ని కూడగట్టుకోవాలనీ (ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాలకోసం), అటు తర్వాత, బహుశా, ట్రేడ్‌యూనియనిస్టు "క్రియాశీలతకు శిక్షణ" నుంచి సోషల్ డెమొక్రటిక్ కార్యాచరణకు మారాలి!" అని అనుకుంటూనే ఉన్నారు.

ఆర్థికవాదులు యింకా యిలా అంటారు: "...తన యీ వెదుకులాటలో 'ఇస్క్రా' తరచుగానే వర్గ దృక్పథంనుంచి వైదొలగుతోంది, వర్గ వైరుధ్యాలను అస్పష్టంచేస్తోంది. 'తోడ్పాటుదార్లలో' ప్రభుత్వంపట్ల ఉన్న అసంతృప్తికి గల కారణాలూ, స్థాయిలూ విభిన్నమైనవైనప్పటికీ, సాధారణ స్వభావాన్ని అన్నింటికన్న ముందుపెడుతోంది. ఉదాహరణకు, జేమ్‌స్త్వొపట్ల 'ఇస్క్రా' వైఖరి యిలాంటిదే.... ప్రభుత్వం యిచ్చే స్వల్పరాయితీలతో అసంతుష్టి చెందిన కులీనులకు 'ఇస్క్రా' కార్మికవర్గపు తోడ్పాటును వాగ్దానం చేస్తుందే గాని, యీ సామాజిక విభాగాల మధ్య వున్న వర్గ వైరుధ్యాన్ని గురించి ఒక్క మాట కూడా చెప్పదు"ట. పాఠకుడు "నిరంకుశత్వం, జేమ్‌స్త్వొ" అన్న వ్యాసాన్ని ("ఇస్క్రా," సంచికలు 2, 4) చూసినట్లయితే – బహుశా లేఖా రచయితలు దాన్నే ఉద్దేశిస్తున్నారు – అవి* "సామాజిక తరగతులపై ఆధారపడిన నిరంకుశాధికారవర్గం బాపతు జేమ్‌స్త్వొ మెతక ఆందోళన" పట్లా, "ఆస్తిపర వర్గాలు కూడా చేసే స్వతంత్ర కార్యాచరణ" పట్లా ప్రభుత్వ వైఖరిని గురించి చర్చిస్తాయన్న సంగతిని అతను గ్రహిస్తాడు. ప్రభుత్వం జేమ్‌స్త్వొమీద పోరాటం సాగిస్తున్నప్పుడు, కార్మికులు ఊరుకోజాలరని, విప్లవాత్మక సోషల్ డెమొక్రటిక్ ఉద్యమం తన సర్వశక్తులా ప్రభుత్వంతో తలపడినప్పుడు మెతక ప్రసంగాలకు స్వస్తిచెప్పి, దృఢంగానూ, కృతనిశ్చయంతోనూ మాట్లాడవలసిందిగా జేమ్‌స్త్వొ సభ్యులు ప్రేరేపించబడినట్టు ఆ వ్యాసం పేర్కొంది. లేఖా రచయితలు దీంట్లో దేనికి ఒప్పుకోరో స్పష్టం

* ఈ రెండు వ్యాసాలకీ మధ్యలో మరో వ్యాసం ఉంది ("ఇస్క్రా," సంచిక 3). అది ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో వర్గ వైరుధ్యాలను గురించే చర్చించింది.

కాకుండా ఉంది. ''ఆస్తిపర వర్గాలు,'' ''సామాజిక తరగతులపై ఆధారపడిన నిరంకుశా ధికారవర్గపు జేమ్‌స్ట్వోలు'' అన్న పదబంధాలు కార్మికులకు అర్థంకావని వాళ్ళు భావిస్తున్నారా? జేమ్‌స్ట్వో సభ్యులను మెతక ప్రసంగాలకు స్వస్తి చెప్పి, దృఢంగా మాట్లాడమని ప్రేరేపించడం ''భావజాలానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వడమా?'' జేమ్‌స్ట్వోపట్ల కూడా నిరంకుశ ప్రభుత్వపు వైఖరి ఏమిటో బొత్తిగా ఏమీ తెలుసుకోకపోయినట్లయితే, నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి కార్మికులు ''బలాన్ని కూడగట్టుకో'' గలరని వాళ్ళు భావిస్తున్నారా? ఇదంతా కూడా అయోమయంగానే ఉండిపోయింది. కేవలం ఒక్క విషయం మాత్రమే స్పష్టంగా వుంది, సోషల్ డెమోక్రసీ రాజకీయ కర్తవ్యాలకు సంబంధించి యీ లేఖా రచయితలకున్న అవగాహన చాలా అస్పష్టమైనదన్నదే అది. వాళ్ళ యీ వ్యాఖ్యవల్ల అది మరింత స్పష్టంగా వెల్లడైంది: ''విద్యార్థి ఉద్యమాన్ని గురించి కూడా 'ఇస్క్రా' వైఖరి యిదే'' (అంటే, అది కూడా ''వర్గ వైరుధ్యాలను మభ్యపుచ్చుతుంది''). బహిరంగ ప్రదర్శనల ద్వారా అడ్డు అపుల్లేని హింస, అవ్యవస్థ, అత్యాచారాలకు నిజమైన కేంద్రం విద్యార్థులు కారనీ, రష్యన్ ప్రభుత్వమేననీ (''ఇస్క్రా,'' సంచిక 2) చాటిచెప్పవలసిందిగా కార్మికులకు విజ్ఞప్తిచేసేందుకు బదులు, బహుశా మనం ''రబోచయ మీస్ల్'' బాణీలో వాదనలను ముందుకు తేవలసింది! 1901 ఆకురాలుకాలంలో, ఫిబ్రవరి, మార్చి ఘటనల అనంతరం, విద్యార్థి ఉద్యమంలో వచ్చిన ఓ కొత్త వెల్లువకి సరిగా ముందు సోషల్ డెమోక్రట్లు యిటువంటి భావాలనే వ్యక్తంచేశారు. విద్యార్థి ఉద్యమంలో ఈ కొత్త వెల్లువ తెలియజేసిందేమిటంటే, యీ రంగంలో సైతం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ''సద్యోజనిత'' నిరసన, ఉద్యమపు చైతన్యపూరిత సోషల్ డెమోక్రటిక్ నాయకత్వాన్ని దాటి ముందుకిపోతోంది. పోలీసుల, కోసక్కుల దాడికి గురి అవుతున్న విద్యార్థుల్ని కాపాడేందుకు కార్మికులు జరిపిన సద్యోజనిత కృషి సోషల్ డెమోక్రటిక్ నిర్మాణం చైతన్యపూరిత కార్యకలాపాలను దాటి ముందుకిపోతోంది!

లేఖా రచయితలు యిలా కొనసాగించారు: ''అలా ఉండగా, 'ఇస్క్రా' యితర వ్యాసాల్లో అన్ని రకాల రాజీలనూ నిశితంగా ఖండించి, ఉదాహరణకు గెడిస్టుల[81] సహింపరాని ప్రవర్తన లాంటి వాటిని సమర్థిస్తుంది'' ఆధునిక సోషల్ డెమోక్రట్ల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు చాలా స్వల్పమైనవనీ, వాటిని పట్టుకుని ఉద్యమాన్ని చీల్చడం ఉచితం కాదనీ అవాస్తవికంగానూ, అషామాషీగానూ చెప్పబోయేవాళ్లకు పై మాటల్ని గురించి గంభీరంగా ఆలోచించవలసిందిగా మేం సలహాయిస్తున్నాం. ఓ పక్కన వివిధ వర్గాలపట్ల నిరంకుశ ప్రభుత్వం చూపే శత్రుత్వాన్ని గురించీ, నిరంకుశ ప్రభుత్వంపట్ల వివిధ సామాజిక విభాగాలు ప్రదర్శించే వ్యతిరేకతను గురించీ వివరించే విషయంలో మనం అతి తక్కువ కృషిచేశామని అనేవాళ్లు కొందరూ, మరో పక్కన యీ వివరణను ఒక ''రాజీ''గా – ''యజమా

నులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాట'' సిద్ధాంతంతో రాజీగా ఉండాలని — పరిగణించేవాళ్లు మరి కొందరూ ఉన్నప్పుడు, యీ రెండు రకాల మనుష్యులూ ఒకే సంఘంలో ఉండి, కలిసికట్టుగా పనిచెయ్యడం సాధ్యమా?

రైతాంగ విముక్తి నలభైయవ వార్షికోత్సవ సందర్భంగా వర్గ పోరాటాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మొదలుపెట్టవలసిన ఆవశ్యకత గురించి మేము చెప్పాం (సంచిక 3),[175] వీట్టె రహస్య జ్ఞాపికకి సంబంధించి స్థానిక ప్రభుత్వ సంస్థలకీ నిరంకుశ పాలనకీ మధ్య ఉన్న అభిప్రాయభేదాన్ని సరిదిద్దుకోవడం అసాధ్యమని చెప్పాం (సంచిక 4).[176] కొత్త చట్టానికి సంబంధించి ఫ్యూడల్ ప్రభువులనూ, వాళ్లకి ఊడిగంచేసే ప్రభుత్వాన్నీ (సంచిక 8)[177] ఖండించి, చట్ట విరుద్ధంగా జరిగిన జేమ్‌స్త్వో మహాసభకు మేము స్వాగతం చెప్పాం. దాస్య ప్రవృత్తితో చేసే విన్నపాలు (సంచిక 8) మాని, పోరాటానికి దిగవలసిందిగా జేమ్‌స్త్వో సభ్యులకి మేము విజ్ఞప్తిచేశాం. రాజకీయ పోరాటావశ్యకతను అర్థంచేసుకుని, ఆ పోరాటంలోకి దిగడం మొదలెట్టిన విద్యార్థులను మేము ప్రోత్సహించాం (సంచిక 3), అయితే, అదే సమయంలో, వీధి ప్రదర్శనల్లో పాల్గొనవద్దని విద్యార్థులకు బోధించిన ''శుద్ధ విద్యార్థి'' ఉద్యమ సమర్థకులు ప్రదర్శించిన ''ఘోరమైన అవగాహన లోపాన్ని'' మేము తూర్పారబట్టాం (ఫిబ్రవరి 25న మాస్కో విద్యార్థుల కార్యవర్గం విడుదలచేసిన ప్రణాళిక సందర్భంగా, సంచిక 3). ''రొస్సీయ'' పత్రికకి[178] చెందిన జిత్తులమారి లిబరల్సుయొక్క ''అర్థం లేని కలలనూ,'' ''వంచనాత్మక కాపట్యాన్నీ'' మేము బహిర్గతంచేసి ఖండించాం (సంచిక 5), అయితే దానితోబాటే, ప్రభుత్వ జైళ్లలో ''శాంతియుతులైన రచయితలనూ, వృద్ధులైన ప్రొఫెసర్లనూ, విజ్ఞానశాస్త్రజ్ఞులనూ, సుప్రసిద్ధులైన లిబరల్ జేమ్‌స్త్వో సభ్యులనూ'' తీవ్ర క్రోధంతో దారుణమైన హింసాకాండకు గురిచెయ్యడాన్ని మనం పేర్కొన్నాం (సంచిక 5, ''సాహిత్యంపై పోలీసుల దాడి''). ''కార్మిక సంక్షేమానికి ప్రభుత్వ రక్షణ'' పథకపు అంతరార్థాన్ని బహిర్గతంచేసి, ''కార్మికవర్గం తన డిమాండ్లను ముందుకు తెచ్చేదాకా వేచివుండకుండా, అటువంటి సంస్కరణలకోసం కిందనుంచి డిమాండు రాకుండా నిరోధించేందుకుగాను, పైనుంచి సంస్కరణలను మంజూరు చెయ్యడం మేలు'' అన్న ''విలువైన ఒప్పుకోలు''ను మేము హర్షించాం (సంచిక 6). ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతువిప్పి నిరసన తెలిపిన గణాంకశాస్త్రజ్ఞులను మనం ప్రోత్సహించాం (సంచిక 7), సమ్మె విచ్ఛిన్నానికి పూనుకున్న గణాంకశాస్త్రజ్ఞులను మనం నిరసించాం (సంచిక 9). ఈ ఎత్తుగడలను శ్రామికవర్గపు చైతన్యాన్ని మసకబారచెయ్యడంగానూ, లిబరలిజంతో రాజీగానూ పరిగణించేవాడు ''క్రెడో'' కార్యక్రమపు అసలు అర్థాన్ని గ్రహించలేదన్న విషయాన్ని బయటపెట్టుకుంటూ, మరోపక్కన, తను ఎంత ఎక్కువగా ఆ విషయాన్ని కాదంటున్నా కూడా వాస్తవంలో ఆ కార్యక్రమాన్నే అమలుజరుపుతున్నాడు. అటువంటి వైఖరి కారణంగా సోషల్

డెమోక్రటిక్ ఉద్యమాన్ని "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" దిశగా అతను లాక్కెళ్తాడు, లిబరలిజానికి దాసోహం అంటాడు, అన్ని లిబరల్ సమస్యల్లోనూ క్రియాశీలంగా జోక్యంచేసుకునే కర్తవ్యాన్నీ, యీ సమస్యపట్ల తన సొంత, సోషల్ డెమోక్రటిక్ వైఖరిని నిర్ణయించుకునే కర్తవ్యాన్నీ వదిలేస్తాడు.

## ఊ) మరోసారి "అబద్ధాలకోర్లు," మరోసారి "ఇంద్రజాలికులు"

ఈ శిష్ట పదాలు "రబోచెయె దేలొ" వన్న విషయం పాఠకుడికి గుర్తుండి వుంటుంది. అది "కార్మికోద్యమాన్ని బూర్జువా ప్రజాస్వామ్యానికి ఒక సాధనంగా మార్చేసేందుకు పరోక్షంగా భూమికను తయారుచేస్తోంది" అన్న మా ఆరోపణకు అది యిలా జవాబు చేప్తోంది. "రబోచెయె దేలొ" తన అమాయకత్వం కారణంగా, యీ ఆరోపణ వాద వివాదం సందర్భంగా చేసే దాడి తప్ప వేరేమీ కాదని నిర్ణయించుకుంది: ద్వేషబుద్ధి కలిగిన యీ సిద్ధాంతజడులు మమ్మల్ని గురించి రకరకాల అప్రియ విషయాలు చెప్పాలని కంకణం కట్టుకున్నారు. మరి, బూర్జువా ప్రజాస్వామ్యానికి ఒక సాధనం కావడంకన్న అప్రియ విషయం మరొకటేమిటి వుంటుంది? అందుకని పెద్ద పెద్ద అక్షరాల్లో వాళ్ళ ఆ ఆరోపణకి "ఖండన"ను ప్రచురించారు. "ఇదంతా పచ్చి అబద్ధం" ("రెండు మహాసభలు," పేజి 30), "ఇంద్రజాలం" (31), "ఛద్మవేషం" (33) తప్ప మరేమీ కాదు. ఇంద్రుడి మాదిరిగానే "రబోచెయె దేలొ" (ఇంద్రుడితో దానికి ఎక్కువ సామ్యమేమీ లేకపోయినప్పటికీ) తనది తప్పు కనుకనే మండిపడుతోంది. తన ప్రత్యర్థి వాదనా పద్ధతిని అర్థం చేసుకొనే సామర్థ్యం తనకి లేదు కనుకనే తొందరపాటుగా దూషణకు పూనుకుంటోంది. అయితే, అది ఏ కొంచెం ఆలోచించినా, ప్రజోద్యమంలో సద్యోజనితత్వానికి ఏమాత్రం దాసోహమన్నా, సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలను ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాల స్థాయికి ఏమాత్రం దిగజార్చినా – దాని అర్థం కార్మికోద్యమాన్ని బూర్జువా ప్రజాస్వామ్యానికి ఒక సాధనంగా మార్చడమే అన్న విషయాన్ని అది అర్థంచేసుకోగలిగి వుండేది. సద్యోజనిత కార్మికోద్యమం తనకు తాను ట్రేడ్‌యూనియనిజాన్ని తప్ప మరిదేన్నీ ఉత్పన్నం చెయ్యలేదు (విధిగా దాన్ని ఉత్పన్నం చేస్తుంది), కార్మికవర్గపు ట్రేడ్‌యూనియనిస్టు రాజకీయాలంటే సరిగా కార్మికవర్గ బూర్జువా రాజకీయాలే. కార్మికవర్గం రాజకీయ పోరాటంలో పాల్గొవచ్చు, రాజకీయ విప్లవంలో సైతం పాల్గొవచ్చు, అయితే అంతమాత్రాననే దాని రాజకీయాలు సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలైపోవు. "రబోచెయె దేలొ" యీ విషయాన్ని నిరాకరించేందుకు సాహసిస్తుందా?

అది చివరకు యిన్నాళ్ల తర్వాత, బహిరంగంగా, స్పష్టంగా, మాటలగారడీ లేకుండా అంత ర్జాతీయ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ తక్షణ సమస్యలపైన తన అవగాహన ఏమిటో వివరిస్తుందా? ఊహూం. అది ఇలాంటి పని ఎన్నడూ చెయ్యదు. ఎందుకంటారేమో, అది ఓ కిటుకును పట్టుక్కూర్చుంది. అన్నింటికీ "కాదు" అని చెప్పడమే ఆ కిటుకు. "అది నేను కాను, అది నా గుర్రం కాదు, నేను దాన్ని నడపడం లేదు. మేము ఆర్థికవాదులం కాము, 'రబోచయ మీస్ల్' ఆర్థికవాదాన్ని సమర్థించదు; అబ్బే అసలు రష్యాలో ఆర్థిక వాదమే లేదు." ఇది మహా నేర్పైన, "రాజకీయ" కిటుకు. అయితే ఇందులో ఒకే ఒక్క లోపం ఉంది — ఈ కిటుకుని ప్రయోగించే పత్రికలను జనం "దేవరా, తమ బాంచను" అనే బాపతువి అంటారు.

రష్యాలోని బూర్జువా ప్రజాస్వామ్యం, మొత్తంమీద "కాల్పనిక ఛాయ" మాత్రమేనని "రబోచెయె దేలొ" ఉద్దేశం ("రెండు మహాసభలు," పేజి 32).* వీళ్లెంత సుఖవంతులో! ఉష్ట్రపక్షుల్లా, వీళ్లు తమ తలల్ని యిసుకలో దూర్చేసి, చుట్టూ అన్నీ మాయమైపోయా యని ఊహించుకుంటారు. మార్క్సిజంమీద తాము విజయం సాధించామనీ, మార్క్సిజం కూలిపోవడమే కాక రూపుమాసిపోయిందనీ లిబరల్ పత్రికా రచయితలు నెల నెలా ప్రపం చానికి చాటుతున్నారు. వర్గపోరాటాన్ని గురించిన బ్రెంటానో అవగాహననీ,[179] రాజకీయా లకు సంబంధించి ట్రేడ్‌యూనియనిస్టు అవగాహననీ కార్మికుల దగ్గరకి తెచ్చే లిబరల్సుని ప్రోత్సహించే లిబరల్ వార్తా పత్రికలు ("సెంట్ పీటర్స్‌బుర్గ్‌స్కియె వేదొమొస్తి," "రూస్కియె వేదొమొస్తి," యింకా అనేక యితర పత్రికలూ) ఉన్నాయి; మార్క్సిజాన్ని విమర్శించే ప్రజ్ఞావంతుల సమూహం వుంది, వీళ్ల నిజ ధోరణులను "క్రెడో" చాలా బాగా వెల్లడిం చింది, వీళ్ల రచనలే యీనాడు రష్యాలో అడ్డూ, ఆపూ లేకుండా ప్రచురింపబడుతున్నాయి; విప్లవవాద సోషల్ డెమోక్రటికేతర ధోరణులు, ప్రత్యేకించి ఫిబ్రవరి, మార్చి ఘటనల

---

* దీని తర్వాత "రష్యాలోని నిర్దిష్ట పరిస్థితులు కార్మికోద్యమాన్ని విప్లవ పథం మీదకి తప్పనిసరిగా నెట్టుతున్నాయి" అన్న ప్రస్తావన ఉంది. అయితే వీళ్లు కార్మిక వర్గపు విప్లవ పంథా సోషల్ డెమోక్రటిక్ పంథా కాకపోవచ్చునన్న విషయాన్ని అర్థం చేసుకోడానికి నిరాకరిస్తారు. నిరంకుశ ప్రభుత్వాల పాలన సాగినప్పుడు, యావత్తు పశ్చిమ యూరపియన్ బూర్జువావర్గమూ కార్మికులను విప్లవ పథంమీదకి "నెట్టింది," బుద్ధి పూర్వకంగా నెట్టింది. కాని, సోషల్ డెమోక్రట్లం అయిన మనం, దానితో సంతృప్తి చెంద జాలం. మనం ఏవిధంగానైనా సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలను సద్యోజనిత ట్రేడ్ యూనియనిస్టు రాజకీయాల స్థాయికి దిగజార్చినట్లయితే, తద్వారా మనం బూర్జువా ప్రజాస్వా మ్యవాదుల జాలంలో పడతాం.

తర్వాత మరింతగా తిరిగి తలెత్తుతున్నాయి — అయ్యా, ఇవన్నీ నిస్సందేహంగా కాల్పనిక ఛాయలే! వీటన్నింటికీ బూర్జువా ప్రజాస్వామ్యంతో ఏ సంబంధమూ లేదు!

''రబోచెయె దేలొ,'' ''ఇస్క్రా'' 12వ సంచికలో ప్రచురింపబడిన ఆర్థికవాద లేఖా రచయితలూ ''వసంతకాలంలో జరిగిన ఘటనలు సోషల్ డెమొక్రటిక్ ఉద్యమపు పలుకుబడినీ, ప్రతిష్ఠనీ పెంచేందుకు బదులు, విప్లవాత్మక సోషల్ డెమొక్రటికేతర ధోరణులలో యింతటి పునర్జాగృతి ఎందుకొచ్చిందని ఆలోచించవలసివుంది.''

దీనికి వాస్తవ కారణం ఏమిటంటే, మన కర్తవ్య పాలనలో మనం విఫలమయ్యాం. కార్మిక జనసామాన్యం మనకంటె తాము ఎక్కువ క్రియాశీలంగా ఉన్నట్లు రుజువుచేసుకున్నారు. ప్రతిపక్ష శ్రేణులన్నింటిలోనూ పరివ్యాపించి వున్న భావాలకు సంబంధించిన పూర్తి పరిజ్ఞానం కలిగి, ఉద్యమానికి నాయకత్వం వహించడానికీ, సద్యోజనితంగా ఆరంభమైన ప్రదర్శనను రాజకీయమైనదిగా మార్చడానికీ, దాని రాజకీయ స్వభావాన్ని విస్తృతం చెయ్యడం మొదలైన వాటికీ సామర్థ్యం కలిగిన తగినంత శిక్షణ పొందిన విప్లవాత్మక నాయకులూ, ఆర్గనైజర్లూ మనకి కొదవగా ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో, మరింత చలనశీలురూ, మరింత క్రియాశీలురూ అయిన సోషల్ డెమొక్రటికేతర విప్లవవాదులు మన వెనకబాటుతనాన్ని అనివార్యంగా ఉపయోగించుకుంటారు. కాగా పోలీసులకీ, సైనికులకీ వ్యతిరేకంగా ఆత్మబలిదానానికి సిద్ధపడి కార్మికులు ఎంత సమరశీలంగా పోరాడినా కూడా, వాళ్ల ఎంతటి విప్లవాత్మక కార్యకలాపాలు చేబట్టినా, సోషల్ డెమొక్రటిక్ అగ్రదళానికి కాక, బూర్జువా ప్రజాస్వామ్యానికి చెందిన విప్లవవాదులకు మద్దతుదన్నుగా మాత్రమే ఉండిపోతారు. ఉదాహరణకు, జర్మన్ సోషల్ డెమొక్రట్లనే తీసుకుందాం. మన ఆర్థికవాదులు వాళ్లలోని బలహీన పార్శ్వాలను మాత్రమే ఆదర్శంగా తీసుకోవాలనుకుంటారు. జర్మనీలో సోషల్ డెమొక్రటిక్ ఉద్యమపు పలుకుబడినీ, ప్రతిష్ఠనీ పెంపొందించే ఏ ఒక్క రాజకీయ సంఘటనా లేకపోవడానికి కారణమేమిటి? ప్రతి ఒక్క సంఘటననీ అత్యంత విప్లవాత్మకంగా అంచనా వెయ్యడంలోనూ, పీడనకి వ్యతిరేకంగా ప్రతి ఒక్క నిరసననీ బలపరచడంలోనూ అందరికంటె ఎప్పుడూ అది ముందుండటమే యిందుకు కారణం. కార్మికులు తమకు రాజకీయ హక్కులు లేవని గ్రహించేందుకు ఆర్థిక పోరాటం తోడ్పడుతుందనీ, నిర్దిష్ట పరిస్థితులు కార్మికోద్యమాన్ని అనివార్యంగా విప్లవ పథంమీదకి నెట్టుతాయనే వాదనలతో అది తనని తాను జోకొట్టుకోదు. సామాజిక, రాజకీయ జీవితపు ప్రతి ఒక్క రంగంలోనూ, ప్రతి ఒక్క సమస్యలోనూ అది జోక్యంచేసుకుంటుంది: అది నగర మేయరుగా బూర్జువా ప్రగతిశీల వ్యక్తి ఎన్నికను ఆమోదించేందుకు కైజర్ విల్‌హెల్మ్ నిరాకరణ సమస్య కావచ్చు (అలాంటి పని, వాస్తవంలో, లిబరలిజంతో రాజీపడటమేనని జర్మన్లకు మన ఆర్థికవాదులు యింకా తెలియజెప్పలేకపోయారు!); అది ''అశ్లీల'' ప్రచురణ

లకూ, చిత్రాలకూ వ్యతిరేకంగా చట్టం విషయం కావచ్చు; అది ప్రొఫెసర్ల ఎంపిక విషయంలో ప్రభుత్వ జోక్యం విషయం వగైరా వగైరాలు కావచ్చు. సోషల్ డెమోక్రట్లు అన్ని వర్గాల్లోనూ రాజకీయ అసంతృప్తిని జాగృతంచేస్తూ, నిద్రబోతులను మేల్కొలుపుతూ, మందకొడులకు ముందుకెళ్లేందుకు ప్రేరణనిస్తూ, శ్రామికవర్గపు రాజకీయ చైతన్య, రాజకీయ క్రియాశీలత పెరుగుదలకు అవసరమైన బోలెడంత సమాచారాన్ని సరఫరాచేస్తూ, అన్నిచోట్లా ముందు శ్రేణిలో కనిపిస్తారు. తత్పర్యవసానంగా, సోషలిజానికి గర్భ శత్రువులు సైతం యీ పురోగామి రాజకీయ పోరాట యోధులపట్ల నిండు గౌరవం కలిగివుంటారు. తత్పర్యవసానంగానే బూర్జువావర్గాలనుంచీ, నిరంకుశాధికార, కోర్టు వర్గాలనుంచీ సైతం తరచుగానే ఏ ముఖ్యమైన పత్రమో, యింద్రజాలంలో మాదిరిగా "Vorwärts" సంపాదక కార్యాలయానికి చేరుకుంటూ వుంటుంది.

అయితే, ''రబోచెయె దేలొ,'' తన అవగాహనకి బొత్తిగా అందని కారణంగా, చేతులెత్తేసి, యిది ''ఛద్మ వేషం!'' అంటూ అరిచేసిన ఆ ''విరోధాభాస''లా కనిపించే దానికి పరిష్కారం యిదీ: నిజంగానే దాన్ని గురించి కొంచెం ఆలోచించండి: మేము ''రబోచెయె దేలొ'' వాళ్లం, అతి విస్తృతమైన కార్మికోద్యమాన్నే ఆందోళననే మూలస్తంభంగా (మరి యీ మాటను పెద్ద అక్షరాల్లో వేస్తాం!) పరిగణిస్తాం. సద్యోజనిత శక్తుల ప్రాముఖ్యాన్ని తగ్గించి చెప్పడానికి వ్యతిరేకంగా చిన్నా పెద్దా ప్రతి ఒక్కడినీ మేము హెచ్చరిస్తాం. ఆర్థిక పోరాటానికే – దాని'కే' – మేము రాజకీయ స్వభావాన్ని కల్పించాలని కోరుతాం. శ్రామిక వర్గ పోరాటంతో సన్నిహితమూ, సజీవమూ అయిన సంబంధాన్ని కొనసాగించాలని మేము వాంఛిస్తాం. అయినా కూడా, కార్మికోద్యమాన్ని బూర్జువా ప్రజాస్వామ్యానికొక సాధనంగా మార్చేందుకు భూమికను మేము తయారుచేస్తున్నామని అంటున్నారు! అయితే యీ మాట అనేందుకు సాహసిస్తున్నది ఎవరు? ప్రతి ఒక్క ''లిబరల్'' సమస్యలోనూ జోక్యం కల్పించుకోవడంద్వారా, విద్యార్థుల విషయంలోనూ, చివరకు (ఎంత దారుణం!) జేమ్స్త్వొ సభ్యుల విషయంలోనూ విశేషంగా శ్రద్ధ వహించడంద్వారా లిబరలిజంతో ''రాజీపడే''వాళ్లు (''శ్రామిక వర్గ పోరాటంతో సన్నిహిత, సజీవ సంబంధం'' అన్నదాన్ని వాళ్లెంత తప్పుగా అర్థంచేసుకున్నారో!) మొత్తంమీద, జనాభాలోని శ్రామికవర్గేతర వర్గాలమధ్య తమ కృషిలో ఎక్కువ భాగాన్ని (ఆర్థికవాదులతో పోలిస్తే) వినియోగించాలని కోరేవాళ్లు! ఇది ''ఛద్మ వేషం'' కాక మరేమిటి?

పాపం ''రబోచెయె దేలొ''! ఈ యక్షప్రశ్నకి దానికి ఎప్పటికైనా సమాధానం దొరికేనా?

# IV

## ఆర్థికవాదుల అనిపుణత, విప్లవకారుల నిర్మాణం

రాజకీయాందోళనకు మిక్కిలి విస్తృతంగా వర్తించే సాధనం ఆర్థిక పోరాటమేననీ, ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం యీనాటి మన కర్తవ్యం అనీ ''రబో చెయె దేలొ'' చేసిన ఉద్ఘాటనలు – వీటిని నేనింతకు ముందే విశ్లేషించాను – మన రాజకీయ కర్తవ్యాలకు సంబంధించే కాక, మన నిర్మాణ పరమైన కర్తవ్యాలకు సంబంధించి కూడా సంకుచితమైన దృక్పథాన్ని వ్యక్తంచేస్తున్నాయి. ''యజమానులకీ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా జరిపే ఆర్థిక పోరాటంలో'' అఖిల రష్యా కేంద్రీకృత సంఘమంటూ అవసరమే లేదు. అందుచేత యీ పోరాటం రాజకీయ వ్యతిరేకత, నిరసన, కోపాతిరేకాల వ్యక్తీకరణ లన్నింటినీ ఒకే సాధారణ దాడిలో ఏకీకృతం చెయ్యగల సంఘాన్ని, వృత్తి విప్లవకారులతో కూడి, యావన్మంది ప్రజల అసలైన రాజకీయ నాయకులచేత నడపబడే సంఘాన్ని ఉత్పన్నం చెయ్యజాలదు. ఇది సహజమే. ఏ సంఘపు స్వభావమైనా సహజంగానూ, తప్పనిసరిగానూ దాని కార్యకలాపాల సారాంశంపైనే ఆధారపడుతుంది. దీన్నిబట్టి, ''రబోచెయె దేలొ,'' పైన విశ్లేషింపబడిన తన ఉద్ఘాటనల ద్వారా, రాజకీయ కార్యకలాపాల్లోని సంకుచితత్వాన్నే కాకుండా నిర్మాణపరమైన సంకుచితత్వాన్ని ఆశీర్వదిస్తుంది, సరైనదని ముద్రవేస్తుంది. ''రబోచెయె దేలొ'' ఎప్పటిమాదిరిగానే, యీ సందర్భంలో కూడా, తను సద్యోజనితత్వానికి సాగిలపడే చైతన్యం కలిగిన పత్రిక అన్న సంగతిని రుజువుచేసుకుంది. అయితే, సద్యోజనితంగా అభివృద్ధిచెందే నిర్మాణ రూపాలకు దాసోహం అనడం, నిర్మాణరంగంలో మన కృషి సంకుచితత్వాన్నీ, అనిపుణతనూ అతి ముఖ్యమైన యీ రంగంలో మనం అనుసరించేది చేతివృత్తుల నాటి పద్ధతులన్న విషయాన్నీ గుర్తించకపోవడం – యిదే మన ఉద్యమాన్ని యీ రోజున పట్టి పీడిస్తున్న ఓ పెద్ద వ్యాధి అని నా ఉద్దేశం. నిస్సందేహంగా ఇది పతన ఫలితంగా వస్తున్న వ్యాధి కాదు, పెరుగుదలతో వస్తున్న వ్యాధి. అయితే ప్రస్తుతం, సద్యోజనితంగా పెల్లుబుకుతున్న కోపపు వెల్లువ మననీ, మన ఉద్యమ నాయకుల్నీ, ఆర్గనైజర్లనీ ముంచెత్తుతున్న యీనాడు, వెనుకబాటుతనాన్ని సమర్థించడంపైనా, యీ విషయంలో సంకుచితత్వాన్ని ప్రమాణీకరించడంపైనా మనం రాజీలేని పోరాటం జరపవలసి వుంది. కార్యరంగంలో ఉన్నవాళ్లందరిలోనూ లేక ఆ కృషిని చేబట్టేందుకు సన్నద్ధులవుతున్నవారిలోనూ, మనలో ప్రబలంగా వున్న ''అనిపుణత''పట్ల అసంతృప్తిని రేకెత్తించడం, దాన్ని వదిలించుకోవాలన్న అచంచల సంకల్పాన్ని కలిగించడం ప్రత్యేకించి అవసరం.

## అ) అనిపుణత అంటే ఏమిటి?

1894–1901 నాటి నమూనాప్రాయమైన ఒక సోషల్ డెమోక్రటిక్ అధ్యయన బృందపు కార్యకలాపాలను క్లుప్తంగా వర్ణించడంద్వారా యీ ప్రశ్నకు సమాధానం యిచ్చేందుకు నేను ప్రయత్నిస్తాను. ఆనాటి విద్యార్థి యువజన సామాన్యం మార్క్సిజంలో మునిగి తేలుతూ వుండేదన్న సంగతి మనకి తెలిసిందే. అయితే ఈ విద్యార్థులు ఒక సిద్ధాంతంగా మాత్రమే మార్క్సిజంలో మునిగి తేలలేదు, అంతకన్న ఎక్కువగా ''ఏం చెయ్యాలి?'' అన్న ప్రశ్నకు జవాబుగానూ, శత్రువుకు వ్యతిరేకంగా పోరాటరంగంలోకి ఒక పిలుపుగానూ మార్క్సిజంపట్ల వాళ్లు ఆకర్షితులయ్యారు. ఈ కొత్త యోధులు ఆశ్చర్యం కొలిపేటంతటి ఆదిమ ఆయుధాలతోనూ, శిక్షణతోనూ యుద్ధరంగంలో దిగారు. అనేక సందర్భాల్లో వాళ్లకి అసలు ఆయుధాల్లేవు, శిక్షణ అసలు బొత్తిగా లేదు. తమ పొలాలనుంచి దుడ్డుకర్రలు తీసుకుని బయల్దేరిన రైతుల మాదిరిగా వాళ్లు యుద్ధానికి దండెత్తివెళ్లారు. ఉద్యమంలోని పూర్వ సభ్యులతో ఏ సంబంధమూ లేకుండా, యితర జిల్లాల్లో గాని, కనీసం అదే నగరంలోని యితర ప్రాంతాల్లో గాని (యితర విద్యా సంస్థల్లో గాని) ఉన్న అధ్యయన బృందాలతో ఎలాంటి సంబంధమూ లేకుండా, విప్లవ కృషియొక్క విభిన్న శాఖల నిర్మాణమేమీ లేకుండా, ఏ కొంచెం కాలవ్యవధికైనా కార్యకలాపాలకు సంబంధించి ఎటువంటి క్రమబద్ధమైన పథకమూ లేకుండా ఒక విద్యార్థి బృందం కార్మికులతో సంబంధాలు పెట్టుకుని పని మొదలుపెడుతుంది. ఆ బృందం తన ప్రచారాందోళనలను క్రమంగా పెంచుకుంటూపోతుంది. తన కార్యకలాపాల ద్వారా కార్మికుల్లో గణనీయమైన విస్తృత విభాగాల సానుభూతిని సంపాదించుకుంటుంది. విద్యావంతుల శ్రేణిలో ఒక విభాగపు సానుభూతిని కూడా పొందుతుంది. తనకు ధన సహాయం చేసే యీ విభాగంనుంచే విద్యార్థి ''కమిటీ'' కొత్త యువజన బృందాలను సభ్యులుగా చేర్చుకుంటుంది. ఈ కమిటీ (లేక పోరాట సమితి) ఆకర్షణ శక్తి పెరుగుతుంది, దాని కార్యకలాపాల పరిధి మరింత విస్తరిస్తుంది. ఆ కమిటీ తన యీ కార్యకలాపాన్ని పరమ సద్యోజనితంగా విస్తృతం చేస్తుంది. ఓ ఏడాది క్రితమో, కొద్ది నెలల క్రితమో విద్యార్థి బృందపు సమావేశాల్లో ప్రసంగించి, ''ఎక్కడికి వెళ్లాలి?'' అన్న సమస్యపై చర్చలు జరిపి, కార్మికులతో సంబంధాలు నెలకొల్పుకుని, వాటిని కొనసాగించి, కరపత్రాలు రాసి, ప్రచురించినవాళ్లే, యిప్పుడు విప్లవకారుల యితర గ్రూపులతో సంబంధాలు పెట్టుకుంటారు, సాహిత్యం సంపాదిస్తారు, స్థానిక పత్రిక ప్రచురణకు పూనుకుంటారు, ఒక ప్రదర్శన ఏర్పాటును గురించి మాట్లాడటం మొదలెడతారు, చివరకు బాహాటమైన పోరాటం మొదలుపెడతారు (ఇది, ఆయా

పరిస్థితులనుబట్టి మొదటి ఆందోళనా కరపత్ర ప్రచురణ కావచ్చు, లేక పత్రిక మొదటి సంచిక ప్రచురణ కావచ్చు, అదీ కాకపోతే మొదటి ప్రదర్శన ఏర్పాటు కావచ్చు). సర్వసామాన్యంగా అలాంటి కార్యాచరణకి పురిటిలోనే పూర్తిగా సంధికొట్టేస్తుంది. పురిటిలోనే, పూర్తిగా అని ఎందుకు అంటున్నామంటే, ఈ బహిరంగ పోరాటం క్రమబద్ధంగా, బాగా ఆలోచించి, కాలక్రమంలో తయారుచేసిన పథకం మేరకు దీర్ఘకాలంపాటు పట్టుదలగా జరిగేది కాక, సాంప్రదాయిక అధ్యయన బృందపు కృషి సద్యోజనిత పెరుగుదల పర్యవసానం కనుక. సహజంగానే, దాదాపు అన్ని సందర్భాల్లోనూ, పోలీసులకు స్థానిక ఉద్యమ ప్రధాన నాయకులెవరో ముందే తెలిసివుంటుంది. విద్యార్థులుగా వున్న రోజుల్లోనే వాళ్లు ''ప్రసిద్ధులయ్యారు'' కనుక, పోలీసులు దాడిచేసి వాళ్లని పట్టుకునేందుకు కేవలం సరైన అదనుకోసం మాత్రమే వేచివున్నారు. వాళ్లు కావాలనే అధ్యయన బృందం తన కృషిని పెంపొందించుకునేందుకు తగినంత వ్యవధిని – నేరారోపణకు ప్రత్యక్ష ఆధారాన్ని చేజిక్కించుకునేందుకు వీలుగా – యిచ్చారు. తమకు తెలిసినవారిలో కొందరిని ''కొత్త తరాన్ని వృద్ధిచేసేందుకు'' (నాకు తెలిసినంతవరకు, యిది, మనవాళ్లూ, పోలీసులూ కూడా వాడే సాంకేతిక పదం) స్వేచ్ఛగా ఉండనిచ్చేవారు. ఈ మాదిరి పోరాటాన్ని రైతులు తమ దుడ్డుకర్రలతో ఆధునిక సైన్యంమీదకి తరలి వెళ్లడంతో సరిపోల్చకుండా ఉండలేం. యోధులకి శిక్షణ బొత్తిగా కొరవడినప్పటికీ, విస్తరించి, పెరిగి, విజయాలను సాధించిన ఉద్యమ జీవశక్తిని చూసి ఆశ్చర్యపోకుండా ఎవరూ ఉండలేరు. నిజమే, చారిత్రక దృష్ట్యా, ఆయుధాల ఆదిమత్వం ఆదిలో అనివార్యమే కాకుండా, యోధులను భారీఎత్తున చేర్చుకునేందుకు అవసరాల్లో ఒకటిగా ఉచితమైనదే కూడా. కాని అసలైన పోరాటాలు ప్రారంభమైనప్పుడు (వాస్తవానికి అవి 1896 వేసవిలో సమ్మెలతో మొదలయ్యాయి); మన పోరాట శాఖల్లో వున్న లోపాలు అంతకంతకు అధిక స్థాయిలో బయటపడ్డాయి. మొదట విభ్రాంతి చెంది, అనేక పొరపాటు చర్యలు తీసుకున్న ప్రభుత్వం (ఉదాహరణకు, సోషలిస్టుల దుష్కార్యాలను వర్ణించి జనసామాన్యానికి విజ్ఞప్తిచేసి, కార్మికులను రాజధాని నగరాలనుంచి ప్రాంతీయ పారిశ్రామిక కేంద్రాలకు వెళ్లగొట్టి), అతి త్వరలోనే పోరాటపు కొత్త పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుని, అన్ని రకాల అస్త్ర శస్త్రాలతోనూ సుసజ్జితులైన ఏజెంట్లు, గూఢచారుల, రాజకీయ బృందాలను రంగంలోకి పకడ్బందీగా దింపింది. దాడులు ముమ్మరమయ్యాయి, విస్తృత సంఖ్యలో అరెస్టులు జరగడంతో స్థానిక అధ్యయన బృందాల సభ్యులను పూర్తిగా ఏరివెయ్యడంతో కార్మిక జనసామాన్యం దాదాపుగా నాయకత్వమంతటినీ కోల్పోయింది. ఉద్యమం ఆశ్చర్యం కొలిపేటంతగా ఎగుడుదిగుళ్ల స్వభావాన్ని సంతరించుకుంది. కార్యకలాపాల్లో ఒక అనుస్యూతినీ, పొందికనూ నిలబెట్టడం పూర్తిగా అసంభవమైంది. పైన వర్ణించిన పరిస్థితుల అనివార్య పర్యవసానం ఏమిటంటే: స్థానిక నాయకులు ఘోరంగా చెల్లాచెద

రైపోయి గడపవలసి రావడం, అధ్యయన బృంద సభ్యత్వాల అస్థిర స్వభావం, సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సమస్యల్లో శిక్షణ లోపం, అదే సమస్యలపై సంకుచిత దృక్పథం ఏర్పడటం. పరిస్థితులు ఏ దశకు చేరుకున్నాయంటే, కొన్నిచోట్ల, మనలో ఆత్మ సంయమనమూ, రహస్య గోపన సామర్థ్యమూ కొరవడినందువల్ల కార్మికులు మేధావుల్లో విశ్వాసాన్ని కోల్పోయి, వాళ్లకు దూరంకావడం మొదలెట్టారు. మేధావులు చాలా అజాగ్రత్తపరులనీ, పోలీసు దాడులకు కారణభూతులవుతున్నారనీ అనడం మొదలెట్టారు!

ఉద్యమాన్ని గురించి ఏ కొంచెం తెలిసినవాడికైనా కూడా, ఆలోచనాపరులైన సోషల్ డెమోక్రట్లందరూ యీ అనిపుణ పద్ధతులను చివరకు యిప్పుడు ఒక వ్యాధిగా పరిగణిస్తున్నారన్న సంగతి తెలుసు. ఉద్యమంతో పరిచయంలేని పాఠకుడు, ఉద్యమానికి సంబంధించిన ఓ ప్రత్యేక దశను, ఓ ప్రత్యేక వ్యాధిని నేను "కల్పిస్తున్నాను" అని అనుకోకుండా ఉండేందుకుగాను, యింతకుముందు పేర్కొన్న సాక్షి రచననుంచే మళ్లీ ఉదహరిస్తున్నాను. ఈ ఖండిక పెద్దదైనందుకు పాఠకులు నన్ను మన్నిస్తారని ఆశిస్తాను:

బి–వ్ "రబోచెయె దేలో" 6వ సంచికలో యిలా రాశాడు: "మరింత విస్తృతమైన ప్రత్యక్ష కార్యకలాపాలకు క్రమ పరివర్తన, రష్యన్ కార్మికోద్యమం యీనాడు ఏ దశగుండా గడుస్తోందో ఆ సాధారణ పరివర్తన దశపై నేరుగా ఆధారపడిన పరివర్తన ఒక విశిష్ట లక్షణం... కాగా, రష్యన్ కార్మికుల విప్లవ సాధారణ యంత్రాంగంలో, యింతకంటె తక్కువ ఆసక్తిదాయకం కాని మరో లక్షణం వుంది. నా ఉద్దేశంలో అది *కార్యాచరణకు యోగ్యమైన విప్లవ శక్తుల సాధారణ కొరత,** యీ కొరత ఒక్క పీటర్స్‌బుర్గ్‌లోనే కాకుండా, రష్యా అంతటా కనిపిస్తోంది. కార్మికోద్యమ సాధారణ పునరుజ్జీవనంతో, కార్మిక జనసామాన్యపు సాధారణాభివృద్ధితో, సమ్మెల మధ్య వ్యవధి తగ్గడంతో, కార్మికుల సామూహిక పోరాటం అంతకంతకు అధికంగా బహిరంగ రూపాన్ని ధరించడంతో, దమనకాండ, అరెస్టులను, ప్రవాస, దేశాంతరవాస శిక్షలను ప్రభుత్వం ముమ్మరంచెయ్యడంతో *అత్యంత నిపుణమైన విప్లవ శక్తుల కొరత అంతకంతకు ఎక్కువగా ప్రస్ఫుటమవుతోంది*, నిస్సందేహంగా *యిది ఉద్యమపు ప్రగాఢత్వాన్నీ, సాధారణ స్వభావాన్నీ దెబ్బతియ్యకుండా ఉండజాలదు.* తమమీద విప్లవ సంఘాల గట్టి, ప్రత్యక్ష ప్రభావం లేకుండానే అనేక సమ్మెలు జరుగుతున్నాయి.... ఆందోళనకు సంబంధించిన కరపత్రాలూ, రహస్య సాహిత్యాల కొరత కనిపిస్తోంది.... కార్మికుల అధ్యయన బృందాలు ఆందోళనకారులు లేకుండా

---

* ఉటంకింపులన్నీ నావి.

పోయారు.... దీనికితోడు, ఎప్పుడూ నిధుల కొరత ఒకటి. ఒక్కముక్కలో చెప్పాలంటే, కార్మికోద్యమపు పెరుగుదల విప్లవ సంఘాల పెరుగుదలనీ, అభివృద్ధినీ అధిగమించి ముందుకుపోతోంది. క్రియాశీల విప్లవకారుల సంఖ్య, అసంతృప్త కార్మిక జన సామాన్యంపై విస్తరించిన ప్రభావాన్నంతనీ తమ చేతుల్లోకే తెచ్చుకోజాలనంత, లేక యీ అసంతృప్తికి లేశమాత్రపు వ్యవస్థితమూ, సంఘటితమూ అయిన రూపాన్ని యివ్వజాలనంత మరీ తక్కువగా ఉంది.... వేర్వేరు అధ్యయన బృందాలూ, విడి విడి విప్లవకారులూ చెదురుబదురుగా, అసంఘటితంగా ఉండి, క్రమక్రమంగా అభివృద్ధి చెందిన శాఖలతో కూడిన క్రమశిక్షణాయుతమైన ఒకే ఒక, బలమైన సంఘంగా తయారుకాలేకపోయారు....'' విచ్ఛిన్నం చెయ్యబడిన అధ్యయన బృందాల స్థానంలో సరికొత్త అధ్యయన బృందాలను ఏర్పాటుచెయ్యడమన్నది ''ఉద్యమంలో ఉన్న జీవశక్తిని నిరూపిస్తుందే గాని... తగినంతగా శిక్షణ పొందిన విప్లవ కార్య కర్తలు తగినంత సంఖ్యలో ఉన్నారని నిరూపించడంలేదు'' అని ఒప్పుకుంటూ, ఆ రచయిత యిలా ముగిస్తాడు: ''పీటర్స్‌బుర్గ్ విప్లవకారుల్లో కార్యాచరణకు సంబం ధించిన శిక్షణ లోపం వాళ్ల కృషి ఫలితాలపైన ప్రతిబింబిస్తోంది. ఇటీవలి కేసులు, ప్రత్యేకించి 'స్వీయ విమోచన గ్రూపు,' 'పెట్టుబడి వ్యతిరేక శ్రమ పోరాట' గ్రూపు[180]లమీద జరిగిన విచారణలు, కార్మికవర్గ పరిస్థితులకు సంబంధించిన విస్తృత పరిజ్ఞానం లేని, తత్పర్యవసానంగా, ఒకానొక నిర్దిష్టమైన ఫ్యాక్టరీలో ఏ పరి స్థితుల్లో ఆందోళన సాగించడం సాధ్యమో తెలియని, రహస్య గోపన సూత్రాలు తెలి యని, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ సాధారణ సూత్రాలు మాత్రమే తెలిసిన (అసలంటూ అతనికి తెలిస్తే) యువ ఆందోళనాకారుడు మహా అయితే నాలుగో, అయిదో, లేక ఆరు నెలలో మాత్రమే తన కార్యకలాపాలను కొనసాగించగలడు. తర్వాత అరెస్టులు జరుగుతాయి, అవి మొత్తం సంఘపు విచ్ఛిన్నానికీ, లేక దానిలో కొంత భాగపు విచ్ఛిన్నానికీ దారితీస్తాయి. కాగా, గ్రూపు అస్తిత్వం నెలల్లోకి దిగజారిన ప్పుడు, ఆ గ్రూపు విజయవంతంగా కార్యకలాపాలను నిర్వహించగలదా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.... ప్రస్తుతం ఉన్న సంఘాల లోపాలను పూర్తిగా పరివర్తన దశకే ఆపాదించడం సాధ్యం కాదన్న విషయం స్పష్టం.... క్రియాశీల సంఘాల సభ్యత్వ సంఖ్యా, అన్నింటికన్న ముఖ్యంగా వాటి గుణాత్మకమైన స్వరూపం తక్కువ ప్రాముఖ్యం కలిగిన అంశం కాదనడం స్పష్టం, కాగా మన సోషల్ డెమోక్రట్లు తప్పక చేబట్ట వలసిన మొట్టమొదటి కర్తవ్యం ఏమిటంటే... సంఘాలను ఆచరణలో ఏకంచెయ్యడం, వాటి సభ్యులను నిక్కచ్చిగా ఎంపికచెయ్యడం.''

## ఆ) అనిపుణత, ఆర్థికవాదం

నిస్సందేహంగా ప్రతి పాఠకుడి మనస్సులోకీ వచ్చిన ఒక ప్రశ్నను గురించి మనం యిప్పుడిక చర్చించవలసి వుంది. మొత్తం ఉద్యమానికి ఎదిగే దశలో సహజంగా సోకే వ్యాధి మాదిరి అనిపుణతకీ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ఒక ధోరణి అయిన ఆర్థికవాదానికీ మధ్య సంబంధం ఉండడం సాధ్యమేనా? సాధ్యమనే నా ఉద్దేశం. కార్యాచరణకు సంబంధించిన శిక్షణ, నిర్మాణ కృషిని కొనసాగించగల సామర్థ్యం — వీటి లోపం, ఆది నుంచీ విప్లవాత్మక మార్క్సిజాన్ని అచంచలంగా సమర్థించిన విప్లవకారులతోబాటు మనం దరిలోనూ ఉంది. ఆచరణకు సంబంధించిన శిక్షణ లోపం మాత్రమే అయినట్లయితే, కార్యకర్తల్ని ఎవ్వరూ తప్పుపట్టలేరు. కాని ''అనిపుణత'' అన్న పదంలో శిక్షణ లోపంకన్న ఏదో ఎక్కువే యిమిడివుంది: సాధారణ విప్లవ కృషికి పరిమితం కావడం, అటువంటి పరిమిత కార్యకలాపాల ప్రాతిపదికపైన మంచి విప్లవకారుల సంఘం నిర్మింపబడ జాలదన్న అవగాహన లోపం వుంది, చివరి సంగతి — యిదే ముఖ్యమైనది — యీ పరిమితత్వాన్ని సరైనదని సమర్థించి, దాన్నొక ప్రత్యేక ''సిద్ధాంతంగా'' పైకెత్తే ప్రయత్నం వుంది, అంటే, ఈ రంగంలో కూడా సద్యోజనితత్వానికి దాసోహమనడం వుంది. అటువంటి ప్రయత్నాలు ఎప్పుడైతే వ్యక్తం అయినాయో, అప్పుడు అనిపుణత ఆర్థికవాదంతో ముడిపడివుందనీ, మనం మొత్తంగా ఆర్థికవాదంనుంచి (అంటే మార్క్సిస్టు సిద్ధాంతానికీ, సోషల్ డెమోక్రసీ పాత్రకీ, దాని రాజకీయ కర్తవ్యాలకీ సంబంధించిన సంకుచిత అవగాహననుంచి) బయట పడితేగాని, నిర్మాణపర కార్యకలాపానికి సంబంధించిన యీ పరిమితత్వంనుంచి మనం ఎన్నడూ బయటపడలేం. ఈ ప్రయత్నాలు ద్విముఖంగా వ్యక్తమయ్యాయి. కొందరు యిలా అనడం మొదలెట్టారు: విస్తృతమూ, సమరశీలమూ అయిన కర్తవ్యాలను విప్లవకారులు కార్మికులమీద ''రుద్దేందుకు'' ప్రయత్నిస్తున్నారే తప్ప, కార్మికులు తమంతట తాముగా వాటిని ముందుకింకా తేలేదు. అందుచేత కార్మికులు తక్షణ రాజకీయ డిమాండ్లకోసం, ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటాన్ని''* సాగించేందుకోసమూ పోరాటాన్ని కొనసాగించాలి (కాగా, సహజంగానే, జనసామాన్య ఉద్యమానికి ''అందుబాటులో ఉండే'' యీ పోరాటానికి అనుగుణంగానే బొత్తిగా శిక్షణలేని యువకులకు సైతం ''అందుబాటులో ఉండే'' సంఘం ఉండాలి. ఏ క్రమతత్వ సిద్ధాంతానికీ కట్టుబడని మరి కొందరు ''రాజకీయ విప్లవాన్ని తీసుకురావడం'' సాధ్యమూ, అవసరమే గాని, శ్రామిక

---

* ''రబోచయ మీస్ల్,'' ''రబోచెయె దేలొ'' ప్రత్యేకించి ప్లెహానొవ్‌కి ''సమాధానం.''

వర్గాన్ని ఎడతెగని సుదృఢమైన పోరాటంకోసం సుశిక్షితులను చేసేందుకు బలమైన విప్లవకారుల సంఘాన్ని నిర్మించనవసరం లేదన్నారు. మనం చెయ్యవలసిందంతా ఏమిటంటే, మన పాత మిత్రమైన, ''అందుబాటులో వున్న'' దుడ్డుకర్రని చేతిలోకి తీసుకుని ముందుకు పోవడమే. రూపకాలంకారాన్ని వదిలేస్తే దీని అర్థమేమిటంటే, మనం సార్వత్రిక సమ్మెని* నిర్వహించాలి, లేకపోతే కార్మికోద్యమపు ''మంద'' గతిని ''ఉత్తేజకర హింసాకాండ'' ద్వారా మనం ఉత్తేజపరచాలి.** ఈ రెండు ధోరణులూ – అవకాశవాదులూ, ''విప్లవకారులూ'' ప్రాచుర్యంలో వున్న అనిపుణతని దాసోహం అంటారు. దాన్ని తొలగించవచ్చునని ఈ యిద్దరిలో ఏ ఒక్కరూ విశ్వసించరు. రాజకీయ పోరాటానికి శక్తినీ, స్థిరత్వాన్నీ, అనుస్యూతినీ కలిగించే సామర్థ్యం కలిగిన విప్లవకారుల సంఘాన్ని స్థాపించడమే మన ప్రధాన, ఆచరణాత్మక కర్తవ్యమన్న విషయాన్ని ఈ యిద్దరిలో ఏ ఒక్కరూ అర్థంచేకోరు.

బి–వ్ అన్న యీ కింది మాటల్ని నేనింతకు ముందే ఉదహరించాను: ''కార్మికోద్యమపు పెరుగుదల విప్లవ సంఘాల పెరుగుదలనీ, అభివృద్ధినీ అధిగమించి ముందుకు పోతోంది.'' ''సన్నిహిత పరిశీలకుని'' యీ ''విలువైన వ్యాఖ్య''కి (బి–వ్ వ్యాసంమీద ''రబోచెయె దేలో'' వ్యాఖ్య) మనకు సంబంధించి రెండు రకాల విలువ వుంది. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో యీనాడున్న సంక్షోభానికి జనసామాన్యపు సద్యోజనిత విజృంభణకన్న నాయకులు (''సిద్ధాంతకర్తలు,'' విప్లవకారులు, సోషల్ డెమోక్రట్లు) వెనకబడటమే ప్రధాన కారణం అన్న నా అభిప్రాయం సరైనదేనన్న విషయాన్ని యిది నిరూపిస్తోంది. దీన్నిబట్టి, ''ఆర్థికవాద'' లేఖా రచయితలూ (''ఇస్క్రా'' 12వ సంచికలో), బి. క్రిచేవ్‌స్కీ, మర్తీనొవూ సద్యోజనిత అంశపు ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనా వెయ్యడంలోవున్న ప్రమాదాన్ని గురించీ సాదా, రోజువారీ పోరాటాలను గురించీ యెత్తుగడలు ఓ క్రమంగా వుండటం, వగైరాలను గురించీ ముందుకు తెచ్చిన వాదనలు అనిపుణతను ఆకాశానికెత్తడం, వెనకేసుకు రావడం తప్ప మరేమీ కాదని తేలుతోంది. ''సిద్ధాంతకారుడు'' అన్న పదాన్ని ఎద్దేవా లేకుండా ఉచ్చరించలేని వీళ్లు, ప్రచలితంగా ఉన్న శిక్షణ లోపానికీ, వెనుకబాటుతనానికీ ముందు తమ సాష్టాంగ దండ ప్రణామాలను ''జీవిత వాస్తవాల అవగాహన''గా వర్ణించుకునే వీళ్లు, క్రియలో మన అత్యంతావసర ఆచరణాత్మక కర్తవ్యాలేమిటో కూడా తెలుసుకోలేకుండా ఉన్నారు. వెనకబడ్డ వాళ్లని ఉద్దేశించి వాళ్లు యిలా చెప్తారు: అడుగూ అడుగూ కలిపి

* రష్యాలో ప్రచురింపబడిన కీయెవ్ కమిటీచేత తిరిగి ముద్రించబడిన ''శ్రామికవర్గ పోరాటం'' అన్న శీర్షికగల వ్యాస సంపుటిలో ''రాజకీయ విప్లవాన్ని ఎవరు తెస్తారు?'' అన్న వ్యాసాన్ని చూడండి.

** ''విప్లవవాద పునరుత్థానం,'' ''స్వొబోద'' పత్రిక.

నడవండి, ముందుకి పరుగెత్తకండి! నిర్మాణపర కృషిలో శక్తీ, చొరవా లేనివాళ్లకీ, విస్తృతమూ, సాహసికమూ అయిన కార్యకలాపాలకు "పథకాలు" లేనివాళ్లకీ "యెత్తుగడలు ఓ క్రమంగా" వుండాలంటూ ఉపదేశిస్తున్నారు! మన రాజకీయ, నిర్మాణపర, కర్తవ్యాలను మనం రోజువారీ ఆర్థిక పోరాటపు తక్షణ, "ప్రత్యక్ష," "నిర్దిష్ట" ప్రయోజనాల స్థాయికి దిగజారుస్తూ వుంటాం, యిదే మనం చేసే పొరపాట్లన్నింటిలోకీ పెద్దది. కాని వీళ్లు ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించండి అంటూ పాచిపాటనే పాడుతూ వుంటారు. మనం దానికి యిలా జవాబిస్తాం: ప్రచారంలో వున్న ఓ జానపద కథలో నాయకుడు శవ యాత్రలోని వాళ్లని ఉద్దేశించి "యీ శుభదినం మీకు పదే పదే వచ్చుగాక!" అన్న దానిలో "జీవిత వాస్తవాల అవగాహన" ఎంత వుందో వీళ్ల యీ ధోరణిలో కూడా అంతే వుంది.

ఈ మహా తెలివిపరులు సాటిలేని, నిజమైన "నార్సిసస్[181] మాదిరి" స్వాతిశయ భావంతో, "కార్మిక అధ్యయన బృందాలు మొత్తంమీద" (sic!) "వాస్తవికమూ, ఆచరణాత్మకమూ అయిన అర్థంలో, అంటే, రాజకీయ డిమాండ్లకోసం జరిగే ప్రయోజనకర, సఫల ఆచరణాత్మక పోరాటమనే అర్థంలో, రాజకీయ కర్తవ్యాలను అందుకోలేవు" ("'రబోచెయె దేలో' సంపాదకవర్గపు సమాధానం," పేజి 24) అంటూ ప్లెహానొవ్‌ని ఉద్దేశించి ఎలా ఉపన్యాసం దంచారో గుర్తుకి తెచ్చుకోండి. మహాశయులారా, బృందాల్లో అనేక రకాలుంటాయి! "అనిపుణుల" బృందాలు, తమ అనిపుణతని గుర్తించి, దీన్ని విసర్జించేదాకా, రాజకీయ కర్తవ్యాలను ఎదుర్కోలేవు. దీనికితోడు, యీ అనిపుణులు తమ అనిపుణ పద్ధతుల పట్ల వ్యామోహితులైపోయి, "ఆచరణాత్మక" అన్న పదాన్ని నొక్కిచెప్పాలని పట్టుపట్టి, ఆచరణాత్మకంగా ఉండటమంటే జనాభాలోని మిక్కిలి వెనుకబడ్డ విభాగాలు అర్థంచేసుకునే స్థాయికి తమ కర్తవ్యాలను దిగజార్చాలని అనుకుంటే, అప్పుడిక వాళ్లు ఎందుకూ పనికిరాని అనిపుణులే అవుతారు, మొత్తంమీద ఎలాంటి రాజకీయ కర్తవ్యాలతోనూ ఎంత మాత్రం సరితూగలేరు అనడం స్పష్టం. కాని, అలెక్సేయెవ్, మీష్కిన్, హల్తూరిన్, జెల్యాబొవ్ మాదిరి నాయకుల బృందం యీ రాజకీయ కర్తవ్యాలతో నిజాయితీగానూ, అత్యంత క్రియాపరమైన అర్థంలోనూ, సరితూగగలుగుతుంది. వాళ్లు ఏ కారణంగా, ఏ మేరకు అలా చెయ్యగలుగుతారంటే వాళ్లు చేసే ఆవేశపూరిత ప్రచారానికి సద్యోజనితంగా జాగృతులవుతున్న జనసామాన్యం ప్రతిస్పందించింది కనుక, ప్రతిస్పందించిన మేరకు, వాళ్ల పొంగిపొర్లే శక్త్యుత్సాహాలకు విప్లవ వర్గపు ప్రతిస్పందనా, తోడ్పాటూ లభించింది కనుక, లభించిన మేరకు అలా చెయ్యగలుగుతుంది. ప్లెహానొవ్ యీ విప్లవ వర్గాన్ని నిర్దేశించి చూపి, సద్యోజనితంగా అది జాగృతమవడం అనివార్యం అన్న విషయాన్ని నిరూపించడమే కాకుండా, "కార్మికుల అధ్యయన బృందాల" ముందు మహత్తరమూ, ఉన్నతమూ అయిన ఓ రాజకీయ కర్తవ్యాన్ని కూడా పెట్టాడు. ఇది పూర్తిగా సరైనదే. కాని యీ కర్తవ్యాన్ని తక్కువ చేయ

డానికీ, ''కార్మికుల అధ్యయన బృందాల'' శక్తినీ, కార్యకలాపాల పరిధినీ సంకుచితం చేసేం దుకూ అప్పటినుంచీ పెల్లుబికిన ప్రజాందోళనను మీరు ప్రస్తావిస్తున్నారు. మీ అనిపుణ పద్ధతులపట్ల వ్యామోహితులైన అనిపుణులు కాకపోతే మీరు మరేమిటి? మీరు మీకు క్రియా దృష్టి ఉందంటూ డబ్బా వాయించుకుంటూ వుంటారు, కాని, రష్యన్ కార్య కర్తల్లో ప్రతి ఒక్కడికీ తెలిసినదాన్ని, అంటే, విప్లవాందోళన విషయంలో ఒక బృందం మాట అటుంచి విడి వ్యక్తుల శక్త్యుత్సాహాలు సైతం ఎంతటి అద్భుత ఫలితాలను చేకూర్చ గలవో అన్న విషయాన్ని మీరు తెలుసుకోలేరు. లేకపోతే, 1870 దశకం సృష్టించిన మాదిరి నాయకులను మన ఉద్యమం సృష్టించలేదని మీరు అనుకుంటున్నారా? ఒకవేళ అలాగే అనుకుంటూవుంటే, ఎందుకు మీరు అలా అనుకుంటున్నారు? మనకి శిక్షణ కొరవడింది కనుకనా? కాని మనకి మనం శిక్షణ యిచ్చుకుంటూనే వున్నాం, మనకి మనం శిక్షణ యిచ్చు కుంటూనే వుంటాం, మనం శిక్షణ పొంది తీరుతాం! దురదృష్టవశాత్తూ, ''యజమాను లకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం'' అనే నిలవ నీటిపైన మురికి తెట్టు కట్టింది; మనలో సద్యోజనితత్వం ముందు సాగిలపడేవాళ్ళూ, రష్యన్ శ్రామికవర్గపు ''పృష్ఠ భాగాన్నే'' (ప్లెహానొవ్ మాటల్లో) దిగ్భ్రాంతులై నోళ్ళు తెరుచుకుని చూస్తూ ఉండి పోయేవాళ్ళూ కొందరు తయారయ్యారు. కాని మనం యీ మురికి తెట్టుని వదిలించు కుంటాం. నికరమైన విప్లవ సిద్ధాంత మార్గదర్శకత్వంలో, సిసలైన విప్లవకరమూ, సద్యో జనితంగా జాగృతమయ్యే వర్గంపై ఆధారపడి, చివరకు — చిట్టచివరకు ఎన్నాళ్లకో! — తమ సమస్త విరాట్ శక్తినీ కూడగట్టుకొని రష్యన్ విప్లవకారులు రొమ్ము విరుచుకొని నిలబడగల సమయం వచ్చింది. మన రాజకీయ కర్తవ్యాలను తక్కువ చేసే ప్రయత్నాలనూ, నిర్మాణ రంగంలో మన కృషి పరిధిని సంకుచితం చేసే ప్రయత్నాలనూ మన కార్యకర్తల సముదాయం, తాము చదువుకుంటున్న రోజుల్నుంచీ కార్యకర్తలుగా పనిచెయ్యాలని కలలు గన్నవాళ్ల మరింత పెద్ద సముదాయం అసహ్యించుకోవడం, ఎద్దేవా చెయ్యడమే యిప్పుడు కావలసిందల్లా. మహాశయులారా, మేమీ పనిని సాధించి తీరుతాం, కంగారు పడకండి!

''దేనితో ప్రారంభించాలి?'' అన్న వ్యాసంలో ''రబోచెయె దేలొ''కి సమాధానంగా నేనిలా రాశాను: ''ఏదో ఒక ప్రత్యేక సమస్యపై జరిపే ఆందోళనల ఎత్తుగడలను, లేక పార్టీ నిర్మాణంలో ఏదో ఒక వివరానికి సంబంధించిన ఎత్తుగడలను 24 గంటల్లో మార్చ వచ్చు; అంతేగాని, పోరాటాన్ని నిర్వహించవలసిన సంఘపు ఆవశ్యకతపైనా, జనసామాన్యంలో రాజకీయ ఆందోళనను (మొత్తంమీద, నిరంతరాయంగా, తిరుగు లేకుండా) సాగించవలసిన ఆవశ్యకతపైనా 24 గంటల్లో, లేక, ఆమాటకొస్తే 24 నెలల్లో తమ అభిప్రాయాలను మార్చుకోగలిగినవాళ్లు బొత్తిగా ఏ సూత్రమూ పాటించనివాళ్లు మాత్రమే.'' దీనికి ''రబోచెయె దేలొ'' యిలా జవాబిచ్చింది: '''ఇస్క్రా' చేసిన ఆరోపణల్లో వాస్తవాలపై

ఆధారపడినట్లు కనిపించే యీ ఒకే ఒక్క ఆరోపణకు సైతం బొత్తిగా ఆధారం లేదు. ఆది నుంచీ, 'ఇస్క్రా' ప్రచురణకోసం వేచి వుండకుండానే మేము రాజకీయ ఆందోళన కావాలని చెప్పిన సంగతి 'రబోచెయె దేలో' పాఠకులకి తెలిసిందే... (అయితే అదే సమయంలో, కార్మికుల అధ్యయన బృందాలు మాత్రమే కాక, "కార్మిక జనసామాన్యపు ఉద్యమం సైతం నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యడాన్నే తన ప్రథమ రాజకీయ కర్తవ్యంగా పరిగణించజాలదు" అనీ, తక్షణ రాజకీయ డిమాండ్లకోసం జరిగే పోరాటాన్ని మాత్రమే ప్రథమ రాజకీయ కర్తవ్యంగా పరిగణించాలనీ, "జనసామాన్యం ఒకటి, లేక కొన్ని సమ్మెల తర్వాత తక్షణ రాజకీయ డిమాండ్లను అర్థంచేసుకుంటారు" అనీ చెప్పా),... కాని రష్యాలో పని చేసే కామ్రేడ్లకి మేము విదేశాలనుంచి తెప్పించిన ప్రచురణల ద్వారా ఏకైక సోషల్ డెమొక్రటిక్, రాజకీయ, ఆందోళనా సమాచారాన్ని సమకూర్చాం... (అంతేకాదు, యీ ఏకైక సమాచారంలో మీరు అత్యంత విస్తృత రాజకీయాందోళనను కేవలం ఆర్థిక పోరాటంపై ఆధారపడేలా చెయ్యడమే కాకుండా, యీ పరిమిత ఆందోళనే "మిక్కిలి విస్తృతంగా అన్వయింపదగినది"గా వాదించేదాకా వెళ్లారు. మహాశయులారా, సమకూర్చబడిన సమాచారం యిది ఒక్కటే అన్న మీ వాదనే, 'ఇస్క్రా' ప్రచురణావశ్యకతనూ, 'రబోచెయె దేలో'కి వ్యతిరేకంగా దాని పోరాటావశ్యకతనూ రుజువుచేస్తున్న సంగతి మీకు కనిపించడం లేదా?)... "మరోవంక, వాస్తవానికి మా ప్రచురణ కార్యక్రమం పార్టీ ఎత్తుగడలకు సంబంధించి పార్టీ ఐక్యతకు భూమికను తయారుచేశాయి".... (ఎత్తుగడలు పార్టీ కర్తవ్యాల పెరుగుదల క్రమం, అవి పార్టీతోబాటే పెరుగుతాయి అన్న విశ్వాసంతోనా ఐక్యత? — నిజానికి బహు విలువైన ఐక్యతే!)... "తద్వారా 'ఒక సమరశీల సంఘ' స్థాపనను సాధ్యంచేసింది, దీనికోసం 'దేశాంతర యూనియనే,' విదేశాల్లోని ఏ సంఘమైనా చెయ్యగలదంతా చేసింది" ("రబోచెయె దేలో," సంచిక 10, పేజి 15). దాటవేసేందుకు శుష్క ప్రయత్నం! మీరు చెయ్యగలిగినదంతా చేశారన్న విషయం నేను కాదనను. మీరు చెయ్యగలిగిన పనుల "సాధ్యత"కు మితులు సైతం మీ సంకుచిత దృక్పథంచేత పరిమితం చెయ్యబడ్డాయని నేను యింతకు ముందూ చెప్పాను, యిప్పుడూ చెప్తున్నాను. "తక్షణ రాజకీయ డిమాండ్ల" కోసం పోరాడేందుకూ, లేక "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" జరిపేందుకూ "సమరశీల సంఘాన్ని" గురించి మాట్లాడటం హాస్యాస్పదం.

కాని, అనిపుణత విషయంలో "ఆర్థికవాది"కీ ఉన్న విపరీత వ్యామోహానికి సంబంధించి ఆణిముత్యాలని చూడాలని పాఠకుడు అనుకుంటే, అతను కలగూరగంపలాంటి భావాలూ, ఊగిసలాడే స్వభావమూ వున్న "రబోచెయె దేలో"ని విడిచిపెట్టి సుసంగతంగానూ, దృఢసంకల్పంతోనూ ఉండే "రబోచయ మీస్ల్"ని చూడాలి. దాని ప్రత్యేకానుబంధం, పేజి 13లో ఆర్. ఎమ్. యిలా రాశాడు: "ఇప్పుడు అసలు విప్లవాత్మక మేధావివర్గం అనబడే

దాన్ని గురించి రెండు మాటలు. అది కొన్ని సందర్భాల్లో 'జారిజంతో కృతనిశ్చిత పోరాటానికి దిగేందుకు' తను సిద్ధమేనని రుజువుచేసుకున్న మాట నిజమే. అయితే, దురదృష్టకర విషయం ఏమిటంటే, రాజకీయ పోలీసులచేత నిర్దాక్షిణ్యంగా హింసించబడిన మన విప్లవాత్మక మేధావివర్గం, రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా జరిపే పోరాటాన్నే నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే రాజకీయ పోరాటమని భావించింది. అందుకనే యీనాటికీ అది నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులు ఎక్కడినుంచి వస్తాయో అర్థం చేసుకోలేకపోతోంది.''

సద్యోజనిత ఉద్యమపు యీ ఆరాధకుడు (యీ మాటకి వున్న మిక్కిలి చెడ్డ అర్థంలో) పోలీసు వ్యతిరేక పోరాటంపట్ల చూపిన తిరస్కార భావం నిజంగా సాటిలేనిదే! సద్యోజనిత ప్రజాందోళన జరిగేటప్పుడు రాజకీయ పోలీసులతో పోరాటం జరపడం ఎంతమాత్రం ముఖ్యం కాదన్న వాదంతోటి రహస్య కార్యకలాపాల నిర్వహణ విషయంలో మన అశక్తతని ఆయన సమర్థించ సిద్ధమవుతున్నాడు! నిస్సారమైన యీ నిర్ధారణను నిజానికి బహు కొద్దిమంది మాత్రమే బలపరుస్తారు; విప్లవ సంఘాలలో మన లోపాల సమస్య అంతటి నిశిత ప్రాముఖ్యాన్ని సంతరించుకుందన్నమాట. కాని, ఉదాహరణకు మర్తీనొవ్ యీ నిర్ధారణతో ఏకీభవించకపోతే, అందుకు, తన భావాలను తర్కబద్ధంగా ఆమూలాగ్రం పరిశీలించలేకపోవడమో, లేక అందుకు సాహసించకపోవడమో, శక్తి లేకపోవడమో కారణం అయ్యుంటుంది. వాస్తవానికి, జనసామాన్యం నిర్దిష్టమైన డిమాండ్లను, ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశమున్న డిమాండ్లను, ముందుకు తెచ్చే ''కర్తవ్య'' పరిపూర్తికి సుస్థిరమూ, కేంద్రీకృతమూ, సమరశీలమూ అయిన విప్లవకారుల సంఘాన్ని నిర్మించడానికి ప్రత్యేక ప్రయత్నాలు అవసరమా? అటువంటి ''కర్తవ్యాన్ని'' ''రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా పోరాటం జరపని'' జనసామాన్యం సైతం నిర్వహించలేరా? అంతేకాకుండా, కొద్దిమంది నాయకులకు తోడు, ''రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా పోరాడే'' సామర్థ్యం బొత్తిగా లేని కార్మికులు (అత్యధిక సంఖ్యాకులు) కూడా దాన్ని అమలుజరపడంలో పాల్గొనకపోతే యీ కర్తవ్యాన్ని పరిపూర్తి చెయ్యడం సాధ్యమా? అటువంటి కార్మికులు, జనసామాన్యంలోని సామాన్యమైన మనుషులు, సమ్మెల్లోనూ, పోలీసులతోనూ, సైనికులతోనూ జరిగే వీధి పోరాటాల్లోనూ బృహత్తరమైన శక్తినీ, మహత్తరమైన ఆత్మ త్యాగాన్నీ ప్రదర్శించగలరు, వాళ్లే మన యావత్తు ఉద్యమ ఫలితాన్నీ నిర్ధరించగల సమర్థులు (నిజానికి, వాళ్లు మాత్రమే సమర్థులు) — కాని రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ప్రత్యేక లక్షణాలు ఉన్నవాళ్లు అవసరం. దానికి వృత్తి విప్లవకారులు అవసరం. జనసామాన్యం నిర్దిష్టమైన డిమాండ్లను ''ముందుకు తెచ్చేలా'' చూడటమే కాకుండా, కార్మిక జనసామాన్యం అటువంటి వృత్తి విప్లవకారులను అధికతర సంఖ్యలో ''ముందుకు తెచ్చేలా'' మనం

చూడాలి. ఈవిధంగా, వృత్తి విప్లవకారుల సంఘానికీ, శుద్ధ సరళ కార్మికోద్యమానికీ మధ్య సంబంధపు సమస్య దగ్గరకి మనం చేరుకున్నాం. ఈ సమస్య సాహిత్యంలో ఏమంత ఎక్కువగా ప్రస్తావించబడకపోయినప్పటికీ, ఎక్కువ తక్కువ మోతాదుల్లో ఆర్థికవాదం వైపు మొగ్గు చూపే కామ్రేడ్సుతో సంభాషణలోనూ, వాదాల్లోనూ "రాజకీయవేత్తలమైన" మనకు, యీ సమస్యపట్ల ఎక్కువ శ్రద్ధ వహించవలసిన అవసరం కలిగింది. ఇది ప్రత్యేకించి చర్చించవలసిన సమస్య. అయితే, యీ సమస్యని గురించి చర్చించేందుకు ముందర, అని పుణతకీ ఆర్థికవాదానికీ మధ్య ఉన్న సంబంధాన్ని గురించి మన సూత్రీకరణపై వెలుగును ప్రసరించే మరో ఖండికను యీ కింద యిస్తాను:

ఎన్. ఎన్. గారు తన "సమాధానం"లో[182] యిలా రాశాడు: "'శ్రమ విమోచన' గ్రూపు, యీ పోరాటంకోసం పాదార్థిక శక్తులను ఎక్కడ సమకూర్చుకోవాలన్న అంశాన్ని గురించి ముందు ఆలోచించకుండా పోరాట పంథా ఏమిటో సూచించకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష పోరాటం కావాలని డిమాండుచేస్తుంది." పోరాట పంథా అన్న మాటలను వక్కాణిస్తూ, "పంథా" అన్న దానికి రచయిత యీ కింది పాద పీఠికను జోడించాడు: "కార్యక్రమం ఒక ప్రజోద్యమానికి సంబంధించిందే గాని ఒక కుట్రకి సంబంధించింది కాదు గనుక, రహస్య గోపన కారణాలతో దీన్ని మనం వివరించలేం. మరి జన సామాన్యం రహస్య పంథాల్లో ముందుకి వెళ్లజాలరు. రహస్య సమ్మెని మనం ఊహించుకోగలమా? రహస్య ప్రదర్శనలనీ, రహస్య విజ్ఞాపనలనీ మనం ఊహించుకోగలమా?" ("Vademecum," పేజి 59.) రచయిత యీవిధంగా, "పాదార్థిక శక్తుల" (సమ్మెల, ప్రదర్శనల నిర్వాహకుల) సమస్యకీ, పోరాట "పంథాల" సమస్యకీ దగ్గరగా వచ్చాడు. కానైతే, ఆయన యింకా దిగ్భ్రాంతిలోనే ఉన్నాడు, ఆయన ప్రజోద్యమాన్ని "ఆరాధించడమే" యిందుకు కారణం. అంటే, మనల్ని ప్రోత్సహించ వలసినదిగానూ, మన విప్లవ క్రియాశీలతను ఉత్తేజితం చెయ్యవలసిందిగానూ కాక, విప్లవ కార్యకలాపాలను నిర్వహించవలసిన ఆవశ్యకతనుండి మనల్ని తప్పించే ఏదోగా ప్రజోద్యమాన్ని ఆయన పరిగణించడమే ఆయన యీ దిగ్భ్రాంతికి కారణం. సమ్మెలో పాల్గొనేవాళ్లకీ, దానితో సన్నిహిత సంబంధం కలిగివున్న వాళ్లకీ అది రహస్యంగా ఉండటమన్నది అసాధ్యం, కాని, రష్యన్ కార్మిక జనసామాన్యానికి అది రహస్యంగా ఉండిపోవచ్చు (ఎక్కువ సందర్భాల్లో అలా ఉండిపోతుంది కూడా). సమ్మెదారులతో సంబంధాలన్నింటినీ తెంచివేసేందుకూ, సమ్మెలకు సంబంధించిన ఏ వార్తలూ వ్యాపించకుండా నివారించేందుకూ ప్రభుత్వం శ్రద్ధతీసుకోవడమే యిందుకు కారణం. "రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా" ప్రత్యేక "పోరాటం" – సమ్మెల్లో పాల్గొనేటంత పెద్ద జనసమూహంచేత క్రియాశీలంగా నిర్వహింపబడజాలని పోరాటం – దానికి అవసరం. విప్లవ కార్యకలాపాలే జీవిత ధ్యేయంగా కలిగినవాళ్లు "ఆ కళకి సంబంధించిన నియమాలన్నింటి" ప్రకారం

యీ పోరాటాన్ని సంఘటితం చెయ్యాలి. ఉద్యమంలోకి జనం సద్యోజనితంగా వస్తున్నారన్నంత మాత్రాన యీ పోరాట ఆవశ్యకత తగ్గదు. తద్భిన్నంగా అది మరింత ఆవశ్యకం అవుతుంది. ఎందుకంటే, సోషలిస్టులమైన మనం పోలీసులు అన్ని సమ్మెలని గురించీ, ప్రదర్శనలను గురించీ కప్పెట్టకుండా నివారించకపోయినట్లయితే (మధ్య మధ్య సమ్మెలకూ, ప్రదర్శనలకూ మనమే రహస్య సన్నాహాలు జరపకపోయినట్లయితే) జనసామాన్యం పట్ల మనకి వున్న ప్రత్యక్ష బాధ్యతా నిర్వహణలో మనం విఫలమవుతాం. సద్యోజనితంగా జాగృతులవుతున్న జనసామాన్యం కూడా, తమ శ్రేణుల్లోనుంచే, అధికతర సంఖ్యలో ''వృత్తి విప్లవకారులను'' తయారుచేస్తారు గనుక (అంటే, కార్మికుల్ని చేతులు కట్టుకుని కూర్చోమని సలహా యివ్వాలన్న ఆలోచన మన మనస్సులపై సవారీచెయ్యకపోతే), యీ పని చెయ్యడంలో మనం సఫలమవుతాం.

## ఇ) కార్మికుల సంఘం, విప్లవకారుల సంఘం

రాజకీయ పోరాటమూ, ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటమూ'' ఒకటేనని భావించే సోషల్ డెమోక్రట్ ''విప్లవకారుల సంఘమూ,'' ''కార్మికుల సంఘమూ'' యించుమించుగా ఒకటేనని భావిస్తాడని తలవడం సహజమే. మరి, వాస్తవంలో జరిగేది యిదే; అందుకే సంఘాన్ని గురించి మాట్లాడేటప్పుడు మనం అక్షరాలా భిన్నభిన్న భాషల్లో మాట్లాడుతున్నట్లు తేలుతుంది. ఉదాహరణకు, పూర్వ పరిచయంలేని, ఓ మోస్తరు సుసంగతంగా మాట్లాడే ఒక ఆర్థికవాదితో నేను జరిపిన సంభాషణ నాకు బాగా జ్ఞాపకం ఉంది.[183] ''రాజకీయ విప్లవాన్ని ఎవరు తెస్తారు?'' అన్న శీర్షిక కలిగిన ఓ చిన్న పుస్తకాన్ని గురించి మేము చర్చించుకుంటున్నాం. సంఘ నిర్మాణ సమస్యను విస్మరించడం అన్నదే దానిలోని ప్రధాన లోపం అన్న విషయంపై మా యిద్దరికీ ఏకీభావం కుదిరింది. మా యిద్దరి మధ్యా పూర్తి యేకాభిప్రాయం వుందనే మేము అనుకోనారంభించాం. కాని, సంభాషణ గడిచేకొద్దీ, మేమిద్దరం భిన్నభిన్న విషయాలను గురించి మాట్లాడుతున్నట్లు స్పష్టపడింది. నాతో సంభాషించిన వ్యక్తి సమ్మె నిధులు, పరస్పర సహాయ సమితులు మొదలైన వాటిని గురించి పట్టించుకోనందుకు నన్ను తప్పుపట్టినప్పుడు, రాజకీయ విప్లవాన్ని ''తేవడం''లో విప్లవకారుల సంఘం ముఖ్యాంశమన్న సంగతి నా మనస్సులో మెదిలింది. ఈ అభిప్రాయభేదం స్పష్టం కాగానే, ఆ ఆర్థికవాదితో నేను సూత్రరీత్యా ఏకీభవించిన సమస్య దాదాపు ఏదీ లేకపోయింది!

మా అభిప్రాయభేదానికి మూలం ఏమిటి? అసలు సంగతేమిటంటే, నిర్మాణపర, రాజకీయ సమస్యలు రెండింటిపైనా ఆర్థికవాదులు ఎప్పుడూ కూడా సోషల్ డెమోక్రటి

జంనుంచి వైదొలగి ట్రేడ్‌యూనియనిజాన్ని అనుసరిస్తూ వచ్చారు. యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా కార్మికులు జరిపే ఆర్థిక పోరాటంకన్న సోషల్ డెమోక్రట్ల రాజకీయ పోరాటం చాలా విస్తృతమూ సంక్లిష్టమూ అయినది. అదే విధంగా (నిజానికి అదే కారణంగా), విప్లవాత్మక సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిర్మాణం, యీ పోరాటానికి రూపొందించబడిన కార్మికుల సంఘటనకి భిన్నంగా ఉండితీరాలి. మొదటి సంగతి, కార్మికుల సంఘం వృత్తి ప్రాతిపదికగా వుండే ట్రేడ్‌యూనియన్ అయ్యుండాలి. రెండో సంగతి, అది సాధ్యమైనంత విస్తృతంగా ఉండాలి. మూడో సంగతి, పరిస్థితులు సాధ్యంచేసిన మేరకు అది బహిరంగంగా ఉండాలి (యిక్కడా, యికముందూ కూడా, నేను నిరంకుశ పాలన సాగిన రష్యాని దృష్టిలో పెట్టుకునే ప్రస్తావిస్తాను). మరో పక్కన, విప్లవకారుల సంఘం ప్రధమంగానూ ప్రధానంగానూ విప్లవ కార్యకలాపాలను తమ వృత్తిగా పెట్టుకున్నవాళ్లతోనే కూడివుండాలి (విప్లవకారుల సంఘం, అంటే విప్లవాత్మక సోషల్ డెమోక్రట్ల సంఘం అని నేనన్నది అందుకనే). అటువంటి సంఘ సభ్యులు అందరి విశిష్ట లక్షణమూ ఒక్కటే అయిన దృష్ట్యా, కార్మికులకీ, మేధావులకీ మధ్య వున్న వ్యత్యాసాలన్నీ (వృత్తికీ ఉద్యోగానికీ మధ్య వున్న వ్యత్యాసాల సంగతి వేరే చెప్పనక్కర్లేదు) తొలగింపబడాలి. అటువంటి సంఘం ఎప్పటికీ మరీ విస్తృతంగా ఉండజాలదు, అది సాధ్యమైనంత రహస్య సంఘంగా ఉండి తీరాలి. ఈ త్రిముఖ వ్యత్యాసాన్ని పరిశీలిద్దాం.

రాజకీయ స్వేచ్ఛ ఉన్న దేశాల్లో, ట్రేడ్‌యూనియన్లకీ, సోషల్ డెమోక్రటిక్ సంఘాలకీ మధ్య తేడా మాదిరిగానే, ట్రేడ్‌యూనియన్‌కీ రాజకీయ సంఘానికీ మధ్య తేడా స్పష్టంగానే కనబడుతుంది. ముందువాటికీ తర్వాతవాటికీ మధ్య ఉన్న సంబంధాలు సహజంగానే చారిత్రక, చట్టపర, తదితర పరిస్థితులనుబట్టి ప్రతి ఒక్క దేశంలోనూ మారుతూవుంటాయి. అవి ఎక్కువో, తక్కువో ఘనిష్టంగానూ, సంక్లిష్టంగానూ వగైరా ఉండవచ్చు (మన దృష్టిలో అవి ఎంత ఘనిష్టంగానూ, సరళంగానూ ఉంటే అంత మంచిది). కాని స్వతంత్ర దేశాల్లో ట్రేడ్‌యూనియన్ల నిర్మాణమూ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిర్మాణమూ ఒకే విధంగా ఉండే సమస్యే ఉత్పన్నం కాజాలదు. కాని రష్యాలో, నిరంకుశ ప్రభుత్వ పాలన, పైకి కనిపించేటట్టు, సోషల్ డెమోక్రటిక్ సంఘానికీ, కార్మిక సంఘానికీ మధ్య అంతరాన్నంతటినీ చెరిపేసిందని అనిపించక మానదు. ఎందుకంటే అన్ని కార్మిక సంఘాలూ, అన్ని అధ్యయన బృందాలూ యిక్కడ నిషేధింపబడ్డాయి, కార్మికుల ఆర్థిక పోరాటపు ప్రధాన రూపమూ, ముఖ్యాస్త్రమూ అయిన సమ్మె దండించదగిన (ఒక్కొక్క సందర్భంలో రాజకీయమైనదిగా కూడా!) నేరంగా పరిగణింపబడుతోంది. అందుకని, మన దేశంలోని పరిస్థితులు, ఒక వంక, ఆర్థిక పోరాటంలో నిమగ్నులై వున్న కార్మికులను రాజకీయ సమస్యలను పట్టించుకునేలా గట్టిగా “ప్రేరేపిస్తున్నాయి”; మరో వంక, అవి సోషల్ డెమోక్రట్లను

సోషల్ డెమోక్రటిజంతో ట్రేడ్‌యూనియనిజాన్ని కలగాపులగం చేసేలా "ప్రేరేపిస్తున్నాయి" (మరి మన క్రిచేవ్‌స్కీ, మర్తినొవ్‌లూ, యింకా ఆ బాపతువాళ్లూ మొదటి "ప్రేరణ"ని గురించి కూలంకషంగా చర్చిస్తున్నారు, కాగా రెండోదాన్ని పట్టించుకోవడం లేదు). తొంభైతొమ్మిది శాతం "యజమానులకీ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటంలో" మునిగివున్న వ్యక్తులను మీ మనసుల్లో ఊహించుకోండి. వాళ్లలో కొందరికి, తమ కార్యకలాపాల మొత్తం కాలవ్యవధిలో (అంటే నాలుగునుండి ఆరు నెలలు) విప్లవకారుల మరింత సంక్లిష్ట సంఘాన్ని గురించి ఆలోచించవలసిన అవసరం ఎన్నడూ పడదు. మిగతా వాళ్లకు బహుశా, బాగా విస్తృతంగా పంచబడిన బెర్న్‌స్టైనియన్ సాహిత్యం తారసపడుతుంది, దానితో వాళ్లకి "రోజువారీ సాదా పోరాటపు పురోగమనం"పట్ల ప్రగాఢ విశ్వాసం కలుగుతుంది. ఇంకా మిగిలినవాళ్లు బహుశా, "శ్రామికవర్గ పోరాటంతో సన్నిహిత, సజీవ సంబంధపు"—ట్రేడ్‌యూనియన్, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాల మధ్య సంబంధపు—కొత్త ఉదాహరణను ప్రపంచానికి చూపడమన్న వ్యామోహకర భావానికి లొంగి కొట్టుకుపోతారు. కొందరు ఈ విధంగా వాదిస్తారు: ఏ దేశమైనా పెట్టుబడిదారీ రంగంలో, తత్ఫర్యవసానంగా కార్మిక ఉద్యమంలో ఎంత ఆలస్యంగా అడుగుపెడితే, ఆ దేశంలోని సోషలిస్టులు అంత ఎక్కువగా ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలో పాల్గొనే, దాన్ని బలపరచే అవకాశం వుంటుంది, కాగా ఆ దేశంలో సోషల్ డెమోక్రటికేతర ట్రేడ్‌యూనియన్లు అంత తక్కువ ఉండే అవకాశం వుంటుంది. ఇంతవరకు యీ వాదం పూర్తిగా రైటే. అయితే దురదృష్టవశాత్తూ, కొందరు దీన్ని దాటివెళ్లి, ట్రేడ్‌యూనియనిజంతో సోషల్ డెమోక్రటిజం మిళితమై పోవడాన్ని గురించి కలగంటూ వుంటారు. సంఘ నిర్మాణానికి సంబంధించి మన పథకంమీద అటువంటి స్వప్నాలకు ఎంతటి హానిదాయకమైన ప్రభావం ఉంటుందో, "సెంట్ పీటర్స్‌బుర్గ్ పోరాట సమితి నిబంధనావళి" ఉదాహరణనుంచి మనం యిప్పుడే చూస్తాం.

ఆర్థిక పోరాటం జరిపే కార్మికుల సంఘాలు వృత్తిపరమైనవిగా ఉండాలి. ప్రతి సోషల్ డెమోక్రటిక్ కార్మికుడూ యీ సంఘాలకు సాధ్యమైనంత ఎక్కువగా తోడ్పడాల్సిందే, యీ సంఘాల్లో క్రియాశీలంగా కృషి జరపాల్సిందే. అయితే, యిదంతా నిజమే కాని, సోషల్ డెమోక్రట్లకు మాత్రమే "ట్రేడ్" యూనియన్ సభ్యులయ్యేందుకు హక్కుండాలి అనడం మాత్రం మన ప్రయోజనాలకు ఎంతమాత్రం దోహదంచెయ్యదు. ఎందుకంటే, అలా చేస్తే జనసామాన్యంమీద మనం వేయగల ప్రభావం తగ్గిపోతుంది. యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటం కోసం ఐక్యం కావలసిన ఆవశ్యకతను అర్థం చేసుకున్న కార్మికులందర్నీ ట్రేడ్‌యూనియన్లలో చేరనివ్వండి. కనీసం యీ అవగాహన స్థాయికైనా చేరుకున్న వాళ్లందర్నీ ఐక్యం చెయ్యకపోయినట్లైతే, అవి బాగా విస్తృత సంఘాలు

కాకపోయినట్లయితే, ట్రేడ్‌యూనియన్ల లక్ష్యాన్ని సాధించడమే దుస్సాధ్యమై పోతుంది. ఈ సంఘాలు ఎంత ఎక్కువ విస్తృతమైనవైతే, వాటిమీద మన ప్రభావం అంత ఎక్కువ విస్తృతంగా ఉంటుంది — ఈ ప్రభావం కేవలం ఆర్థిక పోరాటపు సద్యోజనిత అభివృద్ధి కారణంగానే ఉత్పన్నం కాదు, సోషలిస్టు ట్రేడ్‌యూనియన్ సభ్యులు తమ సహచరులను ప్రభావితం చేసేందుకు ప్రత్యక్షంగానూ, చైతన్యపూరితంగానూ చేసే కృషిపైననే అది ఆధారపడివుంటుంది. కాని విస్తృతమైన సంఘం కచ్చితమైన రహస్య పద్ధతులను అమలు జరపలేదు. (ఆర్థిక పోరాటానికి అవసరమైనదానికన్న దీనికి అధికతర శిక్షణ అవసరం కావడమే యిందుకు కారణం.) అధిక సంఖ్యలో సభ్యత్వావసరం, కచ్చితమైన రహస్య పద్ధతుల అవసరం — వీటి మధ్యవున్న వైరుధ్యాన్ని పరిష్కరించడం ఎలా సాధ్యం? ట్రేడ్‌యూనియన్లని మనం సాధ్యమైనంత బహిరంగ సంస్థలుగా చెయ్యడం ఎలా? మొత్తం మీద యిందుకు రెండే రెండు పద్ధతులు ఉండగలవు: ట్రేడ్‌యూనియన్లు చట్టబద్ధం చెయ్యబడనైనా చెయ్యబడాలి (కొన్ని దేశాల్లో సోషలిస్టు, రాజకీయ సంఘాలను చట్ట బద్ధం చెయ్యడానికి ముందు యిది జరిగింది), లేకపోతే, సంఘాన్ని రహస్యంగానే ఉంచాలి, కాని అదే సమయంలో ''స్వేచ్ఛ''గా, అవ్యవస్థితంగా, జర్మన్లు అనేట్లు lose గా ఉంచాలి. అప్పుడిక అత్యధిక సంఖ్యాక సభ్యులకు సంబంధించినంతవరకు, రహస్య పద్ధతుల ఆవశ్యకత దాదాపు శూన్యమే అవుతుంది.

రష్యాలో సోషలిస్టేతర, రాజకీయేతర కార్మిక సంఘాలను చట్టబద్ధం చేసే క్రమం మొదలైంది. పోతే, వేగంగా పెంపొందుతున్న సోషల్ డెమొక్రటిక్ కార్మికోద్యమం సాధించే ప్రతి ఒక్క ముందడుగూ చట్టబద్ధం చేసే ప్రయత్నాలను యితోధికం చేస్తుంది, ప్రోత్స హిస్తుంది. ఈ ప్రయత్నాలు ఎక్కువభాగం ప్రస్తుత వ్యవస్థను బలపరిచే వాళ్లనుంచే జరు గుతాయి, అయితే స్వయంగా కార్మికులూ, ఉదారవాద మేధావులూ కూడా కొంతమేరకు యీ ప్రయత్నాలు చేస్తారు. వసీల్యెవ్, జుబాతొవ్ వంటివాళ్లు చట్టబద్ధం చెయ్యాలన్న నినాదాన్ని చేబట్టారు. ఓజెరొవ్, వోర్మ్స్ వంటివాళ్లు యీ ప్రయత్నానికి తమ తోడ్పాటు ఉంటుందని హామీ యిచ్చి, తోడ్పడ్డారు, కార్మికుల మధ్య యిప్పటికే కొత్త ధోరణి సమర్ధ కులు వున్నారు. ఇప్పుడిక మీదటనుంచి యీ ధోరణిని మనం ఉపేక్షించేందుకు వీల్లేదు. దీనితో మనం ఎలా వ్యవహరించాలి అన్న విషయంలో, సోషల్ డెమొక్రట్లలో రెండు అభి ప్రాయాలు ఉండజాలవు. ఈ ఉద్యమంలో జుబాతొవ్, వసీల్యెవ్ వంటివాళ్లూ, రాజకీయ పోలీ సులూ మత గురువులూ వహించే పాత్ర ఏదైతే వుందో దాన్ని మనం ఎడతెగకుండా బహి ర్గతం చేసి, వాళ్ల అసలు సంకల్పాలేమిటో కార్మికులకు వివరించి చెప్పాలి. కార్మికుల చట్ట బద్ధ సమావేశాల్లో లిబరల్ రాజకీయవేత్తలిచ్చే ఉపన్యాసాల్లో వినవచ్చే రాజీవాద, ''సామ రస్యవాద'' స్వరాలను కూడా యీ ఉపన్యాసాలు శాంతియుత వర్గ సహకారం వాంఛనీయమన్న

హృదయపూర్వక విశ్వాసంతో చెయ్యబడ్డాయా, లేక ప్రభుత్వపు మెప్పునూ మెహర్బానీనీ చూరగొనేందుకు చెయ్యబడ్డాయా, అదీ కాకపోతే, అయోమయంవల్ల చెయ్యబడ్డాయా అన్న దానితో ప్రసక్తి లేకుండా — మనం బహిర్గతం చేసి, ఖండించవలసి వుంటుంది. చివరి సంగతి, పోలీసులు తరచుగా పన్నే ఉచ్చులను గురించి మనం కార్మికుల్ని హెచ్చరించవలసి వుంటుంది. ఎందుకంటే, యీ పోలీసులు అటువంటి బహిరంగ సభల్లోనూ, చట్టబద్ధ సంఘాల్లోనూ "మెరికల్లాంటి వాళ్లను" కనిపెడతారు, చట్టవిరుద్ధ సంఘాల్లో తమ గూఢచారి ఏజంట్లను దూర్చేందుకు చట్టబద్ధ సంఘాలను వినియోగించుకుంటారు.

అయితే, మనం యిదంతా చేసేటప్పుడు, చిట్టచివరకు కార్మికోద్యమాన్ని చట్టబద్ధంచెయ్యడంవల్ల లబ్ధిపొందేది మనమేగాని జుబాతొవ్ వంటివాళ్లు కాదన్న సంగతిని ఎంతమాత్రం మరవకూడదు. ఇందుకు భిన్నంగా, వరినుంచి కలుపుని వేరుచేసేందుకు మనకి తోడ్పడేది సరిగా ముసుగులు తొలగించే మన యీ కార్యక్రమమే. ఈ కలుపు ఏమిటో నేనింతకు ముందే సూచించాను. వరి అన్నప్పుడు మన ఉద్దేశం మిక్కిలి వెనకబడ్డ విభాగాలతో బాటు, అంతకంతకు అధిక సంఖ్యలో కార్మికులను, సామాజిక, రాజకీయ సమస్యలకేసి ఆకర్షించడం, మనల్ని మనం, అంటే విప్లవకారులను ప్రధానంగా చట్టబద్ధమైన పనుల నుంచి (చట్టబద్ధమైన పుస్తకాల పంపిణీ, పరస్పర సహాయం మొదలైన వాటినుంచి) విముక్తులమవడం. దీని అభివృద్ధి మూలంగా ఆందోళనకి అవసరమైన సమాచారం తప్పని సరిగా అధికతర ప్రమాణంలో సమకూరుతుంది. ఈ దృష్ట్యా మనం జుబాతొవ్, ఓజెరొవ్ వంటివాళ్లకు యిలా చెప్పవలసి వుంటుంది: మహాశయులారా అలాగే కానివ్వండి, మీ పూర్తి శక్తిని ఉపయోగించి మరీ చెయ్యండి! మీరు కార్మికుల దోవలో (ప్రత్యక్షంగా రెచ్చగొట్టడం ద్వారానో, లేక "స్ట్రూవెయిజం"[184] సహాయంతోనో కార్మికులకు "నిజాయితీతో" ధృతి పోయేటట్టు చెయ్యడం ద్వారా) ఉచ్చు పన్నినప్పుడల్లా, మిమ్మల్ని బట్టబయలుచేసేందుకు మేం చూస్తాం. కాని ఎప్పుడైనా మీరు నిజంగా మంచి ముందడుగు వేస్తే, అది పరమ "పిరికితనంతో కూడినదీ, వంకరటింకరిదీ" అయినా కూడా మేమిలా అంటాం: దయచేసి కొనసాగించండి! నిజమైన ముందడుగు అనేది ఎప్పుడూ కూడా, కార్మికుల కార్యాచరణ రంగాన్ని చిన్నగానైనా నిజంగా విస్తృతంచేసేది మాత్రమే కాగలదు. అటువంటి ప్రతి విస్తరణా మనకి లాభదాయకమే అవుతుంది, తద్వారా చట్టబద్ధమైన సంఘాల నిర్మాణంలో సహాయం లభిస్తుంది. అటువంటి సంఘాల్లో గూఢచారి ఏజెంట్లు సోషలిస్టుల్ని కనిపెట్టడం కాదు జరిగేది, అందుకు బదులు సోషలిస్టులే ఏజెంట్లను సమకూర్చుకోగలుగుతారు. క్లుప్తంగా చెప్పాలంటే, కలుపుని పెరికెయ్యడమే మన పని. ధాన్యాన్ని పూల కుండీల్లో పెంచడం కాదు మన పని. కలుపు మొక్కల్ని పీకెయ్యడం ద్వారా ధాన్యపు చేను కోసం మనం నేలని శుభ్రం చెయ్యాలి. మరి అఫనాసీ ఇవానొవిచ్, పుల్హేరియా ఇవానొవ్నా[185]

వంటివాళ్ళు పూల కుండీల్లోని తమ పంటని సాకుతూంటే, యీనాటి కలుపుని పీకెయ్యడానికే కాకుండా, రేపటి పంటని కోసేందుకు కూడా అవసరమైన నిపుణుల్ని మనం తయారు చేసుకోవలసివుంది.*

ఇందువల్లనే చట్టబద్ధీకరణ ద్వారా, సాధ్యమైనంత తక్కువ రహస్యంగానూ, సాధ్యమైనంత విస్తృతంగానూ ఉండే వృత్తి సంఘాన్ని నిర్మించే సమస్యను మనం పరిష్కరించలేం (కాని, జుబాతొవ్, ఓజెరొవ్ లాంటివాళ్ళు అటువంటి పరిష్కారానికి సాక్షికంగా అవకాశం యిచ్చినా కూడా చాలా సంతోషించి, యీ లక్ష్య సిద్ధికోసం మనం వాళ్లతో తీవ్రంగా పోరాడవలసివుంది). ఇంక, రహస్య వృత్తి సంఘాల విషయం మిగిలివుంటుంది, ఏ కార్మికులైతే ఈ మార్గాన్ని అనుసరిస్తున్నారని (మనకి నిశ్చితంగా తెలుసునో) వాళ్లకి మన చేతనైన తోడ్పాటు నంతనీ మనం యివ్వవలసి వుంది. ట్రేడ్‌యూనియన్ సంఘాలు, ఆర్థిక పోరాటాన్ని అభివృద్ధి చెయ్యడంలోనూ, సంఘటితం చెయ్యడంలోనూ మిక్కిలి విలువైనవే కాకుండా రాజకీయాందోళనకీ, విప్లవ సంఘాలకీ చాలా ముఖ్యమైన సహాయకాలు కూడా కాగలవు. ఈ లక్ష్య సాధనకోసమూ, కొత్తగా తలెత్తిన ట్రేడ్‌యూనియన్ ఉద్యమాన్ని సోషల్ డెమోక్రట్లకు కావలసిన మార్గాల్లో నడిపేందుకోసమూ, సుమారు అయిదేళ్లుగా పీటర్స్‌బుర్గ్ ఆర్థికవాదుల నలుగుతున్న నిర్మాణ పథకంలోని అసంగతత్వం మనం మొట్టమొదట స్పష్టంగా అర్థంచేసుకోవాలి. ఆ నిర్మాణ పథకం 1897 జూలైనాటి ''కార్మికుల పరస్పర లాభ నిధి నిబంధనావళి''లోనూ (''లిస్తోక్ 'రబోత్నిక,' '' 9–10 సంచికలు, పేజి 46, ''రబోచయ మీస్ల్,'' సంచిక 1 నుంచి

---

* కలుపుకి వ్యతిరేకంగా ''ఇస్క్రా'' చేసిన ఆందోళనపట్ల ''రబోచెయె దేలొ'' మండిపడుతూ యిలా రాసింది: '' 'ఇస్క్రా'కి కాల సూచికలు, కార్మికోద్యమాన్ని 'చట్టబద్ధం' చెయ్యడానికి జుబాతొవ్ ఏజెంట్లు చేసే దయనీయ ప్రయత్నాల్లో కనిపించేటంత ఎక్కువగా మహత్తర సంఘటనల్లో (వసంతకాలపు) కనిపించడం లేదు. ఈ వాస్తవాలు తనకే వ్యతిరేకంగా ఉన్నాయన్న విషయాన్ని గుర్తించడంలో అది విఫలమైంది; ప్రభుత్వ దృష్టిలో కార్మికోద్యమం ప్రమాదకర స్థాయిని చేరుకోవడమే యిందుకు కారణం'' (''రెండు మహాసభలు,'' పేజి 27). దీనంతటికీ ''జీవితపు తక్షణ డిమాండ్లను పెడచెవినిపెట్టే'' ఛాందసుల ''పిడివాదాన్నే'' మనం నిందించవలసివుంటుంది. వీళ్లు గజం ఎత్తు వరిమొక్కల్ని చూడ నిరాకరించి, అంగుళం ఎత్తు కలుపుమొక్కల నిర్మూలనకోసం కత్తిగట్టారు! దీన్ని బట్టి ''రష్యన్ కార్మికోద్యమంపట్ల వీళ్ల దృక్పథం వక్రమైనదని తేలడం లేదా'' (అదే గ్రంథం, పేజి 27)?

గ్రహించబడింది), అలాగే 1900 అక్టోబరునాటి "ట్రేడ్‌యూనియన్ కార్మిక సంఘపు నిబంధనావళి" (యిది సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడి "ఇస్క్రా" సంచిక 1లో ప్రస్తావింపబడిన ప్రత్యేక కరపత్రం)లోనూ వివరింపబడ్డాయి. ఈ రెండు నిబంధనావళు ల్లోనూ ఒక ప్రధాన లోపం వుంది: విస్తృతమైన కార్మికుల సంఘాన్ని అవి రెండూ కూడా ఓ యినుప పంజరంలాంటి చట్రంలో బిగించి, విప్లవకారుల సంఘంతో కలగాపులగం చేశాయి. రెండవ నిబంధనావళి మరింత వివరంగా రూపొందించబడింది కనుక, దాన్ని మనం పరిశీలిద్దాం. దీనిలో యాభై రెండు నిబంధనలు ఉన్నాయి. వీటిలో యిరవై మూడు నిబంధనల్లో "కార్మిక బృందాల" నిర్మాణ స్వరూపం, పని పద్ధతీ, పరిధీ చర్చింప బడ్డాయి. ఈ బృందాలు ప్రతి ఫ్యాక్టరీలోనూ ఏర్పడాలనీ ("గరిష్ఠ సంఖ్య పదిమంది") అవి "కేంద్ర (ఫ్యాక్టరీ) గ్రూపులను" ఎన్నుకోవాలనీ పేర్కొనబడింది. రెండో నిబంధన మేరకు "కేంద్ర గ్రూపు తన ఫ్యాక్టరీలోనూ, లేక కార్ఖానాలోనూ జరిగేదాన్నంతనీ గమనిస్తూ, ఘటనలన్నింటినీ నమోదుచేస్తుంది." "కేంద్ర గ్రూపు సమర్పించే నెల వారీ అక్కౌంటును చందాదారుల ముందు పెడుతుంది" (నిబంధన 17), వగైరా. పది నిబంధనలు "పేట శాఖకి" వినియోగింపబడ్డాయి. పంథొమ్మిది నిబంధనలు "కార్మిక సంఘ కమిటీకీ," "సెంట్ పీటర్స్‌బుర్గ్ పోరాట సమితి కమిటీకీ" మధ్య ఉండే సంక్లిష్ట అంతస్సంబంధాలకు కేటాయింపబడ్డాయి (ప్రతి పేటలోని "కార్యనిర్వాహక గ్రూపుల" ఎన్నుకోబడిన ప్రతినిధులు — "ప్రచారకుల గ్రూపులు, రాష్ట్రాలతోనూ, విదేశాల్లోని సంఘంతోనూ సంబంధం పెట్టుకునే గ్రూపులు, స్టోర్సునూ, ప్రచురణలనూ, నిధులనూ నిర్వహించే గ్రూపులు").

సోషల్ డెమోక్రసీ అంటే కార్మికుల ఆర్థిక పోరాటానికి సంబంధించిన "కార్య నిర్వాహక గ్రూపులు" అన్నమాట! ఆర్థికవాదుల అభిప్రాయాలు సోషల్ డెమోక్రటిజం నుంచి ట్రేడ్‌యూనియనిజంవైపు ఎంతగా దిగజారాయో, సోషల్ డెమోక్రట్లు ప్రథమంగానూ, ప్రధానంగానూ విముక్తికోసం జరిగే యావత్తు శ్రామికవర్గ పోరాటానికీ మార్గదర్శకత్వం వహించగల విప్లవకారుల సంఘం ఉండాలన్న భావానికి ఎంత దూరమో అన్న విషయానికి యింతకన్న చక్కటి ఉదాహరణ దొరకదు. "కార్మికవర్గపు రాజకీయ విముక్తిని గురించి," "జారిస్టు నిరంకుశత్వానికి" వ్యతిరేకంగా పోరాటం గురించీ మాట్లాడ్డం, అదే సమయంలో యిలాంటి నిబంధనావళులను రాయడం అంటే, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు అసలు రాజకీయ కర్తవ్యాలను గురించి బొత్తిగా అవగాహన లేకపోవడమేనని అర్థం. యాభై నిబంధనలు వుంటే, వాటిలో ఏ ఒక్కటీ కూడా జనసామాన్యంలో సాధ్యమైనంత అధికతమ రాజకీయ ఆందోళననూ, రష్యన్ నిరంకుశత్వానికి సంబంధించిన అన్ని పార్శ్వాలనూ, రష్యాలోని వివిధ సామాజిక వర్గాల విశిష్ట లక్షణాలనూ ప్రస్ఫుటంచేసే

ఆందోళనను నిర్వహించడం అవసరమన్న అవగాహనా లేశాన్ని కూడా వ్యక్తంచెయ్యలేదు. ఇటువంటి నిబంధనావళి రాజకీయ లక్ష్యాల మాట అలా వుంచి ట్రేడ్ యూనియన్ లక్ష్యాలను సాధించడానికి సైతం పనికిరాదు; ఎందుకంటే, ట్రేడ్ యూనియన్లను వృత్తుల రీత్యా సంఘటితంచెయ్యడం అవసరం, దీన్ని గురించి యీ నిబంధనావళిలో ప్రస్తావనే లేదు.

అయితే అత్యంత గమనార్హమైన విషయం ఏమిటంటే, యీ మొత్తం ''పద్ధతి''లో వున్న తలభారం. ఈ పద్ధతి అన్ని ఫ్యాక్టరీలనూ, వాటి ''కమిటీ''లనూ ఒకే రకమైన హాస్యాస్పదమనదగినంతటి చిల్లర నిబంధనలూ, మూడు దశల ఎన్నికలూ అనే శాశ్వత సూత్రంతో బంధించాలని ప్రయత్నించింది. ఆర్థికవాద సంకుచిత దృక్పథంతో కుంచించుకుపోయిన మనస్సులు రెడ్ టేపిజాన్నీ బ్యూరాక్రటిక్ పద్ధతులనూ తలపింపజేసే వివరాలతో కూరుకుపోయాయి. ఆచరణలో నాలుగింట మూడువంతుల నిబంధనలు ఎన్నడూ అమలు జరపబడ లేదు. పైగా, ప్రతి ఒక్క ఫ్యాక్టరీలోనూ తన కేంద్ర గ్రూపును కలిగివున్న యీ మాదిరి ''రహస్య'' సంఘం రాజకీయ పోలీసులు విస్తృత స్థాయిలో దాడులు జరపడాన్ని సుసాధ్యం చేస్తుంది. పోలిష్ కామ్రేడ్సు తమ ఉద్యమంలో సరిగా యిలాంటి దశనే గడిచారు. కార్మిక సహాయక నిధులకు సంబంధించిన విస్తృత ఏర్పాట్ల విషయంలో ప్రతి ఒక్కడూ విశేషమైన ఉత్సాహాన్ని ప్రదర్శించిన దశ అది. అటువంటి సంఘాలు రాజకీయ పోలీసుల పంట బాగా పండటానికి మాత్రమే తోడ్పడుతున్నట్లు గ్రహించిన పోలిష్ కామ్రేడ్సు సత్వరమే తమ యీ ఆలోచనని వదులుకున్నారు. మన మనసుల్లో ఉన్నది విస్తృతమైన అరెస్టులు కాక విస్తృతమైన కార్మిక సంఘాలే అయినట్లయితే, రాజకీయ పోలీసులకు సంతృప్తిని సమకూర్చడం మన కోర్కె కాకపోయినట్లయితే, యీ సంఘాల నిర్మాణం విషయంలో లాంఛనప్రాయమైన ఎలాంటి కఠిన నియమాలూ ఉండకూడదు. కాని, అప్పుడు వాటికి పనిచెయ్యగల సామర్థ్యం ఉంటుందా? ఆ విధులేమిటో చూద్దాం: ''...ఫ్యాక్టరీలో జరిగేదాన్నంతనీ గమనించి పరిశీలించి, ఘటనలన్నింటినీ నమోదు చెయ్యడం'' (నిబంధనావళిలో నిబంధన 2). ఈ పని చేసేందుకోసం లాంఛనప్రాయంగా ఏర్పడిన గ్రూపు నిజంగా కావాలా మనకి? ప్రత్యేక గ్రూపుల్ని ఏర్పాటుచెయ్యకుండా రహస్య పత్రికల్లో ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా యీ పని యింతకంటె బాగా చెయ్యడం సాధ్యం కాదా?'' ...తమ ఫ్యాక్టరీల్లో పరిస్థితులను మెరుగొనర్చుకోడం కోసం ఆ కార్మికుల పోరాటాలను నడపడానికి '' (నిబంధన 3). దీనికి కూడా నిర్ణీతమైన నిర్మాణ స్వరూపమే అక్కర్లేదు. కాస్త లోకజ్ఞానం కలిగిన ఏ ఆందోళనకర్త అయినా, సామాన్య సంభాషణ క్రమంలో కార్మికుల డిమాండ్లేమిటో తెలుసుకుని, కరపత్ర రూపంలో వెల్లడించేందుకోసం, విప్లవకారుల విస్తృత సంఘానికి కాక పరిమిత సంఘానికి అందజెయ్యవచ్చు. ''...ఒక నిధిని ఏర్పాటుచేసేందుకు... దీనికిగాను రూబులుకు రెండు కోపె

క్కులు* చందాగా యివ్వాలి'' (నిబంధన 9) – చందాదారులకు వెలవారీ అకౌంటును సమర్పించాలి (నిబంధన 17), తను చందాలు చెల్లించని సభ్యుల్ని బహిష్కరించాలి (నిబంధన 10), వగైరా. బలే, దీనితో పోలీసుల రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే; ఎందు కంటే, అలాంటి ''కేంద్ర ఫ్యాక్టరీ నిధి'' రహస్యాన్ని ఛేదించడం, డబ్బుని చేజిక్కించు కోవడం, మెరికల్లాంటి కార్యకర్తల్ని అరెస్టుచెయ్యడం కన్న తేలికైన విషయం మరొకటేదీ ఉండదు. ఇంతకంటె, సుప్రసిద్ధమైన (అత్యంత పరిమిత, అత్యంత రహస్య) సంఘపు అధి కార పూర్వకమైన స్టాంపు వేసిన ఒక కోపెక్కు చీటీలనో రెండు కోపెక్కుల చీటీలనో జారీ చెయ్యడమో, లేకపోతే ఏ బాపతు చీటీలూ లేకుండానే డబ్బులు పోగుచేసి, ఏదైనా ఒక రహస్య పత్రికలో అంగీకృత సంకేత పద్ధతిలో నివేదికలను ప్రచురిస్తే మేలు కాదా? తద్వారా మన ఉద్దేశమూ నెరవేరుతుంది, రాజకీయ పోలీసులకు కూపీలు తియ్యడమూ కష్టమవు తుంది కదా.

నేని నిబంధనావళిని యిలా ఎంతైనా విశ్లేషిస్తూ పోగలను, అయితే, యింతవరకు చెప్పిందే సరిపోతుందనుకుంటాను. అత్యంత విశ్వాసపాత్రులూ, అనుభవజ్ఞులూ, కాకలుదీరిన కార్మికుల ఘనిష్టమైన ఓ చిన్న కేంద్రం ఉండి, ప్రధానమైన పేటల్లో విప్లవకారుల శాఖలో రహస్య గోపన కఠిన నియమాల చేత బంధింపబడిన బాధ్యతాయుత ప్రతినిధులతో ఆ కేంద్రానికి సంబంధాలున్నప్పుడు, ఆ కేంద్రం జనసామాన్యపు విస్తృతమైన తోడ్పాటుతో, లాంఛనప్రాయమైన సంఘమేదీ లేకుండానే, ట్రేడ్ యూనియన్ సంఘం నిర్వర్తించగల అన్ని విధులనూ, పైపెచ్చు, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి వాంఛనీయమైన పద్ధ తిలో, నిర్వహించగలుగుతుంది. రాజకీయ పోలీసులు అందరూ కట్టకట్టుకొని అడ్డంవచ్చినా కూడా, సోషల్ డెమోక్రటిక్ వృత్తిపర ఉద్యమాన్ని సంఘటితం చెయ్యడానికీ, అభివృద్ధిచెయ్యడానికీ సాధ్యమైన మార్గమల్లా ఇదొక్కటే.

నిర్దిష్టమైన రూపం కూడా లేకుండా, చేర్చుకోబడిన సభ్యుల సభ్యత్వ రిజిస్టరు కూడా లేకుండా lose** గా ఉన్న దాన్ని సంఘం అని పిలిచేందుకే వీల్లేదు కదా అని ఎవరైనా అభ్యంతరం చెప్పవచ్చు. బహుశా యిది నిజమే కావచ్చు. అయితే నా ఉద్దేశంలో పేరు కాదు ప్రధానం. ముఖ్యమైన విషయం ఏమిటంటే, యీ ''సభ్యత్వం లేని సంఘం'' మన భవి ష్యత్ ట్రేడ్ యూనియన్లకీ, సోషలిజానికీ మధ్య ఘనిష్టమైన సంబంధాన్ని ముందు నుంచీ సుస్థిరంచేసేందుకు అవసరమైన ప్రతి పనినీ చేస్తుంది. నిరంకుశ ప్రభుత్వంకింద

---

* సంపాదించుకున్న వేతనాల్లో. – సం.

** విశాలంగా, విస్తృతంగా. – సం.

ఎన్నికలు, నివేదికలు, సార్వజనిక ఓటింగు మొదలైనవన్నీ కలిగిన విశాల కార్మిక సంఘాలను స్థాపించాలని కోరేవాడు పరమ స్వాప్నికుడే.

దీన్నుంచి నేర్చుకోవలసిన గుణపాఠం సరళమైనది. విప్లవకారుల సుదృఢ సంఘపు నిర్మాణంతో మనం ప్రారంభించినట్లయితే, మొత్తంగా ఉద్యమ సుస్థిరత్వానికి హామీ ఏర్ప డుతుంది. అప్పుడు సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు, ముఖ్యంగా ట్రేడ్ యూనియన్ల లక్ష్యాలను సాధించడంలో మనం సాఫల్యం పొందుతాం. అందుకు విరుద్ధంగా కార్మికుల విశాల సంఘంతో మనం మొదలుపెట్టినట్లయితే — జనసామాన్యానికి అత్యధికంగా ''అందు బాటులో'' ఉంటుందని తలచబడే యీ సంఘం (వాస్తవానికి రాజకీయ పోలీసులకు అత్య ధికంగా అందుబాటులో వుండి, విప్లవకారులను అతి తేలికగా పోలీసుల కబంధ హస్తాలకు అందిస్తుంది) — ఈ రెండు లక్ష్యాల్లో ఏ ఒక్కదాన్నీ మనం సాధించలేం. సద్యోజనిత త్వంతో కూడి, సిద్ధాంత రహితంగా, అలవాటునుబట్టి వచ్చే పద్ధతులను మనం వదిలించుకోలేం, పోతే, మనం చెదురుబదురుగానే ఉండిపోతాం, మన బలగాలను పోలీసులు పదే పదే దెబ్బతీస్తూనే వుంటారు, జుబాతొవ్, ఓజెరొవ్ మాదిరి ట్రేడ్ యూని యన్లను మాత్రమే మనం అత్యధిక జనసామాన్యానికి అందుబాటులోకి తేగలం.

సరిగా చెప్పకోవాలంటే, విప్లవకారుల సంఘాలు ఏయే విధులను నిర్వర్తించాలి? ఈ విషయాన్ని యిక్కడ సవివరంగా చర్చించుకుందాం. అయితే మొదటి సంగతి, మన టెర రిస్టు — యీ విషయంలో కూడా (దౌర్భాగ్యవశాన!) అర్థికవాదికి అత్యంత సన్నిహితవర్తి — వాదనని పరిశీలిద్దాం. కార్మికులకోసం ప్రచురింపబడే ''స్వబోద'' పత్రిక మొదటి సంచికలో ''సంఘం'' శీర్షిక గల ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ఆ వ్యాసకర్త తన మిత్రులను, ఇవా నొవొ-వొజ్నెసేన్స్కికి చెందిన అర్థికవాద కార్మికులను వెనకేసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాడు. ఆయన యిలా రాస్తాడు:

''జనసామాన్యం మూగగానూ, అజ్ఞానావస్థలోనూ ఉండి, ఉద్యమ వెల్లువ సామాన్య సభ్యుల్లోంచి పుట్టుకురాకపోవడం బాగా లేదు. ఉదాహరణకు, విశ్వవిద్యా లయం ఉన్న పట్టణంనుంచి వేసవి సెలవులప్పుడూ, యితర సెలవులప్పుడూ విద్యార్థులు యిళ్లకు పోతారు, అంతే, వెంటనే కార్మికోద్యమం మూలపడిపోతుంది. బయటనుంచి గెంటవలసివచ్చే, కార్మికోద్యమం నిజమైన శక్తి కాగలదా? ఎంతమాత్రం కాజాలదు.... అటువంటి ఉద్యమం యింకా తన కాళ్లమీద తాను నడవడం నేర్చు కోలేదు, అదింకా ఎవరి చేతినో పుచ్చుకుని నడవగల స్థితిలో మాత్రమే వుంది. అన్ని రంగాల్లోనూ యిదే పరిస్థితి వుంది: విద్యార్థులు వెళ్లిపోతారు — పనంతా స్తంభించిపోతుంది; అత్యంత సమర్థులు అరెస్టుచెయ్యబడతారు — మీగడ తీసెయ్యగానే

పాలు పులిసిపోతాయి; 'కమిటీ' అరెస్టు చెయ్యబడితే, మరో కొత్త కమిటీని ఏర్పాటు చెయ్యగలిగేదాకా పనంతా బందైపోతుంది; తర్వాత ఏర్పడబోయే కమిటీ ఎలాంటిదవుతుందో ఎవళ్లకీ ఎన్నడూ తెలియదు — అది ముందు మాదిరిది ఎంతమాత్రం కాకపోవచ్చు. పూర్వపు కమిటీ చెప్పిన దానికి యీ కొత్త కమిటీ పూర్తి విరుద్ధంగా చెప్పవచ్చు. తద్వారా నిన్నటికీ రేపటికీ మధ్య అనుస్యూతి తెగిపోతుంది, గతానుభవం భవిష్యత్తుకి మార్గదర్శకం కాకుండా పోతుంది. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే, జన సామాన్యంలో ఉద్యమం లోతుగా వేళ్లూనుకోక పోవడం వల్లనే. పని చేసేదెప్పుడూ వందమంది మూర్ఖులు కాదు, ఓ డజనుమంది తెలివైనవాళ్లు. డజనుమంది తెలివైనవాళ్లు చేపల్లా పట్టుబడిపోవచ్చు, అయితే ఉద్యమం కార్మిక జనసామాన్యంలో విస్తరించినప్పుడు అన్ని పనులూ వాళ్లే చేస్తారు, అప్పుడిక ఎవడూ, ఎంత తంటాలుపడినా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చెయ్యలేడు'' (పేజి 63).

వాస్తవాల వర్ణన కచ్చితంగా వుంది. మన అనిపుణత వర్ణించబడింది. కాని, అటు తెలివితక్కువతనం దృష్ట్యా, యిటు రాజకీయ చాతుర్య లోపం దృష్ట్యా నిర్ధారణలు సరిగా ''రబోచయ మీస్ల్''కి తగినట్లే ఉన్నాయి. రచయిత ఉద్యమపు ''లోతులోని,'' ''మూలాలని'' గురించి తాత్విక, సామాజిక—చారిత్రక సమస్యను రాజకీయ పోలీసులను ఎదుర్కోవడంలో అత్యుత్తమ పద్ధతి ఏమిటన్న సాంకేతిక, నిర్మాణపర సమస్యతో కలగాపులగం చేశాడు, అందుకనే యీ నిర్ణయాలు పరమ తెలివి తక్కువగా వున్నాయి. చెడ్డ నాయకుల స్థానంలో మంచి నాయకులను తీసుకురావాలని చెప్పేందుకు బదులు, నాయకుల స్థానంలో కార్మికజన సామాన్యాన్ని ప్రవేశపెట్టాలని రచయిత చెప్తున్నాడు, అందుకని యీ నిర్ధారణలు రాజకీయ చాతుర్య లోపపు పారమ్యాన్ని చేరుకున్నాయి. రాజకీయాందోళన స్థానంలో ఉత్తేజకరమైన హింసాకాండను ప్రవేశపెట్టాలన్న భావం మనల్ని రాజకీయంగా వెనక్కి తీసుకువెళ్లేందుకు ప్రయత్నం అయినట్లే, యిది నిర్మాణరీత్యా మనల్ని వెనక్కి తీసుకెళ్లేందుకు ప్రయత్నమే. వాస్తవానికి, నేను embarras de richesses* ''స్వొబోద'' సృష్టించిన దుర్భ్రమలను చెదరగొట్టేందుకు ఎక్కడ మొదలెట్టాలో పాలు పోకుండా ఉన్నాను. స్పష్టత కోసం, నేనొక ఉదాహరణతో మొదలుపెడతాను. జర్మన్లను తీసుకోండి. జర్మన్ ఉద్యమం జనసామాన్యాన్ని కూడగట్టిందనీ, జర్మనీలో అన్నీ జనసామాన్యంలో నుంచే మొదలవుతాయనీ, కార్మికోద్యమం అక్కడ తన కాళ్లపైన తాను నడవడం నేర్చుకుందనీ నేనంటే, ఎవరూ అభ్యంతరం చెప్పరని ఆశిస్తాను. అయితేనేం, అక్కడ యీ లక్షలాదిమంది కాకలు

* విషయ సామగ్రి ఆధిక్యతతో ఉక్కిరిబిక్కిరవుతున్నాను. — సం.

తీరిన తమ "డజనుమంది" నాయకులను ఎంతగా గౌరవిస్తారో, ఎంత దృఢంగా వాళ్లకి అంటిపెట్టుకుని ఉంటారో గమనించండి. పార్లమెంటులోని ప్రతికూల పార్టీల సభ్యులు సోషలిస్టులను తరచుగా యిలా అని ఎద్దేవా చేస్తూండేవారు: "మీరు మా దొడ్డ ప్రజాస్వామ్యవాదులే! మీది పేరుకి మాత్రమే కార్మికోద్యమం; ఆచరణలో ఏళ్ల తరబడిగా అదే నాయకుల ముఠా కనిపిస్తుంది, అదే బేబెల్, అదే లీబ్‌క్నెఖ్ట్. దశాబ్దాల తరబడిగా యిదే సాగుతోంది. ఎన్నుకోబడ్డారని చెప్పే మీ కార్మిక ప్రతినిధులు చక్రవర్తి నియమించే ఉద్యోగుల కంటె కూడా పెర్మనెంటు అన్నట్లున్నారు!" కాని "జనసామాన్యాన్ని" "నాయకుల" పైకి ఎగదోలేందుకూ, వాళ్లలో చెడ్డ భావాలనూ, ఆశాపాతక భావాలనూ రెచ్చగొట్టేందుకూ, తమ "డజనుమంది తెలివిపరుల" పట్ల జనసామాన్యానికి వున్న విశ్వాసాన్ని చెదరగొట్టడం ద్వారా ఉద్యమ ఘనిష్టతకూ, స్థిరత్వానికీ ఎసరుబెట్టేందుకూ జరిగే యీ ధూర్త ప్రయత్నాలపట్ల జర్మన్లు తిరస్కార భావంతో నవ్వి ఊరుకుంటారు. జర్మన్లలో రాజకీయ ఆలోచనా శక్తి తగినంతగా అభివృద్ధి చెందింది. "డజనుమంది" కాకలుదీరిన, ప్రతిభావంతులైన (ప్రతిభావంతులు వందల సంఖ్యలో యేమీ పుట్టుకురారు), తమ పనిలో పూర్తి శిక్షణ పొంది, సుదీర్ఘానుభవం పొంది, పూర్తి సామరస్యంతో పనిచేసే నాయకులు లేనిదే ఆధునిక సమాజంలోని ఏ వర్గమూ దృఢ సంకల్పంతో పోరాటాన్ని సాగించ జాలదన్న విషయాన్ని గ్రహించేపాటి రాజకీయానుభవాన్ని వాళ్లు సంపాదించుకున్నారు. జర్మన్లలో కూడా రెచ్చగొట్టే వక్తలూ, "వందమంది మూర్ఖుల్ని" పొగడి, వాళ్లకి "డజను మంది తెలివిపరుల" కన్న ఉన్నత స్థానం యిచ్చి, జనసామాన్యపు "కాయలు కాసిన హస్తాలను" కీర్తించి (మోస్ట్, హస్సెల్‌మన్‌ల మాదిరిగా), వాళ్లని దుస్సాహసిక "విప్లవ" కార్యాచరణకు రెచ్చగొట్టి, సుదృఢ, సుస్థిర నాయకులపట్ల అవిశ్వాస బీజాలను నాటే వాళ్లూ లేకపోలేదు. సోషలిస్టు ఉద్యమంలోని రెచ్చగొట్టే యిటువంటి సకల శక్తులపైనా సుదృఢమైన ఎడతెగని పోరాటం జరపడం ద్వారానే జర్మన్ సోషలిస్టు ఉద్యమం పెరిగి, యీనాటి బృహత్ శక్తి కాగలిగింది. సద్యోజనితంగా జాగృతులైన జనసామాన్యాన్ని నడప గలిగిన, తగినంత శిక్షణ కలిగి, అభివృద్ధిచెంది, అనుభవ జ్ఞానం సంపాదించుకున్న నాయకుల లోపమనే సంక్షోభాన్ని రష్యన్ డెమోక్రటిక్ ఉద్యమం ఎదుర్కొంటున్న తరుణంలో మన పండితమ్మన్యులు మూర్ఖత్వ పారమ్యంలో "ఉద్యమ వెల్లువ సామాన్య సభ్యుల్లోంచి పుట్టుకు రాకపోవడం బాగా లేదు" అంటూ ఘోషిస్తున్నారు.

"విద్యార్థుల కమిటీవల్ల ప్రయోజనం లేదు; దానిలో స్థిరత్వం ఉండదు." ఇది పూర్తిగా నిజమే. అయితే దీన్నుంచి నేర్చుకోవలసిన గుణపాఠం ఏమిటి? మనకి కావలసినది వృత్తి విప్లవకారుల కమిటీ అనీ, అటువంటి హోల్‌టైమ్ విప్లవకారుడు కాగలిగినది విద్యార్థియా, కార్మికుడా అన్నది అంత ముఖ్యం కాదనీ. కాని మీరు చేస్తున్న నిర్ధారణ ఏమిటి? కార్మికో

ద్యమాన్ని బయటినుంచి ముందుకి గెంటరాదని! మీ రాజకీయ అమాయకత్వం కారణంగా, మీరు ఆర్థికవాదుల చేతుల్లో పడుతున్నారనీ, మన అనిపుణతను పెంపొందిస్తున్నారనీ మీరు గమనించడం లేదు. అయితే నేను మిమ్మల్నొక ప్రశ్న అడుగుతాను. మన విద్యార్థులు కార్మికుల్ని ఎక్కడ, దేనిలో "ముందుకి గెంటుతున్నారు?" విద్యార్థులు కేవలం తమకున్న రాజకీయ పరిజ్ఞాన లేశాన్ని, తాము సంపాదించుకోగలిగిన సోషలిస్టు భావ లేశాలను కార్మికులకు అందజేస్తున్నారు, (ఎందుకంటే, యీనాటి విద్యార్థులకి మేధాపర ప్రధానాహారమైన చట్టబద్ధ మార్క్సిజం కేవలం ప్రాథమిక జ్ఞానాన్ని లేక జ్ఞాన లేశాలను మాత్రమే అందజెయ్యగలదు). అలాంటి "బయటనుంచి ముందుకి గెంటడం" అన్నది మరీ ఎక్కువగా ఎన్నడూ లేదు. ఇందుకు భిన్నంగా, మన ఉద్యమంలో అలాంటిది యింతవరకు మరీ తక్కువగా ఉంది: మనం గిరిగీసుకుని అందులో ఉండిపోవడమే యిందుకు కారణం. మనం ప్రాథమికమైన "యజమానులకీ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా కార్మికులు జరిపే ఆర్థిక పోరాటం" ముందే మరీ బానిస బుద్ధితో సాగిలపడ్డాం. వృత్తి విప్లవకారులమైన మనం ఆ మాదిరి "బయట నుండి ముందుకు గెంటడాన్ని" యింతకు ముందర కన్న వందరెట్లు ఎక్కువగా, మన పనిగా పెట్టుకోవాలి, పెట్టుకుంటాం. కాని, "బయటనుంచి ముందుకు గెంటడం" అన్న రోసిపోయిన పదాలను మీరు ఎంచుకోవడాన్ని బట్టే — కార్మికుల్లో (కనీసం మీసాటి అజ్ఞానవంతులైన కార్మికుల్లో) బయటనుంచి తమకి రాజకీయ జ్ఞానాన్నీ, విప్లవానుభవాన్నీ (వీటి మూలంగా కార్మికులకి ఆ బాపతువాళ్ళ అందర్నీ ప్రతిఘటించాలన్న సహజ ప్రవృత్తి కలుగుతుంది) తెచ్చేవాళ్ళ అందరిపట్లా అవిశ్వాసాన్ని కలిగించక మానదు — మీరు రెచ్చగొట్టే వక్తలు అనీ, కార్మికవర్గానికి రెచ్చగొట్టే వక్తలే గర్భశత్రువులనీ రుజువవుతోంది.

అయ్యా, దయచేసి, వాదనలో నా "అమిత్ర పద్ధతుల్ని" గురించి యిప్పుడింక బొబ్బలు పెట్టడం మొదలెట్టకండి. మీ ఉద్దేశాల పావిత్ర్యాన్ని శంకించాలన్న వాంఛ నాకు ఏ కోశానా లేదు. నేనింతకు ముందే చెప్పినట్లు, మనిషి కేవలం రాజకీయ అమాయకత్వం కారణంగా కూడా రెచ్చగొట్టే వక్త కావచ్చు. మీరు రెచ్చగొట్టే వక్తల స్థాయికి దిగజారారని నేనింతకు ముందే నిరూపించాను. కాగా, కార్మికవర్గానికి రెచ్చగొట్టే వక్తలను మించిన బద్ధశత్రువులు ఉండరన్న విషయాన్ని విసుగు లేకుండా పదే పదే చెప్తాను. వీళ్ళు అందర్నీ మించిన బద్ధ శత్రువులని ఎందుకంటున్నానంటే, రెచ్చగొట్టే వక్తలు కార్మికుల్లో నీచాభిరుచుల్ని రెచ్చగొడతారు, అంతగా చైతన్యవంతులు కాని కార్మికులు తమ ప్రతినిధులుగా చలామణీ అయ్యే వాళ్లలో తమ శత్రువులెవరో గుర్తించలేరు, కొన్ని సందర్భాల్లో వాళ్లనే తమ మిత్రులుగా కూడా హృదయపూర్వకంగా విశ్వసిస్తారు. బద్ధ శత్రువులని ఎందుకంటున్నానంటే, అనైక్యతా, ఊగిసలాటలూ ప్రబలంగా ఉన్న దశలో, మన ఉద్యమం యింకా అప్పుడప్పుడే రూపొందుతున్న సమయంలో జనసామాన్యాన్ని రెచ్చగొట్టే ఉపన్యాసాలిచ్చే పద్ధతుల్ని వినియోగించి,

తప్పు దోవ పట్టించడం కన్న తేలిక పని మరొకటుండదు. అయితే కార్మికులు కటువైన అనుభవాల తర్వాత మాత్రమే తమ పొరపాట్లను తెలుసుకో గలుగుతారు. అందుకనే యీనాడు ప్రతి ఒక రష్యన్ సోషల్ డెమోక్రటూ, యీ కింది నినాదాన్ని తన ముందుంచుకోవాలి: రెచ్చగొట్టే ఉపన్యాసాలిచ్చే పద్ధతులకు దిగజారిన "స్వొబోద," "రబోచెయె దేలొ"లకి వ్యతిరేకంగా బద్ధకంకణులై పోరాడండి! దీన్ని గురించి నేను తర్వాత మరింత విపులంగా చర్చిస్తాను.*

"ఓ వందమంది మూర్ఖులకన్న ఓ డజనుమంది తెలివిపరులను పట్టుకోవడం సుల భతరం." ఈ అద్భుత వాస్తవం (దీన్ని ఆ వందమంది మూర్ఖులూ సదా హర్షిస్తూనే వుంటారు) వాదనకి సరిగా మధ్యలో మీరు ఒక సమస్యను వదిలి మరో సమస్యకి గంతే శారు కనుకనే, మీకు యింత స్పష్టమైనదిగా కనిపిస్తోంది. "కమిటీ"ని పట్టుకోవడం గురించీ, "సంఘాన్ని" పట్టుకోవడం గురించీ చెప్పడం మొదలెట్టి, చెప్పడం కొనసాగించి, యిప్పుడేమో మీరు ఉద్యమపు "వేళ్లను" "అట్టడుగున" పట్టుకోవడం అనే సమస్యకి కుప్పిగంతు వేస్తున్నారు. మన ఉద్యమానికి జనసామాన్యంలో కోట్లకొలది లోతైన వేళ్లు న్నాయి, అందుచేతనే దాన్ని నిర్మూలించడం వాస్తవానికి అసాధ్యమనడం స్పష్టం; అయితే ప్రస్తుత చర్చనీయాంశం అది కాదు. "లోతైన వేళ్లకి" సంబంధించినంతవరకు, మనలో అనిపుణత ఎంతగా ఉన్నప్పటికీ కూడా, యీనాడు సైతం మనల్ని పట్టుకోవడం అసా ధ్యమే. అయినా మన మందరం "సంఘాలు" పట్టుబడుతున్నాయనీ, దాని మూలంగా ఉద్యమంలో అనుస్యూతిని కాపాడుకోవడం అసంభవమవుతోందనీ ఫిర్యాదు చేస్తున్నాం, ఫిర్యాదు చెయ్యకుండా ఉండలేకపోతున్నాం. కాని సంఘాలు నిర్మూలింపబడటం గురించిన సమస్యని మీరు లేవదీస్తున్నారు కనుక, నూరుమంది మూర్ఖులను పట్టుకోవడం కన్న డజను మంది తెలివిపరులను పట్టుకోవడం చాలా కష్టతరమని నేను ఢంకా బజాయించి చెప్తున్నాను. నేను "ప్రజాస్వామ్య వ్యతిరేక" అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నాననీ వగైరాలు చెప్పి జనసామాన్యాన్ని నాకు వ్యతిరేకంగా మీరెంతగా రెచ్చగొట్టినా కూడా, యీ నా అభి ప్రాయాన్నే నేను సమర్థిస్తాను. నేను పదే పదే చెప్పినట్లుగా, నిర్మాణానికి సంబంధించి తెలివిపరులు అన్నప్పుడు, వృత్తి విప్లవకారులు — వాళ్లు విద్యార్థుల్లోంచి వచ్చారా, లేక

* ప్రస్తుతానికి యిక్కడ మనం "బయటినుంచి ముందుకి నెంటడం" పైనా, నిర్మాణం విషయంలో "స్వొబోద" సుదీర్ఘ వ్యాసాలపైనా నా వ్యాఖ్యలు "రబోచెయె దేలొ" అనుచరులతోబాటు అందరు ఆర్థికవాదులకీ పూర్తిగా వర్తిస్తాయన్న విషయాన్ని మాత్రమే గుర్తించుకుంటే సరిపోతుంది. వాళ్లలో కొందరు నిర్మాణానికి సంబంధించి అలాంటి అభి ప్రాయాలను చురుకుగా బోధించి, సమర్థించగా వాళ్లలో మరికొందరు వాటివైపుకి మొగ్గారు.

కార్మికులమంచి వచ్చారా అన్న దానితో ప్రసక్తి లేకుండా — అనే నా ఉద్దేశం. నేనీ కింది విషయాలు వక్కాణించి చెప్తున్నాను: (1) అనుస్యూతితోబాటు స్థిరమైన నాయకుల సంఘటన లేనిదే ఏ విప్లవోద్యమమూ ఎక్కువ కాలం మనలేదు; (2) ఎంత విస్తృత స్థాయిలో జనసామాన్యం సద్యోజనితంగా పోరాటంలోకి వచ్చి, ఉద్యమానికి ప్రాతిపదిక అయి, దానిలో పాల్గొంటుందో అంత విస్తృత స్థాయిలో అలాంటి ఉద్యమ సంఘటన తక్షణావశ్యకం అవుతుంది, యీ సంఘటన అంత ఎక్కువ సంఘటితంగా ఉండవలసివుంటుంది (లేకుంటే, అమాంబాపతు రెచ్చగొట్టే వక్తలూ జనసామాన్యంలోని తక్కువ చైతన్యం కలిగిన విభాగాలను పక్క దోవలు పట్టించగలుగుతారు); (3) అలాంటి సంఘటన ప్రధానంగా విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనే హోల్‌టైమర్లదై వుండాలి; (4) నిరంకుశ రాజ్యంలో అలాంటి సంఘపు సభ్యత్వాన్ని విప్లవ కార్యకలాపాలే వృత్తిగా కలిగిన వాళ్లకీ, రాజకీయ పోలీసులను ఎదుర్కోవడమనే కళలో నిరంతరాయమైన శిక్షణ పొందినవాళ్లకీ ఎంత ఎక్కువగా మనం <u>పరిమితం చేస్తే</u>, సంఘ సభ్యుల్ని పట్టుకోవడం అంత ఎక్కువ కష్టమవుతుంది; (5) కార్మికవర్గం నుంచీ, సమాజంలోని తదితర వర్గాలనుంచీ అంత <u>ఎక్కువ సంఖ్యలో</u> ఉద్యమంలో చేరగలుగుతారు, దానిలో చురుకుగా పనిచెయ్యగలుగుతారు.

మన ఆర్థికవాదులనూ, టెరరిస్టులనూ, ''ఆర్థికవాద టెరరిస్టులనూ''* పై సూత్రీకరణలను పూర్వపక్షం చెయ్యవలసిందిగా నేను ఆహ్వానిస్తున్నాను. ప్రస్తుతానికి నేను చివరి

---

* ఈ పదబంధం ముందరి పదంకన్న ''స్వొబోద''కి బహుశా బాగా వర్తించవచ్చు. ఎందుకంటే, ''విప్లవవాద పునరుత్థానం'' అన్న శీర్షికతో వెలువరచిన వ్యాసంలో అది టెరరిజాన్ని బలపరచగా, యిప్పుడు మన పరిశీలనలో ఉన్న వ్యాసంలో అది ఆర్థికవాదాన్ని సమర్థించింది. ''స్వొబోద''ని గురించి ఎవరైనా యిలా చెప్పుకోవచ్చు: ''మంచి చెయ్యాలనే అనుకుంటుంది, కాని తీరా చెడు చేస్తుంది.'' దాని కోర్కెలేమి, ఉద్దేశాలేమి చాలా మంచివే — కాని పర్యవసానం మాత్రం శుద్ధ గందరగోళం. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే, ''స్వొబోద'' సంఘంలో అనుస్యూతి కావాలని ఒకమూల చెప్తూ, మరోమూల విప్లవవాద ఆలోచనలోనూ, సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతంలోనూ అనుస్యూతి కావాలని గుర్తించేందుకు అది నిరాకరిస్తుంది. వృత్తి విప్లవకారుల పద్ధతిని పునరుద్ధరించాలని అది కోరుతుంది (''విప్లవవాద పునరుత్థానం''), ఆ లక్ష్యసాధన కోసం అది యీ కింది ప్రతిపాదనలు చేస్తుంది: ఒకటి ఉత్తేజకర హింసాకాండ, రెండు, ''సగటు కార్మికుల సంఘం'' (''స్వొబోద,'' సంచిక 1, పేజి 66, దాని తర్వాత), యిది ''బయటినుంచి ముందుకు గెంటే అవకాశం తక్కువ. వేరే మాటల్లో చెప్పాలంటే, యింటిని వేడిగా ఉంచేందుకు గాను కట్టెలకోసం యింటినే పడగొట్టాలన్నట్లుంది.

రెండు అంశాలను గురించి మాత్రమే పరిశీలిస్తాను. ''ఓ డజనుమంది తెలివిపరులని'' పట్టుకోవడమా లేక ''ఓ వందమంది మూర్ఖుల్ని'' పట్టుకోవడమా ఏది సులభతరం అన్న ప్రశ్న, కచ్చితమైన రహస్య గోపనం అవసరమైనప్పుడు పైన చర్చింపబడిన విశాల ప్రజా సంఘం సాధ్యమా అన్న ప్రశ్నకు కుంచింపబడుతుంది. రహస్య గోపనం ఏ స్థాయిలో లేనట్లయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టుదలతో అనుస్యూతితో కూడిన పోరాట సమస్యే ఉండ జాలదో, ఆ స్థాయిలో రహస్య గోపనాన్ని విస్తృత ప్రజా సంఘంలో ఎన్నడూ మనం సాధించ లేం. సాధ్యమైనంత తక్కువమంది వృత్తి విప్లవకారుల చేతుల్లో రహస్య కార్యాలన్నింటినీ కేంద్రీకరించడమంటే, వాళ్లే ''అందరికోసం ఆలోచిస్తారనీ,'' జనసామాన్యం ఉద్యమంలో పాల్గొనరనీ అర్థం కాదు. అందుకు భిన్నంగా, జనసామాన్యం తమలోంచి అంతకంతకు ఎక్కువ సంఖ్యలో వృత్తి విప్లవకారులను ముందుకు తెస్తారు. కొద్దిమంది విద్యార్థులూ, ఆర్థిక పోరాటం సాగించే కొద్దిమంది కార్మికులూ ఓ ''కమిటీ''ని ఏర్పాటుచేసుకునేందుకు జతగూడితేనే సరిపోదనీ, ఎవరైనా వృత్తి విప్లవకారుడు కావాలనుకుంటే అందుకు కొన్ని ఏళ్లు పడుతుందనీ, సామాన్య సభ్యులు అనిపుణ పద్ధతులను గురించి మాత్రమే కాక, అలాంటి శిక్షణ గురించి కూడా ''ఆలోచిస్తారనీ''జనసామాన్యులు తెలుసుకుంటారు. సంఘపు రహస్య విధుల కేంద్రీకరణ అంటే ఉద్యమపు అన్ని విధుల కేంద్రీకరణ అని ఎంతమాత్రమూ అర్థం కాదు. చట్టవిరుద్ధమైన పత్రికల నిర్వహణకు సంబంధించిన రహస్య విధుల నిర్వహణ ఓ ''డజనుమంది'' వృత్తి విప్లవకారుల చేతుల్లో కేంద్రీకృతమైన కారణంగా, రహస్య పత్రికల్లో విస్తృత జనసామాన్యం పాల్గొనడమన్నది తగ్గదు; సరికదా పది రెట్లు పెరుగుతుంది. ఈవిధంగా, యీవిధంగా మాత్రమే, రహస్య పత్రికల పఠనం, వాటికి రాయడం, కొంతమేరకు వాటిని పంపిణీ చెయ్యడం అన్నవి దాదాపు రహస్య కార్యకలాపాలు కాకుండా పోతాయి. ఎందుకంటే, వేల సంఖ్యలో పంపిణీచెయ్యబడే పత్రికయొక్క ప్రతి సంచికపైనా న్యాయ విచారణా, పాలనా సంబంధమైన తంతును నిర్వహించడంలోని మూర్ఖత్వాన్నీ, అసాధ్యతనూ పోలీసులు త్వరలోనే తెలుసుకుంటారు. ఇది ఒక్క పత్రికలకే కాకుండా, ప్రదర్శనలతోబాటు, ఉద్యమ సంబంధమైన ప్రతి ఒక్క కార్యకలాపానికీ వర్తిస్తుంది. జనసామాన్యపు క్రియాశీలమూ, విస్తృతమూ అయిన భాగస్వామ్యం తగ్గదు, సరికదా అందుకు భిన్నంగా, ''ఓ డజనుమంది'' అనుభవజ్ఞులూ, పోలీసులకంటె తక్కువ శిక్షణ పొందని వృత్తి విప్లవకారుల చేతుల్లో కరపత్రాల రచన, ముసాయిదా పథకాల తయారీ, పట్టణంలోని ప్రతి పేటకూ, ప్రతి ఫ్యాక్టరీకీ ప్రతి ఒక విద్యా సంస్థ మొదలైనవాటికీ నాయకత్వాన్ని నియమించడం వంటి రహస్య కార్యకలాపాలు కేంద్రీకరింపబడతాయి గనుక, అది పెరుగుతుంది. (నా ''ప్రజాస్వామ్య విరుద్ధ'' అభిప్రాయాలకు అభ్యంతరం చెప్పబడుతుందని నాకు తెలుసు, అయితే, తెలివైనది మాత్రం కాని యీ అభ్యంతరానికి సమగ్రంగా

జవాబిస్తాను.) విప్లవకారుల సంఘం చేతుల్లో మిక్కిలి రహస్యమైన కార్యకలాపాల కేంద్రీకరణ కార్మికుల ట్రేడ్‌యూనియన్లు, కార్మికుల స్వయం శిక్షణ కేంద్రాలు, చట్టవిరుద్ధ సాహిత్య పఠన కేంద్రాలు, జనాభాలోని యితర అన్ని విభాగాల్లోని సోషలిస్టు, అలాగే ప్రజాస్వామిక కేంద్రాలు వగైరా, వగైరాల వంటి, విస్తృత ప్రజానీకం కోసం ఉద్దేశింపబడి, తత్కారణంగా వదులుగానూ, సాధ్యమైనంత తక్కువ రహస్యంగానూ ఉండే చాలా సంఘాల కార్యకలాపాల పరిధినీ, నాణ్యాన్నీ, తగ్గించదు సరికదా పెంపొందించుతుంది. మనకి అలాంటి బృందాలూ, ట్రేడ్ యూనియన్లూ, సంఘాలూ అన్నిచోట్లా, సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో, అత్యధిక వైవిధ్యం కలిగిన కార్యకలాపాలను కలిగివుండటం తప్పనిసరి అవసరం; అయితే వాటిని విప్లవకారుల సంఘంతో కలగాపులగం చెయ్యడం, వాటిమధ్య సరిహద్దు రేఖని చెరిపెయ్యడం, ప్రజోద్యమానికి ''సేవచేసేందుకు'' గాను ప్రత్యేకించి సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాలకు తమను తాము అంకితం చేసుకునే వ్యక్తులు కావాలనీ, అలాంటి వ్యక్తులు వృత్తి విప్లవకారులుగా ఉండేందుకుగాను తమను తాము ఓపిగ్గానూ, పట్టుదలతోనూ శిక్షితులను చేసుకోవాలన్న విషయంలో యిప్పటికే తక్కువగా ఉన్న గుర్తింపును మరింత నీళ్ళుకార్చడం అవకతవక పనే కాకుండా హానిదాయకం కూడా.

నిజమే, యీ గుర్తింపు నమ్మలేనంత అస్పష్టంగా ఉంది. నిర్మాణానికి సంబంధించి మన ఘోర తప్పిదం ఏమిటంటే, మన అనిపుణతతో రష్యాలో విప్లవకారుల ప్రతిష్ఠని మనం మట్టిపాలు చేశాం. సిద్ధాంతం విషయంలో దౌర్బల్యం కలిగి, ఊగిసలాడే వ్యక్తి, సంకుచిత దృక్పథం కలిగిన వ్యక్తి, తన మందకొడితనానికి జనసామాన్యపు సద్యోజనితత్వాన్ని సాకుగా చెప్పుకునే వ్యక్తి, ప్రజా ప్రతినిధిలాకంటె ట్రేడ్ యూనియన్ కార్యదర్శిలా ఉండే వ్యక్తి, ప్రత్యర్థుల గౌరవాన్ని సైతం చూరగొనే విస్తృతమూ, సాహసికమూ అయిన పథకాన్ని ఊహించలేని వ్యక్తి, తన స్వీయ వృత్తికి సంబంధించిన కళలో — రాజకీయ పోలీసులను ఎదురుదెబ్బ తీసే కళలో — అనుభవ హీనుడూ, చాతుర్య రహితుడూ అయిన వ్యక్తి పనికి మాలిన ఔత్సాహికుడే తప్ప విప్లవకారుడు కాడు!

నేను నిర్మొగమాటంగా చేసిన యీ వ్యాఖ్యలకు క్రియాశీల కార్యకర్తలెవరూ కోపం తెచ్చుకోకూడదు. ఎందుకంటే, శిక్షణ లోపం విషయంలో ప్రథమంగానూ, ప్రధానంగానూ యీ వ్యాఖ్యలను నాకు నేనే ఆపాదించుకుంటున్నాను. నేనో అధ్యయన బృందంలో[186] పని చేస్తూండేవాడిని. ఆ బృందం చాలా విస్తృతమూ, సర్వతోముఖమూ అయిన కర్తవ్యాలను తన ముందు పెట్టుకుంది. ఆ బృందంలో సభ్యులమైన మేమందరం, ఒకానొక సుప్రసిద్ధ సూక్తిని మార్చి, ''మాకొక విప్లవకారుల సంఘాన్ని యివ్వండి, మేము రష్యాని తలకిందులు చేసేస్తాం!'' అన గలిగిన ఒకానొక చారిత్రక క్షణంలో, అనిపుణుల మాదిరిగా వ్యవహరిస్తున్నామన్న గుర్తింపుతో, ఘోరమైన మానసిక క్షోభకి గురయ్యాం. నేను అప్పట్లో అనుభ

వించిన సిగ్గు నన్నెంత దహించివేసిందో నేను ఎంత ఎక్కువగా గుర్తుచేసుకుంటే, యీనాటి కుహనా సోషల్ డెమొక్రట్లపట్ల నా కోపం అంత ఎక్కువగా పెరుగుతోంది. వీళ్ల బోధనలు "వృత్తి విప్లవకారులకు అవమానం తెచ్చిపెడుతున్నాయి." మన కర్తవ్యం విప్లవకారుణ్ణి అనిపుణుడి స్థాయికి దిగజార్చడాన్ని సమర్థించడం కాదనీ, అనిపుణులను పైకి లేవదీసి విప్లవకారుల స్థాయికి చేర్చడమేననీ వీళ్లు అర్థంచేసుకోరు.

## ఈ) సంఘటన కృషి పరిధి

బి–వ్ "కార్యాచరణకు యోగ్యమైన విప్లవ శక్తుల సాధారణ కొరత"ని గురించి చెప్తూ, "యీ కొరత ఒక్క పీటర్స్‌బుర్గ్‌లోనే కాకుండా, రష్యా అంతటా కనిపిస్తోంది" అంటున్నాడు. ఇది వాస్తవం కాదని అనేవాడు దాదాపు ఎవ్వడూ ఉండడు. అయితే, యీ వాస్తవానికి కారణం ఏమిటన్నదే యిక్కడ సమస్య. బి–వ్ యిలా రాస్తాడు:

> "ఈ విషయానికి సంబంధించిన చారిత్రక కారణాలను వివరించేందుకు మేమిక్కడ పూనుకోము. మేమిక్కడ యీ కింది విషయం మాత్రమే చెప్తాము: దీర్ఘకాలంపాటు రాజకీయ అభివృద్ధి నిరోధకతత్వంచేత నిర్వీర్యమై, పాత, కొత్త ఆర్థిక మార్పుల కారణంగా ఛిన్నాభిన్నం చెయ్యబడిన సమాజం, తన సభ్యుల్లోంచే విప్లవ కార్యాచరణకు యోగ్యమైన చాలా కొద్దిమంది వ్యక్తులను ఉత్పన్నం చేస్తుంది. నిషిద్ధ సంఘాల శ్రేణులను కొంతవరకు నింపే విప్లవ కార్యకర్తలను కార్మికవర్గం ఉత్పన్నంచేస్తుంది, కాని అలాంటి విప్లవకారుల సంఖ్య ప్రస్తుతావసరాలకు సరిపోదు. దీనికి యింకో కారణం కూడా ఏమిటంటే, రోజులో పదకొండున్నర గంటలు ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు ప్రధానంగా ఆందోళనకారుడి కర్తవ్యాలను మాత్రమే నిర్వర్తించగలుగుతాడే గాని, ప్రచారం, నిర్మాణం, నిషిద్ధ సాహిత్యపు పంపిణీ, పునర్ముద్రణ, కరపత్రాల విడుదల మొదలైన విధులు ప్రధానంగా మేధావుల అతి చిన్న బలగపు భుజాలపైననే పడతాయి" ("రబోచెయె దేలొ," సంచిక 6, పేజీలు 38–39).

బి–వ్‌తో మనం చాలా అంశాలమీద, ప్రత్యేకించి పైన వక్కాణించిన అంశాలమీద విభేదిస్తున్నాం. ఈ అంశాలపై మన అనిపుణతతో (ఆలోచనాపరుడైన ప్రతి కార్యకర్త మాదిరిగానే) విసిగిపోయినప్పటికీ, యీ దుర్భర పరిస్థితినుంచి బయటపడే మార్గాన్ని బి–వ్ సూచించలేకపోయాడు. ఆర్థికవాదం ఆయనమీద సవారీ చేస్తూండటమే యిందుకు

కారణం. వాస్తవం ఏమిటంటే, ''పని''కి యోగ్యులైన కార్యకర్తలను చాలా ఎక్కువమంది నే సమాజం ఉత్పన్నంచేస్తుంది, కాని, వాళ్లనందర్నీ మనం వినియోగించుకోలేకపోతున్నాం. ఈ దృష్ట్యా, మన ఉద్యమపు క్లిష్టమూ, పరివర్తనాత్మకమూ అయిన స్థితిని యిలా సూత్రీకరించవచ్చు: మనుషులు దొరకడం లేదు — కాని, బోలెడుమంది మనుషులు ఉన్నారు. కార్మికవర్గమూ, అంతకంతకు ఎక్కువగా సమాజంలోని వివిధ విభాగాలూ, ఏటేటా, తమ మధ్యనుంచి అంతకంతకు అధిక సంఖ్యలో అసంతృప్త జీవులను సృష్టిస్తున్నాయి. తమ నిరసనను వెల్లడించాలని కోరుకుంటున్న యీ అసంతృప్త జీవులు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా — దాని దుర్భరత్వాన్ని మొత్తం అందరూ గుర్తించకపోయినా, జనసామాన్యంలో నానాటికీ ఎక్కువమంది యీ విషయాన్ని అంతకంతకు ఎక్కువ నిశితంగా గుర్తిస్తున్నారు — జరిగే పోరాటంలో తాము యివ్వగలిగిన తోడ్పాటునంతనీ యివ్వడానికి సిద్ధంగా ఉన్నారు; అందుకే మనకి బోలెడుమంది మనుషులున్నారు. అయితే అదే సమయంలో, మనకి మనుషులు దొరకడం లేదు. మిక్కిలి అల్ప శక్తులతోబాటు అన్ని శక్తులనూ వినియోగించుకుని, విస్తృతమూ, అదే సమయంలో ఒకే మాదిరి, సమరసమైన కార్యకలాపాలను ఏర్పాటుచెయ్యగల ప్రతిభా సామర్థ్యాలు కలిగిన నాయకుల, అందునా రాజకీయ నాయకుల కొరతే యిందుకు కారణం. ''విప్లవ సంఘాల పెరుగుదలా, అభివృద్ధీ'' కార్మికోద్యమపు పెరుగుదలకే కాకుండా— యీ విషయాన్ని బి–వ్ కూడా ఒప్పుకుంటున్నాడు — జనాభాలోని అన్ని విభాగాల్లోని సాధారణ ప్రజాస్వామికోద్యమపు పెరుగుదలకంటె కూడా వెనకబడుతున్నాయి. (ఈరోజున బహుశా బి–వ్ తన నిర్ధారణకే యీ అంశం బలాన్ని చేకూరుస్తుందని తెలుసుకుంటాడు.) ఉద్యమానికి గల సద్యోజనిత ప్రాతిపదిక విస్తృతితో పోల్చినప్పుడు విప్లవ కార్యకలాపాల పరిధి చాలా సంకుచితమైనది. ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా పోరాటం'' అన్న దౌర్భాగ్యపు సిద్ధాంతం మూలంగా అది మరీ కుంచింపచెయ్యబడింది. అయినా కూడా, యీనాడు రాజకీయ ఆందోళనకారులు మాత్రమే కాకుండా, సోషల్ డెమొక్రటిక్ ఆర్గనైజర్లు కూడా ''జనాభాలోని అన్ని వర్గాల ప్రజల మధ్యకీ వెళ్లాలి''* సోషల్ డెమొక్రట్లు తమ సంఘటన కృషికి సంబంధించిన సవాలక్ష చిన్నచిన్న పనులను విభిన్న వర్గాలకు చెందిన

---

* ఉదాహరణకు, యిటీవలి కాలంలో సైన్యంలో ప్రజాస్వామ్య భావాల అసందిగ్ధ పునరుద్ధరణ కానవస్తోంది. ఇందుకు పాక్షికంగా కార్మికులు, విద్యార్థుల వంటి ''శత్రువులతో'' మరింత తరచుగా జరుగుతున్న వీధి పోరాటాలు కారణం. మనకి తగినన్ని వనరులు సమకూడగానే, మనం తప్పనిసరిగా, సైనికుల్లోనూ, ఆఫీసర్లలోనూ ప్రచారాందోళనలపట్లా, మన పార్టీకి అనుబంధితమైన ''సైనిక సంఘాల'' ఏర్పాటుపట్లా విశేషమైన శ్రద్ధ వహించాలి.

వేర్వేరు ప్రతినిధులకు పంచడం సాధ్యమన్న విషయంలో సందేహించే చురుకైన కార్యకర్త బహుశా ఏ ఒక్కడూ ఉండడు. మన పని తీరులో వున్న అతి ముఖ్యమైన లోపాల్లో స్పెషలైజేషను లోపం ఒకటి. దీన్ని గురించి బి–వ్ తీవ్రంగా విమర్శించడం సహేతుకమైన విషయమే. మన ఉమ్మడి లక్ష్య సాధనకోసం మనం చెయ్యవలసిన పని మొత్తాన్ని ఎంత చిన్నచిన్న "భాగాల" కింద మనం విడగొట్టగలుగుతామో, వాటిని పూర్తిచెయ్య గలిగిన వారు అంత ఎక్కువమంది మనకి దొరుకుతారు (వీరిలో అత్యధిక సంఖ్యాకులు వృత్తి విప్లవకారులు ఎంతమాత్రం కాలేరు), కాగా యీ "చిన్నచిన్న పనులు చేసే కార్యకర్తలు" అందర్నీ పట్టుకోవడం పోలీసులకి అంత కష్టతరం అవుతుంది, అప్పుడిక ఏ చిన్న విషయానికో చేసిన అరెస్టుని ఆధారంచేసుకుని "భద్రత" పేరిట తను పెట్టే ఖర్చు సహేతుకమైనదే నని నిరూపించుకోగలంతటి "కేసు"ను బనాయించడం పోలీసువాళ్లకి కష్టతరమైపోతుంది. మనకి సహాయంచేసేందుకు సిద్ధపడేవాళ్లు ఎంతమంది ఉంటారన్న విషయంలో సుమారు గత అయిదేళ్ల కాలంలో బ్రహ్మాండమైన మార్పు వచ్చిన విషయాన్ని వెనకటి ప్రకరణంలో నేను పేర్కొన్నాను. అయితే రెండో వంక, యీ అన్ని చిన్నచిన్న పనులనూ ఏకత్రితం చేసేందుకూ, ఉద్యమ విధులను విడదియ్యడంతోబాటు ఉద్యమాన్నే విచ్ఛిన్నం చెయ్యకుండా ఉండేందుకూ, యీ చిన్నచిన్న పనులను నిర్వహించేవారిలో తమ పని అవసరమైనదీ, ముఖ్యమైనదీ అన్న విశ్వాసాన్ని – యీ విశ్వాసం లేనిదే వాళ్లు పనిని ఎన్నడూ చెయ్యరు* – కల్పిం

---

* ఒక ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ని గురించి ఓసారి ఒక కామ్రేడ్ చెప్పిన విషయం నాకిప్పుడు గుర్తుకొస్తోంది. ఆ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు సోషల్ డెమోక్రట్లకు సహాయంచెయ్యాలని అనుకుంటూండేవాడు, చేశాడు కూడా. కాని, తను అందజేసిన "సమాచారం" సరైన విప్లవ కేంద్రానికి అందిందో లేదో, దాని అవసరం నిజంగా ఏ మేరకు ఉందో, తను చేసే ఉడుతాభక్తి సేవలను వినియోగించుకోగల అవకాశాలు ఏం ఉన్నాయో తనకు తెలియడంలేదని బాధగా ఫిర్యాదు చేశాడు. మన అనిపుణత కారణంగా మనం ఎంతమంది సహచరులను దూరం చేసుకున్నామో తెలియజేసే యిలాంటివే అనేక యితర సందర్భాలను ప్రతి కార్యకర్తా ఏకరువు పెట్టగలడనడంలో సందేహం లేదు. విడి విడిగా "చిన్నవే" అయినా, మొత్తంగా తీసుకున్నప్పుడు అమూల్యమైనవైన యీ సేవలను ఒక్క ఫ్యాక్టరీల్లోనే కాకుండా పోస్టల్ శాఖలోనూ, రైల్వేలలో, కస్టమ్స్ విభాగంలో, ప్రభువర్గంలో, మతగురువుల్లో, పోలీసులు, కోర్టులతోబాటు(!) ప్రతి ఒక్క యితర జీవిత రంగంలోనూ కార్యాలయోద్యోగులూ, ఆఫీసర్లూ మనకి చెయ్యగలరు, చేస్తారు. మనకి అసలైన పార్టీయే వుంటే, విప్లవకారుల అసలైన సమరశీల సంఘమే వుంటే యీ "సహాయకుల" మీద అనవసరమైన భారాన్ని మోపివుండేవాళ్లం కాము, వాళ్లని అన్నప్పుడూ, ప్రతిసారీ మన "నిషిద్ధ నిర్మాణం" మధ్యకి

చేందుకూ కాకలు తీరిన విప్లవకారులతో కూడిన ఓ గట్టి సంఘం అవసరం. అటువంటి సంఘం ఎంత ఎక్కువ రహస్యమైనదైతే, పార్టీ పైన జనానికి విశ్వాసం అంత దృఢతరంగా, అంత విస్తారంగా ఉంటుంది. మనకి తెలిసిన విషయమే, యుద్ధకాలంలో, తన బలాన్ని గురించి సొంత సైన్యానికి విశ్వాసాన్ని కల్పించడమే కాకుండా, శత్రువులకీ, తటస్థులు అందరికీ కూడా యీ బలాన్ని గురించి నమ్మకం కలిగించడం చాలా ముఖ్యం; ఎందుకంటే, మైత్రీపూర్వకమైన తాటస్థ్యం కూడా ఒక్కొక్కసారి నిర్ణాయకమైనదిగా వుండవచ్చు. సుస్థిరమైన సైద్ధాంతిక పునాదినీ, సోషల్ డెమొక్రటిక్ పత్రికనీ కలిగిన అలాంటి సంఘం ఉన్నట్లయితే, దానిలోకి ఆకర్షింపబడ్డ చాలామంది "బయటివాళ్ల" మూలంగా ఉద్యమం తన దోవనుంచి పక్కకి మళ్లింపబడుతుందని భయపడేందుకు కారణమేమీ ఉండదు (అందుకు భిన్నంగా, సరిగా యిప్పుడే, అంటే అనిపుణత ప్రబలంగా ఉన్నప్పుడే, చాలామంది సోషల్ డెమొక్రట్లు "క్రెడో" వైపు మొగ్గడం, తమని తాము సోషల్ డెమొక్రట్లని అనుకుంటూ ఉండటం మనం చూస్తాం). ఒక్కముక్కలో చెప్పాలంటే, కేంద్రీకరణ అన్నది స్పెషలైజేషనుకి తప్పనిసరిగా పూర్వషరతుగా వుంటుంది, దానిని విధాయకంగా అపేక్షిస్తుంది.

స్పెషలైజేషను ఆవశ్యకతను గురించి యింత చక్కగా వర్ణించిన బి–వ్‌యే, నేను పైన ఉదహరించిన వాదపు రెండో భాగంలో, దాని ప్రాముఖ్యాన్ని నా ఉద్దేశంలో, తక్కువ అంచనా వేస్తాడు. కార్మికవర్గానికి చెందిన విప్లవకారులు తగినంత సంఖ్యలో లేరని అంటాడాయన. ఇది పూర్తిగా నిజం, ఒక "సన్నిహిత పర్యవేక్షకుడు" యీ విషయంలో యిచ్చిన "విలువైన అభిప్రాయం" సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోని ప్రస్తుత సంక్షోభానికి గల కారణాలనూ, తత్పర్యవసానంగా, దాన్ని అధిగమించేందుకు అవసరమైన సాధనాలనూ గురించిన నా అభిప్రాయాన్ని పూర్తిగా ధృవీకరిస్తున్నాయని నేను మరోసారి వక్కాణించి చెప్తున్నాను. జనసామాన్యపు సద్యోజనిత జాగృతికి మొత్తంగా విప్లవకారులు మాత్రమే కాకుండా, కార్మిక జనసామాన్యపు సద్యోజనిత జాగృతికి కార్మిక విప్లవకారులు సైతం వెనకబడుతున్నారు. "ఆచరణ" దృష్ట్యానే కాకుండా, కార్మికులపట్ల మన కర్తవ్యాల విష

---

తెచ్చేందుకు ప్రయత్నించేవాళ్లం కాము. కాని అందుకు విరుద్ధంగా, వాళ్లని మిక్కిలి జాగ్రత్తగా పోదుపుచేసుకుంటాం, ప్రత్యేకించి అలాంటి విధులను నిర్వర్తించేందుకు వ్యక్తులకు — చాలామంది విద్యార్థులు "స్వల్పకాలిక" విప్లవకారులుగా ఉండేదానికన్న ఏ అధికారిక ఉద్యోగమో చేస్తూ "సహాయకులు"గా ఉంటే పార్టీకి ఎక్కువ సేవచెయ్యగలుగుతారన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని — శిక్షణ కూడా యిస్తాం. అయితే స్థిరంగా కాలూనుకున్న సంఘం, క్రియాశీల కార్యకర్తల కొరతలేని సంఘం మాత్రమే యిటువంటి ఎత్తుగడలను అమలుజరిపే హక్కు కలిగివుంటుందన్న విషయాన్ని నేనిక్కడ మరోసారి చెప్తున్నాను.

యంలో జరిగే చర్చా క్రమంలో మనకి తరచుగా వినపబడే "బోధనశాస్త్రపు" అవక తవక స్వభావాన్నీ, రాజకీయంగా దాని అభివృద్ధి నిరోధక స్వభావాన్నీ కూడా యీ వాస్తవం నిరూపిస్తుంది. కార్మికవర్గ విప్లవకారులకు శిక్షణ నివ్వడం, పార్టీ కార్యకలాపాలకు సంబంధించినంతవరకు, వారిని మేధావులలోంచి వచ్చిన విప్లవకారులతో సమాన స్థాయికి తీసుకు రావడం మన ప్రప్రథమ, అతి ముఖ్య కర్తవ్యమని యీ వాస్తవం నిరూపిస్తోంది ("పార్టీ కార్యకలాపాలకు సంబంధించినంతవరకు" అని నేను వక్కాణించి ఎందుకు చెప్తున్నానంటే, కార్మికులను యితర విషయాల్లో కూడా మేధావులతో సమాన స్థాయికి తీసుకురావడం అవసరమే అయినప్పటికీ, అది అంత తేలికగాని, అంత తక్షణావసరం గాని కాదు గనుక). అందుచేత, కార్మికులను విప్లవకారుల స్థాయికి పెంచడంపట్ల ప్రధానంగా మనం శ్రద్ధ వహించాలి. ఆర్థికవాదులు కోరుతున్నట్లు "కార్మిక జనసామాన్యపు" స్థాయికి గాని, "స్వొబోద" కోరుతున్నట్లు "సగటు కార్మికుడి" స్థాయికి గాని (యిలా చెప్పడం ద్వారా ద్వితీయ శ్రేణి "బోధనశాస్త్రానికి" అది ఎగబాకుతోంది) దిగజారడం మన కర్తవ్యం ఎంతమాత్రం కాదు. కార్మికులకు సులభగ్రాహ్యమైన సాహిత్యం, ప్రత్యేకంగా వెనకబడ్డ కార్మికులకు ప్రత్యేకించి సులభగ్రాహ్యమైన (అంతేగాని, అపభ్రంశమైనది ఎంతమాత్రం కాదు) సాహిత్యం అవసరమన్న విషయాన్ని నేనెంత మాత్రమూ కాదనను. కాని, అదే పనిగా బోధన శాస్త్రాన్ని యిలా రాజకీయ, నిర్మాణపర సమస్యలతో గజిబిజి చెయ్యడమే నాకు మంట కలిగిస్తోంది. అయ్యా, మహాశయులారా, "సగటు కార్మికుల"పట్ల యింత ఆదుర్దా చూపుతున్న మీరు, ఆచరణలో, కార్మికవర్గ రాజకీయాలను గురించీ, కార్మిక సంఘాలను గురించీ కార్మికులతో చర్చించేటప్పుడు, వాళ్ల స్థాయికి దిగి మాట్లాడాలన్న మీ నిర్ణయం ద్వారా వాళ్లని మీరు అవమానపరస్తున్నారు. గంభీరమైన విషయాలను గురించి గంభీరమైన పద్ధతిలోనే మాట్లాడండి; బోధనశాస్త్రాన్ని బోధనశాస్త్రజ్ఞులకే వదలండి గాని, రాజకీయ వేత్తలకూ, ఆర్గనైజర్లకూ వదలకండి! మేధావివర్గంలో సైతం ఉన్నతులూ, "సగటు మనుషులూ," "సామాన్యులూ" లేరూ? సులభగ్రాహ్యమైన సాహిత్యం మేధావివర్గానికి కూడా కావాలని అందరూ ఒప్పుకోవడం లేదూ? అలాంటి సాహిత్యం రాయబడటం లేదూ? కాలేజి లేక హైస్కూలు విద్యార్థుల్ని సంఘటితం చేసే విషయంపై ఒకరు ఒక వ్యాసం రాశారని అనుకోండి. ఆయనగారు అందులో తనేదో కొత్త విషయం కనిపెట్టినట్లు, మొట్టమొదట మనం "సగటు విద్యార్థుల" సంఘాన్ని నిర్మించాలని పదే పదే చెప్పాడనుకోండి. అలాంటి వ్యాసాన్ని ఎవరైనా రాసినట్లయితే ఆయన్ని నలుగురూ ఎగతాళి పట్టిస్తారు, మరి అది సబబే కదా. అయ్యా, నిర్మాణాన్ని గురించి మీకేమైనా అభిప్రాయాలుంటే, భేషుగ్గా చెప్పండి, అయితే ఎవరు "సగటు స్థాయికి" చెందినవారు, వారికి పై స్థాయిలో ఉన్నవారు ఎవరు, కింది స్థాయిలో ఉన్నవారెవరన్న విషయాన్ని స్వయంగా మేమే నిర్ణయించుకుంటాం, అని

ఆయన గారికి జవాబు చెప్తారు. కాని, నిర్మాణానికి సంబంధించి మీ సొంత అభిప్రాయా లంటూ ఏమీ లేకపోతే, ''సామాన్యులు,'' ''సగటు మనుషులు'' అంటూ మీరు చేసే తర్కం విసుగే కలిగిస్తుంది. ''రాజకీయాలకూ,'' ''నిర్మాణానికీ'' సంబంధించిన యీ సమస్యలు స్వతహాగా చాలా గంభీరమైన విషయాలు, కాగా వాటిని గురించి గంభీరంగా తప్ప ఆలో చించేందుకు వీల్లేదు. మనం కార్మికులకీ (విశ్వవిద్యాలయ విద్యార్థులకీ, హైస్కూలు విద్యా ర్థులకీ) శిక్షణనిచ్చి, యీ సమస్యలను వారితో చర్చించ గలిగేటంత స్థాయికి వారిని తీసుకు రాగలం, తీసుకురావాలి. కాని తమరు యీ సమస్యలను ఒకసారి ముందుకు తెచ్చినప్పుడు, వీటికి అసలైన సమాధానాలను యివ్వాల్సివుంటుంది ''సగటు మనుషులు'' లేక ''సామా న్యులు'' అంటూ కప్పదాట్లు వెయ్యకండి. తమాషా కబుర్లూ, కాకరకాయలూ చెప్పి సమ స్యని కొట్టిపారేసేందుకు ప్రయత్నించకండి.*

తన లక్ష్య సాధనకోసం పూర్తిగా సన్నద్ధుడయ్యేందుకుగాను, కార్మిక విప్లవకారుడు కూడా వృత్తి విప్లవకారుడు కావలసివుంటుంది. అందుకే, కార్మికుడు ఫ్యాక్టరీలో పదకొం డున్నర గంటలు గడుపుతాడు కనుక (ఆందోళనని మినహాయించి) తదితర అన్ని విప్లవ కార్యకలాపాల భారమూ ''విధిగానూ, తప్పనిసరిగానూ, అతి కొద్దిమంది మేధావుల భుజ స్కంధాలపైన ప్రధానంగా పడాల్సివుంటుంది'' అని బి–వ్ అనడం సరైనది కాదు. అయితే యిలా జరగడం అన్నది ''తప్పనిసరి'' కాదు. మనం వెనకబడి వున్నాం కనుక యిలా జరుగుతుంది. సమర్థుడైన ప్రతి కార్మికుడూ వృత్తి ఆందోళనకారుడూ, ఆర్గనైజరూ, ప్రచారకుడూ, సాహిత్య పంపిణీదారుడూ వగైరా, వగైరా అయ్యేందుకు తోడ్పడటం మన విధి అన్న సంగతిని మనం గుర్తించడం లేదు గనుక యిలా జరుగుతుంది. ఈ విషయంలో, మనం మన శక్తులను పరమ సిగ్గుమాలిన పద్ధతిలో వ్యర్థంచేస్తున్నాం. ప్రత్యేక శ్రద్ధతో

---

* ''స్వొబోద'' సంచిక 1, పేజి 66, ''సంఘం'' అన్న వ్యాసంలో: ''కార్మిక సైన్య పద ఘట్టనలు రష్యన్ శ్రామికుల తరఫున ముందుకు తేబడే డిమాండ్లన్నింటికీ బలాన్ని చేకూరుస్తాయి'' – అయితే యిక్కడ శ్రామికులు అన్న మాటను పెద్ద అక్షరాలతో అచ్చు వేసిన సంగతిని మరిచిపోకూడదు సుమాండి. ఆ రచయిత యింకా యిలా అంటున్నాడు: ''నేను మేధావులకు ఎంతమాత్రం ప్రతికూలుణ్ణి కాను, కాని (యీ 'కాని'కి శ్చెద్రీన్ యిలా భాష్యం చెప్పాడు: చెవులు ఎన్నడూ నుదుటిని మించి పైకి ఎదగలేవు!) – ఎవరైనా నా దగ్గరకు వచ్చి, అందమైన, ఆకర్షణీయమైన మాటల్ని వల్లించి, వాటిని వాటి (తన?) అందం చూసీ, తదితర గుణగణాలను చూసీ ఆమోదించమని డిమాండుచేస్తే నాకు మటుకు ఎప్పుడూ మహ మంట పుట్టుకొస్తుంది'' (పేజి 62). ఔను, నాకు కూడా ''ఎప్పుడూ మహ మంట పుట్టుకొస్తుంది.''

పెంచి పోషించవలసినదాన్ని పొదుపుగా వాడుకునే సామర్థ్యం మనలో కొరవడింది. జర్మన్లని చూడండి: వాళ్లకి మనకంటె శతాధిక శక్తులూ బలగాలూ ఉన్నాయి. కాని, నిజంగా సమర్థులైన ఆందోళనకారులు వగైరాలు ''సగటు మనుషుల'' నుంచి తరుచుగా తయారుకారన్న సంగతి వాళ్లకి చాలా బాగా తెలుసు. ఈ కారణంగానే వాళ్లు సమర్థుడైన ప్రతి కార్మికుడినీ, అతను అభివృద్ధి చెంది, తన శక్తి సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకోగల పరిస్థితుల్లో పెట్టేందుకు వెంటనే ప్రయత్నిస్తారు: అతన్ని వృత్తి ఆందోళనకారుణ్ణి చేస్తారు, అతను తన కార్య రంగాన్ని విస్తరించుకునేలా, దాన్ని ఒక ఫ్యాక్టరీనుంచి మొత్తం పరిశ్రమ కంతటికీ, ఒక ప్రాంతంనుంచి దేశమంతటికీ వ్యాపింపజేసేలా అతన్ని ప్రోత్సహిస్తారు. అతను తన వృత్తిలో అనుభవాన్నీ, నేర్పునూ సంతరించుకుంటాడు. అతను తన దృక్పథాన్ని విస్తరింపజేసుకుని, తన జ్ఞానాన్ని పెంపొందించుకుంటాడు. అతను యితర ప్రాంతాలకూ, యితర పార్టీలకూ చెందిన ప్రముఖ రాజకీయ నాయకులను సన్నిహితంగా పరిశీలిస్తాడు. అతను వాళ్ల స్థాయికి యెదిగేందుకోసం, తనలో శ్రామికవర్గ వాతావరణాన్నీ సోషలిస్టు విశ్వాసాల నూతనత్వాన్నీ వృత్తి నైపుణ్యంతో మిళితం చేసుకోవడంకోసం కృషి చేస్తాడు. ఈ వృత్తి నైపుణ్యం లేకపోయినట్లయితే శ్రామికవర్గం అద్భుతంగా శిక్షణ పొందిన తన శత్రువుమీద పట్టుసడలని పోరాటాన్ని చెయ్యలేదు. ఈవిధంగా మాత్రమే కార్మిక జన సామాన్యం బేబెల్, ఔవర్ వంటివాళ్లను సృష్టిస్తారు. కాని రాజకీయ స్వాతంత్ర్యం కలిగిన దేశంలో ఎక్కువ మేరకు తనకు తానుగా జరిగిపోయేదాన్ని రష్యాలో మన సంఘాలు బాగా ఆలోచించి, క్రమబద్ధంగా చెయ్యాల్సివుంటుంది. ఏమాత్రం ప్రతిభా, ''ముందుకురాగల గుణం'' కార్మిక ఆందోళనాకారుడిలో ఉన్నా, అతను ఫ్యాక్టరీలో రోజుకి పదకొండు గంటలు పనిచేయ కూడదు. అతన్ని పార్టీయే పోషించేలా, అతను సకాలంలో రహస్య జీవితంలోకి వెళ్లేలా, అతను తన కార్య క్షేత్రాన్ని మార్చుకునేలా మనం ఏర్పాట్లు చెయ్యాలి. అలా చేసినప్పుడే అతను తన దృక్పథాన్ని విస్తృతం చేసుకుని, రాజకీయ పోలీసులతో జరిగే పోరాటంలో కనీసం కొద్ది సంవత్సరాల పాటైనా నిలబడగలుగుతాడు. కార్మిక జనసామాన్యపు ఉద్యమం సద్యోజనితంగా మరింత విస్తృతమూ, ప్రగాఢమూ అయ్యేకొద్దీ, కార్మిక జన సామాన్యం తమలోంచి అధికాధిక సంఖ్యలో ప్రతిభావంతులైన ఆందోళనాకారులనే కాకుండా, ప్రతిభావంతులైన ఆర్గనైజర్లను, ప్రచారకులను, మంచి ''కార్యకర్తలను'' సృష్టిస్తారు — ''కార్యకర్తలు'' అన్న పదాన్ని నేనిక్కడ చాలా మంచి అర్థంలో వాడుతున్నాను (మన మేధావుల్లో యీ కర్యకర్తలు చాలా తక్కువమంది ఉన్నారు, వాళ్లలో ఎక్కువభాగానికి, రష్యన్ పద్ధతిలో తమ అలవాట్ల విషయంలో ఒక రకమైన అజాగ్రత్త, అలసత్వం వుంటాయి). మన దగ్గర ఎప్పుడైతే విస్తారమైన సన్నాహాలు చేసుకుని, ప్రత్యేక శిక్షణ పొందిన కార్మిక విప్లవకారులు (అన్ని రకాల ''అస్త్రధారులైన'' విప్లవకారులూ నిస్సందేహంగా వీరిలో

ఉంటారు) ఉంటారో, అప్పుడిక ప్రపంచంలోని ఏ రాజకీయ పోలీసులూ వాళ్లతో పోటీపడి తట్టుకోలేరు. ఎందుకంటే, విప్లవంపట్ల అచంచల విశ్వాసం కలిగిన యీ వ్యక్తులకు కార్మికుల్లోని అత్యధిక భాగపు అపారమైన విశ్వాసం లభిస్తుంది. ఈ పంథాని – కార్మికులకూ, "మేధావులకూ" ఉమ్మడిదైన యీ పంథాని – వృత్తి విప్లవకారుల శిక్షణ పంథాయే అది – చేబట్టేలా కార్మికులను "ప్రోత్సహించేందుకు" అతి తక్కువగా కృషిచేసినందుకూ, కార్మిక జనసామాన్యానికీ, "సగటు కార్మికులు" వగైరాలకూ, "అందుబాటులో ఉండే దాన్ని" గురించీ అతి తరచుగా వాళ్లని మన మూర్ఖ ప్రసంగాలతో దిగదీసినందుకూ నేరుగా మనదే "దోషం."

ఇతర సందర్భాల్లో మాదిరిగానే యీ సందర్భంలో కూడా, నిర్మాణ రంగంలో మన కృషియొక్క పరిమిత విస్తృతికి నిస్సందేహమైన కారణం ఒకటుంది ("ఆర్థికవాదుల్లోని" అత్యధిక సంఖ్యాకులూ, ప్రత్యక్ష కార్యకలాపాల్లోకి కొత్తగా వచ్చినవాళ్లూ యీ విషయాన్ని గుర్తించకపోయినా), అదేమిటంటే, మనం మన సిద్ధాంతాలనీ, మన ప్రత్యక్ష రాజకీయ కర్తవ్యాలనీ పరిమితం చేసుకుంటున్నాం. సద్యోజనితత్వానికి దాసోహం అనడం, జనసామాన్యానికి "అందుబాటులో ఉండే" దానికి ఒక్క అడుగైనా పక్కకి వైదొలగే విషయంలో భయాన్ని రేకెత్తించినట్లు కనిపిస్తుంది. జనసామాన్యపు తక్షణ, ప్రత్యక్ష అవసరాలను తీర్చడంతోనే కేవలం సరిపెట్టుకోక మరీ ఎక్కడ పైకెళ్లిపోతామో అన్న భయంలా యిది కనిపిస్తుంది. మహాశయులారా, భయపడకండి! నిర్మాణం విషయంలో మనం ఎంత తక్కువ స్థాయిలో ఉన్నామంటే, మనం మరీ ఎత్తుకి ఎగిరిపోగలమేమో అన్న వూహే అసంబద్ధమైనది!

## ఉ) "కుట్రదారీ" సంఘం, "ప్రజాస్వామ్యతత్వం"

కానైతే, "జీవితవాణి" అంటే బెదిరిపోయేవాళ్లు మనలో చాలామంది వున్నారు. అదంటే వాళ్లు ప్రపంచంలో మరి దేనికన్న ఎక్కువ భయపడతారు. పైన నేను వివరించిన అభిప్రాయాలను అనుసరించేవాళ్లు "నరోద్నయ వోల్య" పంథాను అనుసరిస్తున్నారనీ, "ప్రజాస్వామ్యతత్వం" అర్థంచేసుకోవడం లేదనీ వగైరా ఆరోపణలు చేస్తున్నారు వాళ్లు. "రబోచెయె దేలొ" కూడా వల్లిస్తున్న యీ ఆరోపణలను గురించి యిక్కడ చర్చించడం అవసరం.

ఈ వాక్యాల రచయితకు పీటర్స్‌బుర్గ్ ఆర్థికవాదులు "రబోచయ గజేత" పైన "నరోద్నయ వోల్య" ధోరణులను అనుసరిస్తోందన్న ఆరోపణ చేశారన్న విషయం బాగా తెలుసు. ("రబోచయ గజేత"ను ఎవరైనా "రబోచయ మీస్ల్"తో పోల్చి చూస్తే యీ విష

యం చక్కగా అర్థమవుతుంది.) అందుకనే, ''ఇస్క్రా'' వెలువడిన కొద్దికాలానికే, ఫలానా పట్టణానికి చెందిన సోషల్ డెమోక్రట్లు ''ఇస్క్రా''ని ''నరోద్నయ వోల్య'' వాద పత్రిక అని పిలుస్తున్నట్లు ఓ కామ్రేడ్ చెప్పినప్పుడు, మాకెంతమాత్రమూ ఆశ్చర్యం కలగ లేదు. అంతేకాదు, యీ ఆరోపణని మేమొక ప్రశంసగా కూడా పరిగణించాం. ఎందుకంటే, ఆర్థికవాదులు ఏ మంచి సోషల్ డెమోక్రట్‌పై ''నరోద్నయ వోల్య'' సానుభూతిపరుడంటూ ఆరోపణ చెయ్యకుండా వదిలారు?

ఈ ఆరోపణలు రెండు దురభిప్రాయాల మూలంగా వస్తున్నాయి. మొదటిది, విప్లవోద్యమ చరిత్రను గురించిన పరిజ్ఞానం జనంలో బాగా తక్కువ. అందుకనే, జారిజానికి వ్యతిరేకంగా కృతనిశ్చిత పోరాటాన్ని ప్రకటించే ఏ సమరశీల కేంద్రీకృత సంఘానికైనా కూడా ''నరోద్నయ వోల్య'' అనే పేరే పెడుతూ వుంటారు. 1870 దశకంలో పనిచేసిన విప్లవకారుల మహత్తర సంఘాన్ని – దాన్నే మనం నమూనాగా తీసుకోవలసి వుంటుంది – స్థాపించినది దరిమిలా ''చోర్నీ పెరెదేల్''గానూ, ''నరోద్నయ వోల్య''గానూ చీలిపోయిన ''జెమ్ల్యా యి వోల్య''[187]గాని ''నరోద్నయ వోల్య'' కాదు. అందుకనే, ఏ సమరశీల విప్లవ సంఘాన్నైనా అదేదో ప్రత్యేకించి ''నరోద్నయ వోల్య'' స్వభావాన్ని కలిగివుందని అనడం చారిత్రకంగానూ, తార్కికంగానూ కూడా అసంబద్ధమే. ఏ విప్లవ ధోరణికీ కూడా, అది పోరాటాన్ని గురించి తీవ్రంగా ఆలోచించే మాటైతే, అటువంటి సంఘం లేకుండా సాగదు. ''నరోద్నయ వోల్య'' చేసిన పొరపాటు, అసంతృప్తులు అందర్నీ తన సంఘంలో చేర్చుకునేందుకు ప్రయత్నించడమూ, యీ సంఘాన్ని నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటం కోసం నడపడమూ కాదు; పైగా, యిదే దాని మహత్తర చారిత్రక సేవ. అది చేసిన పొరపాటు ఏమిటంటే, సారాంశంలో ఎంతమాత్రమూ విప్లవాత్మకమైనది కాని సిద్ధాంతంమీద ఆధారపడటం. వర్ధమాన పెట్టుబడిదారీ సమాజంలోని వర్గపోరాటంతో తమ ఉద్యమాన్ని అభేద్యంగా జోడించడం ఎలాగో ''నరోద్నయ వోల్య'' సభ్యులకు తెలియకపోయైనా ఉండాలి, లేక అది వారికి చేతకాకపోయైనా ఉండాలి. మార్క్సిజాన్ని అర్థంచేసుకోవడంలో ఘోర వైఫల్యం (లేక ''స్త్రూవెయిజం'' ధోరణిలో దాన్ని ''అర్థం చేసుకోవడం'') మాత్రమే సామూహిక, సద్యోజనిత కార్మికోద్యమ వెల్లువ, ''జెమ్ల్యా యి వోల్య'' వంటి మంచి విప్లవకారుల సంఘాన్ని, లేక సాటిలేనంత మంచిదాన్ని రూపొందించవలసిన అవసరాన్నుంచి మనని తప్పిస్తుందన్న అభిప్రాయాన్ని కలిగించగలదు. అందుకు భిన్నంగా, యీ ఉద్యమం, యీ కర్తవ్య పాలననే మనమీద విధిస్తోంది. ఎందుకంటే, సద్యోజనిత శ్రామికవర్గ పోరాటాన్ని విప్లవకారుల సుదృఢ సంఘం నడిపిననాడు గాని, యీ పోరాటం అసలైన ''వర్గపోరాటం'' కాజాలదు.

రెండవ సంగతి ఏమిటంటే, చాలామంది – వీరిలో బి. క్రిచేవ్‌స్కీ కూడా ఉన్నాడ

నడం స్పష్టం ("రబోచెయె దేలొ," సంచిక 10, పేజి 18), రాజకీయ పోరాటానికి సంబంధించిన "కుట్రదారీ" దృక్పథానికి వ్యతిరేకంగా సోషల్ డెమోక్రట్లు నిరంతరాయంగా జరుపుతూ వచ్చిన వాగ్వివాదాలను తప్పుగా అర్థంచేసుకుంటున్నారు. రాజకీయ పోరాటాన్ని కుట్రకి పరిమితం చెయ్యడాన్ని మేమెప్పుడూ వ్యతిరేకిస్తూ వచ్చాం, యిక ముందు కూడా వ్యతిరేకిస్తూనే వుంటాం.* అయితే దీని అర్థం, సుదృఢమైన విప్లవ సంఘ ఆవశ్యకతను మేము తిరస్కరిస్తున్నామని కాదనడం స్పష్టం. ఉదాహరణకు, యింతకు ముందరి అధస్సూచికలో పేర్కొనబడిన చిన్న పుస్తకంలో, రాజకీయ పోరాటాన్ని కుట్రకి పరిమితం చెయ్యడానికి వ్యతిరేకంగా జరిపిన చర్చానంతరం, "నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చావుదెబ్బ కొట్టేందుకుగాను," "తిరుగుబాటుకీ," తదితర ప్రతి "దాడి రూపానికీ" "పూనుకోగలంతటి" బలమైన ఒక సంఘం గురించి (సోషల్ డెమోక్రట్లకు ఒక ఆదర్శంగా) వర్ణన యివ్వబడింది.** నిరంకుశ రాజరిక ప్రభుత్వంకింద ఉన్న దేశంలో, రూపం రీత్యా అలాంటి బలమైన విప్లవ సంఘాన్ని "కుట్రదారీ" సంఘమని కూడా వర్ణించవచ్చు. ఎందుకంటే "conspiration" అన్న ఫ్రెంచి మాట, రష్యన్ "జగొవోర్" ("కుట్ర") అన్న మాటకి సమానార్థకమైనది. కాగా అలాంటి సంఘపు విషయాలను అతి రహస్యంగా ఉంచడం అవసరం. ఈ మాదిరి సంఘానికి రహస్య వర్తనం చాలా అవసరమైన షరతు. తదితర

---

* చూ: "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు," పేజి 21, పి. ఎల్. లావ్రొవ్‌కి వ్యతిరేకంగా వాదనలు.

** "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు," పేజి 23. ఈ సందర్భంలో యిక్కడ నేను మరొక ఉదాహరణ యిస్తున్నాను. "రబోచెయె దేలొ"కి తను చెప్తున్నదేమిటో అర్థంకాకనైనా పోవాలి, లేకపోతే "గాలివాటుగా" అది తన అభిప్రాయాలను మార్చుకొంటూనైనా ఉండాలి. "రబోచెయె దేలొ" మొదటి సంచికలో, యీ కింది వాక్యం మనకి వక్కాణింపుతో కనిపిస్తుంది: "చిన్న పుస్తకంలోని సారాంశం 'రబోచెయె దేలొ' సంపాదకీయంలో యివ్వబడిన కార్యక్రమంతో పూర్తిగా సారూప్యం ఉంది" (పేజి 142). ఇది నిజమేనా? జనసామాన్యపు ఉద్యమానికి నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యడాన్ని ప్రథమ కర్తవ్యంగా ఉంచరాదన్న అభిప్రాయం, "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు"లో వ్యక్తంచెయ్యబడిన అభిప్రాయాలతో సారూప్యం ఉందా? "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" అన్న సిద్ధాంతమూ, దశల సిద్ధాంతమూ ఆ చిన్న పుస్తకంలో వ్యక్తంచెయ్యబడిన అభిప్రాయాలతో సారూప్యం కలిగి ఉన్నాయా? "అభిప్రాయాల సారూప్యతను" యీ విశిష్ట పద్ధతిలో అర్థంచేసుకునే పత్రికకు సుదృఢ సూత్రాలంటూ ఏమైనా ఉండగలవేమో తేల్చుకోవలసిందిగా పాఠకుల నిర్ణయానికే వదిలేస్తున్నాను.

షరతులన్నింటినీ (సభ్యుల సంఖ్య, వాళ్ల ఎంపిక, విధులు వగైరాలను) దానికి అనుగుణంగా మలచవలసివుంటుంది. అందుచేత, సోషల్ డెమోక్రట్లమైన మనం, కుట్రదారీ సంఘాన్ని నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నామన్న ఆరోపణను గురించి భయపడటం శుద్ధ అమాయకత్వమే అవుతుంది. ''నరోద్నయ వోల్య'' పంథాని అనుసరిస్తున్నారన్న ఆరోపణ మాదిరిగానే, యీ అరోపణ కూడా ఆర్థికవాద వ్యతిరేకులందరికీ గర్వకారణమైనదే కావాలి.

అన్ని రహస్య కార్యకలాపాల దారాలనూ తన చేతుల్లో కేంద్రీకరించుకొనే శక్తివంతమూ, పరమ రహస్యమూ అయిన అలాంటి సంఘం – అవసరార్థం కేంద్రీకరింపబడిన సంఘం – అతి తేలికగా తొందరపాటు దాడికి దూకవచ్చుననీ, రాజకీయ అసంతృప్తీ, కార్మికవర్గపు నిస్సహాయతా క్రోధాలూ మొదలైనవి యింకా తగినంతగా పెరిగి, అలాంటి దాడి సంభవమూ, అవసరమూ కాకముందే, అనాలోచితంగా ఉద్యమాన్ని ముమ్మరం చెయ్య వచ్చుననీ ఎవరైనా అభ్యంతరం చెప్పవచ్చు. దీనికి మా జవాబేమిటంటే: స్థూలంగా చూస్తే, ఒకానొక సమరశీల సంఘం అనాలోచితంగా పోరాటంలోకి దూకనూవచ్చు, యితర పరిస్థితుల్లో పూర్తిగా నివార్యమైన ఓటమికి గురికానూవచ్చు, అన్న విషయాన్ని కాదనలేమనడం స్పష్టం. కాని మనం యిలాంటి సమస్యపై ఊహాత్మక తర్కానికి పరిమితం కాలేం. ఎందుకంటే, ప్రతి పోరాటంలోనూ ఊహాత్మకంగా పరాజయ అవకాశం యిమిడే వుంటుంది. పోరాటానికి సంఘటిత సన్నాహం జరపడం ద్వారా తప్ప యీ అవకాశాన్ని తగ్గించే మార్గం లేదు. కాని, రష్యాలో యిప్పుడున్న నిర్దిష్ట పరిస్థితులను గురించిన ఆలోచనతో మొదలు పెట్టినట్లయితే, ఉద్యమానికి సుస్థిరతను చేకూర్చడానికీ, అనాలోచితమైన దాడులు చేసే సంభావ్యతనుంచి ఉద్యమాన్ని కాపాడటానికే సుదృఢమైన విప్లవ సంఘం పరమావశ్యకమన్న నిర్ణయానికి మనం రాక తప్పదు. సరిగా, అలాంటి సంఘం యింకా లేని, విప్లవోద్యమం శీఘ్రంగానూ, సద్యోజనితంగానూ పెరుగుతున్న ప్రస్తుత సమయంలో పరస్పరం బద్ధ వ్యతిరేకమైన రెండు దృక్పథాలు మనకి అప్పుడే కనిపిస్తున్నాయి (ఇవి సహజంగానే దగ్గర పడతాయని అనుకోవచ్చు). అవి ఏమిటంటే: ఒకవంక బొత్తిగా పొంతనలేని ఆర్థికవాదం, మెతకదనాన్ని బోధించడం, మరోవంక దానితో సమానంగానే పొంతనలేని ''ఉత్తేజకర హింసాకాండ'' ఉన్నాయి. ఈ హింసాకాండ ''ఉద్యమం పెంపొంది, తనని తాను పటిష్ఠం చేసుకుంటున్నప్పుడు, యీ ఉద్యమం యింకా అంతానికి కన్న ఆరంభానికే దగ్గరగా ఉన్నప్పుడు, ఉద్యమం అంతమైపోయే లక్షణాలను కృతకంగా కల్పించేందుకు ప్రయత్నిస్తోంది'' (''జర్యా'' 2–3 సంచికలు, పేజి 353లో వి. జసూలిచ్). ''రబోచెయె దేలో'' ఉదాహరణనిబట్టి, యీ రెండు అతిశాయితలకు లోనవుతున్న సోషల్ డెమోక్రట్లు యింతకు ముందే ఉన్నారని రుజువవుతోంది. ఇది ఆశ్చర్యకర విషయమేమీ కాదు. ఎందుకంటే, యితర కారణాల మాట అటుంచి, ''యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా పోరాటం''

ఎన్నడూ విప్లవకారులను సంతృప్తిపరచ లేదు. కాగా, అతిశాయితలు అక్కడక్కడ ఎప్పుడూ కనిపిస్తూనే వుంటాయి. సోషల్ డెమోక్రటిక్ విధానాన్ని నిరంతరాయంగా అమలుజరుపుతూ, అన్ని విప్లవ ఆకాంక్షలనూ, ప్రయత్నాలనూ ఒక విధంగా సంతుష్టి పరచే కేంద్రీకృత, సమరశీల సంఘం మాత్రమే అనాలోచితమైన దాడులు చెయ్యకుండా ఉద్యమాన్ని కాపాడుతుంది, విజయావకాశాలు ఉన్న దాడులకు సన్నద్ధం చెయ్యగలుగుతుంది.

నిర్మాణానికి సంబంధించి యిక్కడ వివరింపబడిన అభిప్రాయాలు "ప్రజాస్వామ్య సూత్రానికి" విరుద్ధంగా ఉన్నాయంటూ మరో అభ్యంతరాన్ని లేవదియ్యవచ్చు. అక్కడ, ఆ మొదటి ఆరోపణ ప్రత్యేకించి రష్యన్ స్వభావం కలిగిన ఆరోపణ కాగా, యిక్కడ యీ రెండో ఆరోపణ ప్రత్యేకించి విదేశీ స్వభావం కలిగిన ఆరోపణ. విదేశాల్లో ఉన్న సంఘం మాత్రమే ("దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్") తన సంపాదక వర్గానికి యీకింది ఆదేశాలను యివ్వగలిగింది:

> "నిర్మాణ సూత్రం. సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ అభివృద్ధినీ, ఐక్యతనీ విజయవంతంగా సాధించేందుకుగాను, పార్టీ నిర్మాణానికి సంబంధించిన విస్తృతమైన ప్రజాస్వామిక సూత్రాన్ని వక్కాణించి చెప్పడం, అభివృద్ధి చెయ్యడం, దానికోసం పోరాడటం అవసరం. మన పార్టీ సామాన్య సభ్యుల్లో బయటపడిన ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణుల దృష్ట్యా, యిది ప్రత్యేకించి అవసరం" ("రెండు మహాసభలు," పేజి 18).

"రబోచెయె దేలో" "ఇస్క్రా" "ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులపై" ఎలా పోరాడుతుందో మనం తర్వాతి అధ్యాయంలో చూద్దాం. ప్రస్తుతానికి యిక్కడ, ఆర్థికవాదులు ముందుకు తెచ్చిన "సూత్రాన్ని" మరింత సన్నిహితంగా పరిశీలిద్దాం. "విస్తృతమైన ప్రజాస్వామిక సూత్రం" కోసం ముందుగా యీ కింది రెండు విషయాలు అమలుజరగడం అవసరమన్న సంగతిని బహుశా ప్రతి ఒక్కడూ ఆమోదిస్తాడు: మొదటిది, ప్రతి పనీ బహిరంగంగా జరగడం, రెండోది అన్ని పదవులకీ ఎన్నికలు జరపడం. పార్టీ వ్యవహారాలను బహిరంగంగా జరపకుండా — పైగా యీ బహిరంగ వ్యవహారాలు సంఘ సభ్యులకు మాత్రమే పరిమితం కారాదు — డెమోక్రటిజాన్ని గురించి మాట్లాడటం అసందర్భమే అవుతుంది. మనం జర్మన్ సోషలిస్టు పార్టీని ప్రజాస్వామ్య సంఘం అంటాం. ఎందుకంటే, దాని కార్యకలాపాలన్నీ బహిరంగంగా సాగింపబడతాయి. ఆ పార్టీ మహాసభలు సైతం బహిరంగంగా నిర్వహింపబడతాయి. అంతేగాని, తన సభ్యులనుంచి తప్ప, మిగిలిన అందరినుంచీ

రహస్యమనే తెర ద్వారా మరుగుపరచబడే సంఘాన్ని ప్రజాస్వామిక సంఘమని ఎవరూ పిలవరు. మరి, యీ సూత్రానికి అవసరమైన ప్రధానమైన షరతునే రహస్య సంఘం అమలు జరపలేనప్పుడు, "విస్తృత ప్రజాస్వామిక సూత్రాన్ని" ముందుకు తెచ్చి ప్రయోజనం ఏమిటి? "విస్తృత సూత్రం" వినడానికైతే పటారంగానే వుంటుంది గాని, లోపల లొటారమే. ఇంతేకాదు, నిర్మాణానికి సంబంధించి సమకాలిక తక్షణ కర్తవ్యాల అవగాహన బొత్తిగా లేకపోవడాన్ని కూడా యిది చూపిస్తుంది. మన విప్లవకారుల్లో "బహుళ" సంఖ్యాకుల మధ్య రహస్య గోపనం ఎంత తక్కువగా వుందో ప్రతివాడికీ తెలుసు. ఈ విషయంలో బి-వ్ చేసిన కటువైన ఫిర్యాదులను మనం విన్నాం, "సభ్యులను ఎంపికచేసేటప్పుడు కఠినమైన పద్ధతిని అనుసరించాలి" అన్న ఆయన డిమాండు అత్యంత సముచితమైనదన్న సంగతి మనకి తెలుసు ("రబోచెయె దేలొ," సంచిక 6, పేజి 42). అయితేనేం, తమకి నిశితమైన "వాస్తవిక దృష్టి" ఉందని గప్పాలు కొట్టే పెద్దమనుషులు, యిలాంటి పరిస్థితిలో, అతి కఠిన రహస్య గోపనాన్నీ, సభ్యుల్ని ఎంపికచేసేటప్పుడు అత్యంత కఠినమైన (అందుకనే, మరింత పరిమితమైన) పద్ధతినీ అవలంబించాలని చెప్పడానికి బదులు "విస్తృత ప్రజాస్వామిక సూత్రాన్ని" అమలుజరపాలని వక్కాణించి చెప్తున్నారు! దీన్నే గురికి బారెడు దూరంగా కొట్టడం అంటారు.

డెమొక్రటిజపు రెండో లక్షణమైన ఎన్నిక సూత్రానికి సంబంధించి కూడా పరిస్థితి యింతకన్న మెరుగ్గా ఏమీ లేదు. రాజకీయ స్వాతంత్ర్యం వున్న దేశాల్లో, యీ షరతు మామూలే ననుకుంటారు. "పార్టీ కార్యక్రమ సూత్రాలను ఆమోదించి, పార్టీకి అన్ని విధాలా తోడ్పడేవాళ్ళు పార్టీ సభ్యులుగా ఉండేందుకు అర్హులు" అని జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిబంధనావళి మొదటి నిబంధనలో వుంది. నాటక రంగస్థలం ప్రేక్షకుల కళ్ళముందు ఉన్నట్లే, యావత్తు రాజకీయ రంగమూ జనం కళ్ళముందు ఉంటుంది. అందుకని ఎవరు యీ సూత్రాలను ఆమోదిస్తారో, ఎవరు ఆమోదించరో, ఎవరు వీటిని సమర్థిస్తారో, ఎవరు వ్యతిరేకిస్తారో పత్రికల ద్వారానూ, బహిరంగ సభల ద్వారానూ అందరికీ తెలిసిపోతుంది. ఒక రాజకీయ నాయకుడు తన రాజకీయ జీవితాన్ని ఫలానా విధంగా మొదలుపెట్టాడు, అది ఫలానా ఫలానా పరిణామ క్రమంలో సాగింది, గడ్డు సమయాలు వచ్చినప్పుడు అతను ఫలానా ఫలానా విధంగా ప్రవర్తించాడు, అతని మంచి చెడ్డలు ఫలానా ఫలానావి అని ప్రతి ఒక్కడికీ తెలుస్తుంది. తత్పర్యవసానంగా పార్టీ సభ్యులు అందరూ, అన్ని విషయాలూ తెలియడంవల్ల, పార్టీలో అతన్ని ఒక ప్రత్యేక స్థానానికి ఎన్నుకోవచ్చుననో, ఎన్నుకోరాదనో నిర్ణయించుకోగలుగుతారు. రాజకీయ రంగంలో పార్టీ వ్యక్తుల ప్రతి పని పైనా ఉండే యీ సార్వత్రిక అజమాయిషీ (అక్షరాలా) మూలంగా, జీవశాస్త్రంలో "జీవశక్తి వున్నదే బతికి వుంటుంది" అంటారే, అలాంటి, స్వయంవర్తిత నియమం అమ

ల్లోకి వస్తుంది. పూర్తి బహిరంగత, ఎన్నికలు, సాధారణ అజమాయిషీ ద్వారా "ప్రాకృతిక వరణం" ఒక హామీ కల్పిస్తుంది అదేమిటంటే, అంతిమ విశ్లేషణలో, ప్రతి రాజకీయ నాయకుడూ "తనకి తగిన స్థానంలో" ఉంటాడు, తన శక్తి సామర్థ్యాలనుబట్టి తను ఏ పనికి అన్నిటికన్న ఎక్కువగా పనికివస్తాడో ఆ పనే అతనికి లభిస్తుంది, అతను చేసిన పార పాట్ల ఫలితాలు అతనికే అనుభవంలోకి వస్తాయి, తన పొరపాట్లేమిటో తెలుసుకుని, అవి జరగకుండా నివారించుకోగల సామర్థ్యం ప్రపంచం అంతటిముందూ నిరూపితమవుతుంది.

ఈ చిత్రాన్ని నిరంకుశ ప్రభుత్వ చట్రంలో అమర్చేందుకు ప్రయత్నించండి! రష్యాలో, "ఎవరైతే పార్టీ కార్యక్రమ సూత్రాలను ఆమోదించి, పార్టీకి అన్ని విధాలా తోడ్పడుతారో" వాళ్లందరూ రహస్య కార్యకలాపాల్లో నిమగ్నులైన విప్లవకారుల ప్రతి చర్యపైనా అజమాయిషీ చెయ్యడాన్ని ఊహించుకోగలమా? అందరూ కలిసి రహస్యంగా పనిచేసే యీ విప్లవ కారుల్లో ఒకరిని ఒకానొక స్థానానికి ఎన్నుకోవడం – సరిగా ఆ పని ప్రయోజనాల దృష్ట్యానే, యీ "అందరి"లోనూ తొంభై శాతం మందినుంచి అజ్ఞాతంగా ఉండటం ఆ విప్లవకారుడి విధియైనప్పుడు – సాధ్యమా? "రబోచెయె దేలో" వాడే ఆడంబర పదజాలంలోని అసలు అర్థాన్ని గురించి కొంచెం ఆలోచించండి. నలుపక్కలా నిరంకుశత్వ అంధకారం వ్యాపించి వున్నప్పుడు, సైనిక పోలీసులు గాలించి గాలించి జనాన్ని అరెస్టుచేస్తున్నప్పుడు, పార్టీ నిర్మాణంలో "విస్తృత డెమోక్రటిజం" అన్నది పనికిమాలినదే కాకుండా హానికరమైన ఆట బొమ్మ తప్ప మరేమే కాదు. అది పనికిమాలిన ఆటబొమ్మ, ఎందుకంటే, నిజానికి ఏ విప్లవ సంఘమూ కూడా ఎన్నడూ – అదెంతగా కోరుకున్నా కూడా – విస్తృత డెమోక్రటిజానికి అమలు జరపనూలేదు, జరపలేదు కూడా. అదెందుకు హానికరమైన ఆటబొమ్మ అంటే, "విస్తృత ప్రజాస్వామిక సూత్రాన్ని" అమలుజరిపేందుకు చేసే ఏ ప్రయత్నమైనా, పోలీసులు భారీ ఎత్తున దాడులు జరిపేందుకు మాత్రమే తోడ్పడుతుంది, ప్రస్తుతం నిర్మాణంలో వున్న అనిపుణతను స్థిరోభవ చేస్తుంది, చురుకైన కార్యకర్తలు వృత్తి విప్లవ కారులుగా మారవలసిన ముఖ్యమూ, ఆవశ్యకమూ అయిన కర్తవ్యంనుంచి, ఎన్నిక విధానాలకు సంబంధించిన "కాగితపు" నిబంధనావళులకు మళ్లడానికే దోహదం చేస్తుంది. "ప్రజా స్వామ్యం ఆట" అన్నది అతి తరచుగా, నిజంగా చురుకైన కార్యకలాపాలు సాగించే అవకాశం లేనివాళ్ళు జతగూడే విదేశాల్లో మాత్రమే, అదీ చిన్న చిన్న గ్రూపుల్లో, అక్కడక్కడ మాత్రమే అభివృద్ధిచెందుతుంది.

హేతుబద్ధంగా కనిపించే ప్రజాస్వామ్యం అనే "సూత్రాన్ని," విప్లవ వ్యవహారాల్లో ముందుకు తెచ్చే "రబోచెయె దేలో"కి ప్రియమైన కపటోపాయంలోని అయోగ్యతను నిరూపించేందుకు గాను, నేను మరో సాక్షిని ముందుకు తెస్తున్నాను. లండన్‌నుంచి వెలు వడే "నకనూనె" పత్రికా సంపాదకుడైన యీ సాక్షి వై. సెరెబ్ర్యకోవ్‌కి, "రబోచెయె

దేలొ''పట్ల ఆర్ద్రభావమూ, ప్లెహానొవ్‌పట్లా, ''ప్లెహానొవ్ అనుచరుల''పట్లా విపరీతమైన ద్వేషభావమూ ఉన్నాయి. ''దేశాంతర రష్యన్ సోషల్ డెమొక్రట్ల యూనియన్''లో చీలికపై తను ప్రచురించిన వ్యాసాల్లో ''నకనూనె'' ''రబోచెయె దేలొ''ని కచ్చితంగా బలపరచి, ప్లెహానొవ్‌మీద చౌకబారు తిట్ల వర్షం కురిపించింది. అందుకనే, మన పరిశీలనలో వున్న అంశంపైన యీ సాక్షి సాక్ష్యపు విలువ మరింత పెరుగుతోంది. 1899 జూలైలో, ''నకనూనె''' (సంచిక 7)లో, ''కార్మికుల స్వయం విమోచన గ్రూపు విజ్ఞప్తిని గురించి'' అన్న శీర్షికతో సెరెబ్ర్యకోవ్ ఒక వ్యాసం రాశాడు. అందులో ఆయన '''గంభీరమైన విప్లవోద్యమంలో ఆత్మవంచన గురించీ, నాయకత్వం గురించీ, ఎరియోపేగస్* అనబడేదాన్ని గురించీ మాట్లాడటం ''అసభ్యం'' అంటూ వాదించాడు. సెరెబ్ర్యకోవ్ యితర విషయాలతోబాటు ఆ వ్యాసంలో యింకా యిలా కూడా రాశాడు:

> ''మిష్కిన్, రొగచోవ్, జెల్యాబొవ్, మిహైలొవ్, పెరోవ్స్కయా, ఫీగ్నెర్, తదితరులు తమని తాము ఎన్నడూ నాయకులుగా పరిగణించుకోలేదు, ఎవళ్లూ వాళ్లని ఎన్నడూ నాయకులుగా ఎన్నుకోనూలేదు, నియమించనూలేదు. అయినప్పటికీ ఆచరణలో వాళ్లు నాయకులే. ఎందుకంటే, ప్రచార దశలోనూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాట దశలోనూ కూడా, వాళ్లు అత్యంత ప్రమాదకరమైన తావుల్లో నిలబడేవాళ్లు, వాళ్ల కార్యకలాపాలు అత్యధిక ఫలదాయకమైనవి. తాము కోరుకున్నమూలంగా కాక వాళ్ల కామ్రేడ్సుకి వాళ్ల వివేకంపైనా, వాళ్ల శక్తిపైనా, వారి విధేయతపైనా విశ్వాసం ఉండటం మూలంగానే వాళ్లు నాయకులయ్యారు. ఉద్యమాన్ని ఎరియోపేగస్ మాదిరిదేదో నిరంకుశంగా పాలిస్తుందని భయపడటం (భయపడకపోతే, దాన్ని గురించి రాయడం ఎందుకు?) అమాయకత్వానికి పరాకాష్ఠ. దాన్ని ఎవరు లెక్కచేస్తారు?''

ఈ ''ఎరియోపేగస్'' ''ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులకు'' ఏవిధంగా భిన్నమైనదని నేను పాఠకుణ్ణి ప్రశ్నిస్తున్నాను. ''రబోచెయె దేలొ'' ప్రతిపాదించే ''హేతుబద్ధంగా కనిపించే'' నిర్మాణ సూత్రం కూడా యింతే అమాయకమైనదీ, అసభ్యమైనదీ అనడం స్పష్టం కాదా? అది ఎందుకు అమాయకమైనదంటే, ''ఎరియోపేగస్''నూ, లేక ''ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులు'' గల వ్యక్తులనూ, ''వాళ్ల కామ్రేడ్సుకు వాళ్ల వివేకంలోనూ, కార్య కౌశల్యంలోనూ, విధేయతలోనూ విశ్వాసం'' లేకపోయినట్లయితే, ఎవరూ ఖాతరుచెయ్యరు.

---

* ఎరియోపేగస్ — ఏథెన్సులోని సర్వోన్నత న్యాయ స్థానం. దాని సమావేశాలు ఎరియో పేరుగల కొండమీద జరుగుతూండేవి. — సం.

అది అసభ్యమైనది, యెందుకంటే, ఈ సూత్రానికి సంబంధించి కొందరి స్వాతిశయాన్ని కికురించేందుకూ, మన ఉద్యమ వాస్తవ పరిస్థితిని గురించి కొందరిలో ఉన్న అజ్ఞానం నుంచీ, మరి కొందరిలో వున్న శిక్షణ లోపంనుంచీ, విప్లవోద్యమ చరిత్రకు సంబంధించిన పరిజ్ఞాన లోపంనుంచీ లాభం పొందేందుకూ ఉద్దేశింపబడిన ఆడంబర పదాలతో కూడిన చతురోక్తి గనుక. మన ఉద్యమంలోని చురుకైన కార్యకర్తలు తమ ముందు పెట్టుకోవలసిన ఏకైక నిర్మాణ సూత్రం ఏమిటంటే – కచ్చితమైన రహస్య గోపనం, సభ్యులను ఎంపిక చేసుకునేటప్పుడు కఠినమైన నియమాలను పాటించడం, వృత్తి విప్లవకారులను తయారు చేసుకోవడం. ఇవే కనుక అమలు జరిగినట్లయితే, ''డెమోక్రటిజం'' కంటె కూడా ఎక్కువైనది లభించే హామీ మనకి ఏర్పడుతుంది. అదేమిటంటే, విప్లవకారుల మధ్య పూర్తి, మైత్రీ పూర్వక, పరస్పర విశ్వాసం. దీని స్థానంలో, సార్వత్రిక ప్రజాస్వామిక అజమాయిషీని ప్రవేశ పెట్టే అవకాశం రష్యాలో లేదు. అందుకనే యిది మనకి అత్యంత ఆవశ్యకం. నిజమైన ''ప్రజాస్వామిక'' అజమాయిషీని నెలకొల్పడం సాధ్యం కాదు గనుక విప్లవ సంఘ సభ్యుల పైన అసలు అజమాయిషీయే ఉండదనుకోవడం పెద్ద పొరపాటు. వాళ్లకి వేడుక రూపాల్లో వుండే డెమోక్రటిజాన్ని గురించి (పూర్తి, పరస్పర విశ్వాసం వుండే, సన్నిహితమూ, పొంకమైన కామ్రేడ్ల సంఘంలో డెమోక్రటిజాన్ని) గురించి ఆలోచించేందుకు తీరిక ఉండదు, కానైతే, వాళ్లకి తమ బాధ్యతని గురించిన సజీవ భావన ఉంటుంది. సిసలైన విప్లవకారుల సంఘం, తనలో వున్న పనికిమాలిన సభ్యుణ్ణి వదిలించుకోడానికి ఎంత పెద్ద చర్య తీసుకోడానికైనా వెనుకాడదన్న సంగతిని స్వానుభవం ద్వారా వాళ్లు తెలుసుకోవడమే అందుకు కారణం. ఇంతే కాదు, రష్యన్, (అలాగే అంతర్జాతీయ) విప్లవకారుల్లో వ్యాప్తిలో వున్న బహుజనాభిప్రాయం కనిపిస్తుంది. దాని వెనక సుదీర్ఘ చరిత్ర వుంది. అది, కామ్రేడ్ల పట్ల నిర్వర్తించవలసిన విధుల ప్రతి అతిక్రమణనీ కఠినంగా, నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తుంది. (కాగా డెమోక్రటిజం – నిజమైన డెమోక్రటిజం – కామ్రేడ్లీ భావనలో తప్పనిసరిగా ఒక అంతర్భాగంగా ఉంటుంది). మీరు వీటన్నింటినీ దృష్టిలోకి తీసుకున్నట్లయితే, ''ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణుల''ను గురించిన యీ మాటలూ, యీ తీర్మానాలవల్ల విదేశాల్లో నాయకులుగా పోజులుపెట్టే క్రీడ పాచికంపు కొడుతోంది.

ఈ రకంగా మాట్లాడటానికి మరో మూలమైన అమాయకత్వం, ప్రజాస్వామ్యం అంటే ఏమిటన్న విషయంలో భావాల గందరగోళం మూలంగా ఉత్పన్నమైనదేనన్న విషయాన్ని గుర్తుంచుకోవడం కూడా అవసరం. బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్లని గురించి వెబ్బ్ దంపతులు రాసిన పుస్తకంలో ఆసక్తికరమైన ప్రకరణం ఒకటుంది. దాని శీర్షిక: ''ఆదిమ ప్రజాస్వామ్యం.'' రచయితలు అందులో, బ్రిటిష్ కార్మికులు, తమ సంఘాలు ఏర్పడిన తొలి దశలో, సంఘాల నిర్వహణలో అందరు సభ్యులూ అన్ని బాధ్యతలనూ నిర్వర్తించడాన్ని ప్రజా

స్వామ్యానికి తప్పనిసరి లక్షణంగా ఎలా పరిగణించేవారో వర్ణించారు. అన్ని సమస్యలపైనా అందరు సభ్యులూ ఓట్లు వేసి నిర్ణయించడం మాత్రమే కాకుండా, నాయకత్వ బాధ్యతలన్నింటినీ సభ్యులందరూ వంతుల వారీగా నిర్వహిస్తూండేవారట. ప్రజాస్వామ్యాన్ని గురించిన అటువంటి అవగాహన అవకతవకదని గ్రహించడానికీ, ఒక వంక ప్రాతినిధ్య సంస్థల ఆవశ్యకతనీ, మరో వంక హోల్‌టైమ్ కార్యనిర్వాహకుల ఆవశ్యకతనీ, అర్థంచేసుకోడానికి కార్మికులకి దీర్ఘకాల చారిత్రకానుభవం అవసరమైంది. అనేక ట్రేడ్‌యూనియన్లు దివాళాలు తీసిన తర్వాతగాని, విరాళాలనూ, ఆర్థిక సౌకర్యాలనూ గురించి ప్రజాస్వామిక పద్ధతిలో ఓటింగు ద్వారా నిర్ణయిస్తేనే సరిపోదనీ, దీనికి ఇన్స్యూరెన్సు నిపుణుల సలహా కూడా అవసరమనీ కార్మికులు గ్రహించలేకపోయారు. పార్లమెంటరీ విధానం గురించీ, ప్రజలు శాసన నిర్మాణం చెయ్యడం గురించీ కౌట్స్కీ రచించిన పుస్తకాన్ని కూడా మనం చూద్దాం. ఈ మార్క్సిస్టు సిద్ధాంతవేత్త చేసిన నిర్ధారణలు, "సద్యోజనితం"గా తమను తాము సంఘటితులను చేసుకున్న కార్మికులు అనేక సంవత్సరాల ప్రత్యక్షానుభవ క్రమంలో నేర్చుకున్న గుణపాఠాలకు అనుగుణంగా ఉండటాన్ని మనం ఆ పుస్తకంలో చూస్తాం. ప్రజాస్వామ్యంపట్ల రిట్టింగ్‌హౌసెన్ ఆదిమ అవగాహనను కౌట్స్కీ తీవ్రంగా ఖండించాడు. ప్రజాస్వామ్యం పేరిట "ప్రజా పత్రికలకు నేరుగా ప్రజలే సంపాదకులుగా వ్యవహరించాలి" అంటూ డిమాండుచేసినవాళ్లని కౌట్స్కీ అవహేళనచేశాడు. శ్రామికవర్గ వర్గపోరాటపు సోషల్ డెమోక్రటిక్ నాయకత్వం కోసం, వృత్తి పత్రికా రచయితలు, పార్లమెంటేరియన్లు వగైరాలు ఉండవలసిన అవసరాన్ని కౌట్స్కీ నిరూపించాడు. "అట్టహాసంగా కనిపించే ప్రయత్నంలో" నేరుగా ప్రజలే శాసనాలు చెయ్యడాన్ని ఆకాశానికెత్తుతూ, యీ భావాన్ని ఆధునిక సమాజంలో సాపేక్షంగా కొంతమేరకు మాత్రమే అన్వయించగలమన్న విషయాన్ని బొత్తిగా అర్థంచేసుకోలేని "అరాజకవాదుల, సాహిత్యవేత్తల సోషలిజాన్ని" కౌట్స్కీ తీవ్రంగా ఖండించాడు.

విద్యార్థి, కార్మిక జనసామాన్యంలో ప్రజాస్వామ్యాన్ని గురించిన "ఆదిమ" భావం ఎంత విస్తారంగా వ్యాపించి వున్నదన్న విషయం మన ఉద్యమ ప్రత్యక్ష కార్యకలాపాల్లో పాల్గొన్నవాళ్లకి తెలుసు. ఈ అవగాహన నిర్మాణ నిబంధనావళుల్లోకీ, సాహిత్యంలోకీ కూడా చొచ్చుకురావడం అన్నది ఆశ్చర్యకర విషయమేమీ కాదు. బెర్న్‌స్టైన్ పంథా ఆర్థికవాదులు తమ నిబంధనావళిలో యీ కింది దాన్ని చేర్చారు: "నిబంధన 10. మొత్తం యూనియన్ ప్రయోజనాలను ప్రభావితం చేసే వ్యవహారాలన్నీ, దాని సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకుల ఓట్లనుబట్టి నిర్ణయింపబడతాయి." వాళ్ల యీ నిబంధననే టెరరిస్టు పంథాను అనుసరించే ఆర్థికవాదులు యిలా తిరిగి వల్లించారు: "కమిటీ నిర్ణయాలు, అన్ని అధ్యయన బృందాలలోనూ పంచబడి, వాటి ఆమోదం పొందిన తర్వాతగాని అమల్లోకి రావు" ("స్వోబోద," సంచిక 1, పేజి 67) మొత్తం సంఘం ఎన్నికల ప్రాతిపదికపైన నిర్మింపబడాలన్న

డిమాండుకి తోడు, విస్తృత ప్రాతిపదికపైన అభిప్రాయ సేకరణ జరగాలన్న యీ ప్రతిపాదనను పరిశీలించండి! నిస్సందేహంగా మనం, దీని ఆధారంగా, అసలైన ప్రజాస్వామ్య సంఘాల సిద్ధాంతాచరణలను అధ్యయనం చేసే అవకాశాలు బాగా తక్కువగా వున్న ప్రత్యక్ష కార్యకర్తలను ఖండించబోము. నాయకత్వానికి అర్రులు చాచే ''రబోచెయె దేలొ,'' అలాంటి పరిస్థితుల్లో కూడా, విస్తృత ప్రజాస్వామిక సూత్రాలను గురించిన తీర్మానానికి పరిమితమై ఉన్నప్పుడు, దాన్ని కేవలం ''అట్టహాసంగా కనిపించే ప్రయత్నం'' అని తప్ప మరోలా వర్ణించగలమా?

## ఊ) స్థానిక, అఖిల రష్యన్ కార్యకలాపాలు

ఇక్కడ నేను వివరించిన నిర్మాణ పథకానికి, అది ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమైనదీ, కుట్రదారీ స్వభావం కలిగినదీ అన్న వాదనలతో లేవదియ్యబడుతున్న అభ్యంతరాలు శుద్ధ బోలువి. అయినా కూడా, తరుచుగా ముందుకు తేబడుతూ వున్న ఒక సమస్యను యిక్కడ విపులంగా చర్చించడం అవసరం. అది స్థానిక కార్యకలాపాలకూ, అఖిల రష్యన్ కార్యకలాపాలకూ వుండవలసిన పరస్పర సంబంధాల సమస్య. కేంద్ర సంఘ నిర్మాణం జరిగినప్పుడు స్థానిక కార్యకలాపాల ప్రాధాన్యం తగ్గిపోయి, కేంద్ర కార్యకలాపాల ప్రాధాన్యం పెరగవచ్చుననీ, కార్మిక జనసామాన్యంతో మన సంబంధాలూ, మొత్తంమీద స్థానిక ఆందోళనలోని అనుస్యూతీ దెబ్బతినడం ద్వారా మన ఉద్యమం నష్టపడవచ్చునన్న భయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ భయాలకు మేము చెప్పే జవాబేమిటంటే, మన ఉద్యమం గత కొద్ది సంవత్సరాల్లో దెబ్బతిన్నది సరిగా, స్థానిక కార్యకర్తలు స్థానిక కార్యకలాపాల్లో అతిగా నిమగ్నులైన కారణంగానే అనీ; అందుకనే, దేశవ్యాపిత కార్యకలాపాలకు ఎక్కువ ప్రాధాన్యం యివ్వడం పరమావశ్యకం అనీ, అలా చేస్తే మన సంబంధాలూ, మన స్థానిక ఆందోళన అవిచ్ఛిన్నతా బలహీనపడేందుకు బదులు బలపడతాయనీ. కేంద్ర పత్రికల, స్థానిక పత్రికల సమస్యను తీసుకుందాం. అత్యంత విస్తృతమూ, మొత్తంమీద మరింత వైవిధ్యపూరితమూ అయిన విప్లవ కార్యకలాపాలని చూపించేదానికి, ఉదాహరణగా మాత్రమే ప్రస్తావిస్తున్నానన్న విషయాన్ని మరచిపోవద్దని పాఠకులకు మనవి చేస్తున్నాను.

ప్రజోద్యమ ప్రథమ దశలో (1896–98), ''రబోచయ గజేత'' అనే అఖిల రష్యా పత్రిక నొకదాన్ని ప్రచురించేందుకు స్థానిక కార్యకర్తలు ప్రయత్నించారు. తర్వాతి దశలో (1898–1900), ఉద్యమం గొప్ప ముందంజ వేసింది, కాని నాయకుల శ్రద్ధ పూర్తిగా స్థానిక పత్రికల ప్రచురణలపైననే లగ్నమైంది. ప్రచురింపబడిన స్థానిక పత్రికల మొత్తం సంఖ్యను లెక్కపెట్టినట్లయితే, సగటున నెలకొక పత్రిక చొప్పున ప్రచురింపబడినట్లు

తేలుతుంది.* ఇది మన అనిపుణతను స్పష్టంగా రుజువుచెయ్యడంలేదూ? ఉద్యమ సద్యో జనితాభివృద్ధి కన్న మన విప్లవ సంఘం వెనకబడుతోందన్న సంగతిని యిది స్పష్టంగా రుజువు చెయ్యడంలేదూ? చెదురుబదురు స్థానిక గ్రూపులచేత కాక, యిదే సంఖ్యలో పత్రి కల సంచికలు ఒకే ఒక సంఘంచేత ప్రచురింపబడినట్లయితే, మనకి ఎంతో శ్రమ మిగల డమే కాకుండా, మన కృషిలో యింకెంతో ఎక్కువ స్థిరత్వాన్నీ, అనుస్యూతినీ సమకూర్చు కొని ఉండగలిగేవాళ్లం. క్రియాశీలంగానూ, దాదాపు పూర్తిగానూ స్థానిక పత్రికల్లో పనిచేసే ప్రత్యక్ష కార్యకర్తలు యీ చిన్న అంశాన్ని తరచుగా విస్మరిస్తున్నారు (దురదృష్ట వశాత్తూ యిప్పుడు సైతం అత్యధిక సందర్భాల్లో యిదే నిజం). అలాగే, యీ అంశంపై ఆశ్చర్యం గొలిపేటంతటి ఊహా విహార పరాయణులైన పత్రికా రచయితలు కూడా యీ విషయాన్ని విస్మరిస్తున్నారు. స్థానిక కార్యకర్తలకు అఖిల రష్యన్ వార్తాపత్రిక నిర్వహణ ''కష్టసాధ్యం''** అనీ, అసలు వార్తాపత్రికలే లేకపోవడం కన్న స్థానిక వార్తాపత్రికలైనా ఉండటం మేలనే వాదంతో సాధారణంగా ప్రత్యక్ష కార్యకర్తలు సంతృప్తిచెందుతూ వుంటారు. నిస్సం దేహంగా యీ వాదం సహేతుకమైనదే. మొత్తంమీద చూసినప్పుడు, స్థానిక వార్తాపత్రికల ప్రాముఖ్యాన్నీ, ఉపయోగాన్నీ గుర్తించడంలో ప్రత్యక్ష కార్యకర్తలెవరికీ మేము తీసిపోం. అయితే, సమస్య యిది కాదు. సమస్య ఏమిటంటే, రష్యా అంతట్లోనూ, రెండున్నర సంవ త్సరాల కాలంలో ప్రచురింపబడిన స్థానిక పత్రికల ముప్పై సంచికల్లో వ్యక్తమైన అసంపూ ర్ణత్వాన్నీ, అనిపుణతనీ మనం అధిగమించలేమా? మొత్తంమీద స్థానిక వార్తాపత్రికల ఉపయోగాన్ని గురించి నిర్వివాదమే గాని, మరీ సాధారణమైన ప్రకటనకు మిమ్మల్ని మీరు పరిమితుల్ని చేసేసుకోకండి; రెండున్నర సంవత్సరాల అనుభవం వెలుగులో వాటిలో బహిర్గతమైన ప్రతికూల పార్శ్వాలను నిర్మొగమాటంగా గుర్తించేందుకు ధైర్యంగా ముం దుకు రండి. ఈ అనుభవం మనకి తెలియజేస్తున్నది ఏమిటి? మనం పనిచేస్తున్న పరిస్థి తుల్లో, యీ స్థానిక వార్తాపత్రికలు, అధిక సంఖ్యాక సందర్భాల్లో, తమ సూత్రాల విష యంలో అస్థిరంగా ఉన్నాయి, వాటి రాజకీయ ప్రాముఖ్యం శూన్యం, విప్లవ శక్తుల వ్యయం

* ''పారిస్ మహాసభకు సమర్పించబడిన నివేదిక''[188] పేజి 14ని చూడండి. ''ఆనాటి (1897)నుండి 1900 వసంతకాలం వరకు వివిధ ప్రాంతాల్లో వివిధ పత్రికల ముప్పై సంచికలు ప్రచురింపబడ్డాయి.... సగటున నెలకు ఒక సంచికకు పైగా ప్రచురింపబడ్డాయి.''

** ''ఈ కష్టం పైకి కనిపించేదే గాని నిజమైనది కాదు. నిజానికి అఖిల రష్యా కృషికి సంబంధించి, ఏదో ఒక విధిని నిర్వహించే అవకాశం కొరవడిన స్థానిక అధ్యయన బృందం ఒక్కటి కూడా లేదు. ''నేను చెయ్యను అని చెప్పండి, అంతేగాని నాచేత కాదు అని చెప్పకండి.''

దృష్ట్యా చాలా ప్రియమైనవి, సాంకేతిక దృష్ట్యా పూర్తిగా అసంతృప్తికరమైనవి (నా దృష్టిలో ఉన్నది అచ్చు టెక్నిక్ కాదు, ప్రచురణలో క్రమభంగం లేకపోవడం). ఈ లోపాలు యాదృచ్ఛికమైనవి కావు; అసంపూర్ణత్వంవల్ల అనివార్యంగా వచ్చినవి. వీటినిబట్టి ఒక వంక, మన పరిశీలనలో ఉన్న కాలంలో, స్థానిక పత్రికల బాహుళ్యం తెలియవస్తుంది; మరో వంక యీ బాహుళ్య కారణంగా యీ అసంపూర్ణత్వం మరింత పెరుగుతూ పోతోంది. తన పత్రికను సిద్ధాంత రీత్యా దృఢమైనదిగా ఉంచి, రాజకీయ పత్రిక స్థాయికి పెంచడమన్నది నిస్సందేహంగా ఒక విడి స్థానిక సంఘపు శక్తికి మించిన పని. మన రాజకీయ జీవితం అంతటినీ ప్రజల దృష్టికి తీసుకురాగలంతటి సమాచారాన్ని సేకరించడం, వినియోగించడం దాని శక్తికి మించిన పని. స్వతంత్ర దేశాల్లో పలు స్థానిక వార్తాపత్రికల ఆవశ్యకతను బలపరుస్తూ మామూలుగా ఒక వాదనను ముందుకు తెస్తూవుంటారు: స్థానిక కార్మికుల చేత అచ్చువేయిస్తే ప్రింటింగు ఖర్చులు తక్కువగా ఉంటాయి, జనానికి మరింత సమగ్రంగా, సత్వరంగా సమాచారాన్ని అందజెయ్యవచ్చునన్న యీ వాదన, రష్యాలో స్థానిక వార్తాపత్రికలకు వర్తించదని అనుభవ రీత్యా రుజువైంది. విప్లవ శక్తుల ఖర్చు దృష్ట్యా, అవి విపరీతమైన వ్యయంతో కూడినవై, చాలా అరుదుగానే వెలువడతాయి. రహస్య వార్తాపత్రిక ప్రచురణకు, దాని సైజు ఎంత చిన్నదైనప్పటికీ కూడా, భారీ ఫ్యాక్టరీ ఉత్పత్తితో బాటు మాత్రమే సంభవమైన, విస్తృతమైన రహస్య యంత్రాంగం అవసరమవుతుంది, ఎందుకంటే, యీ యంత్రాంగాన్ని చిన్న తరహా, చేతివృత్తి కార్ఖానాలో తయారుచెయ్యడం సాధ్యంకాదు. అతి తరచుగా, రహస్య యంత్రాంగపు వెనకబాటుతనం వల్ల (ప్రతి ప్రత్యక్ష కార్యకర్త యిందుకు అనేక ఉదాహరణలను పేర్కొనగలడు), ఒకటి రెండు సంచికల ప్రచురణనూ, పంపిణీనీ ఆధారంగా తీసుకుని, పోలీసులు సామూహికంగా అరెస్టులు చెయ్యగలుగుతారు, తత్పర్యవసానంగా అంతా తుడిచిపెట్టుకుపోవడంతో, అంతా మళ్లీ కొత్తగా మొదలుపెట్టాల్సివస్తుంది. సుసంఘటితమైన రహస్య యంత్రాంగ నిర్వహణకు సుశిక్షితులైన వృత్తి విప్లవకారులూ, అత్యంత సుసంగతంగా అన్వయింపబడిన శ్రమ విభజనా అవసరం. అయితే యీ రెండు ఆవశ్యకతలనూ తీర్చడం విడి స్థానిక శాఖ – ఒకానొక ప్రత్యేక సమయంలో అదెంత బలంగా ఉన్నా కూడా – శక్తికి మించిన పని. మన ఉద్యమపు సాధారణ ప్రయోజనాలను (స్థిరమైన సోషలిస్టు, రాజకీయ సూత్రాల్లో కార్మికులకు శిక్షణ యివ్వడం) అటుంచి, ప్రత్యేక స్థానిక ప్రయోజనాలను కూడా స్థానికేతర పత్రికలు మరింత బాగా తీరుస్తాయి. పైకి యిది విరోధాభాసగా కనిపించవచ్చు, కాని పైన పేర్కొన్న రెండున్నర సంవత్సరాల అనుభవాన్నిబట్టి యిది పూర్తిగా రుజువైంది. ముప్పై పత్రికల సంచికలను ప్రచురించడంలో నిమగ్నులైన స్థానిక శక్తులన్నీ ఒకే వార్తాపత్రిక ప్రచురణలో కృషిచేసి వున్నట్లయితే, నూరు కాకపోయినా, ఓ అరవై సంచికలనైనా తేలిగ్గా ప్రచురించ

గలిగి వుండేవాళ్లమనీ, ఉద్యమపు ప్రత్యేక స్థానిక లక్షణాలన్నింటి కారణంగా ఆ పత్రిక మరింత సమగ్రంగా కూడ ఉండివుండేదనీ అందరూ అంగీకరిస్తారు. అంతటి నిర్మాణ స్థాయిని సాధించడం అంత తేలిక విషయం కానిమాట నిజమే, కాని దాని అవసరాన్ని మనం గుర్తించాల్సివుంది. ప్రతి ఒక్క స్థానిక అధ్యయన బృందమూ దాన్ని గురించి ఆలోచించాలి, బయటనుంచి ఏదో ప్రచోదనం వస్తుందని వేచి చూడకుండా, దాన్ని సాధించేందుకు క్రియాశీలంగా పనిచెయ్యాలి. స్థానిక వార్తాపత్రిక ప్రజారంజక మవుతుందనీ, మరింత సన్నిహితంగా ఉంటుందనీ ప్రలోభంలో పడకూడదు. ఎందుకంటే, మన విప్లవాత్మక అనుభవం యిది చాలవరకు భ్రమాత్మకమైనదన్న విషయాన్ని రుజువుచేసింది.

ప్రత్యక్ష కార్యకర్తలకు తాము ప్రత్యేకించి సన్నిహితులమని అనుకొంటూ, యీ భ్రమాత్మక విషయాన్ని గుర్తించడంలో విఫలమవుతున్న పత్రికా రచయితలు ప్రత్యక్ష కార్యకలాపాలకు ఏమాత్రం ఉపకారం చెయ్యడంలేదు. మనకి స్థానిక వార్తాపత్రికలు కావాలి, మనకి జిల్లా వార్తాపత్రికలు కావాలి, మనకి అఖిల రష్యన్ వార్తాపత్రికలు కూడా కావాలంటూ పరమ చౌకబారు వాదనలు చేస్తున్నారు. స్థూలంగా చెప్పుకోవాలంటే, నిస్సందేహంగా యివన్నీ అవసరమే. కాని, నిర్మాణపరమైన ఒకానొక నిర్దిష్టమైన సమస్యను పరిష్కరించేందుకు పూనుకున్నప్పుడు, కాలాన్నీ, పరిస్థితులనూ తప్పనిసరిగా దృష్టిలోకి తీసుకోవలసి వుంటుంది. ''స్వొబోద'' (సంచిక 1, పేజి 68) ఒక ప్రత్యేక వ్యాసంలో పత్రిక సమస్యను గురించి'' యీ కింది విధంగా రాయడం గాలి మేడలు కట్టడం కాదూ? ''కొంచెం గణనీయమైన సంఖ్యలో కార్మికులు కేంద్రీకృతులై వున్న ప్రతి చోటా దాని సొంత కార్మిక పత్రిక ఉండాలని భావిస్తున్నాం. అది ఎక్కణ్ణుంచో తీసుకువచ్చినది కాక, ఆ ప్రాంతానికే చెందినదై వుండాలి.'' ఈ మాటలు రాసిన పత్రికా రచయిత వాటి అర్థాన్ని గురించి ఆలోచించ నిరాకరిస్తే కనీసం పాఠకుడు దాన్ని అతనికి చెప్పవచ్చు. రష్యాలో ''గణనీయమైన సంఖ్యలో కార్మికులు ఉన్న చోట్లు'' వందలకొద్దీ కాకపోయినా డజన్ల కొద్దీ ఉన్నాయి! నిజానికి ప్రతి స్థానిక శాఖా తన సొంత వార్తాపత్రికను ప్రచురించ పూనుకున్నట్లయితే, అది మన అనిపుణ పద్ధతులను పట్టుకుని యెంత వేళ్లాడ్డం అవుతుంది! ఈ వికేంద్రీకరణ, పోలీసులు ''పెద్ద గణనీయంగా'' శ్రమ పడకుండానే, స్థానిక కార్యకర్తలను — వాళ్లు తమ కార్యకలాపాలను మొదలుపెట్టీ పెట్టగానే పట్టేసేందుకూ, సిసలైన విప్లవకారులుగా వాళ్లు అభివృద్ధి చెందకుండా నివారించేందుకూ మాత్రమే పనికివస్తుంది. ఆ పత్రికా రచయిత యింకా యిలా రాస్తాడు: అఖిల రష్యన్ పత్రిక పాఠకుడికి యితర పట్టణాలకు చెందిన ఫ్యాక్టరీ యజమానుల దుశ్చర్యలూ, ''తన పట్టణం కాక యితర పట్టణాల్లోని ఫ్యాక్టరీ జీవిత వివరాలూ ఆసక్తి గొలపవట. కాని ''ఒరేల్ పట్టణ వాసికి ఒరేల్ వ్యవహారాలు చదవడానికి విసుగుపుట్టవు''ట. ప్రతి సందర్భంలోనూ ఎవరిని 'ఎండగట్టేందుకు ఎంచు

కున్నారో,' ఎవరిని 'చీల్చి చెండాడారో' తెలుసుకున్న అతని మనస్సు ఉత్సాహంతో పొంగి పొర్లుతుంది''ట(పేజి 69). ఔనౌను, ఒరేల్ పాఠకుడి మనస్సు ఉత్సాహంతో పొంగి పొర్లుతుంది, కాని మన పత్రికా రచయిత ఊహా విహారాలు కూడా యెత్తుగా వున్నాయి. మరీ యెత్తుగా అలాంటి చిల్లర మల్లర అంశాలపట్ల అంత శ్రద్ధ చూపడం సరైనదేనా అని అతను ఆత్మావలోకనం చేసుకుని ఉండాల్సింది. ఫ్యాక్టరీల్లో జరిగే దుశ్చర్యలను బట్టబయలు చెయ్యడం ఎంత ముఖ్యమో, ఎంత అవసరమో గుర్తించే విషయంలో మేమెవరికీ తీసిపోము. కాని, మీరు ఒక విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. పీటర్స్‌బుర్గ్ ''రబోచయ మీస్ల్''లో వెలువడే పీటర్స్‌బుర్గ్ వార్తా లేఖలు పీటర్స్‌బుర్గ్ జనానికి బోరుకొట్టే దశకి మనం చేరుకున్నాం. స్థానిక ఫ్యాక్టరీల్లో జరిగే దుశ్చర్యలను బహిర్గతం చేసి ఖండించడానికి కరపత్రాలు యింతకు ముందెప్పుడూ వున్నాయి, యికముందు కూడా వాటిని అలాగే కొనసాగించాలి. అయితే మనం పత్రిక స్థాయిని పెంచాలేగాని, కరపత్రపు స్థాయికి దాన్ని దిగజార్చ కూడదు. మనం పత్రికనుంచి కోరుకునేది ''చిల్లర విషయాలను'' బహిర్గతం చేసి ఖండించడం కాదు. పెద్ద పెద్ద అంశాలనూ, ఫ్యాక్టరీ జీవితానికి సంబంధించిన విలక్షణమైన అంశాలనూ అది బహిర్గతంచేసి ఖండించాలి. ఈ బహిర్గతం చేసి ఖండించడమన్నది ప్రత్యేకించి కొట్టవచ్చినట్లు కనిపించే వాస్తవాల ప్రాతిపదికపైన జరగాలి. కాగా, అది అందరు కార్మికుల, అందరు ఉద్యమ నాయకుల ఆసక్తినీ రేకెత్తించి, వాళ్ల విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించి, వాళ్ల దృక్పథాన్ని విశాలంచేసేదిగా, కొత్త ప్రాంతాలనూ, కొత్త కొత్త వృత్తులకు చెందిన కార్మికులనూ జాగృతంచేసేదిగా ఉండాలి.

''దీనికితోడు, స్థానిక వార్తాపత్రికలో, ఫ్యాక్టరీ యజమానుల, తదితర అధికారుల దుశ్చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టవచ్చు. కాని, దూరాన వెలువడే సాధారణ పత్రిక కార్యాలయానికి వార్తలు చేరుకుని, అవి ప్రచురింపబడేనాటికి, ఆయా ఘటనలు జరిగిన ప్రాంతాల జనం వాటిని అప్పుడే మరిచిపోతారు. పత్రిక అందుకున్న పాఠకుడు 'దొంగపడ్డ ఆరునెలలకా కుక్కమొరగడం,' యిదెవడికి గుర్తు?' అంటాడు'' (అదే పేజి ). అయ్యా, సరైన మాట సెలవిచ్చారు – ఎవరికి గుర్తు ఉంటుంది! రెండున్నర ఏళ్లకాలంలో 30 పత్రికలు 6 నగరాలనుంచి ప్రచురింపబడ్డాయన్న విషయాన్ని మనం వీళ్ల ద్వారానే తెలుసుకున్నాం. సగటున చూస్తే, అర్ధ సంవత్సరానికి ఒక్కొక్క నగరానికి ఒక్క సంచిక వెలువడిందన్నమాట! మన బోళాబోళీ పత్రికా రచయిత స్థానిక కృషి ఉత్పాదకతను మూడు రెట్లు అంచనావేసినా కూడా (సగటు పట్టణం విషయంలో యిది శుద్ధ తప్పే అవుతుంది, ఎందుకంటే, మన అనిపుణ పద్ధతుల ద్వారా ఉత్పాదకతను గణనీయంగా పెంచడమన్నది దుస్సాధ్యం), మనకింకా ప్రతి రెండు నెల్లకీ ఒక్క సంచిక చొప్పున మాత్రమే వస్తుంది. అంటే, దీని అర్థం, ''ఎప్పటికప్పుడు ఎండగట్టడం'' కాదన్నమాట. కాని, ఓ పది స్థానిక

శాఖలు కలిసి, ఒక సాధారణ పత్రిక నిర్వహణలో చురుకైన పాత్ర వహించేందుకోసం తమ ప్రతినిధులను పంపి, మనం ప్రతి పక్షం రోజులకీ ఒకసారి, రష్యా అంతటాన్నూ, చిల్లర మల్లర చెడుగులను కాక, నిజంగా ముఖ్యమైన, సామాన్యమైన చెడుగులను బట్టబయలుచెయ్య గలిగితే సరిపోతుంది. మన శాఖల పరిస్థితి తెలిసిన ఏ ఒక్కడికీ యీ విషయంలో ఎంత మాత్రమూ సందేహం ఉండజాలదు. ఇకపోతే, శత్రువుని కన్నంలో ఉన్నవాడిని ఉండగానే పట్టు కోవడం సంగతి — ఏదో చక్కటి సామెత ప్రాయంగా కాక యీ విషయాన్ని మనం గంభీరంగా తీసుకున్నట్లయితే — వాస్తవానికి, సర్వసామాన్యంగా యిలాంటి పని రహస్య వార్తాపత్రిక పరిధికి అతీతమైనది. ఈ పనిని చెయ్యగలిగినది ఒక్క కరపత్రం మాత్రమే. ఎందుకంటే, ఆ మాదిరి బహిర్గతం చేసి ఖండించే కార్యక్రమాల కాలపరిధి మహాఅయితే ఒకటి రెండు రోజులు మాత్రమే (ఉదాహరణకు మామూలుగా జరిగే చిల్లర మల్లర సమ్మెలు, ఫ్యాక్టరీల్లో జరిగే తీవ్రమైన కొట్లాటలు, ప్రదర్శనలు వగైరా).

మన పత్రికా రచయిత యింకా యిలా కొనసాగిస్తాడు: "కార్మికులు ఫ్యాక్టరీల్లో మాత్రమే కాక, నగరాల్లో కూడా జీవిస్తారు" అంటూ ప్రత్యేకాంశంనుంచి సాధారణాంశా నికి వెళ్తాడు. ఈయన ప్రదర్శించిన సుసంగతత్వం స్వయానా బొరీస్ క్రిచేవ్‌స్కీకే గౌరవా పాదకంగా ఉంది. ఇంకా ఆయన మ్యునిసిపల్ కౌన్సిళ్లను, మ్యునిసిపల్ ఆస్పత్రులను, మ్యునిసిపల్ స్కూళ్ల వంటి వ్యవహారాలను గురించి ప్రస్తావించి, కార్మిక పత్రికలు మొత్తంగా మ్యునిసిపల్ వ్యవహారాలను అలక్ష్యం చెయ్యరాదని డిమాండుచేశాడు. ఈ డిమాండు — దాన్ని విడిగా తీసుకున్నప్పుడు — చాలా మంచిదే. అయితే, స్థానిక దినపత్రికలకు సంబంధించిన మన చర్చలు అతి తరచుగా శుష్కమైన గాలికబుర్లకు పరిమితమవడమన్నది యిందుకు ప్రత్యేకించి చాలా మంచి ఉదాహరణ. మొదటి విషయం, "స్వొబోద" కోరుతున్నట్లు మ్యునిసిపల్ వ్యవహారాలపై అంతటి సవివరమైన సమాచారంతో "గణనీయమైన సంఖ్యలో కార్మికులు కేంద్రీకృతమై ఉన్న ప్రతి చోటా" నిజంగానే వార్తాపత్రికలు వెలువడి నట్లయితే, మన రష్యన్ పరిస్థితుల్లో తప్పనిసరిగా యిది చిల్లరమల్లర విషయాలపట్ల శ్రద్ధ చూపడమే అవుతుంది, జారిస్టు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా అఖిల రష్యా వ్యాపిత విప్లవ దాడిని నీరుకార్చడానికే యిది దారితీస్తుంది. ఉన్న మ్యునిసిపల్ కౌన్సిళ్లను గురించి మానేసి, లేని పార్లమెంటులను గురించి విప్లవకారులు చాలా ఎక్కువగా మాట్లాడుతున్నా రన్న ప్రసిద్ధ వ్యాఖ్య మూలంగా ముందుకొచ్చిన ధోరణియొక్క మహా బలమైన మొలకలకు — పెరికి వేయబడక, మాటున దాగి వున్న లేక తాత్కాలికంగా అణచబడిన వాటికే — యిది పుష్టిని చేకూరుస్తుంది.[189] "తప్పనిసరిగా" అని నేనెందుకు అంటున్నానంటే, "స్వొబోద" దీన్ని కోరుకోవడం లేదనీ, దీనికి భిన్నంగా జరగాలనే అది కోరుకుంటున్నదనీ అనడం స్పష్టం. అయితే సత్సంకల్పాలే సరిపోవు. మన మొత్తం కార్యకలాపాలను దృష్టిలో పెట్టు

కుని, మ్యునిసిపల్ వ్యవహారాలను గురించి సరైన దృక్పథంలో మాట్లాడాలన్నప్పుడు, యీ దృక్పథాన్ని మొట్టమొదట స్పష్టంగా నిర్ధారణచేసుకోవాలి, దాన్ని సుస్థిరంగా స్థాపించుకోవాలి, అయితే యీ పని వాదనల ద్వారా కాక అనేక ఉదాహరణల ద్వారా జరగాలి; అప్పుడే యీ పంథా సంప్రదాయానికి వుండే స్థిరత్వాన్ని సంతరించుకుంటుంది. అయితే యిప్పటికి మనం యీ పనికి చాలా దూరంలో ఉన్నాం. అయినా కూడా, యీ పని ముందు చేసిన తర్వాత మాత్రమే, మనం దేశం మొత్తంమీద విస్తృత స్థాయిలో స్థానిక వార్తాపత్రికల నిర్వహణను గురించి ఆలోచించగలం, దాన్ని గురించి చర్చించగలం.

రెండో విషయం: మ్యునిసిపల్ వ్యవహారాలను గురించి నిజంగా బాగానూ, ఆసక్తికరంగానూ రాయడానికి ఆ సమస్యలను గురించిన పుస్తక జ్ఞానం ఉంటే సరిపోదు, ఆ సమస్యలను గురించిన ప్రత్యక్ష పరిజ్ఞానం ఉండాలి. అయితే, అలాంటి పరిజ్ఞానం కలిగిన సోషల్ డెమోక్రట్లు దాదాపు రష్యాలో ఎక్కడా లేరు. మ్యునిసిపల్ వ్యవహారాలను గురించీ, రాజ్య వ్యవహారాలను గురించీ వార్తాపత్రికల్లో (ప్రజానురంజకమైన చిన్నపుస్తకాల్లో కాదు) రాయగలగాలంటే, అందుకోసం వైవిధ్యపూరితమైన తాజా సమాచారాన్ని, సేకరించడం, దాన్ని సమర్థులైనవారిచేత రాయించడం అవసరం. అలాంటి సమాచారాన్ని సేకరించి, రాయాలంటే, ప్రాథమిక అధ్యయన బృందంలో వుండే "ఆదిమ ప్రజాస్వామ్య"మే సరిపోదు. దానిలో అందరూ అన్ని పనులూ చేస్తారు, అందరూ జనాభిప్రాయ సేకరణ నాటకాన్ని ఆడి తమని తాము ఉల్లాసపరచుకుంటారు. ఇందుకోసం దక్షులైన రచయితలూ, విలేకరులూ కావాలి. విస్తృత స్థాయిలో సంబంధాలు పెట్టుకుని, అన్ని రకాల "ప్రభుత్వ రహస్యాలనూ" (యీ రహస్యాలు తమకు తెలుసుననే రష్యన్ ప్రభుత్వోద్యోగులు విర్రవీగుతూ వుంటారు, కాని వాటినే అతి తేలికగా వాళ్ళు పైకి కక్కేస్తూ వుంటారు) తవ్విపైకి తీసే సామర్థ్యం కలిగిన, "తెరవెనక భాగోతాల" కూపీలు తియ్యగలిగిన సోషల్ డెమోక్రటిక్ రిపోర్టర్ల దండు కావాలి — వీళ్ళు అన్నీ తెలుసుకోవడాన్నీ, అన్ని చోట్లా ప్రత్యక్షమవడాన్నీ తమ "ఉద్యోగ ధర్మంగా" పరిగణించేవాళ్లై వుండాలి. మనం, అంటే అన్ని రకాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, జాతీయ పీడనకూ వ్యతిరేకంగా పోరాడే పార్టీ, అలాంటి సర్వం తెలిసిన జనాన్ని కనిపెట్టగలం, కనిపెట్టి, వాళ్లని పోగుచేసి, వాళ్లకి శిక్షణనిచ్చి, సమీకరించి, వాళ్లని పనిలోకి తరలించాలి — అయితే యిప్పటికింకా యివన్నీ జరగనే లేదు. అత్యధిక సంఖ్యాక ప్రాంతాల్లో యీ దిశగా ఒక్క చర్య కూడా తీసుకోబడకపోవడమే కాకుండా, చాలా తరచుగా యీ పని అవసరమన్న గుర్తింపు కూడా లోపిస్తోంది. మన సోషల్ డెమోక్రటిక్ పత్రికల్లో దౌత్య, సైనిక, మత, మ్యునిసిపల్, ఆర్థిక వగైరా, వగైరా చిన్నా, పెద్దా వ్యవహారాలపై ఉత్తేజకరమూ, ఆసక్తికరమూ అయిన వ్యాసాలు, లేఖలు, ఖండనలు వుండే రచనల కోసం కంచుకాగడా వేసి వెతకండి. ఈ విషయాలను గురించి మీకు వాటిలో

దాదాపు ఏమీ వుండదు, లేక అతి స్వల్పంగా మాత్రమే వుంటుంది.* అందుకనే ''గణనీయమైన సంఖ్యలో కార్మికులు కేంద్రీకృతమై ఉన్న ప్రతి చోటా'' ఫ్యాక్టరీల్లోనూ, మ్యునిసిపల్ కౌన్సిళ్లలోనూ, ప్రభుత్వంలోనూ జరిగే చెడుగులను బట్టబయలు చేసే వార్తాపత్రికల ఆవశ్యకతను గురించి ''ఎవరైనా నా దగ్గరకు వచ్చి, చాలా సొగసుగా ఆహ్లాదకరంగా వుండే మాటలు చెప్పినప్పుడల్లా, నా ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకినట్లుంటుంది నాకు.''

కేంద్ర పత్రికమీద స్థానిక పత్రికల ప్రాబల్యం అన్నది దారిద్ర్యానికైనా సూచన కావచ్చు, లేక ఐశ్వర్యానికైనా సూచన కావచ్చు. ఉద్యమం భారీ ఉత్పత్తికి అవసరమైన శక్తుల్ని యింకా అభివృద్ధి చెయ్యనప్పుడు, అనిపుణ పద్ధతుల్లోనే పడి యింకా పైకి రాలేక గిలగిల కొట్టుకుంటున్నప్పుడు, ''ఫ్యాక్టరీ జీవితానికి సంబంధించిన చిల్లర వివరాలు'' అనే ఊబిలో కూరుకుపోయి ఉన్నప్పుడు — అది దారిద్ర్య సూచకం అవుతుంది. బహిర్గతం చేసే ఖండనలను సమగ్ర కార్యక్రమాన్నీ, సమగ్ర ఆందోళన కార్యక్రమాన్నీ నిర్వహించడంలో ఉద్యమం పూర్తిగా ఆరితేరినప్పుడూ, కేంద్ర పత్రికకు తోడు అనేక స్థానిక పత్రికలను కూడా ప్రచురించడం ఉద్యమానికి అవసరమైనప్పుడూ అది ఐశ్వర్య సూచకం అవుతుంది. ఈనాటి రష్యాలో స్థానిక పత్రికల ప్రాబల్యం అన్నది, దారిద్ర్య సూచకమో, లేక ఐశ్వర్య సూచకమో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. నా మటుకు నేను, దురవగాహనకి తావు లేకుండా ఉండేందుకుగాను, నా నిర్ణయాన్ని కచ్చితంగా సూత్రీకరించాలని కోరుతున్నాను. ఇప్పటిదాకా, మన స్థానిక శాఖల్లో అధిక సంఖ్యాక శాఖలు దాదాపు పూర్తిగా స్థానిక వార్తాపత్రికల దృష్ట్యా మాత్రమే ఆలోచించాయి, తమ కార్యకలాపాల్లో అత్యధిక భాగాన్ని యీ పనికే అంకితం చేశాయి. ఇది సరైనది కాదు — యిందుకు పూర్తి భిన్నంగా జరిగివుండాల్సింది.

---

* అందుకనే చాలా మంచి స్థానిక పత్రికల ఉదాహరణ సైతం మన దృక్పథాన్నే పూర్తిగా బలపరుస్తోంది. ఉదాహరణకు, ''యూజ్నియ్ రబోచి''[190] చాలా మంచి పత్రిక. సూత్రరీత్యా అస్థిరత్వ దోషానికి అదెన్నడూ గురికాలేదు. కాని అది సకాలంలో సక్రమంగా వెలువడక పోవడంవల్లా, దానిపై పోలీసు దాడులు తరుచుగా జరగడంవల్లా, స్థానిక ఉద్యమానికి తను చెయ్యాలనుకున్న సేవను అది చెయ్యలేకపోయింది. ఉద్యమానికీ, విస్తృత రాజకీయ ఆందోళనకూ సంబంధించిన మూల సమస్యలను సూత్రరీత్యా వివరించే పని — యీ పని మన పార్టీకి అతి జరూరుగా అవసరం — ఆ స్థానిక పత్రికకి మరీ తలకు మించిన పనిగా తేలింది. అది ప్రచురించిన సమాచారానికి — ఉదాహరణకు గని యజమానుల మహాసభను గురించీ, నిరుద్యోగాన్ని గురించీ వగైరా—ప్రత్యేకమైన విలువ వుంది. నిజానికి అది స్థానిక సమాచారం కాదు, ఒక్క దక్షిణాదికే కాకుండా, యావత్తు రష్యాకీ దాని అవసరం ఉంది. మన సోషల్ డెమొక్రటిక్ పత్రికల్లో దేనిలోనూ అలాంటి వ్యాసాలు వెలువడలేదు.

స్థానిక పార్టీ శాఖల్లో అధిక సంఖ్యాక శాఖలు ప్రధానంగా ఒక అఖిల రష్యా పత్రిక ప్రచురణను గురించి ఆలోచించి, తమ కార్యకలాపాలను ప్రధానంగా ఆ పనికి అంకితం చెయ్యాలి. ఈ పని జరిగేదాకా, సమగ్రమైన ఆందోళనతో కొంతమేరకైనా ఉద్యమానికి సేవజెయ్యగల ఏ ఒక్క పత్రికనూ కూడా మనం స్థాపించ లేము. అయితే యీ పని జరిగినప్పుడు, ఆవశ్యక కేంద్ర పత్రికకీ, ఆవశ్యక స్థానిక పత్రికలకీ మధ్య సహజమైన సంబంధాలు వాటంతట అవే ఏర్పడతాయి.

* * *

స్థానిక కృషిపై మొగ్గును అఖిల రష్యా కృషిపైకి మళ్లించాలన్న నిర్ధారణ, ప్రత్యేకించి ఆర్థిక పోరాట రంగానికి వర్తించదన్నట్లు పైకి కనిపిస్తుంది. ఈ ఆర్థిక పోరాటంలో, విడివిడి యజమానులూ, యజమానుల బృందాలే కార్మికుల ప్రత్యక్ష శత్రువులు. రాజకీయ పోరాటంలో మన ప్రత్యక్ష శత్రువైన రష్యన్ ప్రభుత్వానికి అతి చిన్న విషయాల్లో కూడా ఒకే ఒక అభీష్టం మేరకు నడిచే, శుద్ధ సైనికమూ, కచ్చితంగా కేంద్రీకృతమూ అయిన వ్యవస్థ వుండగా, ఈ యజమానులకు అటువంటి సంఘటన యే మాత్రమూ లేదు.

అయితే విషయం యిది కాదు. ఇంతకు ముందే పదే పదే చెప్పినట్లు, ఆర్థిక పోరాటమన్నది ట్రేడ్‌యూనియన్ పోరాటం. ఈ కారణంగా దానికోసం కార్మికుల్ని, వారు వారు పనిచేసే చోట్లనుబట్టి మాత్రమే కాకుండా, వాళ్ల వృత్తులనుబట్టి సంఘటితం చెయ్యాల్సి వుంటుంది. మన యజమానులు రకరకాల కంపెనీలలోనూ, సిండికేట్లలోనూ ఎంత ఎక్కువ వేగంగా సంఘటితులవుతున్నారో అంత ఎక్కువ వేగంగా కార్మికులను వృత్తులవారీగా సంఘటితం చెయ్యడం అవసరం. ఈ మాదిరి సంఘటన కృషికి అఖిల రష్యా ట్రేడ్‌యూనియన్లకు నాయకత్వం వహించగల విప్లవకారుల ఏకైక అఖిల రష్యా సంఘం ఉండటం అవసరం, కాని యీ కృషికి మనం చెల్లా చెదరుగా ఉండటం, మన అనిపుణత పెద్ద ఆటంకాలుగా ఉన్నాయి. ఇందుకోసం ఎలాంటి సంఘం అవసరమో నేను పైన వర్ణించాను; ఇప్పుడిక నేను, మన పత్రికల సమస్యపైన యీ సందర్భంగా, యింకొద్ది మాటలు జోడిస్తాను.

ప్రతి ఒక్క సోషల్ డెమొక్రటిక్ వార్తాపత్రికలోనూ, ట్రేడ్‌యూనియన్ (ఆర్థిక) పోరాటానికి అంకితమైన ఒక ప్రత్యేక విభాగం అవసరమన్న విషయంలో దాదాపు ఏ ఒక్కరికీ సందేహం ఉండదు. కాని, ట్రేడ్‌యూనియన్ ఉద్యమాభివృద్ధి మూలంగా ట్రేడ్ యూనియన్ పత్రికల స్థాపనను గురించి తప్పని సరిగా ఆలోచించవలసిన పరిస్థితి కలుగుతోంది. అయితే, ఏ కొద్ది సందర్భాల్లోనో తప్ప, రష్యాలో ప్రస్తుతం ట్రేడ్‌యూనియన్ పత్రికల స్థాపన సమస్యే లేదని, మాకు అనిపిస్తోంది. అవి మనకొక విలాసం, అనేక సందర్భాల్లో మనకి రోజువారీ తిండే గగనమైపోతోంది. మనం రహస్య కార్యకలాపాలు జరుపుతున్న పరి

స్థితులకు అనువుగా వుండే ట్రేడ్‌యూనియన్ పత్రికల రూపమూ, మనకి తక్షణమే కావల సినవి ఏమిటంటే, ట్రేడ్‌యూనియన్ పుస్తకాలు. అవి చట్టసమ్మతమైన,* రహస్య సమాచారాన్ని పోగుచేసి, దాన్ని క్రమబద్ధంగా విభజించాలి. ఆయా వృత్తుల్లో కార్మికుల జీవిత పరిస్థితుల్ని గురించి; ఈ విషయంలో రష్యాలోని వివిధ ప్రాంతాల్లో వున్న వ్యత్యాసాలను గురించీ; ఆయా

---

* ఈ సందర్భంగా చట్టసమ్మతమైన సమాచారానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. అలాంటి సమాచారాన్ని సేకరించి, దాన్ని క్రమబద్ధంగా వినియోగించుకోవడంలో మనం ప్రత్యేకించి వెనకబడివున్నాం. పూర్తిగా చట్టసమ్మతమైన సమాచారంపైనే ఆధారపడి, ఒక ట్రేడ్‌యూనియన్ చిన్న పుస్తకాన్ని ఎలాగో ఒకలాగ తంటాలుపడి తయారుచెయ్య వచ్చు, కాని, పూర్తిగా రహస్య సమాచారంపైనే ఆధారపడి అలా చెయ్యలేం. ''రబోచయ మీస్ల్'' ప్రచురణల్లో చర్చింపబడిన మాదిరి సమస్యలపైన[191] కార్మికుల దగ్గర్నుంచి రహస్య సమాచారాన్ని పోగుచెయ్యడంలో మనం విప్లవకారుల శక్తిని కొల్లలుగా వృథా చేస్తున్నాం (యీ విషయంలో విప్లవకారుల స్థానాన్ని చట్టసమ్మతంగా పనిచేసే కార్యకర్తలు తేలికగా భర్తీచెయ్యవచ్చు), అయినా కూడా మనకెన్నడూ మంచి సమాచారం లభ్యంకావడం లేదు. అతి తరచుగా ఓ పెద్ద ఫ్యాక్టరీలోని ఒకేఒక విభాగాన్ని గురించి మాత్రమే, అందునా దాదాపు ఎప్పుడూ ఆర్థిక ఫలితాలను గురించి మాత్రమే గాని, తన పనికి సంబంధించిన సాధారణ పరిస్థితులూ, ప్రమాణాలూ తెలియని కార్మికుడికి, ఫ్యాక్టరీ ఆఫీసు సిబ్బందికీ, ఇన్‌స్పెక్టర్లకీ, డాక్టర్లు మొదలైన వాళ్లకీ ఉన్నంత విషయ పరిజ్ఞానం ఉండదు. అలాంటి విషయ సామగ్రి పత్రికల్లో పడే చిల్లరమల్లర వార్తల్లోనూ, ప్రత్యేకమైన పారిశ్రామిక, వైద్య, జేమ్‌స్త్వో ప్రచురణల్లోనూ, తదితర ప్రచురణల్లోనూ చెదిరి వుంటుంది.

నా ''మొదటి అనుభవం'' నాకు బాగా జ్ఞాపకం వుంది, అలాంటిది మళ్లీ కలగా లని నేను కోరుకోను. నా దగ్గరకి ఓ కార్మికుడు తరచుగా వస్తూండేవాడు. అతను పని చేస్తున్న బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలోని పరిస్థితులకు సంబంధించిన విశేషాలను గురించి నేనతన్ని చాలా వారాలపాటు ''గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేశాను.'' నిజంగానే, చాలా శ్రమ పడ్డ తర్వాత సాధారణ వివరాలకు అవసరమైన సమాచారాన్ని (ఆ ఒక్క ఫ్యాక్టరీకి సంబం ధించి) నేను సంపాదించగలిగాను. కాని ఈ యింటర్వ్యూ చివర ఆ కార్మికుడు తన నుదుటి మీద చెమటను తుడుచుకుని, చిరునవ్వు నవ్వుతూ నాతో ''మీ ప్రశ్నలకి జవాబులు చెప్పడం కన్న ఓవర్‌టైమ్ పనిచెయ్యడమే తేలిక'' అన్నాడు.

మన విప్లవ పోరాటాన్ని మనం ఎంత జోరుగా సాగిస్తే, ట్రేడ్‌యూనియన్ కార్యక లాపాల్లో ఒక భాగాన్ని ప్రభుత్వం అంత ఎక్కువగా చట్టసమ్మతం చెయ్యవలసిన పరిస్థి తిలో పడుతుంది; తద్వారా మన భుజాలమీద వున్న భారం కొంత తగ్గుతుంది.

వృత్తుల్లోని కార్మికులు ముందుకు తెచ్చిన ప్రధానమైన డిమాండ్లను గురించీ; ఆ వృత్తికి వర్తించే శాసనాల లొసుగులను గురించీ; ఆ వృత్తిలోని కార్మికులు నిర్వహించిన ఆర్థిక పోరాటపు ప్రముఖ ఘట్టాలను గురించీ; వాళ్ల ట్రేడ్‌యూనియన్ సంఘపు ఆరంభ, ప్రస్తుత స్థితులను గురించీ; భవిష్యత్తులో వాటి అవసరాలు మొదలైన వాటిని గురించీ ఈ పుస్తకాలు చర్చించాలి. మొదటి సంగతేమిటంటే, అలాంటి చిన్న పుస్తకాల మూలంగా, మన సోషల్ డెమోక్రటిక్ పత్రికలకు, ఆయా వృత్తుల్లోని కార్మికులకు మాత్రమే ఆసక్తిజనకమైన బోలెడు వివరాలను ప్రచురించవలసిన భారం తగ్గిపోతుంది. రెండో సంగతి, ట్రేడ్‌యూనియన్ పోరాటంలో మన అనుభవ ఫలితాలను అవి నమోదుచేస్తాయి, సేకరింపబడి అనేక కరపత్రాల్లోనూ, చిల్లర మల్లర లేఖల్లోనూ ప్రస్తుతం అక్షరాలా చెల్లాచెదురైపోతున్న సమాచారాన్ని అవి భద్రపరుస్తాయి; ఈ సమాచారాన్ని అవి సామాన్యీకరిస్తాయి. మూడవ సంగతి, ఈ చిన్న సమాచార పుస్తకాలు ఆందోళనకారులకు మార్గదర్శకంగా పనిచేస్తాయి. పని పరిస్థితులు సాపేక్షంగా నెమ్మదిగా మారడమూ, ప్రత్యేకమైన ఒక వృత్తిలో కార్మికుల డిమాండ్లు చాలా కాలంపాటు ఒకే విధంగా ఉండటమే (ఉదాహరణకు, మాస్కో పేట నేత కార్మికుల 1885 నాటి డిమాండ్లనూ,[192] సెంట్ పీటర్స్‌బుర్గ్ నేత కార్మికుల 1896 నాటి డిమాండ్లనూ[193] సరిపోల్చిచూడండి) యిందుకు కారణం. అటువంటి డిమాండ్లనూ, కోర్కెలనూ సేకరించి ఉంచితే, వెనకబడిన ప్రాంతాల్లోనో, లేక కార్మికుల్లోని వెనుకబడిన శ్రేణుల్లోనో పనిచేసే ఆందోళనకారులకు, అవి చక్కటి కరదీపికలుగా ఉపయోగిస్తాయి. ఒకానొక ప్రాంతంలో విజయవంతంగా జరిగిన సమ్మెల ఉదాహరణలు, ఒకానొక ప్రాంతంలో సాధించుకోబడిన ఉన్నత జీవన ప్రమాణాలకూ, మెరుగైన పని పరిస్థితులకూ సంబంధించిన సమాచారం, యితర ప్రాంతాల్లోని కార్మికులు వాటి కోసం మళ్లీ మళ్లీ పోరాటాలు జరిపేందుకు ప్రోత్సాహాన్ని యిస్తాయి. నాల్గవ సంగతి, ట్రేడ్‌యూనియన్ పోరాటాన్ని సామాన్యీకరించడం ద్వారా రష్యన్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమానికీ సోషలిజానికీ మధ్య సంబంధాన్ని సుదృఢం చేసి, అదే సమయంలో మన ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలు మొత్తంగా మన సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాల్లో మరీ తక్కువ స్థానాన్ని గాని, మరీ ఎక్కువ స్థానాన్ని గాని ఆక్రమించకుండా వుండేటట్టు సోషల్ డెమోక్రట్లు చూస్తారు. ఇతర పట్టణాల్లోని శాఖలతో సంబంధాలు లేకుండా పోయిన స్థానిక శాఖకి, యీ విషయంలో సరైన సమతూకాన్ని నిలుపుకోవడం చాలా కష్టమూ, కొన్ని సందర్భాల్లో దాదాపు అసంభవమూ అయిపోతుంది (''రబోచయ మీస్ల్'' ఉదాహరణను తీసుకుంటే, ట్రేడ్‌యూనియనిజం దిశలో ఎంత భయానకమైన అతిశయ ప్రాధాన్యం యివ్వబడిందో రుజువవుతుంది). కాని, మార్క్సిజం పునాదిమీద అచంచలంగా నిలబడి, మొత్తం రాజకీయ పోరాటాన్నంతనీ నడుపుతూ, వృత్తి

ఆందోళనకారుల బృందాన్ని కలిగిన విప్లవకారుల అఖిల రష్యా సంఘానికి సరైన సమతూకాన్ని నిర్ణయించుకోవడం ఎన్నడూ కష్టం కాదు.

## V

## అఖిల రష్యన్ రాజకీయ పత్రిక కోసం "పథకం"

బి. క్రిచేవ్‌స్కీ "సిద్ధాంతాన్ని ఆచరణనుంచి దూరంచెయ్యడం ద్వారా మనం దాన్నొక పిడివాదంగా తయారుచేసే" ధోరణిలో ఉన్నామని మనపైన ఆరోపణచేసి ("రబోచెయె దేలొ," సంచిక 10, పేజి 30), "ఈ సందర్భంగా 'ఇస్క్రా' చేసిన అత్యంత దారుణమైన పొరపాటు మొత్తం పార్టీ నిర్మాణానికి అది ప్రతిపాదించిన పథకం" (అంటే "దేనితో ప్రారంభించాలి?" శీర్షికతో వెలువడిన వ్యాసం) అని రాశాడు. "సముజ్జ్వలమూ, సమగ్రమూ అయిన భావాల ప్రచారంతో పోల్చి, నీరస దైనందిన పోరాట పురోగతి ప్రాముఖ్యాన్ని కించపరిచే 'ఇస్క్రా' ధోరణి... సంచిక 4లో 'దేనితో ప్రారంభించాలి?' అనే శీర్షికతో వెలువడిన వ్యాసంలో, పార్టీ నిర్మాణ పథకం పరాకాష్ఠ పొందిందని మర్తీనొవ్ వర్ణించాడు (అదే గ్రంథం, పేజి 61). చిట్టచివర, యీ "పథకానికి" వ్యతిరేకంగా కోపం వెళ్లగక్కిన వాళ్ల బృందగానంలో యిటీవల ఎల్. నదేజ్దిన్ కూడా చేరాడు (కొటేషన్ గుర్తులు వ్యంగ్యం కోసం ఉద్దేశింపబడ్డాయి). నా చేతికి యిప్పుడే అందిన, "విప్లవ ప్రాంగణం" శీర్షికతో ఆయన రచించిన చిన్న పుస్తకంలో ("విప్లవ సోషలిస్టు గ్రూపు" "స్వొబోద" ప్రచురించిన యీ పుస్తకంతో మనకు యింతకు ముందే పరిచయమయింది), ఆయన యిలా అంటాడు (పేజి 126): "అఖిల రష్యన్ వార్తాపత్రికచేత కూడగట్టబడిన సంఘం గురించి యిప్పుడు మాట్లాడటమంటే, అర్థం కార్యాలయంలో కూర్చుని ఊహించుకునే భావాలనూ, కార్యకలాపాలనూ ప్రచారం చెయ్యడమే," యిది వాస్తవాలతో పరిచయంలేని "పుస్తక పరిజ్ఞానమే" తప్ప వేరేమీ కాదు, వగైరా.

మన టెరరిస్టు "నీరస దైనందిన పోరాట పురోగతి" సమర్థకులతో ఏకీభవించడమన్నది ఆశ్చర్యకర విషయమేమీ కాదు, ఎందుకంటే, వాళ్లిద్దరికీ మధ్య వున్న సన్నిహిత సంబంధానికి గల మూలాన్ని గురించి రాజకీయ, నిర్మాణ సంబంధమైన ప్రకరణాల్లో నేను ఆరాతీసే వున్నాను. అయితే యిక్కడ నేనొక వాస్తవాన్ని పాఠకుల దృష్టికి తీసుకురావలసి వుంది: తనకి నచ్చని వ్యాసంలోని ఆలోచనా ధారని గ్రహించేందుకూ, సూటిగా దానికి జవాబిచ్చేందుకూ చిత్తశుద్ధితో ప్రయత్నించినవాడు ఎల్. నదేజ్దిన్ ఒక్కడే. కాగా "రబో

చెయె దేలో'' విషయాంశానికి సంబంధించి చెప్పిందేమీ లేకపోగా, అసలు సమస్యను అయుక్తమైన, బూటక చతురోక్తులతో గందరగోళ పరిచేందుకు మాత్రమే ప్రయత్నించింది. ఈ పని సంతోషకరమైనది కాకపోయినా, యీ ఔగేయన్ గుర్రపు శాలని శుభ్రం చేసేందుకు[194] మనం కొంత కాలాన్ని వ్యయం చెయ్యవలసి వుంటుంది.

## అ) ''దేనితో ప్రారంభించాలి?'' వ్యాసం ఎవరికి కోపం కలిగించింది?*

''రబోచెయె దేలో'' నాపై విసిరిన వ్యర్థారోపణల్లోనూ, చేసిన ధాం ధూముల్లోనూ కొన్నింటిని మీ ముందు ఉంచుతున్నాను: ''పత్రిక పార్టీని నిర్మించదు, పార్టీయే వార్తాపత్రికని నిర్మిస్తుంది....'' ''పార్టీకి అతీతమైనదిగా, దాని అదుపుకి వెలిగా, తనకి ప్రత్యేక ఏజెంట్ల సిబ్బంది వుండడం పుణ్యమా అని పార్టీ సంబంధం లేని స్వతంత్రమైన పత్రిక...'' కావాలని కోరుకుంటోంది. ''తను ఏ పార్టీకైతే చెంది వున్నదో, ఆ పార్టీకి యీ నాడున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ శాఖల అస్తిత్వాన్నే 'ఇస్క్రా' మరచిపోవడం విడ్డూరం కాక మరేమిటి?...'' ''సుదృఢమైన సూత్రాలూ, తదనుగుణమైన ప్లానూ ఎవరికైతే ఉన్నాయో వాళ్లే పార్టీ వాస్తవ పోరాటపు నిర్దేశకులై పార్టీకి తమ పథకాన్ని ఆదేశిస్తారు....'' ''ఈ పథకం మన క్రియాశీల, సమరశీల పార్టీ శాఖలను అంధకారంలోకి నెట్టి, ఏజెంట్ల వల యాన్త్రికదాన్ని అమల్లోకి తేవాలని వాంఛిస్తోంది....'' '''ఇస్క్రా' పథకం అమలుజరపబడినట్లయితే, యిప్పుడిప్పుడే రూపుదాలుస్తున్న రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోతుంది....'' ''ప్రచార సాధనంగా ఉండవలసిన ఒక పత్రిక యావత్తు ప్రత్యక్ష విప్లవ పోరాటానికీ అదుపూ అద్దూ లేని నియంత కావాలని

---

* ''పన్నెండేళ్లు'' అన్న సంకలనంలో, 5వ ప్రకరణంలోని 'అ' విభాగాన్ని లెనిన్ తీసేసి యీ కింది వివరణను యిచ్చాడు: ''విభాగం అ) '''దేనితో ప్రారంభించాలి?'' వ్యాసం ఎవరికి కోపం కలిగించింది?' 'హుకుములు జారీ చెయ్యడం' మొదలైన 'ఇస్క్రా' ప్రయత్నాల సమస్యపై 'రబోచెయె దేలో'తోనూ, బుంద్‌తోనూ వాదోపవాదాలకే యీ విభాగం పరిమితమైనందున ప్రస్తుత ముద్రణనుంచి మినహాయించబడింది. ఈ విభాగం యితర విషయాలతోబాటు, స్వయంగా బుంద్ (1898–99)లో, పార్టీ కేంద్ర పత్రికను పునరుద్ధరించమనీ, ఒక 'సాహిత్య ప్రయోగశాల'ను ఏర్పాటుచెయ్యమనీ 'ఇస్క్రా' సభ్యులకు విజ్ఞప్తిచేసిందన్న విషయాన్ని తెలియజేస్తుంది.''

కోరుకుంటోంది....'' ''ఒకానొక స్వయంపాలిత సంపాదకవర్గానికి తను పూర్తిగా లొంగి వుండాలన్న సూచనపట్ల, మన పార్టీ ఎలా ప్రవర్తించాలి?'' వగైరా, వగైరా.

పైన యివ్వబడిన భాగాల్లోని మాటలనూ, ధోరణినీ బట్టి, ''రబోచెయె దేలొ''కి కోపం కలిగిందన్న విషయాన్ని పాఠకుడు గ్రహించుకోగలడు. ఈ కోపం తన కోసం కాదు, మన పార్టీ శాఖల కోసం, కమిటీల కోసమూను – వాటిని ''ఇస్క్రా'' అంధకారంలోకి తరిమెయ్యాలనీ, వాటి జాడలు కూడా లేకుండా సమూలంగా తుడిచిపెట్టెయ్యాలనీ కోరు తోందని ''రబోచెయె దేలొ'' ఆరోపిస్తోంది. ఎంత దారుణం! అయితే యిక్కడొక చిత్ర మైన విషయాన్ని గమనించాల్సివుంది. ''దేనితో ప్రారంభించాలి?'' అన్న వ్యాసం 1901 మేలో వెలువడగా, ''రబోచెయె దేలొ''లోని వ్యాసాలు 1901 సెప్టెంబరులో వెలువడ్డాయి. మనం యిప్పుడు 1902 జనవరి మధ్యలో వున్నాం. ఈ ఐదు మాసాల కాలంలో (సెప్టెం బరుకి ముందూ, తర్వాతా), ఒక్కగానొక్క కమిటీ గాని, ఒక్కగానొక్క పార్టీ శాఖ గాని తమను చీకటిలోకంలోకి తరిమెయ్యాలని ప్రయత్నించే యీ రాక్షసికి వ్యతిరేకంగా గొంతెత్తి లాంఛన ప్రాయమైన నిరసనను కూడా తెలియజెయ్యలేదు! కానైతే యీ అయిదు నెలల్లో ''ఇస్క్రా''లోనూ, అనేక స్థానిక, స్థానికేతర ప్రచురణల్లోనూ రష్యాలోని అన్ని ప్రాంతాల నుంచీ, డజన్లకొద్దీ, వందలకొద్దీ లేఖలు ప్రచురింపబడ్డాయి. చీకటిలోకంలోకి తరిమెయ్య బడే వాళ్లకి ఆ విషయం తెలియకపోవడం, వాళ్లు కోపం తెచ్చుకోకపోవడం, కాని యీ మూడో పెద్ద మనిషికి కోపం రావడం – యిదేం చిత్రం?

దానికి కారణం ఏమిటంటే, ఆ కమిటీలూ, యితర పార్టీ శాఖలూ వాస్తవ కార్య కలాపాల్లో నిమగ్నమై వున్నాయి. అవి ''ప్రజాస్వామ్యతత్వ'' నాటకాన్ని ఆడటం లేదు. ఆ కమిటీలు ''దేనితో ప్రారంభించాలి?'' అన్న వ్యాసాన్ని చదివాయి, ''ఏ పథకం ప్రకారం కృషిచేస్తే పార్టీ శాఖల నిర్మాణం సర్వతోముఖంగా జరుగుతుందో, అలాంటి నిర్దిష్టమైన పథకాన్ని రూపొందించేందుకు'' అందులో ప్రయత్నం జరిగిందన్న సంగతిని అవి చూశాయి. అటువంటి సంఘ నిర్మాణ ఆవశ్యకత వుందనీ, దాని నిర్మాణ పథకం నిర్దుష్టంగా ఉందనీ తనకు విశ్వాసం కలిగేదాకా, యీ ''పక్షాలు'' అన్నింటిలోనూ ఏ ఒక్కటీ ''దాన్ని నిర్మించ పూనుకోవాలని'' కలలో కూడా అనుకోవు. ''ఇస్క్రా''లో యీ కింది విధంగా చెప్పినవాళ్ల సాహసంపట్ల ''కోపం తెచ్చుకోవాలని'' సహజంగానే వాటికి ఎన్నడూ తట్టలేదు: ''ఈ సమస్యకి వున్న తక్షణ ప్రాముఖ్యం దృష్ట్యా, మా వంతుకి మేము, ప్రస్తుతం అచ్చుకి సిద్ధ పరచబడుతున్న చిన్న పుస్తకంలో మరింత వివరంగా చర్చించబడిన ఒక పథకపు రేఖా చిత్రాన్ని కామ్రేడ్సు ముందు వుంచుతున్నాం.'' జనం తాము చేసే పనిపట్ల చిత్తశుద్ధి కలిగివున్నప్పుడు, యీ విషయాన్ని వాళ్లు గ్రహించలేరా? తమకి సమర్పించబడిన పథకాన్ని తాము ఆమోదించినట్లయితే, కామ్రేడ్సు దాన్ని అమలుపరుస్తారు. అయితే వాళ్లు తాము

''పరాధీనులు'' కాబట్టి అలా చెయ్యడం గాక, మన ఉమ్మడి లక్ష్యానికి అది ఆవశ్యకమని తమకు విశ్వాసం కలిగితేనే అలా చేస్తారు. ఒకవేళ వాళ్లు దాన్ని ఆమోదించకపోయినట్ల యితే, అప్పుడు ఆ ''రేఖా చిత్రం'' (డాంబికమైన పదమేమో కదూ?) కేవలం ''రేఖా చిత్రం'' గానే ఉండిపోతుంది, అంతే కదా? ఒక పథకపు రేఖా చిత్రంమీద కుప్పి పట్టి, దాన్ని ఈకకి ఈక, తోకకి తోక పీకి, దాన్ని తిరస్కరించవలసిందిగా కామ్రేడ్సుకి సలహా యివ్వడం ద్వారానే కాకుండా, విప్లవ వ్యవహారాల్లో అనుభవంలేని వాళ్లని, కేవలం పథక కర్తలు ''శాసించ'' సాహసిస్తున్నారనీ, వాళ్లు ''సర్వోన్నత నిర్దేశకులు''గా ముందు కొస్తున్నారన్న ప్రాతిపదికపైన మాత్రమే, రెచ్చగొట్ట పూనుకోవడం బూకరింపు కాక మరేమిటి? స్థానిక కార్యకర్తలను విస్తృతాభిప్రాయాలు, కర్తవ్యాలు, పథకాలు వగైరాల దిశగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాన్ని నిరోధిస్తే మన పార్టీ అభివృద్ధి చెంది, పురోగమించ గలదా? — అందునా యీ అభిప్రాయాలు తప్పు అన్న కారణంగా కాక, మనల్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ''కోర్కె''యే ''కోపం కలిగించడం'' సమంజసం కాగలదా? ఎల్. నదేజ్దిన్ కూడా మన పథకాన్ని ఈకకి ఈక, తోకకి తోక పీకాడు. కాని ఆయన కేవలం అమాయ కత్వ కారణంగా గాని, రాజకీయాభిప్రాయాల్లో ఆదిమత్వం కారణంగా కాని అలాంటి బూక రింపులకు దిగజారలేదు. ఆయన మొదట్లోనే, మేం ''పార్టీమీద ఇన్‌స్పెక్టరుగిరీ''ని నెల కొల్పుకోవాలని ప్రయత్నిస్తున్నామన్న ఆరోపణను గట్టిగా తిరస్కరించాడు. అందుకనే పథకంమీద నదేజ్దిన్ విమర్శకు, దాని యోగ్యతాయోగ్యతలను బట్టి, జవాబు చెప్పాల్సి వుంది. అదే సమయంలో, ''రబోచెయె దేలో''ను మనం తిరస్కారపూర్వకంగా ఉపేక్షించి వదిలెయ్యాలి.

కాని, ''నిరంకుశత్వం,'' ''లొంగుబాటు''లను గురించి గొంతుచించుకొని అరిచేటంత హీన స్థాయికి దిగజారే రచయితను తిరస్కార భావంతో అలక్ష్యం చేస్తున్నప్పటికీ, అలాంటి వాళ్లు తమ పాఠకుల మనసుల్లో సృష్టించే గందరగోళాన్ని చెదరగొట్టే కర్తవ్యంనుంచి యీ తిరస్కారభావం మమ్మల్ని విముక్తుల్ని చెయ్యదు. ఈ సందర్భంగా మేము ''విస్తృత ప్రజాస్వామ్యతత్వం'' వంటి ఊతపదాల స్వభావాన్ని ప్రపంచం ముందు స్పష్టంగా ప్రదర్శించ గలం. మేము కమిటీలను విస్మరిస్తున్నామనీ, వాటిని చీకటిలోకంలోకి నెట్టెయ్యడం వగై రాలకు ప్రయత్నిస్తున్నామనీ మాపైన ఆరోపణ చెయ్యబడింది. రహస్య గోపన ఆవశ్యకత కారణంగా, కమిటీలతో నిజంగా మాకున్న సంబంధాలను గురించి దాదాపు వాస్తవాలు నేటినీ పాఠకుల ముందు ఉంచజాలని పరిస్థితిలో, నేనీ ఆరోపణలకు సమాధానమెలా యివ్వ గలను? గుంపును రెచ్చగొట్టేందుకు ఉద్దేశింపబడిన తీవ్ర ఆరోపణలను విసిరే వ్యక్తులు మా కంటె తాము ముందున్నట్లు కనిపిస్తారు. ఇందుకు వాళ్ల సిగ్గుమాలినతనం, విప్లవకారునికి వున్న, విప్లవకారుడు పెట్టుకుంటున్న, లేక పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సంబం

ధాలను గురించి ప్రపంచపు దృష్టినుంచి మరుగుపరచడంలో అతనికి వున్న కర్తవ్యాన్ని వాళ్లు విస్మరించడమే కారణం. సహజంగానే, ''ప్రజాస్వామ్యతత్వ'' రంగంలో అలాంటి వాళ్లతో పోటీచేసేందుకు మేం ఎంతమాత్రమూ సిద్ధంగా లేము. పార్టీ వ్యవహారాలన్నింటి లోనూ ప్రవేశంలేని పాఠకుడికి సంబంధించినంతవరకు, నాకున్న కర్తవ్యాన్ని నేను ఒక్క విధంగా మాత్రమే నిర్వర్తించగలను. అదేమిటంటే, ఏమిటో, ఏమి జరుగుతోందో కాక, im Werden* దానిలో ఒక లేశమాత్రాన్ని, గతానికి చెందిన విషయంగా చెప్పడానికి వీలున్నదాన్ని పాఠకుడికి నేను చెప్తాను.

మేము ''వంచకులం'' అని బుంద్ సూచిస్తోంది;** ''దేశాంతర యూనియన్,'' పార్టీని నామ రూపాలు లేకుండా తుడిచిపెట్టాలని మేము ప్రయత్నిస్తున్నట్లు ఆరోపిస్తోంది. మహాశయులారా, గతానికి సంబంధించిన నాలుగు వాస్తవాలను జనానికి నేను వివరించి చెప్పినప్పుడు, మీకు పూర్తి సంతోషం కలుగుతుంది.

మొదటి వాస్తవం.*** మన పార్టీ సంస్థాపనలో ప్రత్యక్ష పాత్ర వహించి, పార్టీ సంస్థాపక మహాసభకు ప్రతినిధిని పంపిన ''పోరాట లీగుల్లో'' ఒకదాని సభ్యులు ''ఇస్క్రా'' గ్రూపుకి చెందిన ఒక సభ్యుడితో, కార్మికులను ఉద్దేశించి, మొత్తం ఉద్యమానికి పనికొచ్చే పద్ధతిలో వరుసగా కొన్ని పుస్తకాలు రచించే విషయంలో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. వరుసవారీ పుస్తకాల ప్రచురణకు సంబంధించిన ఆ ప్రయత్నం విఫలమైంది. అందుకోసం రచింపబడిన ''రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు,'' ''కొత్త ఫ్యాక్టరీ చట్టం'' అన్న చిన్న పుస్తకాలు డొంక తిరుగుడు మార్గంలో, పైవాళ్లద్వారా విదేశం చేరుకున్నాయి, అక్కడ అవి ప్రచురింపబడ్డాయి.

రెండో వాస్తవం. బుంద్ కేంద్ర కమిటీ సభ్యులు ''ఇస్క్రా'' గ్రూపు సభ్యుల్లో ఒకరికి ఒక ''సాహిత్య ప్రయోగశాల''ను – యిది బుంద్ అప్పట్లో పెట్టిన పేరు – ఏర్పాటు చెయ్యవలసిందిగా ప్రతిపాదించారు. ఇది జరగనిదే ఉద్యమం బాగా వెనకబడిపోతుందని ఆ ప్రతిపాదన చేసేటప్పుడు వాళ్లు పేర్కొన్నారు. ఈ సంభాషణల పర్యవసానంగా వెలువడినదే ''రష్యాలో కార్మికవర్గ లక్ష్యం''**** అన్న చిన్నపుస్తకం.

---

* జరగబోతుందో. – సం.

** ''ఇస్క్రా,'' సంచిక 8. జాతుల సమస్యపై నా వ్యాసానికి రష్యా, పోలండు దేశాల అఖిల యూదు సంఘపు కేంద్ర కమిటీ సమాధానం.

*** నేను ఉద్దేశపూర్వకంగానే యీ వాస్తవాలను, అవి సంభవించిన క్రమంలో యథాతథంగా యివ్వడం లేదు.[195]

**** ఈ చిన్న పుస్తకపు రచయిత యీ కింది విషయాన్ని తెలియజెయ్యవలసిందిగా

మూడో వాస్తవం. బుంద్ కేంద్ర కమిటీ, ఒక ప్రాంతీయ పట్టణంద్వారా ''ఇస్క్రా'' గ్రూపుకి చెందిన ఒక సభ్యుడి ముందు, పునరుద్ధరింపబడిన ''రబోచయ గజేత'' సంపాదకత్వ బాధ్యతను వహించవలసిందన్న ప్రతిపాదనను పెట్టింది. ఆ కామ్రేడ్ అందుకు అనుమతించాడని వేరే చెప్పనక్కర్లేదు. దరిమిలా యీ ప్రతిపాదనలో మార్పు వచ్చింది. సంపాదకవర్గ సంపుటిలో కొత్తగా వచ్చిన మార్పు మూలంగా, పత్రికకు రచనలు పంపవలసిందిగా ఆ కామ్రేడ్‌కు సూచింపబడింది. ఈ సూచనను కూడా ఆ కామ్రేడ్ ఆమోదించాడు. వ్యాసాలు పంపబడ్డాయి (వాటిని నేను భద్రపరచగలిగాను): ''మన కార్యక్రమం''— యిది బెర్న్‌స్టైన్ వాదాన్ని నేరుగా ఖండించి, చట్టసమ్మతమైన సాహిత్యంలోనూ, ''రబోచయ మీస్ల్''లోనూ వ్యక్తమవుతున్న పంథా మార్పుకి వ్యతిరేకత తెలియజేస్తుంది. ''మన తక్షణ కర్తవ్యం'' (''క్రమబద్ధంగా వెలువడి, స్థానిక గ్రూపులన్నింటితోనూ సన్నిహిత సంబంధాలు కలిగిన పార్టీ పత్రికను ప్రచురించడానికి;'' ప్రచలితంగా వున్న ''అనిపుణత్వ'' లోపాలు); ''తక్షణ సమస్య''— (ఒక ఉమ్మడి పత్రికను ప్రారంభించేందుకు ముందు స్థానిక గ్రూపుల కార్యకలాపాలను మొట్టమొదట అవసరం అన్న అభ్యంతరపు పరిశీలన; ''విప్లవ సంఘానికి గల'' సర్వోన్నత ప్రాముఖ్యం పైనా, ''నిర్మాణాన్నీ, క్రమశిక్షణనీ, రహస్య గోపన టెక్నిక్‌నీ అత్యున్నత స్థాయిదాకా మెరుగుపరచడం పైనా ఉటంకింపు''). ''రబోచయ గజేత''ను తిరిగి ప్రచురించాలన్న నిర్ణయం అమలు జరగలేదు, యీ వ్యాసాలు ప్రచురింపబడలేదు.

నాలుగో వాస్తవం. మన పార్టీ ద్వితీయ నియమిత మహాసభ సన్నాహక కమిటీ సభ్యుడొకడు ''ఇస్క్రా'' గ్రూపు సభ్యుడొకడికి మహాసభ కార్యక్రమాన్ని పంపి, పునరుద్ధరింపబడిన ''రబోచయ గజేత''కు ''ఇస్క్రా'' గ్రూపును సంపాదకవర్గ సభ్యులుగా పనిచెయ్యవలసిందిగా సూచించాడు. ప్రారంభ చర్య అనదగిన యీ సూచనను, యీ కామ్రేడ్ కూడా సభ్యుడైన కమిటీ, బుంద్ కేంద్ర కమిటీ ఆమోదించాయి. ''ఇస్క్రా'' గ్రూపుకి మహాసభ స్థల కాలాల సమాచారం అందజేయ్యబడింది (కొన్ని కారణాలవల్ల, తన ప్రతినిధిని పంపగలమన్న నమ్మకం లేక), అది మహాసభకి తన లిఖిత నివేదికను తయారుచేసింది. ఆ నివేదికలో, సర్వత్రా పూర్తి అవ్యవస్థ వ్యాపించి వున్న ప్రస్తుత పరిస్థితిలాంటి పరిస్థితిలో,

---

నన్ను కోరాడు. తన పూర్వపు చిన్న పుస్తకాల మాదిరిగానే దీన్ని కూడా ఆయన ''దేశాంతర యూనియన్''కి— దాని ప్రచురణల సంపాదకత్వ బాధ్యతను ''శ్రమ విమోచన'' గ్రూపు వహిస్తోందన్న ఉద్దేశంతో— పంపాడు (కొన్ని పరిస్థితుల కారణంగా, ఆయన అప్పట్లో— 1899 ఫిబ్రవరి— సంపాదకుల్లో వచ్చిన మార్పును తెలుసుకోలేకపోయాడు). ఈ చిన్న పుస్తకాన్ని త్వరలోనే లీగు[196] పునర్ముద్రిస్తుంది.

కేవలం కేంద్ర కమిటీని ఎన్నుకున్నంత మాత్రానసే ఐక్యతా సమస్య పరిష్కారం కాదనీ; ఇందుకు భిన్నంగా, ప్రస్తుతం ప్రచలితంగా వున్న రహస్య గోపన అభావం కారణంగా త్వరలోనే, పోలీసులు మెరుపుదాడి చేసి, మూకుమ్మడిగా అరెస్టులు చేసే అవకాశం వుందనీ, అటువంటి పరిస్థితిలో పార్టీ స్థాపనకు సంబంధించిన మహత్తర భావానికే ముప్పు వాటిల్లవచ్చుననీ; అందుకని, అన్ని కమిటీలకూ, తదితర అన్ని సంఘాలకూ పునరుద్ధరింపబడిన ఉమ్మడి పత్రికకు తోడ్పాటు నివ్వవలసిందిగా విజ్ఞప్తిచెయ్యడం ద్వారా ఆరంభం చెయ్యాలనీ, ఆ పత్రిక అన్ని కమిటీలకూ మధ్య నిజమైన సంబంధాలను నెలకొల్పి, మొత్తం ఉద్యమానికి అవసరమైన నాయకుల బృందమొకదానికి ఆచరణలో శిక్షణనిస్తుందనీ, ఆ బృందం పెరిగి, బలపడగానే, కమిటీలూ, పార్టీ దాన్ని కేంద్ర కమిటీగా అతి తేలికగా మార్చగలుగుతాయనీ సూచించబడింది. కాని, చాలా పోలీసు దాడులూ, అరెస్టులూ జరిగిన ఫలితంగా ఆ మహాసభ నిర్వహణ సాధ్యంకాలేదు. రహస్య గోపనావసరం దృష్ట్యా ఒక కమిటీ ప్రతినిధులతోబాటు కేవలం కొద్దిమంది కామ్రేడ్లు మాత్రమే చదివిన తర్వాత ఆ నివేదిక తగలబెట్టబడింది.

బుంద్ మేము దగాకోర్లమని అన్నప్పుడూ, లేక, ''రబోచెయె దేలో'' మేము కమిటీలను అంధకారంలోకి నెట్టేసేందుకు ప్రయత్నిస్తున్నామనీ, పార్టీ నిర్మాణం స్థానంలో ఒక్కగానొక్క పత్రిక ప్రతిపాదించే భావాలను ప్రచారంచేసే సంఘాన్ని ''ప్రవేశపెట్ట'' ప్రయత్నిస్తున్నామనీ ఆరోపించినప్పుడూ అవి అనుసరిస్తున్న పద్ధతుల స్వభావమేమిటో పాఠకులనే స్వయంగా నిర్ణయించుకోనియ్యండి. కమిటీలకే, అవి పదేపదే చేసిన విజ్ఞప్తుల మీదటే, సమీకృత కార్యకలాపాల కోసం నిర్దిష్టమైన ఒక ప్లానును ఆమోదించవలసిన ఆవశ్యకతను గురించి మేము నివేదికను సమర్పించాం. ''రబోచయ గజేత''కు పంపిన వ్యాసాల్లోనేమి, పార్టీ మహాసభకు సమర్పించిన నివేదికలోనేమి, పార్టీ (వాస్తవ) పునరుద్ధరణకోసం చొరవ తీసుకోగలిగినంత పలుకుబడిని పార్టీలో కలిగివున్నవారి విజ్ఞప్తి మేరకైతేనేమి మేమీ పథకాన్ని గురించి విపులీకరించినది సరిగా పార్టీ నిర్మాణం కోసమే. మమ్మల్ని కూడా కలుపుకుని, అధికారికంగా, పార్టీ కేంద్ర పత్రిక పునరుద్ధరణకోసం పార్టీ చేసిన రెండు ప్రయత్నాలు విఫలమైనాక మాత్రమే, మేము ఒక అనధికార పత్రికను ప్రచురించడం మా విధ్యుక్త ధర్మంగా భావించాం. ఈ మూడవ ప్రయత్నంతోనైనా, కేవలం ఊహాత్మక పథకాలను కాక, అనుభవ ఫలితాలను కామ్రేడ్ల ముందు ఉంచేందుకే మేమీ పని చేశాం. ఈనాడు యీ అనుభవ ఫలితాలు ప్రత్యక్షంగా అందరిముందూ ఉన్నాయి. కాగా, మేము మా విధ్యుక్త ధర్మాలను సరిగా అర్థం చేసుకున్నామో లేదో, సమీప గతానికి సంబంధించిన విషయాలతో పరిచయంలేనివారిని తప్పు దోవ పట్టించేందుకు – వాళ్ల యిలా చెయ్యడానికి కేవలం ఒక్కటే కారణం, కొందరికి ''జాతీయ'' సమస్యపై వాళ్ల అసంగతత్వాన్నీ, మిగిలినవారికి, సిద్ధాం

తాల విషయంలో వాళ్ల అనామోదయోగ్యమైన ఊగిసలాటనీ మేము ఎత్తిచూపడమే — తంటాలుపడుతున్నవారిని గురించి ఏమనుకోవాలో కార్మేడ్సు యిప్పుడు స్వయంగా నిర్ణయించుకోవచ్చు.

## ఆ) వార్తాపత్రిక సమష్టి ఆర్గనైజరుగా పనిచెయ్యగలదా?

"దేనితో ప్రారంభించాలి?" అన్న వ్యాసపు సారాంశం ఏమిటంటే, అది సరిగా యిదే ప్రశ్న ముందుకు తెచ్చి, దానికి ఔనని సమాధానమిస్తుంది. నాకు తెలిసినంతవరకు, యీ సమస్య సారాంశాన్ని గురించి చర్చించి, ఇది సరికాదని నిరూపించేందుకు ప్రయత్నించిన దల్లా ఒక్క ఎల్. నదేజ్దిన్ మాత్రమే. ఆయన వాదాన్ని పూర్తిగా యీ కింద యిస్తున్నాను:

"అఖిల రష్యన్ వార్తాపత్రిక ఆవశ్యకత ప్రశ్నను 'ఇస్క్రా' (సంచిక 4) ముందుకు తేవడం మాకు చాలా సంతోషం కలిగించింది; కాని యీ వ్యాసంతో యీ వ్యాస శీర్షిక 'దేనితో ప్రారంభించాలి?' అన్నది పొసుగుతుందని నేననుకోవడం లేదు. ఇది అత్యంత ముఖ్యమైన విషయమనడం నిస్సందేహం, కాని ఒక వార్తాపత్రిక గాని, సుబోధకమైన బోలెడు కరపత్రాలు గాని, లేక బండెడు ప్రకటనలు గాని, విప్లవ తరుణంలో సమరశీల పార్టీ శాఖకి ప్రాతిపదిక కాజాలవు. ఆయా ప్రాంతాల్లో బలమైన రాజకీయ పార్టీ శాఖలను నిర్మించేందుకు మనం పూనుకోవాలి. మనకి అలాంటి పార్టీ శాఖలు కొరతగా వున్నాయి; మనం యింతదాకా ప్రధానంగా జాగృతులైన కార్మికుల మధ్యనే కృషిచేస్తున్నాం, అయితే కార్మిక జనసామాన్యం దాదాపు ప్రత్యేకంగా ఆర్థిక పోరాటంలోనే నిమగ్నులైవున్నారు. బలమైన స్థానిక రాజకీయ పార్టీ శాఖలు నిర్మింపబడక పోయినట్లయితే, సుసంఘటితమైన అఖిల రష్యన్ వార్తాపత్రిక ఉండి మాత్రం ఏమి లాభం? అది ఒక మండే పొదమాదిరి — తనూ పూర్తిగా తగులబడి పోక, మరెవ్వరినీ ప్రజ్వలింపచెయ్యనూ లేకపోయిన — పొదమాదిరిగా మాత్రమే ఉండి పోతుంది! జనం తన చుట్టూ, తనకోసం కృషిచేసేందుకని పోగవుతారనీ, సంఘటితులవుతారనీ 'ఇస్క్రా' భావిస్తుంది. కాని జనానికి, మరింత నిర్దిష్టమైన కార్యకలాపాల చుట్టూ పోగై, సంఘటితులవడం యింకా చాలా తేలికగా కనిపిస్తుంది. ఈ మరింత నిర్దిష్టమైనది స్థానిక వార్తాపత్రికల విస్తృత నిర్మాణం, ప్రదర్శనలకు కార్మిక శక్తుల తక్షణ సన్నాహం, నిరుద్యోగుల మధ్య స్థానిక సంఘాల నిరంతరాయమైన కార్యకలా

పాల నిర్వహణా (చిన్న పుస్తకాలనూ, కరపత్రాలనూ అవిశ్రాంతంగా పంచిపెట్టడం, సభలు నిర్వహించడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చర్యలకు విజ్ఞప్తులు చెయ్యడం వగైరాలు). స్థానికంగా మనం సజీవమైన రాజకీయ కృషిని మొదలెట్టాలి, ఈ వాస్తవ ప్రాతిపదికపైన ఐక్యమయ్యే సమయం వచ్చినప్పుడు అది కృతకమైన, కాగి తంమీద మాత్రమే వుండే ఐక్యత కాబోదు. అలాంటి స్థానిక కృషిని మనం అఖిల రష్యన్ కృషిగా తప్పక చేస్తాం, అయితే అది సాధ్యమయ్యేది వార్తా పత్రికల ద్వారా మాత్రం కాదు!'' (''విప్లవ ప్రాంగణం,'' పేజి 54.)

జోరుగా సాగిన యీ దాడిలో మా పథకాన్ని గురించి రచయిత తప్పుడు నిర్ధారణలనూ, మొత్తంమీద ''ఇస్క్రా'' దృక్పథానికి పోటీగా ప్రతిపాదించబడిన ఆయన దృక్పథంలోని పొరపాటునూ మిక్కిలి స్పష్టంగా చూపే వాక్యాలను నేనిక్కడ వక్కాణించి చెప్పాను. స్థానికంగా బలమైన రాజకీయ పార్టీ శాఖలను తరిఫీదు చేస్తే గాని, చాలా బాగా సంఘటితం చెయ్యబడిన అఖిల రష్యన్ వార్తాపత్రికవల్ల సైతం లాభమేమీ వుండదు. ఇది తిరుగులేని సత్యం. అయితే అసలు విషయం ఏమిటంటే, అఖిల రష్యన్ వార్తాపత్రిక ద్వారా తప్పితే, బలమైన రాజకీయ పార్టీ శాఖలను తరిఫీదు చేసే మార్గం మరొకటేదీ లేదు. ''ఇస్క్రా'' తన పథకాన్ని ప్రతిపాదించేందుకు ముందు చెప్పిన అతి ముఖ్యమైన మాటలను రచయిత వది లేశాడు: ''అన్ని శక్తులనూ కూడగట్టి, పేరుకి మాత్రమే కాక, ప్రత్యక్షాచరణలో ఉద్యమాన్ని నడపగలిగిన, ఒక విప్లవ పార్టీ నిర్మాణంకోసం అంటే, ఎప్పుడు ఎక్కడ ఏ నిరసన ఆందోళన జరిగినా దానికి తోడ్పాటునిచ్చేందుకూ, నిర్ణయాత్మక పోరాటానికి తగిన పోరాట శక్తులను పెంపొందించడానికీ, సంఘటితం చెయ్యడానికీ వాటిని వినియోగించుకొనేందుకూ సర్వ సంసిద్ధంగా వుండే సంఘ నిర్మాణం కోసం విజ్ఞప్తి చెయ్యాలి'' అన్నవే ఆ మాటలు. ''ఇస్క్రా'' యింకా యిలా రాసింది: ఫిబ్రవరి, మార్చి ఘటనల అనంతరం యిప్పుడు, అందరూ యీ విషయంలో సూత్రరీత్యా ఏకీభవిస్తారు. అయితే మనకు కావలసింది సమస్యను ఆచరణ రీత్యా పరిష్కరించడమే గాని, సూత్రరీత్యా పరిష్కరించడం కాదు, ఏ నిర్దిష్టమూ, నిర్మాణాత్మకమూ అయిన పథకం ప్రకారమైతే అందరూ అన్ని పక్కల నుంచీ నిర్మాణ కృషికి పూనుకోవచ్చునో అలాంటి పథకాన్ని మనం వెన్వెంటనే ముందుకు తేవాలి. మనం యిప్పుడు మళ్లీ ఆచరణాత్మక పరిష్కారంనుంచి మరి దేనికేసో యీడ్వ బడుతున్నాం. ఆ ''ఏదో'' సూత్రరీత్యా పూర్తిగా సరైనదే, నిర్వివాదమైనదే, గొప్పదే, కాని విస్తృత కార్మికజన సామాన్యానికి అంటే, ''బలమైన రాజకీయ సంఘాలను పెంపొందించేందుకు'' బొత్తిగా సరిపోనిదీ, అయోమయమైనదీని! మహా రచయితగారూ, యిక్కడ సమస్య యిది కాదు; తరిఫీదునిచ్చే పనికి ఎలా పూనుకోవాలి, దాన్నెలా సాధించాలన్నదే సమస్య.

''మనం యింతదాకా ప్రధానంగా జాగృతులైన కార్మికుల మధ్యనే కృషి చేస్తున్నాం, అయితే, కార్మిక జనసామాన్యం దాదాపు ప్రత్యేకంగా ఆర్థిక పోరాటంలోనే నిమగ్నులై వున్నారు'' అనడం సరి కాదు. ప్రతిపాదనను యీ రూపంలో పెట్టడమంటే, ''స్వాబోద'' సామాన్యంగా చేసేలా జాగృతులైన కార్మికుల్ని ''కార్మిక జనసామాన్యానికి'' పోటీ పెట్టడమే అవుతుంది. అయితే యిది మౌలికంగా పొరపాటు. ఇటీవలి సంవత్సరాల్లో జాగృతులైన కార్మికులు సైతం ''దాదాపు ప్రత్యేకంగా ఆర్థిక పోరాటంలోనే నిమగ్నులైవున్నారు.'' అదీ మొదటి సంగతి. రెండో సంగతి ఏమిటంటే, యీ పోరాటంకోసం నాయకుల్ని – జాగృతులైన కార్మికుల్లోనుంచీ, మేధావుల్లోనుంచీ కూడా – తరిఫీదు చేసుకోవడంలో మనం తోడ్పడితే గాని, జనసామాన్యం రాజకీయ పోరాటాన్ని నిర్వహించడమెలాగో ఎన్నడూ నేర్చుకోలేరు. మన రాజకీయ జీవితానికి సంబంధించిన రోజువారీ పార్శ్వాలన్నింటినీ, వివిధ వర్గాలు, వివిధ కారణాలుగా నిరసన ప్రకటన కోసమూ, పోరాటాల కోసమూ చేసే ప్రయత్నాలన్నింటినీ క్రమబద్ధంగా అంచనావేసుకున్నప్పుడు మాత్రమే అలాంటి నాయకులు తరిఫీదును పొందగలరు. అందుకని, ''రాజకీయ పార్టీ శాఖలను తరిఫీదు చేయడం'' గురించి మాట్లాడటం, అదే సమయంలో ఒక రాజకీయ పత్రిక చేసే ''కాగితపు కృషి''ని ''స్థానికంగా జరిగే సజీవ రాజకీయ కార్యకలాపాలకు'' పోటీపెట్టడం శుద్ధ హాస్యాస్పద విషయం. ''ఇస్క్రా'' వార్తాపత్రిక కోసం తయారుచేసుకున్న ''పథకమే,'' నిరుద్యోగుల ఉద్యమాన్నీ, రైతుల తిరుగుబాట్లనీ, జేమ్‌స్త్వో సభ్యుల్లో వున్న అసంతృప్తినీ, ''జారు ప్రభుత్వపు విశృంఖల ఘాతుకత్వానికి వ్యతిరేకంగా జనంలో చెలరేగే క్రోధం'' వగైరాలనూ బలపరచేందుకు గాను, ''సమరశీల సన్నద్ధత''ను సృష్టించేందుకు అనువుగా మలచుకుంది. ఉద్యమంతో ఏమాత్రం పరిచయం ఉన్నవాడికైనా కూడా, అత్యధిక సంఖ్యాక స్థానిక పార్టీ శాఖలు యీ విషయాలను గురించి కలలో సైతం ఆలోచించలేదన్న సంగతి, యిక్కడ సూచింపబడిన ''సజీవ రాజకీయ కృషి''కి గల పెక్కు అవకాశాలను ఏ ఒక్క పార్టీ శాఖా ఎన్నడూ కార్యరూపంలో పెట్టలేదన్న సంగతి పూర్తిగా తెలుస్తుంది. ఉదాహరణకు, జేమ్‌స్త్వో మేధావుల్లో అసంతృప్తి, నిరసనల పెరుగుదలను జనం దృష్టికి తెచ్చేందుకు మేము ప్రయత్నించినప్పుడల్లా నదేజ్దిన్‌కే (''ఓరి దేవుడా, యీ పత్రిక జేమ్‌స్త్వో సభ్యులకోసం వెలువడుతోందా?'' ''ప్రాంగణం,'' పేజీ 129), ఆర్థికవాదులకే (''ఇస్క్రా''కి లేఖ, సంచిక 12), చాలమంది ప్రత్యక్ష కార్యకర్తలకే కలవరపాటూ, విభ్రాంతీ కలుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో, యీ విషయాలన్నింటిని గురించీ ఆలోచించేటందుకూ, కుతకుతలాడే అసంతృప్తికీ, క్రియాశీల పోరాటానికీ సంబంధించిన వివిధ రూపాలను జోడించి, వాటిని సామాన్యీకరించేలా జనానికి ప్రేరణ నివ్వడం ద్వారా మాత్రమే ''ప్రారంభించడం'' సాధ్యం. సోషల్ డెమోక్రటిక్ కర్తవ్యాలు తగ్గు స్థాయికి దిగజార్చబడుతున్న మన కాలంలో, ''సజీవ

రాజకీయ కృషి''ని ప్రారంభించ గలగడానికి సజీవ రాజకీయ ఆందోళన ఒక్కటే మార్గం. మరి యిది, తరచుగా ప్రచురింపబడి క్రమబద్ధంగా పంపిణీ చెయ్యబడే అఖిల రష్యన్ వార్తాపత్రిక ఉంటే తప్ప సాధ్యం కాదు.

''ఇస్క్రా'' ''పథకాన్ని'' ''పుస్తక పరిజ్ఞాన'' వ్యక్తీకరణగా పరిగణించేవాళ్లు దాని సారాంశాన్ని బొత్తిగా అర్థంచేసుకోవడంలేదు; ప్రస్తుత కాలానికి అత్యంతోపయోగకర సాధనంగా సూచింపబడినదాన్నే లక్ష్యంగా తీసుకుంటున్నారు. పథకాన్ని స్పష్టీకరించేందుకోసం యివ్వబడిన రెండు ఉపమానాలను అధ్యయనంచేసే శ్రమ కూడా వీళ్లు పడడంలేదు. ''ఇస్క్రా'' యిలా రాసింది: అఖిల రష్యన్ రాజకీయ వార్తాపత్రిక ప్రచురణ అన్నది ఒక ప్రధాన సూత్రంగా – దేని సహాయంతోనైతే మనం సంఘాన్ని (అంటే, ప్రతి ఒక నిరసన చర్యనీ, ప్రతి ఒక తిరుగుబాటు చర్యనీ బలపరిచేందుకు సర్వ సంసిద్ధంగా ఉండే విప్లవ సంఘాన్ని) అచంచలంగా అభివృద్ధిచేసి, ప్రగాఢమూ, విస్తృతమూ చెయ్యగలమో ఆ సూత్రంగా – ఉండాలి. అయ్యా దయచేసి నాకో విషయం చెప్పండి: తాపీ పనివాళ్లు ఓ పెద్ద భవనంలోని – ముందెన్నడూ లేనంత బ్రహ్మాండమైన భవనంలోని – వేర్వేరు భాగాల్లో ఇటుకలు పేర్చేటప్పుడు, ఇటుకలను సరిగ్గా పేర్చడంలో తమకి తోడ్పడేందుకూ, తాము కలిసి కట్టుగా చేసే కృషి అంతిమ లక్ష్యాన్ని సూచించేందుకూ, ప్రతి యిటుకనీ మాత్రమే గాక, ముందూ వెనకా పేర్చే యిటుకల్లో యిమిడి, పూర్తి అయిన, అవిచ్ఛిన్నమైన వరస తయారయ్యేందుకు ప్రతి యిటుక ముక్కనీ వాడుకోగలిగేందుకోసం తాపీవాళ్లు ఒక దారాన్ని లాగి కట్టడం ''కాగితం'' పనే అవుతుందా? మన పార్టీ జీవితంలో మనమిప్పుడు సరిగా అలాంటి దశలోనే – అంటే మనకి ఇటుకలు ఉన్నాయి, యిటుకల్ని పేర్చే తాపీ పనివాళ్లు ఉన్నారు, కాని అందరూ చూసి, అనుసరించగల మార్గదర్శకమైనదారమే లేని దశలో – లేమా? ఆ దారాన్ని లాగి కట్టడం ద్వారా మనం హుకుం జారీ చెయ్యాలనుకుంటున్నామంటూ వాళ్లని గొంతులు చించుకుని అరవనివ్వండి. మహాశయులారా, హుకుములు జారీచెయ్యాలనే కనుక మేము కోరుకున్నట్లయితే, ముఖపత్రం మీద '' 'ఇస్క్రా,' సంచిక 1'' అని కాక, '' 'రబోచయ గజేత,' సంచిక 3'' అనే పెట్టి వుండేవాళ్లం – నిజానికి కొందరు కామ్రేడ్లు మమ్మల్ని అలా పెట్టమని కోరారు, పైన పేర్కొనబడిన ఘటనల అనంతరం, మనకి అలా పెట్టే పూర్తి హక్కు వుండివుండేది కూడా. కాని మేము ఆ పని చెయ్యలేదు. కుహనా సోషల్ డెమోక్రట్లందరికీ వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరిపేందుకు వీలుగా మన చేతుల్ని స్వేచ్ఛగా వుంచుకోవాలని మనం కోరుకున్నాం. మనం మన పథాన్ని – అది సరైనదైతే – పార్టీ అధికార పత్రిక వేసినందువల్ల కాక, సరిగా వున్నందువల్ల జనం గౌరవించాలని కోరుతాం.

''స్థానిక కర్యకలాపాలను కేంద్ర సంస్థల్లో సమీకృతంచేసే సమస్య ఒక విష వలయంగా

తయారైంది'' అంటూ ఎల్. నదేజ్దిన్ మనకి ఉపదేశిస్తున్నాడు; ఐక్యం చెయ్యడానికి అంశాల్లో సమరూపం ఉండటం అవసరం; ఈ సమరూపాన్ని సృష్టించడానికి ఐక్యం చేసేదేదో ఉంటేనే సాధ్యం; కాని ఐక్యం చేసే ఈ అంశం బలమైన స్థానిక సంఘాలనుంచే జనించవలసివుంటుంది, అయితే ప్రస్తుతానికి ఈ స్థానిక సంఘాలలో సమరూపం ఎంతమాత్రం కనిపించడం లేదు.'' బలమైన రాజకీయ సంఘాలను తరిఫీదు చేయడమన్నది ఎంతటి మాన్య, నిర్వివాద సత్యమో యిది కూడా అంతే మాన్య, నిర్వివాద సత్యం. కాగా యీ సత్యం అంతే నిస్సారమైనది కూడా. మొత్తంగా రాజకీయ జీవితం అనంతమైన ఒక గొలుసు లాంటిది, అసంఖ్యాకమైన లింకులతో అది కూడివుంటుంది. అందుకనే ప్రతి సమస్యా ''విష వలయంలో'' తిరుగుతూ వుంటుంది. ఏ లింకునైతే మన చేతుల్లోంచి ఊడగొట్టడానికి తక్కువ అవకాశముందో, యీనాడు ఏది అతి ముఖ్యమైనదో, దేన్ని పట్టుకుంటే మొత్తం గొలుసు వశంలోకి వచ్చే గ్యారంటీ ఉంటుందో ఆ లింకును కనుక్కొని, దాన్ని సాధ్యమైనంత గట్టిగా పట్టుకోవడంలోనే రాజకీయ కళ అంతా యిమిడివుంది.* మన దగ్గర అనుభవజ్ఞులైన తాపీ పనివాళ్ల బృందం ఒకటుండి, వాళ్లకి కలిసికట్టుగా చాలా బాగా పనిచెయ్యడం తెలిసివుండి, సరైన గీతను తెలిపే దారం లేకపోయినా వాళ్లు తమ యిటుకలను కచ్చితంగా పేర్చగలిగినట్లయితే (సాధారణంగా యిది ఎంతమాత్రం అసంభవం కాదు), అప్పుడు బహుశా మనం మరో లింకును పట్టుకోవచ్చు. కాని దురదృష్టవశాత్తూ ఓ బృందంలా పనిచేసేందుకు శిక్షణ పొందిన తాపీ పనివాళ్లు మనకింకా లేరు, ఇటుకలు తరచుగా అవి అసలు అవసరమే లేనిచోట్ల పేర్చబడుతున్నాయి, అవి మొత్తం దారానికి అనుగుణంగా పేర్చబడటం లేదు, అంతేకాక అవి చిందర వందరగా పేర్చబడుతున్నాయి. దానితో యిటుకలతో కాక, ఏదో యిసుకతో నిర్మింపబడినట్లు, ఆ కట్టడాన్ని శత్రువు తేలిగ్గా కూల్చివెయ్య గలుగుతున్నాడు.

ఇప్పుడిక రెండో ఉపమానాన్ని తీసుకోండి: ''వార్తాపత్రిక సమష్టి ప్రచారకర్త, సమష్టి ఆందోళనకర్తే కాక, అదొక సమష్టి ఆర్గనైజరు కూడా. ఈ దృష్ట్యా దాన్ని నిర్మాణంలో వున్న భవనం చుట్టూ వుండే అంచెలవారీ పరంజా మంచెగా పరిగణించవచ్చు. దాన్నిబట్టి భవనపు రూపురేఖలు తెలుస్తాయి. భవన నిర్మాతలు ఒకరు మరొకరి దగ్గరకి

* కామ్రేడ్ క్రిచేవ్‌స్కీ, కామ్రేడ్ మర్తీనొవ్! ''నియంతృత్వం,'' ''నిర్నిరోధ అధికారం,'' ''సర్వోన్నత నియంత్రణ'' వగైరాల దారుణ వ్యక్తీకరణలపై మీ దృష్టిని సారించవలసిందిగా కోరుతున్నాను. చూశారా, చూశారా, ఎంత దారుణమో: మొత్తం గొలుసంతనీ వశం చేసుకోవాలని వాంఛించడం!! వెంటనే ఫిర్యాదుచెయ్యండి సుమా. ''రబోచెయె దేలొ'' 12వ సంచికలో రెండు సంపాదకీయాలకు గరమ్ గరమ్ సమాచారం, యిదిగో మీకు సిద్ధంగావుంది చూసుకోండి!

వెళ్లేందుకూ, వాళ్ళు తమ మధ్య పనిని పంచుకునేందుకూ, తమ సంఘటిత శ్రమ ఫలితంగా లభించిన ఉమ్మడి ఫలితాలను చూసుకునేందుకూ అది తోడ్పడుతుంది.* ఉదహరింపబడిన యీ వాక్యాలనుబట్టి ఎవరో గదిలో ముక్కు మూసుకుని కూర్చునే రచయిత తన పాత్ర ప్రాధాన్యాన్ని అతిశయింప చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడని అనుకోవాలా? భవనానికి పరంజా మంచె బొత్తిగా అవసరం లేదు; దాన్ని చౌకబారు సామగ్రితో తయారుచేస్తారు, దాన్ని తాత్కాలికంగా మాత్రమే నిలబెడతారు. నిర్మాణపు చట్రం తయారుకాగానే పొయ్యిలో వంటచెరుకుగా వాడుకునేందుకు దాన్ని పీకేస్తారు. విప్లవ సంఘాలకు సంబంధించినంతవరకు, ఒక్కొక్కసారి పరంజా మంచె లేకుండానే వాటిని నిర్మించవచ్చునని అనుభవం తెలియజేస్తోంది – 1870 దశకం యీ విషయాన్ని నిరూపించింది. కాని ప్రస్తుతం, మనకి కావలసిన కట్టడాన్ని పరంజా మంచె లేకుండా నిర్మించగల అవకాశాన్ని మనం కలలో కూడా ఊహించలేం.

నదేజ్దిన్ దీన్ని ఒప్పుకోక, యిలా అంటాడు: "తన చుట్టూ, తన కోసం జరిగే కార్యకలాపాల్లో జనం సమీకృతులవుతారనీ, సంఘటితులవుతారనీ 'ఇస్క్రా' భావిస్తుంది. కాని, మరింత నిర్దిష్టమైన కార్యకలాపాల వాటి చుట్టూ జనం సమీకృతులవడం, సంఘటితులవడం యింకా చాలా తేలిక అవుతుంది!" బలే బాగుంది! "కార్యకలాపాలు మరింత నిర్దిష్టమైనవైనప్పుడు, యింకా చాలా తేలిక." ఓ రష్యన్ సామెత వుంది: "నూతిలో ఉమ్మెయ్యకు, ఆ నీళ్లు నువ్వే తాగవలసి రావచ్చు!" కాని, ఉమ్మేసిన నూతిలోని నీళ్లను తాగడానికి అభ్యంతరం లేనివాళ్లు కొందరున్నారు. ఈ మరింత నిర్దిష్టమైనదాని పేర మన హేమాహేమీలైన చట్టబద్ధ "మార్క్సిజం విమర్శకులు," "రబోచయ మీస్ల్" రహస్య ఆరాధకులు ఎలాంటి హేయమైన విషయాలు చెప్పారు! మన సంకుచితత్వం, చొరవ లేకపోవడం, ఊగిసలాటల మూలంగా – "మరింత నిర్దిష్టమైన కార్యకలాపాల చుట్టూ సమీకృతులవడం యింకా చాలా తేలిక అవుతుంది" అన్న సాంప్రదాయికమైన వాదనతో యివి సముచితమైనవిగా చిత్రింపబడుతున్నాయి – మన ఉద్యమం ఎంతగా సంకుచితం చెయ్యబడింది! పోతే నదేజ్దిన్ – "జీవిత వాస్తవాలను" గుర్తించే అద్భుతమైన ప్రజ్ఞావంతుడుగా తనను తాను పరిగణించుకుంటాడు, "గదిలో ముక్కు మూసుకుని కూర్చునే" రచయితలను తీవ్రంగా ఖండిస్తాడు, (తానేదో వాక్చాతుర్యం కలవాడిని అనుకుంటూ) "ఇస్క్రా"కి లోకంలో సర్వత్రా

* "రబోచెయె దేలొ" (సంచిక 10, పేజి 62)లో మొదటి వాక్యాన్ని ఉదహరించి, రెండో వాక్యాన్ని మర్తీనొవ్ వదిలేశాడు – తద్వారా, ఈ సమస్య మూలాంశాలను చర్చించడంపట్ల తన అయిష్టాన్ని లేక, వాటిని అర్థంచేసుకునే సామర్థ్యం లేకపోవడాన్ని వక్కాణించాలనే అనుకున్నట్లున్నాడు.

ఆర్థికవాదాన్నే చూసే బలహీనత ఏర్పడిందన్నాడు, సాంప్రదాయికులకీ, విమర్శకులకీ మధ్య చీలికలో తనను తాను ఎంతో అతీతుడుగా పరిగణించుకున్నాడు — తన వాదనలతో తను ఏ సంకుచితత్వమైతే తనకు కోపకారణమైందో దానికే తోడ్పడుతున్నాననీ, అతిగా ఉమ్మి వెయ్యబడిన నూతినుంచే తను నీళ్ళు తాగుతున్నాననీ గుర్తించలేకపోతున్నాడు! సంకుచితత్వానికి వ్యతిరేకంగా అత్యంత చిత్తశుద్ధితో కూడిన కోపం, సంకుచితత్వం సాష్టాంగపడి దాన్ని ఆరాధించేవాళ్లను మోకాళ్లమీంచి పైకి లేపి నిలబెట్టాలన్న హృదయపూర్వకమైన తపన — యివే సరిపోవు, ఆ కోపించిన వ్యక్తి తెరచాప గాని, చుక్కాని గాని లేకుండా 1870 దశకం నాటి విప్లవకారుల మాదిరిగా సద్యోజనితత్వంతో "ఉత్తేజకర హింసాకాండ," "వ్యావసాయిక హింసాకాండ," "అపాయసూచక గంట మోగించడం" వంటి వాటితో కొట్టుకు పోయాడంతే. వేటి చుట్టూనైతే సమీకృతులు కావడం, సంఘటితులు కావడం "చాలా తేలిక" అని ఆయన అనుకుంటున్నాడో ఆ "మరింత నిర్దిష్ట" కార్యకలాపాలేమిటో మన మొకసారి చూద్దాం: (1) స్థానిక పత్రికలు; (2) ప్రదర్శనలకోసం సన్నాహాలు; (3) నిరుద్యోగులమధ్య కార్యకలాపాలు. చూసీ చూడగానే యివన్నీ కూడా ఏదో ఒకటి చెప్పేం దుకు సాకుగా ఎటువంటి ఆలోచనా లేకుండా ఎంచుకున్న విషయాలని స్పష్టమైపోతుంది. ఎందుకంటే, మనం ఏవిధంగా చూసినా కూడా, "సమీకృతులనూ, సంఘటితులనూ చేసేం దుకు" ప్రత్యేకించి అనువైనది వాటిలో ఏదో ఉందనుకోవడం శుద్ధ అవకతవక తప్ప మరేమీ కాదు. అదే నదేజ్దిన్ మరి కొద్ది పేజీల తర్వాత యిలా అంటాడు: "ఇప్పటిక యీ వాస్తవాన్ని స్పష్టంగా చెప్పుకోవలసిన సమయం వచ్చింది — వివిధ స్థానాల్లో కార్యకలాపాలు అత్యంత హీన స్థాయిలో సాగింపబడుతున్నాయి. కమిటీలు తాము చెయ్యగల పనిలో పదోవంతు కూడా చెయ్యడం లేదు..., మనకి యీనాడున్న సమన్వయ కమిటీలు పరమ గాలి సంస్థలు. ఓ మాదిరి విప్లవ బ్యూరాక్రసీకి అవి ప్రతీకలు ఉదాహరణలుగా ఉన్నాయి, వాటి సభ్యులు పరస్పరం పదవులు కట్టబెట్టుకుంటారు. బలమైన స్థానిక సంఘాలు వృద్ధిచేందేదాకా అవి అలాగే కొనసాగుతాయి." పరిస్థితిని కొంచెం అతిశయోక్తి చేసి చెప్పినప్పటికీ, ఈ వ్యాఖ్యల్లో చేదు నిజాలు చాలా వున్నాయి. అయితే, సాన్థిక స్థాయిలో కార్యకలాపాలు చాలా నాసిగా జరుగుతూ వుండటానికీ, స్థానిక సంఘాలకు పరిమితులైన పార్టీ కార్యకర్తల్లో శిక్షణ లోపం మూలంగా అనివార్యంగా ఉండే సంకుచిత మానసిక ప్రవృత్తికీ, వాళ్ల కార్యక లాపాల సంకుచిత పరిధికీ మధ్య ఉన్న సంబంధాన్ని నదేజ్దిన్ చూడలేకపోతున్నాడని అన వచ్చునా? నిర్మాణం గురించి "స్వొబోద"లో ప్రచురింపబడిన వ్యాస రచయిత మాదిరిగానే, నదేజ్దిన్ కూడా, విస్తృత స్థాయిలో స్థానిక పత్రికలకు పరివర్తనతోబాటు (1898 దరిమిలా) ఆర్థికవాదం, అనిపుణత ఏవిధంగా బాగా ముమ్మరం అయాయో మరచి పోయాడా? ఒకవేళ "విస్తృత స్థాయిలో స్థానిక పత్రికలను" తృప్తికరంగా స్థాపించడం

సాధ్యమే అయినప్పటికీ (అతి కొద్ది సందర్భాల్లో తప్ప యిది సాధ్యం కాదని మేం పైన నిరూపించాం), అప్పుడు కూడా నిరంకుశ ప్రభుత్వంమీద సార్వత్రిక పోరాటానికీ, సమైక్య పోరాట నాయకత్వం వహించడానికీ స్థానిక పత్రికలు మొత్తంగా అన్ని విప్లవ శక్తులనూ ''సమీకృతం, సంఘటితం'' చెయ్యలేవు. మనమిక్కడ చర్చిస్తున్నది ''సమీకరణ'' లోనూ, సంఘటిత పరచడంలోనూ పత్రికకి వున్న ప్రాధాన్యాన్ని గురించి మాత్రమే నన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. వికేంద్రీకరణను సమర్థించే నదేజ్దిన్‌ని, ఆయన వ్యంగ్యంగా వేసిన ప్రశ్ననే తిరిగి మనం అడగవచ్చు: ''మనకేమైనా 2,00,000 మంది విప్లవ ఆర్గనైజర్లు వారసత్వంగా సంక్రమించారా?'' అంతే కాకుండా, ''ప్రదర్శనలకు సన్నాహాలు'' అన్న దాన్ని ''ఇస్క్రా'' పథకానికి పోటీగా చూపించడం సాధ్యం కాదు, ఎందు కంటే, యీ పథకంలో సాధ్యమైనంత మిక్కిలి విస్తృతమైన ప్రదర్శనల నిర్వహణ తన లక్ష్యాల్లో ఒకటిగా పేర్కొనబడింది. ఇక్కడ మనం చర్చిస్తున్న అంశం: యీ లక్ష్యాల సాధ నకు ఆచరణ యోగ్యమైన సాధనాలు ఏమిటన్నదే. ఈ అంశంమీద కూడా నదేజ్దిన్ గంద రగోళంలోనే వున్నాడు. ''సమీకృతమూ, సంఘటితమూ'' అయిన శక్తులు మాత్రమే ప్రదర్శనలకు ''సన్నాహాలు'' చెయ్యగలుగుతాయి (యీ ప్రదర్శనలు యింతదాకా, అత్యధిక సందర్భాల్లో సద్యోజనితంగా జరిగాయి), అలా సమీకృతమూ, సంఘటితమూ చేసే సామ ర్థ్యమే సరిగా మనకి కొరవడింది – అన్న విషయాన్ని గుర్తించకపోవడమే ఆయన గందర గోళానికి కారణం. ''నిరుద్యోగుల మధ్య కార్యకలాపాలు.'' ఈ విషయంలో కూడా మళ్లీ అదే గందరగోళం. ఎందుకంటే, యిది కూడా సమీకృత శక్తుల ప్రత్యక్ష కార్యకలాపాల రంగమే గాని, శక్తుల సమీకరణకి ఓ పథకం కాదు. నదేజ్దిన్ యీ విషయంలో కూడా మన వికేంద్రీకరణ మూలంగా, ''2,00,000 మంది ఆర్గనైజర్ల'' కొరత మూలంగా జరి గిన హానిని ఎంత తక్కువగా అంచనా వేస్తున్నాడో యీ కింది వాస్తవాన్ని బట్టి తెలుసుకో వచ్చు: నిరుద్యోగాన్ని గురించి చాలా తక్కువ వార్తలు యిస్తోందనీ, గ్రామీణ జీవితానికి సంబంధించిన అత్యంత సాధారణ విషయాలపై అది ప్రచురించే లేఖలను వేళ్లపైన లెక్కించ వచ్చుననీ అనేక మంది (నదేజ్దిన్‌తోబాటు) ''ఇస్క్రా''మీద ఆరోపణ చేశారు. ఈ ఆరోపణ సరైనదే. కాని ''ఇస్క్రా'' ''నేరంచెయ్యకుండానే నేరస్తురాలు.'' మనం గ్రామీణ ప్రాంతంగుండా కూడా ''దారం లాగేందుకు'' ప్రయత్నిస్తున్నాం, అయితే దాదాపుగా అక్కడెక్కడా తాపీ పనివాళ్లు లేరు. అత్యంత సామాన్యమైన యదార్థ ఘటనల వార్తల నైనా పంపగల ప్రతివాడినీ, గత్యంతరం లేక మనం ప్రోత్సహించవలసివస్తోంది. ఆయా రంగాల్లో సమాచారం పంపగలవాళ్ల సంఖ్యని పెంచి, చివరకు నిజంగా అతిముఖ్యమైన వాస్తవాలను వాటిలోంచి ఎంపికచేసుకునే శిక్షణను మన అందరికీ కల్పిస్తుందన్న ఆశతోనే మేమిలా చెయ్యవలసివస్తోంది. అయితే, మన ఏ సమాచారం ఆధారంగానైతే యీ శిక్ష

ణను యివ్వగలమో అది చాలా తక్కువగా ఉన్న కారణంగా, మొత్తం రష్యా అంతకీ పనికి వచ్చేలా దాన్ని మనం సామాన్యీకరిస్తే గాని, శిక్షణ నివ్వగల సామగ్రి మనదగ్గర బొత్తిగా తక్కువైపోతుంది. ఆందోళనకారుడుగానూ, దేశ దిమ్మరుల జీవితం విషయంలోనూ కనీసం సదేజ్దిన్‌లో కనిపించేటంత సామర్థ్యం, పరిజ్ఞానమూ ఉన్నవాడు, నిరుద్యోగుల మధ్య ఆందోళనచెయ్యడం ద్వారా, ఉద్యమానికి అమూల్యమైన సేవచెయ్యగలడు. కాని అలాంటి వ్యక్తి తన కృషి క్రమంలో తను వేసిన ప్రతి అడుగును గురించిన వార్తనూ రష్యాలోని తన కామ్రేడ్సు అందరికీ అందజెయ్యకపోయినట్లయితే, అతని అనుభవ జ్ఞాన దీపం అతనిలోనే మలిగిపోతుంది, కొత్త కార్యకలాపాలను తమకు తాముగా చేబట్టగల సామర్థ్యం లేని యితర కామ్రేడ్సుకు అతని అనుభవ జ్ఞానం నిరుపయోగమే అవుతుంది.

మినహాయింపు లేకుండా యిప్పుడు అందరూ ఐక్యత ప్రాముఖ్యాన్ని గురించీ, ''సమీకృతం, సంఘటితం'' చెయ్యవలసిన ఆవశ్యకతను గురించీ మాట్లాడుతున్నారు. అయితే అధికసంఖ్యాకుల్లో దేనితో ప్రారంభించాలి, యీ ఐక్యతను ఎలా సాధించాలి అన్న విషయంలో నిర్దిష్టమైన అభిప్రాయం లేకుండా వుంది. బహుశా యీ కింది విషయాన్ని అందరూ ఆమోదిస్తారని అనుకుంటాను: ఒకానొక పట్టణంలోని వేర్వేరు పేటల్లోని అధ్యయన బృందాలను మనం ''ఐక్యం చెయ్యాలనుకున్నా''మనుకోండి. ఇందుకోసం ఉమ్మడి సంస్థలు ఉండటం అవసరమవుతుంది. అంటే, అన్నింటినీ కలిపి ఒక ''సంఘం'' అని పేరు పెడితేనే పని జరగదు. చిత్తశుద్ధితో కూడిన ఉమ్మడి కృషి, సమాచారం, అనుభవం, కార్యకర్తలు, పని బాధ్యతల పంపిణీ — పేటలవారీగానే కాకుండా, పట్టణ స్థాయిలో ప్రత్యేక నైపుణ్యంతో యీ ఆదానప్రదానాలు జరగాల్సివుంటుంది. ఏదో ఒక్క పేటలో ఉన్న వనరులతో (అర్థ బలం, అంగబలం — యీ రెండింటి విషయంలోనే అనడం స్పష్టం) ఓ పెద్ద రహస్య యంత్రాంగాన్ని నిర్వహించడం (వాణిజ్య పరిభాషలో) ఖర్చులు పూడే పని కాదు. పోతే, యీ సంకుచిత రంగం, తన ప్రతిభను పెంపొందించుకొనేందుకు అవసరమైనంత అవకాశాన్ని ఏ నిపుణుడికీ కల్పించదు — యీ విషయాన్ని అందరూ ఆమోదిస్తారని అనుకుంటాను. అయితే, చాలా పట్టణాల కార్యకలాపాల సమన్వయం విషయంలో కూడా యిదే వర్తిస్తుంది. ఎందుకంటే, మన సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్రలో యింతకు ముందే రుజువైనట్టు, ఒక ప్రత్యేక ప్రాంతం కూడా యీ విషయంలో అత్యంత పరిమిత కార్యాచరణ క్షేత్రంగా వుంటుంది. రాజకీయ ఆందోళనకూ, నిర్మాణ కృషికీ సంబంధించి నేనీ విషయాన్ని యింతకుముందే సవివరంగా చూపించాను. మనకి ప్రప్రధానంగానూ, విధిగానూ కావలసింది కార్యరంగాన్ని విస్తృతం చెయ్యడం, క్రమబద్ధ, ఉమ్మడి కృషి ప్రాతిపదికపైన పట్టణాల మధ్య వాస్తవికమైన సంబంధాలను స్థాపించడమే. ఎందుకంటే యీ వికేంద్రీకరణ జనానికి భారమైపోతోంది. ప్రపంచంలో ఏమి జరుగుతోందో,

ఎవరి దగ్గర్నుంచి తెలుసుకోవాలో, లేక అనుభవం ఎలా సంపాదించుకొని, విస్తృత కార్యక లాపాల్లో నిమగ్నులు కావాలన్న కోర్కెను ఎలా సంతృప్తిపరచుకోవాలో తెలియక (''ఇస్క్రా'' విలేకరి మాటల్లో), వాళ్లు ''నూతిలో కప్పల మాదిరిగా యిరుక్కుపోయారు.'' ఒక ఉమ్మడి పత్రిక ప్రాతిపదికపైన మాత్రమే మనం వాస్తవికమైన సంబంధాలని మొదలు పెట్టగలమని నేను మరోసారి నొక్కి చెప్తున్నాను. ఎందుకంటే, క్రమబద్ధంగా వెలువడే, ఏకైక అఖిల రష్యా పత్రిక మాత్రమే, అత్యంత వైవిధ్యపూరితమైన రూపాల్లో జరిగే కార్యకలాపాల ఫలితాలను క్రోడీకరించి, తద్వారా, అన్ని రోడ్లూ రోము నగరానికే తీసుకు వెళ్తాయన్నట్లు, విప్లవానికి తీసుకుపోగల మార్గాలు అన్నింట్లోనూ నిర్విరామంగా పురోగ మించేలా జనాన్ని ముందుకి గెంటుతుంది. పేరుకు మాత్రమే కాకుండా, ఆచరణలో కూడా మనం ఐక్యతను కోరుకున్నట్లయితే, స్థానిక అధ్యయన బృందాలన్నీ, ఉదాహరణకు తమ శక్తుల్లో నాల్గో వంతును వెన్వెంటనే ఉమ్మడి లక్ష్య సాధన కోసం చురుకుగా కృషిచేసేం దుకు తక్షణం కేటాయించాలి. మరి అప్పుడు పత్రిక యీ లక్ష్యపు సాధారణ రూపురేఖ లనూ, పరిధినీ, స్వభావాన్నీ వెంటనే వాళ్లకి తెలియజేస్తుంది;* అఖిల రష్యా కార్యకలాపాల్లో ఎక్కడ మిక్కిలి తీవ్రమైన లోపాలు ప్రస్ఫుటమవుతున్నాయో, ఎక్కడ ఆందోళన కొరతగా వుందో, సంబంధాలు బలహీనంగా ఉన్నాయో పత్రిక వాళ్లకి కచ్చితంగా సూచిస్తుంది. అంతే కాదు, విస్తారమైన మొత్తం యంత్రాంగంలో ఏ చిన్న చక్రాలను ఒకానొక ప్రత్యేక అధ్యయన బృందం మరమ్మతుచెయ్యాలో లేక మార్చి, మరింత మంచి వాటిని పెట్టాలో అది పేర్కొంటుంది. ఇంకా కార్యకలాపాలు మొదలెట్టని, కాని అప్పుడప్పుడే వాటికోసం తడుములాడుతున్న అధ్యయన బృందం, ''పరిశ్రమ''లో అంతకు ముందు వచ్చిన అభి వృద్ధిని గురించి గాని, లేక పరిశ్రమలో అమల్లో వున్న ఉత్పత్తి పద్ధతుల సాధారణ స్థాయిని గురించి గాని తెలియని ఓ చిన్న విడి కార్ఖానాలోని చేతిపనివాడి మాదిరిగా కాకుండా, నిరంకుశ ప్రభుత్వంమీద సంపూర్ణ, సాధారణ విప్లవాత్మక దాడిని ప్రతిబింబించే ఒక విస్తృత విప్లవాత్మక కృషిలో ఒక భాగస్వామిలా పాల్గొనవచ్చు. ప్రతి ఒక్క చక్రపు నగిషీ

---

* దీనికొక షరతు: అదేమిటంటే, ఒకానొక ప్రత్యేక అధ్యయన బృందానికి పత్రిక విధానంపట్ల సానుభూతి వుంటే, దానితో సహకరించడం – దీని అర్థం సాహిత్యపరమైన సహకారమే కాక, మొత్తంగా విప్లవ కార్యకలాపాల్లో సహకారం – ప్రయోజనకరమని అను కుంటే. ''రబోచెయె దేలో''కి వివరణ: ప్రజాస్వామ్యతత్వ నాటకానికి కాక లక్ష్యానికి ప్రాము ఖ్యాన్ని ఆపాదించే విప్లవకారులు, ''సానుభూతిని'' అత్యంత క్రియాశీలమూ, సజీవమూ అయిన సహకారంనుంచి వేరుచెయ్యనటువంటి విప్లవకారులు యీ షరతును పాటించే ప్రవర్తిస్తారు.

ఎంత ఎక్కువ నిర్దుష్టంగా ఉంటుందో, ఉమ్మడి లక్ష్య సాధనలో చిల్లరమల్లర పనులు చేసేవాళ్లు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటారో, మన నిర్మాణపు అల్లిక అంత ఎక్కువ జిగిగా వుంటుంది, అనివార్యంగా జరిగే పోలీసు దాడుల ఫలితంగా మన సాధారణ సభ్యుల్లో అంత తక్కువ గందరగోళం ఉంటుంది.

కేవలం పత్రికను పంపిణీ చేసే పని (నిజంగా దాన్ని పత్రిక అని పిలవటానికి యోగ్యమైనదైతే, అంటే, మాస పత్రిక మాదిరిగా నెలకొకసారి గాక, నెలకి కనీసం నాలుగు సార్లైనా క్రమబద్ధంగా దాన్ని ప్రచురించేట్లయితే) వాస్తవిక సంబంధాలను నెలకొల్పుకోడానికి తోడ్పడుతుంది. విప్లవ కార్యక్రమాలకోసం పట్టణాల మధ్య సంబంధాలు యీనాడు అతి అరుదుగా ఉంటున్నాయి. ఏదేమైనా, అది నియమం కాదనీ, మహా అయితే మినహాయింపు మాత్రమేననీ చెప్పవచ్చు. కాని, మనకి పత్రికే ఉన్నట్లయితే, అటువంటి సంబంధం నియమం అవుతుంది; నిస్సందేహంగా పత్రిక పంపిణీని మాత్రమే కాకుండా (అంతకంటె ముఖ్యమైన విషయం), అనుభవం, సమాచారం, శక్తులు, వనరుల ఆదాన ప్రదానాలను కూడా అది సాధిస్తుంది. నిర్మాణ సంబంధమైన కృషికి వెంటనే చాలా ఎక్కువ అవకాశం చేకూరుతుంది. ఒక ప్రాంతం సాధించిన విజయం మరింత నిర్దుష్టతను సాధించేందుకు స్థిరమైన ప్రోత్సాహకంగా ఉంటుంది. దేశంలోని యితర భాగాల్లో కామ్రేడ్సు సాధించిన అనుభవాన్ని వినియోగించుకోవాలన్న వాంఛను అది జాగృతంచేస్తుంది. స్థానిక కృషి యిప్పటి కంటె యింకెంతో సంపన్నమూ, మరింత వైవిధ్యపూరితమూ అవుతుంది. రష్యా నాలుగు మూలల్లోనూ బహిర్గతం చెయ్యబడి, ఖండింపబడిన ఆర్థిక వ్యవహారాలను సేకరించి యిస్తే, అవి అన్ని వృత్తులకూ, అన్ని అభివృద్ధి స్థాయిలకూ చెందిన కార్మికుల మెదళ్లకు మేత అవుతాయి. అత్యంత వైవిధ్యపూరితమైన అంశాలమీద సంభాషణలకీ, పఠనానికీ అవి సమాచారాన్నీ, సందర్భాన్నీ సమకూరుస్తాయి. దీనికితోడు, చట్టసమ్మతంగా వెలువడే పత్రికల్లో అన్యాపదేశంగా, జనం మధ్య సంభాషణల ద్వారా, ప్రభుత్వపు "సిగ్గుతో కూడిన" ప్రకటనల ద్వారా సూచనలు దొరుకుతాయి. ప్రతి ఒక తిరుగుబాటు ప్రయత్నం, ప్రతి ఒక ప్రదర్శనా, అన్ని పార్శ్వాలనుంచీ, రష్యా నాలుగు మూలల్లో బేరీజు వెయ్యబడుతుంది, చర్చింపబడుతుంది. ఈవిధంగా యితరులను అందుకోవాలన్న, అధిగమించాలన్న వాంఛను రేకెత్తిస్తుంది (సోషలిస్టులమైన మనం సమ ఉజ్జీ అయ్యేందుకు అన్ని రకాల స్పర్ధకూ, "పోటీకీ" ఎంత మాత్రం వ్యతిరేకులం కాము!), ముందేదో యాదృచ్ఛికంగా వ్యక్తమైనట్లు కనిపించినదానికోసం, యిప్పుడు చైతన్యపూర్వకంగా కృషిచెయ్యాలన్న యిచ్ఛ కలుగుతుంది, ఒక ప్రత్యేక ప్రాంతంలోనో, ఒక ప్రత్యేక సమయంలోనో వుండే అనుకూల పరిస్థితులను అనువుగా తీసుకుని దాడి వ్యూహాన్ని సంస్కరించే యిచ్ఛను రేకెత్తిస్తుంది, వగైరా. అదే సమయంలో, స్థానిక కార్యకలాపాల యీ పునరుద్ధరణ, ప్రస్తుతం తరచు జరుగుతున్న

మాదిరిగా, ప్రతి ఒక్క ప్రదర్శనకోసమూ, స్థానిక పత్రిక ప్రతి సంచిక ప్రచురణకోసమూ తెగింపుతో సకల శక్తులూ సకల ప్రయత్నాలూ ఒడ్డి, ''ఒళ్లంతా హూనం చేసుకోవలసిన'' శ్రమనం తనీ తప్పిస్తుంది. ఒక పక్క, పోలీసులకి ''మూలాలని'' పట్టుకోవడం యింతకు ముందరి కన్న చాలా కష్టమవుతుంది, ఎందుకంటే యీ వేళ్లకోసం ఏ పేటలో వెతకాలో వాళ్లకి తెలియదు. మరో పక్క క్రమబద్ధమైన ఉమ్మడి కృషివల్ల మన జనానికి లభించే శిక్షణ మూలంగా, ఒకానొక నిర్దిష్టమైన దాడికోసం మొత్తం సైన్యంలో ఎంత బలగం వున్న దండును కేటాయించాలో తెలుస్తుంది (ఇప్పుడు దాదాపు ఎవ్వరూ యీ విషయాన్ని ఖాతరుచెయ్యడంలేదు, ఈ దాడుల్లో నూటికి తొంభై వంతులు సద్యోజనితంగా జరిగేవి కావడమే యిందుకు కారణం). అలాంటి క్రమబద్ధమైన ఉమ్మడి కృషి ఒక్క సాహిత్యాన్నే కాకుండా విప్లవ శక్తులను కూడా ఒక చోటునుంచి మరో చోటుకి ''తరలించడాన్ని'' సాధ్యం చేస్తుంది.

ప్రస్తుతం అనేక సందర్భాల్లో, యీ విప్లవ శక్తులు పరిమితమైన స్థానిక కృషి కోసం వెచ్చించబడి వృథాచెయ్యబడుతున్నాయి. అయితే మనం చర్చిస్తున్న పరిస్థితుల్లో సమర్థుడైన ఒక ఆందోళనకారుడినో, ఆర్గనైజరునో దేశపు ఒక మూలనుంచి మరో మూలకి పంపడం సాధ్యమవుతుంది, అలా పంపవలసిన సందర్భాలు కూడా నిరంతరాయంగా పెరుగుతాయి. పార్టీ పనిమీద, పార్టీ ఖర్చుతో చిన్న చిన్న ప్రయాణాలతో మొదలుపెట్టి, కామ్రేడ్సు పార్టీచేత పోషింపబడటానికీ, వృత్తి విప్లవకారులు అయ్యేందుకూ, నిజమైన రాజకీయ నాయకులుగా తమకు తాము శిక్షణ యిచ్చుకునేందుకూ అలవాటుపడతారు.

స్థానిక కమిటీలను, స్థానిక గ్రూపులను అధ్యయన బృందాలను అన్నింటినీ గాని, లేక కనీసం గణనీయమైనంత అధిక సంఖ్యలో గాని, ఉమ్మడి లక్ష్యం కోసం క్రియాశీలంగా కృషిచేసే స్థాయికి చేర్చడంలో మనం నిజంగానే సఫలమైతే, సమీప భవిష్యత్తులోనే, రష్యా అంతటా, వేల కాపీల్లో క్రమబద్ధమైన పంపిణీ కోసం ఒక వార పత్రికను మనం నెలకొల్పగలుగుతాం. ఈ పత్రిక వర్గపోరాటానికీ, జనసామూహిక కోప వ్యక్తీకరణకూ సంబంధించిన ప్రతి ఒక్క నిప్పురవ్వనీ ఎగసనదోసే కమ్మరివాడి బ్రహ్మాండమైన జంట కొలిమి తిత్తుల్లో ఒక భాగమవుతుంది. ఇప్పటికింకా తనకు తానుగా బహు నిరపాయకరమూ, బహుచిన్నదీ, కాని క్రమబద్ధమూ, ఉమ్మడిదీ అయిన కృషి చుట్టూ — ఆ పదానికి వున్న పూర్తి అర్థంలో — కాకలుతీరిన పోరాట యోధుల స్థాయీ సైన్యం క్రమబద్ధంగా సమీకృతమై, శిక్షణ పొందుతుంది. ఈ మొత్తం నిర్మాణ చట్రపు నిచ్చెనలమీదా, పరంజా మంచెలమీదా, తన విప్లవకారుల మధ్యనుంచి సోషల్ డెమోక్రటిక్ జెల్యాబోవ్‌లూ, మన కార్మికుల్లోంచి రష్యన్ బేబెల్‌లూ అభివృద్ధిచెంది, ముందుకొస్తారు. వీళ్లు సమీకృత సైన్యపు మున్మొనలో తమ

స్థానాన్ని ఆక్రమించి, రష్యా కళంకాన్నీ, శాపాన్నీ అంతంచెయ్యవలసిందిగా యావన్మంది ప్రజలనూ జాగృతం చేస్తారు!

మనం కలలు కనవలసింది దీని కోసమే!

* * *

''మనం కలలు కనాలి!'' నేనీ మాటలు రాశాక భయంతో ఉలిక్కిపడ్డాను. నేనొక ''ఐక్యతా మహాసభ''లో కూర్చున్నట్లు, నా ఎదుట ''రబోచెయె దేలొ'' సంపాదకులూ, రచయితలూ కూర్చున్నట్లూ నాకు అనిపించింది. కామ్రేడ్ మర్తీనొవ్ లేచి, నాకేసి తిరిగి, కఠోరంగా యిలా అంటాడు: ''అయ్యా, మిమ్మల్నొక ప్రశ్న వెయ్యడానికి నన్ను అనుమతించండి, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంపాదకవర్గానికి, ముందుగా పార్టీ కమిటీల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకోనిదే కలలుగనే హక్కుందా?'' ఆయన తర్వాత కామ్రేడ్ క్రిచేవ్‌స్కీ (ప్లెహానొవ్‌ని ఎన్నడో మరింత ప్రగాఢం చేసిన కామ్రేడ్ మర్తీనొవ్‌ని సైతం తాత్వికంగా గాఢం చేస్తూ) మరింత కఠోరంగా యిలా అంటాడు: ''నేనింకొంచెం ముందుకు వెళ్తాను. మార్క్స్ అభిప్రాయాన్ని బట్టి, మానవజాతి ఎప్పుడూ కూడా తను సాధించగలిగిన కర్తవ్యాలనే తన ముందు పెట్టుకుంటుంది, మరి ఎత్తుగడలు అన్నది పార్టీ అభివృద్ధితోబాటు పెరిగే పార్టీ కర్తవ్యాల అభివృద్ధి క్రమం. అలాంటప్పుడు మార్క్సిస్టు అన్నవాడికి కలలుగనే హక్కంటూ అసలు ఉందా అని?''

కఠోరమైన యీ ప్రశ్నలను గురించి ఆలోచిస్తేనే నా శరీరం కొరడుబారిపోయి, పారిపోయి దాక్కునేందుకు ఏదైనా జాగా దొరికితే అంతే చాలురా నాయనా అనిపిస్తుంది. అందుకని నేను పీసరెవ్‌ని అడ్డుపెట్టుకునేందుకు ప్రయత్నిస్తాను.

కలలకీ వాస్తవికతకీ మధ్య ఉన్న ఎడాన్ని గురించి పీసరెవ్ యిలా రాశాడు: ''ఈ ఎడాలనేవి రకరకాలు. నా కల సహజ ఘటనా క్రమంనుంచి ముందు పరుగెత్తవచ్చు, లేక సహజ ఘటనా క్రమ దిశకు పూర్తి భిన్నమైన దిశలో, సహజ ఘటనా క్రమం ఎన్నడూ సాగని దిశలో పోవచ్చు. మొదటి రకం కల వల్ల ఎలాంటి హానీ జరగదు; పైగా అది శ్రమజీవుల క్రియాశీలతకు తోడ్పడి దానికి దోహదం కూడా చెయ్యవచ్చు.... అలాంటి కలల్లో శ్రమ శక్తిని వక్రమార్గం పట్టించేది గాని, కుంటుపరచేదిగాని ఉండదు. అందుకు భిన్నంగా, మనిషికి యీవిధంగా కలలుగనే సామర్థ్యమే పూర్తిగా కొరవడితే, అతను మధ్యమధ్య ముందుకు పోయి, తన చేతిలో యిప్పుడే రూపుదాల్చ నారంభిస్తున్న వస్తువుకి మనస్సులో సంపూర్ణమూ, సమగ్రమూ అయిన చిత్రాన్ని ఊహించుకోలేని పరిస్థితిలో కళా, విజ్ఞానశాస్త్ర, ప్రత్యక్ష కృషి వగైరా రంగాల్లో విస్తృతమూ, శ్రమైక సాధ్యమూ అయిన కృషిని చేబట్టేందుకు మనిషికి ప్రేరణ అంటూ ఏముంటుందో నేను బొత్తిగా ఊహించుకోలేక పోతున్నాను.

కలలుగనే వ్యక్తి తన కలని చిత్తశుద్ధితో విశ్వసిస్తే, అతను జీవితాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే, తను పరిశీలించినవాటిని తన గాలిమేడలతో సరిపోల్చి చూసుకుంటే, అంతే కాకుండా మొత్తం మీద అతను తన కలలకి వాస్తవ రూపం యిచ్చేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తే కలలకీ వాస్తవానికీ మధ్య ఉన్న ఎడంవల్ల నష్టమేమీ కలగదు. కలలకీ జీవితానికీ మధ్య ఏ కొంచెమైనా సంబంధం ఉంటే, అప్పుడిక అంతా సజావుగా వుంటుంది.''[197]

దురదృష్టకరమైన విషయం యేమిటంటే, యీ మాదిరి కలలుగనడమన్నది మన ఉద్యమంలో చాలా తక్కువగా కనిపిస్తోంది. ఇందుకు ఎక్కువ బాధ్యులు, తమ అభిప్రాయాలు హేతుబద్ధమైనవనీ, తాము ''నిర్దిష్టమైనదానికి'' ''పరమ సన్నిహితులమనీ'' బడాయిలు చెప్పుకునేవాళ్లే — అంటే చట్టసమ్మత విమర్శకూ, రహస్య ''తోకవాదానికీ'' ప్రతినిధులే.

## ఇ) మనకి ఎలాంటి నిర్మాణం అవసరం?

పైన చెప్పినదాన్ని బట్టి పాఠకుడు ఏమి తెలుసుకుంటాడంటే: దాడికోసం తక్షణ నినాదాన్ని యివ్వ నిరాకరించడంలో, ''శత్రు దుర్గంమీద పటువైన ముట్టడి జరపడాన్ని'' అపేక్షించడంలో, మన ''పథకంగా ఎత్తుగడలు'' అనేది వుంది. వేరే మాటల్లో చెప్పాలంటే, ఒక స్థాయీ సైన్యాన్ని సమీకరించి, సంఘటితం చేసి, పోరాటానికి సన్నద్ధం చెయ్యాలని మనం అపేక్షించడంలో వుందన్న విషయాన్ని తెలుసుకుంటాడు. ''రబోచెయె దేలో'' ఆర్థికవాదంనుంచి లంఘించి, దాడి చెయ్యాలని అరుపులు (దాడికోసం అది 1901 ఏప్రిల్‌లో ''లిస్తోక్ 'రబోచెగొ దేల,' ''[198] సంచిక 6లో పెద్దగా బొబ్బలు పెట్టింది) ''రబోచెయె దేలో''ను మేం హేళనచేసినప్పుడు అది వెంటనే మేం ''పిడివాదులమనీ,'' మా విప్లవ కర్తవ్యాన్ని గుర్తించడంలో మేం విఫలమయ్యామనీ, మెలకువ పేరుతో వెనక్కి దిగ తీస్తున్నామనీ వగైరా ఆరోపణలతో మామీద విరుచుకు పడింది. ఎవరైతే సూత్ర రహితులైనవారో, ''ఒ క్రమంగా ఎత్తుగడలు'' అన్న గంభీరమైన మంత్రాన్ని వల్లించి అన్ని వాద నలనూ దాటవేస్తున్నారో వాళ్ల దగ్గర్నుంచి యీ ఆరోపణలు రావడం మాకు బొత్తిగా ఆశ్చర్యాన్ని కలిగించలేదనడం స్పష్టం. అలాగే, దీర్ఘకాల కార్యక్రమాలనూ, ఎత్తుగడల మూలసూత్రాలనూ సాధారణంగా పరమ ఏహ్యభావంతో చూసే నదేజ్దిన్ యీ ఆరోపణలను రెట్టించడంపట్ల కూడా మాకు ఆశ్చర్యం కలగడంలేదు.

చరిత్ర ఎన్నడూ పునరావృతం కాదని అంటూ వుంటారు. కాని దాన్ని పునరావృతమయ్యేలా చేసేందుకోసం నదేజ్దిన్ గొంతు చించుకుని అరుస్తున్నాడు. ''విప్లవాత్మక సంస్కృతివాదాన్ని'' గట్టిగా ఖండించడంలోనూ, ప్రమాద సూచకమైన ''ఈల ఊదడం'' గురించీ,

''విప్లవ ప్రాంగణం గురించి ప్రత్యేకమైన అభిప్రాయం,'' వగైరాలను గురించీ అరవడం లోనూ, త్కాచోవ్‌ని జోరుగా అనుకరిస్తున్నాడు. అసలు చారిత్రక ఘటన విషాదాంత నాటకం కాగా, దాని నకలు కేవలం ఓ ప్రహసనం అవుతుందన్న ప్రసిద్ధ సూక్తిని ఈయన మరచి పోయినట్లు కనిపిస్తోంది.[199] త్కాచోవ్ బోధనకు అనుగుణంగా అధికారాన్ని హస్తగతంచేసు కునేందుకు తయారుచెయ్యబడిన పథకం నిజంగానే భయోత్పాతం కలిగించిన ''భయో త్పాతం కలిగించే'' హింసాకాండద్వారా అమలుజరిగిన, హుందా అయిన ప్రయత్నం కాగా, యీ ఛోటా త్కాచోవ్ ప్రతిపాదించే ''ఉత్తేజకర'' హింసాకాండ – మధ్యరకం కార్మికుల సంఘటన భావనను కూడా దానికి జోడించినప్పుడు – కేవలం హాస్యాస్పదమైన ప్రయత్నం.

నదేజ్దిన్ యిలా రాస్తాడు: '' 'ఇస్క్రా' తన పుస్తక పాండిత్యాన్ని వదిలి బయటపడితే యీ సూచనలు ('ఇస్క్రా' 7వ సంచికలో ప్రచురింపబడిన కార్మికుడి లేఖ మాదిరి సంద ర్భాలు వగైరాలు), త్వరలోనే, అందునా అతి త్వరలోనే, 'దాడి' ప్రారంభమవుతుందన్న వాస్తవానికి సూచనలనీ, కాగా, యిప్పుడు sic! ఒక అఖిల రష్యా పత్రికతో సంబంధం కలిగిన సంఘాన్ని గురించి మాట్లాడటమంటే కార్యాలయంలో కూర్చుని భావాలనూ, కార్యకలాపాలనూ ప్రచారం చెయ్యడమేననీ అది గ్రహిస్తుంది.'' ఎంతటి ఊహాతీతమైన గందరగోళంరా నాయనా! ఒక పక్క ఉత్తేజకర హింసాకాండ, ''మధ్యరకంవాళ్ల నిర్మాణం,'' దానితోబాటు, ఓ స్థానిక పత్రిక లాంటి ''మరింత నిర్దిష్టమైన దాని'' దేని చుట్టూ నైనా సమీకరించడం చాలా ''సులభతరం'' అంటాడు. మరో పక్క అఖిల రష్యా పార్టీని గురించి ''యిప్పుడు'' మాట్లాడటం కార్యాలయంలో కూర్చుని భావాలను ప్రచారంచెయ్యడమే అంటాడు – బండగా వేరే మాటల్లో చెప్పాలంటే, ''యిప్పుడు'' అప్పుడే దానికి చాలా ఆల స్యమైపోయిందంటాడు! అయితే, తమరు ''స్థానిక పత్రికలను విస్తృతంగా ఏర్పాటు చెయ్యడం'' గురించి సెలవిచ్చారు కదా, అందుకు కూడా చాలా ఆలస్యమైపోలేదా నదేజ్దిన్ మహాశయా? దీనితో ''ఇస్క్రా'' దృక్పథాన్నీ, ఎత్తుగడల పంథానీ పరిపోల్చి చూడండి. ఉత్తేజకర హింసాకాండ అనే దానికి అర్థం లేదు. మధ్యరకం జనాన్ని సంఘటితం చెయ్యడం గురించీ, స్థానిక పత్రికలను విస్తృతంగా ఏర్పాటుచెయ్యడాన్ని గురించీ మాట్లాడటమంటే అర్థం ఆర్థికవాదానికి తలుపు బార్లా తెరవడమే. విప్లవకారుల అఖిల రష్యా సంఘాన్ని గురించి మనం చెప్పి తీరవలసిందే, కాగితపు దాడి కాక, నిజమైన దాడి మొదలయ్యే దాకా అలా చెప్ప వలసిన అవసరానికి కాలదోషం ఎన్నడూ పట్టదు.

నదేజ్దిన్ యింకా యిలా అంటాడు:

''సంఘటనకి సంబంధించినంతవరకు పరిస్థితి ఎంత మాత్రం బాగా లేని మాట నిజమే. మన పోరాట బలగాలు వలంటీర్లతోనూ, తిరుగుబాటుదార్లతోనూ

కూడి వున్నాయని 'ఇస్క్రా' చెప్పడం కూడా పూర్తిగా సరైనదే.... మన బలగాల పరిస్థితిని గురించి యిలాంటి సబబైన చిత్రణనిచ్చి మీరు మంచి పని చేశారు. అయితే, అదే సమయంలో, జనసామాన్యం బొత్తిగా మన పక్షంలో లేరనీ, ఆ కారణంగా, సైనిక కార్యకలాపాలను తాము ఎప్పుడు మొదలెట్టాలని మనల్ని అడగరనీ మీరెందుకు మరచిపోతున్నారు? వాళ్లు పట్టినే పోయి 'తిరుగుబాటు చేస్తారు' అంతే.... గుంపే తన సద్యోజనిత వినాశకర శక్తితో విరుచుకుపడినప్పుడు — ఏ "స్థాయీ సైన్యం"లోనైతే మనమెప్పుడూ అత్యంత క్రమబద్ధమైన నిర్మాణాన్ని ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తూవచ్చామో; కాని, దేన్నైతే మనం ఎన్నడూ చెయ్యనే లేకపోయామో — ఆ "స్థాయీ సైన్యాన్ని" దిగతొక్కేసి, దోవలోంచి పక్కకి నెట్టిపారెయ్యవచ్చు" (వక్కాణింపు నాది).

ఆశ్చర్యకరమైన తర్కం! సరిగా "జనసామాన్యం మన పక్షంలో లేరు" అన్న కారణంగానే, తక్షణ "దాడి"ని గురించి గొంతు చించుకొని అరవడం మూర్ఖత్వమూ, అసంగతమూ అవుతుంది. ఎందుకంటే, ముమ్మరమైన దాడి అంటే స్థాయీ సైన్యం చేసే దాడి అనే కాని, జనసామాన్యం సద్యోజనితంగా చేసే తిరుగుబాటు అని అర్థం కాదు. జనసామాన్యపు స్థాయీ సైన్యాన్ని దిగతొక్కేసి, పక్కకి నెట్టెయ్యవచ్చు కనుకనే, స్థాయీ సైన్యంలో "అత్యంత క్రమబద్ధమైన సంఘటనను ప్రవేశపెట్టే" మన కృషిద్వారా మనం సద్యోజనితమైన తిరుగుబాటుతో తప్పని సరిగా "అడుగు కలిపి ముందుకు నడవగలిగేలా చూసుకోవాలి." ఎందుకంటే, అలాంటి సంఘటనను మనం ఎంత ఎక్కువగా ప్రవేశపెట్ట "గలిగితే," జనసామాన్యపు వెల్లువ స్థాయీ సైన్యాన్ని దిగతొక్కేసి పక్కకి నెట్టేసే అవకాశం అంత తక్కువగా ఉంటుంది, జనసామాన్యపు ముమ్మొనలో స్థాయీ సైనికులు నిలబడే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. సైనికులు క్రమబద్ధమైన నిర్మాణ క్రమంలో తమని జనసామాన్యంనుంచి వేరుజేసివేసే దేనిలోనో నిమగ్నులవుతారని ఆయన భావించుతున్న కారణంగానే నదేజ్దిన్ గందరగోళ పడుతున్నాడు. అయితే వాస్తవానికి, వాళ్లు బహుముఖమూ, సమగ్రమూ అయిన రాజకీయ ఆందోళనలో, అంటే, జనసామాన్యపు సద్యోజనిత విధ్వంసక శక్తినీ, విప్లవకారుల సంఘపు చైతన్యపూరిత విధ్వంసక శక్తినీ మరింతగా సన్నిహితం చేసి, ఏకోన్ముఖమైన మొత్తంగా మిళితం చేసే కృషిలోనే ప్రత్యేకించి నిమగ్నులవుతారు. మహాశయులారా, మీరు తప్పు లేని చోట తప్పు ఎంచాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే, సరిగా "స్వొబోద" గ్రూపే, తన కార్యక్రమంలో హింసాకాండని చేర్చడం ద్వారా, టెరరిస్టుల సంఘటన కోసం నినాదమిస్తోంది. అటువంటి సంఘటనే మన సైనికుల్ని జనసామాన్యంతో — దురదృష్టవశాత్తూ యిప్పటివరకు యింకా మన వైపు రాని,

దురదృష్టవశాత్తూ తమ సైనిక చర్యలను ఎప్పుడు, ఎలా మొదలుపెట్టాలో యిప్పటివరకు మనల్ని యింకా అడగని, లేక అరుదుగా మాత్రమే అడిగే జనసామాన్యంతో – మరింత సన్నిహితమైన సంబంధాలు నెలకొల్పుకోకుండా నివారిస్తుంది.

''ఇస్క్రా''ని బెదరగొట్టే తన ప్రయత్నంలో నదేజ్దిన్ యింకా యిలా కొనసాగిస్తాడు: ''అనుకోకుండా పడ్డ పిడుగులాగా మనపైన విరుచుకు పడ్డ యిటీవలి హఠాత్ ఘటనలు యెలా మన చెయ్యి జారిపోయాయో, విప్లవం కూడా అలాగే చెయ్యి జారిపోతుంది.'' పైన ఉదహరించిన దానితో కలిపి చదువుకున్నప్పుడు, యీ వాక్యం, ''స్వొబోద'' కనిపెట్టిన ''విప్లవ ప్రాంగణం గురించి ప్రత్యేకమైన అభిప్రాయం''* ఎంత అర్థరహితమైనదో స్పష్టం చేస్తుంది. ఉన్నది ఉన్నట్లు చెప్పాలంటే, యీ ప్రత్యేక అభిప్రాయం సారాంశం యిలా తేలుతుంది: చర్చించడానికీ, సన్నద్ధమవడానికీ ''యిప్పుడు'' వ్యవధి మించిపోయింది. అయ్యా, ''పుస్తక జ్ఞాన'' మహా యోగ్య విరోధిగారూ, అసలు సంగతి యిదే అయితే, ''సిద్ధాంతం,** ఎత్తుగడల సమస్యల''పై 132 పేజీల పుస్తకం రాసినందువల్ల ప్రయోజన మేమిటి? ఇంతకంటె ''విప్లవ ప్రాంగణం గురించిన దృక్పథం'' దృష్ట్యా వాళ్లు ''వాళ్లని చితగ్గొట్టండి!'' అనే సంక్షిప్త నినాదంతో కూడిన 1,32,000 కరపత్రాలను విడుదలచేసి వుంటే, తమకి తగినట్లుండేది కదా?

* ''విప్లవ ప్రాంగణం,'' పేజి 62.

** అన్నట్లు, ఎల్. నదేజ్దిన్ తన ''సైద్ధాంతిక సమస్యల సమీక్ష''లో సైద్ధాంతిక సమస్యల చర్చకు సంబంధించి బహుశా యీకింది వాక్యాలను మినహాయిస్తే, కొత్తగా చెప్పింది బొత్తిగా ఏమీ లేదు. ''విప్లవ ప్రాంగణం గురించిన అభిప్రాయం'' దృష్ట్యా యివ్వబడిన యీకింది వాక్యాలు అత్యంత విలక్షణమైనవి: ''మొత్తంమీద చూసుకుంటే, మనకి యీనాడు బెర్న్‌స్టైనిజం కీలకత్వం తగ్గిపోతోంది. అదే విధంగా, స్త్రూవెగారిని యింతకు ముందే దుయ్యబట్టి వుండాల్సిందన్న విషయాన్ని అదమోవిచ్‌గారే నిరూపిస్తారా, లేక అందుకు భిన్నంగా స్త్రూవెగారే అదమోవిచ్‌గారిని పూర్వపక్షం చేసి, రాజీనామా యిచ్చేందుకు నిరాకరిస్తారా అన్న విషయానికి కూడా ప్రాముఖ్యం తగ్గిపోతోంది – విప్లవ ఘడియ వచ్చేసింది, కనుక నిజానికి యిప్పుడిక వీటి మధ్య అంతరమేమీ లేదు'' (పేజి 110). సిద్ధాంతంపట్ల ఎల్. నదేజ్దిన్‌కి వున్న అంతులేని నిర్లక్ష్య భావానికి యింతకంటె కొట్టవచ్చినట్లు కనిపించే ఉదాహరణ మరొకటి ఉండబోదు. ''విప్లవ ప్రాంగణాన్ని'' మనం చాటి చెప్పాం, అందుచేత, ఛాందసులు చివరకు విమర్శకులను వాళ్ల స్థానాలనుంచి తప్పించడంలో సఫలురవుతారా, కారా అన్న విషయానికి యిప్పుడిక ''నిజానికి అంతరమేమీ లేదు!'' ఆచరణలో విమర్శకుల వైఖరులపైన సుదృఢమైన పోరాటం జరపగలిగేందుకు గాను, విమర్శకులతో మనం జరిపే సైద్ధాంతిక పోరాటాల ఫలితాలు మనకి సరిగా విప్లవకాలంలోనే అవసరమన్న విషయాన్ని గుర్తించడంలో మన పండితమ్మన్యుడు విఫలుడయ్యాడు.

''ఇస్క్రా'' చేస్తున్నట్లు, ఎవరైతే తమ యావత్తు కార్యక్రమానికీ, తమ ఎత్తుగడలకీ, తమ నిర్మాణ కృషికీ దేశవ్యాపిత ఆందోళనను పునాదిగా చేసుకుంటారో వాళ్ల విషయంలో విప్లవం కూడా అలాగే చెయ్యి జారిపోయే ప్రమాదం చాలా తక్కువగా వుంటుంది. ఈనాడు రష్యా అంతటా అఖిల రష్యా పత్రికనుంచి విస్తరించే సంబంధాల వలను అల్లడంలో నిమగ్నులై వున్నవాళ్లు, వసంతకాలపు ఘటనలను గుర్తించడంలో విఫలురు కాకపోవడమే కాకుండా, వాటిని గురించి ముందే జోస్యం చెప్పగల అవకాశాన్ని వాళ్లు మనకి కల్పించారు. ''ఇస్క్రా'' 13, 14 సంచికల్లో వర్ణింపబడిన ప్రదర్శనలను[200] వాళ్లు తమ చెయ్యి జారిపోనివ్వలేదు సరికదా, అందుకు భిన్నంగా, సద్యోజనితంగా తిరుగుబాటు చేసే జనసామాన్యానికి తోడ్పడటం, అదే సమయంలో, పత్రిక ద్వారా రష్యాలోని కామ్రేడ్సందరూ యీ ప్రదర్శనలను గురించి తెలుసుకునేందుకూ, తమ సమీకృత అనుభవాన్ని వినినియోగించుకునేందుకూ సహాయపడటం తమ విధి అన్న విషయాన్ని స్పష్టంగా గుర్తించి, ఆ ప్రదర్శనల్లో వాళ్లు పాల్గొన్నారు. వాళ్లే కనుక బతికివున్నట్లయితే, వాళ్లు యీ విప్లవాన్ని చెయ్యి జారవిడుచుకోకుండా పాల్గొంటారు. అయితే విప్లవంలో పాల్గొనేవాళ్లలో ప్రథమంగానూ, ప్రధానంగానూ ఉండవలసినవి ఏమిటంటే: ఆందోళన చెయ్యడంలో అనుభవం, ప్రతి నిరసననూ (సోషల్ డెమోక్రటిక్ పద్ధతిలో) బలపరచే సామర్థ్యం, సద్యోజనిత ఉద్యమానికి నాయకత్వం వహించే సామర్థ్యం, అదే సమయంలో మిత్రుల పొరపాట్లనుంచీ, శత్రువుల పన్నాగాలనుంచీ విప్లవాన్ని కాపాడగల సామర్థ్యం.

ఉమ్మడి పత్రిక కోసం, ఉమ్మడి కృషి ద్వారా అఖిల రష్యా పత్రికను కేంద్రంగా కలిగిన ఒక సంఘటనకి పథకం కోసం మనమెందుకు యింత గట్టిగా పట్టుపట్టవలసిన అవసరం ఏర్పడిందో తెలిపే చిట్టచివరి కారణానికి యీవిధంగా మనం యిప్పుడు చేరుకున్నాం. అటువంటి సంఘం మాత్రమే సమరశీల సోషల్ డెమోక్రటిక్ సంఘానికి అవసరమైన పట్టు విడుపులను సుసాధ్యం చేస్తుంది. అంటే, పోరాటానికి సంబంధించిన అత్యంత వైవిధ్య పూరితమూ, మిక్కిలి వేగంగా మారిపోయేవీ అయిన పరిస్థితులకు అనురూపంగా తనను తాను మార్చుకునే సామర్థ్యం, ''ఒక వంక, తనకంటె అనేక రెట్లు బలమైన శత్రువు, తన శక్తులన్నింటినీ ఒక్క చోట కేంద్రీకరించినప్పుడు — అతనికి వ్యతిరేకంగా బహిరంగ పోరాటాన్ని తప్పించుకోవడం, మరో వంక, అతని అలవికానితనాన్ని ఆసరా చేసుకుని దాడి ఎప్పుడు, ఎక్కడ మొదలవుతుందో అతను బొత్తిగా ఊహించనప్పుడు, ఊహించని చోట దాడి చెయ్యడం.''* తిరుగుబాట్లూ, వీధి పోరాటాలూ మాత్రమే జరుగుతాయన్న ఆశతో, లేక

---

* ''ఇస్క్రా,'' సంచిక 4. ''దేనితో ప్రారంభించాలి?'' నదేజ్దిన్ యిలా రాశాడు: ''విప్లవ ప్రాంగణం అభిప్రాయాన్ని ఆమోదించని విప్లవ సాంస్కృతికవాదులు తామింకా

''రోజువారీ సాదా ఆర్థిక పోరాట పురోగమనం'' పైన మాత్రమే ఆధారపడి మనం పార్టీని నిర్మించబూనుకుంటే అది ఘోరమైన తప్పిదమే అవుతుంది. మనం రోజువారీ కార్యకలాపాలను సదా నిర్వహిస్తూనే వుండాలి, ఎదురయ్యే ప్రతి అవాంతరాన్నీ ఎదుర్కొడానికి సదా సంసిద్ధంగా వుండాలి. ఎందుకంటే, తిరుగుబాటు దశ ఎప్పుడు ముగుస్తుంది, దాని స్థానంలో శాంతి దశ ఎప్పుడు వస్తుంది అన్న విషయాన్ని ముందుగా ఊహించడం దాదాపు అసంభవం. అయితే, మనం అలా ఊహించగలిగిన సందర్భాల్లోనైనా, మనం యీ దూరదృష్టిని మన సంఘ పునర్నిర్మాణానికి మళ్లించలేం. ఎందుకంటే, నిరంకుశ పాలన నెలకొనివున్న దేశంలో, ఘటనాక్రమంలో వచ్చే యీ మార్పులు ఆశ్చర్యజనకమైన వేగంతో జరుగుతాయి, ఒక్కొక్కసారి జారిస్టు యనిచార్లు[201] రాత్రిపూట జరిపే ఒకే ఒక్క దాడితోనే యీ మార్పు ఆరంభం కావచ్చు. విప్లవాడేనా అదేదో ఒకే ఒక్క చర్య అన్నట్లు (నదేజ్దిన్ బాపతువాళ్లు పరిగణిస్తున్నారని) పరిగణించకూడదు. తరతమ స్థాయిల్లో జరిగే శక్తివంతమైన తిరుగుబాట్ల — తరతమ స్థాయిల్లో మధ్య మధ్య ఏర్పడే పూర్తి ప్రశాంత దశలతో — ఒక పరంపరగా విప్లవాన్ని పరిగణించాల్సివుంటుంది. అందుకనే, మన పార్టీ నిర్మాణ కార్యకలాపాల ప్రధాన సారాంశమూ, యీ కార్యకలాపాల కేంద్ర బిందువూ అత్యంత శక్తివంతమైన తిరుగుబాటు దశలోనూ, అలాగే పూర్తి ప్రశాంత దశలోనూ సాధ్యమూ, అవసరమూ అయిన కృషి — అంటే రష్యా అంతటా వ్యాపించి ఉండి, అన్ని జీవిత రంగాలపైనా ప్రభావాన్ని కలగజేస్తూ జనసామాన్యంలో మిక్కిలి విస్తృత శ్రేణుల్లో నిర్వహింపబడే రాజకీయ ఆందోళనా కృషి అయివుండాలి. అతి తరచుగా ప్రచురింపబడే అఖిల రష్యా పత్రిక ఒకటి లేనిదే, సమకాలిక రష్యాలో యీ కృషి అనూహ్యం. ఈ పత్రిక కేంద్రంగా ఏర్పడే సంఘం, దానితో సహకరించేవారి (ఆ మాట విస్తృతార్థంలో, అంటే, దానికోసం పనిచేసేవాళ్లందరి)

---

దీర్ఘకాలం పనిచెయ్యవలసి రావడంపట్ల ఎంతమాత్రం కలవరపడరు'' (పేజి 62). దీనికి మన జవాబు యిదీ: చాలా దీర్ఘకాలం పనిచేసేందుకు అవసరమైన రాజకీయ ఎత్తుగడలనూ, నిర్మాణ పథకాన్నీ మనం రూపొందించుకోగలిగినప్పుడు గాని, అదే సమయంలో, యీ పని క్రమంలోనే, ఘటనల వేగం పెరిగినప్పుడల్లా కలిగే ప్రతి ఒక్క అవాంతరాన్నీ ఎదుర్కొగలిగేందుకు గాను మన పార్టీ కార్యరంగంలో తన స్థానంలో నిలబడి, తన విధి నిర్వహించేందుకు సర్వ సంసిద్ధంగా ఉండేలా చూసుకోకపోతే — మనం దీన్ని విజయవంతంగా చెయ్యకపోతే, మనం మనల్ని పచ్చి రాజకీయ జూదరులంగా నిరూపించుకుంటాం. కేవలం నిన్ననో మొన్ననో తనను తాను సోషల్ డెమొక్రట్‌నని పిలుచుకోవడం మొదలెట్టిన నదేజ్దిన్ మాత్రమే, యావత్తు మానవజాతి జీవిత పరిస్థితులనూ సమూలంగా మార్చివెయ్యడమే సోషల్ డెమొక్రట్ల లక్ష్యమన్న విషయాన్నీ, యీ కారణంగానే దీర్ఘకాలం పనిచెయ్యవలసి రావడం గురించి సోషల్ డెమొక్రట్లు ''కలవర'' పడరాదన్న విషయాన్నీ విస్మరించగలడు.

సంఘం తీవ్రమైన విప్లవ ''మాంద్య'' దశల్లో పార్టీ గౌరవాన్నీ, ప్రతిష్ఠనీ, అనుస్యూతినీ నిలబెట్టడం దగ్గర్నుంచి, దేశవ్యాపితమైన సాయుధ తిరుగుబాటుకు సన్నాహం చేసి, కాల నిర్ణయం చేసి, దాన్ని నిర్వహించడం వరకు ప్రతి ఒక్క విషయానికీ అది సంసిద్ధంగా ఉంటుంది.

రష్యాలో సర్వ సామాన్యంగా సంభవించే ఒక ఘటన — ఒక చోటగాని, లేక కొన్ని చోట్ల గాని మన కామ్రేడ్సును పోలీసులు నిర్బంధించడం జరిగిందని అనుకోండి. అన్ని స్థానిక శాఖలనూ ఐక్యం చేసే ఒకే ఒక, ఉమ్మడి, నియమబద్ధ కార్యకలాపం లేనప్పుడు, అలాంటి మూకుమ్మడి అరెస్టులు తరచుగా చాలా నెలలపాటు కార్యకలాపాలు మొండిపడ టానికి దారితీస్తాయి. కాని, స్థానిక శాఖలన్నింటికీ ఉమ్మడి కార్యకలాపాలు ఉన్నట్లయితే, అప్పుడు, బాగా పెద్ద ఎత్తున మూకుమ్మడి అరెస్టులు జరిగినా కూడా, యిద్దరు ముగ్గురు దిట్టమైన కామ్రేడ్సు కొద్ది వారాలు తిరక్కముందే ఉమ్మడి కేంద్రానికీ, కొత్త యువజన బృందాలకీ — యిప్పుడు కూడా అవి అతి త్వరగా ఉద్భవిస్తున్నాయన్న సంగతి మీకు తెలి సిందే — మధ్య సంబంధాన్ని నెలకొల్పగలుగుతారు. అరెస్టుల మూలంగా కుంటుబడిన ప్పటికీ ఉమ్మడి కార్యకలాపాలు యివీ అని అందరూ స్పష్టంగా తెలుసుకున్నప్పుడు, కొత్త బృందాలు నెలకొనగలుగుతాయి, అవి కేంద్రంతో మరింత వేగంగా సంబంధాలను పెట్టుకో గలుగుతాయి.

మరో వంక, ఒక ప్రజా తిరుగుబాటు జరిగిందని అనుకోండి. మనం దీన్ని గురించి ఆలోచించాలనీ, దీనికోసం సన్నాహం చెయ్యాలనీ బహుశా యిప్పుడు అందరూ అంగీకరిస్తారు. కాని ఎలా? తిరుగుబాటుకోసం సన్నాహాలు చేసేందుకుగాను కేంద్ర కమిటీ అన్ని స్థానా ల్లోనూ తన ఏజెంట్లను నియమించలేదు కదా. ఒకవేళ మనకొక కేంద్ర కమిటీ ఉన్నా కూడా, రష్యాలో ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో, అది బొత్తిగా ఏమీ సాధించలేదు. కాని, ఉమ్మడి పత్రిక స్థాపన, పంపిణీల క్రమంలో దేశంలో ఏర్పడే ఏజెంట్ల సమూహం*

---

* అయ్యో, అయ్యో! ''ఏజెంట్లు'' అనే భయం కలిగించే మాట — మర్తీనొవ్ లాంటి ప్రజాస్వామికవాదులకు మహా కర్ణ కఠోరంగా వినిపించే మాట — నా నోటినుంచి మళ్లీ జారి వచ్చేసిందే! మరి, 1870 దశకపు వీరులకు కోపం కలిగించని యీ మాట, 1890వ దశకపు అపరిణతులకు ఎందుకు కోపం కలిగిస్తోందో నాకు ఆశ్చర్యంగా వుంది. నాకీ మాట నచ్చింది, ఎందుకంటే, అందరు ఏజెంట్లూ ఏ ఉమ్మడి లక్ష్యం కోసం మనసా, వాచా, కర్మణా తమ శక్తులన్నింటినీ వినియోగిస్తారో ఆ ఉమ్మడి లక్ష్యాన్ని యీ మాట సుస్పష్టంగానూ సునిశితంగానూ సూచిస్తుంది. కాగా యీ మాట స్థానంలో మరో మాటని వాడవలసివస్తే, నేను ఎంచుకోగల ఒకే ఒక్క మాట ''సహకారి'' మాత్రమే — అయితే దానిలో కొంత గ్రాంధికతా, అస్పష్టతా లేకపోలేదనుకోండి. మనకి కావలసిందేమిటంటే,

తిరుగుబాటు పిలుపుకోసం గోళ్లుగిల్లుకుంటూ "యెదురుచూస్తూ కూర్చొన"క్కర్లేకుండా, దాని విజయానికి అత్యధిక అవకాశాలు కల్పించగల క్రమబద్ధమైన కార్యకలాపాలను వారు నిర్వహించగలుగుతారు. అలాంటి కార్యకలాపాలు కార్మిక జనసామాన్యంలోని అత్యంత విస్తృత శ్రేణులతోనూ, నిరంకుశ ప్రభుత్వంపట్ల అసంతృప్తి చెందిన అన్ని సామాజిక శ్రేణులతోనూ మన సంబంధాలను సుదృఢం చేస్తాయి — తిరుగుబాటు విషయంలో యీ సంబంధాలకు ఎంతో ప్రాముఖ్యం వుందన్న విషయం తెలిసిందే. సరిగా అలాంటి కార్యకలాపాలే సాధారణ రాజకీయ పరిస్థితిని కచ్చితంగా అంచనావేసే సామర్థ్యాన్నీ, తత్పర్యవసానంగా, తిరుగుబాటుకు సరైన క్షణాన్ని ఎంపికచేసుకునే సామర్థ్యాన్నీ అలవరచుకునేందుకు తోడ్పడుతాయి. సరిగా అలాంటి కార్యకలాపాలే యావత్తు రష్యానూ కలవరపరుస్తున్న అవే రాజకీయ సమస్యలకూ, ఘటనలకూ, సన్నివేశాలకూ ఏకకాలంలో ప్రతిస్పందించేందుకూ, అలాంటి "ఘటనల" పట్ల సాధ్యమైనంత ఎక్కువ మేరకు శక్తివంతంగా, ఏకవిధంగా, కార్యసాధకంగా ప్రతివర్తించేందుకూ అన్ని స్థానిక శాఖలకూ శిక్షణను యిస్తాయి. తిరుగుబాటు అంటే వాస్తవానికి, ప్రభుత్వానికి యావన్మంది ప్రజలూ యిచ్చే అత్యంత శక్తివంతమూ, మిక్కిలి ఏకరూపమూ, అత్యంత కార్యసాధకమూ అయిన "జవాబే." చివరి విషయం, సరిగా అలాంటి కార్యకలాపాలే, రష్యా అంతటా వున్న విప్లవ సంఘాలకు అత్యంత నిరంతరాయమూ, అదే సమయంలో అత్యంత రహస్యమూ అయిన పరస్పర సంబంధాలను నెలకొల్పుకుని, తద్వారా నిజమైన పార్టీ ఐక్యతను నెలకొల్పుకొనే శిక్షణను కల్పిస్తాయి. ఎందుకంటే, అలాంటి సంబంధాలు లేనిదే తిరుగుబాటు పథకాన్ని గురించి సమష్టిగా చర్చించడం, తిరుగుబాటుకు ముందు రోజుల్లో అవసరమైన సన్నాహక చర్యలను — మిక్కిలి రహస్యంగా ఉంచవలసిన చర్యలను — చేబట్టడం సాధ్యం కాదు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, "అఖిల రష్యా రాజకీయ పత్రిక పథకం" పిడివాద, గ్రాంధికతా రోగపీడితులై కార్యాలయంలో కూర్చుని భావాలనూ, కార్యకలాపాలనూ రూపొందించేవారి కృషి ఫలితం (యీ పథకం గురించి బాగా ఆలోచించనివాళ్ళు అనుకునేట్లు) కాదు. సరికదా, యిది తిరుగుబాటుకి తక్షణ, సర్వతోముఖ సన్నాహాలు జరిపేందుకు అత్యంత ఆచరణాత్మకమైన పథకం. అదే సమయంలో యీ పథకం, మన రోజువారీ తక్షణావసర కార్యకలాపాలను ఒక్క క్షణం కూడా విస్మరించదు.

---

ఏజెంట్ల ఒక సైనిక సంఘటన. అయితే, ఎవరైతే "పరస్పరం పదవులు కట్టబెట్టుకోడాన్ని" విశేషానందదాయకంగా పరిగణిస్తారో అలాంటి మర్తీనొవ్ బాపతు చాలామంది (ముఖ్యంగా విదేశాల్లో) "పాస్‌పోర్ట్ ఏజెంటు" అనేందుకు బదులు "విప్లవకారులకు పాస్‌పోర్టులను సప్లయ్‌చేసే ప్రత్యేక విభాగాధిపతి" వగైరాలు అనడానికి ఇష్టపడవచ్చు.

# ముగింపు

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్రను విస్పష్టమైన మూడు దశలుగా విభజించవచ్చు.

మొదటిది దాదాపు పదేళ్ల దశ; ఇది సుమారు 1884–94 మధ్య కాలం. సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ సిద్ధాంత కార్యక్రమాలు ఆవిర్భవించి, సంఘటితమయిన దశ యిది. రష్యాలో యీ దశలో యీ నూతన ధోరణి అనుయాయుల సంఖ్య బాగా తక్కువ. అప్పట్లో సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం కార్మికోద్యమం లేని ఉద్యమం. ఒక రాజకీయ పార్టీగా అది పిండ దశలో వుంది.

రెండవ దశ 1894–98 మధ్య గల మూడు నాలుగేళ్ల కాలం. ఈ దశలో సోషల్ డెమోక్రసీ ఒక సామాజిక ఉద్యమంగా, జనసామాన్యపు వెల్లువగా, ఒక రాజకీయ పార్టీగా రంగంమీదకి వచ్చింది. ఇది దాని బాల్య, కౌమార దశ. ఈ దశలో మేధావివర్గం నరోదిజానికి వ్యతిరేకంగా పోరాటం జరపాలన్న, కార్మికుల మధ్యకు వెళ్లాలన్న విస్తారమూ, సార్వత్రికమూ అయిన ఉత్సాహంతో ఉత్తేజితమైంది. సమ్మె కార్యాచరణపట్ల కార్మికులు సార్వత్రికోత్సాహాన్ని ప్రదర్శించారు. ఉద్యమం ప్రచండ వేగంతో ముందంగలు వేసింది. నాయకుల్లో అధిక సంఖ్యాకులు "ముప్పయ్యేళ్ల వయస్సు" లోపు యువకులే. ఎన్. మిహైలోవ్‌స్కీగారి దృష్టిలో యిది సహజమైన వయో పరిమితి. యువావస్థలో ఉన్న కారణంగా యీ నాయకులు ఆచరణాత్మక కృషికి తమకి శిక్షణ లేదని నిరూపించుకొని, ఆశ్చర్యం గొలిపేటంతటి వేగంతో రంగంనుంచి జారుకున్నారు. కాని అధిక సంఖ్యాక సందర్భాల్లో వాళ్ల కార్యకలాపాల పరిధి చాలా విస్తారమైనది. వాళ్లలో చాలామంది తమ విప్లవ చింతనను "నరోద్నయ వోల్య" అనుయాయులుగా మొదలుపెట్టారు. వాళ్లలో దాదాపు అందరూ కూడా తమ తొలి యౌవనంలో మహోత్సాహంతో టెరరిస్టు వీరులను ఆరాధించారు. ఆ వీరోచిత సంప్రదాయాల సమ్మోహక ప్రభావంనుంచి విముక్తులు కావడం అనేది పోరాట రూపంలో జరిగింది, "నరోద్నయ వోల్య"కు విధేయులుగా వుండేందుకు కృతనిశ్చయులైన వాళ్లతో — వీళ్లపట్ల యువ సోషల్ డెమోక్రట్లకు ప్రగాఢమైన గౌరవభావం వుంది —

వ్యక్తిగత సంబంధాలను తెంచుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ పోరాటం మూలంగా యువ నాయకులకు తమకు తాము శిక్షణనిచ్చుకోవలసిన అవసరం, అన్ని ధోరణులకు చెందిన నిషిద్ధ సాహిత్యాన్నీ చదవవలసిన అవసరం, చట్టబద్ధ నరోదిజానికి సంబంధించిన సమస్యలను సన్నిహితంగా అధ్యయనం చెయ్యవలసిన తప్పనిసరి అవసరం ఏర్పడ్డాయి. ఈ పోరాటంలో శిక్షణ పొందిన సోషల్ డెమోక్రట్లు, తమ మార్గంపై ఉజ్వలమైన కాంతిని ప్రసరించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని గాని, నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యవలసిన కర్తవ్యాన్ని గాని "ఒక్క క్షణం" కూడా విస్మరించకుండా, కార్మికోద్యమంలో ప్రవేశించారు. ఈ దశకు చెందిన సోషల్ డెమోక్రట్లు చేసిన అత్యంత గణనీయమూ, దానికితోడు చిట్టచివరిదీ అయిన పని, 1898 వసంతకాలంలో పార్టీని స్థాపించడమే.

మూడో దశకు సన్నాహం, మనం యింతకు ముందే చూసినట్లు, 1897లో జరిగింది. 1898 (1898–?)లో యిది నిశ్చిత రూపంలో రెండో దశ స్థానాన్ని ఆక్రమించింది. ఇది అనైక్యత, విచ్ఛిన్నం, ఊగిసలాటల దశ. కౌమార దశలో యువకుడి స్వరంలో జీర వస్తుంది. కాగా, యీ దశలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ స్వరం జీరబోయి, అపస్వరం ఏర్పడనారంభించింది — ఒక వంక శ్రీయుతులు స్త్రూవె, ప్రొకొపోవిచ్, బుల్గాకొవ్, బెర్ద్యాయెవ్‌ల రచనల్లోనూ, మరో వంక వి. ఐ—న్, ఆర్. ఎమ్., బి. క్రిచేవ్‌స్కీ, మర్తీనొవ్‌ల రచనల్లోనూ యీ అపస్వరాలు వ్యక్తమయ్యాయి. అయితే, యిలా విడివిడిగా చెదిరిపోయినదీ, వెనక్కి జంకినదీ నాయకులు మాత్రమే. ఉద్యమం మటుకు పెరుగుతూనేవుంది, ప్రచండ వేగంతో పురోగమిస్తూనే వుంది. శ్రామికవర్గ పోరాటం కార్మికుల్లోని కొత్త శ్రేణులకు వ్యాపించి, మొత్తం రష్యా అంతటికీ విస్తరించింది. దానితోబాటే పరోక్షంగా అది విద్యార్థుల్లోనూ, జనాభాలోని తదితర విభాగాల్లోనూ ప్రజాస్వామ్య భావాలను జాగృతం చేసింది. కాని, నాయకుల రాజకీయ చైతన్యం మాత్రం సద్యోజనిత వెల్లువ విస్తృతికీ, శక్తికీ అనుగుణంగా వృద్ధిచెందలేదు; సోషల్ డెమోక్రటిక్ కార్యకర్తల్లో మరో కొత్త రకం మనుషులు ప్రాబల్యంలోకి వచ్చారు — ఈ రకం పార్టీ కార్యకర్తలు ఎలాంటివాళ్లంటే, వీళ్లు దాదాపు పూర్తిగా "చట్టబద్ధ" మార్క్సిస్టు సాహిత్యం ద్వారా శిక్షణ పొందినవాళ్లు, జనసామాన్యపు సద్యోజనితత్వం కారణంగా నాయకుల్లో రాజకీయ చైతన్య స్థాయి పెంపొందవలసిన ఆవశ్యకత పెరిగినకొద్దీ యీ చట్టబద్ధ మార్క్సిస్టు సాహిత్యం మరింత కొరతగా ఉన్నట్లు తేలింది. సిద్ధాంతానికీ ("విమర్శనా స్వేచ్ఛ"), ఆచరణకీ ("అనిపుణత") సంబంధించి నాయకులు వెనకబడటమే కాకుండా, వాళ్లు తమ వెనకబాటుతనాన్ని రకరకాల భారీ వాదనలతో సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. బ్రెంటానోవాదుల చట్టబద్ధ సాహిత్యంలోనూ, తోకవాదుల నిషిద్ధ సాహిత్యంలోనూ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని ట్రేడ్‌యూనియనిజం స్థాయికి దిగజార్చారు. ప్రత్యేకించి ఎప్పటినుంచైతే సోషల్ డెమో

ట్ల ''అనిపుణత'' మూలంగా విప్లవ సోషల్ డెమోక్రటికేతర ధోరణుల పునరుద్ధరణ జరిగిందో అప్పుడు ''క్రెడో'' కార్యక్రమాన్ని అమల్లో పెట్టడం మొదలైంది.

''రబోచెయె దేలో'' వంటి ఏదో ఒక పత్రిక రచనలను గురించే నేనింత మరీ విస్తారంగా చర్చించినందుకు పాఠకులకు అభ్యంతరం తోచవచ్చు, అందుకు నేను వాళ్ళకి యీ కింది విధంగా మాత్రమే జవాబు చెప్పగలను: ''రబోచెయె దేలో'' యీ మూడవ దశ ''మూల భావాన్ని'' మిక్కిలి బాగా వ్యక్తం చేసిన కారణంగా, అది ''చారిత్రక'' ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.* ఈ దశలో ఎలాంటి అనైక్యతా, ఊగిసలాటా వున్నాయో, ''విమర్శన''కి, ''ఆర్థికవాదానికి,'' బెరరిజానికి రాయితీలు యిచ్చేందుకు జనం ఎలా సిద్ధపడ్డారో – దీనికి అవకాశవాదులైన క్రిచేవ్‌స్కీ, మర్తీనొవ్ వంటివాళ్ల రచనల్లో దొరికేటన్ని మంచి ఉదాహరణలు సుసంగతమైన ఆర్. ఎమ్. రచనల్లో మనకి దొరకవు. ఈ దశ ప్రధాన లక్షణం ప్రత్యక్ష కృషిపట్ల ''పరమత్వ'' ఆరాధకుడెవడో ప్రదర్శించిన ఘనమైన యేహ్య దృష్టి ఎంతమాత్రం కాదు, యీ దశ ప్రధాన లక్షణం ఏమిటంటే, అధమ స్థాయి కార్యాచరణను – సిద్ధాంతంపట్ల పరమ ఉపేక్షాభావంతో జోడించడం. ఈ దశకు చెందిన మహారథులు ''ఆర్భాటపు పదబంధాలను'' వక్రీకరించడంలో మగ్నులైనంత ఎక్కువగా, వాటిని ప్రత్యక్షంగా తిరస్కరించడంలో మగ్నులు కాలేదు. వీళ్ల చేతుల్లో పడిన శాస్త్రీయ సోషలిజం ఒక అవిభాజ్య విప్లవ సిద్ధాంతంగా మిగలక, కొత్తగా వెలువడిన ప్రతి ఒక్క జర్మన్ పాఠ్య పుస్తక సారాంశాన్నీ ''ధారాళంగా'' మిళాయించిన కలగూర గంప మాదిరిగా తయారైంది. ''ఆర్థిక పోరాటం రాజకీయ పోరాటంతో అవిభాజ్యంగా ముడిపడివుంది'' కనుక, ''వర్గ పోరాట'' నినాదం వీళ్లని మరింత విస్తృతమూ, మరింత శక్తివంతమూ అయిన కార్యకలాపాలకు పురిగొల్పడం మాని, సేదదీర్చే షర్బతుగా తయారైంది. పార్టీకి సంబంధించిన ఆలోచన విప్లవకారుల సమరశీల సంఘ నిర్మాణానికి ప్రేరణనివ్వక, ఒక రక

---

* నేను దీనికి "Den Sack schlägt man, den Esel meint man" (''నువ్వు బాదుతున్నదేమో బస్తాని, కాని అసలు నువ్వు బాదాలని అనుకున్నదేమో గాడిదని'') అన్న జర్మన్ సామెతతో కూడా జవాబు చెప్పగలను. ఒక్క ''రబోచెయె దేలో''యే కాకుండా, ప్రత్యక్ష కార్యకర్తల్లో బహుళ సంఖ్యాకులూ, సిద్ధాంతకర్తలూ కూడా ప్రబలంగా వున్న ఫేషను మేరకు ''విమర్శనల''లో కొట్టుకుపోయారు. సద్యోజనితత్వం సమస్య విషయంలో గందరగోళంలో పడటం, మన రాజకీయ, నిర్మాణ కర్తవ్యాల విషయంలో సోషల్ డెమోక్రటిక్ అవగాహననుంచి ట్రేడ్‌యూనియనిస్టు అవగాహనకు దిగజారడమే యిందుకు కారణం.

''విప్లవ బ్యూరాక్రసీ''నీ, పిల్లల మాదిరిగా ''ప్రజాస్వామిక'' రూపాల్లో నాటకం ఆడటాన్నీ సమర్థించడానికి ఉపయోగపడింది.

ఈ మూడో దశ ఎప్పుడు ముగుస్తుందో, నాలుగోది ఎప్పుడు మొదలవుతుందో మనకి తెలియదు (కాని, నాలుగో దశ ఆరంభానికి సంబంధించిన అనేక సూచనలు యిప్పుడు కని పిస్తున్నాయి). ఈనాడు గత చరిత్ర రంగంనుంచి వర్తమాన రంగంలోకీ, పాక్షికంగా భవి ష్యత్ రంగంలోకీ మనం అడుగుపెట్టాం. అయితే మన దృఢ విశ్వాసం ఏమిటంటే, యీ నాలుగో దశలో సమరశీల మార్క్సిజం బలపడుతుంది, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం సంక్షోభంనుంచి బయటపడి, పూర్తి ప్రౌఢత్వాన్ని సంతరించుకుంటుంది, సమా జంలోని అత్యంత విప్లవకర వర్గపు నికార్సైన అగ్రగామి దళం అవకాశవాద తిరోగామి దళాన్ని ''తోసివేసి, దాని స్థానాన్ని స్వీకరిస్తుంది.''

అటువంటి ''బదలాయింపు'' కోసం నినాదమిచ్చే దృష్ట్యానూ, పైన వివరింపబడిన దాని సారాంశం దృష్ట్యానూ ''ఏం చెయ్యాలి?'' అన్న ప్రశ్నకు మనం సంక్షిప్తమైన యీకింది జవాబును యివ్వవచ్చు:

మూడో దశను అంతం చెయ్యాలి!

1901 ఆకురాలు కాలానికీ, 1902 ఫిబ్రవరికీ
మధ్య రచింపబడినది
మొదటిసారిగా ష్టుట్‌గార్ట్‌లో 1902
మార్చిలో ప్రత్యేక పుస్తకంగా
ప్రచురింపబడింది

## అను బం ధం

# "రబోచెయె దేలో"నీ, "ఇస్క్రా"నీ ఐక్యంచేసే ప్రయత్నం

"రబోచెయె దేలో"తో నిర్మాణపరమైన తన సంబంధాల విషయంలో "ఇస్క్రా" అవలంబించినటువంటి, సుసంగతంగా అనుసరించినటువంటి ఎత్తుగడలను వర్ణించడమే యిప్పుడిక నాకు మిగిలింది. ఈ ఎత్తుగడలు "ఇస్క్రా" 1వ సంచికలో "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్‌లో చీలిక" అనే శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసంలో పూర్తిగా వివరింపబడ్డాయి. మేము వెన్వెంటనే యీకింది అభిప్రాయాన్ని అవలంబించాం: మన పార్టీ ప్రథమ మహాసభ దేన్నైతే విదేశాల్లో తన ప్రతినిధిగా గుర్తించిందో ఆ "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" రెండు సంఘాలుగా చీలిపోయింది; పార్టీ ప్రాతినిధ్య సమస్య తేలకుండానే ఉండిపోయింది, పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ మహాసభలో "అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో"[202]కి, చీలిపోయిన "దేశాంతర యూనియన్"యొక్క రెండు విభాగాల్లో ఒక్కొక్క దానినుంచి ఒక్కొక్కరు చొప్పున యిద్దరు ప్రతినిధులను రష్యాకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎన్నుకోవడంద్వారా యీ సమస్య తాత్కాలికంగా, షరతులతో మాత్రమే పరిష్కరింపబడింది. "రబోచెయె దేలో"ది మౌలిక విషయాల్లోనే పొరపాటు అని మేము ప్రకటించాం; సూత్రరీత్యా మేం దృఢంగా "శ్రమ విమోచన" గ్రూపు పక్షం వహించాం, అదే సమయంలో చీలిక వివరాల్లోకి వెళ్లేందుకు నిరాకరించాం, "దేశాంతర యూనియన్" కేవలం ఆచరణాత్మక రంగంలో చేసిన సేవలను గుర్తించాం.*

కాగా, మన విధానం, కొంతమేరకు, నిరీక్షణ విధానం. ఆర్థికవాదానికి బద్ధ వ్యతిరేకులైనవాళ్లు "దేశాంతర యూనియన్"తో చెయ్యీ చెయ్యీ కలిపి పనిచెయ్యడం సాధ్యమంటూ అధిక సంఖ్యాక సోషల్ డెమోక్రట్లలో ప్రచలితంగా వున్న అభిప్రాయాలకు నేను కొంత

* చీలిక విషయంలో నా నిర్ణయం, యీ అంశానికి సంబంధించిన సాహిత్య పఠనం పైననే కాకుండా, మన సంఘ సభ్యులు కొందరు స్వయంగా విదేశాల్లో సేకరించిన సమాచారంపైన కూడా ఆధారపడి చెయ్యబడింది.

మేరకు మినహాయింపు యిచ్చాం. ''దేశాంతర యూనియన్'' సిద్ధాంతానికీ, ఎత్తుగడలకీ సంబంధించిన మౌలిక సమస్యలపై స్వతంత్ర వైఖరిని అవలంబించినట్లు కనిపించకపోవడం, ''శ్రమ విమోచన'' గ్రూపుతో సూత్రరీత్యా తన ఏకీభావాన్ని పదేపదే అది ప్రకటించడమే యిందుకు కారణం. మేము తీసుకున్న యీ వైఖరి సరైనదన్న విషయం యీకింది అంశాల ద్వారా పరోక్షంగా నిరూపింపబడింది: ''ఇస్క్రా'' మొదటి సంచిక (1900 డిసెంబరు) వెలువడీ వెలువడగానే, ముగ్గురు సభ్యులు ''దేశాంతర యూనియన్'' నుంచి విడిపోయి, ''ఆరంభకుల గ్రూపు'' అనబడేదాన్ని ఏర్పాటుచేసి, రాజీకోసం జరిగే సంప్రదింపుల్లో మధ్యస్థులుగా యీకింది వాటికి సహాయం చేస్తామని వాగ్దానం చేశారు: (1) ''ఇస్క్రా'' సంఘ దేశాంతర విభాగానికి, (2) ''సొత్సియాల్ డెమొక్రట్'' విప్లవ సంఘానికి,[203] (3) ''దేశాంతర యూనియన్''కి. మొదటి రెండు సంఘాలూ యీ ప్రతిపాదనకు వెన్వెంటనే తమ ఆమోదాన్ని తెలిపాయి; మూడోది యీ ప్రతిపాదనను తిరస్కరించింది. పోయిన ఏడాది జరిగిన ''ఐక్యతా'' మహాసభలో ఒక వక్త యీ విషయాన్ని ప్రస్తావించినప్పుడు, ''దేశాంతర యూనియన్'' నిర్వాహక కమిటీ సభ్యుడొకడు, యీ ప్రతిపాదనను తిరస్కరించడానికి, ''ఆరంభకుల గ్రూపు'' సంపుటి పట్ల ''దేశాంతర యూనియన్'' అసంతృప్తి చెందడమే ఏకైక కారణం అని ప్రకటించాడు, ఇది యథార్థం. ఈ వివరణను యిక్కడ ఉదహరించడం నా విధిగా నేను భావించాను, అయితే యిది తృప్తికరమైనది కాదని చెప్పడానికి నేను వెనుకాడను. ఎందుకంటే, రెండు సంఘాలు సంప్రదింపులకు సిద్ధపడ్డాయని తెలిసినప్పుడు, ''దేశాంతర యూనియన్'' మరో మధ్యస్థుడి ద్వారానో, లేక నేరుగానో వాటితో సంప్రదింపులు జరిపి వుండవలసింది.

1901 వసంత కాలంలో ''జర్యా'' (సంచిక 1, ఏప్రిల్), ''ఇస్క్రా'' (సంచిక 4, మే) – రెండూ ''రబోచెయె దేలో''తో బహిరంగ వాదోపవాదాలను మొదలెట్టాయి. ''ఇస్క్రా'' ''రబోచెయె దేలో''లో వెలువడిన ''చారిత్రకమైన మలుపు'' అన్న వ్యాసాన్ని ప్రత్యేకించి విమర్శించింది. ''రబోచెయె దేలో'' తన ఏప్రిల్ అనుబంధంలో, అంటే, వసంత కాలపు ఘటనల తర్వాత, టెరరిస్టు కార్యకలాపాలు జరపాలనీ, ''రక్తానికి రక్తంతో ప్రతీకారం తీర్చుకోవాలనీ'' చెయ్యబడిన విజ్ఞప్తుల విషయంలో – అప్పట్లో చాలా మంది యీ విజ్ఞప్తితో కొట్టుకుపోయారు – ఊగిసలాటను ప్రదర్శించింది. ఈ వాద వివాదాలు జరుగుతున్నా కూడా, ''దేశాంతర యూనియన్,'' ''మధ్యస్థుల'' ఓ కొత్త బృందం[204] ద్వారా, రాజీ సంప్రదింపులను తిరిగి మొదలెట్టేందుకు ఆమోదాన్ని తెలిపింది. పైన పేర్కొనబడిన మూడు సంఘాల ప్రతినిధుల ప్రాథమిక సమావేశం ఒకటి జూన్‌లో జరిగింది. బాగా సవివరమైన ''సూత్రాలపై ఒప్పందం'' ప్రాతిపదికపైన ఆ సమావేశం ఒక ముసాయిదా ఒప్పందాన్ని రూపొందించింది. ఈ ఒప్పందాన్నే ''దేశాంతర యూనియన్'' ''రెండు

మహాసభలు'' అన్న పుస్తకంగానూ, ''విదేశాల్లో లీగు'' '''ఐక్యతా' మహాసభ పత్రాలు'' అన్న పుస్తకంగానూ ప్రచురించింది.

సూత్రాలపై యీ ఒప్పంద అంశాలను (వీటినే చాలా మంది ''జూన్ కాన్ఫరెన్సు తీర్మానాలు'' అని పిలుస్తూ వుంటారు) చూసినట్లయితే, మొత్తంగా అవకాశవాదానికి చెందిన అన్ని రూపాలనూ, ప్రతి ఒక్క రూపాన్నీ, ప్రత్యేకించి రష్యన్ అవకాశవాదాన్నీ అత్యంత దృఢంగా నిరాకరించడం అవసరమన్న విషయాన్ని ఐక్యతకి ఒక పరమ షరతుగా పెట్టామన్న విషయం పూర్తిగా స్పష్టమవుతుంది. 1వ నిబంధన యిలా వుంది: ''శ్రామిక వర్గపు వర్గపోరాటంలోకి అవకాశవాదాన్ని — అర్థికవాదం, బెర్న్‌స్టైనిజం, మిల్లెరానిజం వగైరా పేర్లతో చలామణీ అయ్యే అవకాశవాదాన్ని — ప్రవేశపెట్టేందుకు జరిగే అన్ని ప్రయత్నాలనూ మనం తిరస్కరిస్తాం.'' ''సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాల పరిధిలో... విప్లవాత్మక మార్క్సిజానికి ప్రత్యర్థులైన వాళ్లందరికీ వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం యిమిడివుంటుంది'' (4, సి.); ''నిర్మాణ, ఆందోళన కార్యకలాపాలకు సంబంధించిన ప్రతి ఒక్క రంగంలోనూ నిరంకుశ ప్రభుత్వాన్ని కూల్చివెయ్యడమే రష్యన్ శ్రామికవర్గపు తక్షణ కర్తవ్యమన్న విషయాన్ని సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం, ఒక్క క్షణం కూడా ఎన్నడూ విస్మరించకూడదు'' (5, ఎ); ''...వేతన శ్రమకీ పెట్టుబడికీ మధ్య రోజువారీ ఘర్షణ ప్రాతిపదికపైన మాత్రమే ఆందోళన జరగరాదు'' (5, బి); ''...శుద్ధ ఆర్థిక పోరాట దశనూ, పాక్షిక రాజకీయ డిమాండ్ల కోసం జరిగే పోరాటాన్నీ... మనం గుర్తించం'' (5, సి); ''...అపరిణతత్వాన్నీ... ఉద్యమపు నిమ్న రూపాల సంకుచితత్వాన్నీ సిద్ధాంతీకరించే ధోరణులను విమర్శించడం ఉద్యమానికి ప్రయోజనకరమని మనం పరిగణిస్తున్నాం'' (5, డి). పూర్తిగా కొత్తవాడైనా కూడా, యీ తీర్మానాలను ఏ మాత్రమైనా శ్రద్ధగా చదివినట్లయితే, అవి సూత్రీకరింపబడిన తీరునుబట్టే, అవి అవకాశవాదులకూ, ఆర్థికవాదులకూ, క్షణకాలమైనా కూడా నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసే కర్తవ్యాన్ని విస్మరించిన వాళ్లకూ, దశల సిద్ధాంతాన్ని ఆమోదించినవాళ్లకూ, సంకుచితత్వాన్ని సూత్ర స్థాయికి ఎత్తినవాళ్లు వగైరాలకూ వ్యతిరేకంగా ఉద్దేశింపబడ్డాయని గుర్తిస్తాడు. ''శ్రమ విమోచన'' గ్రూపూ, ''జర్యా,'' ''ఇస్క్రా''లు — ''రబోచెయె దేలో''తో జరిపిన వాదవివాదాలతో ఏ కొంచెం పరిచయం ఉన్నవాడైనా కూడా, యీ తీర్మానాలు, ఒక అంశం తర్వాత ఒకటిగా, ''రబోచెయె దేలో'' చేసిన పొరపాట్లనే ఖండించాయన్న విషయాన్ని ఒక్క క్షణం కూడా శంకించడు. అందుకని, ''దేశాంతర యూనియన్'' సభ్యుడొకడు ''ఐక్యతా'' మహాసభలో, ''రబోచెయె దేలో'' 10వ సంచికలోని వ్యాసాలకు, ''దేశాంతర యూనియన్'' విషయంలో ఓ కొత్త ''చారిత్రకమైన మలుపు'' కాక, ఆ తీర్మానాలలో వున్న అతి ''అని

ర్దిష్టతే'' ప్రేరణ అని అన్నప్పుడు,* యీ ఉద్ఘాటనను ఉపన్యాసకుల్లో ఒకరు సహేతుకంగానే హేళన చేశాడు. ఆ తీర్మానాలు అనిర్దిష్టంగా ఉండకపోవడం మాట అటుంచి, నమ్మలేనంత నిర్దిష్టంగా ఉన్నాయనీ, చూచినంత మాత్రానసే, అవి ''ఎవరినో బోల్తా కొట్టించేందుకే'' ఉద్దేశింపబడ్డట్లు తెలుస్తోందనీ ఆయన అన్నాడు.

ఈ వ్యాఖ్య ఫలితంగా మహాసభలో ఆసక్తిదాయకమైన ఒక ఘటన జరిగింది. ఓ పక్కన బి. క్రిచేవ్‌స్కీ యీ ''పట్టుకోవడం'' అన్న పదాన్ని పట్టుకున్నాడు. ఇదేదో మా దుస్సంకల్పాలను బయటపెట్టే మాట (''బోనును ఒగ్గటం'') అనీ, దీన్ని మేము నోరుజారి అనివుంటామనీ అనుకుని, ఆయన నాటకీయంగా యిలా అన్నాడు: ''నేను అడుగుతున్నాను, వాళ్లు ఎవళ్లని బోల్తా కొట్టించాలనుకుంటున్నారు? ఎవరిని?'' అప్పుడు ప్లెహానొవ్ ఊరుకోక వ్యంగ్యంగా యిలా డెకారించాడు: ''ఔను సుమా, ఎవరినంటారు?'' బి. క్రిచేవ్‌స్కీ యిలా జవాబిచ్చాడు: ''కామ్రేడ్ ప్లెహానొవ్ స్పష్టంగా అర్థంచేసుకోగలిగేందుకు వీలుగా, యీ బోను 'రబోచెయె దేలొ' సంపాదకవర్గంకోసం ఒగ్గబడిందని నేను చెప్పదలుచుకున్నాను (సర్వత్రా నవ్వు), అయితే మేం వాళ్లకి చిక్క లేదు!'' (ఎడమ పక్కనుంచి ఒక స్వరం: ''మీ విషయంలో యిది యింకా దారుణం!'') మరోవంక ''బొర్బా'' బృందం (రాజీవాదుల బృందం) సభ్యుడొకడు, తీర్మానాలకు ''దేశాంతర యూనియన్'' ప్రతిపాదించిన సవరణలకు వ్యతిరేకంగా, మన వక్తని సమర్థించాలన్న సంకల్పంతో, వాదవివాదాల వేడిలో ''బోల్తా కొట్టించడం'' అన్న పదం జారినట్లుందని అన్నాడు.

నాకు సంబంధించినంతవరకు, యీ మాట అన్న వక్త యీ ''సమర్థన''పట్ల సంతోషిస్తాడని నేను అనుకోను. ''ఎవరినో బోల్తా కొట్టించడం కోసం ప్రయత్నించడం'' అన్న మాటలు ''తమాషాగానే అన్నా నిజమైన మాటలు'' అని నేను అనుకుంటున్నాను; ''రబోచెయె దేలొ'' స్థిరత్వాన్ని ప్రదర్శించడంలేదనీ, ఊగిసలాడుతోందనే మేమెప్పుడూ ఆరోపిస్తూ వచ్చాం. కాగా, సహజంగానే, దాని ఊగిసలాటను తుదముట్టించేందుకు గాను దాన్ని పట్టుకునేందుకు మేము ప్రయత్నించవలసివచ్చింది. మనం చర్చిస్తున్నది సూత్రాల విషయంలో అస్థిరత్వం గురించి కనుక ఇందులో దుస్సంకల్పం యీషణ్మాత్రం కూడా లేదు. ''దేశాంతర యూనియన్''ని కామ్రేడ్లీ పద్ధతిలో** ''పట్టుకోడంలో'' మేం ఎంతటి సాఫ

* ''రెండు మహాసభలు''లో యీ ఉద్ఘాటన పేజి 25లో రెట్టింపబడింది.

** సరిగా యిదీ సంగతి: జూన్ తీర్మానాల ముందుమాటలో, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం మొత్తంగా ''శ్రమ విమోచన'' గ్రూపు సూత్రాలనే ఎప్పుడూ సమర్థించిందనీ, ''దేశాంతర యూనియన్'' చేసిన ప్రత్యేక సేవ అది చేసిన ప్రచురణ, నిర్మాణపర కార్యకలాపాలేనని మేం పేర్కొన్నాం. వేరే మాటల్లో చెప్పాలంటే, గతాన్ని విస్మరించేందుకూ, ''దేశాం

ల్యం పొందామంటే, స్వయానా బి. క్రిచేవ్‌స్కీ, ''దేశాంతర యూనియన్'' పాలక కమిటీకి చెందిన మరొక సభ్యుడూ జూన్ తీర్మానాలపై సంతకాలు పెట్టారు.

''రబోచెయె దేలొ'' 10వ సంచికలో ప్రచురింపబడిన వ్యాసాలనుబట్టి, (మన కామ్రేడ్సు మహాసభకు చేరుకున్నాక, సభలు ప్రారంభమయ్యేందుకు కొద్ది రోజుల ముందు మాత్రమే మొట్టమొదటి సారి యీ సంచికను చూశారు), వేసవికీ, ఆకురాలు కాలానికీ మధ్య ''దేశాంతర యూనియన్'' ఓ కొత్త మలుపు తిరిగిందన్న విషయం సుస్పష్టమైంది: ఆర్థికవాదులు మళ్లీ పై చెయ్యి సంపాదించుకున్నారు, యెలా పడితే అలా ప్రతి ''గాలి వాటుకీ'' దిక్కు మార్చే సంపాదకవర్గం, మళ్లీ ''బాహాటమైన బెర్న్‌స్టైన్‌వాదులనూ,'' ''విమర్శనా స్వేచ్ఛ''నూ, సద్యోజనితత్వాన్నీ సమర్థించడం మొదలెట్టింది, మర్తీనొవ్ నోట మన రాజకీయ ప్రభావ పరిధిని ''పరిమితం చేసే సిద్ధాంతాన్ని'' (యీ ప్రభావాన్ని మరింత సంక్లిష్టం చేసేందుకనబడే సాకుతో బోధించడటం మొదలెట్టింది. ఏ అవకాశవాదినైనా సూత్రరీత్యా పట్టుకోవడం కష్టం అన్న పార్వుస్ సూక్తి నిజమని మరోసారి నిరూపితమైంది. అవకాశవాది ఏ సూత్రం మీదనైనా వెంటనే సంతకమూ పెడతాడు, అంత తేలిగ్గానూ దాన్ని త్యజించనూ త్యజిస్తాడు, ఎందుకంటే నిశ్చితమూ, సుదృఢమూ అయిన సూత్రాలు లేకపోవడానికి మారుపేరే అవకాశవాదం. ఈ రోజున, అవకాశవాదులు ఉద్యమంలో అవకాశవాదాన్ని చొప్పించే అన్ని ప్రయత్నాలనూ, అన్ని రకాల సంకుచితత్వాన్నీ ఖండిస్తూ ప్రకటించారు; ''నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసే కర్తవ్యాన్ని ఒక్క క్షణం కూడా విస్మరించబోము'' అనీ, ''వేతన శ్రమకీ పెట్టుబడికీ మధ్య రోజువారీ పోరాట ప్రాతిపదికపైన మాత్రమే ఆందోళనను'' సాగించమనీ, గంభీరంగా వాగ్దానంచేశారు; వగైరా, వగైరా. కాని రేపే తమ మాటల ధోరణిని మార్చేసి, సద్యోజనితత్వాన్నీ, నీరసమైనందిన పోరాట పురోగతినీ సమర్థించే సాకుతో, ప్రత్యక్ష ఫలితాలను యివ్వగల అవకా

---

తర యూనియన్'' ఉపయోగకర కార్యకలాపాలు (ఉద్యమం కోసం) చేసిందని ఒప్పుకునేందుకూ మేము పూర్తిగా సిద్ధమే, అయితే, అందుకు షరతు ఏమిటంటే, మేము దేన్నైతే ''పట్టుకునేందుకు'' ప్రయత్నించామో ఆ ఊగిసలాటను అది పూర్తిగా విడిచిపెట్టాలి. జూన్ తీర్మానాలను చదివిన ఏ నిష్పాక్షిక వ్యక్తి అయినా వాటికి యిలా మాత్రమే భాష్యం చెప్తాడు. ''దేశాంతర యూనియన్,'' ఆర్థికవాదంగా తను తీసుకున్న కొత్త మలుపు ద్వారా (10వ సంచికలోని తన వ్యాసాల్లోనూ, సవరణల్లోనూ) చీలికను కల్పించిన తర్వాత, దాని సేవలను గురించి మేం చెప్పిన మాటల్ని పుచ్చుకుని, మామీద అబద్ధం చెప్తున్నామన్న ఆరోపణచేస్తోంది (''రెండు మహాసభలు,'' పేజి 30), ఇప్పుడిక మేము చెయ్యగలిగిందల్లా, చిరునవ్వు నవ్వి ఊరుకోవడం మాత్రమే.

శమున్న డిమాండ్లు వగైరాలను మెచ్చుకొనే సాకుతో, వాళ్లు తమ పాత ఎత్తులకు తిరిగి పూనుకుంటారు. 10వ సంచికలోని వ్యాసాల్లో ''మహాసభలో ఆమోదింపబడిన ముసాయిదా సాధారణ సూత్రాలను '' 'దేశాంతర యూనియన్' వెనక గాని, యిప్పుడు గాని విడిచిపెట్టి నట్లు భావించడం లేదు'' (''రెండు మహాసభలు,'' పేజి 26) అంటూ పదే పదే ఉద్ఘాటించడం ద్వారా, అభిప్రాయభేదాలకు సంబంధించిన ప్రధానాంశాలను అర్థంచేసుకునే సామర్థ్యం గాని, యిచ్ఛ గాని తనకు బొత్తిగా లేదన్న విషయాన్ని మాత్రమే ''దేశాంతర యూనియన్'' బయటపెట్టుకుంటోంది.

''రబోచెయె దేలొ'' 10వ సంచిక వెలువడ్డాక, మేమీ కింది ఒక్క ప్రయత్నాన్ని మాత్రమే చెయ్యగలిగాం: ''దేశాంతర యూనియన్'' సభ్యులు అందరూ యీ వ్యాసాలతోనూ, సంపాదకవర్గంతోనూ ఏకీభవిస్తున్నారా అన్న విషయాన్ని తేల్చుకునేందుకు గాను ఒక సాధారణ చర్చను మొదలుపెట్టడమే అది. ప్రత్యేకించి సరిగా యీ విషయంమీదనే ''దేశాంతర యూనియన్''కి మామీద కోపం వచ్చింది, ఇందుకే అది, మేము తన సభ్యుల మధ్య చీలిక తేవాలని ప్రయత్నిస్తున్నామనీ, యితరుల విషయాల్లో మేము వేలు పెడుతున్నామనీ, వగైరా వగైరా ఆరోపణలు చేస్తోంది. ఈ ఆరోపణలు ఆధారరహితమైనవన్న విషయం స్పష్టం, ఎందుకంటే, ఎంత చిన్నదైనా కూడా యే గాలివాటు పడితే దానికి, ''దిక్కు మార్చే'' ఎన్నుకోబడిన సంపాదకవర్గం విషయంలో ప్రతీదీ కూడా గాలివాటు మీద ఆధారపడివుంటుంది; ఐక్యం కావాలని కోరుకునే సంఘాల సభ్యులు తప్ప మరెవ్వరూ లేని ప్రైవేటు సమావేశాల్లో ఆ దిక్కుని మేం నిర్వచించాం. ''దేశాంతర యూనియన్'' పేర దాఖలుచెయ్యబడిన సవరణలను బట్టి ఒప్పందం కుదిరే అవకాశ లేశం కూడా లేదని తేలిపోయింది. ఆర్థికవాదం వైపు మొగ్గుకీ, ''దేశాంతర యూనియన్'' సభ్యుల్లో అధిక సంఖ్యాకులు ''రబోచెయె దేలొ'' 10వ సంచికతో ఏకీభవిస్తున్నారన్న వాస్తవానికీ యీ సవరణలు రాతపూర్వకమైన రుజువులు. అవకాశవాద వ్యక్తీకరణల ప్రస్తావననుంచి ''ఆర్థిక వాదం అనబడే'' అన్న మాటల్ని తొలగించాలని ప్రతిపాదించబడింది (ఈ మాటల ''అర్థం'' ''అస్పష్టంగా ఉంది'' అంటూ యిందుకు సాకు చెప్పబడింది; అదే కారణం అయ్యేమాటైతే, ప్రచలితంగా వున్న పొరపాటు స్వభావాన్ని గురించి మరింత కచ్చితమైన నిర్వచనాన్ని యివ్వడం) ''మిల్లెరానిజం'' అన్న మాటని తొలగించడమే (బి. క్రిచేవ్‌స్కీ ''రబోచెయె దేలొ,'' సంచిక 2–3, పేజీలు 83–84ల్లోనూ "Vorwärts"లో మరింత బాహాటంగానూ ఆ మాటను సమర్థించినప్పటికీ)* యిప్పుడు జరగవలసిందల్లా. సోషల్ డెమొక్ర

* ఈ విషయంమీద "Vorwärts"లో, దాని ప్రస్తుత సంపాదకుడు కౌట్స్కీకీ, ''జర్యా'' సంపాదకవర్గానికీ మధ్య యిప్పుడు వాదోపవాదాలు జరుగుతున్నాయి. రష్యన్ పాఠకుడికి మేమీ వాదోపవాదాలతో పరిచయం చెయ్యక మానం.[205]

టిక్ ఉద్యమ కర్తవ్యం ''అన్ని రకాల రాజకీయ, ఆర్థిక, సామాజిక పీడనకూ వ్యతిరేకంగా జరిగే శ్రామికవర్గ పోరాట వ్యక్తీకరణ ప్రతిదానికీ నాయకత్వం వహించడమే'' అని జూన్ తీర్మానాలు నిర్దిష్టంగా సూచించాయి, తద్వారా యీ పోరాట వ్యక్తీకరణలన్నింటిలోనూ ఒక వ్యవస్థనూ, ఐక్యతనూ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తిచేశాయి, అయినా కూడా, ''దేశాంతర యూనియన్'' పూర్తిగా అప్రస్తుతమైన యీకింది మాటలను జోడించింది. ''జనసామాన్యపు ఉద్యమానికి ఆర్థిక పోరాటం శక్తివంతమైన ప్రేరణ నిస్తుంది'' (యీ ఉద్ఘాటనను విడిగా తీసుకున్నప్పుడు, దీన్ని కాదని ఎవరూ అనలేరు, కాని సంకుచిత ఆర్థికవాదం అస్తిత్వంలో ఉన్న మూలంగా, అది తప్పు భాష్యాలు చెప్పడానికి తప్పక అవకాశమిస్తుంది), అంతే కాకుండా, ''ఒక్క క్షణం కూడా'' (నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యాన్ని విస్మరించ రాదు) అన్న మాటలను తొలగించడం ద్వారానూ, జనసామాన్యాన్ని క్రియాశీల రాజకీయాల్లోకి లాక్కురావడంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించదగిన సాధనం ఆర్థిక పోరాటమే'' అన్న మాటలను చేర్చడం ద్వారానూ జూన్ తీర్మానాలలో ''రాజకీయాలను'' సంకుచితం చెయ్యాలని కూడా ప్రయత్నం జరిగింది. సహజంగానే, యిలాంటి సవరణలు ప్రతిపాదింపబడిన తర్వాత మన పక్షానికి చెందిన వక్తలందరూ, ఒకరి తర్వాత ఒకరు వేదికమీదకి ఎక్కి మాట్లాడేందుకు నిరాకరించారు. మళ్లీ ఆర్థికవాదం వేపు తిరిగి, ఊగిసలాట ప్రదర్శించే స్వేచ్ఛను సంపాదించుకునేందుకు కృషిచేస్తున్నవాళ్లతో సంప్రదింపులు కొనసాగించడం వృథా అని వాళ్లు గ్రహించడమే యిందుకు కారణం.

''మన భవిష్యత్ ఒప్పందపు స్థిరత్వానికి 'రబోచెయె దేలొ' స్వతంత్ర లక్షణాలనూ, దాని స్వయం ప్రతిపత్తినే, sine qua non* 'దేశాంతర యూనియన్' పరిగణించగా, 'ఇస్క్రా' సరిగా వీటినే ఒప్పందానికి అవరోధాలుగా పరిగణించింది'' (''రెండు మహాసభలు,'' పేజి 25). ఇది శుద్ధ పొరపాటు. ''రబోచెయె దేలొ'' స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించాలన్న సంకల్పం మాకు ఎన్నడూ లేదు.** ''స్వతంత్ర ధోరణులు'' అన్నప్పుడు, సిద్ధాంతం, ఎత్తుగడల సమస్యలపై సూత్రరీత్యా స్వాతంత్ర్యం అన్న అర్థమే అయితే, దాని స్వతంత్ర ధోరణులను గుర్తించేందుకు నిజంగానే మేము ఎంత మాత్రం ఒప్పుకోలేదు. జూన్ తీర్మానాలలో అలాంటి స్వతంత్ర ధోరణుల పూర్తి నిరాకరణ వుంది. ఎందుకంటే, ఆచరణలో, అలాంటి ''స్వతంత్ర ధోరణుల''కి

* తప్పని సరిగా. — సం.

** అయితే ఐక్యం చెయ్యబడిన గ్రూపుల అత్యున్నత సంయుక్త సమితి స్థాపన విషయంలో సలహా సంప్రదింపులను స్వయం ప్రతిపత్తికి భంగకరమైనవిగా పరిగణించకుండా వుండాలి. కాని జూన్‌లో ''రబోచెయె దేలొ'' యీ విషయాన్ని ఒప్పుకుంది.

ఎప్పుడూ ఒకటే అర్థం వుంటుంది. మేమింతకు ముందే పేర్కొన్నట్లు, మనలో వున్న అనైక్యతను — పార్టీ దృష్ట్యా సహించరాని అనైక్యతను — పెంచే రకరకాల ఊగిసలాటలే యీ స్వతంత్ర ధోరణులు. ''రబోచెయె దేలొ'' తన పదవ సంచికలో ప్రచురించిన వ్యాసాలను బట్టీ, దాని ''సవరణల''ను బట్టీ యీ మాదిరి స్వతంత్ర ధోరణులనే అది భద్రపరచాలని కోరుతున్నట్లు స్పష్టంగా వెల్లడవుతోంది. కాగా, అలాంటి కోరిక, సహజంగానే చీలికకూ, యుద్ధ ప్రకటనకూ దారితీసింది. అయితే, అది కొన్ని నిర్దిష్టమైన సాహిత్య విధుల నిర్వహణపట్ల తన దృష్టిని కేంద్రీకరించినప్పుడు, ''రబోచెయె దేలొ'' ''స్వతంత్ర ధోరణుల''ను గుర్తించేందుకు మాకు అభ్యంతరం లేదు. ఈ విధుల సముచిత కేటాయింపు జరిగినప్పుడు సహజంగానే అవి యిలా వుంటాయి. (1) ఒక సైద్ధాంతిక పత్రిక, (2) ఒక రాజకీయ పత్రిక, (3) జనరంజకమైన వ్యాస సంపుటాలు, జనరంజకమైన చిన్నచిన్న పుస్తకాలు. ఈ మాదిరి విధుల కేటాయింపును ఆమోదించడం ద్వారా మాత్రమే, తాను తన పొరపాట్లను — ఏ పొరపాట్లనైతే జూన్ తీర్మానాలు వ్యతిరేకించాయో వాటిని — శాశ్వతంగా విడిచిపెట్టాలని చిత్తశుద్ధితో వాంఛిస్తున్నట్లు ''రబోచెయె దేలొ'' నిరూపించుకోగలుగుతుంది. ఆ మాదిరి విధుల కేటాయింపు జరిగినప్పుడే ఘర్షణకి దారితీయగల అవకాశాలన్నీ తొలగిపోతాయి, నాలుగు కాలాల పాటు నిలబడే ఒప్పందానికి హామీ ఏర్పడుతుంది, దీనికి తోడు, మన ఉద్యమ పునరుజ్జీవనానికీ, నూతన విజయాలకీ ప్రాతిపదిక ఏర్పడుతుంది.

విప్లవ ధోరణులకీ అవకాశవాద ధోరణులకీ మధ్య సంబంధాల్లో ఏర్పడిన యీ అంతిమ విచ్ఛేదానికి ఏ ''నిర్మాణపరమైన'' పరిస్థితులూ కాక, అవకాశవాదపు స్వతంత్ర ధోరణులను సంఘటితం చేసుకొని, క్రిచేవ్‌స్కీ, మర్తీనొవ్ బాపతువాళ్ల ఉపదేశాల ద్వారా కామ్రేడ్ల మనసుల్లో గందరగోళం కల్పించాలన్న వాంఛయే కారణమన్న విషయంలో ఏ రష్యన్ సోషల్ డెమొక్రట్‌కీ, యిప్పుడిక యీషణ్మాత్రం సందేహం కూడా ఉండజాలదు.

## ''ఏం చెయ్యాలి?''కి సవరణ

''ఏం చెయ్యాలి?'' అన్న శీర్షికతో నేను రాసిన చిన్న పుస్తకంలోని 141వ పేజిలో* ఏ ''ఆరంభకుల గ్రూపు''ను గురించైతే నేను ప్రస్తావించానో ఆ గ్రూపువారు, దేశాంతర సోషల్ డెమొక్రటిక్ సంఘాల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము చేసిన ప్రయత్నాన్ని గురించి నేనిచ్చిన వర్ణనకు యీ కింది సవరణ చెయ్యవలసిందిగా చెప్పారు: ''ఈ గ్రూపులో ముగ్గురు సభ్యుల్లోనూ, ఒక్కరు మాత్రమే 1900 అంతంలో ''దేశాంతర యూని యన్''నుంచి విడిపోయారు; మిగిలిన యిద్దరూ 1901లో, అంటే, విదేశాల్లోని ''ఇస్క్రా'' సంఘాలతోనూ, ''సోత్సియాల్ డెమొక్రట్'' విప్లవ సంఘాలతోనూ సమావేశం జరపా లని ''ఆరంభకుల గ్రూపు'' చేసిన ప్రతిపాదనకు ''దేశాంతర యూనియన్'' సమ్మతిని పొందడం దుస్సాధ్యమని తేలిపోయాక మాత్రమే, ''దేశాంతర యూనియన్''నుంచి విడి పోయారు. ''దేశాంతర యూనియన్'' నిర్వాహక కమిటీ, ''ఆరంభకుల గ్రూపు''లోని వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరించగల ''సామర్థ్యం లేనివారు'' అన్న కారణంతో, యీ ప్రతిపాదనను మొదట్లో తిరస్కరించి, విదేశాల్లోని ''ఇస్క్రా'' సంఘంతో నేరుగా సంప్ర దింపులు జరపాలన్న వాంఛను వ్యక్తంచేసింది. కాని, అందుకు కొద్ది కాలం తర్వాతనే ''దేశాంతర యూనియన్'' నిర్వాహక కమిటీ, ''యూనియన్''లో చీలికను గురించిన వార్త వున్న ''ఇస్క్రా'' మొదటి సంచిక వెలువడిన తర్వాత, తను తన నిర్ణయాన్ని మార్చుకు న్నాననీ, ''ఇస్క్రా''తో సంప్రదింపులు జరపాలని తానిక ఎంతమాత్రం కోరుకోవడం లేదనీ ''ఆరంభకుల గ్రూపు''కి తెలియజేసింది. దీని తర్వాత ''దేశాంతర యూనియన్'' నిర్వహణ కమిటీ సభ్యుల్లో ఒకరు, ''ఆరంభకుల గ్రూపు'' సభ్యుల సంపుటిపట్ల తమకు గల అసంతృప్తి మాత్రమే రాజీ సంప్రదింపులను యూనియన్ తిరస్కరించడానికి కార ణమంటూ చేసిన ప్రకటనను ఎవరైనా అర్థంచేసుకోవడం ఎలా? అయితే వాస్తవానికి, గత జూన్ మాసంలో ''దేశాంతర యూనియన్'' నిర్వహణ కమిటీ సంప్రదింపులు జరిపేం

---

* ఈ సంపుటంలోని 297 పేజి చూడండి. — సం.

దుకు ఎందుకు ఆమోదించిందన్న విషయాన్ని అర్థంచేసుకోవడం కూడా అంతే కష్టం; ఎందుకంటే, ''ఇస్క్రా'' మొదటి సంచికలోని ఆ వ్యాసం అప్పుడు కూడా ఉంది, ''దేశాంతర యూనియన్'' పట్ల ''ఇస్క్రా'' ''ప్రతికూల'' వైఖరి ''జర్యా'' మొదటి సంచికలోనూ, ''ఇస్క్రా'' 4వ సంచికలోనూ – యీ రెండూ కూడా జూన్ కాన్ఫరెన్సుకి ముందే వెలువడ్డాయి – మరింత ఘాటుగా వ్యక్తంచెయ్యబడింది.''

ఎన్. లెనిన్

''ఇస్క్రా'', సంచిక 19,
1 ఏప్రిల్, 1902

# వివరణలు

[1] గ్రనాత్ సోదరులు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం కోసం లెనిన్ యీ వ్యాసాన్ని రాశాడు. ఆయన దీన్ని పొరోనిన్ (గలీసియా)లో 1914 వసంతరుతువులో మొదలుపెట్టి అదే సంవత్సరం నవంబరులో బెర్న్ (స్విట్జర్లండ్)లో పూర్తిచేశాడు. 1918 నాటి చిన్న పుస్తకపు ముందుమాటలో తనకి గుర్తువున్న దాన్ని బట్టి, దీని రచనాకాలం 1913గా ఆయన పేర్కొన్నాడు.

ఆ విజ్ఞాన సర్వస్వపు 1915 నాటి సంపుటంలో గ్రనాత్ యీ వ్యాసాన్ని ప్రచురించారు. "మార్క్సిజపు గ్రంథవివరణ పట్టిక" దానికి అనుబంధంగా వుండింది, దాని కింద సంతకం "వి. ఇల్యీన్" అని వుంది. సెన్సార్‌షిప్ కారణాల వల్ల "సోషలిజం," "శ్రామికవర్గపు వర్గపోరాట యెత్తుగడలు" అన్న ప్రకరణాలను వదిలేశారు; వ్యాసంలో కొన్ని మార్పులు చేశారు.

1918లో "ప్రిబోయ్" ప్రచురణకర్తలు చిన్న పుస్తక రూపంలో గ్రనాత్ ప్రచురించిన దాన్ని యధాతథంగా ప్రచురించారు. దానికి "గ్రంథ వివరణ పట్టిక" లేదు. కాని లెనిన్ రాసిన ముందు మాట వుంది.

రాతప్రతినుండి గ్రహించిన పూర్తిపాఠం మొదటి సారిగా రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షెవిక్) కేంద్ర కమిటీ వారి లెనిన్ ఇన్‌స్టిట్యూట్ 1925లో తెచ్చిన "మార్క్స్, ఎంగెల్స్, మార్క్సిజం" సంకలనంలో ప్రచురితమైంది.

ఈ సంకలనంలో "మార్క్సిజపు గ్రంథ వివరణ పట్టిక" వదలి వేయబడింది. – 12.

[2] మెన్షెవిక్కులు – రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ఒక అవకాశవాద ధోరణికి ప్రతినిధులు. అంతర్జాతీయ అవకాశవాదంలో ఒక శాఖ అయిన ఈ ధోరణి 1903లో, ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభలో, లెనిన్ "ఇస్క్రా"కు వ్యతిరేకులైన వాళ్ళచేత రూపొందించబడింది. మహాసభలో, పార్టీ కేంద్ర సంస్థలకు జరిగిన యెన్ని

కలలో, లెనినిస్టులకు మెజారిటీ వోట్లు వచ్చాయి. అందువలన వాళ్లకు బోల్షెవిక్కులు అనే పేరు వచ్చింది. మైనారిటీగా వుండిన అవకాశవాదులకు మెన్షెవిక్కులనే పేరు వచ్చింది.

1905–1907 విప్లవ కాలంలో మెన్షెవిక్కులు విప్లవంలో కార్మికవర్గానికి నాయకత్వ పాత్ర ఉండకూడదనీ, కార్మికవర్గానికీ రైతాంగానికీ మధ్య మైత్రి అక్కర లేదనీ వాదించారు, ఉదారవాద బూర్జువావర్గానికి విప్లవంలో నాయకత్వాన్ని అప్ప గించాలనీ, దానితో పొత్తు కుదుర్చుకోవాలనీ వాదించారు. విప్లవం ఓటమి చెందిన తరువాత, అభివృద్ధి నిరోధక దాడి సంవత్సరాలలో, మెన్షెవిక్కులలో చాలమంది లిక్వి డేటర్లు (రద్దువాదులు) అయ్యారు. వాళ్లు కార్మికవర్గ విప్లవ రహస్య పార్టీని రద్దు చేయాలని డిమాండుచేశారు.

1917 ఫిబ్రవరిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవ విజయానంతరం మెన్షె విక్కులు బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రి పదవులు వహించారు. దాని సామ్రాజ్యవాద విధానాన్ని బలపరచారు, సోషలిస్టు విప్లవంకోసం చేసిన సన్నాహాలను వ్యతిరేకించారు. అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం తర్వాత వాళ్లు యితర విప్లవ ప్రతీ ఘాత పార్టీలతో కలిసి, సోవియట్ ప్రభుత్వంతో పోరాడారు. – 12.

[3] వామపక్ష హేగెలియన్లు లేదా యువ హేగెలియన్లు – 19వ శతాబ్దపు 30–40వ దశకాలలో వ్యాప్తిలో వున్న జర్మన్ తత్వశాస్త్రపు భావవాద ధోరణి. జర్మనీలో బూర్జువా సంస్కరణ అవసరాన్ని రుజావు చెయ్యాలని యువ హేగెలియన్లు హేగెల్ తత్వశాస్త్రం నుంచి విప్లవ నిర్ధారణలు చేయడానికి ప్రయత్నించారు. డి. స్ట్రౌస్, బి. బౌవర్, ఎ. బౌవర్, ఎమ్. ష్టీర్నర్ యింకా కొంతమంది యీ శాఖకి నాయకులు; కొంతకాలం పాటు ఫాయెర్‌బాఖ్, యువకులుగా వున్న మార్క్స్, ఎంగెల్స్‌లు వాళ్లతో కలిశారు. ఆతర్వాత మార్క్స్, ఎంగెల్స్‌లు యువ హేగెలియన్లతో సంబంధాలు తెంచుకుని, వాళ్ల భావవాద, పెటీబూర్జువా ధోరణి సారాన్ని "పవిత్ర కుటుంబం" (1844), "జర్మన్ భావజాలం" (1845–46) అనే గ్రంథాలలో విమర్శించారు. – 13.

[4] ఎఫ్. ఎంగెల్స్ "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి," మార్క్స్, ఎంగెల్స్, సంకలిత రచనలు, భాగం 4, మాస్కో. – 14.

[5] "Rheinishe Zeitung für Politik, Handel und Gewerbe" ("రాజకీయ, వర్తక, పారిశ్రామిక సమస్యలపై రైనిషె పత్రిక") – 1842 జనవరి 1కీ – 1843 మార్చి 31కీ మధ్య కొలోన్‌నుండి ప్రచురింపబడిన ఒక దినపత్రిక. ప్రష్యన్ నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా ప్రతిపక్షానికి చెందిన రైనిషె బూర్జువాలచేత

ఈ పత్రిక స్థాపించబడింది. వామపక్ష హెగెలియన్లలో కొందరు దానితో సహకరించారు. 1842 ఏప్రిల్‌నుంచి మార్క్స్ దానితో సహకరించాడు, అదే ఏడాది అక్టోబరునుంచి దాని సంపాదకుల్లో ఒకడయ్యాడు. మార్క్స్ సంపాదకవర్గంలో ఉన్నప్పుడు ఆ పత్రికకు విప్లవ ప్రజాస్వామిక స్వభావం కలిగింది. 1843 జనవరిలో ప్రష్యన్ ప్రభుత్వం పత్రికను మూసివేయాలన్న తీర్మానం చేసింది, 1842 ఏప్రిల్‌నుంచి 1843 మార్చి 31న ఆ పత్రిక ఆగిపోయేదాకా దానిమీద కఠినమైన సెన్సార్‌షిప్ విధించింది. పత్రికకు ఉదారవాద స్వభావం కలిగించే వాటాదార్ల ఉద్దేశ్యం కారణంగా 1843 మార్చి 17 తేదీన మార్క్స్ సంపాదకవర్గంనుంచి ఉపసంహరించుకున్నానని ప్రకటించాడు. – 14.

6 "కార్ల్ మార్క్స్" అనే వ్యాసానికి లెనిన్ సమకూర్చిన గ్రంథ వివరణ పట్టిక గురించిన ప్రస్తావన ఇది. ఈ ప్రచురణలో ఆ పట్టిక వదలివేయబడింది. – 14.

7 "మోసెల్ విలేఖరి విధ్యుక్త ధర్మనిర్వహణ" ("The Acquittal of the Mo-selle correspondent") అన్న మార్క్స్ వ్యాసానికి ప్రస్తావన ఇది. – 14.

8 "Deutsch-Französische Jahrbücher" ("జర్మన్-ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచికలు") జర్మన్ భాషలో పారిస్‌లో ప్రచురింపబడింది; కార్ల్ మార్క్స్, ఆర్నాల్డ్ రూగెలు దీని సంపాదకులు. 1844 ఫిబ్రవరిలో ఒకే సంచిక – మామూలుకు రెండంతల సంచిక – వెలువడింది. దానిలో మార్క్స్ ఎంగెల్స్‌ల రచనలు వెలువడ్డాయి. భౌతికవాదానికీ, కమ్యూనిజానికీ మార్క్స్ ఎంగెల్సుల నిశ్చితమైన మలుపుకు ఆ రచనలు సూచికలు. ఆ పత్రిక ప్రచురణ నిలిచిపోవడానికి మార్క్స్‌కీ బూర్జువా రాడికల్ అయిన రూగెకీ మధ్య వచ్చిన అభిప్రాయభేదాలే ప్రధాన కారణం – 14.

9 ఇది మార్క్స్ "హెగెల్ ధర్మవిషయక తత్వశాస్త్ర విమర్శను గురించి. పీఠిక" అనే రచనలో యీ కింది మాటలకు ప్రస్తావన: "విమర్శ అనే ఆయుధం ఆయుధాలతో విమర్శ స్థానాన్ని సహజంగానే ఎన్నడూ ఆక్రమించజాలదు, ఒక భౌతిక శక్తిని మరో భౌతిక శక్తితోనే కూలదోయాలి; కాని సిద్ధాంతం కూడా, ప్రజా బాహుళ్యపు మనస్సులలో నాటుకుపోయిన తక్షణమే ఒక భౌతిక శక్తిగా మారిపోతుంది." – 15.

10 ప్రూడనిజం – మార్క్సిజంకు వ్యతిరేకమైన అశాస్త్రీయ పెటీబూర్జువా సోషలిస్టు ధోరణి. దాని సిద్ధాంతకారుడైన ఫ్రెంచి అరాజకవాది ప్యేర్ జోసెఫ్ ప్రూడన్‌ద్వారా దానికి ఆ పేరు వచ్చింది. అతను పెటీబూర్జువా దృక్పథంనుండి బడా పెట్టుబడిదారీ యాజమాన్యాన్ని విమర్శించి, సన్నకారు సొంత యాజమాన్యాన్ని చిరస్థాయిగా వుంచాలని ప్రయత్నించి, "ప్రజల" బాంకులనూ, "మారకపు" బాంకులనూ సృష్టించాలని

సూచించాడు. కార్మికులు ఉత్పత్తి సాధనాలు సంపాయించుకోడానికీ, చేతిపనివాళ్లు కావడానికీ ఆ బాంకులు వీలు కలిగిస్తాయనీ, వాళ్ల ఉత్పాదితాలు "న్యాయంగా" అమ్మక మయ్యేటట్లు కట్టుదిట్టం చేస్తాయనీ అతను అన్నాడు. అతను శ్రామికవర్గపు చరిత్రాత్మక పాత్రను గుర్తించలేక, వర్గపోరాటంపట్లా, శ్రామికవర్గ విప్లవంపట్లా, కార్మిక వర్గ నియంతృత్వంపట్లా వ్యతిరేక వైఖరి అవలంబించాడు. అరాజకవాదిగా తమ రాజ్యం అనేది అనవసరమని విశ్వసించాడు. "తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే గ్రంథంలో మార్క్సు ప్రూడనిజాన్ని తీవ్రంగా విమర్శించాడు. – 15.

11 కమ్యూనిస్టు లీగు – విప్లవ శ్రామికవర్గపు మొదటి అంతర్జాతీయ సంఘం. 1847 వేసవిలో లండన్‌లో దీని స్థాపన జరిగింది. కార్ల్ మార్క్సు, ఫ్రెడరిక్ ఎంగెల్సులు లీగుని నిర్మించి, నడిపించారు. లీగు ఆదేశం ప్రకారం దాని కార్యక్రమాన్ని రచించారు. అదే ప్రసిద్ధ "కమ్యూనిస్టు ప్రణాళిక." వర్గ వైరుధ్యాల పునాదిమీద వున్న బూర్జువా సమాజాన్ని కూలదోసి, వర్గాలు లేని, వ్యక్తిగత ఆస్తిస్వామ్యం లేని నవసమాజాన్ని నిర్మించడం తన లక్ష్యంగా లీగు ప్రకటించింది. శ్రామికవర్గ విప్లవకారులకి పాఠశాలగా, శ్రామికవర్గ పార్టీకి బీజంగా కమ్యూనిస్టు లీగు చారిత్రక పాత్ర నిర్వహించింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్)కి యిది వైతాళికమైంది. యిది 1852 దాకా వుంది. దీని ప్రముఖ సభ్యులు తర్వాత మొదటి ఇంటర్నేషనల్‌లో ప్రధాన పాత్ర వహించారు. – 15.

12 ఫ్రాన్సులో ఫిబ్రవరి 1848లో జరిగిన బూర్జువా విప్లవానికి ప్రస్తావన ఇది. – 15.

13 జర్మనీ ఆస్ట్రియాలలో 1848 మార్చిలో మొదలైన బూర్జువా విప్లవానికి ప్రస్తావన ఇది. – 15.

14 "నోయె రైనిషె సైటుంగ్" ("Neue Rheinische Zeitung") – 1848 జూన్ 1నుంచి 1849 మే 19 దాకా కొలోన్‌నుంచి వెలువడిన పత్రిక. మార్క్సు ప్రధాన సంపాదకుడుగా మార్క్సు, ఎంగెల్సులు దీన్ని నిర్వహించారు. యిది ప్రజా బాహుళ్యానికి బోధించింది, విప్లవ ప్రతిఘాతాన్ని ఎదిరించేటట్టు వాళ్లని మేల్కొల్పింది. దాని ప్రభావం జర్మనీ అంతా విస్తరించింది. దృఢమైన, రాజీలేని దాని విధానం వల్లా, దాని సమరశీల అంతర్జాతీయ తత్వంవల్లా, ప్రష్యన్ ప్రభుత్వానికీ, కొలోన్ అధికారులకీ వ్యతిరేకంగా అది ప్రకటించిన రాజకీయమైన బహిరంగ విమర్శల వల్లా యిది ఫ్యూడల్ – రాచరిక, ఉదారవాద బూర్జువా పత్రికల దాడికీ, ప్రష్యన్ ప్రభుత్వపు వేధింపుకీ గురైంది. 1849 మేలో విప్లవ ప్రతిఘాతపు సామాన్య దాడి కాలంలో మార్క్సు ప్రష్యన్ పౌరుడు కాడనేదాన్ని ఆయన్ని ప్రష్యానుంచి బహిష్కరించడానికి సాకుగా ప్రభు

త్వం తీసుకుంది. మార్క్సు బహిష్కరణ వల్లా, మిగతా సంపాదకులని పీడించడం వల్లా పత్రిక ప్రచురణ నిలిపివెయ్యాల్సివచ్చింది. – 15.

15 పెటీబూర్జువా పార్టీ ("మహీధరం" అనబడేది) జరిపిన ప్రజా ప్రదర్శనకు ప్రస్తావన ఇది. 1848 నాటి విప్లవ క్రమంలో ప్రవేశపెట్టబడిన చట్టబద్ధ నిబంధనలను అధ్యక్షుడూ, శాసన సభ మెజారిటీ ఉల్లంఘించినందుకు నిరసనగా ఈ ప్రదర్శన జరిగింది. ప్రభుత్వం ప్రదర్శకులను చెదరగొట్టింది. – 16.

16 జర్మనీలో 1913, సెప్టెంబరులో వెలువడిన మార్క్సు ఎంగెల్సుల ఉత్తరప్రత్యుత్తరాలను లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. – 16.

17 బోనపార్టిస్టు ఏజెంటు అయిన కె. ఫోగ్ట్ రాసిన "'Allgemeine Zeitung' మీద నా కేసు" అనే నిందారోపణలతో కూడిన చిన్న పుస్తకానికి జవాబుగా మార్క్సు రాసిన వ్యాసం "Herr Vogt"కి ప్రస్తావన ఇది. – 16.

18 ఈ సంఘపు ప్రారంభోత్సవ విజ్ఞప్తికి ప్రస్తావన ఇది. – 16.

19 1871 నాటి పారిస్ కమ్యూన్ – కార్మికవర్గంయొక్క విప్లవాత్మక ప్రభుత్వం, 1871 మార్చి 18నుండి మే 28 వరకు యిది అధికారంలో వుంది. శ్రామికవర్గ నియంతృత్వానికి సంబంధించిన తొలి చారిత్రకానుభవాన్ని కార్మికవర్గానికి యిది సమకూర్చింది. – 16.

20 బకూనినిజం – అరాచకవాద సిద్ధాంతవేత్తా, మార్క్సిజానికీ, శాస్త్రీయ సోషలిజానికీ పరమ శత్రువూ అయిన ఎమ్. బకూనిన్ ద్వారా ఆ ధోరణికి యీ పేరు వచ్చింది. మార్క్సిస్టు సిద్ధాంతానికీ, శ్రామికవర్గ ఉద్యమపు మార్క్సిస్టు యెత్తుగడలకీ వ్యతిరేకంగా బకూనినిస్టులు మొండి పోరాటం జరిపారు. బకూనినిజపు ప్రధాన సూత్రీకరణ శ్రామిక వర్గ నియంతృత్వంతో సహా ప్రభుత్వపు అన్ని రూపాలనీ కాలదన్నడం. బకూనినిస్టులు శ్రామికవర్గపు చారిత్రాత్మక పాత్రని అర్థం చేసుకోలేదు. వర్గ "సమానత" సాధించడాన్నీ, కిందనుంచి "స్వేచ్ఛా సంఘాల" కలయికనీ బకూనిన్ ప్రతిపాదించాడు. తక్షణం ప్రారంభం కాబోయే ప్రజల తిరుగుబాట్లని "ప్రముఖులు" వున్న రహస్య విప్లవ సంఘం నడిపిస్తుందనీ, ఉదాహరణకి రష్యాలో రైతాంగం తక్షణం తిరుగుబాటుకి సిద్ధంగా వుందనీ బకూనినిస్టులు భావించారు. కుట్ర, తక్షణమైన తిరుగుబాట్లు, భయకంపిత చర్యలు వట్టి జూదపు యెత్తుగడలూ, తిరుగుబాటుకి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకమైనవీనీ. – 17.

[21] K. Marx, F. Engels, *The holy Family, or Critique of Critical Criticism*. Ch. 6, 3. *Absolute Criticism's Third Compaign*. – 18.

[22] F. Engels, *Anti-Dühring. General Remarks*. – 19.

[23] అజ్ఞేయతావాదం (agnosticism) – గ్రీక్ పదం "అగ్నోస్" ("అజ్ఞేయత") నుంచి ఈ సిద్ధాంతానికి ఈ పేరు వచ్చింది. అజ్ఞేయతావాదం రెండు భిన్న రూపాలలో వ్యక్తమవుతుంది: కొందరు వస్తుగత భౌతిక ప్రపంచం వుందని ఒప్పుకుంటారు గానీ, దానిని గ్రహించడం సాధ్యంకాదని వాదిస్తారు; మరికొందరు, మన ఇంద్రియానుభూతులకి అతీతంగా ఏదైనా ఉందో లేదో తెలుసుకోవడం మానవునికి సాధ్యం కాదు కాబట్టి, భౌతిక ప్రపంచం లేదంటారు.

కాంట్ తన సిద్ధాంతం "విమర్శనావాద" మని ("criticism") పిలిచేవాడు. మానవుని పరిజ్ఞాన సామర్థ్యాన్ని విమర్శించాలనేది ఆ సిద్ధాంతం ప్రధాన లక్ష్యం.

పాజిటివిజం (positivism) – బూర్జువా తత్వశాస్త్రం, సాంఘిక శాస్త్రాల్లో విస్తృతంగా వ్యాపించిన ధోరణి. ఆ ధోరణికి మూల పురుషుడు ఫ్రెంచి తత్వవేత్త, సాంఘిక శాస్త్రవేత్త కొంట్ (1798–1857). పాజిటివిస్టులు బాహ్య ప్రపంచంలో వున్న అంతరంగిక నియమబద్ధ సంబంధాలను మానవుడు గ్రహించజాలడంటారు; బాహ్య ప్రపంచం గురించిన జ్ఞానం పొందడానికీ, దానిని మార్చడానికీ తత్వశాస్త్రం ఒక పద్ధతి అన్న వాదాన్ని ఒప్పుకోరు. తత్వశాస్త్రాన్ని విడి శాస్త్రాల సమాచారాన్ని పోగుచేసేదిగానూ, పరిశోధనా ఫలితాల పైపై వివరణలు ("పాజిటివ్ – అనుకూల ఘటనలు) చేసేదిగానూ కుదిస్తారు. తాము భౌతికవాదానికీ భావవాదానికీ అతీతంగా ఉంటామని అంటారు, కాని వాస్తవానికి వాళ్ల సిద్ధాంతం ఆత్మపరమైన భావవాదంలో ఒక ధోరణే. – 19.

[24] ఎఫ్. ఎంగెల్స్ "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి," ప్రకరణం II, మార్క్స్, ఎంగెల్స్ సంకలిత రచనలు, భాగం 4, మాస్కో. – 19.

[25] F. Engels, *Anti-Duhring*. Ch. 1 *General Remarks*. – 21.

[26] ఎఫ్. ఎంగెల్స్ "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" (ప్రకరణాలు IV, I). మార్క్స్, ఎంగెల్స్, సంకలిత రచనలు, భాగం 4, మాస్కో. – 21.

[27] F. Engels, *Anti-Dühring*. Ch. 1 *General Remarks*. – 21.

[28] "నాస్తికరణయొక్క నాస్తికరణ" – గతితార్కికవాదంలోని ప్రధాన నియమాలలో ఒకటి.

మొట్టమొదట హేగెల్‌చే రూపొందించబడింది. కాని దానిని సరియైన భౌతికవాద దృష్ట్యా ఎంగెల్స్ నిర్వచించాడు. ఈ నియమం ప్రకారం పాత లక్షణాలు పోగొట్టటం (నాస్తికరణ) ద్వారా, కొత్త లక్షణాలు ఉద్భవించడం ద్వారా పరిణామం జరుగుతుంది. కొత్తగా ఉద్భవించిన గుణలక్షణాలు, పాత లక్షణాలు కొన్నిటిని ఉన్నత స్థాయిలో పునరుత్పత్తి చేస్తాయి. ఈవిధంగా, నాస్తికరణయొక్క నాస్తికరణ అనే నియమం, ఒక వైపున పాత గుణలక్షణాల మౌలిక మార్పును వ్యక్తం చేసి, మరో వైపున పాతదానికీ కొత్తదానికీ మధ్య కొనసాగింపును వ్యక్తంచేస్తుంది. – 22.

29 ఎఫ్. ఎంగెల్స్ "లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" (ప్రకరణం II). మార్క్స్, ఎంగెల్స్ సంకలిత రచనలు, భాగం 4, మాస్కో. – 23.

30 పునరుద్ధరణ కాలం – ఫ్రెంచి దేశ చరిత్రలో 1814–30 మధ్య కాలం. ఈ కాలంలో, అంతకు పూర్వం 1792 ఫ్రెంచి మహా విప్లవంచే కూలదోయబడిన బోర్బను వంశస్తులు తిరిగి అధికారంలోకి వచ్చారు. – 26.

31 K. Marx, *Capital.* ch. 1 *Commodity and Money. I Commodities. 4. The Fetishism of Commodities and the Secret There of.* – 28.

32 K. Marx, *A Contribution to the Critic of Political Economy* (1. *The Commodity*). – 28.

33 K. Marx, *Capital*, Vol. I, ch. IV *The Transformation of Money into Capital. 3. The Buying and Selling of Labour-Power.* – 29.

34 అదే పుస్తకం, అదే ప్రకరణం. – 30.

35 K. Marx, *Capital*, Vol. I, ch. XXXII. *The So-called primitive Accumulation. 7. Historical Tendency of Capitalist Accumulation.* (తెలుగులో మార్క్స్ "పెట్టుబడి పుట్టుక," "ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో 1982.) – 33.

36 "ఉపాంత్య ఉపయోగపు విలువ" సిద్ధాంతం – ఈ సిద్ధాంతం ఆస్ట్రియన్ పంథా అనబడే దానిచే 19వ శతాబ్దం చివరిలో శ్రమ విలువను గురించిన మార్క్సిస్టు సిద్ధాంతానికి ప్రతిగా ప్రతిపాదించబడింది. అది సరుకు విలువను సామాజికంగా అవసరమైన శ్రమనుబట్టిగాక కేవలం దాని ఉపయోగాన్నిబట్టి నిర్ణయిస్తుంది. అత్యవసర కోరికను తీర్చే ఏదైనా సరుకు ఉపయోగపు విలువను అది ఆత్మపరంగా వ్యక్తం చేస్తుంది. – 34.

[37] K. Marx, *Capital*, Vol. III, ch. XLVIII *Genesis of Capitalist Ground-Rent.* IV *Money-Rent.* – 37.

[38] K. Marx, *Capital*, Vol. I, ch. XXXII *The So-called Primitive Accumulation.* ch. XXX. *Reaction of the Agricultural Revolution on Industry.* (తెలుగులో మార్క్స్ "పెట్టుబడి పుట్టుక," "ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో). – 37.

[39] K. Marx, *Capital*, Vol. I, ch. XX *The General Law of Capitalist Accumulation. 4. Different Forms of Relative Surplus-Population.* – 37.

[40] K. Marx, *The Class Struggles in France, 1848 to 1850* (III Consequences of June 13, 1849). – 38.

[41] మార్క్స్ "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ," ప్రకరణం 7, మాస్కో – 38.

[42] K. Marx, *Class Struggles in France, 1848 to 1850* (III Consequences of June 13, 1849). – 38.

[43] K. Marx. *Capital*, Vol. III, ch. XLVII *Genesis of Capitalist Ground-Rent. Transformation of Surplus-Profit into Ground Rent.* – 38.

[44] అదే పుస్తకం, అదే పేజి. – 38.

[45] K. Marx, *Capital*, Vol. III, ch. XLVII *Genesis of Capitalist Ground-Rent.* V *Metayage and Peasant Proprietorship of Land Parcels.* – 39.

[46] F. Engels, *Anti-Dühring*. Part III, *Socialism. II Theoretical.* – 42.

[47] F. Engels, *The Peasant Question in France and Germany.* – 42.

[48] "Die Neue Zeit" ("కొత్త కాలం") – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ సిద్ధాంత పత్రిక, 1883నుండి 1923దాకా ష్టుట్‌గార్ట్‌లో ప్రచురింపబడింది. మార్క్స్, ఎంగెల్సుల రచనలలో కొన్ని మొదట యీ పత్రికలో అచ్చయినాయి. ఎంగెల్సు తన సలహాలతో సంపాదకులకు సహాయం చేసి, మార్క్సిజంనుండి వైదొలగినందుకు వాళ్లను అప్పుడప్పుడు విమర్శించాడు. 1890ల ఉత్తరార్థంలో, ఎంగెల్సు మరణం తర్వాత,

యీ పత్రిక క్రమపద్ధతిగా రివిజనిస్టుల వ్యాసాలు ముద్రించింది, మార్క్సిజంమీద రివిజనిస్టు యుద్ధం ప్రారంభించిన "సోషలిజం సమస్యలు" అనే ఇ. బెర్న్‌స్టైన్ వ్యాస పరంపరతో సహా. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో యిది సెంట్రిస్టు వైఖరి అవలంబించి, అర్థాత్తూ సోషల్ జాతీయ దురహంకారులకు అండదండలు యిచ్చింది. – 42.

49 ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖ 1863, ఏప్రిల్ 9 తేదీ. – 43.

50 K. Marx, *The Poverty of Philosophy*, Moscow, 1973, p. 150. – 44.

51 ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖ, 1851, ఫిబ్రవరి 5 తేదీ. – 44.

52 మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖ, 1857, డిసెంబరు 17 తేదీ. – 44.

53 మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖ, 1858, అక్టోబరు 7 తేదీ. – 45.

54 మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖ, 1863, ఏప్రిల్ 8 తేదీ. – 45.

55 ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖ, 1863, ఏప్రిల్ 9 తేదీ. – 45.

56 చార్టిస్టులు – 19వ శతాబ్దపు ఇంగ్లీషు కార్మికుల ప్రజావిప్లవోద్యమంలో పాల్గొనే వాళ్లు. ఆ ఉద్యమపు రాజకీయ డిమాండులున్న charter (పత్రం) అనే మాట నుంచి దానికా పేరు వచ్చింది. ఆ పత్రంలో సార్వత్రిక ఓటింగు హక్కు కావాలనీ, పార్లమెంటు డిప్యూటీలకు భూమి ఉండాలన్న షరతు రద్దు కావాలనీ డిమాండ్లు ఉన్నాయి. కొన్ని సంవత్సరాలపాటు దేశవ్యాపితంగా కోట్లాది ప్రజలతో సభలు, ప్రదర్శనలు జరిగాయి. బ్రిటన్ పార్లమెంటు ఆ పత్రం ఆమోదించడానికి నిరాకరించింది.

ప్రభుత్వం చార్టిస్టులపై దమనకాండ ఉధృతంగా జరిపింది, వాళ్ల నాయకులను అరెస్టు చేసింది. ఉద్యమం అణచివేయబడింది, కాని తరువాతి అంతర్జాతీయ కార్మికోద్యమ అభివృద్ధిమీద దాని ప్రభావం చాలా వుంది. – 45.

57 ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖ, 1866, ఏప్రిల్ 2వ తేదీ. – 45.

58 మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖలు, 1869, నవంబరు 19వ తేదీ, 1881, ఆగస్టు 11వ తేదీ. – 45.

59 1815నుంచి ఆస్ట్రియా, ప్రష్యా, రష్యా సంయుక్త అజమాయిషీ కింద వున్న క్రాకొవ్ రిపబ్లిక్‌లో జాతీయ విముక్తి, ప్రజాస్వామిక తిరుగుబాటుకు ప్రస్తావన ఇది. తిరుగుబాటు క్రమంలో తిరుగుబాటుదార్లు జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించారు. అది ఫ్యూడల్ కట్టుబాట్లని రద్దుచేసి, నష్టపరిహారం లేకుండా భూమిని రైతులకు బదలాయించడానికి వాగ్దానంచేస్తూ ప్రకటన జారీచేసింది. ఇతర ప్రకటనలలో, జాతీయ కార్ఖానాలు

ఏర్పాటు చేయడం, వాటిలో పనిచేసే కార్మికుల జీతం పెంచడం, పౌరుల సమానత్వం నెలకొల్పడం జరుగుతుందని ఉద్ఘాటించింది. కాని త్వరలో తిరుగుబాటు అణచివేయ బడింది. – 45.

[60] K. Marx, *The Bourgeoisie and the Counter-Revolution* (see Marx and Engels, *Selected Works*, vol. 1, Moscow, 1973, p. 141). – 46.

[61] ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖ, 1856, ఏప్రిల్ 16వ తేదీ. – 46.

[62] మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖ, 1865, జనవరి 27వ తేదీ. – 46.

[63] మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖ, 1865, ఫిబ్రవరి 5వ తేదీ. – 46.

[64] ప్రత్యేకతావాదం – ఒక దేశంలో విడివిడి ప్రాంతాలూ, మండలాలూ కేంద్రాధికారంనుంచి సాధ్యమైనంత స్వాతంత్ర్యాన్ని పొంది అనతిక్రమణీయమైన స్థానిక హక్కులనూ, ప్రత్యేక సదుపాయాలనూ ఆచారాలనూ అనుభవించాలనే వాదం. – 47.

[65] మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖలు: 1863, జూన్ 11వ తేదీ; 1863, నవంబరు 24వ తేదీ; 1864, సెప్టెంబరు 4వ తేదీ; 1865, జనవరి 27వ తేదీ; 1867, అక్టోబరు 22వ తేదీ; 1867, డిసెంబరు 6వ తేదీ; ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖలు: 1863, జూన్ 12వ తేదీ; 1864, డిసెంబరు 10వ తేదీ; 1865, ఫిబ్రవరి 3వ తేదీ; 1867, డిసెంబరు 17వ తేదీ. – 47.

[66] కూగెల్‌మన్‌కు మార్క్స్ రాసిన లేఖ, 1871, ఏప్రిల్ 12వ తేదీ. – 47.

[67] సోషలిస్టు వ్యతిరేక చట్టం – యీ చట్టం జర్మనీలో 1878నుంచి 1890వరకు అమలులో వుంది. ఇది కార్మికవర్గ ప్రజా సంఘాలనూ, అన్ని సోషల్ డెమోక్రటిక్ సంఘాలనూ, కార్మిక పత్రికలనూ నిషేధించింది, సోషలిస్టు సాహిత్యాన్ని జప్తు చేసి, సోషల్ డెమోక్రట్లను హింసించి దేశంనుంచి వెళ్లగొట్టింది. పరిస్థితి అలా వుండగా, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రహస్య పత్రికల ప్రచురణ ఏర్పాటు చేయ గలిగింది. ప్రజానీకంతో సంబంధాలను బలపరచడానికి చట్టబద్ధ అవకాశాలను వినియోగించింది. నానాటికీ అధికమైన ప్రజా కార్మికోద్యమ ఒత్తిడి ఫలితంగా యీ చట్టం 1890లో రద్దు చేయబడింది. – 47.

[68] ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖలు: 1877, జూలై 23వ తేదీ; ఆగస్టు 1వ తేదీ; 1879, సెప్టెంబరు 10వ తేదీ; మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖలు: 1879, ఆగస్టు 20, సెప్టెంబరు 9. – 47.

69 ''మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు అంశీభూత భాగాలూ'' అనే వ్యాసం మార్క్స్ 30వ వర్ధంతి సందర్భంగా లెనిన్ రాశాడు. అది ''ప్రొస్వెష్చేనియె'' (''విద్య'') మాసపత్రికలో 1913, 3వ సంచికలో ప్రచురింపబడింది.

''ప్రొస్వెష్చేనియె'' – బోల్షెవిక్కుల సైద్ధాంతిక చట్టబద్ధ మాసపత్రిక; అది పీటర్స్‌బుర్గ్‌నుంచి డిసెంబరు 1911 – జూన్ 1914 మధ్య ప్రచురింపబడింది. దాని ప్రతుల సంఖ్య 5 వేలు అందుకొంది. లెనిన్ పారిస్‌నుంచి, తరువాత క్రాకొవ్, పొరోనిన్‌నుంచి ఆ పత్రికకు నాయకత్వం వహించాడు: వ్యాసాలు సరిచూసుకున్నాడు, సంపాదకవర్గ సభ్యులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపాడు.

ప్రథమ ప్రపంచ యుద్ధానికి ముందు జారిస్టు ప్రభుత్వం ''ప్రొస్వెష్చేనియె'' పత్రికను మూసివేసింది. 1917 శరత్‌కాలంలో ఆ పత్రికను మళ్లీ ప్రచురించనారంభించారు, కాని ఒక సంచిక మాత్రమే వెలువడింది. – 48.

70 ఎంగెల్స్ రాసిన ''యాంటీ డ్యూరింగ్. ఎవ్‌గేనీ డ్యూరింగ్ విజ్ఞానశాస్త్రంలో చేసిన విప్లవం'' అనే పుస్తకానికి ప్రస్తావన యిది. – 49.

71 3వ వివరణ చూడండి.

72 10వ వివరణ చూడండి.

73 20వ వివరణ చూడండి.

74 బెర్న్‌స్టైనియనిజానికి ప్రస్తావన యిది. బెర్న్‌స్టైనియనిజం అంటే అవకాశవాద, మార్క్సిస్టు వ్యతిరేక ధోరణి. అది 19వ శతాబ్దపు ఉత్తర భాగంలో జర్మనీలో ఆవిర్భవించింది. ఎ. బెర్న్‌స్టైన్ బాహాటంగా రివిజనిజం వ్యక్తంచేసిన వాడవడంవల్ల యీ ధోరణికి ఆ పేరు వచ్చింది. ఎంగెల్స్ మరణం తరువాత బెర్న్‌స్టైన్ బూర్జువా ఉదారవాదం దృష్ట్యా మార్క్స్ సిద్ధాంతాన్ని సంస్కరించి, సోషల్ డెమోక్రటిక్ పార్టీని పెటీబూర్జువా సాంఘిక సంస్కరణల పార్టీగా మార్చ ప్రయత్నించాడు.

రష్యాలో బెర్న్‌స్టైన్ అనుయాయులు ''చట్టబద్ధ మార్క్సిస్టులూ,'' ''ఆర్థికవాదులూ,'' బుండ్ సంఘ సభ్యులూ, మెన్షెవిక్కులూనూ. – 55.

75 సోషల్ నరోద్నిక్కులు – నరోద్నిక్కుల మాదిరి పార్టీలు: సోషలిస్టు రివల్యూషనరీలు (ఎస్.ఆర్.లు), ప్రజా సోషలిస్టులు (ఎన్.ఎస్.లు) వంటివారు. సోషలిస్టు రివల్యూషనరీలు – రష్యాలో వామపక్ష బూర్జువా ప్రజాస్వామ్య పార్టీ (1901–1923) సభ్యులు. వీళ్లు పెటీబూర్జువా ప్రయోజనాలను వ్యక్తంచేశారు. శ్రామికవర్గానికీ, రైతాంగానికి మధ్య వర్గ విభేదాలు గ్రహించలేదు, రైతాంగంలోని వర్గ విభజననూ,

వైరుధ్యాలనూ మరుగుపరచారు; విప్లవంలో శ్రామికవర్గ నాయక పాత్రను నిరాకరించారు. ప్రజా సోషలిస్టులు (శ్రమ ప్రజా సోషలిస్టు పార్టీ సభ్యులు). ఇది సోషలిస్టు రివల్యూషనరీ దక్షిణపక్షంనుంచి విడిపోయినవారితో రష్యాలో యేర్పడిన ఒక పెటీ బూర్జువా పార్టీ (1906–1918). బూర్జువా రిపబ్లిక్ స్థాపన, భూస్వాముల నుంచి వశం చేసుకున్న భూములకు నష్ట పరిహారం చెల్లింపు, కులాక్ పద్ధతి వ్యవసాయాన్ని నిలబెట్టడం — యీ పార్టీ కార్యక్రమం. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం ప్రజా సోషలిస్టులు సోవియట్ వ్యతిరేక కుట్రల్లో పాల్గొన్నారు. — 56.

[76] నయా కాంటియన్లు — జర్మనీలో 19వ శతాబ్ది మధ్యలో యేర్పడిన ఒక ప్రగతి వ్యతిరేక బూర్జువా తాత్విక ధోరణికి చెందినవాళ్ళు. వాళ్ళు కాంట్ తత్వశాస్త్రంలోని అత్యంత ప్రగతి వ్యతిరేకమైన, భావవాద అంశాలను స్వీకరించి, దానిలోని భౌతికవాద అంశాలను విసర్జించారు. "తిరిగి కాంట్‌వద్దకు" అనే నినాదంతో వాళ్ళు కాంటియన్ భావవాద పునరుద్ధరణను బోధించి, గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని వ్యతిరేకించారు. నయా కాంటియన్ తత్వంపై సర్వతోముఖమైన విమర్శ లెనిన్ రచించిన "భౌతికవాదమూ, ప్రత్యక్షానుభవయుత విమర్శనవాదమూ" అనే పుస్తకంలో వుంది. — 56.

[77] కె. మార్క్స్ "పెట్టుబడి" రెండవ ముద్రణకు ఉపసంహారం. — 56.

[78] లెనిన్ 1908–09లో రచించిన "భౌతికవాదమూ, ప్రత్యక్షానుభవయుత విమర్శనవాదమూ"లో రివిజనిజంను నిశితమైన విమర్శకు గురిచేసి, మార్క్సిజంలోని సిద్ధాంత సూత్రాలను సమర్థించి, విజ్ఞానశాస్త్రంలోని, ముఖ్యంగా ప్రకృతిశాస్త్రాల లోని తాజా విజయాలన్నీ గతితార్కిక భౌతికవాదపు బోధను ధ్రువపరిచినాయని చూపించాడు. — 57.

[79] కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ (కాడెట్లు) — రష్యాలో ఉదారవాద రాజరికవాద బూర్జువావర్గపు ప్రధాన రాజకీయ పార్టీ, 1905 అక్టోబర్‌లో స్థాపించబడింది, దాని సభ్యులు బూర్జువావర్గ ప్రతినిధులూ, భూస్వాములకు చెందిన జేమ్‌స్త్వో ఉద్యోగులూ, బూర్జువా మేధావులూ. విస్తృత ప్రజానీకాన్ని భ్రమ పరచడానికి వాళ్ళు తమకు "ప్రజా స్వేచ్ఛ పార్టీ" పేరు పెట్టుకున్నారు, వాస్తవానికి కాడెట్లు రాజ్యాంగబద్ధ రాజరికాన్ని డిమాండు చేయడానికి పరిమితమైనారు. ప్రథమ ప్రపంచ యుద్ధంలో వాళ్ళు జారిస్టు ప్రభుత్వపు దురాక్రమణపర విదేశంగ విధానాన్ని చురుకుగా బలపరిచారు. 1917లో అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయం తరువాత కాడెట్లు సోవియట్ అధికారానికి గర్బ శత్రువులయ్యారు. ప్రతి విప్లవ ప్రతీఘాత చర్యలోనూ, విదేశాల సాయుధ జోక్యాలలోనూ పాల్గొన్నారు. విదేశీ జోక్యం దాడులు తిప్పికొట్టి

వేయబడిన తరువాత, విదేశాలలో ప్రవాసంలో వున్నప్పుడు సైతం తమ విప్లవ ప్రతిఘాత కార్యకలాపాలను మానుకోలేదు. – 60.

80 మిలెరానిజం (మంత్రిత్వవాదం) – సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ఒక అవకాశ వాద ధోరణి. ఫ్రెంచి సోషల్ సంస్కరణవాది అలెగ్జాండర్ మిలెరాన్‌ద్వారా దాని కాపేరు వచ్చింది. అతను 1899లో ఫ్రెంచి అభివృద్ధి వ్యతిరేక బూర్జువా ప్రభుత్వంలో మంత్రి పదవి పొంది, దాని ప్రజా వ్యతిరేక విధానాన్ని బలపరిచాడు. లెనిన్ మిలెరాని జంను రివిజనిజంగా, స్వపక్ష పరిత్యాగంగా వర్ణించి, బూర్జువా ప్రభుత్వంలోని సోషల్ సంస్కరణవాదులు పెట్టుబడిదార్లకు ముసుగుగానూ, ప్రభుత్వం జనాలను మోసగిం చడానికి ఉపయోగించే సాధనంగానూ తయారౌతున్నారని నొక్కిచెప్పాడు. – 60.

81 గెడిస్టులు – 19వ శతాబ్ది అంతంలోనూ, 20వ శతాబ్ది ప్రారంభంలోనూ ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలో విప్లవ మార్క్సిస్టు ధోరణికి చెందిన సభ్యులు. యీ ఉద్యమానికి నాయకులు జూల్ గెడ్, పాల్ లాఫార్గ్. 1882లో, సెంట్ ఎటియెన్ మహాసభలో ఫ్రెంచి కార్మిక పార్టీలో చీలిక తర్వాత, గెడిస్టులు స్వతంత్ర పార్టీని నిర్మించి, దానికి పాత పేరు పెట్టుకున్నారు.

1901లో జూల్ గెడ్ నాయకత్వాన విప్లవ వర్గపోరాటపు మద్దతుదార్లు ఫ్రెంచి సోషలిస్టు పార్టీగా యేకమయ్యారు (ఆ పార్టీ సభ్యులకు కూడా గెడిస్టులనే పేరు వచ్చింది). 1905లో గెడిస్టులు సంస్కరణవాదపు ఫ్రెంచి సోషలిస్టు పార్టీతో ఐక్యమ య్యారు. 1914–18 సామ్రాజ్యవాద యుద్ధంలో యీ పార్టీ నాయకులు (గెడ్, సాంబ, మొదలైనవాళ్లు) సోషల్ జాతీయ దురహంకార వైఖరి అవలంబించ డంద్వారా కార్మికవర్గానికి ద్రోహంచేశారు.

జోరేసిస్టులు – ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలోని మితవాద, సంస్కరణవాద పక్షా నికి నాయకుడైన ఫ్రెంచి సోషలిస్టు జాన్ జోరేస్ మద్దతుదార్లు. ''విమర్శన స్వేచ్ఛ'' అనే నినాదపు ముసుగులో జోరేసిస్టులు మార్క్సిజం మౌలిక సూత్రాలను సవరిం చాలని డిమాండుచేసి, కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య వర్గ సహకారాన్ని బోధించారు. 1902లో వాళ్లు సంస్కరణవాద పార్టీ అయిన ఫ్రెంచి సోషలిస్టు పార్టీని యేర్పరచారు.

బ్రుసిస్టులు, లేదా పాసిబిలిస్టులు (సాధ్యతావాదులు): పి. బ్రుస్, బి. మలోన్, తదితరులు – 1880లలో ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలో పుట్టి, విప్లవ పోరాట పద్ధ తులనుండి కార్మికవర్గాన్ని పక్కకు మళ్లించిన పెటీబూర్జువా, సంస్కరణవాద ధోరణి. పాసిబిలిస్టులు కార్మికవర్గపు విప్లవ కార్యక్రమాన్నీ, యెత్తుగడలనూ నిరాకరించి,

కార్మికుల పోరాటాన్ని ''సాధ్య''మైనదానికి పరిమితం చేయాలని సిఫారస్ చేశారు. అందువలననే ఆ పార్టీకి ఆ పేరు వచ్చింది. పాసిబిలిస్టుల ప్రభావం ప్రధానంగా ఫ్రాన్సులో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలోనూ, కార్మికవర్గంలోని అవికసిత భాగాలలోనూ వ్యాపించింది.

తరువాత పాసిబిలిస్టులలో అత్యధిక భాగం జాన్ జోరేస్ నాయకత్వంకింద 1902లో స్థాపించబడిన సంస్కరణవాదపు ఫ్రెంచి సోషలిస్టు పార్టీలో చేరారు. – 60 – 61.

82 గ్రేట్ బ్రిటన్‌లోని సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ 1884లో స్థాపించబడింది. యీ ఫెడరేషన్ సభ్యులలో సంస్కరణవాదులూ, అరాజకవాదులతోపాటు, మార్క్సిజం అనుయాయులైన విప్లవ సోషల్ డెమోక్రట్ల బృందం ఒకటి వుండింది (జి. క్వెల్చ్, టి. మన్, ఎ. ఎవెలింగ్, ఎలియొనోర్ మార్క్స్-ఎవెలింగ్, తదితరులు). యీ బృందం బ్రిటిష్ సోషలిస్టు ఉద్యమంలోని వామపక్షంగా వుండింది. యీ ఫెడరేషన్ పిడివాదానికీ, ఒంటెత్తువాదానికీ, దేశంలోని కార్మికవర్గ సామూహిక ఉద్యమంనుండి అది వేరుపడినందుకూ, ఆ ఉద్యమ విశిష్ట లక్షణాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసినందుకూ ఎంగెల్స్ దీనిని విమర్శించాడు. 1907లో యీ ఫెడరేషన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అనే కొత్త పేరు పెట్టుకుంది. 1911లో యిది ఇండిపెండెంటు లేబర్ పార్టీలోని వామపక్ష శక్తులతో కలిసి బ్రిటిష్ సోషలిస్టు పార్టీగా ఏర్పడింది. 1920లో సోషలిస్టు ఐక్యతా బృందంతో కలిసి యీ పార్టీ బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో ప్రధాన పాత్ర నిర్వహించింది. – 61.

83 గ్రేట్ బ్రిటన్‌లోని ఇండిపెండెంటు లేబర్ పార్టీ (Independent Labour Party) – 1893లో, సమ్మె పోరాటం పునరుద్ధరింపబడి, బూర్జువా పార్టీలనుండి బ్రిటిష్ కార్మికవర్గ స్వాతంత్ర్యం కొరకు ఉద్యమం పెరిగిన కాలంలో, ''కొత్త ట్రేడ్ యూనియన్''ల నాయకులు స్థాపించిన సంస్కరణవాద సంస్థ. ఇండిపెండెంటు లేబర్ పార్టీలో ''కొత్త ట్రేడ్‌యూనియన్‌ల'' సభ్యులూ, కొన్ని పాత ట్రేడ్‌యూనియన్‌ల సభ్యులూ, ఫేబియన్లచేత ప్రభావితులైన మేధావులూ, పెటీబూర్జువాలూ చేరారు. తన కార్యక్రమంలో పార్టీ, ఉత్పత్తి సాధనాల సమష్టి స్వామ్యంకోసం, సమష్టి పంపిణీ మారకాలకోసమూ, 8 గంటల పనిదినం ప్రవేశంకోసమూ, పిల్లల శ్రమ నిషేధంకోసమూ, భీమా, నిరుద్యోగ భృతీ ప్రవేశం పెట్టడంకోసం పోరాటం ముందుకు తెచ్చింది. బూర్జువా పార్టీలనుండి తనకు రాజకీయ స్వాతంత్ర్యం వున్నట్లు ఇండిపెండెంటు లేబర్ పార్టీ చెప్పుకుంది గానీ, అది సోషలిజంనుండి మాత్రమే ''స్వతంత్రంగా వుండి, ఉదారవాదంమీద చాలా ఆధారపడింది.'' (వి. ఐ. లెనిన్.) – 61.

84 బెల్జియన్ కార్మిక పార్టీలో బ్రూకేర్, అతని అనుయాయులూ అభివృద్ధి నిరోధక బూర్జువా ప్రభుత్వంతో సోషలిస్టులు సహకరించకూడదని వాదించి, బెల్జియన్ రివిజనిస్టులకు నాయకత్వం వహించిన వాండెర్‌వెల్డెను వ్యతిరేకించారు. తదుపరి కాలంలో బ్రూకేర్ అవకాశవాదానికి దిగజారాడు. – 61.

85 ఇంటెగ్రలిస్టులు – పెటీబూర్జువా సోషలిజంలో ఒక రకం అయిన "అఖండ" సోషలిజంను బోధించేవాళ్లు. 20వ శతాబ్ది మొదటి దశాబ్దిలో, ఇటాలియన్ సోషలిస్టు పార్టీలో సెంట్రిస్టు ధోరణికి చెందిన ఇంటెగ్రలిస్టులు తీవ్ర అవకాశవాద అభిప్రాయాలు కలిగినవాళ్లూ, ప్రగతి వ్యతిరేక బూర్జువావర్గంతో సహకరించినవాళ్లూ అయిన సంస్కరణవాదులను వ్యతిరేకించేవారు. – 61.

86 "విప్లవ సిండికాలిజం" – 19వ శతాబ్ది అంతంలో కొన్ని పశ్చిమ యూరపియన్ దేశాలలో కార్మికవర్గ ఉద్యమంలో కనిపించిన ఒక పెటీబూర్జువా అర్ధ అరాజకవాద ధోరణి.

సిండికాలిస్టులు కార్మికవర్గం రాజకీయ పోరాటం చేయ నక్కర లేదని అంటూ, పార్టీ నాయక పాత్ర వహించాలనే భావాన్నీ, కార్మికవర్గ నియంతృత్వం వుండాలనే భావాన్నీ నిరాకరించారు. సార్వత్రిక సమ్మెను యేర్పాటుచేయడంద్వారా ట్రేడ్‌యూనియన్లు విప్లవం లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, ఉత్పత్తి నిర్వహణను స్వాధీనం చేసుకోవచ్చునని వాళ్లు భావించారు. – 61.

87 "రూస్కాయె బొగాత్‌స్త్వో" ("రష్యన్ సంపద") – 1876నుంచి 1918దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురితమైన మాసపత్రిక. 1890 దశకపు తొలిప్రాంతాల్లో అది నరోద్నికుల వాణి అయింది. 1893నుంచీ రష్యన్ సోషల్ డెమోక్రాట్లకి వ్యతిరేకంగా పోరాటంచేసింది. 1906లో యీ పత్రిక అర్ధకాడెట్ ప్రజా సోషలిస్టు పార్టీ పత్రిక అయింది. – 63.

88 "మస్కొవ్‌స్కియె వేదొమొస్తి" ("మాస్కో వార్తలు") – అతి ప్రాచీన రష్యన్ వార్తాపత్రికలలో ఒకటి. దీన్ని 1756నుంచీ మాస్కో యూనివర్సిటీ ప్రచురించింది. పరమ ప్రగతి నిరోధకుడూ, జాతీయ దురభిమానీ, అభ్యుదయకర సామాజిక భావాలకి ప్రబల విరోధీ అయిన ఎమ్. ఎన్. కత్కోవ్ 1863–87 మధ్యలో దీనికి సంపాదక, ప్రచురణకర్త. భూస్వాములలోనూ, పురోహిత వ్యవస్థలోనూ వుండే అత్యంత అభివృద్ధి వ్యతిరేక విభాగాల అభిప్రాయాలని ప్రతిఫలిస్తూ, ఆ పత్రికను ఆయన రాచరిక – జాతీయవాద వాణిగా మార్చాడు. 1905లో యీ పత్రిక నల్లనూర్లవాళ్ల ప్రధాన పత్రికల్లో ఒకటైంది. 1917 చివర్లో మూతపడింది. – 63.

89 నరోదిజం – రష్యన్ విప్లవోద్యమంలో ఒక పెటీబూర్జువా ధోరణి. అది పంథొమ్మిదవ శతాబ్దపు 60, 70 దశకాల్లో ఉద్భవించింది. నిరంకుశత్వాన్ని రద్దుచేసి, భూస్వాముల వద్దీలో వున్న భూమిని రైతులకి యివ్వాలని నరోద్నిక్కులు వాంఛించారు. వాళ్ళు తమని సోషలిస్టులుగా భావించుకునేవాళ్ళు గాని, వాళ్ళ సోషలిజం వూహాజనితమైంది.

పెట్టుబడిదారీ విధానం రష్యాలో ఇతర దేశాల్లోలాగా క్రమబద్ధంగా అభివృద్ధి చెందదని నమ్మి, అంచేత శ్రామికవర్గాన్ని కాకుండా, రైతాంగాన్ని ప్రధాన విప్లవ శక్తిగా పరిగణించారు, సోషలిజపు అంకురూపంగా గ్రామ కమ్యూన్ని పరిగణించారు. చారిత్రకాభివృద్ధిలో ప్రజా బాహుళ్యపు పాత్రని తిరస్కరించారు. చరిత్ర వీరులచేత, యుగపురుషులచేత నిర్మించబడుతుందని అన్నారు. వీళ్ళని కార్యాచరణలేని మూకకి పోటీగా వుంచారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రైతులని రెచ్చగొట్టడానికి నరోద్నిక్కులు గ్రామాలకి, "ప్రజల మధ్యకి" వెళ్ళారు, కాని అక్కడ ఆదరణ లభించలేదు.

విప్లవ ప్రజాస్వామ్యంనుంచి ఉదారవాదందాకా కొన్ని దశలగుండా నరోదిజం పరిణమించింది.

1880, 1890లలో నరోద్నిక్కులు జారిజంతోటి రాజీవాద ధోరణిని అనుసరించారు, ధనిక రైతుల ప్రయోజనాలని వ్యక్తంచేశారు, మార్క్సిజానికి వ్యతిరేకంగా పోరాడారు. – 63.

90 "శిష్యవర్గం" – మార్క్స్, ఎంగెల్స్‌ల అనుయాయులు. మార్క్సిస్టులకి పర్యాయపదంగా యీ మాటని 1890లలో చట్టబద్ధ పత్రికలు వాడాయి. – 64.

91 "ఒతేచెస్త్వెన్నియె జపీస్కి" ("పితృదేశపు నోట్సు") – 1820లనుంచీ సెంట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రచురితమైన సాహిత్య, రాజకీయ పత్రిక. 1839నుంచీ ఆ కాలానికి చెందిన అత్యుత్తమ అభ్యుదయగామి పత్రిక అయింది. 1860లలో రష్యాయొక్క విప్లవ ప్రజాతంత్ర మేధావుల్ని తన చుట్టూ సమీకరించుకుంది.

యీ పత్రిక సెన్సార్ వేధింపుకి తరచూ గురైంది. ఏప్రిల్ 1884లో జారిస్టు ప్రభుత్వం దీన్ని మూసివేయించింది. – 64.

92 1861 నాటి రైతు సంస్కరణ రష్యాలో భూస్వామ్య దాస్యాన్ని రద్దుచేసింది. మొత్తం రష్యా ఆర్థికాభివృద్ధి గతివల్లా, ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగంలో పెరుగుతున్న విస్తృత ఉద్యమంవల్లా యిది అవసరమైంది. బూర్జువా రాచరికంగా రష్యా పరివర్తనకి "రైతు సంస్కరణ" ఒక ముందడుగు. 1861 ఫిబ్రవరి 19నాడు రెండవ అలెక్సాంద్ర్ భూస్వామ్య పరాధీనతనుంచి విముక్తమైన రైతులకి సంబం

ధించిన ప్రణాళికమీదా, నియమావళిమీదా సంతకం చేశాడు. అంతకుపూర్వం భూస్వాములకు చెందిన దాసులు మొత్తంమీద 2,25,00,000 మంది ''విమోచన చెందారు.'' అయినా భూమిమీద యాజమాన్యం మిగిలిపోయింది. రైతుల భూమి భూస్వాముల ఆస్తిగా చాటబడింది. చట్టం నిర్దేశించిన పరిమాణంలోనే రైతు భూకమతాన్ని పొంద గలడు, అది కూడా భూస్వామి అనుమతితోనే, అతను దాన్ని విడుదల చేసుకోవాలి, అంటే దానికోసం చెల్లించుకోవాలి. భూమి విడుదల వాయిదాలని జారిస్టు ప్రభుత్వానికి చెల్లించుకోవాల్సి వుంది, ప్రభుత్వం భూస్వాములకి నిర్ణీత మొత్తాన్ని చెల్లించింది. సంస్కరణ తర్వాత భూస్వాములకి సుమారుగా 7,15,00,000 దెస్యతీన్ల భూమి వుంటే, రైతులకి 3,37,00,000 దెస్యతీన్ల భూమి వుంది. అంటే భూస్వాములు రైతుల భూమిలో అయిదింట ఒక వంతుని, యింకా వస్తే అయిదింట రెండు వంతులని తీసుకున్నారు.''

''రైతు సంస్కరణ'' వ్యవసాయంలో పాత వెట్టిచాకిరీ (corvée) పద్ధతిని తగ్గించిందే కాని రద్దుచెయ్యలేదు. భూస్వాములు రైతుల కమతాల్లోనుంచి శ్రేష్ఠమైనవాటిని అధీనం చేసుకున్నారు (''తీసుకున్న భూములు'' – అడవులు, పచ్చిక బయళ్లు, నీటివనరులు, పశుగ్రాస క్షేత్రాలు వగైరా). యివి లేకుండా రైతులు సొంత సాగు చేసుకోలేకపోయారు. విముక్త సంబంధపు యేర్పాట్లన్నీ పూర్తయేదాకా రైతులు ''తాత్కాలికంగా బద్ధులై'' నట్టే లెక్కలోవుండి భూస్వామికి వెట్టిచాకిరీ అయినా చేయాలి లేదా కౌలుశిస్తుని చెల్లించాలి. తమ సొంత కమతాల విముక్తి, అంటే భూస్వాములూ, జారిస్టు ప్రభుత్వమూ రైతులని నిలువునా దోపిడీకి గురిచెయ్యడం అయింది.

వ్యవసాయంలో అంకురిస్తూ వున్న పెట్టుబడిదారీ విధాన ప్రయోజనాలకోసం రైతాంగానికి వ్యతిరేకంగా జరిపిన సామాజిక దౌర్జన్యపు తొలి చర్య 1861 నాటి రైతు సంస్కరణ అన్నాడు లెనిన్. – 65.

93 మాంచెస్టర్ ధోరణి – వాణిజ్యంలో స్వేచ్ఛనీ, వ్యక్తిగత ఆర్థిక కార్యకలాపాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా వుండటాన్నీ అపేక్షించిన బూర్జువా రాజకీయ అర్థశాస్త్ర ధోరణి ప్రతినిధులు. యీ ధోరణి పద్దెనిమిదవ శతాబ్దపు చివర్లో బ్రిటన్‌లో ఉద్భవించి "free trade"గా పేరు గాంచింది. 1830, 1840లలో స్వేచ్ఛా వాణిజ్య ప్రధాన సమర్థకులైన మాంచెస్టర్ ఉత్పత్తిదారులనిబట్టి దీని అనుయాయులు స్వేచ్ఛా వాణిజ్యవాదులు లేదా మాంచెస్టరియన్లు అని పేరు పొందారు. వాళ్ల నాయకులు రిచర్డ్ కాబ్డెన్, జాన్ బ్రైట్‌లు. ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, తదితర దేశాల విధానంలో స్వేచ్ఛా వాణిజ్య ధోరణులు వెల్లడి అయాయి. స్వేచ్ఛా వాణిజ్య విధానం ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోల రచనలలో సిద్ధాంతపరంగా వ్యక్తీకరించబడింది. – 67.

94 సమష్టి బాధ్యత — ప్రతి గ్రామ కమ్యూన్‌లోని రైతులనీ సకాలంలో, పూర్తి చెల్లింపులకీ, ప్రభుత్వానికీ, భూస్వాములకీ చెయ్యవలసిన సకల సేవలకీ (పన్నుల చెల్లింపు, భూ విముక్త సంబంధ వాయిదాలు, సైన్యంలోకి లావణం చేసుకునే నియమం వగైరాలు) సమష్టిగా బాధ్యుల్నిచేసే నిర్బంధ చర్య. భూస్వామ్య దాస్యాన్ని రద్దుచేశాక యీ రైతు బానిసత్వ రూపం 1906 దాకా అమల్లో వుండింది — 68.

95 గ్రామ (భూమి) కమ్యూన్ — రైతులు భూమిని సమష్టిగా వినియోగించుకునే రూపం. నిర్బంధంగా వంతులతో పైరుపెట్టడం, అడవులనీ, పచ్చిక బీళ్లనీ అవిభజితంగా వుంచడం దీని విలక్షణం. సమష్టి బాధ్యత, మధ్యమధ్యన భూమిని పునర్విభజించడం, కమతాన్ని కాదనడానికి లేకపోవడం, కేటాయింపైన భూమి అమ్మడంగాని, కొనడం గాని లేకుండా నిషేధం వుండటం దీని ప్రధాన లక్షణాలు.

రష్యన్ గ్రామ కమ్యూన్ చాలా ప్రాచీనకాలం నాటిది. దీని చారిత్రకాభివృద్ధిలో యిది క్రమేపీ ఫ్యూడలిజపు ముఖ్య అధారాల్లో ఒకటైంది. ఫ్యూడల్ పీడనని తీవ్రం చెయ్యడానికీ, భూమిశిస్తు చెల్లింపులనీ ప్రజలనుంచి పన్నులనీ పిండుకోవడానికీ భూస్వాములూ, జారిస్టు ప్రభుత్వమూ గ్రామ కమ్యూన్‌ని ఉపయోగించుకున్నారు.

1906లో జారిస్టు మంత్రి స్తొలిపిన్ కులక్‌లకి అనుకూలంగా ఒక శాసనాన్ని జారీ చేశాడు. దానివల్ల రైతులు కమ్యూన్‌ని వదిలి తమ కమతాల్ని అమ్ముకోడానికి వీలు కలిగింది. యీ శాసనం గ్రామ కమ్యూన్ వ్యవస్థ అధికారికంగా రద్దుకావడానికి నాంది అయి రైతాంగంలో విభేదాన్ని తీవ్రంచేసింది. యీ శాసనాన్ని ఆమోదించిన తొమ్మిదేళ్లల్లో యిరవై లక్షలకు పైగా రైతు కుటుంబాలు కమ్యూన్‌లనుంచి ఉపసంహరించుకున్నాయి. — 70.

96 "వికాసం" — ఫ్యూడలిజంనుంచి పెట్టుబడిదారీ పరివర్తన దశకు చెందిన ధోరణి. పశ్చిమ యూరప్‌లోని కొన్ని దేశాల్లో ఈ ధోరణి 17–18వ శతాబ్దులలో వ్యాపించింది. ఈ ధోరణి ఎంత విస్తృతంగా వ్యాప్తి చెందిందంటే జీవితపు అన్ని రంగాలనూ అది ప్రభావితం చేసింది. అందుకని "అంధ మధ్య యుగాలకు" బదులు వికాస యుగం వచ్చిందని సమకాలికులు భావించారు. ఫ్రెంచి భాషలో siècles des luminères, జర్మన్‌లో Zeit des Aufklärung, ఇంగ్లీషులో Age of Enlightment అన్నారు. ఈ పదం వోల్టేర్ రచనలో మొదట కనపడింది. 1784లో కాంట్ "వికాసం అంటే ఏమిటి?" అనే వ్యాసం ప్రచురించిన తరువాత ఈ పదం వ్యాప్తిలోకి వచ్చింది. 19వ శతాబ్దపు చరిత్ర, తత్వశాస్త్ర రంగాల్లోని వికాసదాయకులకి మానవుని హేతుబుద్ధి మీద అనంతమైన విశ్వాసం వుండేది. సమాజాన్ని హేతుబద్ధమైన ప్రాతిపదికమీద

పునర్నిర్మించడం సాధ్యమని గట్టిగా నమ్మి, మధ్యయుగపు పిడిసూత్రాలమీద, చర్చి నిరంకుశ దురభిప్రాయాలమీద విజ్ఞానశాస్త్రం విజయం సాధిస్తుందని వాళ్లు ఆశించారు. అలాంటి ధోరణి ప్రాచ్య దేశాల్లో కూడా కనపడుతుంది. – 73.

97 జేమ్‌స్త్వో – 1864లో జారిస్టు రష్యా కేంద్ర గుబేర్నియాలలో (జిల్లాలలో) ప్రవేశ పెట్టబడిన స్థానిక ప్రభుత్వ సంస్థలకి పెట్టిన పేరు. అవి కులీనుల అధీనంలో వుండేవి.

జేమ్‌స్త్వోల అధికారాలు పూర్తిగా స్థానిక ఆర్థిక సమస్యలకే పరిమితం అయి వుండాలి – హాస్పిటళ్లూ, రోడ్ల నిర్మాణం, గణాంక పద్ధతి, భీమా వగైరాలకి. వాటి కార్యకలాపాలని ప్రాంతీయ గవర్నర్లు, ఆంతరంగిక మంత్రి కంట్రోలు చేసేవాళ్లు. వాళ్లు ప్రభుత్వం ఆమోదించని యే నిర్ణయాలనేనా రద్దుచేయగలిగి వుండేవాళ్లు.–74.

98 1860ల నాటి సైద్ధాంతిక వారసత్వాన్ని గురించి రాసేటప్పుడు సెన్సార్‌షిప్ కారణాలవల్ల లెనిన్ స్కాల్‌దిన్‌ని ప్రస్తావించవలసి వచ్చింది. వాస్తవానికి లెనిన్ ఎన్. జి. చెర్నిషేవ్‌స్కీని యీ "వారసత్వపు" ప్రధాన ప్రతినిధిగా పరిగణించాడు. సైబీరియాలోని ప్రవాసంనుంచి ఎ. ఎన్. పొత్రేసొవ్‌కి పంపిన లేఖలో (జనవరి 26, 1899) లెనిన్ యిలా రాశాడు: "...స్కాల్‌దిన్ వారసత్వాన్ని అంగీకరించాలని నేను యెక్కడా ప్రతిపాదించలేదు. మిగిలినవాళ్లనుంచి వారసత్వాన్ని గ్రహించాలనేది నిర్వివాద విషయం. నా సమర్థన (ప్రతికక్షులనుంచి రావడానికి అవకాశం వున్న దాడులకి) 237వ పేజిలోని నోట్‌లో వుంటుంది (ఈ పుస్తకంలో 78 పేజిలో నోట్) "అక్కడ నా మనసులో వున్నది కచ్చితంగా చెర్నిషేవ్‌స్కీ, అక్కడ ఆయన్ని సాదృశ్యంగా తీసుకోవడంలోని యిబ్బందులకి సంబంధించిన కారణాలని యిచ్చాను." (*Collected Works*, Vol. 34, p. 28.) – 75.

99 "పల్లెపట్టునుంచి ఉత్తరాలు" అని నరోద్నిక్కు రచయిత ఎ. ఎన్. ఎంగెల్‌హార్ట్ రాసిన పుస్తకం బహుళ ప్రచారం పొందింది. "ఒతేచెస్‌త్వెన్నియె జపీస్కి" అనే పత్రికలో 1872–1881 మధ్యకాలంలో పదకొండు ఉత్తరాలు ప్రచురితం అయ్యాయి, పన్నెండవది 1887లో అచ్చయింది. – 77.

100 "జెమ్లెదేల్‌చెస్కయ గజేత" ("వ్యావసాయిక పత్రిక") – ప్రభుత్వ ఆస్తుల మంత్రి వర్గపు పత్రిక (1894 నుంచీ ప్రభుత్వ ఆస్తుల, వ్యవసాయ మంత్రిత్వశాఖ); సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1834నుంచి 1917 దాకా వెలువడింది. – 81.

101 "వేస్త్‌నిక్ యెవ్‌రోపి" ("యూరప్ దూత") – ఉదారవాద బూర్జువా మాస పత్రిక, చారిత్రక, రాజకీయ, సాహిత్య పత్రిక. 1866నుంచి 1918దాకా సెంట్

పీటర్స్‌బుర్గ్‌లో వెలువడింది. విప్లవవాద మార్క్సిస్టులకి వ్యతిరేకంగా గురిపెట్టిన వ్యాసాలతో వుండేది. – 85.

102 లెనిన్ యిక్కడ స్కాల్‌దిన్‌ని ఉద్దేశిస్తున్నాడు. అతని పుస్తకాన్ని ఉల్లేఖిస్తున్నాడు. – 89.

103 "నోవాయె స్లోవా" ("కొత్త మాట") – విజ్ఞానశాస్త్ర, సాహిత్య, రాజకీయ మాస పత్రిక. 1894 నుంచీ ఉదారవాద నరోద్నిక్కులు సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి దీన్ని ప్రచురించారు. 1897 తొలిప్రాంతాల్లో "చట్టబద్ధ మార్క్సిస్టులు" పి. బి. స్త్రూవె, ఎమ్. ఐ. తుగాన్-బొరానోవ్‌స్కీ తదితరులూ యీ పత్రికను చేతుల్లోకి తీసుకున్నారు. జారిస్టు ప్రభుత్వం 1897 డిసెంబరులో దీన్ని మూసివేసింది. – 92.

104 చూడండి K. Marx, *The Holy Family* ("పవిత్ర కుటుంబం"), Moscow, 1956, p. 110. – 94.

105 జి. వి. ప్లెహానొవ్ "చరిత్రయొక్క ఏకతా దృక్పథాభివృద్ధి" అన్న తన పుస్తకాన్ని ఎన్. బేల్తొవ్ అనే మారుపేరుతో ప్రచురించాడు. ఆ పుస్తకం చట్టబద్ధంగా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1895లో వెలువడింది. – 94.

106 "నోవాయె స్లోవా" పత్రిక సంచిక 12, సెప్టెంబరు 1897లో ప్రచురితమైన జి. వి. ప్లెహానొవ్ వ్యాసం "చరిత్రను గురించిన భౌతికవాద దృక్పథానికి సంబంధించి" అన్నదానికి యిది ప్రస్తావన. దాని కింద ఎన్. కమేన్‌స్కీ అని సంతకం వుంది. – 100.

107 "Schmollers Jahrbuch" ("ష్మోలెర్ వార్షిక సంచిక") – "Jahrbuch für Gesetzgebung, Verwaltung und Volkwirtschaft im Deutchen Reich" ("జర్మన్ సామ్రాజ్యపు న్యాయ, పరిపాలన, ఆర్థిక సాంవత్సరిక గ్రంథం")– జర్మన్ బూర్జువా ఆర్థికవేత్తలు 1877నుంచి ప్రచురించిన అర్థశాస్త్ర పత్రిక. – 103.

108 "నెదేల్యా" ("వారం") – 1866నుంచి 1901దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి ప్రచురితమైన ఉదారవాద నరోద్నిక్కు రాజకీయ, సాహిత్య వార్తాపత్రిక. నిరంకుశత్వంతో పోరాటాన్ని యిది వ్యతిరేకించింది, "చిల్లర విషయాలు" అని పిలిచే సిద్ధాంతాన్ని ప్రచారంచేసింది, అంటే, విప్లవ పోరాటంనుంచి తటస్థంగా వుండిపోయి "సాంస్కృతిక కార్యకలాపాల్లో" నిమగ్నం కమ్మని మేధావివర్గానికి విజ్ఞప్తిచేసింది. – 104.

109 "ఏం చెయ్యాలి? మన ఉద్యమపు తక్షణ సమస్యలు" అన్న పుస్తకాన్ని రచించాలని 1901 వసంతంలోనే పథకం వేసుకున్న లెనిన్, 1901 ఆకురాలు కాలంలో మాత్రమే దాన్ని రాయడం మొదలుపెట్టాడు. డిసెంబరులో "ఇస్క్రా" 12వ సంచికలో లెనిన్ "ఆర్థికవాద సమర్థకులతో సంభాషణ" అన్న వ్యాసాన్ని ప్రచురించాడు. దరిమిలా ఆ

వ్యాసాన్ని ఆయన "ఏం చెయ్యాలి?"కి విషయ సంక్షేపంగా పేర్కొన్నాడు. పుస్తక రచనను 1902 జనవరిలోనూ, ఉపోద్ఘాతాన్ని 1902 ఫిబ్రవరిలోనూ లెనిన్ పూర్తిచేశాడు. మార్చి మొదట్లో ష్టుట్‌గార్ట్‌లోని డీట్జ్ ప్రచురణాలయం యీ పుస్తకాన్ని ప్రచురించింది.

రష్యాలో కార్మికవర్గపు విప్లవ మార్క్సిస్టు పార్టీ నిర్మాణం కోసం చేసిన కృషిలోనూ, ఆర్.ఎస్.డి.ఎల్.పి. (రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ) కమిటీల్లోనూ, శాఖల్లోనూ ఆతర్వాత 1903 నాటి దాని రెండవ పార్టీ మహాసభలోనూ లెనినిస్టు "ఇస్క్రా" ధోరణి విజయ సాధనలోనూ "ఏం చెయ్యాలి?" పుస్తకం ముఖ్యమైన పాత్ర వహించింది.

1902, 1903 సంవత్సరాల్లో యీ పుస్తకం, రష్యా అంతటా సోషల్ డెమోక్రటిక్ సంఘాల్లో విస్తృతంగా పంచబడింది.

1907 నవంబరులో "పన్నెండేళ్లు" అన్న సంకలనంలో "ఏం చెయ్యాలి?" కొన్ని మార్పులతో ప్రచురింపబడింది.

ఈ సంపుటంలో యివ్వబడిన 1902 నాటి పాఠం 1907 ముద్రణతో సరి చెయ్యబడింది. – 105.

110 "ఇస్క్రా" 4వ సంచిక సంపాదకీయంగా ప్రచురింపబడిన "దేనితో ప్రారంభించాలి?" అన్న వ్యాసంలో అప్పట్లో రష్యాలో సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి సంబంధించిన అతి ముఖ్యమైన సమస్యలకు – రాజకీయాందోళన స్వభావ సారాంశాలు, ఉద్యమ నిర్మాణ సమస్యలు, సమరశీల, అఖిల రష్యా మార్క్సిస్టు పార్టీ నిర్మాణ పథకాలకు సంబంధించిన కర్తవ్యాలు – సమాధానాలు ఉన్నాయి.

విప్లవ సోషల్ డెమోక్రట్లకు కార్యక్రమప్రాయమైన యీ వ్యాసం రష్యాలోనూ, విదేశాల్లోనూ విస్తృతంగా వ్యాపింపచెయ్యబడింది. "ఇస్క్రా"లో యీ వ్యాసాన్ని చదివిన స్థానిక సోషల్ డెమోక్రటిక్ సంఘాలు దీన్ని పుస్తక రూపంలో పునర్ముద్రించాయి.

నిర్మాణానికీ, ఎత్తుగడలకూ సంబంధించి "దేనితో ప్రారంభించాలి?" వ్యాసంలో ప్రతిపాదింపబడి, "ఏం చెయ్యాలి?" పుస్తకంలో సమగ్రంగా విపులీకరింపబడిన లెనిన్ భావాలు, రష్యాలో మార్క్సిస్టు పార్టీ నిర్మాణ క్రమంలో రోజువారీ కార్యకలాపాలకు మార్గదర్శక సూత్రాలు. – 105.

111 "ఇస్క్రా" ("నిప్పు రవ్వ") – మొట్టమొదటి అఖిల రష్యా మార్క్సిస్టు వార్తాపత్రిక. 1900లో లెనిన్‌చేత స్థాపించబడిన యీ పత్రిక, కార్మికవర్గపు విప్లవాత్మక మార్క్సిస్టు పార్టీ ఏర్పాటులో నిర్ణయాత్మకమైన పాత్ర వహించింది.

లెనిన్ ''ఇస్క్రా'' మొట్టమొదటి సంచిక 1900 డిసెంబరులో లైప్జిగ్‌లోను, తదుపరి సంచికలు మ్యూనిచ్‌లోనూ, 1902 జూలైనుంచి లండన్‌లోనూ, 1903 వసంతకాలంనుంచి జెనీవాలోనూ ప్రచురింపబడ్డాయి. సంపాదకవర్గంలో వి. ఐ. లెనిన్, జి. వి. ప్లెహానొవ్, ఎల్. ఒ. మార్తొవ్, పి. బి. అక్సెల్‌రోడ్, ఎ. ఎన్. పొత్రేసొవ్, వేర జసూలిచ్‌లు ఉండేవారు. ఆచరణలో లెనిన్ ప్రధాన సంపాదకుడు, ''ఇస్క్రా'' నాయకుడు. పార్టీ నిర్మాణానికి సంబంధించిన అన్ని ముఖ్య సమస్యలపైనా, రష్యాలో శ్రామికవర్గపు వర్గ పోరాటంపైనా ఆయన వ్యాసాలను ప్రచురించాడు.

''ఇస్క్రా'' పార్టీ బలగాల సమీకరణ కేంద్రంగానూ, ప్రముఖ పార్టీ కార్యకర్తల శిక్షణా కేంద్రంగానూ తయారైంది. అనేక రష్యన్ నగరాల్లో (సెంట్ పీటర్స్‌బుర్గ్, మాస్కో, సమారా వగైరాలు) రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ గ్రూపులూ కమిటీలూ ఏర్పాటుచెయ్యబడ్డాయి. 1902 జనవరిలో సమారాలో జరిగిన ''ఇస్క్రా'' అనుచరుల మహాసభ రష్యాలో ''ఇస్క్రా'' సంఘాన్ని స్థాపించింది.

లెనిన్ చొరవతోనూ, లెనిన్ ప్రత్యక్ష భాగస్వామ్యంతోనూ ''ఇస్క్రా'' సంపాదక వర్గం, పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని రూపొందించి (''ఇస్క్రా'' 21వ సంచికలో ప్రచురింపబడింది), ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభకు సన్నాహం చేసింది. అది 1903 జూలై – ఆగస్టులలో జరిగింది. ఆ మహాసభ ఒక ప్రత్యేక తీర్మానం ద్వారా పార్టీ నిర్మాణంకోసం చేసిన కృషిలో ''ఇస్క్రా'' వహించిన అసాధారణ పాత్రను గుర్తించి, దాన్ని ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర పత్రికగా ప్రకటించింది. లెనిన్, ప్లెహానొవ్, మార్తొవ్‌లతో కూడిన సంపాదకవర్గాన్ని అది ఆమోదించింది. వెనకటి ఆరుగురు సంపాదకవర్గ సభ్యుల్నీ అట్టేపెట్టాలని మార్తొవ్ పట్టుబట్టి, మహాసభ నిర్ణయించినా కూడా సంపాదకవర్గ కృషిలో పాల్గొనేందుకు తిరస్కరించాడు. ఆ కారణంగా 46 నుండి 51 దాకా సంచికలు లెనిన్, ప్లెహానొవ్‌ల సంపాదకత్వంలో వెలువడ్డాయి. దరిమిలా ప్లెహానొవ్ మెన్షెవిక్ వైఖరి తీసుకొని, మహాసభ నిరాకరించినా కూడా, వెనకటి మెన్షెవిక్ సంపాదకులను సంపాదకవర్గంలో పెట్టాలని డిమాండుచేశాడు. లెనిన్ దీనికి ఆమోదించలేక, 1903 అక్టోబరు 19వ (నవంబరు 1) ''ఇస్క్రా'' సంపాదకవర్గాన్ని వదిలేశాడు. కేంద్ర కమిటీకి కోఆప్ట్ చేసుకోబడిన లెనిన్, అక్కడి నుండి మెన్షెవిక్ అవకాశవాదులకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించాడు. ''ఇస్క్రా'' 52వ సంచికకు ప్లెహానొవ్ ఒక్కడే సంపాదకత్వం వహించాడు. 1903 నవంబరు 13 (26)వ, ప్లెహానొవ్, తన సొంత చొరవపైన, మహాసభ అభీష్టాన్ని తోసిపుచ్చి వెనకటి మెన్షెవిక్ సభ్యులందర్నీ సంపాదక వర్గంలో కోఆప్ట్ చేసుకున్నాడు. 52వ

సంచిక మొదలుకొని మెన్షెవిక్కులు ''ఇస్క్రా''ను తమ సొంత పత్రికగా మార్చుకున్నారు. – 105.

112 1901 వసంత, వేసవికాలాల్లో, ఐక్యతా సమస్యపై ఒక అంగీకారాన్ని కుదిర్చేందుకుగాను ''బోర్బా'' గ్రూపు తీసుకున్న చొరవ మూలంగానూ, జరిపిన మధ్యవర్తిత్వం ద్వారానూ, విదేశాల్లో వున్న సోషల్ డెమోక్రటిక్ సంఘాల – రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్, విదేశాల్లో వున్న బుండ్ కమిటీ, ''సోషల్ డెమోక్రట్'' విప్లవ బృందం, విదేశాల్లోని ''ఇస్క్రా,'' ''జర్యా'' బృందం – మధ్య సంప్రదింపు నిర్వహింపబడ్డాయి. ఐక్యతా మహాసభకు సన్నాహాలు చేసేందుకుగాను, యీ సంఘాల ప్రతినిధులు 1901 జూన్‌లో జెనీవాలో ఒక సమావేశం జరిపారు (దీన్నే ''జూన్'' లేక ''జెనీవా'' సమావేశం అంటారు).

విదేశాల్లోని ఆర్.ఎస్.డి.ఎల్.పి. సంఘాల ఐక్యతా మహాసభ 1901 సెప్టెంబరు 21, 22 (అక్టోబరు 4,5) తేదీల్లో జూరిచ్‌లో జరిగింది. ఆ మహాసభకి ''ఇస్క్రా,'' ''జర్యా'' బృందంనుండి ఆరుగురు ప్రతినిధులు (లెనిన్, క్రూప్‌స్కయ, మార్తొవ్, తదితరులు), ''శ్రమ విమోచన'' గ్రూపుకి చెందిన ముగ్గురు సభ్యులతోబాటు (ప్లెహానొవ్, అక్సెల్‌రోడ్, జసూలిచ్) ''సోషల్ డెమోక్రట్'' విప్లవ సంఘపు సభ్యులు ఎనమండుగురు, ''రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్''కి చెందిన పదహారుమంది సభ్యులు (విదేశాల్లోని బుండ్ కమిటీకి చెందిన ఐదుగురు సభ్యులతోబాటు), ''బోర్బా'' గ్రూపుకి చెందిన ముగ్గురు సభ్యులు. ''రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్'' మూడవ మహాసభ ఆమోదించిన జూన్ తీర్మానానికి అవకాశవాద సవరణలూ, చేర్పులూ ఆ మహాసభలో ప్రకటింపబడ్డాయి. దీని దృష్ట్యా ఆ మహాసభలోని విప్లవ విభాగం – ''ఇస్క్రా,'' ''జర్యా,'' ''సోషల్ డెమోక్రట్'' బృందాల సభ్యులు – ఐక్యత అసాధ్యతను గురించి ఒక ప్రకటన చేసి, ఆ మహాసభను విడిచివెళ్లిపోయింది. లెనిన్ చొరవ మేరకు యీ సంఘాలు 1901 అక్టోబరులో కలిసిపోయి, ''విదేశాల్లోని రష్యన్ విప్లవ సోషల్ డెమోక్రట్ల లీగు''గా ఏర్పడ్డాయి. – 105.

113 ''రబోచెయె దేలొ'' (''కార్మిక లక్ష్యం'') – విదేశాల్లోని రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్ పత్రిక. ఇది 1899 ఏప్రిల్‌నుంచి 1902 ఫిబ్రవరి దాకా జెనీవాలో ప్రచురింపబడింది. మొత్తంమీద యీ పత్రిక సంచికలు పన్నెండు, తొమ్మిది దఫాల్లో వెలువడ్డాయి. విదేశాల్లోని ''ఆర్థికవాదుల'' కేంద్రమే ''రబోచెయె దేలొ'' సంపాదకవర్గం. ''రబోచెయె దేలొ'' ''విమర్శనా స్వేచ్ఛ'' అనే బెర్న్‌స్టైన్ నినాదాన్ని బలపరచింది, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు ఎత్తుగడలకూ, నిర్మాణానికీ

సంబంధించిన సమస్యలపైన అవకాశవాద వైఖరిని చేబట్టి, రైతాంగం విప్లవ వైఖ రిని తీసుకొనే సంభావ్యతను తిరస్కరించింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహా సభలో "రబోచెయె దేలొ" సమర్థకులు పార్టీయొక్క అత్యంత మితవాద, అవకాశవాద పక్షానికి ప్రాతినిధ్యం వహించారు. – 105.

114 ఆర్థికవాదం – 19వ శతాబ్దం చివర రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో తలెత్తిన ఒక అవకాశవాద ధోరణి. పనికి సంబంధించి మరింత మంచి పరిస్థితులకోసం, తక్కువ పనిగంటలకోసం, అధిక వేతనాలు మొదలైన వాటికోసం ఆర్థిక పోరాటం జరపడం మాత్రమే కార్మికోద్యమ కర్తవ్యమని ఆర్థికవాదులు ఉద్ఘాటించి చెప్పారు. జారిజానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటం జరపడమన్నది ఉదారవాద బూర్జువావర్గపు వ్యవహారం అని ఆర్థికవాదులు వాదించారు. కార్మికుల స్వతంత్రమైన రాజకీయ పార్టీ ఉండవలసిన అవసరాన్నీ, కార్మికోద్యమంలో విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యాన్నీ వీళ్లు తిరస్కరించి, కార్మికుల్లో సోషలిస్టు ప్రచారం చెయ్యడానికి నిరాకరించారు. – 105.

115 "రబోచయ గజేత" ("కార్మికుల పత్రిక") – కీయెవ్ సోషల్ డెమోక్రట్ల గ్రూపు ప్రచురించిన ఒక రహస్య పత్రిక. రెండు సంచికలు మాత్రమే వెలువడ్డాయి.

1898 మార్చిలో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభలో "రబోచయ గజేత" పార్టీ అధికార పత్రికగా గుర్తింపబడింది. ఆ మహాసభ అనంతరం కేంద్ర కమిటీ సభ్యులూ, "రబోచయ గజేత" సంపాదకులూ అరెస్టుచెయ్యబడ్డారు. ప్రింటింగ్ ప్రెస్సు నాశనం చెయ్యబడింది. కాగా ప్రెస్సుకి వెళ్లేందుకు సిద్ధంగా వున్న 3వ సంచిక వెలువడనే లేదు. 1899లో ఆ పత్రికను తిరిగి ప్రచురించే ప్రయత్నం జరిగింది. "ఏం చెయ్యాలి?" 5వ ప్రకరణం, "అ" విభాగంలో (పేజీలు 265–271) లెనిన్ దీన్ని గురించి వివరించాడు. – 106.

116 లాసాలియన్లు, ఐసెనాఖర్లు – 19వ శతాబ్దపు 60 దశకంలోనూ, 70 దశకపు మొదటి సంవత్సరాల్లోనూ జర్మన్ కార్మికోద్యమంలోని రెండు పార్టీలు. ప్రధానంగా ఎత్తుగడల సమస్యలపైనా, ప్రత్యేకించి ఆనాటి జర్మనీలోని అతి జరూరైన రాజకీయ సమస్యపైనా – దేశాన్ని సమైక్యం చేసేందుకు పద్ధతులపైనా – యీ రెండు పార్టీల మధ్యా నిశితమైన పోరాటం జరిగింది.

లాసాలియన్లు – జర్మన్ పెటీబూర్జువా సోషలిస్టు అయిన ఫెర్డినాండ్ లాసాల్ సమర్థకులూ, అనుచరులూ. లాసాలియన్లు లైప్జిగ్‌లో 1863లో జరిగిన కార్మిక సంఘాల మహాసభలో స్థాపింపబడిన అఖిల జర్మనీ కార్మిక సంఘ సభ్యులు. ఈ జర్మన్ సంఘపు మొదటి అధ్యక్షుడు లాసాల్. అతనే దాని కార్యక్రమాన్నీ, ప్రధాన

ఎత్తుగడలనూ రూపొందించాడు. సార్వజనిక ఓటింగు హక్కు సాధనకోసం పోరాటం యీ సంఘపు రాజకీయ కార్యక్రమంగానూ, ప్రభుత్వ సబ్సిడీతో నడిచే కార్మికుల ఉత్పత్తి సంఘాల స్థాపన దాని ఆర్థిక కార్యక్రమంగానూ ప్రకటింపబడింది. తమ వాస్తవ కార్యకలాపాల్లో లాసాలూ, అతని అనుచరులూ బిస్మార్క్ అగ్రరాజ్య విధానాన్ని బలపరిచారు. మార్క్స్ ఎంగెల్సులు అనేక సందర్భాల్లో లాసాలియన్ల సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనీ, నిర్మాణ సూత్రాలనూ విమర్శించి, జర్మన్ కార్మికోద్యమంలో దాన్ని అవకాశవాదంగా పేర్కొన్నారు.

ఐసెనాఖర్లు — ఐసెనాఖ్‌లో 1869లో జరిగిన ప్రారంభ మహాసభలో స్థాపింప బడిన జర్మన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక పార్టీ సభ్యులు. ఈ ఐసెనాఖర్ల నాయకు లైన ఔగుస్ట్ బేబెల్, విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌లు మార్క్స్ ఎంగెల్సుల సైద్ధాంతిక ప్రభావంలో వుండేవారు. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక పార్టీ తనను తాను ''ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క ఒక విభాగంగా'' పరిగణించుకొని, ''దాని ఆకాంక్షలను పంచుకుంటోంది'' అని ఐసెనాఖ్ కార్యక్రమం పేర్కొంది. మార్క్స్ ఎంగెల్సులు క్రమబద్ధంగా యిచ్చిన సలహాల మూలంగానూ, చేసిన విమర్శల మూలంగానూ, లాసాల్‌యొక్క అఖిల జర్మనీ కార్మిక సంఘం కన్న ఐసెనాఖర్లు మరింత సుసంగతమైన విప్లవాత్మక విధానాన్ని అనుసరించారు. ప్రత్యేకించి, జర్మన్ పునరేకీకరణ సమస్యపైన వాళ్లు ''ప్రజాస్వామిక, శ్రామికవర్గ పంథాను అనుసరించి, ప్రష్యనిజానికీ, బిస్మార్కిజానికీ, జాతీయవాదానికీ ఎటువంటి రాయితీలు యివ్వడానికీ కూడా వ్యతిరేకంగా పోరాడారు'' (V. I. Lenin, *Collected Works*, Vol. 19, p. 298).

1871లో జర్మన్ సామ్రాజ్య సంస్థాపన జరగడంతో లాసాలియన్లకూ ఐసె నాఖర్లకూ మధ్య ఎత్తుగడలకు సంబంధించిన ప్రధానమైన విభేదం తొలగిపోయింది. 1875లో పెరుగుతున్న కార్మికోద్యమంయొక్క, పెరిగిన ప్రభుత్వ నిర్బంధాలయొక్క ప్రభావంకింద యీ రెండు పార్టీలూ గోతా మహాసభలో ఏకమై, జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీగా రూపొందాయి. తర్వాత దీని పేరు జర్మన్ సోషల్ డెమో క్రటిక్ పార్టీగా మారింది. గోతా మహాసభలో ఆమోదింపబడిన కార్యక్రమాన్ని గురించి 146వ వివరణలో చూడండి. — 108.

117 ఫేబియన్లు — ఫేబియన్ సొసైటీ సభ్యులు. 1884లో స్థాపింపబడిన ఈ బ్రిటిష్ సంస్కరణవాద సంఘానికి ఫేబియస్ మాక్సిముస్ ''కుంక్టేటర్'' (''కాలహారి'') అనే రోమన్ జనరల్‌నుంచి ఈ పేరు వచ్చింది. తాత్సారపు ఎత్తుగడలకూ, హానిబల్‌కి వ్యతిరే కంగా నిర్ణయాత్మక యుద్ధాన్ని దాటవెయ్యడానికీ యీ జనరల్ ప్రసిద్ధిచెందాడు.

ఫేబియన్లు అత్యధికాంశం బూర్జువా మేధావులు — విజ్ఞానశాస్త్రవేత్తలు, రచయితలు, రాజకీయవేత్తలు (ఉదాహరణకు, సిడ్నీ వెబ్బ్, బియాట్రిస్ వెబ్బ్, బెర్నార్డ్ షా, రామ్సే మెక్డోనల్డ్). శ్రామికవర్గపు వర్గపోరాటం, సోషలిస్టు విప్లవం వీటి అవసరాన్ని వాళ్లు తిరస్కరించి, పెట్టుబడిదారీ విధానంనుంచి సోషలిజానికి పరివర్తన చిన్న చిన్న సంస్కరణల ద్వారానూ, సమాజపు క్రమ రూపాంతరీకరణ ద్వారానూ మాత్రమే సాధ్యమని ఉద్ఘాటించారు. లెనిన్ యీ ఫేబియన్ ఉద్యమాన్ని "ఒక తీవ్ర అవకాశవాద ధోరణి"గా వర్ణించాడు. (*Collected Works*, Vol. 13, p. 358). 1900లో ఫేబియన్ సొసైటీ లేబర్ పార్టీలో చేరింది. — 108.

118 బ్రిటిష్ సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్కి ప్రస్తావన యిది. 82వ వివరణ చూడండి. — 108.

119 "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") — "జెమ్ల్యా యి వోల్య" ("భూమీ, స్వేచ్ఛా") అనే నరోద్నిక్ సంఘంలో వచ్చిన చీలిక ఫలితంగా, 1879 ఆగస్టులో ఏర్పడిన నరోద్నిక్ టెరరిస్టుల రహస్య రాజకీయ సంఘం. నరోద్నిక్ ఊహాజనిత సోషలిస్టు భావాలకు యింకా కట్టుబడి వుంటూనే, నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యడాన్నీ, రాజకీయ స్వాతంత్ర్య సాధననూ తమ ప్రధాన కర్తవ్యంగా పరిగణించిన "నరోద్నయ వోల్య" సభ్యులు రాజకీయ పోరాట పంథాను చేబట్టారు. జారిస్టు నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాళ్లు వీరోచితంగా పోరాడారు. కాని, క్రియాశీల "వీరులు," క్రియారహిత "జన బాహుళ్యం" అన్న తప్పుడు సిద్ధాంతంనుంచి బయల్దేరి, ప్రజల భాగస్వామ్యం లేకుండా, తమ సొంత ప్రయత్నాల ద్వారా, వ్యక్తిగత టెరరిస్టు చర్యల ద్వారా సమాజాన్ని పునర్నిర్మించాలని వాళ్లు ఆశించారు. 1881 మార్చి 1న, రెండవ అలెక్సాండ్ర్ జారు హత్య చెయ్యబడ్డాక, ప్రభుత్వం యీ సంఘాన్ని అణచివేసింది. 1880 దశకంలో దాన్ని పునరుద్ధరించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే అవన్నీ విఫలమయ్యాయి. — 108.

120 80వ వివరణ చూడండి.

121 రష్యన్ విమర్శకులు — "చట్టబద్ధ మార్క్సిస్టులు" అనబడేవాళ్లు.

"చట్టబద్ధ మార్క్సిజం" — రష్యాలో 1890 దశకంలో బూర్జువా ఉదారవాద మేధావివర్గంలో తలెత్తిన ఒక సామాజిక రాజకీయ ధోరణి. స్త్రూవె, బుల్గాకొవ్, తుగాన్-బరనోవ్స్కీ, తదితర "చట్టబద్ధ మార్క్సిస్టులూ" తమను తాము మార్క్సిస్టులమని పిలుచుకున్నారు. అయితే వాళ్లు మార్క్సిస్టు బోధనముండి ఫ్యూడల్ వ్యవస్థ అనివార్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు చోటిస్తుందన్న సిద్ధాంతాన్ని మాత్రమే

స్వీకరించి, మార్క్సిజంయొక్క "విప్లవాత్మ"ను, అంటే పెట్టుబడిదారీ విధానపు అనివార్య పతనం, సోషలిస్టు విప్లవం, సోషలిజానికి పరివర్తన బోధనను వాళ్లు తిరస్కరించారు. రష్యాలో పెట్టుబడిదారీ అభివృద్ధిని నిరాకరించిన నరోద్నిక్కులను "చట్టబద్ధ మార్క్సిస్టులు" లీగల్ పత్రికల్లో విమర్శించి, పెట్టుబడిదారీ వ్యవస్థను పొగిడారు. దరిమిలా వాళ్లు మార్క్సిజానికి శత్రువులై, బూర్జువా కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీతో కలిశారు. – 109.

122 జూపిటర్, మినేర్వా – పురాతన గ్రీకు దేవతలు. జూపిటర్ స్వర్గానికీ, ఉరుముకీ అధిపతి, రోమన్ రాజ్యాధిదేవత; మినేర్వా – యుద్ధాధిదేవత, చేతి పనులనూ, విజ్ఞాన శాస్త్రాలనూ, కళలనూ కాపాడేది; పురాణ కథ ప్రకారం ఆమె జూపిటర్ తలనుండి ఉద్భవించింది. – 110.

123 "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" – 1894లో, "శ్రమ విమోచన" గ్రూపు చొరవతో, తన సభ్యులందరూ ఆ గ్రూపు కార్యక్రమాన్ని ఆమోదిస్తారన్న షరతుపైన, స్థాపించబడింది. యూనియన్ ప్రచురణల సంపాదకత్వ బాధ్యత యీ గ్రూపుకి అప్పగించబడింది. ఆ గ్రూపు 1895 మార్చిలో తన ప్రింటింగ్ ప్రెస్సుని యూనియన్‌కి అప్పగించింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. (1898 మార్చిలో), యూనియన్ని విదేశాల్లో తన ప్రతినిధిగా గుర్తించింది. దరిమిలా అవకాశవాదులు – "తరుణులు" అని కూడా పిలవబడే ఆర్థికవాదులు – యూనియన్లో పైచెయ్యి సంపాదించుకున్నారు. 1898 నవంబరులో జూరిచ్‌లో జరిగిన యూనియన్ మొదటి మహాసభ ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభ ఆమోదించిన ప్రణాళికను బలపరచ నిరాకరించింది. యూనియన్‌లోపల పోరాటం 1900 ఏప్రిల్లో జెనీవాలో జరిగిన దాని రెండవ మహాసభ దాకానూ, ఆ మహాసభలోనూ కొనసాగింది. తత్ఫలితంగా "శ్రమ విమోచన" గ్రూపూ, దాని సమర్థకులూ మహాసభను వదిలివెళ్లిపోయి, "సోషల్ డెమోక్రట్" అనే స్వతంత్ర సంఘాన్ని స్థాపించుకున్నారు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో ఈ యూనియన్ పతినిధులు అత్యంత అవకాశవాద వైఖరిని తీసుకుని, "విదేశాల్లోని రష్యన్ విప్లవ డెమోక్రట్ల లీగు"నే విదేశాల్లోని ఏకైక పార్టీ శాఖగా గుర్తించి, మహాసభను విడిచి వెళ్లిపోయింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ ఒక తీర్మానం ద్వారా ఈ యూనియన్ని రద్దుచేసింది. – 112.

124 మహీధరం, జిరోండా – 18వ శతాబ్ది అంతంలో జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలోని రెండు రాజకీయ గ్రూపులు. ఎక్కువ కృతనిశ్చయులైన బూర్జువావర్గ

ప్రతినిధులకు మహీధరంవాళ్లు లేక జాకొబిన్లు అని పేరు పెట్టారు. ఆ కాలంలో బూర్జువావర్గం విప్లవ వర్గం, అది నిరంకుశత్వాన్నీ, ఫ్యూడల్ విధానాన్నీ రద్దు చేయాలని డిమాండుచేసింది. మరొక వైపున జిరోండిస్టులు విప్లవానికీ విప్లవ ప్రతిఘాతానికీ మధ్య ఉగిసలాడారు. వారిది రాజరికంతో రాజీపడే విధానం.

సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో అవకాశవాద ధోరణికి ''సోషలిస్టు జిరోండా'' అన్న పేరునూ, ''మహీధరం,'' లేక శ్రామికవర్గ జాకొబిన్లు అన్న పేరును విప్లవాత్మక సోషల్ డెమొక్రట్లకూ లెనిన్ అన్వయించాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. బోల్షెవిక్కులు గానూ, మెన్షెవిక్కులుగాను చీలిపోయాక, రష్యన్ శ్రామికవర్గ ఉద్యమంలో మెన్షెవిక్కులు జిరోండిస్టు ధోరణికి చెందిన వాళ్లని లెనిన్ అనేక సందర్భాల్లో, పేర్కొన్నాడు. – 112.

125 ''జర్యా'' (''ఉషారాగం'') – 1901–02 సంవత్సరాల్లో ''ఇస్క్రా'' సంపాదకవర్గం ష్టుట్‌గార్ట్‌నుంచి ప్రచురించిన మార్క్సిస్టు శాస్త్రీయ, రాజకీయ పత్రిక. మొత్తం మీద నాలుగు సంచికలు (మూడు విడతల్లో) వెలువడ్డాయి.

''జర్యా'' అంతర్జాతీయ రివిజనిజాన్నీ, రష్యన్ రివిజనిజాన్నీ విమర్శించి, మార్క్సిజం సైద్ధాంతిక సూత్రాలను సమర్థించింది. – 112.

126 ''బెజ్‌జగ్లావ్‌త్సీ'' – 1905–07 విప్లవ పతన దశలో ఏర్పడిన రష్యన్ బూర్జువా మేధావుల అర్ధ కాడెట్, అర్ధ మెన్షెవిక్ గ్రూపు. ప్రొకొపోవిచ్ సంపాదకత్వంలో 1906 జనవరి నుంచి మే దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ''బెజ్‌జగ్లావియ'' (''శీర్షిక లేకుండా'') పేర ప్రచురింపబడిన ఒక రాజకీయ వారపత్రికనుంచి యీ గ్రూపుకి యీ పేరు వచ్చింది. ఈ ''బెజ్‌జగ్లావ్‌త్సీ'' తాము పార్టీ రహితులమని చెప్పుకున్నా, ఆచరణలో బూర్జువా ఉదారవాద భావాలనూ, అవకాశవాదాన్నీ ప్రచారంచేశారు. అంతర్జాతీయ, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమాల్లో రివిజనిజాన్ని సమర్థించారు. – 113.

127 1877 మే 27నుండి 29దాకా గోతాలో జరిగిన జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీ మహాసభకు యిది ప్రస్తావన. మహాసభలో పార్టీ పత్రికల విషయం చర్చింపబడినప్పుడు, కొందరు ప్రతినిధులు (మోస్ట్, వాల్టేహ్) డ్యూరింగ్‌ను ఖండిస్తూ ఎంగెల్స్ రాసిన వ్యాసాలను ప్రచురించినందుకు పార్టీ కేంద్ర పత్రిక అయిన "Vorwärts" (''ముందుకు'')ను అభిశంసించే ప్రయత్నం చేశారు. (ఈ వ్యాసాలే దరిమిలా 1878లో ''యాంటీ డ్యూరింగ్. విజ్ఞానశాస్త్రంలో హెర్ ఒయ్‌గెన్ డ్యూరింగ్ తెచ్చిన విప్లవం'' అనే శీర్షికతో పుస్తకంగా ప్రచురింపబడ్డాయి.) ఈ ప్రయత్నాలూ, వాదవివాదాల్లో ఎంగెల్స్ నైశిత్యాన్ని అభిశంసించే ప్రయత్నమూ ఓడింపబడ్డాయి. అయితే, కొన్ని

చిక్కుల దృష్ట్యా, సైద్ధాంతిక సమస్యలపైన చర్చను అనుబంధంలోనే గాని, నేరుగా పత్రికలో ప్రచురించరాదని మహాసభ నిర్ణయించింది. — 114.

128 "Vorwärts" (''ముందుకు'') — 1891నుండి బెర్లిన్‌నుంచి ప్రచురింపబడిన దిన పత్రిక. ఇది జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ కేంద్ర పత్రిక. ఎంగెల్స్ యీ పత్రిక పేజీల్లో అవకాశవాద ధోరణులు అన్నింటిమీదా పోరాటం జరిపాడు. 1890 దశకపు చివరి సంవత్సరాల్లో, ఎంగెల్స్ మరణానంతరం, యీ వార్తాపత్రిక అజమాయిషీ పార్టీలోని మితవాద పక్షం చేతుల్లో పడింది. దానితో యీ పత్రిక అవకాశవాదుల వ్యాసాలను వరుసగా ప్రచురించింది.

1914–18 నాటి ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో "Vorwärts" సోషల్ దురహంకార వైఖరిని చేబట్టింది. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవానంతరం అది సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని సాగించింది. ఈ పత్రిక ప్రచురణ 1933లో నిలిచి పోయింది. — 114.

129 కథెడెర్ సోషలిస్టులు — 1870–1880 దశకాల్లో బూర్జువా అర్థశాస్త్రంలో ఒక ధోరణికి ప్రతినిధులు. తమ విశ్వవిద్యాలయ ఆచార్య పీఠాలనుంచి (జర్మన్ భాషలో Katheder), సోషలిజం ముసుగులో, వీళ్లు బూర్జువా ఉదారవాద సంస్కరణవాదాన్ని బోధించారు. బూర్జువా రాజ్యం ''వర్గాలకు అతీతమైనది'' అనీ, విరుద్ధ వర్గాల మధ్య అది సామరస్యాన్ని సాధించగలదనీ, సాధ్యమైనంతవరకు కార్మికజనంయొక్క డిమాండ్లను పరిగణనలోకి తీసుకొంటూ, పెట్టుబడిదారుల ప్రయోజనలను దెబ్బతియ్యకుండా, క్రమంగా సోషలిజాన్ని అది ప్రవేశపెట్టగలదనీ వీళ్లు వాదించారు. రష్యాలో వాళ్ల యీ అభిప్రాయాలను ''చట్టబద్ధ మార్క్సిస్టులు'' బోధించారు. — 114.

130 నాజ్‌ద్ర్యోవ్ — గోగొల్ ''మృతజీవులు''లోని ఒక పాత్ర. అసభ్య ప్రవర్తనకీ, కిలాడీతనానికీ యీ పాత్ర ప్రసిద్ధి చెందింది. — 115.

131 హనోవర్ తీర్మానం — 1899 అక్టోబరు 9–14 తేదీల్లో హనోవర్‌లో జరిగిన జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభ ''పార్టీ ప్రధాన అభిప్రాయాలపైనా, ఎత్తుగడలపైనా దాడులు'' పై ఆమోదించిన తీర్మానం. జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలోని అవకాశవాద పక్షం, బెర్న్‌స్టైన్ సైద్ధాంతిక నాయకత్వంలో, మార్క్సిస్టు మూలసూత్రాలను తిరగదోడటానికీ, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఎత్తుగడలను మార్చివేసి, ప్రజాస్వామిక సంస్కరణల పార్టీగా దాన్ని రూపాంతరీకరించేందుకు జరిపిన ప్రయత్నాలను యీ తీర్మానం ఖండించింది. అయితే, రివిజనిజంపైనా, వాస్తవంలో

రివిజనిజం వకాలతుదారులపైనా నిశిత విమర్శ లేనందుకు వామపక్ష సోషల్ డెమొక్రట్లు (రోజా లుక్సెంబుర్గ్ ప్రభృతులు) యీ తీర్మానాన్ని అభిశంసించారు. బెర్న్‌స్టైన్ సమర్థకులు యీ తీర్మానానికి అనుకూలంగా ఓటుచేశారు. — 115.

132 ల్యూబెక్ తీర్మానం — 1901 సెప్టెంబరు 22–28 తేదీల మధ్య ల్యూబెక్‌లో జరిగిన జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభ ఆమోదించిన యీ తీర్మానం బెర్న్‌స్టైన్‌కి వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. 1899 నాటి హనోవర్ మహాసభానంతరం, బెర్న్‌స్టైన్, సోషల్ డెమొక్రటిక్ పార్టీ కార్యక్రమానికీ, ఎత్తుగడలకీ వ్యతిరేకంగా తన దాడులను నిలిపెయ్యడానికి బదులు, వాటిని ముమ్మరంచేసి, వాటిని పార్టీయేతర వర్గాల్లోకి కూడా తీసుకెళ్లడమే యిందుకు కారణం. చర్చా క్రమంలోనూ, బేబెల్ ప్రతిపాదించగా అత్యధిక సంఖ్యాకులచేత ఆమోదింపబడిన తీర్మానంలోనూ, బెర్న్‌స్టైన్‌కి ప్రత్యక్షంగా హెచ్చరిక చెయ్యబడింది. అంతేగాని, మార్క్సిజాన్ని తిరగతోడటానికీ పార్టీ సభ్యత్వానికీ మధ్య పొసగదన్న సమస్య సూత్రబద్ధమైన ఒక అంశంగా లేవనెత్తబడ లేదు. — 115.

133 జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ష్టుట్‌గార్ట్ మహాసభ — 1898 అక్టోబరు 3–8 తేదీల మధ్య జరిగిన యీ మహాసభ, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో రివిజనిజం సమస్యపై చర్చ జరిపిన మొట్టమొదటి మహాసభ. దేశాంతరవాసంలో వున్న కారణంగా హాజరుకాలేకపోయిన బెర్న్‌స్టైన్ ప్రకటన యీ మహాసభలో చదవబడింది. అంతకుముందే అనేక వ్యాసాల్లో వెలిబుచ్చిన అవకాశవాద అభిప్రాయాలను బెర్న్‌స్టైన్ తన యీ ప్రకటనలో విపులీకరించి, సమర్థించాడు. అయితే, అతని ప్రత్యర్థుల మధ్య మహాసభలో ఏకాభిప్రాయం లేకపోయింది. కొందరు (బేబెల్, కౌట్స్కీల నాయకత్వాన) చీలికను నివారించేందుకుగాను, పార్టీలోపల బెర్న్‌స్టైనిజానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని సంయమనంతో కూడిన ఎత్తుగడలతో జతచెయ్యాలని ప్రయత్నించారు. మిగిలినవాళ్లు (రోజా లుక్సెంబుర్గ్, పార్వుస్) — అల్పసంఖ్యాకులు — మరింత దృఢమైన వైఖరిని అవలంబించి, చీలికవచ్చే అవకాశాన్ని గురించి భయపడకుండా, మరింత విస్తృతమూ, మరింత తీవ్రమూ అయిన చర్చ జరగాలని ప్రతిపాదించారు. ఈ సమస్యపైన మహాసభ ఏ తీర్మానాన్నీ ఆమోదించలేదు. కాని, చర్చనుంచీ, అది చేసిన యితర తీర్మానాలనుంచీ మహాసభలో పాల్గొన్న ప్రతినిధుల్లో అత్యధిక సంఖ్యాకులు విప్లవాత్మక మార్క్సిజానికి విధేయులుగా ఉన్నారన్న విషయం స్పష్టపడింది. — 116.

134 "ఏం జరిగింది?" అన్న శీర్షికతో ఎ. ఎన్. పొత్రేసొవ్ (స్తరొవేర్) రాసిన వ్యాసం

నుంచి ఉదహరింపబడింది. ఈ వ్యాసం 1901 ఏప్రిల్లో ''జర్యా'' మొదటి సంచికలో ప్రచురింపబడింది. – 117.

135 ''కళ్లు నెత్తికి ఎక్కిన రచయిత'' – మక్సీమ్ గోర్కీ కథల్లో ఒకదాని శీర్షిక. – 119.

136 ''మన ఆర్థికాభివృద్ధి స్వభావ పరిశీలనకు సమాచారం'' పేర 1895లో వెలువడిన వ్యాస సంకలనంలోనూ, 1907లో పునర్ముద్రింపబడిన వ్యాససంకలనం ''పన్నెండేళ్లు'' లోనూ ప్రచురింపబడిన ''నరోదిజంయొక్క ఆర్థిక సారాంశం, స్త్రూవె పుస్తకంలో దానిపై విమర్శ (బూర్జువా సాహిత్యంలో ప్రతిబింబించిన మార్క్సిజం)'' అనే తన వ్యాసాన్నీ, ఆనాటి పరిస్థితినీ, యీ వ్యాస ప్రచురణకు దారితీసిన చరిత్రనూ వివరించిన ఆ వ్యాససంకలనపు ముందుమాటనూ లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. – 119.

137 బెర్న్‌స్టైన్ రచించిన "Die Voraussetzungen des Sozialismus und die Aufgaben der Sozialdemokratie" (''సోషలిజం పూర్వోత్తరాలూ, సోషల్ డెమోక్రసీ కర్తవ్యాలూ'') అనే పుస్తకం రష్యన్ భాషలో, 1901లో, వేర్వేరు శీర్షికలతో ప్రచురింపబడింది: 1) ''చారిత్రక భౌతికవాదం;'' 2) ''సామాజిక సమస్యలు;'' 3) ''సోషలిజం సమస్యలూ, సోషల్ డెమోక్రసీ కర్తవ్యాలూ.'' – 121.

138 ''రష్యన్ సోషల్ డెమోక్రట్ల నిరసన''ను లెనిన్ ప్రవాసంలో వున్నప్పుడు, 1899 ఆగస్టులో రచించాడు. ఆర్థికవాదుల గ్రూపు (ఎస్. ఎన్. ప్రొకొపోవిచ్, యె. డి. కుస్కోవా, యితరులూ) ప్రణాళిక అయిన ''క్రెడో''కి వ్యతిరేకంగా యిది ఉద్దేశింపబడింది. మినుసిన్‌స్క్ జిల్లాలోని యెర్మకోవ్‌స్కాయె గ్రామంలో లెనిన్ సమావేశపరచిన పదిహేడుమంది మార్క్సిస్టు ప్రవాసుల సమావేశంలో యీ ''నిరసన'' చర్చింపబడి, ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. తురుహాన్‌స్క్, ఒర్లోవ్ (వ్యాత్క జిల్లా)లలోని ప్రవాసులు యీ ''నిరసన''ను బలపరిచారు.

లెనిన్ యీ ''నిరసన'' ప్రతినొకదాన్ని విదేశాల్లోని ''శ్రమ విమోచన'' గ్రూపుకి పంపాడు. ప్లెహానొవ్ దీన్ని 1900వ సంవత్సరం మొదట్లో ''రబోచెయె దేలో'' సంపాదకుల కోసం "Vademecum" అన్న సంకలనంలో ప్రచురించాడు. – 122.

139 ''బిలోయె'' (''గతం'') – నరోదిజం, అంతకుముందరి సామాజికోద్యమాల చరిత్రకు అంకితంచెయ్యబడిన చారిత్రక జర్నల్. ఇది 1900–1926 సంవత్సరాల మధ్య పెద్ద పెద్ద విరామాలతో ప్రచురింపబడింది. – 122.

140 ''రబోచయ మీస్ల్'' (''కార్మికుల చింతన'') – 1897 అక్టోబరునుండి 1902 డిసెంబరు దాకా ప్రచురింపబడిన ''ఆర్థికవాదుల'' వార్తాపత్రిక. మొత్తంమీద 16

సంచికలు వెలువడ్డాయి. కె. ఎమ్. తహ్తారెవ్ ప్రభృతులు దీని సంపాదకులు.
"ఇస్క్రా" పత్రికలో తను రాసిన వ్యాసాల్లోనూ, "ఏం చెయ్యాలి?" అన్న తన పుస్తకంలోనూ లెనిన్ యీ వార్తాపత్రిక అభిప్రాయాలను అంతర్జాతీయ అవకాశ వాదపు రష్యన్ నమూనాగా పేర్కొని, వాటిని విమర్శించాడు. — 122.

141 "రబోచెయె దేలొ" సంపాదకులకు "Vademecum" ("దర్శకుడు") జి. వి. ప్లెహానొవ్ ముందుమాటతో "శ్రమ విమోచన" గ్రూపు ప్రచురించిన సంకలనం (జెనీవా, ఫిబ్రవరి, 1900). ఇది ఆర్.ఎస్.డి.ఎల్.పి.లోని అవకాశవాదానికీ, ప్రధానంగా "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్"యొక్క, దాని పత్రిక అయిన "రబోచెయె దేలొ"యొక్క "ఆర్థికవాదానికి" వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. —122.

142 "Profession de foi" ("విశ్వాసం, కార్యక్రమం") — ఆర్.ఎస్.డి.ఎల్.పి. కీయెవ్ కమిటీ అవకాశవాద అభిప్రాయాలను వివరించిన కరపత్రం. ఇది 1899 చివర రచింపబడింది. ఈ కరపత్రానికీ, "ఆర్థికవాదుల" "క్రెడో"కీ మధ్య చాలా సామ్యం వుంది. — 122.

143 "శ్రమ విమోచన" గ్రూపు — మొట్టమొదటి రష్యన్ మార్క్సిస్టు గ్రూపు. దీన్ని 1883లో జెనీవా (స్విట్జర్లండు)లో జి. వి. ప్లెహానొవ్ స్థాపించాడు. ఈ గ్రూపు రష్యాలో మార్క్సిజం వ్యాప్తికి విశేషంగా కృషిచేసి, మార్క్సిజం వ్యాప్తికీ, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాభివృద్ధికీ ప్రధాన సైద్ధాంతిక ఆటంకమైన నరోదిజంమీద తీవ్రమైన దెబ్బకొట్టింది. రష్యన్ సోషల్ డెమోక్రట్లకోసం ప్లెహానొవ్ రచించగా, "శ్రమ విమోచన" గ్రూపు ప్రచురించిన కార్యక్రమంయొక్క రెండు ముసాయిదాలు రష్యాలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిర్మాణానికి సన్నాహాలుచేసి, నిర్మించడంలో ఓ ముఖ్యమైన ముందడుగు. "శ్రమ విమోచన" గ్రూపు అంతర్జాతీయ కార్మికోద్యమంతో సంబంధాలు ఏర్పరచుకొని, 1889లో పారిస్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మొదటి మహాసభనాటినుంచి అన్ని మహాసభల్లోనూ రష్యన్ సోషల్ డెమోక్రట్లకు ప్రాతినిధ్యం వహించింది. అయితే ఆ గ్రూపు తీవ్రమైన పొరపాట్లు చేసింది; అది ఉదారవాద బూర్జువావర్గపు పాత్రను ఎక్కువగా అంచనావేసి, శ్రామికవర్గ విప్లవంలో ఒక రిజర్వుగా రైతాంగపు విప్లవాత్మక పాటవాన్ని తక్కువ అంచనావేసింది. భవిష్యత్తులో ప్లెహానొవ్ ప్రభృతుల మెన్షెవిక్ అభిప్రాయాలకు బీజం యీ పొరపాట్లలోనే వుంది. "శ్రమ విమోచన" గ్రూపు "సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులను మాత్రమే వేసింది, కార్మికోద్యమం దిశగా మొదటి అడుగు వేసింది" అని వి. ఐ. లెనిన్ పేర్కొన్నాడు. (*Collected Works*, Vol. 20, p. 278.)

1899 మొదట్లో ఆ గ్రూపు "ప్రచురణల పునరారంభాన్ని గూర్చిన "శ్రమ విమోచన" గ్రూపు ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రకటన 1899 డిసెంబరులో అక్సెల్‌రోడ్‌చేత రచింపబడింది. అది ఒక విడి పుస్తకంగానూ, "రబోచెయె దేలో" సంపాదకులకు "Vademecum"లోనూ ప్రచురింపబడింది. ఆ "ప్రకటన"లో ప్రతిపాదింపబడిన ఆ గ్రూపు సాహిత్య కార్యకలాపాల కార్యక్రమం "ఇస్క్రా," "జర్యా" ప్రచురణతో మాత్రమే నెరవేర్చబడింది. – 126.

144 "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" మూడవ మహాసభ జూరిచ్‌లో 1901 సెప్టెంబరు రెండవ పక్షంలో జరిగింది. దాని నిర్ణయాలు "యూనియన్"లో అవకాశవాదం తుది విజయం పొందిన విషయాన్ని నిరూపించాయి. ఆ మహాసభ విదేశాల్లోని రష్యన్ సోషల్ డెమోక్రటిక్ సంఘాల ముసాయిదా ఒడంబడికకీ, ఒప్పందానికీ సవరణలనూ, చేర్పులనూ ఆమోదించింది. 1901 జూన్‌లో జెనీవా సమావేశంలో రూపొందింపబడిన ఆ ఒడంబడికా, ఒప్పందమూ కచ్చితమైన అవకాశవాద స్వభావం కలిగినవి. దీన్నిబట్టి, యూనియన్ మూడవ మహాసభకి కొద్ది రోజుల అనంతరం జరిగిన దేశాంతర ఆర్.ఎస్.డి.ఎల్.పి. శాఖల "ఐక్యతా" మహాసభ విఫలమౌతుందని ముందే తేలిపోయింది. వాస్తవంలో రివిజనిస్టులను ప్రోత్సహించిన "రబోచెయె దేలో" సంపాదకులకు ఆదేశాలను కూడా ఆ మహాసభ ఆమోదించింది. – 126.

145 బ్రాకెకు మార్క్స్ రాసిన లేఖ, 1875, మే 5వ తేదీన. – 127.

146 గోతా కార్యక్రమం – 1875లో గోతాలో జరిగిన మహాసభలో జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీ ఆమోదించిన కార్యక్రమం. ఆ మహాసభలో రెండు జర్మన్ సోషలిస్టు పార్టీలు – ఔగుస్ట్ బేబెల్, విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌ల నాయకత్వాన గల మార్క్స్ ఎంగెల్సుల భావాలచేత ప్రభావితులైన ఐసెనాఖర్లూ, లాసాలియన్లూ – ఐక్యమయ్యారు. ఐసెనాఖర్లు అతిముఖ్యమైన సమస్యలపైన లాసాలియన్లకు రాయితీలు యిచ్చి, వాళ్ల సూత్రీకరణలను ఆమోదించిన కారణంగా, ఆ కార్యక్రమానికి పృథక్కలల, అవకాశవాదాల దోషం అంటింది. మార్క్స్ ఎంగెల్సులు గోతా కార్యక్రమాన్ని నిశితంగా విమర్శించారు, 1869 నాటి ఐసెనాఖ్ కార్యక్రమంతో పోల్చినప్పుడు దాన్ని తిరోగామి చర్యగా పాటించారు. – 127.

147 పి. బి. అక్సెల్‌రోడ్ రచించిన "రష్యన్ సోషల్ డెమోక్రట్ల ప్రస్తుత కర్తవ్యాలూ, ఎత్తుగడల సమస్య," జెనీవా, 1898కి యిది ప్రస్తావన. – 128.

148 ఇది 1896 మే – జూన్ మాసాల్లో సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో జరిగిన జౌళి కార్మికుల సామూహిక సమ్మెకు లెనిన్ ప్రస్తావన. సెంట్ పీటర్స్‌బుర్గ్ "కార్మికవర్గ విమోచన

పోరాట సమితి'' యీ సమ్మెకు మార్గదర్శకత్వం వహించింది. తమ హక్కుల పరిరక్షణలో భుజం భుజం కలిపి అందరూ, పట్టుదలగా నిలబడవలసిందిగా కార్మికులకు పిలుపునిస్తూ అది కరపత్రాలను ప్రచురించింది. ''సెంట్ పీటర్స్‌బుర్గ్ జౌళి మిల్లుల కార్మికులు డిమాండ్‌చేస్తున్నదేమిటి?'' అన్న పేరున అది కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రచురించి, పంచిపెట్టింది. ఆ డిమాండ్లు యివీ: $10^1/_2$ గంటల పనిదినం, వేతన రేట్ల పెంపుదల, సకాలంలో వేతనాల చెల్లింపు వగైరా. సెంట్ పీటర్స్‌బుర్గ్ సమ్మెలు రష్యా అంతటా సమ్మె ఉద్యమానికి ఊపునిచ్చి, ఫ్యాక్టరీ చట్టాలను తొందరగా చేసేలాగా, 1897 జూన్ 2 (14) నాటి చట్టాన్ని చేసేలాగా జారిస్టు ప్రభుత్వం మీద ఒత్తిడితెచ్చింది. ఈ చట్టం మేరకు ఫ్యాక్టరీల్లో పనిదినం $11^1/_2$ గంటలకు తగ్గించబడింది. – 132.

149 ''ఆందోళనా పద్ధతులు'' అన్న పుస్తకాన్ని ఎ. క్రేమెర్ (తదుపరి యితను బుండ్ సంఘం ఆర్గనైజరు) వీల్నొలో 1894లో రచించాడు. వీల్నొలో సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాల అనుభవాన్ని క్రోడీకరించిన యీ పుస్తకం రష్యన్ సోషల్ డెమోక్రట్ల పైన విశేషమైన ప్రభావాన్ని కలిగించింది. సంకుచితమైన అధ్యయన కేంద్రాల ప్రచారాన్ని తిరస్కరించి, ప్రజల దైనందిన అవసరాలకూ, డిమాండ్లకూ సంబంధించిన సమస్యలపైన సామూహిక ఆందోళనకు పూనుకోమని అది కార్మికులకు విజ్ఞప్తిచెయ్యడమే అందుకు కారణం. అయితే, కేవలం ఆర్థిక పోరాట పాత్రనూ, ప్రాముఖ్యాన్నీ అది అతిశయింపజేసి, సాధారణ ప్రజాస్వామిక డిమాండ్ల సాధన సమస్యలపైన రాజకీయ ఆందోళనను చిన్న చూపు చూసింది. భవిష్యత్తులోని ఆర్థికవాదానికి అదే బీజం. – 134.

150 ''కార్మికవర్గ విమోచన పోరాట సమితి'' – లెనిన్‌చేత 1895 శరదృతువులో స్థాపించబడిన యీ సమితి సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని ఓ యిరవై మార్క్సిస్టు కార్మికుల అధ్యయన బృందాలను సమైక్యం చేసింది. ఈ ''పోరాట సమితి'' కార్యకలాపాలు కేంద్రీకృత సూత్రాలు, కచ్చితమైన క్రమశిక్షణ ప్రాతిపదికపైన నిర్వహింపబడ్డాయి. లెనిన్ మార్గదర్శకత్వంలో వున్న కేంద్ర గ్రూపు దీనికి నాయకత్వం వహించింది.

1895 డిసెంబరులో, జారిస్టు ప్రభుత్వం యీ సమితిపైన పెద్ద దెబ్బ తీసింది: డిసెంబరు 8వ తేదీ (డిసెంబరు 20) రాత్రి పూట సమితి సభ్యులు గణనీయమైన సంఖ్యలో అరెస్టు చెయ్యబడ్డారు. నిర్బంధితుల్లో లెనిన్ కూడా వున్నాడు. ప్రెస్సుకి సర్వసంసిద్ధం చెయ్యబడిన ''రబోచెయె దేలొ'' మొదటి సంచిక పోలీసులచేత వశంచేసుకోబడింది.

ఖైదులో వున్న కాలంలో లెనిన్, ఆ సమితి కార్యకలాపాలకు మార్గదర్శకత్వం వహించి, తన సలహాల ద్వారా సహాయపడుతూండేవాడు. ఖైదునుండి ఆయన రహస్య లిపిలో లేఖలనూ, కరపత్రాలనూ పంపుతూండేవాడు. ఆయన "సమ్మెలను గురించి" అన్న చిన్న పుస్తకాన్నీ (అయితే యీ రాతప్రతి లభ్యం కాలేదు), "సోషల్ డెమొక్రటిక్ పార్టీ కార్యక్రమ ముసాయిదా, వివరణా" అన్న పుస్తకాన్నీ రచించాడు.

లెనిన్ మాటల్లో చెప్పాలంటే, కార్మికవర్గ ఉద్యమంమీద ఆధారపడి శ్రామిక వర్గపు వర్గపోరాటానికి నాయకత్వం వహించిన విప్లవ పార్టీయొక్క బీజం కావడంలోనే "కార్మికవర్గ విమోచన పోరాట సమితి" ప్రాముఖ్యం వుంది.

అరెస్టు కాకుండా తప్పించుకొన్న సమితి సీనియర్ సభ్యులు ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభకు సన్నాహాలు చేసి, దాన్ని జరపడంలోనూ, ఆ మహాసభ ప్రణాళికను రచించడంలోనూ పాల్గొన్నారు. అయితే, ఆ పోరాట సమితి సంస్థాపక సభ్యులు, అందరి కన్న ముఖ్యంగా లెనిన్, సైబీరియా ప్రవాసంలో ఉండిపోవడం, "యువకులూ," ఆర్థికవాదులూ అవకాశవాద విధానాన్ని అనుసరించడాన్నీ, 1897నుంచి తమ పత్రిక "రబోచయ మీస్ల్" ద్వారా రష్యన్ గడ్డపైన ట్రేడ్‌యూనియనిజాన్నీ, బెర్న్‌స్టైనిజాన్నీ నాటడాన్ని సాధ్యం చేసింది. 1898 ద్వితీయార్ధభాగంలో సమితిమీద అదుపు బాగా కరడుగట్టిన ఆర్థికవాదుల – "రబోచయ మీస్ల్" వాళ్ల చేతుల్లో పడింది. – 135.

151 "రబోచెయె దేలొ" కోసం లెనిన్ రాసిన సంపాదకీయం "రష్యన్ కార్మికులకు" లభ్యం కాలేదు.

"రూస్కయ స్తరినా" ("రష్యన్ ప్రాచీనత") – చారిత్రక సమస్యలను చర్చించే యీ మాసపత్రిక 1870 నుండి 1918 వరకు సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడింది. – 135.

152 1895 ఏప్రిల్ 27న (మే 9న) యరొస్లావ్ల్‌లోని పెద్ద జౌళి మిల్లులలో జరిగిన సమ్మెను పాశవికంగా అణచివేసినదానికి యిది ప్రస్తావన. 4000 మందికి పైగా పాల్గొన్న యీ సమ్మెకు కారణం కొత్త వేతనాల రేట్లను ప్రవేశపెట్టడం. ఈ మార్పు ఫలితంగా వేతనాలు తగ్గాయి.

1895 నాటి యరొస్లావ్ల్ సమ్మెపైన లెనిన్ ఒక వ్యాసం రాశాడు, కాని అది లభ్యం కాలేదు. – 135.

153 "సెంట్ పెటర్స్‌బుర్గ్‌స్కీ రబోచియ్ లిస్తొక్" (సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మిక కరపత్రం") – సెంట్ పీటర్స్‌బుర్గ్ "కార్మికవర్గ విమోచన పోరాట సమితి" పత్రిక. రెండు సంచికలు వెలువడ్డాయి.

కార్మికవర్గపు ఆర్థిక పోరాటాన్ని విస్తృతమైన రాజకీయ డిమాండ్లతో మిళితంచెయ్యవలసిన కర్తవ్యాన్ని యీ పత్రిక ముందుకుతెచ్చి, కార్మికవర్గ పార్టీని నిర్మించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. – 136.

154 ఇది వి. ఐ. లెనిన్, ఎ. ఎ. వనేయెవ్, జి. ఎమ్. క్రిజిజనోవ్‌స్కీ, ఎల్. మార్తొవ్ మొదలైన "కార్మికవర్గ విమోచన పోరాట సమితి" వ్యవస్థాపక సభ్యులకూ, అంటే సైబీరియాకు ప్రవాసులుగా పంపబడేందుకు ముందు ఖైదునుంచి మూడు రోజులపాటు విడుదల చేయబడిన సమితియొక్క "పాత" సభ్యులకూ "యువ" ప్రతినిధులకూ మధ్య జరిగిన సమావేశాలకు ప్రస్తావన. 1897 ఫిబ్రవరి 14–17 (కొత్త పంచాంగం ప్రకారం ఫిబ్రవరి 26 – మార్చి 1) తేదీల మధ్య సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో జరిగిన యీ సమావేశాల్లో నిర్మాణం, ఎత్తుగడల సమస్యలపైన సూత్రరీత్యా వున్న విభేదాలు ప్రస్ఫుటమయాయి. – 137.

155 "లిస్తోక్ 'రబోత్నిక' " ("కార్మిక కరపత్రం") – "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్"చేత జెనీవాలో 1896 నుండి 1898 వరకు అప్పుడప్పుడు ప్రచురింపబడిన పత్రిక. 1–8 సంచికలకు "శ్రమ విమోచన" గ్రూపు సంపాదకత్వం వహించింది. అయితే "దేశాంతర యూనియన్"లోని అధిక సంఖ్యాకులు ఆర్థికవాదం వేపు మొగ్గాక, ఆ యూనియన్ ప్రచురణలకు సంపాదకత్వం వహించడానికి "శ్రమ విమోచన" గ్రూపు నిరాకరించింది. కాగా, ఆ పత్రిక 9–10 సంచికకు (1898 నవంబరు) ఆర్థికవాదులు సంపాదకత్వం వహించారు. – 138.

156 జారిస్టు రాజకీయ పోలీసులు నీలం యూనిఫారాలు ధరించేవారు. – 139.

157 వి. వి. – 1880–90 దశకాల్లో ఉదారవాద నరోదిజంయొక్క సైద్ధాంతికుడైన వి. పి. వొరొన్‌త్సోవ్‌కు మారుపేరు. "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు వి. వి.లు" అన్నప్పుడు, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు అవకాశవాద ధోరణికి ప్రతినిధులైన ఆర్థికవాదులని లెనిన్ అర్థం. – 141.

158 ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క వియన్నా మహాసభ – 1901 నవంబరు 2–6 తేదీల మధ్య జరిగిన యీ మహాసభ 1888 నాటి పాత హైన్‌ఫెల్డ్ కార్యక్రమం స్థానంలో ఓ కొత్త "పార్టీ కార్యక్రమాన్ని" ఆమోదించింది. 1899 నాటి బ్రూన్ మహాసభ ఆదేశాల మేరకు నియమింపబడిన ఒక ప్రత్యేక కమిటీ (వి. ఆడ్లర్ ప్రభృతులు) రూపొందించిన కొత్త కార్యక్రమపు ముసాయిదాలో బెర్న్‌స్టైనిజానికి గణనీయమైన మినహాయింపులు యివ్వబడ్డాయి. ఇది విమర్శకు గురైంది. – 142.

159 జారిస్టు పోలీసులు నియమించిన కార్యకర్తలద్వారా ''కార్మిక సంఘాల''ను ఏర్పరచేందుకు చేసిన ప్రయత్నానికి ప్రస్తావన ఇది. అలాంటి సంఘాలను ఏర్పరచడానికి పోలీసు కలనల్ ఎస్. వి. జుబాతొవ్ చొరవ తీసుకున్నాడు. అందుచేత అలాంటి కార్యక్రమానికి ''జుబాతొవ్‌ష్చిన'' అనే పేరు వచ్చింది. జారిస్టు నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంనుంచి కార్మికులను మళ్లించడమే ఈ ''సంఘాల'' స్థాపన ఉద్దేశం. మొదటి జుబాతొవ్ సంఘాన్ని మాస్కోలో, 1901 మేలో ఏర్పాటుచేశారు, తరువాత ఇతర పట్టణాల్లో కూడా అలాంటి సంఘాలు స్థాపించారు.

విప్లవ సోషల్ డెమొక్రట్లు, ''జుబాతొవ్‌ష్చిన'' అభివృద్ధి నిరోధక స్వభావాన్ని బయటపెట్టి, జారిస్టు ప్రభుత్వ వ్యతిరేక పోరాటానికి విస్తృత కార్మిక జనాన్ని సమీకరించేందుకు చట్టబద్ధ కార్మిక సంఘాలను వినియోగించారు. 1903లో విప్లవ ఉద్యమ విజృంభణ మూలంగా జారిస్టు ప్రభుత్వం జుబాతొవ్ సంఘాలను రద్దుచేయవలసి వచ్చింది. – 145.

160 హిర్ష్-డుంకెర్ ట్రేడ్‌యూనియన్లు - బూర్జువా ప్రోగ్రెసిస్టు పార్టీ ప్రముఖ సభ్యులైన మాక్స్ హిర్ష్, ఫ్రాంజ్ డుంకెర్‌లు జర్మనీలో 1868లో స్థాపించిన సంస్కరణవాద ట్రేడ్‌యూనియన్లు. ఈ యూనియన్ల ఆర్గనైజర్లు శ్రామికుల, పెట్టుబడిదార్ల ప్రయోజనాల మధ్య ''సామరస్యం'' వుండాలని వాదించారు. ట్రేడ్‌యూనియన్లలో పెట్టుబడిదార్లను కూడా చేర్చుకోవచ్చునని భావించారు. సమ్మె పోరాట ఆవశ్యకతను తిరస్కరించి, పెట్టుబడిదారీ సమాజపు చట్రంలోపల, బూర్జువా ప్రభుత్వపు చట్టాల ద్వారా, ట్రేడ్‌యూనియన్ నిర్మాణం తోడ్పాటుతోనూ పెట్టుబడి శృంఖలాలనుంచి కార్మికులను విముక్తం చెయ్యడం సాధ్యమని వాళ్లు వాదించారు. కార్మికులకూ, యజమానులకూ నడుమ మధ్యవర్తిత్వం వహించడం, నిధులను సమీకరించడమే ట్రేడ్‌యూనియన్ల ప్రధాన కర్తవ్యమని వాళ్లు వాదించారు. వాళ్ల కార్యకలాపాలు ప్రధానంగా పరస్పర సహాయ కార్యకలాపాలకూ, సాంస్కృతిక, విద్యా సంస్థలకూ పరిమితం చెయ్యబడ్డాయి. – 146.

161 ''కార్మికవర్గ స్వయం విమోచన గ్రూపు'' – 1898 శరదృతువులో సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో స్థాపింపబడిన ఆర్థికవాదుల చిన్న గ్రూపు. కొద్ది నెలలపాటు మాత్రమే మనిన ఆ గ్రూపు, తన ఆశయాలను వివరించే ఒక విజ్ఞప్తినీ, నిబంధనావళినీ కార్మికులను ఉద్దేశించిన కొన్ని కరపత్రాలనూ ప్రచురించింది. – 148.

162 ''నకనూనె'' (''ప్రాంగణంలో'') – నరోద్నిక్ అభిప్రాయాలను వ్యక్తంచేసే ఒక మాస పత్రిక. రష్యన్ భాషలో అది లండన్‌నుంచి 1899 జనవరికీ 1902 ఫిబ్రవ

రికీ మధ్య ప్రచురింపబడింది. ఆ పత్రిక సంచికలు మొత్తం 37 వెలువడ్డాయి. ఆ పత్రిక వివిధ పెటీబూర్జువా పార్టీల, ధోరణుల ప్రతినిధులకు సమీకరణ కేంద్రంగా పనిచేసింది. — 148.

163 "శ్రమ విమోచన" గ్రూపుకీ, "రబోచెయె దేలో" సంపాదకులకీ మధ్య వివాదం 1899లో, లెనిన్ చిన్నపుస్తకం "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు" (జెనీవా, 1898) పైన "రబోచెయె దేలో" సంచిక 1 ఒక సమీక్షను ప్రచురించడంతో మొదలైంది. "రబోచెయె దేలో" సంపాదకులు "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" అవకాశవాద స్వభావాన్నీ, రష్యాలోని సోషల్ డెమోక్రటిక్ సంఘాల్లో ఆర్థికవాదుల పలుకుబడి పెరుగుదలనూ తిరస్కరించి, "ఆ పుస్తకపు సారాంశం 'రబోచెయె దేలో' సంపాదకీయ కార్యక్రమంతో పూర్తిగా ఏకీభవిస్తున్నద"నీ, ఆ పుస్తకానికి తను రాసిన ఉపోద్ఘాతంలో "ఏ 'యువ' కామ్రేడ్లను అక్సెల్‌రోడ్ ప్రస్తావించాడో" సంపాదకులకు తెలియదనీ ఆ సమీక్షలో వాదించారు.

1899 ఆగస్టులో తను రాసిన "'రబోచెయె దేలో' సంపాదకులకు లేఖ"లో పి. బి. అక్సెల్‌రోడ్, లెనిన్ పుస్తకం "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు"లో వివరింపబడిన విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ వైఖరిని రష్యాలోని, విదేశాల్లోని ఆర్థికవాదుల వైఖరితో జతచెయ్యడంలో గల అసంగతత్వాన్ని నిరూపించాడు. 1900 ఫిబ్రవరిలో "శ్రమ విమోచన" గ్రూపు "Vademecum for the Editors of Rabocheye Dyelo" ("'రబోచెయె దేలో' సంపాదకులకు వ్యాససంపుటి")ని ప్రచురించారు. దానికి జి. వి. ప్లెహానొవ్ ముందుమాట రాశాడు. ప్లెహానొవ్ దానిలో "రబోచెయె దేలో" సంపాదకుల ప్రకటనను ఖండించి, "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్" చుట్టూ చేరిన ప్రవాసుల్లోనూ, "రబోచెయె దేలో" పత్రిక చుట్టూ చేరినవాళ్లలోనూ ఆచరణలో అవకాశవాదమూ, ఆర్థికవాదమూ ఏవిధంగా ప్రబలివున్నాయో నిరూపించాడు.

"రబోచెయె దేలో"తో వివాదం దరిమిలా "ఇస్క్రా," "జర్యా" పత్రికల్లో కొనసాగింపబడింది. — 149.

164 సోషలిస్టు వ్యతిరేక చట్టపు కాలంలో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర పత్రిక "Der Sozialdemokrat" ("సోషల్ డెమోక్రట్") అనే వార్తాపత్రికకు యిది ప్రస్తావన. అది జూరిచ్‌లో 1879 సెప్టెంబరు 28 నుండి 1888 సెప్టెంబరు 22 దాకా, లండన్లో 1888 అక్టోబరు 1 నుండి 1890 సెప్టెంబరు 27 దాకా ప్రచురింపబడింది. 1879, 1880 సంవత్సరాల్లో ఆ పత్రికకు జి. ఫోల్మర్, 1881 జన

వరినుండి ఎ. బెర్న్‌స్టైనూ సంపాదకత్వం వహించారు. బెర్న్‌స్టైన్ అప్పట్లో ఫ్రెడరిక్ ఎంగెల్స్ విశేష ప్రభావం కింద ఉండేవాడు. ఎంగెల్స్ సైద్ధాంతిక మార్గ దర్శకత్వంలో "Der Sozialdemokrat" మార్క్సిస్టు పంథాను చేబట్టింది. సోషలిస్టు వ్యతిరేక చట్టం ఉపసంహరింపబడ్డాక "Der Sozialdemokrat" ప్రచురణ నిలిచిపోయింది. "Vorwärts" (''ముందుకు'') అన్న పత్రిక తిరిగి పార్టీ కేంద్ర అధికార పత్రిక అయింది. – 154.

165 ఎల్. మార్తొవ్ ''నార్సిస్ వరాహమూర్తి'' అనే మారుపేరుతో ''ఆధునిక రష్యన్ సోషలిస్టు కీర్తిగీతం'' అన్న శీర్షికతో రాసిన వ్యంగ్య కవితకు యిది ప్రస్తావన. ఇది 1901 ఏప్రిల్‌లో ''జర్యా'' మొదటి సంచికలో వెలువడింది. ఈ కవిత సద్యోజనిత ఉద్యమాన్ని చేబట్టినందుకు ఆర్థికవాదులను హేళన చేసింది. – 156.

166 ''దేశాంతర రష్యన్ సోషల్-డెమోక్రట్ల యూనియన్''కి యిది ప్రస్తావన. వివరణ 123ని చూడండి. – 164.

167 గ్రామీణ అధికారులు – రైతాంగంపై భూస్వాముల పెత్తనాన్ని పెంచేందుకుగాను, జారిస్టు ప్రభుత్వం 1889లో నెలకొల్పిన ఒక ఉద్యోగం. స్థానిక భూస్వామ్య ప్రభువులనుంచి నియమింపబడిన గ్రామీణ అధికారికి రైతులను అరెస్టు చెయ్యడం, కొరడా దెబ్బలు కొట్టడంవంటి హక్కులతో బాటు పరిపాలనా సంబంధమూ, న్యాయ సంబంధమూ అయిన బృహత్తర అధికారాలు కట్టబెట్టబడ్డాయి. – 164.

168 ''లిథువేనియా, పోలండ్, రష్యా సాధారణ యూదు కార్మికుల సంఘం'' (''బుంద్'') 1897లో వీల్నాలో జరిగిన యూదు సోషల్ డెమోక్రటిక్ బృందాల సంస్థాపక మహాసభలో స్థాపింపబడింది. ఈ సంఘంలో ప్రధానంగా, రష్యాలోని పశ్చిమ ప్రాంతపు అర్ధ శ్రామిక యూదు చేతిపనివాళ్లు ఉండేవారు. 1898 మార్చిలో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభలో ''ప్రత్యేకించి యూదు శ్రామికవర్గాన్ని దెబ్బతీసే సమస్యలకు సంబంధించినంతవరకు మాత్రమే స్వయం ప్రతిపత్తి కలిగిన సంఘం''గా ''బుంద్'' రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో చేరింది. యూదు శ్రామికవర్గానికి తననే ఏకైక ప్రతినిధిగా గుర్తించాలన్న బుంద్ డిమాండును ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభ తిరస్కరించాక, బుంద్, పార్టీనుంచి వైదొలగింది. కాని, నాలుగవ (ఐక్యతా) మహాసభలో చేసిన తీర్మానం ప్రాతిపదికమీద, బుంద్ 1906లో తిరిగి పార్టీలో చేరింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. లోపల, బుంద్ ఎప్పుడూ కూడా పార్టీలోని అవకాశవాద పక్షాన్ని – ఆర్థికవాదులు, మెన్షెవిక్కులు, రద్దువాదులు – బలపరుస్తూ, బోల్షెవిక్కు

లకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతూ వుండేది. 1917లో బుండ్ విప్లవ ప్రతీఘాత తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరచి, అక్టోబరు సోషలిస్టు విప్లవ శత్రువుల పక్షం వహించింది. విదేశీ సైనిక జోక్యం కాలంలోనూ, అంతర్యుద్ధ కాలంలోనూ బుండ్ నాయకులు విప్లవ ప్రతీఘాత శక్తులతో చేతులు కలిపారు. అదే సమయంలో, బుండ్ సాధారణ సభ్యులు సోవియట్ ప్రభుత్వంతో పొత్తు పెట్టుకోవడంపట్ల మొగ్గుచూపారు. 1921 మార్చిలో బుండ్ తనను తాను రద్దుచేసుకుంది. దాని సభ్యుల్లో కొందరు, సభ్యత్వార్హతకు సంబంధించిన సాధారణ సూత్రాల ప్రాతిపదికపైన, రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షెవిక్) సభ్యత్వం తీసుకున్నారు. – 165.

169 భూమి విడుదల చెల్లింపులు – రష్యాలో భూదాస్య విధానపు రద్దును గురించి 1861 ఫిబ్రవరి 19న చెయ్యబడిన నిబంధనను అనుసరించి, తమకు లభించిన భూఖండాల విడుదలకోసం రైతులు భూస్వాములకు డబ్బు చెల్లించుకోవలసి వచ్చింది. ఈ విడుదల చెల్లింపుల మొత్తం సుమారు 200 కోట్ల రూబుల్లదాకా వుంది. ఇది ఆ పొలాల అసలు ఖరీదును బాగా మించిపోయింది. రైతులు యీవిధంగా, చిరకాలంగా తమ చేతుల్లో ఉన్న పొలాలకోసమే కాకుండా, తమ వ్యక్తిగత స్వేచ్ఛకోసం కూడా డబ్బు చెల్లించుకోవలసి వచ్చింది. ఈ భూమి విడుదల చెల్లింపులు రైతులకు పెద్ద భారమైపోయి, వాళ్ల సామూహిక ఆర్థిక వినాశానికీ, వాళ్లు బికారులుగా మారిపోయేందుకూ దారితీసింది.

1905–07 నాటి మొదటి రష్యన్ విప్లవ కాలంలో చెలరేగిన రైతు ఆందోళన మూలంగా, జారిస్టు ప్రభుత్వం భూమి విడుదల చెల్లింపులను 1907 జనవరినుంచి రద్దుచెయ్యవలసివచ్చింది. – 169.

170 1901 సెప్టెంబరు 15న జారిస్టు ప్రభుత్వం జారీచేసిన ''తాత్కాలిక నిబంధనల''కు ప్రస్తావన ఇది. దాని ప్రకారం, కరువు బాధితులైన జిల్లాలలోని రైతులను రైల్వే నిర్మాణానికి, తదితర పనులకు పంపే హక్కు గ్రామీణ అధికార్లకు ఇవ్వబడింది. ఈ పత్రం ప్రకారం రైతుల హక్కులు చాలా కుంచించబడ్డాయి. కార్మిక బృందాలు ప్రవాసానికి పంపబడిన ఖైదీల మాదిరిగానే ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కింద పని చోటుకి పంపబడ్డారు. – 170.

171 1901 ఫిబ్రవరి, మార్చి నెలల్లో పీటర్స్‌బుర్గ్, మాస్కో, కీయెవ్, తదితర రష్యన్ నగరాలలో కార్మికులు జరిపిన సామూహిక విప్లవ చర్యలకు ప్రస్తావన ఇది. 1900–1901 విద్యా సంవత్సరం నాటి విద్యార్థుల ఉద్యమం, జారిస్టు ప్రభుత్వ అభివృద్ధి నిరోధక విధాన వ్యతిరేక విప్లవ రాజకీయ నిరసనగా మారింది. అగ్రగామి కార్మికులు

దాన్ని బలపరచారు, రష్యన్ సమాజంలోని అన్ని విభాగాలూ దానికి స్పందించాయి. 1901 ఫిబ్రవరి – మార్చిలలో కీయెవ్ విశ్వవిద్యాలయంలోని 183 మంది విద్యార్థులను నిరసన సభలో పాల్గొన్నందుకుగాను సైన్యంలో చేర్పించడం ఆ నిరసన ఉద్యమానికి ప్రత్యక్ష కారణమైంది. – 179.

172 ''స్వొబోద'' (''స్వేచ్ఛ'') – ''విప్లవాత్మక సోషలిస్టు'' ''స్వొబోద'' బృందంచేత స్విట్జర్లాండులో ప్రచురింపబడిన పత్రిక. ఈ పత్రిక సంచికలు రెండు మాత్రమే వెలువడ్డాయి: 1901లో 1వ సంచిక, 1902లో 2వ సంచిక ''స్వొబోద'' బృందం తన రచనల్లో ఆర్థికవాద, టెరరిస్టు భావాలను సమర్థించి, రష్యాలోని ''ఇస్క్రా'' వ్యతిరేక బృందాలను బలపరచింది. ఈ బృందం 1903లో అంతరించిపోయింది. – 182.

173 మార్క్స్, ఎంగెల్స్, ''కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక.'' – 191.

174 ''ఇస్క్రా'' 7వ సంచిక (1901 ఆగస్టు)లో ప్రచురింపబడిన లేఖ, సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి ఒక నేత కార్మికుడు రాసినది. ఆ లేఖ ''కార్మికోద్యమం, ఫ్యాక్టరీలనుండి లేఖలు'' అన్న శీర్షిక కింద ప్రచురింపబడింది. పురోగామి కార్మికుల్లో లెనినిస్టు ''ఇస్క్రా''కి వున్న గొప్ప పలుకుబడికి యీ లేఖ ఒక రుజువు. ఆ కార్మికుడు ఇలా రాశాడు: ''ప్రారంభించడమెలాగో నేర్పడమే గాక, జీవించడమెలాగో, మరణించడమెలాగో నేర్పేందుకు రాయదలుచుకున్నాం.'' – 197.

175 రష్యాలో భూ దాస్యాన్ని రద్దుచేస్తూ జారు రెండవ అలెక్సాండ్ర్ 1861 ఫిబ్రవరి 19న ఒక ఉత్తరువును జారీచేశాడు. ఈ సంఘటన నలభైయవ వార్షికోత్సవ సందర్భంగా ''ఇస్క్రా''లోని 3వ సంచికలో లెనిన్ ''కార్మిక పార్టీ, రైతాంగం'' అనే వ్యాసం రాశాడు. – 202.

176 ఆర్థిక మంత్రి ఎస్. వై. వీట్టె రాసిన రహస్య జ్ఞాపికకు ప్రస్తావన ఇది. ఆ జ్ఞాపిక ''నిరంకుశ పరిపాలనా, జేమ్‌స్త్వో'' అనే శీర్షికతో (ముందుమాటను ఆర్.ఎన్.ఎస్. – బి. వి. స్త్రూవె – రాశాడు) ''జర్యా'' పత్రిక 1901లో ష్టుట్‌గార్ట్‌లో ప్రచురించింది. ఆ ''జ్ఞాపిక''లో జేమ్‌స్త్వో, నిరంకుశ పరిపాలనా పొసగవని వీట్టె రుజువు చేశాడు. ముందుమాటలో స్త్రూవె ఆ ''జ్ఞాపిక'' భావాలను బూర్జువా లిబరలిజం దృక్కోణంనుంచి విమర్శించాడు. వీట్టె ''జ్ఞాపిక''కూ, స్త్రూవె ముందుమాటకూ సంబంధించి లెనిన్ ''జేమ్‌స్త్వో హింసకులూ, లిబరలిజంయొక్క హానిబల్స్'' అనే వ్యాసం చూడండి, V. I. Lenin, *Collected Works*, Vol. 5, pp. 95–100. – 202.

177 1901 జూన్ 8న జారిస్టు ప్రభుత్వం జారీచేసిన చట్టానికి ప్రస్తావన ఇది. దాని ప్రకారం

సైబీరియాలో వ్యక్తులకు ప్రభుత్వ భూములు కేటాయింపబడ్డాయి. కులీనులు ఆ భూములను పెద్ద రాయితీలతో కొన్నారు, కౌలుకి తీసుకున్నారు. ఆ చట్టానికి సంబంధించి ''ఇస్క్రా'' 8వ సంచికలో లెనిన్ ''కార్యాచరణకు పూనుకున్న భూస్వాములు'' అనే వ్యాసం రాశాడు. – 202.

178 ''రొస్సీయ'' (''రష్యా'') – 1899నుంచి 1902వరకు సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడిన లిబరల్ దినపత్రిక. – 202.

179 వర్గపోరాటాన్ని గురించిన బ్రెంటానో అవగాహన (బ్రెంటానోయిజం) – శ్రామికవర్గపు విప్లవేతర ''వర్గ'' పోరాటాన్ని సమర్థించే ఒక లిబరల్ బూర్జువా సిద్ధాంతం. ఈ సిద్ధాంతం పెట్టుబడిదారీ విధానపు చట్టం లోపల, ఫ్యాక్టరీ చట్టాల ద్వారానూ, కార్మికులను ట్రేడ్ యూనియన్లలో సంఘటితం చెయ్యడం ద్వారానూ కార్మిక సమస్యను పరిష్కరించవచ్చునని బోధిస్తుంది. బూర్జువా అర్థశాస్త్రంలో కథిడెర్ సోషలిజం ప్రముఖ సమర్థకుల్లో ఒకడైన లుయ్యో బ్రెంటానో పేరిట దీనికి బ్రెంటానోయిజం అన్న పేరు వచ్చింది. – 204.

180 1899 వసంతకాలంలో పీటర్స్‌బుర్గ్‌లో స్థాపించబడిన ''పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటం జరిపే కార్మికుల గ్రూపు''కి యిది ప్రస్తావన. కొందరు కార్మికులతోనూ, మేధావులతోనూ కూడి పీటర్స్‌బుర్గ్‌లోని కార్మికోద్యమంతో గట్టి సంబంధాలులేని యీ గ్రూపు, 1899 వేసవిలో, దాదాపు తన సభ్యులందరూ అరెస్టవడంతో, అంతరించిపోయింది. తన అభిప్రాయాల రీత్యా అది ఆర్థికవాదులకు సన్నిహితంగా వుంది. – 211.

181 నార్సిసస్ – గ్రీకు పురాణ గాథల్లో అందమైన యువకుడు. తన ప్రతిబింబాన్ని నీళ్లలో చూసి తనపట్లే తాను వ్యామోహితుడయ్యాడు. – 214.

182 ''సమకాలీన కర్తవ్యాలూ, రష్యన్ సోషల్ డెమొక్రట్ల ఎత్తుగడలూ'' అనే అక్సెల్‌రోడ్ పుస్తకానికి ఎన్. ఎన్. (ఎస్. ఎన్. ప్రొకొపోవిచ్ మారుపేరు) ''సమాధానానికి'' ప్రస్తావన ఇది. దానిలో ప్రొకొపోవిచ్ అక్సెల్‌రోడ్‌ని ఆర్థికవాద దృక్పథంనుంచి విమర్శించాడు. ప్లెహానొవ్ ఈ ''సమాధానం''ని ''రబోచెయె దేలొ''కోసం "Vademecum"లో ప్రచురించాడు. – 218.

183 1901లో ఎ. ఎస్. మర్తీనొవ్‌తో లెనిన్ మొదటి సమావేశానికి యిది ప్రస్తావన అయి వుండాలి. మర్తీనొవ్ యీ సమావేశాన్ని తన స్మృతుల్లో వర్ణించాడు. – 219.

184 121వ వివరణ చూడండి.

185 అఫనాసీ ఇవానొవిచ్, పుల్‌హేరియా ఇవానొవ్నా – గోగొల్ రచించిన ''పాతకాలపు భూస్వా

ములు'' అన్న పుస్తకంలోని మధ్యతరగతి భూస్వాములకు చెందిన పితృస్వామిక దంపతులు. – 223.

186 సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో తను నాయకత్వం వహించిన సోషల్ డెమొక్రట్ల అధ్యయన బృందాన్ని (''కాకలు తీరినవాళ్లు'') లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. 1895లో స్థాపించబడిన ''కార్మికవర్గ విముక్తి పోరాట సమితి''కి యిదే ప్రాతిపదిక. – 235.

187 ''జెమ్ల్యా యి వోల్య'' (''భూమీ, స్వేచ్ఛా'') – 1876 ఆకురాలు కాలంలో పీటర్స్‌బుర్గ్‌లో స్థాపించబడిన విప్లవ నరోద్నిక్కుల ఒక రహస్య సంఘం.

''జెమ్ల్యా యి వోల్య'' సభ్యులు రష్యాలో రైతుల్నే ప్రధాన విప్లవ శక్తిగా పరిగణించి, జారిజానికి వ్యతిరేకంగా రైతుల తిరుగుబాటును పురిగొల్పేందుకు ప్రయత్నించారు. రష్యాలో తంబోవ్, వొరోనెజ్ మొదలైన కొన్ని గుబేర్నియాలలో వారు విప్లవ కార్యకలాపాలను నిర్వహించారు.

రైతాంగంలో వారి విప్లవ కార్యకలాపాలు విఫలమైనందువలనా, ప్రభుత్వ నిర్బంధకాండ ముమ్మరమైనందువలనా 1879లో యీ సంఘంలో ఒక టెర్రరిస్టు విభాగం ఏర్పాటైంది. ఆ విభాగం రైతుల్లో విప్లవ ప్రచారం చెయ్యడానికి నిరాకరించి, జారిస్టు ప్రభుత్వ సభ్యులకు వ్యతిరేకంగా వ్యక్తిగత హింసాకాండ జరపడమే జారిజానికి వ్యతిరేకంగా చెయ్యగల విప్లవ పోరాట ప్రధాన సాధనంగా పరిగణించింది. అదే సంవత్సరం వొరోనెజ్‌లో జరిగిన మహాసభలో ''జెమ్ల్యా యి వోల్య'' రెండు సంఘాలుగా చీలిపోయింది: 1) ''నరోద్నయ వోల్య'' (''ప్రజా స్వేచ్ఛా''), యిది టెర్రరిజాన్ని తన ప్రధాన పంథాగా ఎంచుకుంది. 2) ''చోర్నీ పెరెదేల్'' (''సార్వత్రిక పునఃపంపకం''), యిది ''జెమ్ల్యా యి వోల్య'' విధానానికి అంటిపెట్టుకుని వుంది. దరిమిలా యీ రెండో గ్రూపుకి చెందిన కొందరు సభ్యులు – ప్లెహానొవ్, అక్సెల్‌రోడ్, వేర జసూలిచ్, డేయిచ్, ఇగ్నాతొవ్ – మార్క్సిస్టు వైఖరులు తీసుకుని, 1883లో స్విట్జర్లండులో తొలి రష్యన్ మార్క్సిస్టు సంఘమైన ''శ్రమ విమోచన'' గ్రూపును నెలకొల్పారు. – 244.

188 ''1900లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహాసభకు రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంపై సమర్పించిన నివేదిక''కు యిది ప్రస్తావన. ''దేశాంతర రష్యన్ సోషల్ డెమొక్రట్ల యూనియన్'' ఆదేశాలమేరకు ''రబోచెయె దేలొ'' సంపాదకులచేత రచింపబడిన యీ నివేదిక, 1901లో జెనీవాలో ''యూనియన్''చేత ప్రచురింపబడింది. – 254.

189 '' 'రబోచయ మీస్ల్'కి ప్రత్యేకానుబంధం''లో ప్రచురింపబడిన ''మన వాస్తవికత'' అన్న

వ్యాసంలోని వివాదాత్మక వ్యాఖ్యకు యిది ప్రస్తావన. దీన్ని "ఏం చెయ్యాలి?" అన్న తన పుస్తకం ప్రకరణం III, ఆ పేరాలో లెనిన్ ఉదహరించాడు (ఈ సంపుటి పేజి 171 చూడండి). – 258.

190 "యూజ్నియ్ రబోచి" ("దక్షిణాది కార్మికుడు") – ఇదే పేరుగల ఒక గ్రూపుచేత 1900 జనవరికీ 1903 ఏప్రిల్‌కీ మధ్య రహస్యంగా ప్రచురింపబడిన ఒక సోషల్ డెమోక్రటిక్ పత్రిక. మొత్తంమీద 12 సంచికలు వెలువబడ్డాయి.

"యూజ్నియ్ రబోచి" అర్థికవాదాన్నీ, టెరరిజాన్నీ వ్యతిరేకించి, జన సామూహిక విప్లవోద్యమాన్ని బలపరచింది. అయితే, "ఇస్క్రా" అఖిల రష్యా వార్తాపత్రిక చుట్టూ కేంద్రీకృతమైన మార్క్సిస్టు పార్టీని నిర్మించాలని ప్రతిపాదించగా "యూజ్నియ్ రబోచి" గ్రూపు ప్రాంతీయ సోషల్ డెమోక్రటిక్ యూనియన్లను నెలకొల్పడంద్వారా ఆర్.ఎస్.డి.ఎల్.పి.ని పునరుద్ధరించాలన్న పథకాన్ని ముందుకు తెచ్చింది.

ఆ గ్రూపు రష్యాలో విస్తృతమైన విప్లవ కార్యకలాపాలను సాగించింది. అయితే అదే సమయంలో, ఉదారవాద బూర్జువావర్గంపట్లా, రైతు ఉద్యమంపట్లా వహించవలసిన వైఖరి విషయంలో అవకాశవాద ధోరణులను ప్రదర్శించి "ఇస్క్రా"కి పోటీగా తన సొంత అఖిల రష్యా వార్తాపత్రికను స్థాపించాలన్న వేర్పాటు పథకాన్ని అనుసరించింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో "యూజ్నియ్ రబోచి" గ్రూపుకి చెందిన ప్రతినిధులు మధ్యస్థ వైఖరిని తీసుకున్నారు. ఆ మహాసభ తదితర అన్ని స్వతంత్ర సోషల్ డెమోక్రటిక్ గ్రూపులతో, సంఘాలతోబాటు "యూజ్నియ్ రబోచి" గ్రూపును కూడా రద్దుచేస్తూ తీర్మానించింది. – 260.

191 "రబోచయ మీస్ల్" ప్రచురించిన "రష్యాలో కార్మికవర్గ పరిస్థితికి సంబంధించిన సమస్యలు" (1898) అన్న కరపత్రానికీ, "రష్యాలో కార్మికవర్గ పరిస్థితికి సంబంధించిన సమాచార సేకరణను గురించిన సమస్యలు" (1899) అన్న చిన్న పుస్తకానికీ యిది ప్రస్తావన. కార్మికుల శ్రమని గురించీ, జీవిత పరిస్థితులను గురించీ కరపత్రంలో 17 ప్రశ్నలూ, ఆ చిన్న పుస్తకంలో 158 ప్రశ్నలూ వున్నాయి. – 262.

192 1885 నాటి సమ్మె ఉద్యమంలో వ్లదీమిర్, మాస్కో, త్వేర్‌లలోనూ, రష్యా పారిశ్రామిక కేంద్రపు తదితర జిల్లాల్లోనూ ఉన్న పలు జౌళి మిల్లుల్లోని కార్మికులు పాల్గొన్నారు. వీటన్నింటిలోకీ బాగా ప్రసిద్ధి చెందినది సావ్వ మొరోజొవ్‌కి చెందిన నికోల్‌స్కాయె మిల్లు కార్మికులు 1885 జనవరిలో జరిపిన సమ్మె. జరిమానాల తగ్గింపు, కార్మికులను పనిలోకి తీసుకునే పద్ధతిని క్రమబద్ధం చెయ్యడం వగైరాలే కార్మికుల ప్రధాన కోర్కెలు. ఆ సమ్మెకు అగ్రగామి కార్మికులు నాయకత్వం వహించారు. దాదాపు

8 వేలమంది కార్మికులు పాల్గొన్న ఆ సమ్మె సైనికులచేత అణచివేయబడింది. ఆ సమ్మెలో పాల్గొన్న 33మంది కార్మికులపైన కేసులు పెట్టారు, 600 మందిని ప్రవాసానికి పంపారు. 1885–86 నాటి సమ్మె ఉద్యమపు ఒత్తిడిని తట్టుకోలేక జారిస్టు ప్రభుత్వం జరిమానాలను గురించి 1886 జూన్ 3 (15)న ఒక శాసనం చెయ్యవలసివచ్చింది. – 263.

193 వివరణ 148 చూడండి.

194 గ్రీకు పౌరాణిక కథ ప్రకారం ఎలీస్ రాజు ఔగేయస్‌కి చెందిన విశాలమైన గుర్రపుశాలలు అనేక సంవత్సరాల తరబడిగా కసవుతో కశ్మలంతో నిండివున్నాయి. అటువంటి ఆ శాలలను హెర్క్యులెస్ ఒకేఒక్క రోజులో పరిశుభ్రంచేసేశాడు. అందుకని ఔగేయస్ గుర్రపు శాలలు అన్న పదం కసవుకశ్మలాల గుట్టకీ, లేక అలక్ష్యంచెయ్యబడి అస్తవ్య స్తంగావున్న పనికీ మారుపేరైంది. – 265.

195 లెనిన్ యీ పాదాంత వివరణను రహస్య గోపనార్థం వాడాడు. వాస్తవ విషయాలు సరిగా అవి జరిగిన క్రమంలో పేర్కొనబడ్డాయి. – 268.

196 "విదేశాల్లోని రష్యన్ విప్లవ సోషల్ డెమొక్రట్ల లీగు" 1901 అక్టోబరులో లెనిన్ చొరవ మేరకు స్థాపించబడింది. విదేశాల్లోని "ఇస్క్రా" సంఘం, "సోత్సియాల్ డెమొక్రట్" విప్లవ సంఘం (దీనిలో "శ్రమ విమోచన" గ్రూపు కూడా యిమిడి వుంది) కలిసి లీగుగా ఏర్పడ్డాయి. విప్లవ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమ భావాలను వ్యాపింపజేయడం, సమరశీలమైన సోషల్ డెమొక్రటిక్ ఉద్యమ స్థాపనకు దోహదం చెయ్యడమే యీ లీగు కర్తవ్యం. లీగు నిబంధనావళి మేరకు, "ఇస్క్రా" సంఘానికి విదేశాల్లో యిది ప్రతినిధిగా వుంది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభ తర్వాత మెన్షెవిక్కులు లీగులో ప్రాబల్యం సంపాదించుకుని లెనిన్‌కీ, బోల్షెవిక్కులకీ వ్యతిరేకంగా పోరాటం మొదలెట్టారు. 1903 అక్టోబరులో జరిగిన లీగు రెండో మహాసభలో మెన్షెవిక్కులు లీగుకి కొత్త నిబంధనా వళిని ఆమోదించారు. ఈ నిబంధనావళి ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభలో ఆమో దింపబడిన పార్టీ నియమావళికి వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. అప్పటినుంచి లీగు మెన్షెవిక్కులకి ఓ పెట్టని కోటగా వుంది. లీగు 1905వరకు వుంది. – 269.

197 "అపరిణత ఆలోచన వల్ల కలిగే పొరపాట్లు" అన్న శీర్షికతో డి. ఐ. పీసరెవ్ రాసిన వ్యాసాన్ని లెనిన్ యిక్కడ ఉదహరిస్తున్నాడు. – 284.

198 "లిస్తోక్ 'రబోచెగో దేల'" ("'రబోచెయె దేలొ' అనుబంధం") – ఇది జెనీవాలో

ప్రచురింపబడింది. 1900 జూన్‌కీ – 1901 జూలైకీ మధ్య క్రమ విరామాల్లో కాకపోయినా ఎనిమిది సంచికలు వెలువడ్డాయి. – 284.

199 మార్క్స్ రచించిన "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"నుంచి యీ కింది వాక్యాలను లెనిన్ ప్రస్తావిస్తున్నాడు: "ప్రపంచ చరిత్రలో అధిక ప్రాముఖ్యం కలిగిన అన్ని ఘటనలూ పునస్సంభవిస్తూ వుంటాయనీ, వ్యక్తులు పునరావిర్భవిస్తూ వుంటారనిపిస్తుందనీ, హెగెల్ ఒకమారెక్కడో గాని అన్నాడు. మొదటిసారి విషాదాంతంగానూ, రెండవసారి ప్రహసనంగానూ అని చేర్చడం ఆయన మరచిపోయాడు" (మార్క్స్, ఎంగెల్స్, "సంకలిత రచనలు," భాగం I, మాస్కో, పేజి 123). – 285.

200 1901 నవంబరు, డిసెంబరు మాసాల్లో విద్యార్థి ప్రదర్శనల తరంగమొకటి రష్యాను ముంచెత్తింది. దీన్ని కార్మికులు బలపరచారు. – 288.

201 <u>యనిచార్లు</u> – టర్కీ సుల్తాను సైన్యంలోని రెగ్యులర్ కాల్బలం. ఇది 14వ శతాబ్దంలో ఏర్పాటుచెయ్యబడింది. సుల్తానుల పాలనలో ప్రధాన పోలీసు బలగం అయిన వీళ్లు దారుణ పాశవికత్వానికి పేరుపొందారు. యనిచార్ల సేనలు 1826లో రద్దు చెయ్యబడ్డాయి. లెనిన్ ఈ పేరును జారిస్టు పోలీసులకు అన్వయించాడు. – 289.

202 <u>"అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో"</u> – రెండవ ఇంటర్నేషనల్ శాశ్వత కార్యవర్గం, సమాచార కేంద్రం. 1900 సెప్టెంబరులో పారిస్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభలో యిది స్థాపించబడింది. దీనిలో అన్ని దేశాల సోషలిస్టు పార్టీల ప్రతినిధులూ వున్నారు. జి. వి. ప్లెహానొవ్, బి. ఎన్. క్రిచేవ్‌స్కీలు రష్యన్ సోషల్ డెమొక్రట్ల ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డారు. లెనిన్ ఆర్.ఎస్.డి.ఎల్.పి. ప్రతినిధిగా 1905 నుంచి దానిలో సభ్యుడుగా వున్నాడు. ఈ అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో 1914లో అంతరించిపోయింది. – 295.

203 <u>"సొత్సియాల్ డెమొక్రట్" విప్లవ సంఘం</u> – "దేశాంతర రష్యన్ సోషల్ డెమొక్రట్ల యూనియన్," తన రెండవ మహాసభలో చీలిపోయాక, 1900 మేలో, "శ్రమ విమోచన" గ్రూపూ, దాని సమర్థకులూ యీ సంఘాన్ని స్థాపించారు. 1901 అక్టోబరులో, లెనిన్ చొరవ మేరకు, యిది విదేశాల్లోని "ఇస్క్రా" సంఘంతో ఏకమై, "విదేశాల్లో రష్యన్ విప్లవ సోషల్ డెమొక్రటిక్ లీగు"ను ఏర్పాటుచేసింది. – 297.

204 పారిస్‌లో 1900 వేసవిలో ఏర్పడిన యీ సోషల్ డెమొక్రటిక్ బృందం, 1901 మేలో, "బొర్బా" ("పోరాటం") అన్న పేరును పెట్టుకుంది. రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోని విప్లవ, అవకాశవాద ధోరణుల మధ్య రాజీ పొసిగించే ప్రయ

త్వంలో, ''బొర్బా'' బృందం దేశాంతర సోషల్ డెమోక్రటిక్ సంఘాల – ''ఇస్క్రా,'' ''జర్యా'' సంపాదకవర్గం, ''సొత్సియాల్ డెమోక్రట్'' బృందం, విదేశాల్లో బుంద్ కమిటీ, ''దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్''ల – కాన్ఫరెన్సును ఏర్పాటు చెయ్యాలని ప్రయత్నించింది. ఈ కాన్ఫరెన్సు జెనీవాలో 1901 జూన్‌లో జరిగింది. ఈ బృందం 1901 అక్టోబరులో జరిగిన ''ఐక్యతా'' మహాసభ కూడా పాల్గొంది. సోషల్ డెమోక్రటిక్ అభిప్రాయాలనుంచీ, ఎత్తుగడలనుంచీ అది దూరం కావడం, నిర్మాణరీత్యా విచ్ఛిన్న చర్యలకు పూనుకోవడం, రష్యాలోని సోషల్ డెమోక్రటిక్ సంఘాలతో దానికి సంబంధాలు కొరవడటం – యీ కారణాల మూలంగా ''బొర్బా'' బృందానికి ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభలో పాల్గొనేందుకు అనుమతి లభించ లేదు. రెండో మహాసభ తీర్మానం మేరకు, ''బొర్బా'' బృందం రద్దు చెయ్యబడింది. – 297.

205 ''ఇస్క్రా,'' సంచిక 18 (1902, మార్చి 10) ''పార్టీ జీవితం'' అన్న విభాగంలో, వివాదాన్ని సమీక్షిస్తూ " 'Vorwärts' సంపాదకులతో 'జర్యా' వివాదం'' అన్న శీర్షికతో ప్రచురించిన వ్యాసం. – 301.

# పేర్ల సూచి


అక్సెల్‌రోడ్, పి. బి. (Axelrod) (1850–1928) – సోషల్ డెమోక్రట్; మొట్టమొదటి రష్యన్ మార్క్సిస్టు సంఘమైన "శ్రమ విమోచన" బృందం స్థాపనలో (1883) పాల్గొన్నాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో (1903) "ఇస్క్రా" అల్పసంఖ్యాక బృందానికి ప్రాతినిధ్యం వహించాడు, మహాసభ అనంతరం మెన్షెవిక్ నాయకుడయాడు. అభివృద్ధి నిరోధక దశలో (1907–10) రద్దువాదుల నాయకుడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) మధ్యస్థ వైఖరి తీసుకున్నాడు. – 128, 149, 171, 172, 184, 200.

అదమోవిచ్ (Adamovich) (వారోవ్స్కీ, వి. వి.) (1871–1923) – బోల్షెవిక్ పార్టీకి చెందిన ప్రముఖ కార్యకర్త; సాహిత్య విమర్శకుడు. విప్లవ దృక్పథంనుంచి స్త్రూవె, బెర్న్‌స్టైన్‌లను విమర్శిస్తూ 1901లో ఒక వ్యాసాన్ని ప్రచురించాడు. –287.

అబ్రామొవ్, వై. వి. (Abramov) (1858–1906) – నరోద్నిక్ రచయిత, సామాజిక ఆర్థిక సమస్యలపై రచనలు చేశాడు. – 85, 97, 98.

అలెక్సేయెవ్, పి. ఎ. (Alexeev) (1849–1891) – 1870 దశకంలో పేరుగాంచిన విప్లవకారుడు; వృత్తి రీత్యా జౌళి కార్మికుడు; కార్మికుల మధ్య చురుకుగా విప్లవ ప్రచార, కార్యకలాపాలు జరిపాడు. అరెస్టు చేయబడ్డాడు. కోర్టు విచారణ సందర్భంగా, జారిస్టు నిరంకుశ పరిపాలన అనివార్యంగా కూలిపోతుందని జోస్యం చెప్తూ అతను చేసిన ప్రసంగం బహుళ ప్రసిద్ధి చెందింది. – 214.

ఆర్. ఎమ్. (R. M.) – ఆర్థికవాద అవకాశవాద అభిప్రాయాలను సమర్థించే "మన వాస్తవ స్థితి" ("Our Reality") అన్న వ్యాస రచయిత. – 169, 175, 216, 293, 294.

ఇలొవాయ్‌స్కీ, డి. ఐ. (Ilovaisky) (1832–1920) – చరిత్రకారుడు, పత్రికా రచయిత, జారిస్టు రష్యాలో ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో బోధింపబడే అధికారిక పాఠ్యగ్రంథాల రచయిత. ప్రధానంగా జారుల, సేనాధిపతుల కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకుని అతను చరిత్ర రచన సాగించాడు. – 114.

ఇవనోవ్, ఐ. (Ivanov) – జసూలిచ్, వి. ఐ. చూడండి.

ఎంగెల్స్ (Engels), ఫ్రెడరిక్ (1820–1895). – 10, 12, 14–16, 18–22, 24, 25, 36, 41–46, 49, 55, 57, 75, 110, 114, 126, 129, 131, 134, 151, 160, 189.

ఎంగెల్‌హార్ట్, ఎ. ఎన్. (Engelhardt) (1832–1893) – పత్రికా రచయిత, నరోద్నిక్; సాంఘిక కార్యకలాపాలకీ, తన ఎస్టేటులో పకడ్‌బందీ అయిన వ్యవసాయ కృషికీ ప్రసిద్ధిచెందాడు. "గ్రామీణ ప్రాంతంనుంచి లేఖలు" అన్న పుస్తకాన్నీ, వ్యవసాయంపై మరికొన్ని పుస్తకాలనీ రచించాడు. – 78–83, 90, 91.

ఎన్. ఎన్. (N. N.) – ప్రొకొపోవిచ్, ఎస్. ఎన్. చూడండి.

ఎన్–న్ (N – on), (డేనియల్‌సన్, ఎన్. ఎఫ్.) (1844–1918) – రష్యన్ అర్థశాస్త్రవేత్త, అర్థశాస్త్రంమీద చాలా పుస్తకాలు రాశాడు, 1880–90 దశకాల్లో లిబరల్ నరోదిజం సైద్ధాంతికుడు. – 84.

ఎపిక్యూరస్ (Epicurus) (క్రీ. పూ. 341–270) – ప్రాచీన గ్రీకు భౌతికవాద తత్వవేత్త, నిరీశ్వరవాది. – 13.

ఎవెలింగ్ (Aveling), ఎలియొనోర్ (1855–1898) – మార్క్స్ చిన్న కూతురు; ఇంగ్లీషు సోషలిస్టు అయిన ఎడ్వర్డ్ ఎవెలింగ్ భార్య; ఇంగ్లీషు, అంతర్జాతీయ కార్మికోద్యమంలో పాల్గొంది. – 17.

ఓజెరొవ్, ఐ. హెచ్. (Ozerov) (1869–1942) – బూర్జువా అర్థశాస్త్రవేత్త, మాస్కో, సెంట్ పీటర్స్‌బుర్గ్ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్. 1901–02 సంవత్సరాల్లో కార్మికోద్యమం లోపల జుబాతొవ్ విద్రోహపూరితమైన రెచ్చగొట్టే ఎత్తుగడలను చురుకుగా బలపరుస్తూ ముందుకొచ్చాడు. – 222–224, 228.

ఓవెన్ (Owen), రాబర్ట్ (1771–1858) – గొప్ప ఆంగ్ల ఊహాజనిత సోషలిస్టు. – 130.

ఔవర్ (Auer), ఇగ్నాత్స్ (1846–1907) – జర్మన్ కార్మికుడు, వృత్తిరీత్యా జీనుల తయారీదారు, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ప్రముఖుడు. 1874లో

ఐసెనాఖర్ల పార్టీ కార్యదర్శి, 1875లో ఐసెనాఖర్లు, లాసాలియన్లు ఐక్యమైన తరువాత జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీ కార్యదర్శి అయ్యాడు; తదుపరి జర్మన్ సోషల్ డెమొక్రట్ల అవకాశవాద పక్ష నాయకుల్లో ఒకడు. – 242.

కత్కోవ్, ఎమ్. ఎన్. (Katkov) (1818–1887) – అభివృద్ధి నిరోధక రచయిత. రాజరికవాద అభివృద్ధి నిరోధకుల వాణి అయిన "మస్కోవ్స్కియె వేదొమొస్తి" ("మాస్కో వార్తలు") పత్రిక సంపాదకుడు, ప్రచురణకర్త. కత్కోవ్ తనని తాను "నిరంకుశ ప్రభుత్వపు విశ్వసనీయుడైన కాపలావాడు"గా అభివర్ణించుకున్నాడు. ఇతని పేరు మిక్కిలి కరడుగట్టిన రాజరికవాద అభివృద్ధి నిరోధకత్వంతో ముడిపడివుంది. – 197.

కమేన్స్కీ (Kamensky) – ప్లెహానొవ్ జి. వి. చూడండి.

కరేయెవ్, ఎన్. ఐ. (Kareyev) (1850–1931) – ఉదారవాద బూర్జువా చరిత్రకారుడు, పత్రికారచయిత. సామాజిక శాస్త్రంలో వ్యక్తిపరమైన ధోరణికి చెందినవాడు, పృథక్శకలవాద భావవాది. 1905నుంచి కాన్స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు, మార్క్సిజానికి వ్యతిరేకి. – 156.

కాంట్ (Kant), ఇమ్మానుయెల్ (1724–1804) – సాంప్రదాయిక జర్మన్ భావవాద తత్వవేత్త. "అజ్ఞేయ వస్తువు"లు ఉండడం – అంటే బాహ్య ప్రపంచం ఉండడం – గుర్తించి, వాటిని తెలుసుకోవడం సాధ్యం కాదని చెప్పాడు. ఆయన భౌతికవాదాన్ని భావవాదానికి జత చేసుకోవడానికి ప్రయత్నించాడు. – 19, 56.

కారిషెవ్, ఎన్. ఎ. (Karishev) (1855–1905) – రష్యన్ అర్థశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త, రష్యాలో రైతు సేద్య ఆర్థిక వ్యవస్థని గురించి పుస్తకాలూ, వ్యాసాలూ రాశాడు. వాటిలో ఉదారవాద నరోద్నిక్ అభిప్రాయాలను సమర్థించాడు. – 81.

కుస్కోవా, ఇ. డి. (Kuskova) (1869–1958) – రష్యన్ బూర్జువా పబ్లిక్ వ్యక్తి, పత్రికారచయిత్రి, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో ఆర్థికవాద సమర్థకురాలు; ఆర్థికవాదపు అభివృద్ధి నిరోధక స్వభావాన్ని విస్పష్టంగా వ్యక్తంచేసే "క్రెడో" రచయిత్రి. తర్వాత కాన్స్టిట్యూషనల్ డెమొక్రట్లను బలపరిచింది. – 122.

కూగెల్మన్ (Kugelmann), లుడ్విగ్ (1830-1902) – జర్మన్ సోషల్ డెమొక్రట్; వైద్యుడు; జర్మనీలో 1848–49 విప్లవంలో పాల్గొన్నాడు. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు. 1862కీ 1874కీ మధ్య లండన్‌లో జీవిస్తూవుండిన

కార్ల్ మార్క్స్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ, ఆయనకి జర్మనీలోని పరిస్థితులను తెలియపరుస్తూ వుండేవాడు. – 47.

కె. కె. (K. K.) – కౌట్స్కీ, కార్ల్ చూడండి.

కౌట్స్కీ (Kautsky), కార్ల్ (కె. కె.) (1854–1938) – జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ, రెండవ ఇంటర్నేషనల్ నాయకుల్లో ఒకడు. మొదట మార్క్సిస్టు, దరిమిలా మార్క్సిజాన్ని వ్యతిరేకించి, కార్మికోద్యమంలో అత్యంత ప్రమాదకరమూ, హానికరమూ అయిన అవకాశవాద ధోరణికి – సెంట్రిజానికి (కౌట్స్కీయిజానికి) – సిద్ధాంతవేత్త అయాడు. జర్మన్ సోషల్ డెమొక్రట్ల సైద్ధాంతిక పత్రిక "Die Neue Zeit" ("నూతన కాలం") సంపాదకుడు. – 142, 143, 173, 174, 252.

క్రిచేవ్‌స్కీ, బి. ఎన్. (Krichevsky) (1866–1919) – రష్యన్ సోషల్ డెమొక్రట్, రచయిత, ఆర్థికవాద నాయకుల్లో ఒకడు. 1890వ దశకపు చివరి సంవత్సరాల్లో "దేశాంతర రష్యన్ సోషల్ డెమొక్రట్ల యూనియన్" నాయకుల్లో ఒకడు. ఆ యూనియన్ పత్రిక అయిన "రబోచెయె దేలొ" ("కార్మిక లక్ష్యం")కి సంపాదకత్వం వహించాడు. అందులో ఆయన బెర్న్‌స్టైన్ అభిప్రాయాలను ప్రచారం చేశాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభ తర్వాత సోషల్ డెమొక్రటిక్ ఉద్యమాన్ని వదిలేశాడు. – 113–115, 151, 152, 156, 170, 189, 213, 221, 244, 258, 264, 275, 283, 293, 294, 299, 300, 301, 303.

గిజో (Guizot), ఫ్రాన్సువా (1787–1874) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు. చరిత్రను వర్గపోరాట దృక్పథంనుంచి చిత్రించిన ప్రథముల్లో ఒకడు, అయితే, చరిత్రకి ఆయన బూర్జువా దృక్కోణంనుంచి భాష్యం చెప్పాడు. – 26.

గెడ్ (Guesde), జూల్ (1845–22) – ఫ్రెంచి సోషలిస్టు పార్టీ, రెండవ ఇంటర్నేషనల్ స్థాపకుల్లోనూ, నాయకుల్లోనూ ఒకడు. మొదటి ప్రపంచ యుద్ధానికి (1914–18) ముందు పార్టీ విప్లవ వామపక్షానికి నాయకత్వం వహించాడు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జాతీయ దురహంకార వైఖరి వహించి, ఫ్రెంచి బూర్జువా ప్రభుత్వంలో చేరాడు. – 60, 108, 173, 201.

గేర్ట్సేన్, ఎ. ఎన్. (Herzen) (1812–1870) – రష్యన్ విప్లవ ప్రజాస్వామ్యవాది, భౌతికవాద తత్వవేత్త, రచయిత. విదేశాలకు వలస వెళ్ళి లండన్‌లో "స్వతంత్ర రష్యన్ ముద్రణాలయం" స్థాపించాడు. 1857 నుంచి "కోలొకొల్" ("గంట") పత్రిక

ప్రచురించ నారంభించాడు. దానిని రహస్యంగా రష్యాలోకి పంపించారు. అది రష్యన్ విప్లవోద్యమాభివృద్ధిలో గొప్ప పాత్ర వహించింది. — 128.

చెర్నిషేవ్‌స్కీ, ఎన్. జి. (Chernishevsky) (1828–1889) — రష్యన్ విప్లవ ప్రజాస్వామ్యవాది, ఊహాజనిత సోషలిస్టు, భౌతికవాద తత్వవేత్త, రచయిత, సాహిత్య విమర్శకుడు, రష్యాలో 1860 దశకంలో విప్లవ ప్రజాస్వామిక ఉద్యమ నాయకుడు. ఆయన్ని 1862లో అరెస్టుచేసి, సైబీరియాలో ఏడేళ్ల కఠిన శ్రమ శిక్ష విధించారు. అక్కడినుంచి ఆయన 1883లో గాని తిరిగి రాలేదు. — 128.

జసూలిచ్, వి. ఐ. (Zasulich) (ఇవనోవ్, వి.) (1849–1919) — రష్యాలో మొదట్లో నరోద్నిక్ ఉద్యమంలోనూ, తర్వాత సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోనూ ప్రముఖ వ్యక్తి. 1878లో సెంట్ పీటర్స్‌బుర్గ్ గవర్నరు త్రేపొవ్‌ని హత్యచేసేందుకు ప్రయత్నించింది. 1883లో మొట్టమొదటి రష్యన్ మార్క్సిస్టు గ్రూపు అయిన "శ్రమ విమోచన" బృందం స్థాపనలో పాల్గొంది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో మెన్షివిక్కుల్లో చేరింది. — 92, 246.

జుబాతొవ్, ఎస్. వి. (Zubatov) (1864–1917) — రహస్య పోలీసు శాఖ కలనల్; "పోలీసు సోషలిజం" ("జుబాతొవిజం") ప్రారంభకుడు, దాన్ని సంఘటితం చేసినవాడు. 1901–03 సంవత్సరాల్లో మాస్కోలోనూ, తదితర నగరాల్లోనూ విప్లవ పోరాటం నుంచి కార్మికులను మళ్లించేందుకోసం పోలీసుల నిఘాకింద వుండే కార్మిక సంఘాలను స్థాపించాడు. కాని విప్లవ వెల్లువలో యీ సంఘాలు తుడిచిపెట్టుకుపోయాయి. — 121, 145, 147, 202–224, 228.

జెల్యాబొవ్, ఎ. ఐ. (Zhelyabov) (1850–1881) — ప్రముఖ రష్యన్ విప్లవకారుడు, విప్లవ నరోదిజం ప్రముఖ ప్రతినిధి, "నరోద్నయ వోల్య" పార్టీ నాయకుడు. — 214, 250, 252.

జోరేస్ (Jaurès), జాన్ (1859–1914) — ఫ్రెంచి, అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమాల్లో ప్రముఖ వ్యక్తి; 1902లో ఆయనా, ఆయన అనుచరులూ ఫ్రెంచి సోషలిస్టు పార్టీని స్థాపించారు. "L'Humanite" పత్రిక సంస్థాపక సంపాదకుడు. ఫ్రెంచి సోషలిస్టు పార్టీలోని అవకాశవాద పక్షానికి నాయకత్వం వహించాడు, సైనికతత్వాన్ని తీవ్రంగా ఖండించాడు; మొదటి ప్రపంచ యుద్ధానికి సరిగా ముందు జాతీయ దురహంకారులచేత ఆయన హత్యచేయబడ్డాడు. — 60.

డుంకెర్ (Duncker) ఫ్రాంట్స్ (1822–1888) — జర్మన్ బూర్జువా రాజకీయవేత్త,

ప్రచురణకర్త; 1860 దశకంలో సంస్కరణవాద ట్రేడ్‌యూనియన్ల స్థాపకుల్లో ఒకడు. – 146.

డ్యూరింగ్ (Dühring), ఒయ్‌గెన్ (1833–1921) – జర్మన్ తత్వవేత్త, అర్థ శాస్త్రవేత్త, పెటీబూర్జువా సిద్ధాంతకర్త, ఆయన పృథక్కలవాద తాత్విక అభిప్రాయాలు భావవాద, అపభ్రంశ భౌతికవాదాల కలగాపులగం. "యాంటీ డ్యూరింగ్. విజ్ఞాన శాస్త్రంలో డ్యూరింగ్ తెచ్చిన విప్లవం" అన్న తన ప్రామాణిక రచనలో డ్యూరింగ్ భావాలను ఎంగెల్స్ తీవ్ర విమర్శకు గురిచేశాడు. – 18, 55, 57, 114, 115.

డేవిడ్ (David), ఎడువార్డ్ (1863–1930) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ దక్షిణపక్ష నాయకుల్లో ఒకడు, రివిజనిస్టు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఇతను సోషల్ జాతీయ దురహంకార వైఖరి తీసుకున్నాడు. – 116.

తుగాన్-బరనోవ్‌స్కీ, ఎమ్. ఐ. (Tugan-Baranovsky) (1865–1919) – రష్యన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, "చట్టబద్ధ మార్క్సిజం" ప్రముఖ ప్రతినిధి. – 85.

తూలిన్, కె. (Tulin, K.) – లెనిన్, వి. ఐ. చూడండి.

త్కచోవ్, పి. ఎన్. (Tkachov) (1844–1885) – విప్లవ నరోదిజం సిద్ధాంత కర్తల్లో ఒకడు, పత్రికారచయిత, సాహిత్య విమర్శకుడు. – 285.

త్యెరీ (Thierry), ఒగుస్టేన్ (1795–1856) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, చరిత్ర కారుడు. సమాజం వర్గాలుగా విభజింపబడివుందని ఒప్పుకున్నాడు. కాని కొన్ని జాతులను మరికొన్ని ఆక్రమించుకోవడం మూలంగా ఈ వర్గాలు ఉద్భవించాయని నమ్మి, బూర్జువావర్గానికీ శ్రామికవర్గానికీ మధ్య వైరుధ్యం పరిష్కారసాధ్యం కానిదన్న విష యాన్ని నిరాకరించాడు. – 26.

త్యేర్ (Thiers), అడొల్ఫ్ (1797–1877) – ఫ్రెంచి అభివృద్ధి నిరోధక రాజకీయ వేత్త, చరిత్రకారుడు, పారిస్ కమ్యూన్‌ని పాశవికంగా అణచివేసిన వాళ్లలో ఒకడు. – 26.

నదేజ్దిన్, ఎల్. (జెలేన్‌స్కీ, వై. ఒ.) (Nadezhdin-Zelensky) (1877–1905) – తన రాజకీయ కార్యకలాపాలను నరోద్నిక్‌గా ప్రారంభించి, తర్వాత సోషల్ డెమోక్రట్ అయాడు; "జనబాహుళ్యాన్ని ఉద్రేకపరచడానికి" టెరరిజం శక్తివంతమైన ఒక సాధనమని ఒకవంక బోధిస్తూ మరోవంక తన రచనల్లో ఆర్థిక వాదులను బలపరిచాడు; లెనిన్ "ఇస్క్రా"ని వ్యతిరేకించి, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో

మహాసభ తర్వాత మెన్షెవిక్ పత్రికలకు రచనలు పంపేవాడు. – 264, 267, 273, 275, 278, 279, 284–287, 289.

నార్సిసస్ వరాహమూర్తి (Narcissus Blunt Snout) – మార్తొవ్ చూడండి.

నైట్ (Knight), రాబర్ట్ (1833–1911) – బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమ ప్రముఖ నాయకుడు; 1871–99 సంవత్సరాల్లో బాయిలర్ తయారీదార్ల యూనియన్‌కీ, బాయిలర్ తయారీదారుల, నౌకా నిర్మాణ కార్మికుల ఐక్య యూనియన్‌కీ కార్యదర్శి. కార్మికులకు మరింత మేలైన పరిస్థితులను సమకూర్చే డిమాండ్లకోసం యజమానులకు వ్యతిరేకంగా జరిపే పోరాటానికి పరిమితం అయ్యే సాంప్రదాయిక ట్రేడ్‌యూనియనిజానికి ప్రతినిధి. – 189.

పార్వుస్ (గెల్‌ఫాంద్, ఎ. ఎల్.) (Parvus-Gelfand) (1869–1924) – రష్యన్, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాలలో పాల్గొన్నాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ (1903) తరువాత మెన్షెవిక్కుల్లో చేరాడు. 1905–07 నాటి విప్లవ కాలంలో రష్యాలో ఉన్నాడు. అభివృద్ధి నిరోధక కాలంలో (1907–10) సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని వదిలిపోయాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) యితను తీవ్ర జాతీయ దురహంకార వైఖరిని తీసుకున్నాడు, జర్మన్ సామ్రాజ్యవాదానికి ఏజెంటుగా పనిచేశాడు. – 300.

పీసరెవ్, డి. ఐ. (Pisarev) (1840–1868) – ప్రముఖ రష్యన్ విప్లవ ప్రజాస్వామ్యవాది, పత్రికారచయిత, సాహిత్య విమర్శకుడు; భౌతికవాద తత్వవేత్త. – 289.

పెరోవ్స్కయా, ఎస్. ఎల్. (Perovskaya) (1853–1881) – రష్యన్ విప్లవకారిణి, "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీ ప్రముఖ సభ్యురాలు. రష్యన్ జారు రెండవ అలెక్సాండ్ర్ హత్యలో యీమెకు పాత్ర వుందన్న నేరారోపణపై జారిస్టు ప్రభుత్వం యీమెకు మరణ శిక్ష విధించింది. – 250.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి రచయిత, అర్థశాస్త్రవేత్త, సాంఘిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గ సిద్ధాంతకారుడు, అరాజకవాద సిద్ధాంత స్థాపకుల్లో ఒకడు. – 15, 16, 101, 144.

ప్రొకొపోవిచ్, ఎస్. ఎన్. (Prokopovich) (N. N.) (1871–1955) – బూర్జువా అర్థశాస్త్రవేత్త, రచయిత; ఆర్థికవాద ప్రముఖ ప్రతినిధి, రష్యాలో బెర్న్‌స్టైనిజం తొలి సమర్థకుల్లో ఒకడు. – 121, 145, 146, 169, 218, 293.

ప్లెహానొవ్, జి. వి. (Plekhanov) (బేల్తొవ్, ఎన్., కమేన్‌స్కీ) (1856–1918) – రష్యన్, అంతర్జాతీయ కార్మికోద్యమాల ప్రముఖ నాయకుడు, రష్యాలో మార్క్సిజం తొలి ప్రచారకుడు, తొలి రష్యన్ మార్క్సిస్టు సంఘమైన "శ్రమ విమోచన" బృందం (1883) స్థాపకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షివిక్కుల్లో కలిశాడు. 1907–12 సంవత్సరాల్లో రద్దువాదాన్ని వ్యతిరేకించాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) సోషల్ జాతీయ దురహంకారి అయాడు. – 6, 56, 94, 99, 100, 113, 149, 156, 171–174, 190, 212, 214, 215, 250, 283, 299.

ఫిగ్నెర్, వి. ఎన్. (Figner) (1852–1942) – రష్యన్ విప్లవ నరోద్నిక్, "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీ కార్యనిర్వాహకవర్గ సభ్యురాలు. 1884లో యామెకు మరణశిక్ష విధింపబడింది. తర్వాత అది యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గింపబడింది. 1905–07 విప్లవం తర్వాత విదేశాల్లో జీవించి, 1915లో రష్యాకి తిరిగివచ్చింది. రచయిత్రిగా కూడా పరిచితురాలు. – 250.

ఫాయెర్‌బాఖ్ (Feuerbach), లుడ్విగ్ (1804–1872) – జర్మన్ భౌతికవాద తత్వవేత్త, నిరీశ్వరవాది. మార్క్సిజానికి పూర్వికుడు. ఆయన హేగెల్ భావవాద తత్వాన్ని విమర్శించి, దానికి మతంతో ఉన్న సంబంధాలు వెల్లడించాడు. కాని సామాజిక విషయాల్లో ఆయన భావవాదిగా నిలిచిపోయాడు. ఆయన భౌతికవాదం అధిభౌతికవాదం. – 13, 14, 18–20, 49.

ఫోగ్ట్ (Vogt), కార్ల్ (1817–1895) – జర్మన్ ప్రకృతి అధ్యయనవేత్త, అపభ్రంశ భౌతికవాది. జంతుశాస్త్రానికీ, భూగర్భశాస్త్రానికీ, శరీరశాస్త్రానికీ సంబంధించిన కొన్ని రచనలు రాశాడు, శాస్త్రీయ సోషలిజాన్ని వ్యతిరేకించి, శ్రామికవర్గ విప్లవకారులను హింసించడంలో పాల్గొన్నాడు. మార్క్స్, ఎంగెల్స్‌లమీద అపనిందలు వేశాడు. – 20.

ఫొరియర్ (Fourier), షార్ల్ (1772–1837) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. –130.

ఫోల్మర్ (Vollmar), గెయోర్గ్ హేన్రిహ్ (1850–1922) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అవకాశవాద పక్ష నాయకుల్లో ఒకడు, సంస్కరణవాద ప్రతిపాదకుడు. – 110.

బకూనిన్, ఎమ్. ఎ. (Bakunin) (1814–1876) – రష్యన్ విప్లవకారుడు, అరాజకవాద సిద్ధాంతవేత్త, 1840 నుండి విదేశాల్లో నివసించాడు, జర్మనీలో 1848–49

విప్లవంలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. మొదటి ఇంటర్నేషనల్‌లో సభ్యుడైన బకూనిన్, అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకత్వాన్ని హస్తగతం చేసుకునే ఉద్దేశంతో, మార్క్స్ ఎంగెల్సులకు వ్యతిరేకంగా విచ్ఛిన్న కార్యకలాపాలకు పూనుకున్నాడు, 1872లో ఇంటర్నేషనల్‌నుంచి బహిష్కరింపబడ్డాడు. – 16, 17, 129.

బజారొవ్, వి. ఎ. (Bazarov) (రూద్నెవ్) (1874–1939) – అర్థశాస్త్రవేత్త, రచయిత, తత్వవేత్త, మార్క్స్ ఎంగెల్సుల రచనలను రష్యన్ భాషలోకి అనువదించాడు. 1905–07లో బోల్షివిక్ ప్రచురణ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అభివృద్ధి నిరోధక దశలో (1907–10) బోల్షివిక్కులనుంచి విడిపోయాడు. మాహిజం ప్రముఖ సమర్థకుల్లో ఒకడు. 1917లో మెన్షివిక్ అంతర్జాతీయవాది. –56

బల్‌హోర్న్ (Ballhorn), యోహాన్ – 16వ శతాబ్దపు జర్మన్ ప్రచురణకర్త. – 174.

బి–వ్ (B – v) (సావిన్‌కొవ్, బి. వి.) (1879–1925) – సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ పెటీబూర్జువా నాయకుల్లో ఒకడు. సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చురుకుగా పోరాటం సాగించాడు. అనేక విప్లవ ప్రతీఘాత తిరుగుబాట్లనూ, కుట్రలనూ నిర్వహించాడు. – 210, 213, 236–239, 241, 248.

బిస్మార్క్ (Bismarck), ఒట్టో ఎడువార్డ్ (1815–1898) – ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, రాజరికవాది; జర్మన్ సామ్రాజ్య ఛాన్సెలర్ (1871–90), ప్రష్యన్ ఆధిపత్యంకింద బలప్రయోగంతో జర్మనీ ఐక్యతను అమల్లోకి తెచ్చాడు. – 14, 47.

బుల్గాకొవ్, ఎస్. ఎన్. (Bulgakov) (1871–1944) – బూర్జువా అర్థశాస్త్రవేత్త, భావవాద తత్వవేత్త, 1890 దశకంలో "చట్టబద్ధ మార్క్సిస్టు." 20వ శతాబ్ది ఆరంభంలో వ్యవసాయ సమస్యపై మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సవరించాలన్న ప్రయత్నంతో ముందుకు వచ్చాడు. 1905–07 విప్లవానంతరం కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రట్లతో చేరిపోయాడు. – 125, 293.

బెర్న్‌స్టైన్ (Bernstein), ఎడువార్డ్ (1850–1932) – జర్మన్ సోషల్ డెమాక్రటిక్ పార్టీయొక్క, రెండవ ఇంటర్నేషనల్‌యొక్క తీవ్ర అవకాశవాద పక్షపు నాయకుడు; రివిజనిజానికీ, సంస్కరణవాదానికీ సిద్ధాంతకర్త. బెర్న్‌స్టైన్, అతని అనుయాయుల అభిప్రాయాలూ, వారి అవకాశవాద కార్యకలాపాలూ కార్మికవర్గ ప్రయోజనాల ద్రోహానికి దారితీశాయి, అవి రెండవ ఇంటర్నేషనల్ పతనంతో ఫలించాయి. – 55, 60, 109, 115, 116, 121, 123, 124, 154, 169, 221, 252, 269, 298, 300.

బెర్క్లీ (Berkely), జార్జ్ (1685–1753) – ఇంగ్లీషు తత్వవేత్త, వ్యక్తిపర భావవాది, ఆంగ్లికన్ చర్చికి ఆర్చిబిషప్. పదార్థ అస్తిత్వాన్ని నిరాకరించి, వస్తువులను ఇంద్రియానుభూతుల మొత్తంగా పరిగణించాడు. బెర్క్లీ తాత్విక భావాలు ప్రత్యక్షానుభవవాదయుత తత్వశాస్త్రానికీ, బూర్జువా తత్వశాస్త్రంలో తదితర కొన్ని ధోరణులకీ మూలం. – 57.

బెర్ద్యాయెవ్, ఎన్. ఎ. (Berdyayev) (1874–1948) – భావవాద తత్వవేత్త, మాయావాది; "చట్టబద్ధ మార్క్సిజాన్ని" బలపరిచాడు, తదుపరి మార్క్సిజానికి బద్ధవ్యతిరేకి అయ్యాడు. 1905లో కాన్స్టిట్యూషనల్ డెమోక్రటిక్ (కాడెట్) పార్టీలో చేరాడు. – 293.

బెలిన్స్కీ, వి. జి. (Belinsky) (1811–1848) – ప్రముఖ రష్యన్ విప్లవ ప్రజాస్వామికవాది, సాహిత్య విమర్శకుడు, పత్రికారచయిత, భౌతికవాద తత్వవేత్త. – 128.

బేబెల్ (Bebel), ఔగుస్ట్ (1840–1913) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ యొక్క, రెండవ ఇంటర్నేషనల్ యొక్క సంస్థాపకుడు, ప్రముఖ నాయకుడు. వృత్తిరీత్యా టర్నరు. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు. జర్మన్ కార్మికోద్యమంలో రివిజనిజాన్నీ, సంస్కరణవాదాన్నీ వ్యతిరేకించాడు. – 116, 173, 174, 230, 242, 282.

బేల్తొవ్, ఎన్. (Beltov) – ప్లెహానొవ్, జి. వి. చూడండి.

బొగ్దానొవ్, ఎ. (Bogdanov) (మలినోవ్స్కీ, ఎ. ఎ.) (1873–1928) – సోషల్ డెమోక్రట్, తత్వవేత్త, అర్థశాస్త్రవేత్త, సామాజిక శాస్త్రజ్ఞుడు, వృత్తిరీత్యా వైద్యుడు. 1905–07 నాటి విప్లవ పరాజయం తర్వాత ఒత్జోవిస్టుల నాయకుడు. తత్వవేత్తగా ఆయన తన సొంత విధానాన్ని – ఆచరణలో ఒక రకం వ్యక్తిపర భావవాద తత్వశాస్త్రమే అయిన "ప్రత్యక్షానుభవయుత అద్వైతవాదా"న్ని రూపొందించేందుకు ప్రయత్నించాడు. – 56.

బొబొరీకిన్, పి. డి. (Boborykin) (1836–1921) – రష్యన్ రచయిత. నరోద్నిక్కులకీ మార్క్సిస్టులకీ మధ్య జరిగిన పోరాటాన్ని వక్రంగా చిత్రిస్తూ "ఇంకో పద్ధతిలో" పేర ఈయన రాసిన నవలపట్ల ప్రగతిశీలురు సహేతుకంగానే నిరసన తెలియజేశారు. – 92.

బౌవర్ (Bauer), బ్రూనో (1809–1882) – జర్మన్ భావవాద తత్వవేత్త, ప్రముఖ యువ హెగెలియన్, బూర్జువా రాడికల్. క్రీస్తుమత తొలిదశ చరిత్రపై కొన్ని రచనలు చేశాడు. 1866 తర్వాత జాతీయ ఉదారవాదీ, బిస్మార్క్ అనుయాయీ అయ్యాడు. అతని భావవాద అభిప్రాయాలను మార్క్స్ విమర్శించాడు. – 13, 14.

బ్యూహ్నెర్ (Büchner), ఫ్రీడిఖ్ కార్ల్ క్రిస్టియన్ లుడ్విగ్ (1824–1899) – జర్మన్ బూర్జువా తత్వవేత్త, అపభ్రంశ భౌతికవాదపు ప్రముఖ ప్రతినిధి, వృత్తి రీత్యా వైద్యుడు. – 20.

బ్యోమ్-బావెర్క్ (Böhm-Bawerk), యెవ్గేనియ్ (1851–1914) – అర్థశాస్త్రంలో ఆస్ట్రియన్ శాఖ అనబడేదానికి ఒక ప్రతినిధి. ఆర్థిక నియమాలకు వ్యక్తిపర, భావవాద భాష్యం చెప్పడం ద్వారా ఈయన మార్క్సిస్టు భావాల వ్యాప్తిని ఎదిరించేందుకు ప్రయత్నించాడు. – 57, 59.

బ్రుస్స్ (Brousse), పాల్ లూయీ మరీ (1844–1912) – ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, పాసిబిలిస్టుల సోషలిస్టు పార్టీ అవకాశవాద పక్ష నాయకుడు. – 60, 61.

బ్రూకేర్ (Brouckére), లూయీ (జననం 1870) – బెల్జియన్ సోషలిస్టు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు బెల్జియన్ కార్మిక పార్టీలోని వామపక్ష విభాగంలో ఉండేవాడు. యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకార వైఖరిని అవలంబించాడు. – 61.

బ్రెంటానో (Brentano), లుయ్యో (1844–1931) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, "కథేడర్ సోషలిజం" సమర్థకుడు. పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలో సంస్కరణల ద్వారా, పెట్టుబడిదారుల, కార్మికుల ప్రయోజనాలను సమరసంగా సమన్వయం చెయ్యడం ద్వారా సాంఘిక సమానత్వాన్ని సాధించవచ్చునని నిరూపించ ప్రయత్నించాడు. బ్రెంటానో, ఆయన అనుచరులూ కార్మికోద్యమాన్ని బూర్జువావర్గ ప్రయోజనాలకు లోబరచేందుకు ప్రయత్నించారు. – 204.

మజ్జీనీ (Mazzini), జుసేప్పె (1805–1872) – ఇటాలియన్ విప్లవకారుడు, బూర్జువా ప్రజాస్వామ్యవాది, ఇటలీ జాతీయ విముక్తి ఉద్యమ నాయకుల్లోనూ, సిద్ధాంతకర్తల్లోనూ ఒకడు. – 16.

మర్తీనొవ్, ఎ. ఎస్. (పికెర్) (Martynov-Picker) (1865–1935) – ఆర్థికవాద సిద్ధాంతకర్త, నాయకుడు, లెనిన్ "ఇస్క్రా"ని క్రియాశీలంగా వ్యతిరేకించాడు. తర్వాత మెన్షెవిజం సిద్ధాంతకర్తల్లో ఒకడుగా వుండి, అభివృద్ధి నిరోధక దశ (1907–10)లో

రద్దువాది అయాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో (1914–18) సెంట్రిస్టు వైఖరిని చేపట్టాడు. – 6, 151, 159, 163, 167–176, 178–180, 183, 184, 187, 189, 190, 192–194, 199, 200, 213, 217, 221, 275, 283, 293, 303.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883) – 9–10, 12–24, 26–37, 39, 41–58, 61, 62, 101, 110, 127, 129, 134, 142, 143, 151, 189, 283, 291, 293, 294.

మార్తొవ్, ఎల్. (త్సెదెర్‌బౌమ్, యై. ఒ., నార్సిసస్ వరాహమూర్తి) (Martov-Tsederbaum) – (1873–1923) – మెన్షెవిక్ నాయకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో (1903) అవకాశవాద అల్పసంఖ్యాక వర్గానికి నాయకత్వం వహించి, మెన్షెవిక్ ప్రముఖ సిద్ధాంతవేత్తగా కొనసాగాడు. అభివృద్ధి నిరోధక దశలో (1907–10) రద్దువాదుల్ని బలపరిచాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో (1914–18) సెంట్రిస్టు వైఖరిని చేపట్టాడు. – 156, 214.

మిన్యే (Mignet), ఫ్రాన్సువా ఒగూస్ట్ మరీ (1796–1884) – ఫ్రెంచి ఉదారవాద బూర్జువా చారిత్రకారుడు. వర్గపోరాట చారిత్రక ప్రాముఖ్యాన్ని గుర్తించిన ప్రథముల్లో ఒకడు. కాని ఆయన వర్గపోరాటాన్ని భూస్వామ్య ప్రభువర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్య పోరాటంగా కుదించాడు. – 26.

మిలెరాన్ (Millerand), అలెగ్జాండ్ర్ ఎట్యేన్ (1859–1943) – ఫ్రెంచి రాజకీయవేత్త; 1890 దశకంలో సోషలిస్టు, 1899లో సోషలిజం ఆశయానికి ద్రోహం చేసి, ఫ్రాన్సు అభివృద్ధి నిరోధక బూర్జువా ప్రభుత్వంలో సభ్యుడయ్యాడు. – 108, 110, 298, 301.

మిహైలొవ్, ఎ. డి. (Mikhailov) (1855–1884) – "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీ స్థాపకుల్లో ఒకడు, అది నిర్వహించిన అనేక సమరశీల కార్యాచరణల ఆర్గనైజరు. ఇతన్ని 1880లో అరెస్టుచేసి, మరణ శిక్ష విధించారు, కాని తర్వాత ఆ శిక్ష యావజ్జీవ కఠిన వరకానికి మార్చబడింది. – 250.

మిహైలొవ్, ఎన్. ఎన్. (Mikhailov) (1870–1905) – వృత్తిరీత్యా డెంటిస్టు, పోలీసు ఏజెంటు, లెనిన్‌కీ, సెంట్ పీటర్స్‌బుర్గ్ "కార్మికవర్గ విముక్తి పోరాట లీగు" ఇతర నాయకులకీ వ్యతిరేకంగా యితగాడు యిచ్చిన ఆచూకీ మేరకు 1895

డిసెంబరులో వాళ్ల అరెస్టు చెయ్యబడ్డారు. 1902 నుంచి పోలీసు డిపార్టుమెంటులో ఉద్యోగి. 1905లో సోషలిస్టు రివల్యూషనరీలు యితన్ని హత్యచేశారు. – 139.

మిహైలోవ్‌స్కీ, ఎన్. కె. (Mikhailovsky) (1842–1904) – రష్యన్ సాంఘిక శాస్త్రవేత్త, రచయిత, సాహిత్య విమర్శకుడు, మార్క్సిజానికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం జరిపిన ఉదారవాద నరోదిజం ప్రముఖ సిద్ధాంతవేత్త. – 63, 78, 85, 97–99, 100–104, 156, 292.

మిన్‌స్కీ (Minsky) (విలేన్‌కిన్, ఎన్. ఎమ్.) (1885–1937) – రష్యన్ కవి, ప్రతికారచయిత, కళలో బూర్జువా వ్యక్తితత్వ సమర్థకుల్లో ఒకడు. – 63.

మిష్కిన్, ఐ. ఎన్. (Myshkin) (1848–1885) – నరోద్నిక్ నాయకుడు; 1875లో ప్రవాసంనుంచి చెర్నిషేవ్‌స్కీ తప్పించుకునే ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నించాడు, కాని విఫలుడై అరెస్టుచెయ్యబడ్డాడు. – 214, 250.

మూల్‌బెర్గర్ (Mülberger), ఆర్తూర్ (1847–1907) – జర్మన్ పెటీబూర్జువా రచయిత, ప్రూడన్ అనుచరుడు. – 55, 114.

మెష్చేర్‌స్కీ, వి. పి. (Meshchersky) (1839–1914) – అభివృద్ధి నిరోధక పత్రికా రచయిత, "నల్ల నూర్ల"వాళ్ల "గ్రజ్దనీన్" ("పౌరుడు") పత్రిక ప్రచురణకర్త. – 197.

మేరింగ్ (Mehring), ఫ్రాంత్స్ (1846–1919) – జర్మనీ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ వామపక్షానికి ఒక అగ్రనాయకుడు, సిద్ధాంతవేత్త, చరిత్రకారుడు, రచయిత, సాహిత్య విమర్శకుడు. కార్ల్ లీబ్‌క్నెఖ్ట్, రోజా లుక్సెంబుర్గ్ వగైరాలతో కలిసి జర్మన్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించాడు. – 154.

మొలెషోట్ (Moleschott,) యాకొబ్ (1822–1893) – డచ్చి శరీర శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త, అపభ్రంశ భౌతికవాద తత్వవేత్త. – 20.

మోస్ట్ (Most), యోహాన్ జోసెఫ్ (1846–1906) – జర్మన్ సోషల్ డెమోక్రట్; దరిమిలా అరాజకవాది అయ్యాడు. – 47, 114, 154, 230.

యుజకోవ్, ఎస్. ఎన్. (Yuzhakov) (1849–1910) – ఉదారవాద నరోదిజం

సిద్ధాంతకారులలో ఒకడు, సాంఘిక శాస్త్రవేత్త, రచయిత; ''ఒతేచెస్త్వెన్నియె జపీస్కి'' (''పితృదేశపు నోట్సు'') పత్రికకీ, ''వేస్త్నిక్ ఎవ్‌రోపి'' (''యూరప్ వార్తలు'') పత్రికకీ, యితర పత్రికలకీ రచనలు పంపాడు. ''రూస్కాయె బొగాత్‌స్త్వో'' (''రష్యన్ సంపద'') పత్రిక సంపాదకవర్గ సభ్యుడు. మార్క్సిజాన్ని తీవ్రంగా ఖండించాడు. – 80, 84, 91, 99.

యూజొవ్ (Yuzov) (కాబ్లిట్జ్, ఐ. ఐ.) (1848–1893) – రచయిత, 1880, 1890 దశకాల్లో ఉదారవాద నరోదిజం సిద్ధాంతకారుల్లో ఒకడు. – 85, 98, 99.

రికార్డో (Ricardo), డేవిడ్ (1772–1823) – బ్రిటిష్ అర్థశాస్త్రవేత్త, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రానికి ప్రతినిధి. – 35, 50.

రిట్టింగ్‌హౌసెన్ (Rettinghausen), మోరిత్స్ (1814–1890) – జర్మన్ పెటీ బూర్జువా ప్రజాస్వామ్యవాది; 1848–49లో మార్క్స్ ఎంగెల్సులు ప్రచురించిన "Neue Rheinische Zeitung" పత్రికకి రచనలు పంపాడు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు. – 252.

రూగె (Ruge), ఆర్నాల్డ్ (1802–1880) – జర్మన్ పత్రికారచయిత, యువ హెగెలియన్, బూర్జువా రాడికల్. 1844లో మార్క్స్‌తో కలిసి "Deutsche-Französische Jahrbücher" పత్రికను ప్రచురించాడు. 1848లో ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ అసెంబ్లీ సభ్యుడయాడు. 1866 తర్వాత జాతీయ ఉదారవాది అయాడు, బిస్మార్కుని సమర్థించాడు. – 14.

రొగచోవ్, డి. ఎమ్. (Rogachov) (1851–1884) – రష్యన్ విప్లవ నరోద్నిక్, ''నరోద్నయ వోల్య'' (''ప్రజా స్వేచ్ఛ'') పార్టీ ప్రముఖ సభ్యుడు. ఆ పార్టీ నిర్వహించిన కొన్ని టెరరిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. 1876లో అతన్ని అరెస్టు చేసి, పదేళ్ల కఠిన శ్రమ శిక్ష విధించారు. అతను జైల్లోనే మరణించాడు. – 250.

రొడ్‌బేర్టుస్-యాగెత్సొవ్ (Rodbertus-Jagetzow), యోహన్ కార్ల్ (1805–1875) – జర్మన్ అపభ్రంశ అర్థశాస్త్రవేత్త, ప్రష్యన్ బడా భూస్వామి, ''ప్రభుత్వ సోషలిజం'' ప్రతిపాదకుడు. – 35.

రోజనొవ్, వి. వి. (Rozanov) (1856–1919) – అభివృద్ధి నిరోధక తత్వవేత్త, రచయిత, విమర్శకుడు. – 63, 97.

లగార్డెల్ (Lagardelle), హుబెర్ట్ (1874–1958) – ఫ్రెంచి పెటీబూర్జువా రాజకీయవేత్త; అరాజకవాద సిండికలిస్టు. అరాజకవాద సిండికలిజపు చరిత్రపై కొన్ని రచనలు చేశాడు. – 61.

లబ్రియోల (Labriola), ఆర్తూరొ (1873–1959) – ఇటాలియన్ అర్థశాస్త్రవేత్త, సిండికలిజం సిద్ధాంతవేత్త. కొన్ని పుస్తకాలు రాశాడు. వాటిలో ఆయన "విప్లవ సిండికలిజం" అనబడే తన సిద్ధాంతాన్ని మార్క్సిజానికి సమన్వయం చేయడానికి ప్రయత్నం చేశాడు. – 61.

లాఫార్గ్ (Lafargue), పాల్ (1842–1911) – అంతర్జాతీయ కార్మికోద్యమ ప్రముఖ నాయకుల్లో ఒకడు, మార్క్సిజం ప్రచారకుల్లో ప్రసిద్ధి కెక్కినవాడు; మొదటి ఇంటర్నేషనల్ సాధారణ సమితి సభ్యుడు, ఫ్రెంచి కార్మిక పార్టీ సంస్థాపకుల్లో ఒకడు. మార్క్స్ ఎంగెల్సుల శిష్యుడు, సహయోధుడు. – 17, 173.

లాఫార్గ్ (Lafargue), లౌరా (1845–1911) – ఫ్రెంచి కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, పాల్ లాఫార్గ్ భార్య, మార్క్స్ కూతురు. – 17,

లావ్రొవ్, పి. ఎల్. (Lavrov) (1823–1900) – రష్యన్ సాంఘిక శాస్త్రవేత్త, రచయిత; నరోదిజానికి ప్రముఖ సిద్ధాంతకర్త. "జెమ్ల్యా ఇ వోల్య" ("భూమీ, స్వేచ్ఛా") సంఘంలోనూ, తర్వాత "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీలోనూ సభ్యుడు. పృథక్కలవాది అయిన కారణంగా, "విమర్శనాత్మక దృష్టి కలిగిన వ్యక్తుల" కార్యకలాపాలద్వారా ప్రగతి చేకూరుతుందని ఆయన వాదించాడు. – 24.

లాసాల్ (Lassalle), ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ పెటీబూర్జువా సోషలిస్టు, కార్మికోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన అఖిల జర్మనీ కార్మిక సంఘ సంస్థాపకుడు (1863). కాని, ఈ సంఘ సంస్థాపన కార్మికవర్గోద్యమం అభివృద్ధికి ప్రతికూలమైన పాత్ర వహించింది. దాని అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన లాసాల్ దాన్ని అవకాశవాద పంథా చేపట్టేలా నడిపించాడు. – 16, 46, 47, 114, 145.

లీబ్‌క్నెఖ్ట్ (Liebknecht), విల్‌హెల్మ్ (1826–1900) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమాల్లో ప్రముఖ వ్యక్తి; జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దాని కేంద్ర పత్రిక "Vorwärts" ("ముందుకు") ప్రధాన సంపాదకుడు. మొదటి, రెండవ ఇంటర్నేషనల్స్‌లో చురుకుగా పాల్గొన్నాడు. – 47, 154, 189, 190, 230.

లెనిన్, వి. ఐ. (Lenin) (తూలిన్, కె., ఎన్. లెనిన్). – 9, 10, 11, 119.

లోంగె (Longuet), జాన్ (1876–1938) – ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సభ్యుడు, రెండవ ఇంటర్నేషనల్ సభ్యుడు, రచయిత. షార్ల్ లోంగె, జెన్నీ మార్క్స్ కొడుకు. ఫ్రెంచి, అంతర్జాతీయ సోషలిస్టు పత్రికలకు చురుకుగా రచనలు పంపేవాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) ఫ్రెంచి సోషలిస్టు పార్టీలోని యుద్ధ నివారణ, మధ్యేవాద అల్ప సంఖ్యాకులకు నాయకత్వం వహించాడు. – 17.

లోంగె (Longuet), జెన్నీ (1844–1883) – అంతర్జాతీయ కార్మికోద్యమ కార్యకారిణి; కార్ల్ మార్క్స్ పెద్ద కూతురు. ఫ్రెంచి సోషలిస్టు షార్ల్ లోంగె భార్య. పత్రికలకు వ్యాసాలు రాసింది. కార్మికవర్గ అంతర్జాతీయతా దృక్పథాన్ని చేపట్టింది. – 17.

వనేయెవ్, ఎ. ఎ. (Vaneyev) (1872–1899) – రష్యన్ సోషల్ డెమొక్రట్. 1895లో సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని "కార్మికవర్గ విమోచన పోరాట సమితి" నిర్మాణంలోనూ, "రబోచెయె దేలొ" ("కార్మిక కర్తవ్యం") పత్రికకి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలోనూ ప్రముఖ పాత్ర వహించాడు. "పోరాట సమితి" కేసు సందర్భంగా అరెస్టుచేసి, ఈయన్ని 1897లో తూర్పు సైబీరియా ప్రవాసానికి పంపారు. – 135, 137.

వల్టేయిహ్ (Vahlteich), కార్ల్ జూలియస్ (1839–1915) – జర్మన్ దక్షిణ పక్ష సోషల్ డెమొక్రట్; వృత్తిరీత్యా బూట్ల తయారీదారు; లాసాలియన్ అఖిల జర్మనీ కార్మిక సంఘ స్థాపకుల్లో ఒకడు, దాని మొదటి కార్యదర్శి. సోషలిస్టు వ్యతిరేక చట్టం (1878) ఆమోదింపబడ్డాక అమెరికాకి ప్రవాసం వెళ్లాడు; అక్కడ కార్మికోద్యమంలో పాల్గొన్నాడు. – 115.

వసీల్యెవ్, ఎన్. వి. (Vasylyev) (జననం: 1855) – రాజకీయ పోలీసు దళంలో కలనల్, జుబాతొవ్ ప్రవచించిన "పోలీసు సోషలిజం" సమర్థకుల్లో ఒకడు. – 222.

వాండెర్‌వెల్డె (Vandervelde), ఎమీల్ (1866–1938) బెల్జియన్ వర్కర్స్ పార్టీ నాయకుడు, రెండవ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో అధ్యక్షుడు; పచ్చి అవకాశవాది; మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) సోషల్ జాతీయ దురహంకార వైఖరి తీసుకుని, బెల్జియన్ బూర్జువా ప్రభుత్వ సభ్యుడయాడు. – 61.

వి. ఐ. (V. I.) (ఇవాన్షిన్, వి. పి.) (1869–1904) – రష్యన్ సోషల్ డెమొక్రట్, ఆర్థికవాద నాయకుల్లో ఒకడు. తను రాసిన వ్యాసాల్లో కార్మికుల తక్షణ

ఆర్థిక ప్రయోజనాలను సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ రాజకీయ కర్తవ్యాలకు పోటీ పెట్టాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ (1903) తర్వాత మెన్షెవిక్ అయాడు. – 138, 139, 148, 149.

విల్‌హెల్మ్, రెండవ (హోహెన్‌జోలెర్న్) (Wilhelm II—Hohenzollern) (1859–1941) – జర్మన్ చక్రవర్తి, ప్రష్యా రాజు (1888–1918). – 205.

విల్లిహ్ (Willich), ఔగుస్ట్ (1810–1878) – ప్రష్యన్ ఆఫీసరు, కమ్యూనిస్టు లీగు సభ్యుడు, 1849 నాటి బాడెన్-ప్ఫాల్‌త్స్ తిరుగుబాటులో పాల్గొన్నాడు; 1850లో కమ్యూనిస్టు లీగునుంచి విడిపోయిన దుందుడుకువాద ఒంటెత్తువాద గ్రూపు నాయకుల్లో ఒకడు. – 46.

వి. వి. (V. V.) (వొరొన్‌త్సోవ్, వి. పి.) (1847–1918) – అర్థశాస్త్రవేత్త, రచయిత, 1880, 1890 దశకాల్లో ఉదారవాద నరోదిజం సిద్ధాంతకర్తల్లో ఒకడు. "రష్యాలో పెట్టుబడిదారీ విధాన భవితవ్యం," మొదలైన గ్రంథాల రచయిత. వాటిలో రష్యాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధిని నిరాకరించి, సన్నకారు సరుకుల ఉత్పత్తిని అతను ఆకాశానికెత్తాడు. జారిస్టు ప్రభుత్వంతో రాజీని సమర్థించాడు, మార్క్సిజంపట్ల బద్ధశత్రుత్వం వహించాడు. – 78, 85, 89, 91, 99, 100, 104, 140, 141, 149, 152, 155.

వీట్టె, ఎస్. వై. (Witte) (1849–1915) – రష్యన్ రాజనీతిజ్ఞుడు, 1905–06లో మంత్రిమండలి అధ్యక్షుడు; ఉదారవాద బూర్జువావర్గానికి చిల్లర మల్లర వాగ్దానాలు చెయ్యడంద్వారానూ, జనాన్ని పాశవికంగా అణచివెయ్యడంద్వారానూ రాజరికాన్ని పదిలపరచాలని ప్రయత్నించాడు. – 202.

వెబ్బ్ (Webb) బియాట్రిస్ (Beatrice) (1858–1943), సిడ్నీ (Sidney) (1859–1947) – ప్రసిద్ధ బ్రిటిష్ పౌరప్రముఖులు, ఇంగ్లండులో కార్మికోద్యమ చరిత్రపై గ్రంథాలు రచించారు. సంస్కరణవాద ఫేబియన్ సొసైటీ స్థాపకుల్లో సిడ్నీ వెబ్బ్ ఒకడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) సోషల్ జాతీయ దురహంకార వైఖరి అవలంబించారు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం వెబ్బ్ దంపతులు సోవియట్ యూనియన్‌ని బలపరిచారు. – 167, 251.

వెస్ట్‌ఫాలెన్ (Westphalen), జెన్నీ, ఫన్ (1814–1881) – కార్ల్ మార్క్స్ భార్య, విశ్వాసపాత్రురాలైన సమర్థకురాలు. – 14.

వొలిన్‌స్కీ (Volynsky) (ఫ్లెక్సెర్, ఎ. ఎల్.) (1863–1926) – కళా విమర్శకుడు; కళ కళకోసమే అన్న అభివృద్ధి నిరోధక సిద్ధాంతాన్ని బోధించాడు, పత్రికా రచనలో ప్రజాస్వామిక, విప్లవ సంప్రదాయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. – 97, 98.

వోర్మ్స్ (Worms), అల్ఫోన్స్ (1868–1937) – లాయరు, మాస్కో విశ్వవిద్యాలయం ప్రొఫెసరు, ఉదారవాది. 1901–02 లలో జుబాతొవ్ సంఘాల సమావేశాల్లో ఉపన్యాసాలిచ్చాడు. – 222.

వోల్ట్‌మన్ (Woltmann), లుడ్విగ్ (1871–1907) – జర్మన్ అభివృద్ధి నిరోధక సాంఘిక శాస్త్రవేత్త, మానుష శాస్త్రవేత్త, ఆర్థిక పోరాటమే కార్మికోద్యమ ప్రధాన కర్తవ్యమని భావించాడు. జాతి వివక్షతావాద విధానాన్ని సమర్థించాడు, జర్మన్లు ఉన్నత జాతికి చెందినవారని వాదించాడు. – 152.

వెట్లింగ్ (Weitling), విల్‌హెల్మ్ (1808–1871) – జర్మన్ దర్జీ పనివాడు, జర్మన్ కార్మికోద్యమపు తొలి దినాల్లో ప్రముఖ పాత్ర వహించాడు; ఊహాజనిత "సమానతావాద" కమ్యూనిజం సిద్ధాంతకర్త. – 144.

షాప్పెర్ (Schapper), కార్ల్ (1812–1870) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమాల్లో ప్రముఖ వ్యక్తి; కమ్యూనిస్టు లీగులో చురుకుగా పనిచేశాడు. 1850 జూలైలో ఇంగ్లండుకు ప్రవాసం వెళ్లాడు, అక్కడ కమ్యూనిస్టు లీగు కేంద్ర కమిటీ సభ్యుడయాడు. మార్క్స్ ఎంగెల్సుల నాయకత్వం కింద వున్న అధిక సంఖ్యాక కేంద్ర కమిటీ సభ్యులను వ్యతిరేకించాడు. ఒంటెత్తువాద-సాహసిక పక్షానికి నాయకుడయాడు. – 46.

షుల్జె-గేవెర్నిట్జ్ (Schulze-Gaevernitz), గెర్‌హార్ట్ (1864–1943) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, ఫ్రైబుర్గ్ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ప్రొఫెసర్; 1892–93లో మాస్కో విశ్వవిద్యాలయంలో బోధించాడు. పెట్టుబడిదారీ సమాజంలో సామాజిక శాంతి, అన్ని వర్గాల ప్రయోజనాలకోసం సామాజిక సామరస్యం నెలకొల్పే అవకాశం ఉందని నిరూపించ ప్రయత్నించాడు. – 103.

షుల్జె-డెలిష్ (Schulze-Delitzsch), హెర్మన్ (1808–1883) – జర్మన్ అపభ్రంశ అర్థశాస్త్రవేత్త, పౌర ప్రముఖుడు; పెట్టుబడిదారుల, కార్మికుల వర్గ ప్రయోజనాల సామరస్యాన్ని సమర్థించాడు. – 145.

ష్చెద్రిన్, ఎమ్. ఇ. (Shchedrin) (సల్తికోవ్-ష్చెద్రిన్) (1826–1889) – రష్యన్ వ్యంగ్య రచయిత, విప్లవ ప్రజాస్వామ్యవాది. – 241.

స్టెయిన్ (Stein), లోరెంత్స్ (1815–1890) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, అటార్నీ, చరిత్రకారుడు. – 22.

శ్రామ్ (Schramm), కార్ల్ ఆగస్ట్ – జర్మన్ ఆర్థికవేత్త. సోషల్ డెమోక్రట్, పార్టీ విప్లవ ఎత్తుగడలను వ్యతిరేకించిన అవకాశవాది. – 154.

ష్వెయ్‌త్సెర్ (Schweitzer), యోహన్ బాప్టిస్ట్ (1833–1875) – జర్మన్ పౌర ప్రముఖుడు, రచయిత, లాసాలియన్; అఖిల జర్మన్ కార్మిక సంఘ అధ్యక్షుడు (1867–71). దానిలో ఆయన వ్యక్తిగత నియంతృత్వ విధానాన్ని అనుసరించాడు. – 154.

సజోనొవ్, జి. పి. (Sazonov) (జననం 1857) – అభివృద్ధి నిరోధక నరోదిజం ప్రతినిధి, ఇతను తర్వాత "నల్ల నూర్ల" "రష్యన్ ప్రజల యూనియన్"లో సభ్యుడయాడు. – 85.

సెంట్ సైమన్ (Saint-Simon), హెన్రీ క్లాడ్ (1760–1825) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 129.

సెరెబ్ర్యకోవ్, వై. ఎ. (Serebryakov) (1854–1921) – రష్యన్ విప్లవ నరోద్నిక్, "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీ సభ్యుడు. 1883లో ప్రవాసం వెళ్లాడు. 1899 నుంచి 1902 దాకా లండనులో "నకనూనె" ("ప్రాంగణం") పత్రికను ప్రచురించాడు. – 249, 250.

సొర్గె (Sorge), ఫ్రీడ్రిఖ్ అడోల్ఫ్ (1828–1906) – జర్మన్ సోషలిస్టు, అంతర్జాతీయ కార్మిక, సోషలిస్టు ఉద్యమాల ప్రముఖ నాయకుడు, మార్క్స్ ఎంగెల్సుల మిత్రుడు, సహయోధుడు. జర్మనీలో 1848–49 విప్లవంలో పాల్గొన్నాడు, ఆ విప్లవం విఫలమయ్యాక అమెరికాకి ప్రవాసం వెళ్లాడు. అక్కడ కార్మికోద్యమంలో క్రియాశీలమైన పాత్ర వహించాడు. – 47.

స్కాల్దిన్ (Skaldin) (ఎలెనెవ్, ఎఫ్. పి.) (1828–1902) – రష్యన్ రచయిత, 1860వ దశకంలో బూర్జువా ఉదారవాది, "ఒతేచెస్త్వెన్నియె జపీస్కి" ("పితృదేశపు నోట్సు") అనబడే పత్రికకు వ్యాసాలు రాశాడు. తదుపరి స్కాల్దిన్ తీవ్ర అభివృద్ధి నిరోధకులతో చేతులు కలిపాడు. – 67–77, 81, 82.

స్తరొవేర్ (Starover) (పొత్రేసొవ్, ఎ. ఎన్.) (1869–1934) – మెన్షెవిక్కుల నాయకులలో ఒకడు. విప్లవ నూతన వెల్లువ కాలంలో (1907–10) లిక్విడేటర్ల

సిద్ధాంతకారుడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జాతీయ దురహంకార వైఖరి తీసుకున్నాడు. – 134.

స్తస్యులేవిచ్, ఎమ్. ఎమ్. (Stasyulevich) (1826–1911) – పత్రికారచయిత, చరిత్ర ప్రొఫెసరు, పౌర ప్రముఖుడు, మితవాద బూర్జువా ఉదారవాదపు ప్రముఖ ప్రతినిధి, ఇంగ్లండులో ఉన్న మాదిరి రాజ్యాంగబద్ధ రాజరికాన్ని గురించి కలలు గన్నాడు. – 75.

స్త్రూవె, పి. బి. (Struve) (1870–1944) – బూర్జువా అర్థశాస్త్రవేత్త; 1890 దశకంలో "చట్టబద్ధ మార్క్సిజం" ప్రముఖ ప్రతినిధి, తర్వాతి సంవత్సరాల్లో కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడయాడు. – 99, 104, 119, 145, 146, 169, 287, 293.

స్మిత్ (Smith), ఆడమ్ (1723–1790) – ఆంగ్ల అర్థశాస్త్రవేత్త, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు గొప్ప ప్రతినిధుల్లో ఒకడు. – 20, 32, 50.

హక్స్లీ (Huxley), తామస్ హెన్రీ (1825–1895) – ఇంగ్లీషు తత్వవేత్త, ప్రకృతి అధ్యయనవేత్త, చార్లెస్ డార్విన్‌కి సన్నిహిత సహచరుడు, డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ప్రజానురంజకం చేసినవాళ్లలో ఒకడు; అస్థిర భౌతికవాది. – 20.

హల్తూరిన్, ఎస్. ఎన్. (Khalturin) (1856–1882) – రష్యన్ విప్లవ కార్యకర్త, 1878లో, మొట్టమొదటి చట్టవిరుద్ధ రాజకీయ విప్లవ కార్మిక సంఘాల్లో ఒకటైన "రష్యన్ కార్మికుల ఉత్తరాది సంఘం" స్థాపించాడు. 1879లో ఆ సంఘం అణచివేయబడిన తర్వాత, యితను "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") పార్టీతో కలిసి పనిచేశాడు, కొన్ని టెరరిస్టు కార్యాచరణల్లో పాల్గొన్నాడు. 1882లో యితన్ని అరెస్టుచేసి, మరణశిక్ష విధించారు. – 214.

హస్సెల్‌మన్ (Hasselmann), విల్‌హెల్మ్ (జననం 1844) – జర్మన్ సోషల్ డెమోక్రట్, లాసాలియన్ అఖిల జర్మన్ కార్మిక సంఘ నాయకుల్లో ఒకడు. 1875లో లాసాలియన్లనూ, ఐజనాఖర్లనూ ఐక్యం చేసేందుకు చొరవ తీసుకున్నవాళ్లలో ఒకడు. 1880లో అరాజకవాది అన్న ఆరోపణపై జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. – 254, 230.

హిర్ష్ (Hirsch), మాక్స్ (1832–1905) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, రచయిత; ప్రోగ్రెసిస్ట్ పార్టీ సభ్యుడు, రైహ్‌స్టాగ్ (పార్లమెంటు) సభ్యుడు. 1868లో ఫ్రాంత్స్ డుంకెర్‌తో కలిసి కొన్ని సంస్కరణవాద ట్రేడ్‌యూనియన్లను (హిర్ష్-డుంకెర్

(ట్రేడ్‌యూనియన్లు అనబడేవాటిని) ఈయన స్థాపించాడు. ఈయన తన రచనల్లో శ్రామికవర్గ విప్లవకర ఎత్తుగడలను ఖండించి సంస్కరణవాదాన్ని సమర్థించాడు. – 140, 146.

హెర్ట్జ్ (Hertz), ఫ్రీడ్రిఖ్ ఒట్టో (జననం 1878) – ఆస్ట్రియన్ అర్థశాస్త్రవేత్త, సోషల్ డెమొక్రట్, రివిజనిస్టు; "సోషలిస్టు దృక్పథంనుంచి వ్యవసాయ సమస్యలు" అన్న తన పుస్తకంలో (ప్రచురణ 1899) వ్యవసాయ సమస్యపై మార్క్సిస్టు బోధనలని ఖండించాడు. – 125.

హెరొస్ట్రాటస్ (Herostratus) – క్రీస్తు పూర్వం 356లో, ప్రాచీన కాలానికి చెందిన ప్రసిద్ధ డయానా దేవాలయాన్ని అగ్నికి ఆహుతిచేసిన గ్రీకువాడు. తన పేరు భవిష్యత్తరాల వారికి తెలియాలన్న కాంక్షయే అతని యీ చర్యకి ప్రేరకం. – 121.

హేగెల్ (Hegel), గియోర్గ్ విల్‌హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) – సాంప్రదాయిక జర్మన్ తత్వవేత్త, వస్తుపర భావవాది; గతితర్కిక భౌతికవాద మూలాల్లో ఒకటైన భావవాద గతితర్కాన్ని సర్వతోముఖంగా విపులీకరించాడు. అది గతితార్కిక భౌతికవాదానికి సైద్ధాంతిక మూలమైంది. – 13, 18, 19–22, 49, 56, 129.

హోలియోక్ (Holyoak), జార్జ్ జాకబ్ (1817–1906) – బ్రిటిష్ సహకారోద్యమంలో ప్రముఖ వ్యక్తి, సంస్కరణవాది; పలు రాడికల్ రిపబ్లికన్ పత్రికల ప్రచురణకర్త, వాటిలో రచనలు చేశాడు. 1850 దశకంనుంచి బూర్జువా రాడికల్సుతో సహకరించాడు, పెట్టుబడిదారీ, సహకార సంస్థలు రెండింటిలోనూ కూడా లాభాల్లో కార్మికులకి వాటా వుండాలన్న సిద్ధాంతాన్ని సమర్థించాడు. – 45.

హోహ్‌బెర్గ్ (Höchberg), కార్ల్ (1853–1885) – జర్మన్ దక్షిణపక్ష సోషల్ డెమొక్రట్, పత్రికా రచయిత. సోషలిస్టు వ్యతిరేక చట్టం అమల్లో వున్నప్పుడు (1878–90) తన పార్టీ విప్లవకర ఎత్తుగడలను ఖండించి, బూర్జువావర్గంతో చేతులు కలపవలసిందిగా ఈయన కార్మికులకు విజ్ఞప్తిచేశాడు. మార్క్స్ ఎంగెల్సులు ఈయన అవకాశవాద అభిప్రాయాలను నిశితంగా విమర్శించారు. – 154.

హ్యూమ్ (Hume), డేవిడ్ (1711–1776) – ఇంగ్లీషు తత్వవేత్త, వ్యక్తిపర భావవాది, అజ్ఞేయతావాది, చరిత్రకారుడు, ఆర్థికవేత్త. – 19, 20.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.


చిరునామా:

Progress Publishers
17, Zubovsky Boulevard,
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
బాంక్ రోడ్డు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002

రెండవ సంపుటంలో లెనిన్ రచనలు: "ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి," "రష్యాలో విప్లవారంభం," "ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు యెత్తుగడలు" ఉంటాయి.